

దేవిదేవతలు


హనుమ

హనుమత్ప్రభంధము-1,2,3









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120000482/83/84

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాధ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

హనుమత్ప్రబంధము

కవిశేఖర, భారతీప్రసన్న

కొండేపూడి సుబ్బారావు



శ్రీ రామాయ నమః

శ్రీ హనుమత్ప్రబంధము

ప్రథమ భాగము అయిదు ఆశ్వాసముల పద్య కావ్యము

జననము నుండి సముద్ర లంఘనమునకు ఉద్యుక్తుడగు వరకు

శ్రీ హనుమంతుని చరిత్రము

రచన

"కవిశేఖర" "భారతీప్రసన్న"

కొండేపూడి సుబ్బారావు

'ప్రసన్న భారతి' గ్రంథమాలా ప్రచురణ

47-10-5, ద్వారకానగర్, విశాఖపట్టణము - 530 016

ఇండియా

భూమిక

ఆంజనేయుడు భారతీయు లెల్లరకు ఆరాధ్య దైవము. ఆంధ్రులకు అభిమాన దేవతామూర్తి. ఈశ్వరాంశతో అంజనావాయువులకు జన్మించిన వరపుత్రుడు. సర్వదేవతామూర్తి, త్రిమూర్త్యాత్మకుడు, సర్వజనరక్షకుడు, అభయప్రదాత అని ఆమహనీయుని ఎన్నియోరీతుల కీర్తింతురు ''ఆంజనేయ'' ''హనుమ'' అను నామములలో పరమాత్మ తత్త్వప్రకాశము కలదనియు ప్రతీతి.

ఆంధ్రదేశములో ఎంత కుగ్రామమైనను నాలుగు బాటలు కలియుకూడలిలో ఉన్నతముగు ఆంజనేయ విగ్రహమును నిలిపి పూజలు సేయుదురు. అందరికిని అందుబాటులో నున్న దైవస్వరూపము హనుమంతుడు. ఆరూపమునందున్న ఆకర్షణ, మహిమ అట్టివి. ఆ దేవునికున్న గుణ గణములా! మఱియెక్కడను లేవని అనిపించును. నిరుపమాన ధైర్య బలసాహసములు వేదశాస్త్ర విద్యాభ్యాసము గురుభక్తి కార్యదీక్ష రాజనీతి ధుర్యత బ్రహ్మచర్యము మహాశౌర్యము పరోపకారము; మీదు మిక్కిలి ఆయన ప్రవర్తనయందు వ్రేలెత్తి చూపుటకు ఒక అణువైన దోషము కన్పింపని పవిత్ర వర్తనుడు. మన దేవతావ్యవస్థలో ఒక విశిష్టరూపము ఆంజనేయుడు. అందుచేతనే విష్ణ్వంశసంభూతుడగు శ్రీరామునికినమ్మిన బంటు అయినాడు. హనుమంతుని రామభక్తి అపారము, ఆయన జీవితము సర్వము రామమయము. శైవవైష్ణవ మాధ్వత్రిమతానుయాయులకు సమముగ ఆరాధనీయుడు హనుమంతుడు.

పుణ్యమూర్తులను స్మరించుట వారి చరిత్రములను వినుట చదువుట మనోవికాసము కలిగించి హృదయ నైర్మల్యము నొసగును. ఇందులకే మన జాతిలో ఆచారముగ వచ్చుచున్న పురాణ పారాయణము పురాణ శ్రవణము హరికథలు మున్నగునవి. వానరుడై జన్మించిన నేమి అన్ని విధముల దేవతలకన్న మిన్నయయిన దివ్య ప్రభావుడు ఆంజనేయుడు. కనుకనే విఘ్నేశ్వరునితో ప్రారంభించిన నిత్యదైవ ప్రార్థనలను ఆంజనేయుని స్తుతించిగాని పూర్తి చేయము. రాత్రులందు నిదురకు పోవుముందు హనుమంతుని స్మరింతుము. హనుమత్ దేవుని స్తుతి సకలభయనివారకము, సకల ప్రయత్న విజయ సాధకము. ఆదేవుని గుణములు, ఎన్నియుగములు చెల్లినను సమాజమునకాదర్శప్రాయములు శ్రేయోదాయకములయి విలసిల్లు చున్నవి. మఱియెన్ని యుగములైనను ఇట్లే విలసిల్లును.

ఈ యీ కారణములే ఈహనుమత్ప్రబంధ కావ్యరచనకు నన్ను ప్రేరేపించినవి. హనుమద్దేవుని చరిత్ర విశేషములు అటనటనున్నవి సేకరించి వ్రాసితిని. ఇది ప్రథమ భాగము. హనుమంతుడు సముద్రలంఘనమునకుద్యుక్తుడగు వరకు కథ యిందున్నది. శ్రీరాముని పట్టాభిషేకము వరకు రెండవ భాగము. సీతాదేవి యొద్ద హనుమంతుని ఆధ్యాత్మిక తత్త్వ చర్చ హనుమంతుడు చూపిన మహిమలు మూడవ భాగమున వచ్చును. ఈ కథలు చాలవరకు

పరాశర సంహిత యందున్నవి. నిస్వార్థులయిన పూర్వమహాఋషులిట్లు మహనీయుల చరిత్రములను మానవ శ్రేయమునకై వ్రాసినవి కోకొల్లలు. నిజమునకు మన పురాణములన్నియు ఇహ పరపరమార్థప్రదములు జగద్ధితములు. పాశ్చాత్య నాగరికతా ప్రభావమున పడిన మన ఆధునికు లీసత్యమును గ్రహింపగలరని నా విశ్వాసము.

సర్వవిధముల ప్రయోజన ప్రదమగు శ్రీ ఆంజనేయుని చరిత్రము మనోరంజకమగు కావ్యరూపమున ఆంధ్రుల కందజేయువలయునను తలంపుతో ప్రారంభించిన కావ్యమిది. ఈ ప్రథమభాగము పూర్తి కాగానే అందందు సభలలో విన్పించితిని. కొందఱు పండితులు చాలభాగములు చదివిరి కూడను. ఏకగ్రీవముగవారి ఆమోదము లభించుట నాకు సంతృప్తి నిచ్చినది. ఉచ్చారణ సౌలభ్యమునకై ద్రుతసంధి అటనట విడువబడినది. 'శ' 'స' లకు ప్రాసము వాడితిని, ఇందులకు పెద్దల ప్రయోగములున్నవి. ప్రామాదికములయిన దొసగు లేవయిన ఉండిన ఉండవచ్చును.

అంకితము

నిరంతర రామనామ జపధ్యాన తత్పరుడైన హనుమంతుడు తన సర్వస్వము శ్రీరామచంద్రునకు అర్పించి చరితార్థుడైనాడు. హనుమంతుని చరిత్రయగు ఈ కావ్యమును గూడ సర్వలోక శరణ్యుడు భక్తజనమందారుడునగు శ్రీరామచంద్రుని చరణకమలముల యందు భక్తి వినమ్రుడనై సమర్పించుకొను చున్నాను.

కృతజ్ఞత :

నేనడిగినంతనే ఈ కావ్యమునకు పీఠిక అభిప్రాయములు వ్రాసియిచ్చిన పండితులకు కవులకు, చక్కగా ముద్రించి యిచ్చిన ముద్రణశాలకు, ప్రత్యేకించి ఈ కావ్యముద్రణకు ధనసహాయము కూర్చిన శ్రీ ఆదూరి భీమారావు రైల్వే ఛీఫ్ ఇంజనీరు (రిటైర్డు) గారికి, నాకృతజ్ఞతలు తెలుపుచున్నాను.

ఇతఃపూర్వము నాగ్రంథములనాదరించినట్లుగనే ఈ నూతన కావ్యము శ్రీ హనుమత్ప్రబంధమును ఆంధ్రప్రజానీకము ఆదరించి శ్రీ హనుమత్కృపనందగలరని నా విశ్వాసము

గ్రంథకర్త

ఆముఖము

ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి M.A., Ph.D.
తెలుగు విభాగం ఆంధ్రవిశ్వకళాపరిషత్తు

ఆంధ్రసాహిత్య చరిత్రలో ఆధునికయుగము గద్యప్రాధాన్యమును బట్టి గద్యయుగముగా బరిగణింపదగినది. ఐనను రసవత్ప్రబంధ కవితా సౌందర్యాస్వాదన తత్పరులు కొరవడుచున్న ఈ కాలములో గూడ గవులు కొందరు హృద్యానవద్యముగ బద్యకావ్యరచనకు జీవితమంకిత మొనరించుకొనుట పరమాభినంద్యము. అట్టివారిలో వివిధ కావ్యరచనలచే లోకవిశ్రుతినందిన వారు కవిశేఖర కొండేపూడి సుబ్బారావుగారు.

వాల్మీకి మహర్షి విరచితమయిన శ్రీ మద్రామాయణమున హనుమత్పాత్ర అత్యంతప్రాథమ్యము నొందియున్నది. అనంతర మావిర్భవింపబడిన పెక్కుపురాణములందును ఆపాత్ర బహువిధ మాహాత్మ్యమును సంతరించు కొనినది.

పరాశరసంహితయందు సప్తమపటలమున "హనుమంతుడు పూజింపబడినచో సర్వదేవతలు పూజింపబడినట్లే" యనియు ఆతని మహిమను బ్రహ్మగూడ వర్ణింప జాలడనియు నిట్లుగ్గడింప బడినది.

ఆంజనేయః పూజితశ్చేత్పూజితా సర్వదేవతాః !
హనుమన్మహిమా శక్యో బ్రహ్మణా పిన వర్ణితుమ్ !!

ఉమాసంహితయందు మహావీరుడైన ఆంజనేయుడు బ్రహ్మవిష్ణు శివాత్మకుడని యిట్లు పేర్కొనబడినది.

ఆంజనేయం మహావరం బ్రహ్మ విష్ణు శివాత్మకమ్ !
బాలార్కసదృశాభాసం రామదూతం నమామ్యహమ్ !!

శౌన సంహిత యందు హనుమత్సేవాతత్పరులకు భోగ మోక్షములు రెండును కరతలామలకములని యిట్లు సూచింపబడినది.

యత్రాస్తి భోగో నహి తత్ర మోక్షః
యత్రాస్తి మోక్షో నహి తత్ర భోగః
ఔ మారుతేస్సేవన తత్పరాణాం
భోగశ్చమోక్షశ్చ కరస్థ ఏవ !!

అట్టి హనుమద్దివ్య చరిత్రమును కవిశేఖర శ్రీ కొండేపూడి సుబ్బారావు గారు సర్వకావ్య సామగ్రీసమంచితమ్మైన మధుర కావ్యముగ సంతరింపబూనుట సర్వజన సమాదరణీయము.

తమ కావ్యమును గూర్చి కవిగారు వెల్లడించిన అభిప్రాయములు :

1. సమ్మాన్యంబగు సంప్రదాయ కవితా సంధాన మీ నవ్యక
వ్యమ్మేపారుత సాహితీ మధుర సర్వస్వ ప్రతిష్ఠాంకమై.

11. మధురార్థశబ్దముల నవ్యోద్యత్ ప్రబంధమ్ముగా ననుసంధించుచు,

శ్రీ సుబ్బారావుగారు హనుమద్దివ్య పదారవింద వరివస్యా లబ్ధ పరమానుభూ త్యా విష్కరణమే ఈ కావ్యరచనా ప్రయోజనమని యిట్లు తెలిపినారు.

మునుపీపావని గాథలెల్ల కవితా పుణ్యోదయుల్ వ్రాయలే
దని కాదీ రచనమ్ము నాహృదయమం దత్యంత సమ్మాన్యమై
హనుమద్దివ్య పదార్చనానుభవ హర్షాధిక్య సంపత్తి కా
రణమై వ్రాయగ జేసె నాకపివర ప్రజ్ఞా విశేషమ్ములన్.

సాధు శబ్ద కవితా స్వారస్య పద్యక్రమముగా హనుమయే ఈ కావ్యమును రచింపజేయుచున్నట్లు కవిగారిట్లు పేర్కొనినారు

అన్నామారుతి! నేనెవండను మహాత్మా! నిత్యసత్కార్యసం
పన్నంబైన భవచ్చరిత్ర లిఖియింపన్; నామనో వాంఛ లీ
సన్నాహంబులు సాధుశబ్ద కవితా స్వారస్య పద్య క్రమం
బెన్నన్ నీ పలికించు పల్కు లివిగావే పూర్ణవిద్యాకృతీ!

ఇందు గర్తృత్వము పరమేశ్వరార్పణమగుట హర్షింపదగ్గ విషయము

శ్రీ సుబ్బారావుగారు రచింపబూనిన హనుమచ్చరిత్రమున నిది తొలి సంపుటము. ఇందు అయిదాశ్వాసములు గలవు. అంజనాకేసరుల వివాహము, హనుమజ్జననము, హనుమద్విద్యాభ్యాసము, శ్రీరామదర్శనము రామసుగ్రీవ సఖ్యము వాలివధ సీతాన్వేషణము మున్నగు కథాంశములు ఈ సంపుటమున వర్ణింపబడెను. ఇంకనురెండు సంపుటములలో ఈ ప్రబంధము రచింపబడగలదు. ఇతివృత్త విస్తృతిని బట్టి హనుమచ్చరిత్రము పురాణప్రాయమనదగినది. కాని కవిగారు ప్రాచీనమహాకవుల ప్రబంధరచనా విన్యాస బంధురముగా దీనిని రచింప సంకల్పించుటచే ఈ కృతికి హనుమత్ప్రబంధమని నామకరణ మొనరించినారు.

ఆంజనేయ స్వామి తన సర్వస్వమును రామార్పణ మొనరించుటచే కవిగారీ కావ్యమును రామాంకిత మొనరించుట పరమౌచిత్య బంధురముగా నున్నది.

తన సర్వస్వము రామభూవిభుని పాదద్వంద్వ సంసేవకై
వినియోగించిన ధన్యజన్ముడు జగద్విఖ్యాత చారిత్రుడా
హనుమం డాతని స్వామినే కుతుక మేపారన్ గృతిస్వామిగా
వినుతుల్ జేసి యొసంగినాడ మృదు మాధ్వీరమ్య మీ కావ్యమున్

ఇందు గవిగారు తమకావ్యము మృదు మాధ్వీరమ్యముగా నున్నదని పేర్కొనుట గమనార్హము.

''వర్ణనా నిపుణః కవిః'' అని ఆలంకారికోక్తి, అనల్ప వర్ణనా ప్రచురముగా రచన గావించువాడు కవియని తాత్పర్యము. కావ్యరచనలో విదగ్ధులైన శ్రీకొండేపూడి వారు ఈ హనుమత్ప్రబంధమును ప్రభాస తీర్థ వర్ణనముతో ఆరంభించినారు. శబ్ద సౌందర్యము, అర్థగాంభీర్యము అహమహమికతో స్పర్థవహించినట్లు ఆవర్ణనము నిర్వహింపబడినది.

పన్నీటి వలిమించు మున్నీటి తుంపురుల్
చలువ వెన్నెలలతో జెలిమి సేయ,
రంగదుత్తుంగ తరంగోత్కర శ్రేణి
పర్వతాగ్రములతో బంతమాడ,
జలువంపు గ్రొన్నురుఁ తెలివెల్లు చాయలు
నింగి నీలిమలను భంగపఱుప,
లోనున్న రత్నాంచి తానూన దీధితుల్
మార్తాండకాంతికి మారువలుక

అమలకాంచన కణ చూర్ణముల దెచ్చి
మేలి పడకల దీర్చిన లీలదనరు
లలితసుస్నిగ్ధ సైకత స్థలు లెసంగు
సర్వసౌందర్య మచ్చటి సాగరమ్ము.

ఈ కావ్యమందలి వర్ణన లన్నింట సూర్యోదయ వర్ణన మత్యంత ప్రశస్తముగా, పరమ ప్రౌఢ భావసమంచితముగ మంజుల పదబంధ బంధురముగ నిట్లు సాగినది.

పద్మ ప్రతానమ్ము భక్తిమై జేసిన
పరమనిష్ఠా తపః ఫలమనంగ,
క్షితిని గ్రమ్మిన కారు చీకటుల్ దొలగంగ
సురలు వెల్గించిన జ్యోతియనగ,
ప్రత్యుషస్స్నాతయై ప్రాగ్దిశా విమలాంగి
నొసలిపైనిడిన సిందూర మనగ,

భూమండలం బెల్ల పాలుపార బండించి
కూర్చిన బంగారు కుప్పయనగ,

భాను బింబమ్ము వచ్చె బూర్వాద్రిపైకి
దనకు దీటైన కాంతి వితాన మమర
నవల నెవ్వడొ వెల్గుచున్నట్లు దలచి
యాంజనేయుని జూచుట కరుగుకరణి.

ప్రబంధోచిత కల్పనలతో రచింపబడిన యీపద్యము తిక్కనగారి ''నీరజాకరములు నిష్ఠమైజేసిన'' అను పద్యమును దలపించుచున్నది.

లంకకేగుటకు గపులు దర్శించిన మహోదధివర్ణనముగూడ కవిగారియనుపమ వర్ణనా నైపుణ్య సమర్థకముగా నున్నది.

1. కనిరావానరవీరులెట్టెదుట ....

2. ఝంఝా ప్రభంజన చండ వేగోద్ధూత
భంగోత్కరంబు లంబరము ముట్ట........

3. ఈ సముద్రమ్మటే ....మున్నగునవి.

ఇందలి సమాసబంధురమైనపదబంధములు ఆవారాశి యౌద్ధత్యమును గాంభీర్యమును సూచించుటకు దగియున్నవి.

ఆంజనేయస్వామి సూర్యునొద్దసమస్త విద్యలు నేర్చి గురుదక్షిణగా ఆతని కోరికపై ఆతని పుత్రుడైన సుగ్రీవునకు మంత్రిగా జేరి కొలుచుట కవిగారి కల్పనము సమన్వయము సుమనోమనో హరముగా నున్నది.

పంచమాశ్వాసమున శ్రీరామావతారగాథ విపులముగా నభివర్ణింపబడినది. అది కవిగారికి రామకథపైగల భక్తిప్రాభవమును నిరూపించుచున్నది. కృతిపతియైన రామచంద్రునకు అవధరింపుమని కవిగారు ఆతని చరిత్రమునే నివేదించుట ఒక విశేషము. జగజ్జ్యోతియైన సూర్యభగవానునకు ''దీపం దర్శయామి'' అనునట్లున్నది.

లోకకంటకుడు స్వర్లోకధూమకేతువుగా విజృంభించుచున్న రావణుని దుశ్చేష్టలను పరమ రమణీయముగా గవిగారిట్లు చిత్రించినారు.

జనులకు నిద్రరాదు, సుఖశాంతులు లేవిలపైని, స్త్రీలకున్
గనబడ దాత్మరక్ష, సవనాగ్నులు వెల్గవు, స్వర్గహీనులై
చని రనిమేషు లావలకు, సర్వజగమ్ములు కంపమొందు నా
దనుజుని నామమాత్రమున ధైర్యము దక్కి శిరమ్ము వాల్చుచున్

ఆంజనేయుడు రామలక్ష్మణులకు సుగ్రీవుని బరిచయ మొనరించుటలో సుగ్రీవపాత్ర స్వరూపస్వభావములు సంగ్రహముగా సూత్రప్రాయముగ నివేదింపబడినవి.

ఆ సుగ్రీవుడు సర్వధర్మ నియమాభ్యాసుండు, దోర్దర్పరే
ఖా సర్వస్వుడు, స్నేహపాత్రు, డత డర్క స్వామి పుత్రుం డెడన్
మీ సఖ్యమ్మను గోరి నన్నిటకు బంపెన్ మిమ్ముదోద్దేర; వి
శ్వాసార్థుం డెదియేని మేలు నొనరింపన్ శక్తిమంతుండగున్.

భావికథార్థ భోధకముగా సుగ్రీవుని గుణములిందు వర్ణింపబడుట విశేషము. శ్రీ కొండేపూడివారి పాత్రచిత్రణ సామర్థ్య నిరూపకముగా ఈ వర్ణనము నిర్వహింపబడినది

హనుమంతునకు రామలక్ష్మణుల ప్రథమ దర్శనము, శ్రీరాముని అంగుళీయకమును తీసికొనిపోవునపుడు హనుమని భావములు కల ఘట్టములు అత్యంత రమణీయములు.

సురుచిరశృంగార రసపోషణమున కవిగారి యనుపమ ప్రజ్ఞ అంజనాకేసరుల యద్వితీయ దాంపత్య సుఖానుభవ వర్ణనమున యభివ్యక్త మగుచున్నది. మధురోదాత్త గంభీరముగ ఆప్రణయమిట్లు వర్ణింపబడినది.

మధుమాస తరుకదంబముల నంజన చూపు
నతడామె నచట నుయ్యాలూపు,
సుమనికుంజముల కారమణి సేవలొనర్చు
అతడామె కొఱకు మాల్యముల గూర్చు,

....

శ్రీ కొండేపూడి సుబ్బారావుగారి అలంకార ప్రయోగ సామర్థ్యమునకు ఈ పద్యము ప్రబలోదాహరణముగా గలదు

గ్రీష్మతప్తమై వాడిన వృక్షరాజి
కంబుధారలు గురిసిన యట్టులయ్యె,
ఆశలుడిగిన కపి హృదయమ్ములకును
ధైర్యమొసగు సంపాతి వాగ్ధారలచట.

హృదయంగమములైన కొన్ని భావచమత్కృతులీ కావ్యమున గుణోత్కర్షకములై ప్రయోగింపబడినవి. ఇట్టివెన్నోయున్నవి.

1. రుమనుగూర్చి : భావజుబాణమో యనగ భాసిలుతన్వి
2. కామాసక్తుడైన సుగ్రీవుని మందలించుటకు వెడలిన లక్ష్మణుని గూర్చి : కుపితోగ్ర తీవ్రకీలానల నిర్నిరీక్ష్య విలయాకృతి...

ఈ కావ్యమున జిగీష, ద్రఢిమవంటి ప్రౌఢ పదములు ప్రయోగింపబడుటయేగాక సుదీర్ఘసమాసములు గూడ సహజ సుందరముగ గ్రథనకౌశలముగ బ్రయోగింపబడినవి.

1. స్ఫారోదార వసంత పుష్ప విగళత్ సౌరభ్య పారంపరీ పారమ్య ప్రవిలాసభాసురము
2. వర్షామేఘ వినీల సుందర తనూ భాస్వన్మహాతేజము
3. చాంపేయాగరు మల్లికాది సుమనస్సౌరభ్యవీచీ స్ఫురత్సంపన్నమ్ము
4. జగతీ కల్యాణ సౌందర్య రేఖానూనామల దివ్య విగ్రహ సమగ్ర శ్రీ మహోమూర్తి

ఛందస్సునకు సంబంధించిన వివిధ వృత్త ప్రదర్శనలో గవిగారు చూపిన ప్రజ్ఞ అనన్యసామాన్యము. ఉత్పల మాలికలు ప్రదర్శింపబడినవి. మత్తకోకిల మానిని వంటివి ప్రయోగింపబడినవి. సాహిత్యమున నెక్కడోగాని కనుపింపని ప్రహర్షిణి ప్రమాణి, విజయ మంగళము, మణిరంగము వంటి విశేష వృత్తములిందు నిర్వహింపబడుట విశేషము. అవియును సందర్భసముచితముగ గూర్పబడుట వృత్తౌచిత్యపోషణమున గవిగారి ఆసక్తిని నిరూపించుచున్నది.

ఇట్లే ''వెదుకబోయిన తీవియ యెదురగుచుంగాళ్ల దగిలి యింపు దలిర్పన్'' వంటి పలుకు బడులు గూడ ఈ కావ్యమున పోషింపబడినవి.

జీవితమున ఇంచుమించు ఎనుబది సంవత్సరముల యనుభవము గల్గిన వారగుటచే శ్రీ సుబ్బారావుగారు అక్కడక్కడ లోకపు తీరుతెన్నులను సూచించినారు. ఆవాక్యములు బంగారమున రత్నములను బొదిగినట్లు కావ్య సౌందర్యమునిను మడింపజేయుచు జీవితమార్గోపదేశికములై పాఠకలోకము నుత్తమ సంస్కార సంపన్న మొనర్పగలవు.

1. ఏగవు దినములు జగతి నొక్కేగతి...
2. దైవమె తానొనరించు ప్రేమసంధానము లుర్వి బిడ్డలకు తల్లుల కీయనురాగబంధముల్
3. అవనితలమున నెంతవాడైన గూడ గర్మఫలమీగ జాలినఘనుడులేడు

ఈ విధముగ హనుమచ్చరిత్రము ధారాశుద్ధిగలిగిన రసవత్ప్రబంధముగా, మధుర గంభీర శైలితో విద్వల్లోక ప్రశంసాపాత్రముగ రచింపబడుట అభినందనీయము. సహృదయ పాఠకులు చదివి తరింతురుగాక. కవిశేఖర శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు ప్రతిపదసార్థకముగ, మధురార్థ బంధురముగ, అనల్పకల్పనావైభవముతో మిగిలిన భాగములను గూడ అచ్చువేయించి సంపూర్ణ హనుమత్ప్రబంధమును అచిరకాలముననే అందింతురుగాక!

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి యేషాం యశః కాయే జరామరణజం భయమ్

శుభం భూయాత్

విశాఖపట్నం
15-4-96



కీర్తిశేషులు శ్రీ ఆదూరి విశ్వనాథము : కనకదుర్గాంబ పుణ్యదంపతులు

జననము 1908	:	1912
నిర్యాణము ఆగష్టు 1995	:	అక్టోబరు 1975

★★★★★

వారి కుమారుడు **శ్రీ ఆదూరి భీమారావుగారు** రైల్వే ఛీఫ్ ఇంజనీరు, C.A.O. (రిటైర్డు)
జననీజనకుల సంస్మరణ పూజా చిహ్నముగా
ఈ హనుమత్ప్రబంధ కావ్యమును ముద్రింపించిరి.

ఆశీస్సు

జ్యోతిశ్శాస్త్రవిశారదుండు, సుగుణస్తోముండు, సత్కార్యదీ
క్షాతాత్పర్యుడు, దైవచింతన సదాచారుండు, వాక్చాతురీ
ఖ్యాతిం గల్గిన దేశికోత్తముడు శ్రీ ఆదూరివంశాంబుధిన్
శీతాంశుండగు విశ్వనాథ మలరెన్ జేగీయచారిత్రుడై.

వాసిగ పల్లెటూరిబడిపంతులుగా నిజజీవితమ్మునన్
జేసినవృత్తి చిన్నదియె చెప్పుకొనన్; తన సత్ప్రవర్తనా
భ్యాసముచేత గొన్న మరియాదయు,మంచియు పెద్దవై యశ
శ్శ్రీసముపేతుడైన గుణసింధు వతండు సమర్థుడన్నిటన్.

ఆయనకున్ సతీమణి నిరంతరభాగవతప్రబంధపా
రాయణపుణ్యశీల, మృదులామలభాషిణి, దుర్గమాంబ, ప్రే
మాయతసాధువర్తనల నందరిమధ్యను పేరుగొన్న సు
శ్రీయుతమూర్తి; ధర్మగుణచిత్తు లుదారులు వారలిర్వురున్.

పెద్దలుసేయు పున్నెముల పెంపువహించుచు వారియన్వయం
బొద్దికతో సదాశయసమున్నతమై విలసిల్లు; సర్వతో
వృద్ధిగ విద్యలందున, వివేకమునందున, శీలమందు, నా
పెద్దల యాశిషమ్ములె భువిన్ దయజూచుత వారినెప్పుడున్.

ప్రణుతాత్ముల్ తనతల్లిదండ్రులగు దుర్గావిశ్వనాథద్వయిన్
మనమం దెంచుచు తత్కుమారమణి భీమారావు సద్భక్తి నీ
హనుమత్కావ్యము వారిసంస్మృతికి చిహ్నంబై విరాజిల్ల ము
ద్రణ గావించె నతండువర్ధిలుత నిత్యమ్మాహనూమత్కృపన్.

గ్రంథకర్త

శ్రీహనుమత్ప్రబంధము

ప్రథమభాగము విషయ సూచిక

ప్రార్థన

శ్రీరాముడు

2. రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే!
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః!!
ఆపదామపహర్తారం దాతారం సర్వసమ్పదామ్
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్!!

హనుమంతుడు

3. అంజనానందనం వీరం జానకీశోక నాశనమ్!
కపీశమక్ష హన్తారం వందేలంకాభయంకరమ్!!

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసమ్
రామాయణ మహామాలా రత్నం వందే నిలాత్మజమ్

మనోజవం మారుత తుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసానమామి

ఆంజనేయ మతిపాటలాననం కాంచనాద్రి కమనీయ విగ్రహమ్
పారిజాత తరుమూల వాసినం భావయామి పవమాన నందనమ్

విఘ్నేశ్వరుడు

1. శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్!
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే!!

సరస్వతి

4. సరస్వతి! నమస్తుభ్యం వరదేకామరూపిణీ!
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా!!

శ్రీ రస్తు

శ్రీరామాయనమః

శ్రీ హనుమత్ప్రబంధము

ప్రథమ భాగము

అవతారిక

ఇష్టదేవతా ప్రార్థన

హనుమత్స్తుతి

శ్రీ రామప్రభు దివ్యపాదయుగ రాజీవార్చనానందరే
ఖారోచిష్ణు, డజేయవిక్రమ మహోగ్రస్థైర్యుడున్ సాధుగా
థారమ్యుండు ప్రసన్నరూపు డఖిలత్రయ్యర్థ విద్యావిదుం
డారాధ్యుండగు నంజనాతనయు డత్యంతమ్ము నన్బ్రోచుతన్.

విఘ్నేశ్వరస్తుతి.

విలసితసత్కృపాన్వితుడు విఘ్నములన్ దొలగించుదైవ ము
జ్జ్వల శశివర్ణసుందరుడు భక్తులొసంగెడి పూజనాదులం
దొలుతగ గూర్మి గైకొను చతుర్భుజు డార్యకు ముద్దుబిడ్డడై
యలరిన గుజ్జువేలుపు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికై.

త్రిమూర్తిస్తుతి.

చెలువొప్పన్ బదునాల్గులోకములు సృష్టింజేసి పోషించి త
ద్విలయావృత్తి పునఃపునఃక్రమము దీపింపంగ జేయున్ సమ
ర్థులు బ్రహ్మాచ్యుతఫాలనేత్రులు త్రిమూర్తుల్ వారి కారుణ్యసం
కలితప్రాభవ సంపదున్నతులకై గావింతు సంస్తోత్రముల్.

వాణీ లక్ష్మీ పార్వతీస్తుతి.

నిరతోద్యత్కరుణావిలాసవిభవోన్నిద్రైక వీక్షావిని
ర్భర వాత్సల్యము జూపి భక్తులకు విద్వద్భాగ్యదీవ్యత్శుభో
త్కరముల్ గల్గగ జేయు ప్రేమభరితాత్మల్ భారతీశ్రీశివల్
సరవిన్ నన్గృపజూచుతన్ మధురవాత్సల్యానురాగమ్ములన్.

దేవీస్తుతి

శంకాసంకులమైన నాహృదికి రక్షాభద్రము ద్రాంకిత
మ్మోంకారస్వరమాధురీ మహితనాదోపాస నామోదిత
హ్రీంకార ప్రథితాక్షరాక్షరకళాహేవాక మంత్రాన్విత
క్లీంకారోజ్జ్వల రూపమై వెలుగు నిన్గీర్తింతు కామేశ్వరీ.

సరస్వతీస్తుతి.

శిరమునదాల్చిన చిన్నిజాబిల్లిచే తనమేనితెలివెల్గు లినుమడింప,
రత్నకిరీటోరురమణీయకాంతులు గగనాగ్రసీమల కెగసివెలుగ,
వీణామధురగాన విమలసాహిత్యముల్ వేదోక్తిసుధల దిగ్వీధినింప,
నిజరూపసౌందర్య నిస్తులోజ్జ్వలకాంతి నలువనెమ్మోముపై నాట్యమాడ,

కోటిమంత్రపరంపరల్ కొలుచుచుండ
ప్రణవపీఠిక కొలువుండు వాగ్వధూటి
మహితచింతామణీమంత్ర మాన్యమూర్తి
వాణి వసియించుగాత నాస్వాంతమందు.

సర్వదేవతాస్తుతి.

పావను లష్టదిక్పతు లపారకృపాభరితాత్ము; లన్యులౌ
దేవత లెల్ల రర్మిలిని దీవనలిచ్చి మరందమాధురీ
శ్రీవిభవప్రసిద్ధిగ రచింపగనెంచిన యీప్రబంధ మీ
పావనిసత్కథన్, విజయవంతమొనర్చి యనుగ్రహించుతన్.

శ్రీవేంకటేశ్వరస్తుతి.

పరమదయార్ద్రమూర్తి, ప్రియబాంధవు డాశ్రితభక్తపాలికిన్,
కరమనురక్తి నాకృతులకన్నిటి కాశ్రయమైన స్వామియున్,
కరుణదలిర్ప ఈకలియుగవ్యధలన్ దొలగించు దైవమై
తిరుపతికొండపై గొలువుదీరిన దేవునకున్ నమస్కృతుల్.

గురుస్తుతి.

వీణాపాణి సరస్వతిం దలచి సంప్రీతిన్ నమోస్తంచు నే
‘‘నోనామా’’లను నేర్పుటే మొదలు నన్నుం బ్రేమతో జూచి వి
ద్యానందం బిడినట్టి సద్గురువులన్ ధ్యానంబునన్ నిల్పి స
మ్మానింతున్ గృతి కాశిషమ్ములిడి సంపత్కీర్తి గల్పింపగా.

జననీ జనకుల సంస్తుతి.

జన్మంబిచ్చినదే మొదల్ మధురవాత్సల్యంబుతో సాకి ప్రే
మోన్మేషం బలరార పెంచిన మహాత్ముల్ దైవ రూపమ్ము ల
స్మన్మాతాపితలైన రత్నమను, శ్రీసర్రాజునున్ నెమ్మదిన్
సన్మానించి ఘటింతు భక్తి వినయ శ్రద్ధాంజలుల్ నిత్యమున్.

సత్కవిప్రశంస.

మానితరీతి నధ్యయనమార్గమనోజ్ఞ విశిష్ట బోధనల్
కానని మానసమ్మునకు కావ్యకళల్ చవిజూపగా గురు
స్థానములైన పూర్వకవిచంద్రులు నన్నయ తిక్కనాది భా
షానిధు లేర్పరించిన ప్రసన్న కథావిధు లాశ్రయించెదన్.

రసజ్ఞ శేఖరులు.

సరసత జూచి, లక్షణపు జందములన్ గని, కావ్యతత్త్వ పుం
దెరువులెఱింగి, భావరమణీయత గాంచి, పదప్రయోగవి
స్ఫురణ గ్రహించి కావ్యగుణముల్ గురుతించి నుతింపగల్గు ధీ
వరులు లభించినన్ కవుల పాలిటి భాగ్యము, కావ్య సిద్ధియున్.

సంప్రదాయకవిత

పరువమెలర్చు సాధుపదబంధములై, మధురార్థ సారసం
భరితముగా కవిత్వపరమార్థము జూపిన సంప్రదాయనుం
దరమగు తెన్గుకైతల విధమ్ము గ్రహింపక క్రొత్త తెన్నులన్
బరువిడు వ్రాతలీ తెనుగు బాసకు శ్రేయముగాని రీతులౌ.

వెదుకంబోయిన తీవియ
యెదురగుచుం గాళ్ళఁదగిలె నింపుదలిర్పం
గుదుటంబడియెను కుంజరు
మది చింతితకార్యసిద్ధి మానుగ గన్నై,

దవ్వుల నవ్వుల నివ్వల
నవ్వనములు నుందరమయి నివ్వటిలెన్
పువ్వుల ప్రోవులు నవ్విన
నవ్వులుగా నవ్యకునుమ నందన వనులై.

చందన శీతలమ్ములు వసంతవనాంత లతావితానముల్
పందిరులయ్యె, తోరణములన్ రమణించిన వాపరీమళత్
సుందరపుష్పముల్; విపినశోభసమస్తము వచ్చి అంజనా
సుందరికిన్ వివాహశుభశోభనమందిర మై నయట్లుగా.

కోసిన పండ్ల గుత్తులను కోసినయట్లుగ వానరోత్తముల్
రాసులు దెచ్చిపోసిరి విరాజిత నూతన వన్య మాధురుల్,
చేసిన చేతలన్ విసువుచెందని రీతుల కొండకోనలన్
క్రోసులదూరముల్ వెదకికొంచును తెచ్చిరి పుట్టతేనియల్.

వంతులుగ పెండ్లివిందున
గంతులిడుచు కపులును తమకడుపులు నిండన్
నుంతయు వలదనుదనుకన్
పంతమ్ములు వోయి తినిరి ఫలములు తేనెల్ -

రసాలి.

ఆమె సుందరియు నాతడుద్యత్
స్థేమ భాసురుడు శిక్షితారి
సోము డిర్వురును శోభితార్ద్ర
ప్రేమ వర్తనులు శ్రీసమేతుల్ -

దీపిత దైవనిర్ణయ విధిప్రథమానము, లోక సత్తపః
ప్రాపిత భాగ్యమౌ పరిణయమ్మిది, అంజనగర్భశుక్తిము
క్తాపటు కీర్తి కౌముదు లికన్ దిశలన్ ప్రసరించుచున్ త్రిలో
కీ పరమార్థముల్ సుజన కీర్తన లౌనని పల్కిరార్యులున్. 140

ఆశ్వాసాంతము

కేసరి అంజన లుదిత
శ్రీసముదీర్ణగుణు లిర్వురి వివాహమ్మున్
వ్రాసితి నీకున్ రసవత్
భాసుర పద్యార్పణమయి వరలుత రామా!

ప్రణవబిందు చిదాత్మ సంప్రభవ నాద
విగళితానంద రసమయ విగ్రహుడవు,
పరమ శాంతి సంధాతవు హరివి నీవు
అవనిజా హృదయాబ్జపీఠాభి రామ!

అమర వంద్య మాన మృదుపదాంబుజుడవు
వేద తత్త్వరహస్యకోవిదుడ వీవు
భక్తలోక రక్షాప్రౌఢ భవ్యమతివి,
సుజన మునిజన క్షీరాబ్ధి సోమ ! రామ!

ఇదియేదో నిరతము నీ
పదపంకజమధుప మయిన పావని చరితం
బెద గదలించిన పుణ్యా
స్పద కథయయి నిను దలచుచు వ్రాసితిరామా !

ఇది పశ్చిమ సముద్రతీర విలసిత ప్రభాస తీర్థ వర్ణనము, శబల శంఖము లను క్రూర మత్తేభములను వానర వీరుడు కేసరి చంపుట, కేసరి అంజనల వివాహ కథయు గల శ్రీ శ్రీహనుమత్ప్రబంధ ప్రథమాశ్వాసము. 145

శ్రీ హనుమత్త్వ బంధము

ద్వితీయా శ్వాసము

శ్రీ మన్మారుతి పూజిత
కోమల చరణాభిరామ! కోదండబలో
ద్దామా ! జననుత సద్గుణ
ధామా! నరవర లలామ! దశరథరామా

దేవా ! అవధరింపుము

కేసరి అంజనల దాంపత్యము.

తరుణీమణి అంజనయును
వరగుణు డా కేసరియును భవ్యచరిత్రుల్
సురుచిరసుందరజీవన
భరితామోదములు వారి ప్రణయక్రీడల్.

ఆ శృంగారము లాసుఖానుభవ మర్యాదల్ ప్రియంభావుకా
వేశోద్భాసిత భోగలాలిత కళాన్వీతమ్ము లాకామలీ
లాశాస్త్రాభ్యసన ప్రచోదిత మహోల్లాసమ్ములున్ ప్రేమసం
దేశమ్మందున నూత్నపాఠములు పృథ్విన్ కాముకశ్రేణికిన్.

చిలుకయుగోరింకయు బలె
విలసిత నవ్యానురాగ విహితక్రీడా
కలితోత్సుక విహరణముల
కలసియె యేగుదురు వారు కానలవెంటన్.

మధుమాసతరుకదంబముల నంజనచూపునత డామె నచట నుయ్యాలలూపు, సుమనికుంజముల కారమణి సేవలొనర్చు అత డామెకొరకు మాల్యముల గూర్చు, ఫలతరుచ్ఛాయ కాపాలతి సేదకుజేరు అరమ్రుగ్గిన పండ్ల నాతడేరు, అంబుధితటి కతం డంజనన్ గొనివచ్చు అచటి శీతానిల మ్మామె మెచ్చు,

ఆమ్రతరువుల మాలతు లల్లుకొనుచు
పెరుగు గుబురులదరికి కేసరియు నరుగు,
ప్రణయపులకితదేహా అంజనయు జేరి
లలితలలితమ్ము లతనికౌగిళుల నొదుగు.

అతిచిత్రం బద్భుతమయి
మతిజొప్పడు నావనచరమహిమము లరయన్
క్షితిపయి మానవులట్లే
బ్రతుకుదురు వారు నిజముగ స్వర్వాససముల్.

ఏగవు దినములు జగతి నొ
కేగతి; నొడుదుడుకులవెత లెవ్వరికేనిన్
వేగమ యరుదెంచు తొలగు;
సాగిన వంజనదినములు సయిత మ్మిట్లే.

కేసరివైరాగ్యము

అమలమనస్కు లాయిరువు రట్లనురాగ మెసంగ కాలమున్
సుమధురమూర్తులై గడపుచుండగ కేసరి కేమిహేతువో
క్రమముగ చిత్తమందొక విరాగము కల్గినమాట నంజనా
రమణి గ్రహించియున్ దలపురాపిడికిన్ మనసొగ్గ దింతయున్.

తెలియగనీయ దాయమ మదిం గలగించుచునున్న వంతయున్,
దెలియగనీ డతండు తన తీవ్రమనోగత వాంఛనేమియున్;
తలపులు కొన్నినాళ్ళిటుల దాచిన కేసరి యెట్టకేలకున్
బలుకదొడంగె నంజనయు బాష్పజలాకుల నేత్రయై వినన్.

వనితా నీవు గ్రహించి యుందువనియే భావించుచుంటిం దపో
మనన ధ్యాన జపవ్రతాది విధులన్ మగ్నంబు నామానసం
బనివార్యంబుగ, ఈప్రయత్న మఖిల మ్మాదైవనిర్ణీతమౌ
పనిగా దోచునుగాన వేఱుగ దలంపంబోకు ముద్విగ్నవై.

విను మా నాడు మదద్విపమ్ములవి నావిక్రాంతికిన్ లోగియా
ల్గిన వేళన్ ననుజూచి వీరుడు జగద్గేయుం, డజేయుండు, నం
దనుడౌ నీకని జెప్పె నామునిభరద్వాజుండు తద్వాక్యమం
దనుమాన మ్మిక లేదు నీకిదియు తన్వంగీ శుభోదర్కమా.

నీమాతృత్వము విష్ణునామ మహిమోన్నిద్ర ప్రభావోదయ
శ్రీమాహాత్మ్యము, సర్వరాక్షసచమూ శీర్షచ్ఛిదాదక్షమౌ
సామర్థ్యమ్మును, వేదశాస్త్రవిలసత్ సౌజన్య సాహిత్యశో
భామాధుర్యధుర మ్మటంచు మునియున్ వాక్రుచ్చెనోభామినీ.

వినమత్శీర్షములై గిరుల్సయిత మేవేల్పున్ తమిన్ గొల్చు నా
వినుతప్రాభవ వేగ దుస్సహబల స్ఫీతోగ్రుడౌ వాయుదే
వుని ప్రార్థింపుము, దిక్పతిత్వధిషణాపూర్ణుండు దీవ్యద్యశో
ధను డాదేవు డనుగ్రహించును భవద్వాంఛామహాలాభమున్.

కను మాప్రాగ్దిశ కాంచనారుణ కనత్కాంతిచ్ఛటల్ నిండెడున్
నను బోనిమ్మిక నంచు మౌనిజనమాన్యంబైన దీక్షాకృతిం
జనె నాకేసరి అంజనన్ విడచి; యీసంసారసాంగత్యబం
ధనముల్ కోసి చరించువారల చరిత్రల్ చూడ అట్లే యగున్. 10

అకలుషు డాత్మనాథుడు జటాజినముల్ ధరియించి యేగగా
ఒకనిముసమ్ము ఖేదము మఱొక్కనిమేషము చిత్తమం దెదో
ప్రకటతరానుమోదమధుర మ్మగు ఆశ జనించి నట్లు వె
న్కకు అలనల్లనన్ జనె మనమ్మును అంజన చిక్కబట్టుచున్.

మధ్యాక్కఱ

ఒకసారి ఒకమబ్బు వచ్చి ఉడురాజుపై గ్రమ్మినటుల
ఒకసారి ఒకమబ్బు విచ్చి ఉడురాజు కన్పించినటుల
ప్రకటిత నైరాశ్యమందు ప్రకటిత నవ్యాశయందు
వికల మంజనకు మనస్సు; వికసిత మ్మంజన మనస్సు.

మధ్యాక్కర

పతియేగె తనదారి, నీకు పవనుడె ప్రాణేశు డనుచు
పతియానె, కనులకన్పడనివా డొకపవనుం డ దెట్లు
పతియేమొగాని నాగతియు పండిన దీరీతి ననుచు
మతియుండి లేనట్లు మాటిమాటి కంజనడెంద మడలు.

మధ్యాక్కర

మునుకొని మనసెల్ల నిండు మొదటిదుఃఖపు పొం గొకింత
అణగారి తనకేదొ యాశ అగుపించి మరపించి నంత
పెనగొన్న మేఘముల్ విడిన వెలివెన్నెలల చల్వ లనగ
తనువునన్ మెదలె నంజనకు తరలి వచ్చిన గాలితరగ.

అంజనావాయుదేవుల కలయిక

మధుమతి

నవవికాసముతో గవియు చంద్రికలై
తవిలె నంజనకుం జవులు గ్రొత్తవియై.

ఒకమునిసత్తముం డనియెనో తనభర్తయె యూహసేసెనో
సకలము భ్రాంతిగా నెడద సందున తోచియు తోచనట్టి భా
వుకగతి నున్న యంజనకు పొల్పుగ నేడు సమీరుడే మనో
వికలత మాన్పి యేలుకొను వేలుపుగా గనుపించె నెమ్మదిన్.

ఆరేయంతయు అంజనాసతికి నేత్రాంతమ్ములం దేదియో
పారావార గభీరనీర తరణ ప్రావీణ్య రేఖోల్లసత్
ధీరమ్యంబగు తేజమొక్కటి వియద్వీధీచలత్క్రీడగా
నై రాజిల్లెను పుత్రమోహకలితాహ్లాదమ్ము లూరించుచున్.

కలయని తెలియని స్థితిలో
ఉలికిపడిన దంజన యెవరో దూరముగా
సలలిత మృదు నిస్వనముల
పిలిచిన య ట్లానిశీథవేళన్ బ్రీతిన్.

కలగిన గుండెలోతుల నొకానొకధైర్యము నూని క్రొందలం
పుల నునుతీపివెల్లులు గుబుల్కొను మోమలరార ఇంటిలో
వెలువడివచ్చె నంజన నవీన మనఃప్రమదప్రలోభనం
కులమతి త్రోపువెట్ట తొలికోడియు కూయని రాత్రివేళలో.

వలిమంచుంజడి తళ్కులొత్తిన వనీప్రాంతమ్ము దీప్తమ్ముగా
చలువల్జిమ్ముచు, జాలుజాలులుగ జ్యోత్స్నాకారి శైత్యాంశువుల్
తెలిపాన్పుల్ సవరించె క్రొంజిలుగుపూదీవల్ నవోన్మేషముల్
తొలిప్రొద్దున్ నునుగాలి వీవనలకై తూగాడె నొక్కొక్కటే. 20

చదలపై నడయాడు జలదమ్ముభంగి
పెదవిపై కదలాడు మృదుహాస మట్లు
పూలతీవియమీది పూగుత్తి వోలె
గాలితాకిడులలో కదలె నంజనయు.

పాయలుపాయలై పరువువారుచు బోవు సరస్వతీనదీ
తోయతరంగ సంతతుల తుంపురు లాచలివెల్గు టందపుం
జాయల తళ్కుటద్దపుబసల్ మిసలాడిన జాడలందు జా
ల్వోయదొడంగె దూరపు పులుం గొక నూతనరాగమాధురిన్.

పూవుల్పూచిన యేవెలుంగుచెలువమ్ముల్ చిందు క్రొందోవలం
దావర్చస్విని అంజనాసతియు తీయన్మెత్తు ఆశాలతల్
త్రోవల్చూప సరస్వతీనదికి దారుల్ పోల్చుకొం చేగి యా
క్రేవన్ వన్యమనోజ్ఞశోభ లనురక్తిన్ జూచుచున్నంతలో.

వైతాళీయము:

మలగిమలగి మంజులాటవిన్
నిలుచుచునిలుచు చనేకవాటులన్
కలగికలగి కాంతయందమున్
తలచుచుతలచుచు తాల్మి తూలగన్.

ప్రాచీసుందర పర్వతాగ్ర హిమవత్ ప్రాగ్భారశైతల్యమై
పూచీపూయని మొగ్గకన్నియల తావుల్ నూత్నసమ్మోదమై
వీచెన్ వాయువు మందమందగమనోద్వేలస్ఫురద్రోచియై
దోచెన్ దత్తరుణీ తనూవిభవ విద్యుత్కాంతిసౌందర్యముల్.

మధుమాసోత్సవ విభవా
స్పద లతికా సుమసుగంధ బంధుర వీచీ
మృదుపవనుడు తనువెల్లన్
గదిసి పొదువ అంజనయును కడువిహ్వలయై.

ఏకాంతమ్మున నున్న నన్నుగని యిట్లెవ్వండో నిర్భీకుడై
పైకొన్నాడని విస్మయంపడుచు విభ్రాంతాత్మయై నిల్వగా
నాకాంతాకరమున్ గ్రహించి పవనుం డత్యంత సౌందర్యశో
భాకారుండయి నిల్చి పల్కను సుధావాక్పూరపూరమ్ములన్.

నీకళ్యాణతనూవిలాససుషమన్ వీక్షించి కాంక్షించి యే
నీకైవచ్చిన వాయుదేవుడను తన్వీ నాపరిష్వంగముల్
స్వీకార మ్మొనరింపు మిద్ది పరమశ్రేయమ్ము నీకీర్తికీ
లోకమ్మందునరాదు లేశమయినన్ లోపమ్ము సాధ్వీమణీ !

అలనాడెప్పుడో మోహితుండగుచు ఫాలాక్షుండు శ్రీమోహినిన్
దిలకింపన్ చలితమ్ముగా పడిన తద్వీర్యం బవార్యస్ఫుర
ద్బలతేజోవికస న్మహామహిమ సంభావ్యంబు నాయందునన్
గల దద్దాన జనించు నీకు సుతు డొక్కం డీశు తేజంబునన్.

కారణజన్ముడున్ దివిజకార్యధురంధరు డాగమాంతవి
ద్యారమణీయమూర్తి కమలాసనతుల్యుడు సాధుభావనో
దారు డజేయ విక్రమ విదారిత శాత్రవు డచ్ఛకీర్తివి
స్తారుడు విష్ణుభక్తిగుణధన్యుడునౌ సుతుడబ్బు నీకికన్. 30

నీమాతృత్వము విష్ణునామమహిమాన్వీత ప్రభావోదయ
శ్రీమాహాత్యము సర్వరాక్షసచమూ శీర్షచ్ఛిదాదక్షమౌ
సామర్థ్యమ్మును సాధువాదవిలసత్ సౌజన్య సాహిత్య శో
భామాధుర్యధురమ్మునై త్రిభువనప్రఖ్యాతమౌ నంజనా!

అనిలుం డట్లనిపల్క నంజనకు చిత్తాంభోజ ముత్ఫుల్లమై
తనయాత్మేశ్వరు డన్నమాటలు భరద్వాజర్షి వాకొన్నదీ
వనలున్ నెమ్మదిలో ప్రతిధ్వనిత భాస్వన్మాధురుల్ చిందగా
ననిలున్ పాదములంటి భక్తినిరతిన్ ప్రార్థించె బద్ధాంజలిన్.

దండకము

శ్రీమన్మహావాయుదేవా దయార్ద్రస్వభావా, ప్రచండ ప్రభావా, త్రినేత్రోరుతేజస్సమానోర్జితప్రాభవా, భక్తలోకార్చి తానూనసేవా, త్రిలోకస్థలీవ్యాప్తమూర్తీ, శరత్కౌముదీ స్వచ్ఛకీర్తీశ్వరా సర్వసర్వంసహాప్రాణిదేహమ్ములన్ ప్రాణమై రమ్యవాసంతపుష్పాసవామో దమాధుర్యధుర్యుండవై, అష్ట దిక్పాలకశ్రేణి నత్యంతముఖ్యుండవై, సాధుసమ్మాన్య సత్పుణ్య గణ్యుండవై, భోగివై త్యాగివై వేగివై పాలితానంత దిగ్భాగివై సాధుమార్గానుసారుండవౌ నీవె నాకున్ శరణ్యమ్ము, సర్వాశ్ర యమ్మర్చనీయుండ వయ్యా! భవత్పాద పంకేరుహధ్యాన తాత్పర్య చింతాభరస్వాంత నీనాడు నీదాననై దీననై దాసినై వచ్చితిన్ స్వామి, నన్నీవు మన్నించి పాలింపు మోవాయుదేవా నమస్తే నమస్తే నమః

అని ప్రార్థించుచునున్న అంజనను ప్రేమార్ద్రప్రసన్నాస్యుడై
అనిలుం డాదట నెత్తి ముద్దులిడి బాహాసంగతాలింగన
ప్రణయక్రీడల దేల్చి, నాలలనయున్ భాస్వన్నవోద్వేగ మో
హన హేలా పరిరంభసంభ్రమ కళావ్యాలోలయ్యై చొక్కగన్.

ఆంజనేయుని జననము

ఆసంయోగఫలాప్తి నంజనకు సద్యః ప్రాప్త గర్భోదిత
శ్రీసంపన్ను డమోఘపాటవ జవస్థేమ ప్రసిద్ధైకవే
షాసర్వస్వు డొకండు పుట్టె సకలాశావ్యాప్త దివ్యచ్ఛవీ
రాశీభూత మహఃప్రభావవిశద ప్రౌఢప్రతాపాఢ్యుడై.

ఇట నట్లంజనకున్ సుతుండు కననయ్యెన్ దివ్యతేజోమయ
స్ఫుటదీప్తిప్రథమాన రమ్యముఖు డస్తోకప్రభాశ్రీకుడై;
అటుప్రాచీదిశ భానుబింబ ముదయంబై తోచె ప్రాదుర్భవత్
పటుదీప్తారుణ హేమవర్ణ కిరణప్రద్యోత మాంజిష్ఠమై.

జననముతోడనే పసిడిజందెములున్ మణికుండలమ్ములున్
మణిగణ మేఖలాకలిత మంజులభూషణముల్ వెలుంగ నం
జన కుదయించె నాశిశువు చక్షురుదాత్తమహోత్సవమ్ముగా
కనదురుకాంతిమత్కిరణ కాంచనవర్ణ మనోజ్ఞదేహుడై.

ఆసలు పండి నాకనులకద్దిన వెల్గుగ పుట్టినట్టి ఈ
నాశిశువింక ప్రాజ్ఞుడగు నాటిది మాటగదా మహేశ్వరా!
ఈసుకుమారు భార మదియెల్లను నీయది, వాయుమూర్తిదిన్
నాసకల మ్మితండని యొనర్చిన దంజన వేయిప్రార్థనల్.

భాసురోదీర్ణబలు డంజనాసుతుండు
ఉదితతేజస్కు డాంజనేయుం డతండు
కన్నతల్లికి కనువిందుగాగ తాను
పుట్టినప్పుడె పటుసత్వపూర్ణుడయ్యె.

ఆకుమఱుంగుపిందె యటు లంజన యాపసిబిడ్డ నెట్టులో
సాకిన దొండురెండు దివసమ్ములు స్తన్యము లిచ్చి గాని తా
నాకలితీర కప్పుడవు డాపసికూనయు పోరుపెట్టగా
ఆకెయు నేమితోచక భయాకులయై కనుచుండు నిస్పృహన్. 40

మూడుదినముల పసిబిడ్డ, ముద్దుశిశువు
నిముసనిముసమ్మునకు సమున్మేషమహిత
శక్తిశాలియు చటులతేజస్వియగుచు
అంజనానేత్రయుగ్మ పద్మార్కు డయ్యె.

అతిశయదేహసౌష్ఠవసమన్వితు డంచిత సత్వపూర్ణుడా
సుతునకు పాలుచాలమియు చుమ్మలుచుట్టి ఫలాసవద్రవం
బతని కొసంగ నంజనయు నాతురయై వనికేగె పండ్లకై
సుతు నట వీడి; ధాత్రి కడుచోద్యము లాతురపాటు కర్జముల్.

పద్మప్రతానమ్ము భక్తిమై జేసిన పరమునిష్ఠాతపఃఫల మనంగ
క్షితిని గ్రమ్మిన కారుచీకటుల్ దొలగంగ సురలు వెల్గించిన జ్యోతియనగ
ప్రత్యుషస్స్నాతయై ప్రాగ్దిశావిమలాంగి నొసలిపై నిడిన సిందూరమనగ,
భూమండలం బెల్ల పాలుపార పండించి కూర్చిన బంగారు కుప్ప యనగ,

భానుబింబమ్ము వచ్చె పూర్వాద్రిపైకి
తనకు దీటైన కాంతి వితాన మమర
అవలనెవ్వడొ వెల్గుచున్నట్లు దలచి
ఆంజనేయుని జూచుట కరుగు కరణి

ఆంజనేయుడు సూర్యుని పట్టుటకు మింటి కెగురుట

అకలికాగలేనివెత నట్టిటు జూచుచు నాంజనేయుడున్
ప్రాకటరీతి ప్రాగ్గిరులపై వెలుగొందు సువర్ణవర్ణశో
భాకమనీయభాస్కరుని పక్వఫలమ్మనుచున్ గ్రసింపగా
దూకె నవార్యవేగబలధూర్వహుడై గగనాగ్రవీధికిన్.

చదలన్ జీల్చుచునేగు విద్యుదిక చంచద్రేఖికా వేగియై
విదితావేశజిగీష విక్రమధురాభీలాకృతిన్ భాస్కరున్
గదియంబోయెడి అంజనాసుతుని నాకమ్మందు వీక్షించి రి
య్యదియేదో విపరీతభూత మని నాకావాసు లుద్విగ్నులై.

ఆరీతిం జను మారుతాత్మజుని వైపై దారికడ్డమ్ముగా
నౌరా వీడెవడో నిశాచరాధముడు నాకాహారమ్మై యొప్పునీ
నీరేజాప్తుని పట్టబోవు ననుచున్ నిర్వేల విద్వేషనూ
చీరోషశ్వసనుండు రాహువరుదెంచెన్ కోపతాపోగ్రుడై.

ఇదియును మంచిదైనదిబలే! ఒకనల్లనిపండటంచు స
ముమ్మదమున రాహువున్న దెస పోయెడి మారుతపుత్రు విక్రమా
స్పద పటుధాటికిన్ నిలువజాలక పర్వులువెట్టె చిత్తమం
దదవదయాచు రాహు వమరాధిపునిన్ శరణమ్ము వేడగా.

స్రగ్విణి

రాహువున్ర్మింగ నుగ్రాకృతిన్ దూకుచున్
సాహసోద్వృత్తితో స్వర్గవీధిన్ మహో
త్సాహియై వచ్చు సందర్శితోద్వేగవత్
దేహునిం జూచుచున్ దేవతల్ భీతులై.

విబుధేంద్రున్ గని మ్రొక్కి దేవ ! యెవడో విన్వీధి లంఘించుచున్
ప్రబలోగ్రాకృతి రాహువున్ దరిమి, స్వర్వాసమ్ముపైవచ్చి దే
వబలమ్ముల్ బెదరించుచుండె నతనిన్ వారింప ధైర్యప్రభా
విభవోద్ధత్యము చూపి కావు మనుచున్ విజ్ఞప్తులం జేయగా.

ఆంజనేయుని మూర్ఛ

దివిజావాసము జొచ్చి నిర్భయముగా ధీరోద్ధతిన్ జూపు వా
డెవడాతండు? వచింపు డీనిముసమందే వాని నంకించి మ
త్పవిధారల్ చవిజూపి వత్తు ననుచున్ వైళంబ వెల్లేన్గుపై
దివిజాధీశుడు వచ్చె వాయుసుతు నుద్దీపించి చెండాడగా. 50

దినినాథున్ కబళింపనేగెను మహాధీరాత్ముడై, రాహువున్
వెనువెంటం జని దాకి డీలుపఱచెన్, నేడిట్లు దర్పోద్ధతిన్
గనుమాటై బడి వచ్చు వింద్రుడొకలెక్కా! మారుతాత్మోద్భవుం
డనుమానింపక వేగపోదొడగె నాకాధ్యక్షుపై కుగ్రుడై.

హతధైర్యుండయి యింద్రు డాకపికుమారౌద్ధత్యమున్ మాపగా
నితరాస్త్రప్రతతుల్ వృథాయనుచు నెంతే యోచనంజేసి అ
ప్రతిమప్రాభవపాటనప్రథితమౌ వజ్రాయుధమ్మున్ మరు
త్సుతుపై నేసెను తద్రయోపహతి దిక్స్తోమమ్ము లూటాడగన్.

అనుపమ దుర్దమోగ్రవిభ వాంచిత మాపవి, శైలపక్షపా
టన మహిమోజ్జ్వల మ్మది హుటాహుటి వచ్చి సమీరసూతికిన్
హనువున దాకి తద్రఢిమ కాగక వెన్కకు బోయె;నామరు
త్తనయుడు మూర్ఛలో మునిగె తత్పవిఘాత కొకింత నింతలో.

శైశవచాపల మ్మెసగ సాహసవృత్తి తనూజు డిట్టులా
కాశపు టెత్తు దూకి కడకన్ తుద కాదివిజేంద్రుచేతి ఘో
రాశనిపాతసంహతికి నైస్వ్రుతిదప్పుట జూచి యాగ్రహా
వేశమనస్కుడై సుతుని వేగమె దాగొనిపోయి వాయుపున్.

త్రిభువననేత యింద్రునికి తీరికగా దనవజ్రహేతిసం
ప్రభవముచూప, మాచిఱుతపాపడెకన్పడెనా! మఱిప్పుడా
ప్రభుతయు చూతుగా కనుచు పంతమునం జని వాయుదేవుడున్
రభసముతో సమీరవిసరమ్ముల నాపెను వీవకుండగన్.

వాయూద్ధారిత వీచికాప్రసరణ వ్రాతమ్ము స్తంభింపగా
ఈయావజ్జగమందు ప్రాణితతిలో ఏకైకకాలమ్మునం
దాయుర్వాయువు లాగిపోయెడి విపత్తారంభమై జీవుల
య్యాయంచున్ మొఱవెట్టె నావిలయకాలోత్పాతదుఃఖమ్మునన్.

ఉసురుసు రని ప్రాణిచయం
బసువులు గుప్పిట నిడుకొని యావేదనతో
శ్వసనము లాడక మరణ
త్రసనం బిదియని వగచుచు తల్లడమందన్.

జరిగినదానికిన్ వగచి సత్వర మాదివిజేంద్రు డార్తిమై
పరువున పద్మసంభవుని వద్దకు నేగి వచింపగా నతం
డిరవుగ దాను చేయగల దేమియులేక విలంబన మ్మికన్
కరము విపత్కరమ్మనుచు గ్రక్కనలేచి రయప్రయాణుడై.

అనిలుడు పుత్రునిం బొదివి యంకమునందున జేర్చి లాలనల్
బొనరుచు నుండగా, దివిజముఖ్యులు నింద్రుడుగూడ తోడరా
వనజభవుండు వేగముగ వాయువునొద్దకు జేరి ముందు దీ
వనలొనరించి యానిసుగుపాపనిమూర్ఛను బాపి యిట్లనెన్.

ఆలింపగదవయ్య యోయనిల ! మాయభ్యర్థనన్, వేగమే
పాలింపంగదవయ్య లోకముల, నీవాయుప్రసారమ్ములన్
దేలింపంగదవయ్య మమ్ము, విలయార్తి క్రూర సంక్షోభమున్
చాలింపంగదవయ్య సర్వజనరక్షాశీలమాన్యుండవై. 60

వినుమీ నీదుసుతుండు చూపిన మహోవీరోచితక్రీడ కీ
తని విఖ్యాతి పదింతలైనది, జగత్సర్వమ్ము హర్షించి వీ
నిని దీవించి నుతించుచుందు రిక కానీ, వాయుదేవా మదిం
గనుమీ న్యాయము; ఒక్కబిడ్డకయి లోకమ్మెల్ల చంపింతువా.

అని వారాడిన పల్కులెల్ల పవనుం డాలించి యోచించి చ
య్యన వాయుప్రసరమ్ములన్ నినిపె బ్రహ్మాండమ్మునన్, బిగ్గబ
ట్టిన ప్రాణమ్ములు లేచివచ్చి యలరెన్ డెందమ్ము లానందభా
వనిరూఢిప్రకటమ్ములై మరల సర్వప్రాణిలోకమ్ములన్.

ఏవలనన్ భయమ్మెసగ దీపసికూన ధరిత్రిపై చిరం
జీవియు భక్తశేఖరు డజేయుడు జ్ఞాని అనంతకీర్తిరే
ఖావిభవుండు సాధుజనగణ్యుడు నౌనని సర్వదేవతల్
దీవనలిచ్చి రాశిశువుదేహమునున్ హనువున్ స్పృశించుచున్.

మ్రొక్కెను వాయువు బ్రహ్మకు
మ్రొక్కించెను శిశువుచేత, మునిసుర లానా
డక్కడ కేతెంచిన వా
రక్కజపడి రాత్మలందు హనుమను గనుచున్.

దొరకిన పండుల గొని వెను
దిరిగిన యంజన తనయుని దిగబెట్టిన చో
టరసియు శిశువును గానక
వెరగున నటుదిటు దిరుగుచు విహ్వలమతియై.

పాపమనంగ బోక పసివానినిటుల్ దిగబెట్టిపోయి తీ
పాపని దొంగలించుకొని పర్విడి రెవ్వరొ నాయురమ్ములన్
చేపినపాలు ధారలయి చిందుచునున్నవి గుండెలోతులం
దూపిరికూడ ఆడదుప్రభూ! ననుసైరణ జేసి బ్రోవవే.

అని వాపోయెడి అంజన
కనువిందుగ వచ్చి నిలిచె కరువలియటకున్
హనుమంతునిగొని ; వేగమె
వినిపించెను సర్వకథయు విస్మయమెసగన్.

కనుగవను బాష్పధారలు కాల్వగట్ట
అంజనయు బిడ్డ నురముల కద్దుకొనుచు
ఇంతలో నెంతయయ్యె తండ్రీ! యటంచు
దృష్టి దిగదుడ్చి దేహము నెల్ల నిమిరి -

ఎవ్వడో దేవు డిట్లు రక్షించెగాక
దక్కుదువె నాకు బంగారుతండ్రి ! ఎంత
కక్కటిల్లిపోయితివొ నన్నానకనుచు
పాలు కుడిపించె నాయమ బాలునకును.

సురుచిరచేష్ట లా నిసుగుసుద్దులు వేగమె తీయముద్దులై
మరల మఱొక్కసారి యని మారిచిమారిచి తల్లిదండ్రులా
చిఱుతను ముద్దులాడుచును చేతులకెత్తి ఒకళ్ళొకళ్ళలో
కరగిరి పూర్వపున్ మధురగాథలు మోముల హాసరేఖలై. 70

కనుమొఱగియుండ దంజన
హనుమంతుని వీడి యొక్క అరగడి యైనన్;
కనుపఱచును విద్దెములన్
హనుమం డేమియు నెఱుగని య ట్లంజనకున్.

మారుతాత్మజు డగుటచే మారుతియని
అనిమిషేంద్రు వజ్రాయుధహతిని తనదు
చెక్కిలికి దెబ్బతగులుటచేత భువిని
ఆంజనేయుడు హనుమంతు డనగ నెగడె.

హనుమంతునివిద్యాభ్యాసము

ఒకనా డంజన బాలునిం బిలిచి బాబూ ! పెద్దవాడైతివీ
విక విద్యల్ గడియించి పేరుగొనుమీ విశ్వమ్ము నిన్మెచ్చగా,
అకలంకోజ్జ్వల పండితుం డినుడు నీకాచార్యుడౌగాక ఆ
యినునింజేరి విపశ్చిదగ్రణివి తండ్రీ కమ్ము శ్రీఘ్రమ్ముగా.

అని దీవించిన తల్లిపాదములయం దానందబాష్పాంబువుల్
ధునులై పాఱగ మ్రొక్కి లేచి హనుమంతుండంత యేనాడొ పం
డని మ్రింగం జని నట్టి భాను డిల నేడారాధ్యుడౌ సద్గురుం
డని భావించుచు సూర్యుజేర శ్రుతిశాస్త్రాభ్యాస దీక్షాధృతిన్.

హనుమంతుంగని దీవనల్ నుడివి యయ్యర్కుండు విద్యాభిలా
షను నావద్దకు వచ్చినాడ విటు లీషట్కాల పర్యంత మా
గని వేగమ్మున నేచరింతును గదా కాలూన కెచ్చోటనై
నను నాచెప్పుట నీవునేర్చుటయు హన్మంతా అసాధ్యంబనన్.

ఆగనట్టి సంచలనమం దనవరతము
విశ్వమందీవు గురుదేవ వెడలుచుండ
నెట్లు నీప్రబోధమ్ములాలింపనగునొ
ఇంతియేకద సందియం బెడదమీకు.

దానికి నేభయంపడను తామరసాప్త! యటంచు నొక్కకా
లూనుచు పశ్చిమాద్రిని మఱొక్కపదమ్మును ప్రాగ్గిరీంద్రమం
దానుచు మారుతాత్మజు డహస్కరుజూచి నమస్కరింపగా
నానిపుణత్వముం గని యహర్పతి యాతని శిష్యుగా గొనెన్.

ఒక సర్వాగమసర్వశాస్త్రగత విద్యోత్కర్షు డధ్యాపకుం
డొక దీక్షావిలసత్ కుశాగ్రశితమేధోత్తంసుడున్ ఛాత్రు డా
ప్రకటోత్ప్రేరిత బోధనాధ్యయన సారస్వాదు రేఖావధుల్
సకలశ్రీపరిషత్తులై వెలయు ఆచార్యత్వశిష్యత్వముల్.

విదితోద్య ద్ద్యుతిభా సముజ్జ్వలకళాభిఖ్యుండు సామీరి, తా
చదువ న్నేర్చెను ప్రత్యహమ్మొక మహాశాస్త్రమ్ము నాద్యంత మా
సదసత్ జ్ఞానవిధేయు డింతటి యభిజ్ఞాశాలి శిష్యుండవన్
హృదయమ్మందతివేల హర్షమున గర్వించెన్ వివస్వంతుడున్.

సంగీత, మ్మఖిలాగమార్థ విపులజ్ఞానమ్ము, శాస్త్రార్థవి
ద్యాంగీకారితసారసౌరభ ముపజ్ఞాధిక్య సర్వస్వదై
సాంగోపాంగముగా గ్రహింపగలిగెన్ హన్మంతు డాదిత్యుస
త్సాంగత్యమ్మున దేవతల్ సయిత మాశ్చర్యమ్మునన్ దేలగా. 80

సకలసద్గుణమూర్తి యంజనయు జనని,
జన్మమరయ మహేశ్వరాంశప్రశస్తి,
చండవేగాతిబలు డనిలుండు తండ్రి,
సకలశాస్త్రదేశికుడు భాస్కరుడు గురుడు;

సాధువర్తనమధుమూర్తి, సకలభువన
మాన్యమహిము, డజేయు, డనన్యసాధ్య
వేగసత్త్వుడు, విద్యావివేకవేది
యగునుగాక అంజనసుతుం డన్యుడగునె.

పరమాత్మసముడ వస్మ
ద్గురుడవు మీకుందినకర! గురుదక్షిణగా
నెఱుగం జేయు డెదేనిన్
నెఱవేర్తు ననుచు హనుమడు నియతిన్ మ్రొక్కన్-

కీశశ్రేష్ఠుడు నాసుతుండొకడు సుగ్రీవుండు కిష్కింధలో
వాసంబుండును, నీవు నాతనికి విశ్వాసంబునన్ మంత్రివై
నీశక్తిం గనుపర్చు మిద్ది జగతీనిశ్రేయ మౌనం చినుం
డాశీర్వాదము లిచ్చి పంపె హనుమన్ హర్షప్రసన్నాత్ముడై.

అనుపమపాండితీవిభవుడై యఖిలాగమశాస్త్రశేముషీ
వినుతమహామనస్వియు వివేకవిదాంవరకీర్తిశాలియై
హనుమడుపోయి భక్తితొలుకాడ ప్రదక్షిణ మాచరించుచున్
జననికి మ్రొక్కె నామె నలినాంఘ్రుల రాల్చుచు మోదబాష్పముల్.

భాస్కరుని శిష్యుగా తాను పంపినట్టి
బాలు డానాడు; జ్ఞానప్రభావ భవ్య
సకలశాస్త్రార్థతత్త్వ తేజస్వి నేడు;
తనయునుం గని పొంగిపోయినది జనని.

తనయుని జూచి తల్లియును, తల్లిని జూచిన యాకుమారుడున్
మునిగి రమేయమోద పరిముద్రిత మాధురసానురక్తులన్
హనుమయు నంత కొంతవడి కాజననీ కరవల్లికోపగూ
హనములనుండి వెల్వడి తదంఘ్రుల వ్రాలి వినమ్రవాక్కులన్.

అంజనహనుమనుసుగ్రీవునికొలువునకనుపుట

భూవలయాన నేనిటుల పుట్టుటకున్ కతమైన సత్కృపా
దైవతమూర్తివమ్మ గురుదక్షిణ తీర్పగ శీఘ్రమేను సు
గ్రీవుని కొల్వు జేరవలె ప్రీతిగ బంపుమనంగ పుత్రమో
హావిల బాష్పసిక్తముఖియై సుతు నంకమునందు జేర్చుచున్.

ఇటనున్న దెపుడు తండ్రీ!
పటుతరములు నీచదువులు బలవిభవమ్ముల్
స్ఫుటముగ నేగన్న దెపుడు
కటకట ! నినుగన్న దేను కానల కొలకా !

చనుమని యెటు లన జాలుదు
నినువీడి యిచట నొకతెను నిముసం బేనిన్
మనజాలుదునా నాయన
హనుమా! విను మొక్కమాట యను చంజనయున్. 90

చెలిమిని కేల్గ్రహించి దరిజేరిన కేసరి యేగె యోగియై,
వలచిన వాయువైన నిలువం డిట దిక్తటులెల్లవానివై,
కలిగిన బిడ్డ వొక్కడవుగా నినువీడుట' యెట్టులోయి ఆ
నలువకు నేనె గావలయునా నుదుటన్ లిఖియంప నీగతిన్.

ఆగుమురా క్షణమ్ము తనయా యని యక్కున జేర్చి, వద్దు నీ
వేగకు మాకపిప్రవరు డెవ్వరొ నేనెఱుగన్ ధరిత్రి నీ
వేగద దిక్కటంచు విలపించుచు ఆకలియయ్యె నీకటం
చాగని చన్గవన్ గుడిపె నంజన హన్మను జేరదీయుచున్.

భానునిబట్టగా గగనభాగము లేగినధీరు డింద్రునిన్
బూనిక నిల్వరించు బలుపున్ గల వాడిటు తల్లికౌగిటన్
దానొక బిడ్డడై యొదిగె; దైవ మె తానొనరించు ప్రేమసం
ధానము లుర్వి బిడ్డలకు తల్లుల కీయనురాగ బంధముల్.

కాదనజాల డా గురువుకామిత మిచ్చుట తల్లిపొందు నా
వేదన చూడలే, డెడద బీటలువాఱు కలంత లివ్వియే
నాథుడు తీర్చునో యని మనమ్మున చుమ్మలు వోవు హన్మ డె
ట్లో దిగమ్రింగి తల్లి కొౕకయూఱట మెల్లన బల్కునంతలో.

హనుమను నిల్పకింక అతివా ! యతడేగుట దైవకార్య మా
యినుని యభీప్సితమ్మిది మఱెట్టి భయమ్మును లేదు శ్రేయమై
చను నిది ధాత్రికే యనిన చల్లనిమాటలు వాయులీనమై
వినబడి నెమ్మదిన్ తెరలువీడినరీతి గ్రహించె నామెయున్.

తనయుని బ్రీతి మూర్కొనియె తల్లియు, తల్లికిమ్రొక్కి హన్మడుం
దన చెయిజంట మోడ్చె గురుదైవము భాస్కరమూర్తి కాదృతిన్;
మనమున వాయువుం దలచి మాతయు ఏమివచించి పంపునో
యని తలపోయు బాలునికి నంజనయున్ జెమరించు కన్నులన్.

ఇనునిమనోరథమ్ము నొనరించియెతీరవలెన్ మఱిప్పుడా
వనచరవీరు గొల్చెదవో; భక్తుడవై వనజాక్షు గొల్చెదో
పనిసకలమ్ము నీది యయి భాసిలు నీవెట నున్న గూడ నా
తనయుడ వోయి నిన్నుగని ధన్యతగాంచితి నయ్య నాయనా!

అని మఱియొక్కమారు హృదయమ్మున పుత్రుని శీర్షమద్ది నీ
వినయము విక్రమోన్నతియు విద్యయు విజ్ఞత నిన్నుగాచు, ని
న్ననిలుడు గాచు, కాచు నినయమ్ము మహేశుడు; నీదు తల్లిదీ
వనలివి నాయనా! భువన వంద్యుడ వౌదువు తథ్యమింతయున్.

పరమవిజ్ఞానమతివి తుభ్యం జయోస్తు
పరమవిక్రాంతి ఖనివి తుభ్యం జయోస్తు
పరమవిద్వదగ్రణివి తుభ్యంజయోస్తు
అనుచు నంజన దీవించి హనుమ ననిపె.

తనయు డొకపెద్దగండమ్ము తప్పిబ్రతికి
ఎట్టులెట్టులో ఈనాటి కినుని కరుణ
నాల్గుముక్కలు నేరిచి నన్నుజూడ
అరుగుదెంచె నావద్ద నున్నటులె లేదు. 100

అని తన మనమున తలపోయుచునే అంజన,

నిరతము తనపదసేవల
జరుపదగిన సుకుమారుం జయ్యన మదినే
యరియరి లే కనిపిన దా
వరసుతుని భవిష్యమేమి భావించినదో.

తల్లివైపు జూచునె యాతనయు డరిగె,
కనులకనబడు దన్క నాహనుమ వైపె
మాటిమాటికి జూచు నా మాతృమూర్తి
కనులకవరోధమై యశ్రుకణము లురలె.

పెరిగినది మురిపెముగ కుంజరుని యింట,
పరిణయ మ్మాడె వలచి కేసరిని దాను
అనిలుసంగతి పుత్రునిం గనియె గూడ;
కనుపడరు నేడు జగతి నంజనకు తోడు.

తోచియు తోచనీనిగతి తొందరలేవొ కలంచు దేహమం
దే చిఱుగాలి సోకినను ఏసడివిన్నను నామె దిక్కులం,
జూచుచు నెవ్వరిన్ గనని శోకమునన్ బడి దేవుడే ననుం
బ్రోచును గాక యన్న తలపుంజడిలో నొనరించు ప్రార్థనల్.

పరిణయమైనదే మొదలు వంతల పాల్పడి చిత్తశాంతియే
యెఱుగని యంజనా సతియు ఏమియు దోచని రీతి నుండగా
సురభిళ శీతలోర్మికల సొంపులదేల్చి సమీరు డూఱటల్
నెఱపగ శాంతియున్ గలిగె నెమ్మది నంజన కంతకంతకున్.

ప్రీతిన్ బిల్వదళమ్ము తేరి శివునర్చించున్, నవోన్మేషకం
జాతమ్ముల్ గొని తెచ్చి నచ్యుతుని పూజల్ సేయు, సంక్షేమసం
ధాతల్ మీరలె కావగావలె నిలన్ నాబిడ్డ నంచున్ శుభ
ప్రాతర్వేళల ప్రార్థనల్ సలుపు నిత్యమ్మంజనాదేవియున్.

ఆశ్వాసాంతము

వినుతం బతిరమ్యంబిది
హనుమంతుని జననగాథ అద్భుతచరితం
బనుపమ మృదుపద మధురము
వినిపించితి రామ! నీకు వినివేద్యముగా.

నిరుపమగుణుండవును నీవు నిర్గుణుడవు
చారుబహురూపుడవు నిరాకారుడవును
సర్వముభరింతు వీవెనిష్కర్ముడవయి
ఎవ్వరని యూహసేతు నిన్నేను రామ!

ఆనందము నీ నామము
ఆనందము నిన్దలచిన యపు డోరామా
ఆనందరాముడవు నీ
యానతి యానంద మఖిల యత్నములందున్. 110

ఇది అంజనా కేసరుల ప్రణయ విహారము, కేసరి వైరాగ్యము అంజనా వాయు దేవుల కలయిక, ఆంజనేయుని పుట్టుక ఆంజ నేయుడు మింటి కెగురుట. బ్రహ్మాదుల వరములు, సుగ్రీవుని కొలువునకై ఆంజనేయుడు బయలు దేరుట యు నను కథలుగల శ్రీ హనుమత్ప్రబంధము నందు ద్వితీయాశ్వాసము.

శ్రీహనుమత్ప్రబంధము

తృతీయాశ్వాసము

శ్రీమ త్సారస నేత్రా
శ్యామాంబుదవర్ణగాత్ర సాధుచరిత్రా
భూమీసుత చిత్తాంబుజ
ధామోదయ బాలమిత్ర దశరథపుత్రా!

శ్రీరామచంద్ర దేవా, అవధరింపుము

సుగ్రీవుని వద్దకు హనుమంతుడేగుట.

ఒకమహనీయు డాశయసమున్నతుడై పొనరించు కార్య మీ
సకలజగత్ప్రియంకరము సత్యసముద్ధరణైక సాధనా
త్మకమయి ధర్మగౌరవవిధమ్మగుచో తదశేషదివ్యభా
వుకమహనీయతల్ మఱచిపోవదు లోక మ దెన్నినాళ్ళకున్.

ఎన్నాళ్ళుండును గురువరు
డన్న పనిని వెన్కబెట్టి హనుమం డింటన్
కన్నమ్మయు ప్రీతితోడ
క్రన్నన దీవించి యనుప కదలెన్ తానున్.

శ్రీకరమంచు తల్లియు వచించెను నాపయనించువేళ నీ
వేకపివీరుగొల్చెదవొ యేకమలాక్షుని గొల్చెదో యటం
చాకథలవ్వి రెండును యథార్థము లౌ కరణీయ ధర్మముల్
నాకగుగాతమంచు పవనాత్మజు డాత్మ దలంచె నేగుచున్.

స్ఫారోదార వసంతపుష్పవిగళత్ సౌరభ్యపారంపరీ
పారమ్య ప్రవిలాస భాసురము పంపాతీర మాకానన
శ్రీరమ్యస్థిరసంపదుజ్జ్వలము కిష్కింధామహారాజ్య మా
దారిం బోవలె చేరగావలెను తత్ప్రాంతమ్ము సామీరియున్.

ఎచ్చటి ప్రభాసతీర్థం
బెచ్చటి కిష్కింధయు నిక నెప్పటికేగన్
వచ్చునొ మది నెఱుగక యే
చెచ్చెర హనుమంతు డరిగె స్థిరతరధృతియై.

కారుమొయిళ్ళచీకటులు గ్రమ్మిన కాననసీమ, శీఘ్రయా
త్రారతి నాతడేగెడి పథమ్ములయందున భాస్కరానిలుల్
వారయి వచ్చి చీకటులు పాఱగద్రోలుదు రా మనోహరా
కారుని కాంజనేయునికి కల్గనీరు శ్రమం బొకింతయున్.

సాకేతమ్ముననుండి రాముడరిగెన్, సామీరియున్ నేడిదే
కీకారణ్యము లంటి పర్వులిడు నాకిష్కింధకున్ ధర్మకా
ర్యైకవ్యగ్రులు వీరలిర్వురును దైత్యాధీశవిధ్వంసన
మ్మొ కాలమ్మరుదెంచుచుండె నని యాహ్లాదాత్ములైవేలుపుల్.

మధ్యాక్కఱ

మారుతపుత్రుడీఘనుడు మానిత మహిమాతిశయుడు
పార మెఱుంగని వేగపాటవ ప్రథమాన బలుడు
ధీరు డీకపివీరు డఖిలదిగ్జయ సాహసుం డగుచు
ధీరమ్ము డగుగాక యనుచు దీవనల్ తెలిపి రెల్లరును. 10

ఆవనసీమ కావలగ నచ్చటనే పాలుపారు కీశరా
జ్యావని, వాలి పాలనము సల్పుచు తమ్ము డటంచులేక సు
గ్రీవునిబట్టి బైటకునుగెంటి బలాత్కృతి తత్సతిన్ రుమన్
గైవసముం బొనర్చుకొని కాముకకేళి చరించు దుష్టుడై.

చేవగలట్టి వాలియును చేరగరానివి ఋశ్యమూకశై
లావృతసీమలన్ తనబలమ్ములు తోడయిరాగ నేగి సు
గ్రీవుడుడాగె, వాలి విపరీతదురాగతవృత్తు లీగ నే
దైవము సాయమై తనకు దారి నొసంగునొ యన్న చింతతో.

ఇనునితనూజుడైన మహనీయుడు, దుర్దమధైర్యసాహసో
ద్ధనబలశాలి యయ్యును సుకంఠుడు వాలినెదుర్చు దర్పముం
గనని విషాదమగ్నుడయి కాలము బుచ్చుచునుండె, మంచివౌ
దినములు లేనియప్పు డతిధీరుల కైనను తప్ప వీవెతల్.

హనుమండున్ మది నింతదన్క నెఱుగండాగాథ, గుర్వాజ్ఞపై
తనకర్తవ్యము నిర్వహించు పనిలో తానిట్లు సుగ్రీవుకా
ల్వను చేరంజనె; దైవనిర్ణయపు చెయ్వుల్గూడతోడౌను, దు
ర్జనదుర్మార్గము లెల్ల డీల్వడు ముహూర్తం బుర్వి నేతేరగన్.

ఆకసమంటు శైలశిఖరాగ్రము లల్లన నెక్కిదూకి, అ
స్తోకజలప్రవాహ పరిశోభిత వాహిను లీది దాటుచున్
కాకియు లోనికిం జనని కాననసీమ లతిక్రమించి పం
పాకమనీయదేశమును పావని జేరె క్రమక్రమమ్ముగా.

అరిగెడుచోటు దగ్గఱగనైన కొలంది సమీరపుత్రుహృ
త్సరసిజ మల్లనన్ విరియసాగిన; దచ్చటతానువానరే
శ్వరునకు మంత్రిగా చను మిషన్ మహితోత్తమ దైవకార్య మొం
డిరవుగ చేయు రీతిని దినేశుడు పంపుచునున్న యట్టులై.

విజయభద్రము

అదిమాధవమనోజ్ఞ మతిసుందరతరమ్ము
అదిశైలసముపేత మతులోజ్జ్వలవనమ్ము
అదివానరుల రాజ్య మవిజేయమగు భూమి
అదియే పవనసూతి కరుగంగ దగు సీమ.

వర్షామేఘ వినీలసుందరతనూ భాస్వన్మహాతేజ ము
త్కర్షంబైన కృపాభిరామ మధురాకారమ్మెదో నెమ్మదిన్
హర్షం బొప్పగ పిల్చుచున్నటుల నేత్రాంతమ్ములం దోచి యా
కర్షింపన్ ద్విగుణీకృతోత్సుకత నేగంజొచ్చె హన్మంతుడున్.

చాంపేయాగురుమల్లికాది సుమనస్సౌరభ్య వీచీస్ఫురత్
సంపన్నమ్ము తనుశ్రమాపనయన స్వారస్య సాకల్యమై
పంపాతీరసమీపకానన చల ద్వాయు ప్రసారమ్ము నై
లింపశ్రీ వనసౌఖ్యముల్ నెఱపి లాలించెన్ హనూమంతునిన్.

అచ్చపు తీయతేనెపెఱ లచ్చులు పోసిన క్రొత్తసొంపులై
యచ్చట తాను కాలిడిన దాది మహోదరభావపూర్ణసం
పచ్చయసాధురూపవిభవమ్ములు వన్యపథమ్ము లన్నియున్
మచ్చికలై కనంబడెను మానసవీధిని వాయు సూతికిన్. 20

హనుమ త్సాహసకృత్యముల్ సకలశాస్త్రాభ్యాసపాండిత్యముల్
మునుపే విన్నవి తాను సర్వమును సమ్మోదమ్ముతో తాదృశ
ప్రణుతాత్ముం డెవడేని తోడయినచో రాణించు నాభాగ్యమం
చును సుగ్రీవుడు మానసమ్మున దలంచున్ నిత్య మత్యాశతో.

ఇంతలో వచ్చె వార్త దినేశునుండి
ప్రియముగూర్చుచు మిగుల సుగ్రీవునకును
తనకడకె వచ్చుచుండెను హనుమ యనుచు
తండ్రికిని నొవ్వులే గద తనయు వెతలు.

పోవలెను వేగ తాను సుగ్రీవుకడకు
అచ్యుతసముండు సూర్యనారాయణునకె
కూర్చునట్టి పుత్రుండు సద్గుణవరేణ్యు
డాకపిశ్రేష్ఠు డెట్టివా డగునొ యేమొ.

ఎంతదూార మీరీతి దానేగవలెనొ
ఏదొ గిరియట యతడు వసించు నెలవు
మద్గురువరు కృపామహిమమ్ము వలన
వారికిని నాకు మేలు గావలయు నచట.

ఏవిధి తాను పోయి దరిసించుట, లామహనీయమూర్తితో
నేవిధి మాటలాడుటయొ యేనని పావని యెంచు నంత సు
గ్రీవ నికేతనప్రకట కేతన నూత్నపటాంచలమ్ము లా
తావుననే కనంబడె నుదాత్తమహత్త్వభవిష్య దర్థముల్.

అతనిచరిత్ర మెట్టిదియొ ఆత్మనెఱుంగడు భానుమూర్తికిన్
సుతుడయి పొల్చు దివ్యగుణశోభితు డాతడు తానుపోయి యే
గతి ప్రియమారసేయుదునొ కర్జము లాయెడ నంచు నెమ్మదిన్
సతమత మౌచునే యరిగె సత్వర మాపవనాత్మజుం డొగిన్.

రాజ్యసింహాసనము లేక, రాణిలేక
గిరిగుహాయె కొలువైన సుగ్రీవు మోము
రాజఠీవి తగ్గియు నభిరామ మయ్యె
మబ్బుగ్రమ్మినసూర్యబింబమ్ముపగిది.

వెరవున కీశముఖ్యుడయి వేల్పుల కందని సౌఖ్యసంపదల్
విరివిగ పొందగల్గెడి వివేకయుతుండిటు ఋశ్యమూక భూ
ధరమున వాసముండిన కత మ్మెది యో యొక దుండవచ్చు నం
చరిగి నమస్కృతుల్ సలిపె నర్కతనూజున కాంజనేయుడున్.

శ్రీవిభవమ్ములైన కనుతెప్పు లొకింతగ నెత్తి యాయెడన్
పావనిజూచె ధీరగుణభాసురుడైన బలిష్ఠమూర్తి సు
గ్రీవుని: యాక్షణమ్మనని కీశవరుండును జూచె బ్రహ్మతే
జోవిభువున్ మహోద్ధతభుజున్ దృఢకాయుని ఆంజనేయునిన్.

పేరు లికేల చెప్పవలె విశ్రుతకీర్తులు లోకవంద్యు ల
వ్వారికి ఆత్మలం దెలియవచ్చిన దెవ్వరు ఎవ్వరైనదిన్
చేరెను చేతులందునను చేతులు, డెందముడెందమందునన్,
తీరనికౌగిలుల్ తనివితీరని ప్రేమ లొకళ్ళొకళ్ళకున్. 30

తనశిష్యుం డొక డద్వితీయ బలవిద్యాశేముషీశ్రేష్ఠుడున్
తనపుత్రుం డిక వానరాన్వయ మహోధ్యక్షప్రభావంతు డీ
యనఘుల్ మంత్రియు రాజునై కలసి; రుద్యద్దిగ్జయోద్దీప్తమై
తనరున్ వారలమైత్రి నా వెలిగె మధ్యాహ్నార్కు డభ్రస్థలిన్.

పావని యంత తానిటకు వచ్చిన సంగతి సూర్యునాజ్ఞగా
పావనమూర్తి తల్లియును పల్కినదీవనగా వచింప, సు
గ్రీవున కాత్మ సమ్మదపరీతమునై తనువెల్ల పుల్కలై
పావని నాత్మకీయసచివాగ్రణిగా గణియించె నర్మిలిన్.

ఆతడు ప్రభువగునో మఱి
యాతడు భృత్యుండొ పరుల కెఱుకపడని సం
గాతంబై యిరువురి మై
త్రీతాత్పర్యము జననుత రీతిన్ దనరెన్.

వాలిసుగ్రీవులు

ఋక్షవిరజుడన్ వానరవృద్ధు డొకడు
శంభునిల్లాలు గౌరిచే శప్తమయిన
కొలనిలో దానమాడుచు కొమిరె యయ్యె
సురుచిరాకర్షక శరీర శోభలెసగ.

సురుచిరమూర్తి ఋక్షవిరజుం డటు లాహ్రదతీరమందు సుం
దరతరుణీవిలాసవిదితమ్మగు రూపముతో సుగంధసం
భరిత వసంతపుష్పవనవాటి విహారము సల్పుచుండగా
సురపతియున్ దివాకరుడు చూచిరి కూడిరి మోహమగ్నులై.

ఆవామాక్షికి వాసవు
చేవాలియు, మఱిదినకరుచే పదపడి సు
గ్రీవుం డను నిరువురు తే
జోవిభవులు పుత్రులైరి శూరవరేణ్యుల్.

బ్రహ్మవరమున పూర్వరూపమ్ము దాల్చి
కీశరాజ్య మేర్పఱచి కిష్కింధవద్ద
ఋక్షవిరజుడు పుత్రుల ప్రీతిదనర
పెంచి పెద్దజేసెను మహావీరు లనగ.

వాలి యవార్యదోర్బలుడు బాహుసహస్రము గల్గు హైహయున్
దూలగజేసె యుద్ధమున; దుర్మదవృత్తినివచ్చు రావణున్
వాలముజుట్టి నల్దెసల వార్నిధులందున ముంచిదేల్చెనా
భీలపరాక్రముం డతనిభీకరధాటికి సాటిలేరొరుల్.

శ్రీవిలస ద్విశిష్ట విదుషీమణి సూక్ష్మబుద్ధి మే
ధావిభవోజ్జ్వలాకృతిని తారను వాలియు భార్యగాగొనెన్;
భావజుబాణమో యనగ భాసిలుతన్వి రుమన్ గ్రహించె సు
గ్రీవుడు భార్యగా శుభపరీతము లిట్లు దినమ్ము లేగగా.

దుందుభినామక దుష్టదైత్యు డొకండు వాలిపై పోరికి వచ్చిపడగ,
వారిర్వురికి నొక్క పర్వతగుహాయందు సమరమ్ము సాగి వత్సరముదనుక,
విననయ్యె దుందుభిభీకారార్భటుల లంత రక్తముల్ పాఱె ద్వారములనుండి
దుందుభియు పయికి దూకిరాకుండగ పర్వతగుహ మూసి వానరాళి. 40

వాలి మృతుడయ్యె ననెడి విభ్రాంతిలోన
ఇల నరాజక సంక్షోభ మెనయకుండ
కీశరాజ్యాధిపతిగ సుగ్రీవునకును
పట్టముం గట్టి నిలిపిరి ప్రభుతమీర.

దుందుభింబట్టి దునుమాడి తుట్టతుదకు
దుర్నిరీక్ష్య రోషానలాత్యుగ్రరావ
ఘూర్ణితాశాతటోత్కట కుట్టిముండు
విజయభీకరుం డయి వాలి వెలికి వచ్చి –

కీశరా జ్యాధివాససింహాసనమున
తమ్మునిం జూచి, దుర్మదౌద్ధత్య మడర
ఔర ! ఇంతలో నెంతవాడైతి వీవు
ప్లవగరాజ్యమ్ము నపహరింపంగ ననుచు -

అనుజు డనుమాట వినకుండ కినుకమీఱ
నొక్కతన్నున సుగ్రీవు నూరినుండి
తరిమి పోద్రోలి యాతనితరుణి రుమను
గైకొనియె బల్మి కామాంధకారవృత్తి.

తనతప్పేమియు లేక అగ్రజునిచేతన్ శిక్షితుండయ్యు అ
న్నను సుగ్రీవుడు చూచి మ్రొక్కి వినుమన్నా దైవతుల్యుండుగా
నిను పూజించినవాడ నేటిదనుకన్ నిన్ వంచితుంజేతునే?
అనుమానింపకు లేదు రాజ్యమున నాకాకాంక్షయున్ లేశమున్.

బవరమ్మంచును నీవుపోయి గడచెన్ వర్షమ్ము; వార్తేమియున్
చెవులం జేరక నిన్నుగూర్చి, నను నీ సింహాసనమ్మందు నీ
ప్లవగుల్ నిల్పిరి; నేడె గైకొనుము నీభద్రాసన మ్మిందు నా
యవివేక మ్మగుచో క్షమార్హుడను గాదా తమ్ముడన్ దాసుడన్.

నమ్మమువాలి! నాదువచనమ్మిది సత్యము నేవచించితిన్
సుమ్మని విన్నవించు ననుజుంగని కన్నుల నిప్పుగ్రక్కి పో
పొమ్మనిగెంటె వాలియును, బుద్ధివిహీనమనస్కు డక్కటా
నమ్మినవాని కాపద నొనర్చుట దేవుడుగూడ మెచ్చడున్.

తారతెలివి యేమొ, దైవ మెఱుంగును
రాణి కావలసిన రమణి రుమయె,
అందకత్తెయామె యని తలంచునుగాని
తనయఘమ్ము నాత్మ గనడు వాలి.

తమ్మునిబైటకుం దరిమి తమ్మునిభార్యను సోదరీసమన్
గ్రమ్మిన కామసంగతవికారమునన్ గయికొన్న వాలికృ
త్యమ్మును గర్హణీయముగ నారసి జాంబవదాదులెల్లరున్
నమ్మినబంటులై చనిరి న్యాయగుణాఢ్యుడు సూర్యసూతితో. 50

తపసుపండిన మౌని మతంగఋషికి
ఋశ్యమూకమ్ము తనతపః క్రియలనెలవు
వాలియును రాడు తద్గిరిప్రాంతములకు
వచ్చెనా చచ్చుననెడి శాపమ్ముకలదు.

దుందుభిని చంపినపుడు తద్రుధిరసిక్త
మాంసఖండమ్ము లాయాశ్రమమున విసరి
పాడొనర్చిన పనికి శాపమ్మునందె
కాలిడగ రాక వాలి యాశైలమందు.

అనుచరులగూడి ఋశ్యమూకాద్రికడనె
వాసముండె సుగ్రీవుడు; వాలివలన
భయమెకింతయులేదను భావమొకటి
చిత్తమం దొకపాటి సుస్థిరత నీయ.

భావమునందు నిల్కడయుపట్టదు, కన్నులుమూసినిద్రకున్
బోవదు, తిండియున్ సరిగముట్టడు, మిత్రులపల్కరింప దే
దైవము తానుగానగుచు తారసిలన్వలె గాని యింక సు
గ్రీవుని చింత లొక్కకొలికిన్ బడబో వని యెంతు రందఱున్.

వచ్చెనొలేదో నేడు తనవద్దకు వాయుకుమారు డంతటన్
హెచ్చిన వేదనాభరము నెల్లను లోగుదియించి పూసలన్
గ్రుచ్చినరీతి గాగ తనగోడు సమస్తము సూర్యసూతి వా
క్రుచ్చెను గాలిపట్టికనుకోసలు మెల్లన చెమ్మరింపగన్.

వదలడు సూర్యసూనుని రవంతయు నొంటిగ, వానిచిత్తమున్
చెదరగనీడు, ధైర్యమువచించునుసారెకు వచ్చు వేగమే
సుదినములంచు, తానొకడె శూరత మీఱగ నేగి వాలిపై
గదిసి యడంతు వానిమదకావరమంచును పల్కు హన్మడున్.

వినినకొలది సుగ్రీవుని వెతల నెల్ల
తలచినకొలంది వాలిచేతలను మదిని,
సానుకంపము కోపము స్వాంతమందు
గీలుకొని మారుతియు పిడికిలి బిగించి -

ప్లవ గోత్తంసుని భానుసూనుని మహాప్రజ్ఞాఢ్యునిన్సౌమ్యుని
ట్లవమానించిన వాలిపై కరుగ క్రోధావేశ దుర్దాంతద
ర్పవిలా సోద్ధతు డాంజనేయుడు మహోగ్రాకారుడై లేవ క
న్గవసన్నన్ పవమానసూను కినుకన్ వారించి సుగ్రీవుడున్.

ఆగుముమారుతీ! భవదనంతబలోగ్ర సమగ్రసాహసో
ద్వేగము నేనెఱుంగుదును, విన్ము ముఖాముఖిగాగ వాలిపై
కేగుట సాధ్య మెవ్వనికినేనియు గాదు, మరేదొ సాధనన్
కాగలకార్యముల్ జరుపగా దలపోయుట యోగ్యమౌనవన్.

మారుతి కొంతచల్లబడి మానసమం దత డన్నమాటలో
సారమెఱింగి స్వీయజవ సత్త్వపటుత్వ మహత్త్వమెప్పుడే
తీరున సూర్యసూనునికి తృప్తిఘటిల్లగ సాయమౌనొ యం
చారటమొంది వందనము లర్పణసేయును దేవతాలికిన్. 60

మది సుగ్రీవుడుకూడ సంతతము సంభావించు నుద్యద్బలా
స్పదు డీవాయుసుతుండు వీనిప్రతిభాసామర్థ్యముల్ సాయమై
హృదయక్షోభమువాసి జీవనమునం దేకొంతయో శాంతిసం
పద వాసించునె యంచు వేయిగతులన్ బ్రార్థించుచున్ వేల్పులన్.

పావని శంకరాంశవిభవమ్ములు మూర్తినిగొన్న తేజపుం
బ్రోవు, తనంతతాను కొలువుం గొన వచ్చు ముహూర్తమేమొ సు
గ్రీవుడు మోదసంపదురరీకృత సుందరసుస్మితాస్యుడై
భావనసేయు నిద్ది తనభావిశుభోదయసూచి యట్లుగన్.

ఆశ్వాసాంతము

హనుమంతుడు సుగ్రీవుడు
ఘను లీయిరువురు కలసినకథ నీకరణిన్
వినిపించితి రామచంద్ర
ప్రణుతోజ్జ్వల మధురభావ రసవత్పణితిన్.

సురసురేంద్ర సంయమి నమస్యుడవు నీవు
యాగ భోగ విలాస మహోత్కుడవును
సాధు సాంగత్య కౌతుక సరసమతివి
శ్రితజనావన దీక్షితాకృతివి రామ! 64

ఇది శ్రీ హనుమత్ప్రబంధమున సుగ్రీవుని కడకు హనుమంతుని సమాగమము, వాలి సుగ్రీవుల జననము, సుగ్రీవుని ఋశ్యమూక నివాస కథయు గల తృతీయాశ్వాసము.

శ్రీహనుమత్ప్రబంధము

చతుర్థాశ్వాసము

శ్రీమునిజనపూజిత పద,
కామిత బహుపుణ్యఫలద, కపికుల వరదా,
భూమీసుతసౌఖ్యాస్పద,
సామిరి మనః ప్రమోద! సత్యవినోదా!

దేవా ! అవధరింపుము

శ్రీరామావతారము

ఎఱుగగజాల రెవ్వరును సృష్టిరహస్యము లోకవర్తనం
బరుగదు సర్వకాల మొకయధ్వమునం బడి, పాపకర్ముడొ
క్కరుడెవడో సమస్తజనకంటకుడై చెలరేగ, దుస్తరో
ద్ధురదురితవ్యథన్ మునిగి దుఃఖమయమ్ముగు లోకమంతయున్.

రావణుడన్న దానవుడు బ్రహ్మకుమన్మడె కాని పాపసం
భావిత దుష్టకార్యవిషవహ్నుల మధ్యగ ముజ్జగమ్ములన్
ప్రోవులుబెట్టు, దర్పపరిపూరిత మృత్యుహసన్నట ద్దశ
గ్రీవుడు నిర్నిమిత్తభయసృష్టికి స్రష్ట యతండు ధారుణిన్.

జనులకునిద్రరాదు, సుఖశాంతులులే విలపైని, స్త్రీలకున్
గనబడ దాత్మరక్ష , సవనాగ్నులువెల్గవు, స్వర్గహీనులై
చని రనిమేషు లావలకు, సర్వజగమ్ములు కంపమొందు నా
దనుజుని నామమాత్రమున ధైర్యము తక్కి శిరమ్ము వాల్చుచున్.

మునులున్దేవతలేగి దైత్యదురితమ్ముల్జెప్పి దుఃఖింపగా
తనసృష్టించిన లోకముల్ పడెడు బాధల్జూచి యాబ్రహ్మయున్
వనజాక్షుం డొకడే త్రిలోకముల బ్రోవన్గల్గు దైవమ్ముగా
మనమం దెంచుచు దేవతాగణములున్ మౌనీంద్రులున్ వెంటరాన్.

శ్రీరమణీమనోహరుడు ,శేషశయుండు కృపాప్రసన్నరే
ఖారుచిరాబ్జలోచనుడు, కామితదాయి, విపన్నలోకమం
దారుడు, క్రూరదానవవిదారణ దక్షుడు,ధర్మమార్గర
క్షారభమాణశీలుడగు నచ్యుతు ముందునవ్రాలి మ్రొక్కుచున్.

ఉత్పలమాలిక

దేవ! వినంగదయ్యయిటు దీనతనుంటిమి ప్రాణభీతితో
ఏవరసిద్ధియో తనకునిచ్చిన దుర్దమ సాహసోగ్రద
ర్పావహుడై జగమ్ము తనదైన యటుల్ విహరించు క్రూరుడై
రావణుడన్నదైత్యుడు దొరా !అతిదుష్టచరిత్రుడున్ దశ -

గ్రీవుడంతడు చేయు విపరీతము లంతముబొంద వామహోగ్రమా
యావి యొనర్పనట్టి యఘమన్నది లేదు, సురాసురోరగుల్
ప్రోవుగవచ్చి యొక్కపరి పోరి మహాస్త్రచయమ్ము లేసినన్
చావ డతండు, వానివరశక్తియు నట్టిద, అల్పుడంచు దా-

భావనసేయు మానవుడె వానినిబట్టి వధింప వీలగున్
గావున దేవ! మానవునిగా ధర నీవయిపుట్టి రానిచో
భూవలయమ్మెగాదు మఱి మూడుజగమ్ములుగూడ ధ్వంసమౌ;
నీ విలయమ్ము నింక శమియింపగజేయు మటంచు వేడినన్. 10

సరసిజసంభవాదులు నిశాచరు చేష్టలిటుల్ వచింప శ్రీ
హరి యభయమ్మొసంగి కరుణాదరమొప్పగ దేవతాళి వా
నరులయి ధాత్రి నింక జననమ్ములుగాంతురు కార్యమాపయిన్
నెఱపెద మానవాకృతిని నేనని బల్కుచు బంపె వారలన్.

అనిమిషులేగినారు దివిజాధిపు దౌత్యము విన్నవించుచున్
తనపని యొక్కటే మిగిలె ధాత్రిని జన్మముగాంచు, టింతలో
తనయుల కోసమై దశరథక్షితి నేత మహేంద్రమిత్రు డా
యినకుల రాజొనర్చు ఒక యిష్టి కనంబడె శౌరికిమ్ముగా.

కరుణాసింధుడు లోకరక్షణ బృహత్ కార్యైక దీక్షాత్ముడా
సరసీజాక్షుడు రాముడై దశరథక్ష్మాజానికిన్ బుత్రుడై
ధరజన్మించెను, క్రూరదైత్య దళనోద్యత్కేళిసంరంభ సం
భరితావేశ ప్రరాక్రమప్రకట భాస్వత్కీర్తిమన్మూర్తి యై.

తనయుడు రాముడే దశరథావనిపాలుని కండ్లవెల్గు తత్
ప్రణుతచరిత్రు నింక యువరాజుగ జేయదలంచు రాజవ
ర్యున కొక తీర్పరాని యవరోధము కల్పితమయ్యె నాతడుం
దన చినభార్య కైకకును తానిడె రెండువరాలు పూర్వ మా-

వనితయు కోరె నాదినమె వానిని పంతము బట్టి రామునిన్
వనులవసింప బంపి పదునాలుగు వత్సరముల్, మహీశుగా
తనసుతునే యొనర్పవలె తప్పదనంగ నృపాలమౌళి కై
క నుడివినట్టి కోరికల కాదనలేక శిరమ్ము వాలిచెన్.

అనిమిషకార్యమున్ జనకునానతి రెండునుగూడ కూడివ
చ్చినపరమార్థమై వెడలె శ్రీరఘురాము డరణ్యసీమకున్
మునిజనవేషధారియు అమోఘధనుర్మహితాస్త్రధారియై
తనసతిసీతతో ననుగుదమ్ముడు లక్ష్మణమూర్తి తోడుగన్.

ఆయతశక్తిపూర్ణ వివిధాస్త్రమహామహితుండు వీరనా
రాయణవిక్రమప్రభువు రాము డజేయ పరాక్రమక్రమ
స్థేయుడు; గాధిమౌని క్రతుదీక్షలగాచెను బాల్యమందె దై
తేయుల గీటడంచి నిటలేక్షణుచాపము బాహుదర్పధౌ-

రేయతమీఱ నెక్కిడి ధరిత్రిజసీతనుబెండ్లియాడె; గా
ధేయబుషీంద్రు డిచ్చిన యుదీర్ణమహాస్త్ర , బలాబలాది వి
ద్యాయుతు డుర్విపై మనుజుడై యుదయించిన విష్ణు వాజగ
ద్ధేయునిపైన యున్నది క్షితిన్ దితి జోద్ధతి నుండి బ్రోవగా.

శ్రీరాముని వనవాసము

ఆ దశకంఠకంఠదళనాకృతి రాముడు కాననసీమ కేగెడున్
మేదినికిన్ దివమ్మునకు మేలగుకాలము వచ్చెనంచు స
మ్మోదభరాత్ములై త్రిదివముఖ్యులు పల్కిరి హర్షదీపితా
స్యాదర రమ్యభావ విజయాశిషముల్ విను వీధినుండియే.

మునికులరక్షకుండు గుణపూజ్యుడు ధర్మనిబద్ధబుద్ధియున్
దనుజదురాగతోన్మథన దక్షుడు శ్రీ రఘురామమూర్తియున్
వనముల కేగుదెంచె నను వార్త నిమేషమునంద వ్యాప్తమై
దనుజులకున్ భయప్రదము తాపసమోదము నై విరాజిలెన్. 20

రాముడు సత్కృపాసుగుణ రాజితశీలుడు బంధురాటవీ
సీమల దవ్వుదవ్వులకు చేరిన యాదినమందె "దేవ! మ
మ్మోమగ వచ్చినావిట కహో! రఘుపుంగవ! వేయికండ్లతో
నీమెయి వేచియుంటిమిటనే భవదాగమనాభిలాషలన్".

అనుచున్ రామునిచుట్టుజేరి మునులాయాచోటులన్ దుఃఖితా
ననులై "రామనరేంద్ర! దైత్యులుమమున్ నానావిధక్రూరవే
దనలన్ బెట్టుచు సాగనీయరు తపోధ్యానమ్ములన్ నిద్రకై
నను సంపూర్తిగ నోచుకోముగద ఎన్నండేని కన్దోయికిన్.

మాయావుల్ప్రభు! వారలీదితిజ దుర్మార్గాటవీసీమకున్
నీయర్ధాంగిని కూడ దెచ్చితివికన్ నీతోడ, ఈక్రోవలం
దేయన్యాయముకైన నోడరు సుమీ! ఈదానవానీక మా
మాయాజాలము లెట్టు లీగగలవో, మమ్మెట్లు గాపాడెదో.

కామమదోగ్రవర్తను లకారణ వైరులు దాన వోత్కరం
బే మెటకేని పోవగల మీసుకుమారిని గాచుకొమ్ము; శ్రీ
రామ! యటన్నమాటలతెలిం గొకభీతిగ సీతమోముపై
బ్రామిన జూచి యాభయము బాపగ రాముడు మందహాసుడై.

ధరణీజాతకరాంబుజమ్ము నిజహస్తమ్మందు గీలించి, ఈ
ధరపై దైత్యులయాట సాగదిటుపై ధైర్యమ్ముతోనుండు డీ
వెఱవంబోకు డటంచు మౌనితతికిన్ వీడ్కోల్పులన్ బల్కి తా
నరిగెన్ పంచవటీప్రశాంత విపిన ప్రాంతమ్ము లందుంటకై.

యతుల కొసంగినట్టి యభయమ్మును నెమ్మదినుంచి పావసం
గత బహుళప్రమాదకర కర్మరులన్ ఖరదూషణాది దు
ర్మతుల వధించె నొంటరిగ రాముడు షష్టిసహస్ర రాక్షస
ప్రతతిని క్రూరబాణవిసర ప్రవిదారణ వహ్నికీలలన్.

రామునియందముం గనిన రావణుసోదరి చుప్పనాకయున్
రామునిపైకి కామగతరాగమునన్ జనుదేర లక్ష్మణుం
డామెను ముక్కుగోసి వెలికంపగ నామెయు సీతయందమున్
రామునిచేష్ట లీర్ష్యమెయి రావణునిన్ బురికొల్పి చెప్పగా.

భూమిపయిన్ దినేశకుల భూషణు డాహవ సాహసోగ్రుడా
రాముడు సర్వరాక్షసవిరాము డికన్, భువనైకసుందర
శ్రీ మహిళాశిరోమణికిరీటము సీతయు,నన్న వార్తలా
కామదురాగతుండు దశకంఠుని యీర్ష్యకు గారణమ్ములై.

దానవదౌష్ట్య్ర సంహర దుదాత్తధనుష్కులు రామలక్ష్మణుల్
లేనితఱిన్ మదోత్కట మలీమసచిత్తుడు మౌనివేషముం
బూనిన వంచనాత్ముడయి భూమిజనెత్తుకపోయి లంకలో
దానవనేత రావణుడు దాచె నిశాట వధూజనమధ్యమందునన్.

పంచవటీకుటీరముల పంచల సీతనుగాన కక్కటా
వంచకు లా నిశాచరుల బారికి పాల్పడి పోతి; నస్మదా
శాంచిత దీపమాయతివ నా దితిజాధము లేమిచేసిరో
యంచు వనమ్ములన్ వెదకె నారఘురాముడు దుఃఖితాత్ముడై. 30

సీతాపహరణము

జిలుగుపైడి మెఱుంగు చిన్నారిలేడి
కులుకునడల తమకుటికి వచ్చుటయు
ధరణిజ కోరగా దానికైతాను
పరువెత్తి తిరిగియు పట్టగ లేక-

వేసారి బాణమ్ము వేసినంతటనె
'హాసీత' యనిలేడి యసురుడై పడుచు
తనమాటగా నార్వ ధరణిజ వెఱచి
అనుజు లక్ష్మణునంపె నంతలో వెనుక-

కరుదెంచి కనుగొన నవనిజలేదు;
ఎఱుగరా దిదియెల్ల ఏదైత్యుపనియొ;
తనబహిఃప్రాణమ్ము ధరణిజలేదు
తన శక్తియేమయ్యె దనుజాముందనుచు-

పలవించి సీతకై వనులెల్ల వెదుక
కలగిన గుండెతో కదలె రాఘవుడు;
తాపమ్ము కోపమ్ము తనపౌరుషమ్ము
దీపించు నొక భావ తీవ్రత మెఱయ.

జానకి గొంచుబోయెడి నిశాచరునాపి జటాయుపక్షి యా
దానవుఖడ్గసంహతికి ధారుణి గూలియు, బిగ్గబట్టి ప్రా
ణానిలముల్ రఘూత్తముని కావసుధాత్మజవార్త జెప్పి తా
బ్రాణమువాసె నచ్చట మహాత్ములవర్తన లిట్టి వేకదా.

ఆజటాయువు దశరథు నాప్తసఖుడు
నేడు సీతకై ప్రాణమున్ వీడెనిట్లు
ప్రీతిమెయి పక్షి కంత్యసంస్కృతుల విధులు
సలిపి రాముడున్ దనకృతజ్ఞతల దెలిపె.

ఉర్వీజకోసమై వెదకుచున్న రఘూత్తము చేతగూలి గం
ధర్వుని రూపముంగొనిన దైత్యుడొకండు కబంధుడన్నవా
డుర్వీజ గొంచు దైత్యకులు డొక్కడు వైళమ దక్షిణాశకుం
బర్విడి పోవుచుండె నని వాకొని రామునికాళ్ళ మ్రొక్కుచున్ -

నాశాపమ్మును దీర్చినాడవు ప్రభూ! నామాటగా వేగమే
ఈసామీప్యమునందె పంపకును మీరేగుండు తద్వాటికన్
కీశాధ్యక్షుడొకండు స్నేహితుని భంగిన్ మీకు దోడౌనటం
చాశన్ జూపగ రాముడేగె తదరణ్యప్రాంతమార్గమ్ములన్.

ఏతొలినాళ్ళ పుణ్యఫల మీవసుధాత్మజ నాకుదక్కునే
నాతనువుండగా నని మనమ్మున గాసిలు రామునాత్మయం
దాతడెవండొ యాదివిజు డాడిన పల్కులు క్రొత్తవెల్గులై
చేతమునందు ధైర్య మొకచిన్నము నిల్పినయట్లు తోచుచున్.

వికచసరోజరమ్యముఖి పృథ్వీజ కన్పడునన్న యాసతో
ఒకపరి యుత్సుకత్వమున నూహలుసేయు, మఱొక్కలిప్తలో
చకితమనస్కుడై బ్రతుకుసర్వము శూన్యముగా దలంచుచున్
ప్రకటవియోగదుర్భరవిపన్మతియై విలపించురాముడున్. 40

సలలిత సాధుమూర్తి విలసన్మృదుభాషిణి సీతరూపమున్
దలచుకొలంది రామునకెదన్ తరుణీవిరహార్తి భార మ
గ్గలమయి వెంటనే దితిజకాండముపై నది కోపహేతువై
కలగినగుండెలో ధృతినిగానడు లక్ష్మణు డూరడించినన్.

సీతకు నై మదిన్ విరహచింతయు, దుష్టనిశాటుమోసపుం
జేతకునై మహాగ్రహము, శ్రీరఘురాముని సర్వమున్ మహో
గ్రాతత వాయువేగ పరికంపిత పాదపమట్లొనర్ప శో
కాతురుడై యతండు చను నావనిలో ననుజుండు వెంటరాన్.

వనములబట్టి యట్లరుగువానిని రాముని జూచి సమ్మదా
స్యనిభృతదీప్తితో శబరియన్న తపస్విని స్వీయసత్తపో
వినుతకుటీరభూమికిని వేగమె తాగొనిపోయి భక్తిమ
ద్వినయమునన్ పదశ్రమము దీరగ జేసె సపర్యలాదృతిన్

శబరిపరిచర్య

సలలిత వాహినీ విమలసారజలమ్ముల పండుటాకుడొ
ప్పల గొనివచ్చి యిచ్చి రసబంధురముల్ పరిపక్వసత్ఫల
మ్ములు పువుదేనె సోనలును ముందుగబెట్టి తనంత దగ్గఱన్
నిలబడు వారలున్ కడుపు నిండుగ తృప్తిగ తిన్న దన్కనున్.

అదె కనుగొండు మద్గురువు నాశ్రమశైలము, నాతపోగ్రహ
మ్మిది, సెలయేటినీరమదె మెల్లగ సాగుచునున్న దీతటిన్
మధురఫలోర్విజమ్ములవె, మంజులపుష్పము లివ్వియున్, వినుం
డిదె పికగానమంచు వచియించుచు చూపును వారి కామెయున్.

గడియ లొక్కటొక్కటియును గడచుకొలది
దినము లనుకూల మగుచున్న వనినయూహ
రామునకుగల్గి శబరియాశ్రమమునందు
మదిని యుల్లాసమొక్కింత పొదలసాగె.

పరమతపోవిధిన్ బ్రతుకుపండిన పుణ్యచరిత్ర యామె ఆ
నరవర సూనులిట్టుల వనాధ్వములంబడి వచ్చు కారణ
మ్మరసి సమీపపంపకు రయమ్మున పోగల దారి జెప్పి యా
దర మృదులోక్తి సంగత విధమ్మున బల్కెనువీడుకొల్పులన్.

ఆగంధర్వుడు, ఈతపస్వినియు ఏయధ్వమ్ములంజూపి రం
దేగంజొచ్చిరి రామలక్ష్మణు లొగిన్ పృథ్వీసుతాన్వేషణో
ద్యోగవ్యగ్రులు పంపవైపునకు; కిశోత్తంసు డాపుణ్యు డె
చ్చోగన్పట్టునొ యన్న సందియములం దూగాడు చిత్తమ్ములన్.

కానన మింతపల్చబడి కానగనయ్యెను చూపుమేర నే
దోనగ, మాయుపాంతములనుండియె వారికణార్ద్రశీతమం
దానిల మేచి వారలయెదల్ కదలించిన దౌక్యనూత్నహ
ర్షానుభవమ్ము సముదంచిత కౌతుక పూర్ణ హేతువై.

యతి మతంగుని ఋశ్యమూకాద్రి యద్ది
అర్కజుడు తలదాచుకొన్నట్టి చోటు
అచటి పంపాసర శ్శీతలానిలములు
వికల మానసోపశమన విలసనములు. 50

కవి.రా.వి.

కొలనున నల్లడ గూర్చివ పంక్తులు క్రొంజిగురాకుల కుంజములన్
జలముల పై బడి చల్లగ సాగుచు జల్లుల నింపెడి తుంపురులున్
పులుగులపాటలు పూబొదరిండులు పొలుపగు తీయనితావులునున్
గలగల మనుచున్ కమ్మగవీచెడి గాలులకున్ కడుతావలమై.

స్వాగత :

చారుదృశ్యములు చల్లని పంపా
తీరభాగములు దీపితపుష్పో
దారవాసములు తన్పెను రామున్
భూరిశాంతిపరిపూర్ణములౌచున్.

చూచితె లక్ష్మణా యిచట శోభిలు వృక్షచయమ్ము లింపుగా
పూచిన పూవులౌచు మధువుల్ చిలికెంచెడు పండ్ల గుత్తులై
తోచుచు వానరాళికిని తోషము గూర్చు నివాసముల్ శుభ
శ్రీ చెలువారుచున్న వని చెప్పుచు ముందున కేగె రాముడున్.

హనుమంతునకు శ్రీరామదర్శనము

ఋశ్యమూకాద్రినుండి సుగ్రీవు డంత
రమ్య పంపాసరోవ రారామ సీమ
సంచరించుచు నున్న తేజః ప్రపూర్ణ
మహితమూర్తుల రామలక్ష్మణుల జూచి.

విస్మయము భ్రాంతియును మనోవీధి గదుర
చూచుచున్నట్టి వారినే చూచి మరల
ఏదియును మానసమున నూహింపలేక
సరసనున్న హన్మంతు జేసన్న బిలిచి.

ఆదెస చూడు మోహనుమ ఆవనవీధుల నిర్వురెవ్వరో
మేదురతైజసాకృతు లమేయబలాఢ్యులు చాపధారులై
ఈదరి కేగుదెంచునటులే కనుపించెడి నీవనమ్మునం
దీదృశు లెవ్వరీయెడ చరించిన జాడయులేదు నేటికిన్.

పాలితదుర్ణయుండు మనవాలియు ఎంతకులేడు నెమ్మదిన్
జాలియొకింతలేని యొకజాల్ముడు తానయిరానులేక ఈ
శైలముమీదికిన్ ప్రబలచండధనుష్కులు వీరినిట్లు నా
పాలిటి మృత్యుమూర్తులుగ ప్రాణముదీయగ పంపియుండునా !

చూడంజూడగ భీతియేదియొ మదిన్ చూడించుచుండెన్ బల
వ్యూఢోరస్కు లుషర్బుధాకృతులు సంపూర్ణప్రభావుల్ జటా
చూడాలంకృత భాసురాస్యులు మహోశూరోగ్రధానుష్కు లే
నా డీ ధీరపరాక్రమాన్వితుల కానన్‌లేదు నాజన్మకున్.

నామాటన్ విని వేగపోయి మతిమంతా ! దుర్నిరీక్ష్యాగ్నిరే
ఖామార్తాండులు వీరలెవ్వ రిక యేకార్యార్థులై యిట్లు పం
పామార్గంబుల బట్టి వచ్చెదరో యావార్తన్ సమస్తమ్మునీ
సామర్థ్యమ్మును జూపి తెచ్చెదనుకన్ శాంతమ్మునే దీయెదన్.

అను సుగ్రీవుని వాక్యపద్ధతుల తానాలించి సామీరి నీ
వనుమానమ్ము గొలంది బీతువడెదేలా యిట్లు కీశేశ ! స
ద్గుణ మూర్తిద్వయ మట్లె వారలును నాకున్ దోచుచున్నారు నే
చని కన్గొందు నటంచు ధైర్యమును నచ్చంజెప్పి తానొక్కడున్. 60

వినయవిధేయుడైన ఒకభిక్షుకరూపము దాల్చి వేగమా
మునిజనవేషభూషితులు మోహనమూర్తులు నైన రామల
క్ష్మణులు చరించుచున్న వనమార్గము ప్రక్కలకేగి చెట్ల సం
దున నిముసమ్ము నిల్చి కనుదోయికి విందుగ జూచె నిర్వురిన్.

ఒకడు వినీల వార్షుక పయోదతనూ సుషమాభిరాము, డిం
కొకడు సువర్ణసుందర తనూజ్జ్వల కాంతిమయూఖు డిర్వురున్
ప్రకటతర ప్రచండధనురంకిత బాహుబలప్రదీపితుల్
అకలుష సుప్రసన్నవదనాంబుజ కాంతిమనోజ్ఞ విగ్రహుల్.

సారవివేక భావుకుడు సాంజలియై పవమానసూను డా
వీరులు వచ్చి నిల్చిన వివిక్తవిశాలవనప్రదేశముం
జేరినయంత వారిముఖసీమలయం దొకదైన్యరేఖ వి
స్ఫారినరీతి జూచి పలుకాడె నిటుల్ వినయానతాస్యుడై.

ఎవరయ్యా మహనీయు లిర్వురును మీరీ పుణ్యపంపాతటీ
వివిధప్రాంతములందు నెవ్వరినో యన్వేషించుచున్నట్లుగా
నవలోకించుచు వత్తురిందనుక నీయధ్వమ్ములం దేను మి
మ్ము విలోకింపను లేదు కైకొనుడు మత్పూజానమస్కారముల్.

శ్రీ కల్యాణమనోజ్ఞలాంఛనులు రాశీభూతసౌందర్యరే
ఖాకూపారులు రాజశేఖరు లుదగ్రస్ఫారధానుష్క వి
ద్యాకారుల్ మఱి మీరుమౌనులయి వన్యాధ్వమ్ములం దిట్టు లే
దోకార్యార్థము వచ్చుచున్నటుల నాయుల్లమ్మునన్ గన్పడున్.

మీతారుణ్యతనూ విలాసరుచు లున్మేషప్రభావంబులై
యాతీరమ్ములనెల్ల నూతనకళాహేలావిశేషోదయ
శ్రీతారమ్ముల జేయుచున్న యవి మీరీకాననమ్మెల్ల సం
పూతమ్మం బొనరింప వచ్చిన జగత్పూజ్యాకృతుల్ కావలెన్.

శూరతమీఱ దర్పములజూపి త్రి లోకములెత్తివచ్చినన్
క్రూరధనుర్విముక్తశరకోటులకున్ బలిజేయజాలు వి
స్తారపరాక్రమోగ్రబలశాసను లూర్జితశౌర్యవిస్ఫుర
ద్వీరులు మీరలెవ్వరొ త్రివిక్రమసత్వ సమగ్రవిగ్రహుల్.

మఱియున్ సర్వదిశాభిరక్షణకళా మాహాత్మ్య సూచీవిని
ర్భర ధర్మాకృతు లాగ మాంత విషయప్రజ్ఞానమున్మేషవి
స్ఫురదాకారముమీది నాదుహృదయమ్మున్ ముట్టి మెచ్చించు నే
నెఱుగన్ వచ్చునె మీరలెవ్వరొమహిన్ విజ్ఞానదీపద్యుతుల్.

పావనమున్ ప్రభుత్వ విభవప్రథమానము మీదుదర్శనం
బీవనసీమ కెల్లను లభించిన యీయమృతక్షణమ్మె నా
జీవనమెల్ల మీచరణసేవల కంకితమైన దంచు నా
పావని వారిపాదముల వ్రాలెను స్వీయవనేచరాకృతిన్.

నావిషయమ్ము జెప్పెద వినందగుకొంత మహాత్ములార సం
భావితసచ్చరిత్రుడగు వాయుకుమారుడ ఆంజనేయుడన్
పావనజీవనుం డఖిల వానరవంశ వివర్ధనుండు సు
గ్రీవుని మంత్రినై యిటచరింతును పిన్నతనమ్మునుండియున్. 70

అనిమిషనాథుని వజ్ర
మ్మున నాచెక్కిలిని దెబ్బపొడమిన కతనన్
హనుమంతుడ; అంజననా
జననియు, దిననాథుకడన చదివితిశ్రుతులన్.

ఆసుగ్రీవుడు సర్వధర్మనియమాభ్యాసుండు దోర్దర్పరే
ఖాసర్వస్వుడు, స్నేహపాత్రు డత డర్కస్వామి పుత్రుం డెదన్
మీసఖ్యమ్మునుగోరి నన్నిటకు బంపెన్ మిమ్ముతోడ్తేరవి
శ్వాసార్హుం డెదియేని మేలునొనరింపన్ శక్తిమంతు ండగున్.

ఐనను వానికిం గలిగె నాపదయొక్కటి అన్నవాలిచే
మానిని గోలుపోయి అవమానముపాలయి ఒంటివాడుగా
ఈనగకందరమ్ముల వసించుచునుండె మహాబలాఢ్యుడా
వానరరాజు వాలియును వైరముమానడు భానుసూతిపై.

కపికులీనుడ నేనును కామరూపి
నగుదు, వచ్చినానిచ్చటి కర్కునాజ్ఞ
ననుచు భక్తిమై రామలక్ష్మణుల కెరగె
మరల లలితమర్యాదు డామారుతియును.

హనుమదృష్టి రఘుస్వామి యంఘ్రులందె
రాముకన్దోయి పావనిమోమునందె
వారుకలిసిన నిముషప్రభావమేమొ
ప్రబలె నన్యోన్యగౌరవభావ మొకటి.

హనుమ డారీతి పలుకుచు న్నంత సేపు
శ్రీరఘూత్తము మోము సుస్మేరరుచిమ
నోజ్ఞ మగుటయు లక్ష్మణుం డును గ్రహించె;
అపుడు శ్రీరామమూర్తియు ననుజుజూచి.

విదితమె లక్ష్మణా! యితడు విన్చిన పల్కులి వెల్లనున్ సుధా
మధురము లెంతవిజ్ఞతయు మాన్యతయున్ ప్రసన్నతా
స్పదములునై కనంబడునొ వ్యాకృతియున్ చెడదన్న మాటలన్
మదిని గ్రహించి లక్ష్మణుడు మారుతికిట్లను సౌమ్యవాక్కులన్.

వినుమోయీ కపివర్యనీమృదువచోవిన్యాస మాలించి మా
మనముల్ తృప్తివహించె, పూజ్యుడితడౌ మాయన్న రాముండు ధ
ర్మనిబద్ధాత్ముడు సత్యసంధుడు జగన్మాన్యైకవీరుండు ల
క్ష్మణుడన్ నేను మహాత్ము డాదశరథక్ష్మాజాని మాతండ్రి; యా-

తని యాజ్ఞందలదాల్చి భార్యయగు సీతాదేవితో రాము డీ
వనులన్ పంచవటీవనాంతరకుటీవాసమ్ము నందుండగా
దనుజుండొక్కడు మేము లేనితరి సీతన్ బల్మిచేబట్టి ద
క్షిణదేశమ్మున కేగెనంచు వినివచ్చెన్ రాముడిచ్చోటికిన్.

వనితారత్నము నట్లు గోలుపడి దుర్వార వ్యథాభుగ్నచే
తను డీ రాముడు జానకిన్ వెదకు యత్నమ్మందు గాంక్షించు మీ
రొనరింపంగల సాయ మా ప్లవగ యూథోత్తంసు చూడన్ మమున్
గొని పొమ్మంచు వచించు లక్ష్మణుని వాక్కుల్ విన్న సామీరికిన్. 80

శ్రీ వికసన్నవాబ్జ మను రీతి వెలింగినదాననమ్ము; సు
గ్రీవుని బాధలుందొలగు శ్రీరఘురామునిజేరు సీత దై
త్యావళి పీడలున్ నురుగు నన్న ప్రియప్రదమైదలిర్చునా
ద్భావము మోమునందలరె భవ్యమహోల్లసనార్ద్రరేఖగా.

హనుమ వేగమె రామలక్ష్మణుల జూచి
ప్రీతి గొనిపోదు మిమ్ము సుగ్రీవుకడకు
అధివసింపుడు మీరిందు ననుచుజూపె
విపులతలములు నిజభుజాపీఠములను.

స్మేరవదనులు రామసౌమిత్రు లెలమి
హనుమని భుజాగ్రతలములం దలరిరపుడు
కనకభూధర సానుభాగములయందు
విరియబూచినట్టి శిరీషతరువు లట్లు.

శ్రమయొకింత లేకయె భుజాస్కంధమందు
తమ్ముగొనిపోవు మారుతితనయు జూచి
ఎంతటికి నైన తగును హన్మంతు డనుచు
రాము డెద దలంచిన ముహూర్తమ్ములోనె.

ప్రహర్షిణి

వైకుంఠుంగొని చను వైనతేయు రీతిన్
రాకాచంద్రముఖుడు రామచంద్రు తోడన్
వీకన్ జేరె హనుమ వేగితాచ్ఛవిద్యుత్
శ్రీకుం డను నట్లుగ ఋశ్యమూక సీమన్.

పరమోదాత్త తనూబలప్రకట భాస్వత్కాంతిమాలాధురం
ధరు లాధీరుల నిర్వురిన్ తనభుజాదార్ఢ్యంబు నందంజనా
వరపుత్రుండటు తోడితెచ్చుటయు విస్పష్టమ్ముగా దూరమం
దరయంగల్గి యొకింత నెమ్మదిని ధైర్యంబూనె సుగ్రీవుడున్.

కనుగవ కామహాప్రబలకార్ముకధారులు దైవమూర్తులై
కనబడి వానరాధిపుని కార్యముసైతము సానుకూలమై
తనరును తథ్యమం చతులితప్రమదార్ద్ర ముఖారవిందుడై
హనుమడు రామలక్ష్మణుల నాకపినాయకుముందు దింపగా.

మునిజనవేషులయ్యు పరిపూర్ణమనోహరరాజపుత్రల
క్షణులు మహోజ్జ్వలాకృతులు చండధనుర్ధరవీరనాయకా
గ్రణులగు వారికిర్వురకు కైజతమోడిచె భానుసూనుడా
ఘను లెవ రిట్లు వచ్చుటకు కారణమేమొ యెఱుంగకుండనే.

తోచి ప్రభాకరచ్ఛటలు తోరములై, మృదుమారుతోర్మికల్
వీచి, విహంగగానములు విన్బడి పుష్పసుగంధసౌరభ
మ్మేచి, సమస్తమాపృథుమహీధరభూమి శుభప్రమోదసం
సూచికగా కనంబడుచు శోభిలె వారల కాక్షణమ్మునన్.

ఆశ్వాసాంతము

ఇనునిసుతుడు సుగ్రీవుం
డినకుల తిలకుండవీవు ఇనుశిష్యుండౌ
హనుమయు మువ్వురు కలసిన
వినుతచరిత్రమ్ము దీని విన్నితి రామా! 90

శాశ్వతానందభావ ప్రశస్తమూర్తి!
రాజితాఖిలసద్గుణ రమ్యకీర్తి!
మౌనిమానస విమలసద్మప్రవర్తి!
ప్రథితకారుణ్యసాంద్ర శ్రీరామచంద్ర!

ఇది శ్రీ హనుమత్ప్రబంధము నందు శ్రీ రాముని వనవాసము సీతాపహరణము హనుమంతునికి శ్రీరామ దర్శనము రామ లక్ష్మణులను హనుమంతుడు సుగ్రీవుని కడకు కొని పోవుట అనుకథలుగల చతుర్థాశ్వాసము.

శ్రీ హనుమత్ప్రబంధము

పంచమా శ్వాసము

శ్రీ నారీ హృదయ వాస,
వానర మైత్రీ విలాస, భాసుర హాసా
దానవదళనాభ్యాసా,
భానుకులోత్తంస రామభద్రనరేశా !

దేవా ! అవధరింపుము.

శ్రీరామ సుగ్రీవుల మైత్రి

తానుతోడ్కొని వచ్చిన వారెట్టి వారో యెఱుగ గోరు సుగ్రీవుని ఆత్రత గ్రహించిన ఆంజనేయుడు ముకుళిత కరకమలుండై మున్ముం దారామలక్ష్మణుల చరణములకు మ్రొక్కి సుగ్రీవున కిట్లు విన్నవించె.

ధారుణి నొక్కముల్కిమొనతాకున వ్రీల్చ సమర్థులౌ ధను
ర్వీరులు కోసలేశ్వరునిబిడ్డలు వీరలు రామలక్ష్మణుల్
ధీరవరేణ్యు లార్యగుణధీవరు లూర్జితపుణ్యభావుకుల్
వీరరుదెంచి రీవిపినవీధుల వెంబడినీదుచెల్మికై.

ధరణిపతిత్వమున్ వదలి తండ్రియనుజ్ఞ నరణ్యసీమలం
దిరుగగ రాముడీతడు సతీమణితో ననుజన్ముతోడుతన్
తిరముగ తానుపంచవటితీరమునన్ వసియించుచుండ వీ
రిరువురులేనివేళ గమనించుచు రామునిభార్యజానకిన్ –

దురితుడు రావణాసురుడు దోర్బలవృత్తిని దొంగిలించి త
త్తరమున దక్షిణాపథముదారుల బోవుటెఱింగి వీరలీ
తెరువులు చూచుకొంచు నరుదెంచిరి సీతగవేషణార్థ మె
వ్వరు తమకున్ సహాయమగువారలొ యన్న మనోభిలాషతో.

ఎచ్చట దాచెనో వనిత నేమియొనర్చెనొ దానవుండటం
చిచ్చట నచ్చటన్ దిరుగు చీదెసవెంబడి యీసహోదరుల్
గ్రచ్చర వచ్చి రీవెదకుకార్యమునందున నీదుస్నేహమం
దిచ్చయుగూడ చాలకల దీపయి నీయది భారమంచనన్.

ఒక యాశామృదువల్లియున్ మొగమునం దూగాడ శ్రద్ధాళువై
సకలప్రౌఢభుజాపరాక్రమకళల్ స్వామిత్వచిహ్నమ్ములై
యకలంకమ్ముగ బొల్చు సోదరుల నత్యాసక్తితోజూచి యు
త్సుకులై వారు వినంగ పల్కెనిటులన్ సుగ్రీవు డుద్గీవుడై.

శ్రీ రాజన్య మనోజ్ఞలాంఛన రుచిస్నిగ్ధాస్య లిచ్చోటికిన్
మీరైవచ్చిరి నాదుసఖ్యమును కూర్మింగోరి ఈస్నేహభా
వారంభప్రథమాన మీనిమున మాహ్లాదైకపారంపరీ
పారమ్యమ్మయి పొల్చుగాత మనకున్ ప్రాంచత్శుభోదర్కమై.

ఓయిమహాప్రభూ రఘుకులోద్వహా! ప్రాణములున్ననాళు లా
ప్యాయతతోడ మిత్రుడనయూ ! యిటు నీకిదె సాచుచుంటి నా
చేయి యనంగ రాముడును చిర్నగ వొప్పగ తానుకూడ న
ట్లేయని చేయిసాచుచు కపీంద్రుని కౌగిలిబూనె ప్రీతితో.

భానుకుమారు డొక్కరుడు భానుకులాగ్రణి యొక్క డిట్లు స్నే
హానుగతాత్ములై వెలయు టారసి భానునిభాత్రు డా హనూ
మానుడు హర్షబాష్పకణమంజుముఖుండయి వెల్గె నింతలో
భానుని రమ్యకాంతులు నభస్థలినిండె శుభాశిషమ్ములై.

ప్రమాణి

సమీరసూను డగ్నివా
రిమధ్యవెల్గజేయగా,
సమంచిత ప్రదక్షిణల్
నమస్కృతుల్ పొనర్చుచున్,

సమీహి తార్థు లౌచు వా
రిమిత్రతన్ మఱొక్కమా
రమోఘరీతి పల్కి ర
గ్నిముందు రామవానరుల్.

హనుమడు తెచ్చినట్టి తలిరాకుల నారఘురామమూర్తి కా
సనమిడి భానుసూతి నయసంభృత వాక్యవిలాస మొప్ప ఓ
యినకులరత్న నీవిషయమెల్లను వాయుసుతుండు జెప్పె నీ
జనకజగూర్చి మానుము విచారము నాయది భార మీపయిన్.

లావుంజేవయు గల్గు యోధులగుగోలాంగూల వీరాగ్రణుల్
నావద్దం గల రెన్నొలక్షలుగ కొండల్ పెల్లగింపంగ, పా
రావారమ్ముల నైన లంఘనమొనర్పన్ నేర్పరుల్; రావణుం
డేవార్ధిన్ దల దాచుకొన్ననుసరే యిచ్చోటికిన్ దెత్తురున్.

కోతులటంచు నీమదిని గొంకకు రామ ! పరాక్రమోగ్రవి
ద్యోతిత కామరూప మహితుల్ బలధూర్వహు లెల్ల రిందు, ఈ
యాతతఫాలనేత్రనిభు డాహవభీకరు డంజనాసుతుం
డీతడొకండె చాలు దనుజేంద్రుని పాలికి మృత్యురూపమౌ. 10

పనిచెద నాల్గుదిక్కులకు వారిని, సీతనుడాచి దైత్యుడెం
దునిచినగాని ఒక్కనెలలో గనివత్తురు నాదునాజ్ఞగా;
జనకజ గానకున్నెడ నిశాటుని రాజ్యము నెల్ల దెచ్చి నీ
కనుగవముందు బెట్టెదరికన్ ముడిపెట్టిన చాపమట్టుగా.

విను మొకచిత్రమ్మును నే
గనినది వచియింతు నిచట కపిబలగము నే
నును గూడియుండ మామ
ధ్యను సంఘటిలిన దది కడునాకస్మికమై.

ఒకనా డాకసమందు బల్మిమెయి దైత్యుండొక్క డీదిక్కుగా
నొకవామాక్షిని గొంచుబోవు నపు డీయుర్వీస్థలిన్ జార్చె నా
యకయున్ నూపురభూషణమ్ము లివి రామా!యంచు వాక్రుచ్చి, జా
నకిపై యుండును చూడుమం చినసుతుం డామూట ముందుంచగా.

వనచరముఖ్యు డాపగిది పల్కిన దెల్ల మహోత్సుకమ్మునన్
వినుచు దలూపుచున్న రఘువీరునికన్నులు చెమ్మగిల్లె నా
కనుగవముందునున్న కనకాభరణమ్ములు నిశ్చయమ్ముగా
జనకజవై కనంబడి విచారభరమ్ము మనమ్ము నేచగా.

చేతులబట్టి, గుండియలజేరిచి యానగలెల్ల రాముడా
సీతను జూచినట్లె తనచిత్తమునన్ దలపోసికొంచు ని
శ్చేతనుడయ్యు దుఃఖమొకచిన్నము తగ్గిన కాలమందు సం
ప్రీతిగ భానుసూనుపయి దృష్టిమరల్చగ నాకపీంద్రుడున్.

వలదయ్యా జనకజకై
కలతయు నీకిక, నిచటన గల కపిసైన్యం
బిలయెల్ల వెదకి సీతా
నలినాక్షిం గనియెద రిది నమ్మము రామా.

అనియింకను శ్రీరాముని సుగ్రీవు డూరడించుచు నొకలిప్తమాత్ర మేదో
యాలోచించుచు మిన్నకుండు నంతలో

హనుమ కాత్మలో నేమి తోచినదొ గాని
ప్రాంజలియయి సీతాభూషణాళి కెలఁగి
వినతుడై నిల్చి కనుల నీర్వెట్టసాగె
నది కనుంగొని రాముని యెద ద్రవించె.

రామచంద్రుని దిక్కు మొగంబై సుగ్రీవుడుమరల

కలదొకమాట రామ! ననుగాసిలిబెట్టుచు, వాయుసూనుడే
కొలదియొ చెప్పియుండు ననుకొందును, నీకది, వీడ నట్టి కొం
దల మిది నాకు నీవువినదగ్గది కూడను నేను నీవలెన్
లలనను గోలుపోయి వెతలంబడి యుంటిని ఒంటిగా నిటన్. 20

వాలివధ

అదె కిష్కింధను చూడు మచ్చటనె కొల్వైయుండు మాయన్న వా
లి దయాహీనుడు కామలోభుడు ననున్ లేశమ్ముగైకోక నా
ముదితన్ బల్మినిగొంచు నన్ బయటికిన్ పోద్రోలె, దుర్వారదు
ర్మదు డాక్రూరు నెడందలో దలచు మాత్రన్ నేనుభీతిల్లుదున్.

వాలియనన్ మహాబలుడు వాసవుపుత్రు డవార్యవిక్రముం
డాలమునందు డీల్వఱచె హైహయుడైన సహస్రబాహునిన్;
వాలమునందు రావణునిబట్టి పదింబది ముంచితేల్చె నీ
నాలుగువార్ధులందు ననినన్ విని రాముడొకింత నవ్వుచున్.

భయమున్ మానుము మిత్ర! శంకవలదున్ భావమ్మునందింక దు
ర్ణయు డావాలికి చావుతప్పదు మదుగ్రక్రోధచాపాశుగ
క్రియకున్ బాల్పడి, నీవె యేలగవలెన్ కిష్కింధ నీ నాదుని
ర్ణయ మింతే యిక చూడగోరుదువె నా నారాచవేగోద్ధతిన్.

అనెనోలేదొ రఘుప్రవీరుని ధనుర్జ్యాముక్త దిక్స్ఫోటన
స్వనసంయుక్త మహోగ్రవేగ చటులాస్త్రమ్మొండు దూరమ్మునం
దున మిన్నంటెడు తాళసప్తకము దోడ్తో వానినేలంటుతో
తునియల్ జేయుచు వచ్చిచేరె మరలన్ తూణీరమున్ వింతగా.

వాలినెదిర్చి ప్రాణములు వాసిన దుందుభియన్న దైత్యుకం
కాళము శైలమ ట్లెదుటగా పడియుండగ కాలి వ్రేలితో
దూలగనేసె రాఘవుడు దూరముగా నది యాకసమ్మునం
దేలుచుపోయి క్రిందబడె నేశతయోజన దూరసీమనో.

ఆమహాద్భుతకృత్యమ్ము లరసినంత
కనులుదిరిగె సుగ్రీవుని కాళ్ళువడకె;
హనుమముఖము మాత్రము విప్పారి మెఱసె;
భానుసుతుడు రాముని తేరిపాఱజూచి.

పదిలముగా కరద్వయిని పట్టిన దెప్పుడు, కార్ముకం బికన్
వదలినదెప్పు డానిశితబాణము; నీచరణాంగుటమ్మునన్
గదపిన దెప్పు డాదనుజుకాయము రాఘవ! భూనభోంతరం
బదవద యయ్యె నయ్య భవదద్భుత భూరిబలప్రదర్శనన్.

దైవతకార్యమున్ నెఱప ధాత్రిజనించిన యేమురారివో
కావలెగాని మర్త్యుడవుగావు మహాత్మ ! భవద్భలోద్ధతుల్
భావనకందనట్టి పృథుపాటవ శౌర్యము లివ్వి, నాకికన్
నీవె శరణ్యమంచు కపినేతయు రాముని కాళ్ళపైబడెన్.

పావనమూర్తి రాఘవుడు పాలితధర్మదయాగుణుండు సు
గ్రీవుని లేవనెత్తి పలికెన్ విడుమీభయమింక వాలియున్
నీవనితామణిన్ విడచి నిన్నుదయన్ గనకుండె నేనియున్
చావిక తప్ప దాతనికి సత్యమునాపలుకంచు చెప్పగన్.

వాలినివాసమున్ గదిసి భానుసుతుండును విస్ఫురద్భుజా
స్ఫాలనజేసి ఓరితులువా విడుమీ రుమనింక నీదు ప్రా
ణాలను నిల్పుకొ మ్మిదియు నచ్చద యేనియు బైటకీడ్చి ని
న్నాలములోన బట్టి దునుమాడెద చూడుమటంచు నార్చెనన్. 30

వాలియు లేచివచ్చి తన వాకిటికిన్ వెడనవ్వు నవ్వుచున్
దూలుచు తమ్ముజూచి ఒక క్రోపునకున్ బరువెత్తిడాగి యా
శైలమునందునన్, మరల సంగరమంచును వత్తు వేజగ
త్పాలుడు నీకుదిక్కగునొ వానిని నిన్నును జూతు నిచ్చటన్.

అని, సుగ్రీవుని బట్టుకొనినుగ్గుగదన్ని పంపగానతడు దీనుడై శ్రీరాముని
కాళ్ళపైబడెను. మీరిరువురు సమాన రూపులగుట నేనూరకున్నాను
ఆనవాలునకై నీవొకగజపుష్పమాల ధరించిమరలయుద్ధమున
కేగు''మని శ్రీరాముడు నుడివిధైర్యమొసంగెను -

వాలికిలెక్కలే దొకరిపల్కులు బాహుబలాతిగర్వదు
శ్శీలుడతండు; తారయును చెప్పిన దిర్వు రవార్యశౌర్య ధీ
శాలులు వచ్చి రర్కసుతుసాయము నీబలమింకచాలదో
వాలియటంచు, వాలికినిపట్టవు నెమ్మదినిట్టి పల్కులున్.

కన్నులను దుర్మదాంధ్యమ్ము గ్రమ్మినపుడు
మంచిచెడ్డలు కనరావు మనసునందు
అవనితలమున నెంతవా డైన గూడ
కర్మఫల మీగ జాలిన ఘనుడులేడు.

ఆ విధినిర్ణయమ్ములటులైనవి, ఆమఱునాడె వాలిసు
గ్రీవులు పోరికిం జనిరి : శ్రీరఘురాముడు చెట్టుచాటుగా
కేవలమొక్కబాణమున గీటడగించెను వాలినేసి, సు
గ్రీవు డెడందలో దలచె పృథ్వి పునర్జను వందినట్లుగన్.

వాలికి పూర్తిగా దెలిసివచ్చిన వాతని దుష్టచేష్టలే
మూలనొ చిత్తమందు; రఘు పుంగవునింగనియంజలించుచున్
''పాలనసేయుమో ప్రభువ! పాపినినే నని'' వేడ నూర్వులో
కాలకుబోదువీవనుచు కారుణికమ్మునబల్కె రాముడున్.

ఆడినమాటదప్పని మహాత్ముఁడు రాముడు; భానుపుత్రునిన్
వేడుకమీఱ కీశపృథివీపృథురాజ్యపదాభిషిక్తు దో
డ్తోడ నొనర్చి వాలికిసుతున్ యువరాజుగజేసె నంగదున్,
కూడి నుతుల్ బొనర్ప కపికోటులు హర్షసమంచితార్భటిన్.

రామునిజూచి నప్పుడె పరాక్రమవహ్ని యతండు దివ్యతే
జోమహిముండు ధర్మగుణశోభిత సచ్చరితుండు సర్వవి
ద్యామధుమూర్తి యన్న తల పాహనుమంతున కిష్ట వేయిరె
ట్లై మదిదోచి రామునిపదాబ్జములన్ విడనాడిపోవదున్.

శ్రీచటులాననాంబుజుడు శ్రీరఘురామునిపై మనమ్మునం
దేచిన భక్తిభావముసరే, కడుదుర్ఘటమైన రామకా
ర్యాచరణమ్మునన్ దగు సహాయమొనర్చు విధమ్మదెట్టిదో
తోచక ఆంజనేయుడును తొట్రుపడున్ సతతమ్మనెమ్మదిన్.

సీతాన్వేషణనకు కపిసేనలు వెడలుట

వానలువెన్కబట్టినవి ప్రాతపగల్ కడముట్టరాజులున్
సేనలుగూర్చి శాత్రవులసీమలపైబడు శీతవేళలున్
గానగనయ్యె; నింక తనకార్యము కాగలయత్న మెవ్వరున్
పూనిన జాడలేక రఘుపుంగవు నాత్మకు లేదు శాంతియన్. 40

కస్రమహాసితాస్యమున తిలకమ్ముదిద్ది
శిరమునందున పూవులు తురుముకొనిన
జనకజనుబోలు నచటి కాననతటమ్ము
నట్టె కనుచుండు రాము దేకాంతమునను.

లాలితమల్లికా సుమదళమ్ముల గూర్చిన పాన్పులట్లుగన్
నేలచెలంగు లెల్లెడల నింపిన వచ్ఛశరద్విభావరీ
వేళలు వెండిక్రొందళుకు వెన్నెలలన్, మధురార్ద్రభావనా
శీలము లేలగా మిధునచిత్తములందు నవానురాగముల్.

వనసుమవీధులందు నెలబాలుని వెన్నెలవేళ రాముడున్
తనమదిలో సతీవిరహతాపము నాపగలేని కిన్కలో
వనచరనాథు నొద్దకును పంపెద లక్ష్మణు నాకపీంద్రునిం
గని యిదమిత్థమేరుపడ గట్టిగతెల్పు నటన్న యూహతో.

తనకును రాజ్యమిచ్చితిని, తన్వినిగూర్చితి, ముందుగానె యా
తనిపని జేసితిన్, రుమనుతారను గూడిన కామమత్తుడై
కునుకుచు విస్మరించె ననుకొందును నాపని; నీవుపోయి ల
క్ష్మణ కనుగొమ్ము కీశపతి చందమదేదియొ గట్టిగా న నన్.

నెలలున్ నాల్గుగతించె తానిటకురానేలేదు సుగ్రీవుడే
లలనాసంగతిజొక్కి రాముపనులన్ లక్షింపకున్నాడొ ఆ
యలసత్వ మ్మణగింతు నేననుచు కీశాధ్యక్షు చూడం జనెన్
జ్వలితోగ్రారుణలోచనుం డగుచు చాపంబూని సౌమిత్రియున్.

హనుమగ్రహించి రామవిభునాగ్రహ మా యిన పుత్రుతో ప్రభూ!
జనకజకోసమైవెదకు సాధనలేమయిపోయె నీవిలం
బనమును రాముడోర్వ డనుమానములేదిక నీవెపోయి యా
యనకునునీప్రయత్నముల నన్నిటినిన్ వచియించు టొప్పగున్.

నేనును విన్న పల్కెదియు నీచెవినుంచెద రామునాజ్ఞపై
నే నిముసమ్ము రాగలడు నీదరి కాకుపితోగ్రతీవ్రకీ
లానలదుర్నిరీక్ష్యవిలయాకృతి లక్ష్మణు డా యశస్వికిన్
మానసమందు రెండనిన మాటలు లేవిది నీవెఱుంగవే.

తనపనిలో విలంబనము తాళడు రాముడె యాగ్రహించుచో
మనగలవాడు లే డిదియు మానసమం దిడి వానరేశ్వరా
చను మిక నామహామహుని సన్నిధి కల్లదె మ్రోగుచుండె ల
క్ష్మణు ధనురుత్కటధ్వని దిగంతములెల్లను వ్రక్కలించుచున్.

మారుతియన్నపల్కులకు మానసమెల్ల చలింపగా గృహ
ద్వారమునందు లక్ష్మణుని దారుణ కార్ముకముక్త ఠం
కారము కూడమ్రోగె, భయకంపితుడై కపినాథుడున్ రుమన్
తారనువీడి ఆత్రముగ ద్వారముజేరి వినమ్రభావుడై.

త్వరపడిన కార్యమగునె నాతప్పులున్న
క్షమ్యుడనుగాని నాలోటు గానరాదు;
తాళు మిదె వత్తు రామువద్దకు నటంచు
లక్ష్మణుకరమ్ము తనచేతులను గ్రహింప - 50

చాపమును దింపి యొకకొంత శాంతుడగుచు
లక్ష్మణుడు కానుపించిన తక్షణమ్మె
ఆంజనేయుని గూడ రమ్మనుచుబిలిచి
వానరపతి సుగ్రీవుడు బయలువెడలి -

సరసత లక్ష్మణుండు తనసాయముగానరుదేర రామునిన్
చరణములంటి ఓయికరుణాసుగుణాంబుధి రామచంద్ర ! నే
మఱవగలేదు నాడనిన మాటల, నీయెడ నాల్గుప్రక్కలం
దరయుము దేవ, యీప్రసవణాద్రికి వచ్చిన వానరావళిన్.

వారలె నాదునాజ్ఞబడి వచ్చిన వానరసేన లెక్కకున్
మీరిన వీరశేఖరు లమేయపరాక్రమధైర్యధూర్వహుల్
క్రూరుడు రావణాసురుడు క్షోణిజనెచ్చట దాచియుంచినన్
వీరలు పోయి చూచి గడువేగమె మాసములోన రావలెన్.

రాక్షసవీరులం జెనకి రాగల వేగసముగ్రసాహసా
ధ్యక్షులు వీరలొక్కొకరు, దైత్యవిదారణదక్షుడై చనున్
పక్షికులేంద్రసన్నిభుడు పావని నీవనితాగవేషణన్
దక్షిణదిక్కు కంగదుడు తక్కిన వానరసేన తోడురాన్.

ధీరతరాత్ములై బయలుదేరగ జేసె ముహూర్తముంచితిన్
దారుణ సాహసప్రళయ దర్పమహేశ్వరు లుగ్రశక్తిమత్
వీరవరేణ్యు లీకపులు వీరునునేనును నేడునీదుదా
సేరులమన్న మాటవిని శ్రీరఘురాముడొకింతయోచనన్.

ఇనసుతు నాదటన్ గవుగిలించి సుహృత్తను మాటకున్ నిద
ర్శన మిల నీవె యోవనచరాధిప యంచు నుతించు నంతలో
ననిలసుతుండు వచ్చి తనయంఘ్రుల వ్రాలుటజూచిరాముడా
హనుమను లేవనెత్తి హసితానన సుందర దివ్యమూర్తియై -

నమ్మితినామనమ్మున ఘనమ్ముగ నీమహనీయశక్తి, శౌ
ర్యమ్మును బుద్ధిసూక్ష్మతయు అంజనపుత్ర! నిశాటసైన్యసం
ఘమ్ములనొంచిజానకినిగాంచిన వార్తను దెచ్చు కార్యభా
రమ్మున సర్వదిగ్జయపరంపర లబ్బును గాక నీకికన్.

ఆకడ కేగినప్పుడు ధరాత్మజనిన్నును నమ్మదేమొ నీ
యాకపిరూపు జూచి యితడెవ్వడొ దానవుడన్న భీతితో,
నాకమలాక్షి కిద్ది గురుతయ్యెడు నామెకు నిమ్ముదీనినిన్
గైకొనుమంచు రాముడిడెనాహనుమంతునకంగుళీయమున్.

వ్రేలికినున్నయుంగరము ప్రీతిగదీసి యొసంగువేళ నా
పాలిటి కాంజనేయ! యిది ప్రాణమునుమ్ము నిశాటవాటికా
జాలముమధ్య నేపగది జానకికిచ్చెదొ నీకునీపనిన్
మేలగుగాక యంచు మది మెచ్చుచు రాముడుపంపె నాతనిన్.

చేతికినున్న యుంగరపుజెల్వులు చూచినయప్పు డాదటన్
సీతయె జ్ఞప్తికిందవిలి చెమ్మగిలున్ కనుదోయి రామభూ
నేతకు పెండ్లివేడుకలె నెమ్మదినిల్చి, యొకొక్కమారు ని
శ్చేతనుడై కలంతవడు చెప్పగలేకను లోదలంపులన్. 60

పృథివిజపెండ్లినా డెదలోన నేభావ మేచెనో యిది మిథిలేశునకును
నాచేతికినితొడ్గనా డెట్టిమధురిమల్ చిందించెనో సీతచిత్తమందు
అనురాగనిలయ నాజనని కౌసల్యకే ప్రియము గూర్చినదొయీా పెండ్లికాన్క
చేతివ్రేలికెగాదు చిత్తమ్మునగూడ చిలికించె వెలుగు లీచిహ్నమనుచు,

తనకుజానకికిని పెండ్లిదినము నుండి
కూరుములుగూర్చి నట్టి బంగారుటంగు
ళీయకముగాంచి తమినాపలేక రాము
డాదరమ్మున గుండెల కద్దుకొనియె.

తిరిగి వేగమె నీవరుదెంచు దనుక
వేయికనులతో నిచట నే వేచియుందు
నచ్చటకు నేను శ్రీరఘుమ్మెవచ్చెద నని
నమ్మకమ్ముగ జెప్పు సీతమ్మతోడ.

అనివచియించు రాముచరణాబ్జము లంటుచు నంగుళీయమున్
కనులకునద్ది భక్తితమకమ్ములరన్ కరమందుదాల్చి ద
క్షిణదిశవెంబడిం జనెడు కీశబలమ్ములతోడ వేగమే
హనుమడుచేరి యేగె కుతుకాంచితనూతనదీక్షితాత్ముడై.

ఉంగర మందుకొన్న కపియోధునియుల్లము పల్లవించె, స
ర్వాంగములందు మేను పులకాంకురముల్ వహియించె, చిత్తము
ప్పొంగె ముదమ్మునన్ ధరణిపుత్రికనే కనుగొన్నయట్లు క
న్నుంగవనుండి రాలినవి నూతనహర్ష కవోష్ణబిందువల్.

జనకుం దేశుభవేళ నీకనకభూషాలంకృతిన్ రామచం
ద్రున కర్పించెనొ, జానకీసతియు సంతోషమ్మునిండార రా
మునిహస్తమ్మున వ్రేలికిందొడిగె కూర్మిల్మీర నేనాడు తత్
క్షణమందే మొదలయ్యె భాగ్యవిలసత్ కళ్యాణముల్ధాత్రికిన్.

పారములేని దీక్షల నపారతపంబుల పుట్టువొందు నె
వ్వారికొ లభ్యమౌ మహిత భాగ్యములన్ దనుపొందగంటి నే
డారవివంశసంభవ నృపావళి కీర్తికిరీటరత్న మా
శ్రీరఘురాము డీపగిది సేయునె మన్నన లోక్యకోతికిన్.

అమలోదాత్త రమా సమంచిత మయోధ్యారాజ్య పట్టాభిషే
క మహోద్యన్మణి పీఠికన్ విజయ విఖ్యాతిన్ బ్రకాశించు రా
మమహీపాలుని యంగుళీయకము నన్మన్నించి ఆశీశ్శుభ
ప్రమదమ్ముల్ సమకూర్చుగా కనుచు లోబ్రార్థించె సామీరియున్.

రాముని మేనికాంతి విసరమ్ములు గ్రమ్మిన యుంగరమ్ము నా
కామితమెల్ల దీర్చు దశకంఠులు వందలు వచ్చి యడ్డినన్
దీమసమొప్ప గూల్తు, ధరణీస్థలి నెక్కడనున్న జానకీ
భామను జూచి వార్తగొనివచ్చెద వానరరాజు మెచ్చగన్.

ఏవసుంధరలోతు లీరీతి పండింపగలిగిన మేలి బంగార మిద్ది,
ఏనోమునోచెనో జానకీరాముల దాంపత్య మిద్ది సంధానపఱచె,
ఏతపమ్మొనరించి యేతెంచెనో రాముకరపద్మమున కలంకార మయ్యె,
క్షేమరాజ్యమున కీరాఘముద్రిక యెన్నివేలేండ్లు చిహ్నమై వెలయగలదొ. 70

అనుచు రామునియంగులీయకము బట్టి
కనులకద్దినదానినే తనివిదీర
మరలమరల నద్దుకొనుచు మురిసిపోయె
భూమి జాన్వేషణకు నేగు రామదూత.

హనుమయు వెంటరాగ బలులంగదజాంబవదాదిగంధమా
దనులును మైందుడున్ ద్వివిదతారసుషేణగవాక్షు లానలుం
డనఘులు నాల్గుదిక్పథములందున సేనలతోడ నేగి రా
జనకసుతాగవేషణకు శైలవనీ గహనాంతరమ్ములన్.

చాలుదు నేనొకండనె నిశాటుల నెల్లర గూల్చి రామభూ
పాలునివద్ద కిప్డె గొనివచ్చెద సీతను లోకమాత నం
చోలి వచించి యేగి రొక రొక్కరు దిక్కులవెంట ఆహవా
భీలసమగ్రమై సకలపృథ్వియె వెల్వడినట్లు వానరుల్.

మాలిని

వనతరు సుమవల్లీ వ్యాపృతంబైన భూముల్
అనవరత జలాపూర్ణాపగాన్వీత సీమల్
ఘనతర శిఖరాగ్రప్రస్థ రోర్వీధ్ర పంక్తుల్
వినుతగతి మహావేగోగ్రులై దాటుకొంచున్.

మణి రంగము

వాలముల్ పయిపయి నభమంటన్
పూలమొక్కలు పుణుకుచు గోటన్
వ్రాలుకొమ్మల ఫలముల తించున్
హేలగా కపులిటునటు గంచున్.

లయగ్రాహి-

ఏకడకు నేగి కన ఆకడనె వారలయి
తోకొనుచు మిత్రులను వీకదన మొప్పన్,
తోకలను త్రిప్పుచును పైకెగసి వేగమున
నాకతల మంటగల పోకడ లెలర్పన్,

ప్రాకుచును శైలములు తాకుచును శీర్షములు
దూకుచును లోయలను వాకలను ధైర్యో
త్సేకమున గంతులిడి కేకిసలు గొట్టుకొను
చాకపులు సాగిరటు తేకువ లెసంగన్.

సదమలదీక్షతోడ కపిసైన్యములెల్లను సర్వదిక్కులన్
వదలినసీమలేదు నలుప్రక్కలకుం జని సీతకోసమై
వెదుకనిచోటులే, దనురవీరుడతం డెట దాచి యుంచె నా
ముదిత నటంచు వేగముగ పోవని తావులులేవు వారికిన్.

పోవలె, నెచ్చటుండినను భూమిజజాడ నెఱింగి వేగమే
రావలె, రాముకార్యమిది బ్రాతిగ జేయకపోదుమేని సు
గ్రీవునియాజ్ఞ ప్రాణముధరిత్రిని ని ల్వదటంచు నల్దెసల్
త్రోవలబట్టి కార్యవిహితోత్సుకులై చని రెల్లవానరుల్.

నాలుగుదిక్తటమ్ములకు నల్వురునాయకు లాప్లవంగసై
న్యాళిని శిక్షణాక్రమమునంగొని యేగగ నందుదక్షిణా
శాలవణాబ్ధిసీమలదెసన్ హనుమన్ముఖులేగి రంగదుం
డేలికగా చలమ్మున మహీతలపాటన పాటవార్భటిన్. 80

నలువురితోటిపాటు తమనాయకువెన్నడి యేగుగాని యా
పలువురిమాటవేఱు తనభాధ్యతవేఱని యాంజనేయు డు
త్తలపడి చిత్తమందు తనదారులు తానె గణించుకొన్న యా
సలపయి దేలుచున్ పరవశమ్మున నుండు మహీజచింతనన్.

దనుజుం డెచ్చటదాచినన్ సరియె సీతన్దాను గొంపోయి,వే
అనకన్ నీవయి చూచిరావలయునయ్యా యన్న సుగ్రీవువా
క్య నినాదమ్ములు, నిన్నెనమ్మితినయా యన్నట్టి శ్రీరామచం
ద్రునివాక్యమ్ములె వాయుసూనుమదియందున్ మ్రోగు ముప్ప్రొద్దులున్.

తానై చూడగలేదు నేటికివి సీతాదేవతారూపమున్
గానీ మానసమందెదో త్రిజగతీకళ్యాణసౌందర్యరే
ఖానూనామల దివ్యవిగ్రహ సమగ్రశ్రీమహామూర్తియై
కానన్వచ్చు సమీరసూనునకు నాత్మాజాత తేజమ్మొగిన్.

రాముండెన్న వికుంఠు డావిభునిభార్యన్ జానకిన్ రావణుం
డేమంచుం గొనిపోవజాలు నిది చింతింపన్ నిశాటాళినీ
భూమిన్ నిర్మథనం బొనర్చు పథకమ్మున్ దైవమీరీతి నే
దోమార్గంబున పన్నిన ట్లనిలజుం డూహించు నొక్కప్పుడున్.

నాలుగుప్రక్కలందు నయనమ్ములు జూడగ సీతకోసమై,
నాలుక రామ! రామ! యను నామమునే స్మరియించుచున్న దీ
క్షాలలితుండునై తనదు సర్వము రామ పదార్పణమ్ముగా
నేలచెఱంగులెల్ల ధరణీసుతకై వెతకాడు నాతడున్.

ఎక్కడకేగి దైత్యవిభు డెచ్చటనామెను దాచియుండునో
యెక్కడ చూడగానగు మహీజను, రామునికార్యమందు గ
ట్టెక్కుదునా యికన్ వనచరేశ్వరు డిచ్చిన మాటదక్కునా
యక్కట! యంచు నొక్కతడవాతడు సందియమందు నాత్మలో.

లేచిన కంటిఱెప్పలను లేశముమూయకయే ధరిత్రిపై
చూచినచోటులే తిరిగిచూచును దైత్యునిచావమోదగా
చాచినబాహువుల్ తిరిగి చయ్యన వెన్కకు తీయ డాత్మలో
రాచినరాపిడై యెసగు రావణుడన్న పదమ్మె వానికిన్.

దండులుగట్టి యట్లుచని ధారుణిభాగము నెల్లచోటులన్
కొండలనెక్కిరిన్ గుహలుకోనలుకానలుదూరి చూచిరిన్
బండలు పెల్లగించి పలుపాటులనొందిరి సీతకోస మా
చండతరప్రతాపబలశాసను లాకపి యోధు లెల్లరున్.

పవనకుమారుడే మితరవానరులేమి మహోగ్రమూర్తులీ
భువనముచాపజుట్టి ఒకమూలకులీలగ త్రోయగల్గువా
రెవరికి వారె; తప్పక మహీజనుగాంచెద మానిశాటులన్
బవరమునందు గూల్చెద మవశ్యమటంచు దలంతు రందఱున్.

తరువులనెక్కుచున్ గుహలదాటుచు అద్రులనుండిభూమిపై
కురుకుచు, అడ్డమౌనదులలోపడియీదుచు నేగి చేతికిం
దొరకు ఫలాదులన్ పుణికి తోడ్కొనిపోవుచు క్షుత్పిపాసలన్
సరకునొనర్ప రాకపులు జానకికై వెదకాడు దీక్షలన్. 90

స్వయంప్రభ

అంతబలాఢ్యులైన కపు లాకలిదప్పుల కింక ఆగలే
నంతటిదన్కకున్ వెదకు చాయెడనున్న మహాద్రికందరా
భ్యంతరమందు జొచ్చి కని రద్భుతమందుచు నొక్కతెవ్వరో
కాంత వసించు రత్నఫలకాంచిత కాంచనసౌధవీదులన్.

ఆయెడ నేయెడంగనిన హాటకరత్నవిచిత్రహర్మ్యశో
భాయుతదృశ్యముల్ మధురసాన్వితపక్వఫలోర్విజమ్ములున్
తీయనిపూవుదేనియలు దివ్యజలేజసరఃప్రదేశముల్
వేయివసంతసంపదలు విచ్చిన యట్టుల నేత్రపర్వమౌ.

వెలగపండుల నాసించి వెదుకబోవు
పాంథజనులకు పనస చేపడినరీతి
క్షుత్పిపాసార్తు లాకపికోటు లెల్ల
ఎప్పు డీ నిర్మలజలమ్ము లిన్ని గ్రోలి -

ఎప్పు డీ ఫలమ్ముల నారగింత మనిన
యాసతోడ ముందున కేగునంతలోన
ప్రభుతదీపించు గంభీరవాక్యఫణితి
ఆగు డివి తాకకుడని యాయమయు పలికె.

ఎవ్వ రీయమ మము నడ్డగించునట్టి
యతిశయము జూపుచున్న దేమైనగాని
యాగునది లేదనెడు వానరాళి నరసి
అంగదుం డాజ్ఞలిడి వారి నాపినంత -

ఏమని యాయమన్ బలుకరించుటొ తోచక సర్వవానర
స్తోమము ప్రక్కప్రక్కలకు జూచుచు నుండ సమీరసూనుడున్
మోమటుద్రిప్పి కైజతనుమోడ్చి వినమ్రవివేకమూర్తియై
యామెనుజేరినిల్చి మధురాదరరీతి వచించె నిట్లుగన్.

దివ్యయోగినీరూప దీధితుల వెల్గు
తల్లి! గైకొమ్ము మాదువందనము లివ్వె
ఒంటరిగ నీవిట వసించుచుంటి వేమొ
అడుగవచ్చునె నీవెవ్వరనుచు దేవి !

ఎవరి వీహేమసౌధమ్ము లీసువర్ణ
కమలకాసార సీమలీ సుమవనమ్ము
లీ మధురఫలవృక్షమ్ము లెఱుగనగునె
క్షుత్పిపాసలబడి వచ్చుచున్న మాదు -

రాకకును కలదొక్క కారణముతల్లి!
రఘుకులార్ణవచంద్రుడు రామమూర్తి
ధరణిబుట్టినదేవుడు తండ్రియాజ్ఞ
భార్యసీతమ్మతో వనవాస మున్న -

యదనుగని దుష్టు డా రావణాసురుండు
సీతనపహరించి చనె దక్షిణపుదెసకు
రాము డామెకొఱకు వనభూములెల్ల
నెమకుచుండ సుగ్రీవుతో స్నేహమమరె. 100

వానరపతి సుగ్రీవునిసేన యిద్ది
రాముకార్యార్థ మిట్లు మేమామెకొఱకు
వెదకుచును వచ్చిపడితి మీబిలమునందు
దృష్టినిలువ దీ శోభవీక్షించుటకును.

మాటలును జాల విద్దాని మహిమదెలుప
నయనవిభ్రమ మయ్యె నంతయును మఱియు
విపినసీమల సీతకై వెదకివెదకి
దప్పిగొనిన మా కీ సరస్స్థలము లరసి
మరలప్రాణముల్ వచ్చె నోమాత! యనిన.

హనుమని వాక్యమత్క్రతియు నాతనిసాధుమనోజ్ఞరూపమున్
గని ముదమంది యాదివిజకాంతయు శీతలనీరమిద్ది గై
కొనుడని యిచ్చి రమ్యమధుకోశములైన ఫలోపహారముల్
తినుడని వారిముం దునిచె తృప్తిఘటిల్లగ నెల్లవారికిన్.

వినుతభక్ష్యభోజ్యమ్ముల దనివిగనిన
వనచరచమూసమూహమున్ గనుచు నామె
వినుడు నాచరిత్రము నుడివెదను మీకు
మయుడు విశ్వకర్మయు స్వర్ణమయమనోజ్ఞ-

చిత్రసీమగ దీని రచించినారు;
హేమ యను నాదు సకియ దీహేమసౌధ
రమ్యకాసార తరువన రాజ్యమెల్ల
ఆమెయును నాకొసంగె నీప్రాంతమెలమి.

మేరుసావర్ణి నాతండ్రి మీరు వినియె
యుందురును స్వయంప్రభను నేనుందు నిచట
యోగ మభ్యసనమ్ము సేయుచును సతము
నిశ్చలధ్యాన జపతపోనిష్ఠ తోడ.

ఈగుహజొచ్చి తాబ్రతికియేగ డెవండును, ఈజలమ్ములన్
ద్రాగిరికాదు మీరు మృతిదప్పిన దోకపులార, మీపనుల్
కాగల వింకమీద సఫలమ్ములు; బైటకు మిమ్మునంపెదన్
వేగమెకండ్లు మూయుడని ప్రీతిగ నామె వచించినంతనే.

జానకిని వెదుక వనచరేశ్వరుని యాజ్ఞ
మనము వచ్చినదారిని మనము బోక
వచ్చిపడినార మీబిలద్వారమందు
వింతలే యిందు మిగుల గన్పించుచుండె.

ఏదో రాక్షసమాయ కాదుగద నేడీకాంతవాక్రుచ్చు సం
వాదమ్ముల్ కడుక్రొత్తవైకనుపడున్, పైపైకితీపైన మ
ర్యాదల్ మాటలు చూపి తుట్టతుదకే యాపత్తు కల్పించునో
యా దైవమ్మె శరణ్యమై యిపుడు కాపాడన్వలెన్ వేగమే.

యనచు దమలోన గ్రిందుమీదగుచు నున్న
వానరులజేరి మెల్లన వాయుజుండు
భయపడగనేల ఆ పుణ్యవనిత నుడువు
మాటలందున లేదె నమ్మకమనంగ. 110

ఆత్మయుం దొక భీతియు ఆశకూడ
వేగిరింపగ ఆకపివీరులెల్ల
ఆమెనుడివిన దానికి నధికముగనె
కనులు గట్టిగ మూసి విప్పినక్షణమ్మె.

అంతయు చిత్రమైన కలగా నొకలిప్తయిలోనె తద్బిల
ప్రాంతమునుండి వెల్వడుచు వారలు వచ్చిన త్రోవ జూచి వి
భ్రాంతియు కొంత తగ్గి తమబాటను పట్టుచుబోయి వార్ధిప
ర్యంతము వచ్చి చేరిరి ధరాత్మజ కన్పడు నన్న యాసతో.

కడలివరకును వారట్లు నడచుదనుక
మాటిమాటికి మనసున మఱపురాక
పలుతెఱంగుల నాస్వయంప్రభ మహత్తె
తలచు కొందురా కపులు సంతసము తోడ.

ఓపికతగ్గదేహములలో, మఱి వారనుకొన్నలక్ష్యమున్
దాపునలేదు, పోదగినదారియుతోచుటలేదు, చిత్తమిం
దీపటువార్ధినెల్లను తరించు ప్రయత్నమికెట్లు సాగునం
చూపిరి బిగ్గబట్టి కపులొక్కరిపై పొకరొచు చూచుచున్.

సంపాతిఉపదేశము

ధారణిజాత కన్పడదు దైత్యునిజాడయులేదు వెన్కకున్
నేరకపోదుమా బ్రదుకనీయడు భానుసుతుం డటంచు లో
నారటమంది కూర్చొనిరి అంగదు నంతటివారుగూడ, సా
మీరి యొకండె యాకడలిమేరలు లెక్కలుబెట్టు నెందుకో.

''నాడు జటాయు వా దనుజనాథుని చేతులయందు జచ్చె నీ
నాడు పయోధివద్ద మరణమ్మగునే మన''కంచు నేదొ మా
టాడుచు గుంపుగుంపులయి యాకపులందున కొందఱొక్కచో
గూడిరి యాత్మహత్యకయి గుండెలుజారిన దైన్యరూపులై.

బంధువులందు నాసగలవారయి యేగ దలంచువారు కి
ష్కింధకు మీర లేగుడిక, చేత నసింగొని కాలరూపుడై
యందె వసించుచుండు ప్లవగాధిపు డేమును చత్తు మీజల
మ్మందె యటంచు నాజలధియంచులు కొందఱు జేరు నంతలో.

ఆతరి కోతులాడిన జటాయువుసంగతి నాలకించి సం
పాతి యటన్నపక్షియును ప్రాకుచు మెల్లగవచ్చి యెట్టెటూ
బ్రాతిగ మీరలాడినవి పల్కులువింటిని నాదుసోదరుం
డాతతసాహసోగ్రుడు జటాయువు చచ్చెన రావణాహతిన్.

అయ్యయొ యెంతమాట విన్ననైనది యీపలు కాలకించియున్
చయ్యనలేచి సోదరుని జంపినవానిపయిన్ జనంగ నా
కియ్యెడ లేవు ఱెక్క లిట నెందుల కోకపులార మీరలున్
గుయ్యిడు చుంటి రేను సమకూర్చెడిదుండిన చెప్పు డర్మిలిన్.

పై నొకమాటగూడ వినబడ్డది మీరిట నాత్మహత్యకున్
బూనినయట్లు లీగతి సమూహపు జావున కేయుపద్రవం
బైనది మిత్రులార! చెపు డాదశకంఠునినుండి భీతి యే
దైనను మీకుగూడ గలదా వినగోరెద నంచు బల్కగా. 120

''ఎవరీపక్షి !మనుష్యవాక్యముల దానీరీతి మాటాడు, దా
నవకృత్య మ్మిది'' యంచు గొందఱుకపుల్ దద్వచనన్ మెల్లగా
పవమానాత్మజు డావిహంగమును సద్భావమ్ముతో జేరి మీ
రెవరయ్యా, యిటుసానుభూతిగ మమున్ వీక్షింతు రన్నంతలో.

చెంగట కేగుదెంచి యొకచిన్నము ధైర్యమువచ్చినట్లు లా
యంగదు డంత పూర్వకథనంతయు జెప్పుచు, పక్షిరాజ ! చే
యంగల యత్నమైనదిక నాకపిరాజుభయమ్ముచేత పో
వంగను లేము వెన్కకని వాకొనుటల్ విని పక్షినేతయున్.

ఔరా, రావణు డెంతనీచమును సేయంగల్గె నాతమ్ముకు
ట్టా రక్షోపతి చేతులన్ మడిసెనా! అచ్చోటనేనున్నచో
కారాకూరము బెట్టి రక్కసుని ముక్కల్జేసి యుందున్గదా
రారం డింకొక మారు నాయనుజువార్తాయోగముం జెప్పుడీ.

మావంశీయులు పూర్వమే దశరథక్ష్మాజానికిన్ మిత్రుల
య్యా వార్ధక్యము వచ్చిపడ్డ దిటు దేహమ్మందు నేనొక్కమా
రావిన్వీధిని సూర్యమండలము దాపైబోవ తద్వహ్నితీ
క్ష్ణావస్థంబడి కాలిపోయినవి ఱెక్కల్ రెండు కాకున్నచో.

చావంగొట్టి నిశాటు నీదినమె విశ్వారాధ్యు డారామసే
వావిష్కార మొసంగియుండెదను గాదా ధారుణీపుత్రికన్
చేవల్ దక్కియిటున్న నాకు వినవచ్చెన్ గర్ణశూలమ్ములై
యీవార్తావళి యేమిసేయుటకు గానీ శక్తిలేదక్కటా.

పోనీ రామునిసేవ నాయనుగు దమ్ముండ్రైన సేసెన్ భువిన్
బ్రాణంబుండిన దన్క నాకదె మహాభాగ్యమ్ము సుండీ, మఱొం
డీనామాటను గూడమీరు వినుడీయాధాత్రియందే స్థలం
బైనన్ నాకది యానవాలె మునుపీ యన్నింటినిన్ జూచితిన్.

ఎచ్చటికేగలేక యిటులే పడియుండిన నాకు నాసుతుం
డచ్చట నచ్చటన్ వెదకి యన్నమొకింతగ దెచ్చియిచ్చు వా
డెచ్చట జూచినాడొ వచియింపగ జాలనుగాని నాకడన్
క్రచ్చఱవచ్చి చెప్పిన యొకానొక సంఘటన మ్మెడందలో-

నాకుం గొంతగ జ్ఞప్తియున్న దొకకాంతారత్నముంబట్టి పెన్
వీకంబోయె నిశాటు డొక్క డిటులీవిన్వీధియం దంబుధి
ప్రాకారంబును దాటి లంకయను ద్వీపావాస మార్గంబు నం
దాకాంతామణి నోట విన్బడియె రామా ! యన్న పల్కొక్కటే.

ఆయమ సీతగావలయు నాపిశితాశియు రావణాసురుం
డే, యిక సంశయమ్ము వలదిచ్చటికిన్ శతయోజనమ్ము లీ
తోయధి కావలన్ గలదు ధూర్తుడు రావణుడున్న లంక మీ
రాయత ధైర్య సాహస సమన్విత శక్తులె గాన నందఱున్.

భావంబందు జనింపనీకు డిటుపై ప్రాయోపవేశ ప్రయ
త్నావేశమ్మును, తోచుచున్నయది నాయాలోచనమ్మందు లం
కావప్రమ్ములు జీల్చి యేగగల యుగ్రప్రౌఢ విక్రాంతతే
జోవర్ధిష్ణులు వైరిలోకదహనార్చుల్ గారె మీనాయకుల్. 130

మీరును పోదురాయెడ కమేయ జవంబున చూచివత్తురున్
ధారుణిపుత్రికన్, దురితదానవనిర్మథనప్రవీణరే
ఖారుచిరోజ్జ్వలత్ప్రళయకార్ముకరుద్రుడు రామచంద్రు డా
క్రూరనిశాచరాధముని గూల్చును తథ్యము నేనెఱుంగుదున్.

అనిలంకాపుర దుర్గమోత్కట రహస్యద్వార సంచారమం
దనుకూలమ్మగు త్రోవలన్నిటిని ధైర్యంబొప్పగా జెప్పి దీ
వెనలన్ బల్కుచు, వానరుల్ వినతులై వీడ్కోల్ప సంపాతియుం
జనె తమ్ముండు జటాయుసంస్మృతిగతశ్రద్ధాంజలుల్ దీర్పగా.

వనచరవీరులందఱి ప్రవర్తనమొక్కవిధమ్ము భక్తిభా
వనుడును స్వామికార్యవిధివత్ప్రథులాశయ దీక్షితాత్ముడా
హనుమని భావముల్ సకల మన్యవిధమ్మున బోవున ట్లెదో
మనమున నెంచు నాత డణుమాత్రము తంద్రతలేని ధీగతిన్.

వానరవీరుల నిరుత్సాహము

ఆ సంపాతి వచించుచున్నపుడు శ్రద్ధాసక్త చిత్తైక వే
షాసర్వస్వవిధేయుడై వినుచు తత్ సందర్భ సంభావ్యవా
చాసూక్ష్మార్థము లూహసేసికొను నాసామీరి వేమారు లా
శా సందీపిత భావరేఖ లెద నుత్సాహమ్ము లూరింపగన్.

తనయెదయెల్ల రామునిపదార్పణ తానొకమౌనమూర్తియై
వినినది సర్వమున్ తిరుగవేసి మనమ్మునతేల్చుకొంచు తా
ననగు రీతు లా దనుజజాతిప్రవర్తన లాపయోధిలం
ఘనఘనకార్యముల్ విలువగట్టుచు చూచుకొనున్ మనమ్మునన్.

తనపయిబెట్టె నాసుగుణధాముడు రాముడు సర్వకార్యసా
ధన మిది తీర్పనేవలయు తానయి యేగుపథమ్ములేనిరో
ధనియమబాధలున్ తనపదమ్ముల కడ్డుగవచ్చినన్ సరే
యను నొకనిర్ణయ మ్మతనియందు వెలింగిన దంతకంతకున్.

బింకమెలర్ప దైత్యు లొకవేళ భయంకరదుష్టవృత్తి న
న్నంకిలివెట్టి గుంజినను నాశిరమందున వెల్గు రామనా
మాంకిత మంగుళీయ మహిమం బొకడున్నది చాలు దానవా
తంకములన్ దహించు నను ధైర్యముగల్గె సమీరసూతికిన్.

మారుతిచిత్తమందొకటిమాత్రము స్పష్టము, విష్టపత్రయా
ధారమహోన్నతోజ్జ్వలవిధాపరమార్థగుణుండు రాము డా
ధారుణిజాత సీతయును తత్పురుషప్రథమానరూపవి
స్ఫారితమూలమౌ ప్రకృతిశక్తి యటన్నసత్యమున్.

గ్రీష్మతప్తమై వాడిన వృక్షరాజి
కంబుధారలు గురిసిన యట్టులయ్యె
ఆశ లుడిగిన కపి హృదయమ్ములకును
ధైర్యమొసగు సంపాతి వాగ్ధార లచట.

ఎట్టులో వచ్చితిమి మన మింత వఱకు
నిల్లలుకు మాత్రమున పండుగెట్టులగును
సీత జాడయు తెలియ వచ్చినది సరియె
నీరధినిదాటి యెవరు పోనేర్తు రటకు. 140

అనుచున్ ముందఱకేగి మానసము లూటాడంగ భీతిల్లుచున్
గని రా వానరవీరు లెట్టెదుట రంగత్తుంగ భంగార్భటీ
ఘనకల్లోల విఘూర్ణ విభ్రమ సముగ్రాటోప దీప్తోత్కట
స్వన సంరంభ విజృంభ సంచలిత దిక్చక్రావధిన్ వార్నిధిన్.

ఝుంఝూ ప్రభంజన చండవే గోద్ధూత భంగోత్కరంబు లంబరము ముట్ట
మకరఘులీవ్యాళ నికరోగ్ర జలనాగ మీనసంతానముల్ మీదికెగయ
పాండుర డిండీర పటలమాలాకేళి వేలావధినిదాటి విరిగి పడగ
పర్వతోన్నత మహా భయద తరంగమ్ము లుర్విపై కుఱ్ఱూత లూగిరాగ,

అంతకంతకు ప్రబలమై అంతులేని
అలలతోడ కల్లోలమౌ జలధియందు
ప్రతికణముగూడ కడుభీకరముగ దోచె
కపిగణమ్ముల కెడదలు కంపిలంగ.

ఈసాగరమ్మటే ఇందిరా శీతాంశు పుణ్యమూర్తుల కైన పుట్టినిల్లు
ఈసముద్రమ్మటే భాసురోజ్జ్వలకాంతి రంజి తామలనవరత్ననిలయ
ఈమహార్ణవమటే ఈరేడులోకాల మేల్గోరు వేల్పుసామికిని సెజ్జ,
ఈవారినిధియటే మృత్యుజిద్వరశక్తి నమరాళి కిచ్చిన యమృతపాత్ర.

భూరిసౌఖ్యమ్ము లిడు తదుదారగరిమ
యిచట నణువైన నేడుకన్పింప దేమి?
శివుడుగళమున బంధింప చెదరిపడిన
ప్రబల హాలాహలకణోగ్రపటిమ దక్క.

దాటవలెన్ తరంగభయదమ్మయి మీదికి పొంగివచ్చు ము
న్నీటిని, క్రూరుడైన రజనీచరనాథుని లంకలోపలన్
కోటను జేరగా వలయు క్షోణిజకై యిది నిర్వహింపనా
పోటుమగం డెవం డని కపుల్మదులన్ గుడుసుట్లువోవుచున్.

ఒకడు తీరమ్ము జూచి వెన్కకునువచ్చు
కొలదిదూర మొక్కండు చూపుల నిగుడ్చు
ఒక్క డావలిదరిజూచి యూరకుండు
కడలి కడతల కురుకు నొక్కడును లేక.

ఆ కపిసైన్యనేత యగు అంగదు డంతట ముందునిల్చి ఓ
హో కపివీరులార! మహితోగ్రపరాక్రమమూర్తులార నే
డీకడలిన్ గమించి దనుజేశుని లంకను జేరువాడు మీ
లోకఅవయ్యెనా మదులలో నిటులేటికి సంశయింతురున్.

అటుచూడన్ కపిరా జనుక్షణము నాకైవేచియుండున్, మదో
త్కటదుష్టాత్ముడు దైత్యనాథుడును సీతాదేవిగొంపోయి తా
నెట బంధించెనొ, స్వామికార్యమిది సాధింపన్ గపిశ్రేణిలో
పటుశక్తిన్ వనరాశిదాటగల సత్వస్ఫూర్తి లేదాయిటన్.

నెల గడువిచ్చె నాపయిని నిల్వడహర్పతిసూతి తొందరల్
తొలగని అంతులేవలకె త్రొక్కుచునుండును, చండశాసనుం
డలుక వహించెనేని మరియాదలుచూడడు వానికత్తికిన్
బలియయిపోవుకన్న బలవంతపుచావులె భద్రమయ్యెడున్. 150

రావణులంక జేరక ధరాత్మజజాడను జూడబోక మీ
రేవగతోడనో వెనుకకేగదలంతురయేని ప్రాణముల్
వోవుట తప్పవాక్షణము లోననె భీకరమూర్తి యల్ల సు
గ్రీవుని కత్తివాదర నొకించుక మానసమందు నెంచుడీ.

ఆదిన్ నాకొకభీతిగల్గినది యీయంభోధి దూరమ్ము తా
నైదాటంగల వారలెవ్వరని నేడావృద్ధపక్షీంద్రుడై
ర్యోదర్యాదర భాషణమ్ములవి నాయుల్లమ్మునన్ నూతనా
శాదీప్తిన్ వెలిగించి చూపినవి భాస్వద్గమ్య మార్గమ్ములన్.

నేనెట్టులైన నద్దరికి నేర్పుగ పోగల శక్తిశాలినే
గానిటు వెన్కకున్ మగిడిక్రన్నన రాగల సాహసమ్ములే
దైనను నేనెపోదు జనకాత్మజగాంచగ నంచు తెంపులో
నూనిన యంగదుం గనుచు నుండిన వృద్ధుడు జాంబవంతుడున్.

జాంబవంతుని ప్రోత్సాహము

అంగద నీకునేల యిటులాగనితొందర వార్ధినెల్ల దా
టంగల శక్తిశాలి వగుటల్ విదితమ్ముగుగాని నీవు పో
వంగ పనేమి ? యీప్లవగవాహినికిన్ యువరాజనీవు నీ
కుంగల కార్యనిర్వహణకుంగద వచ్చితి మెల్ల వారమున్.

ఏనో వృద్ధుడనైతి నావయసునం దీవార్ధిలెక్కా! మఱి
ప్లైనన్ పోయినదేమి రామనృపుకార్యార్థమ్ము సామర్థ్యుడౌ
వానిం జూపెద చూడుమామెదుట దుర్వారోగ్రవేగోత్కటా
నూనప్రాభవసాహసుం డనిలసూనుండున్న వాడచ్చటన్.

అనుచును జాంబవంతు డట కంగదునింగొనిపోయి సర్వమా
వనచరసేనయున్ వినగ పల్కెనిటుల్ హనుమంతుజూచి, ఓ
యనుపమధైర్యసాహసబలాగ్రణి యంజనపుత్ర! నీ వెయీా
వనధిని దాటి ధారుణిజవార్తను తేగలవోయి లెమ్మికన్.

ఓయీా! నీబలమీవెఱుంగుదువోలేదో నీమహాసాహస
స్ఫాయద్భీకర వాయువేగ విలసత్ప్రజ్ఞా వికాసోదయం
బీయుావజ్జగమందు గన్పడదు, నీకీనీరధుల్ పల్వల
ప్రాయం బౌట నిజంబు లెమ్మిక మహోద్యర్ద్ధీమతీ, మారుతీ!

తలచినజాలు నీదునెడదన్ త్రిదివంబును ముట్టుకొందు వా
వల దనుజేశులంకపయి పాదము నుంచినజాలు నీబల
ప్రళయమునందు దానవులుభస్మము కాగల రాధరాత్మజా
లలనను జూచి రాము కుశలమ్మును తెల్పెదవీవు పావనీ.

నీవంశోన్నతి నీదుదోర్బల సమున్మేషప్రభావమ్ములున్
భావమ్మందు దలంచుకొన్న క్షణమే ప్రాదుర్భవమ్మయ్యె నా
కీవిశ్వాసము, రాముకార్యమిదితండ్రీ ! వమ్ముగావించునే
యావద్విశ్వము క్రిందుమీదగుచు నీకడ్డమ్ముగా నిల్చినన్.

నిరుపమశక్తితో గరుడినిన్ బురుడింతువు సూర్యసూతికిన్
సరియగుదీవు నీమహితసత్త్వతనూబలధైర్యకీర్తులం
దరయగ రామలక్ష్మణులదర్పసమున్నతి దోచు, శేముషీ
గరిమమునందు గూడ సరిగానము నీకు సమీరనందనా. 160

భీమప్రాభవ ధైర్యసాహస మహావేగుండు వేదాంతవి
ద్యామేయప్రతిభాన్వితుం డఖిలలోకాతీతు డంచిట్టు లా
సామీరింగని జాంబవంతు డెలమిన్ శ్లాఘించు టాలించి హే
లామోదమ్ముల దేలి రెల్లరును గోలాంగూల యూధోత్తముల్.

మఱల జాంబవంతుడును, హనుమంతా! నీవంతయు
నెఱుంగుదువో లేదో గాని,

తెలిపెద నీదువంశప్రతీతిని విన్ము మహాత్మ! పుంజిక
స్థలయనునప్సరోవనిత శాపవశమ్మున జన్మమందె నీ
యిలపయి కుంజరుండను కపీంద్రునిపుత్రిక అంజనాఖ్యతో
నలరిన యామె నీజనని అందపురాశియు కామరూపయున్.

కేసరియన్న వీరకపికిన్ మధుమాధవమంజువల్లరీ
భాసురమూర్తియంజనయు భార్యగ నైనది గానివెంటనే
కేసరియున్ విరాగియయి కేలకమండలువూది సత్తపో
భ్యాసమునందె తాను గడపందొడగెన్ సమయమ్ము సర్వమున్.

నాకొఱకు చింత వలదు మనమ్మునందు
వాయుదేవుని వేడుమో వనిత యింక
ధన్యచరిత వీవగుదువు ధరణియందు
ననుచు కేసరి వచియించి యరిగె నెటకొ.

అదియు వసంతకాలసమయామలకోమల నూతనప్రసూ
నదళ పరీమళార్ద్రపవనమ్ములు పర్వులు బెట్టు దేశమా
సదమల సీమలందున ప్రశాంతనదీశిశిరోపచార సం
పద లలరారు చోట కుసుమాంగియు అంజనయుండ నొంటిగా.

ఆకమనీయభాసురశుభాంగి సొబంగులు చూచి సౌరభ
శ్రీ కలితుండు ప్రేమవివశీకృత చిత్తుడు వాయుదేవుడున్
పైకొని, కొందలంపడెడు భామిని నూరటబుచ్చి స్వాదుసు
శ్లోక నయప్రియోక్తి శుభసూచక వాచక మొప్ప నిట్లనున్.

నీకల్యాణతనూవిలాస సుషమన్ నేజూచి కాంక్షించి నే
నీకైవచ్చిన వాయుదేవుడను తన్వీ నాపరిష్వంగముల్
స్వీకారమ్మొనరింపు మిద్ది పరమశ్రేయమ్ము నీకీర్తికీ
లోకంబందున రాదు లేశమయినన్ లోపమ్ము సాధ్వీమణీ.

అలనాడెప్పుడొ మోహితాత్ముడయి ఫాలాక్షుండు శ్రీమోహినిన్
తిలకింపన్ చలితమ్ముగాపడిన తద్వీర్యం బవార్యస్ఫుర
ద్బలతేజోవికసన్మహామహిమ సంభావ్యంబు నాయందునన్
గలదద్దాన జనించు నీకుసుతు డొక్కం డీశుతేజంబునన్.

కారణజన్ముడున్ దివిజకార్యధురంధరు డాగమాంతవి
ద్యారమణీయమూర్తి కమలాసనతుల్యుడు సాధుభావనో
దారు డజేయవిక్రమవిదారిత శాత్రవు డచ్చకీర్తివి
స్తారుడు విష్ణుభక్తి భరితాత్ముడు నౌ సుతుడబ్బు నీకికన్. 170

అనుమాటల్ విధినిర్ణయమ్ములుగ నయ్యబ్జాక్షి భావించి మున్
దన యాత్మేశ్వరు డన్నపల్కులు భరద్వాజర్షి వాకొన్నదీ
వనలున్ నెమ్మదిలో ప్రతిధ్వనిత భాస్వన్మాధురుల్ చిందగా
ననిలున్ పాదములంటి భక్తినిరతిన్ప్రార్థించె లోలాత్మయై.

జననంబందితి వంజనాపవన సత్సంబంధసాఫల్యమై
హనుమా! శైవవరప్రసాదనమహత్త్వాంశప్రభావోన్నతిన్
ఘనతేజోనిధివై అజేయబలవిక్రాంతస్ఫురన్మూర్తివై
జనసంస్తుత్య వివేకభూషితుడవై సాధుస్వభావుండవై.

పిననాడే ఒక దోరపండని వియద్వీధీచరద్వేగివై
యినునిం బట్టగనేగు నీపయికి దేవేంద్రుండు వజ్రాయుధం
బనివార్యంబుగ నేయ చెక్కిలికిగాయంబయ్యె నానాటితో
హనుమంతాఖ్యుడవైతివీవు ధృతిమంతా విశ్వవిఖ్యాతితో.

మనమందున్ బసికూనయంచును దలంపంబోకవజ్రాయుధ
మ్మును తానేయునె యింద్రుడం చధికకోపోద్రిక్తుడై వచ్చి నీ
జనకుండాపెను గాలి, నక్కతన నస్తవ్యస్తమ్మై లోకమె
ల్లను వాపోవదొడంగె నోయి! తనువుల్ప్రాణావశిష్టంబులై.

పరువుల్బెట్టుచు వచ్చి నీజనకునింబ్రార్థింప మౌనుల్ సురల్
కరుణన్ వాయుపు వీచసాగె మరలన్ కంజోద్భవుం డింద్రుడున్
వరుసన్ నీకిడినా రశస్త్రమృతియున్ స్వచ్ఛందనిర్యాణమున్
వరదానంబులుగా నినుం బొగడి శశ్వత్ప్రీతివాక్యంబులన్.

సరసీజోద్భవుతుల్యమౌ మహిమయున్ సాహిత్యసాహిత్యముల్
చిరజీవిత్వము సాధువాదము జగజ్జేగీయసద్వర్తనం
బరివీరప్రళయోగ్రదోర్బలము లత్యంతమ్ము నీకబ్బు సు
స్థిరభాగ్యమ్ములుగా నటంచు మునులున్ దీవించిరయ్యా నినున్.

ఇదినీజన్మకథాసుధాలహరి మాకీనాడిటన్ జీవన
ప్రదమై భాసిలు భాగ్యమియ్యది సముద్రాంభస్సు లెల్లన్ భవ
త్పదవిక్రాంతిని దాటి వత్తువు వియత్పర్యాప్తమార్గమ్మునన్
విదితప్రాజ్యబలాగ్రణీయ త్రిజగద్వీరాంజనేయాహ్వయా!.

విను మింకొక్కవిశేష మర్కునికడన్ విద్యార్థిగాజేరి నీ
పిననాడే బహువేదశాస్త్రవిలసద్విద్యావిధుల్ నేర్చి నా
వనఘా విద్యలయందుగాని బలధైర్యస్ఫూర్తులన్గాని నీ
కెనలేరీజగమందు దివ్యగుణ ప్రహ్వీయాకృతీ మారుతీ!

ఎఱుగనియట్టు లీమహిమలెల్లను నీవిటులూరకుంటివో
కరువలిపట్టి! రామవిభుకార్యము నీయది లెమ్మికన్ భవ
చ్చరిత మపూర్వధైర్యబల సాహస దిగ్విజయాప్తకీర్తినుం
దరమయి వెల్గునోయి శశితారకభాస్కర మౌచు నాయనా!

ఈపాధోనిధి దాటి రాగలుగు దీవేయంచు మాప్రాణముల్
నీపై బెట్టితిమయ్య వాయుతనయా, నీధైర్యశౌర్యస్ఫుర
న్నైపుణ్యమ్ము మదిందలంచి కపిసైన్యంబూర్జితోత్కంఠతో
దాపైనిల్చిరి వీరలందఱిమనస్తాపమ్ము లార్పంగదే. 180

అతులప్రీతిని జాంబవంతు డిటు లాహన్మంతు నగ్గించు సం
స్తుతు లౌత్సుక్యత నాలకించి కపియోధుల్ ముందు కొక్కొక్కరే
నతశీర్షముల వచ్చి మ్రొక్కిరి మహానందమ్ముదీపింప మా
రుతికాసల్ నునుమోసులెత్తిన గగుర్పుల్గ్రమ్మ దేహమ్మునన్.

హనుమంతుడు సముద్రమును లంఘింప నుద్యుక్తుడగుట

భల్లూకేశ్వరుడన్నమాట లవి సర్వమ్మున్ యథార్థమ్ములై
యుల్లాసమ్మునుగొల్ప మారుతియు స్వీయోదాత్తవేగాంచితో
ద్యల్లీలామహనీయసాహసబలౌద్ధత్యమ్ము లొక్కింత తా
నుల్లంబందు గ్రహించి యొక్కబిగితో హుమ్మంచు నుగ్రాకృతిన్.

ప్రాంచద్భక్తిని రామనామమెడదన్ భావించి సామీరియున్
పెంచెన్దేహము నభ్రమార్గములకున్, విక్ష్వేడనోద్వృత్తి ఝు
ళ్పించెన్ వాలము, దిక్తటాక్రమితవైజృంభమ్ముదీపింప కా
న్పించెన్ భీకరదుర్నిరీక్ష్యవిభవోన్నిద్రైక తేజస్వియై.

వరజన్మండను వాయుసూనుడను భాస్వద్భాస్కరాశీర్విని
ర్భరసత్వాఢ్యుడ రామదూత నతులప్రారంభవత్ పాట వో
ద్ధురతన్ దూకెద వేయియోజనములద్రుల్ వ్రక్కలింపంగలన్
పురుహూతున్ బరిభూతు సేయగల, నంభోరాసు లింకించెదన్.

తిరుగన్నేర్తు త్రివిక్రమక్రమసముద్దీప్తైక దివ్యాకృతిన్
ధరణిన్ దాటి నభమ్మునంటి జలదాంతస్ఫీతవిద్యుత్తునై
ధరణీజాతను చూచివచ్చు టిక దథ్యమ్మంచు తోచున్ నిశా
చరుడెందుంచిన గూడ; మీరలిట నిస్పందేహులై యుండుడీ.

ఈధరాస్థలమ్ము సుంతయేని నిల్వబోకనాదు
పాదఘట్టనముల గ్రుంగి బ్రద్దలై నశించునేమొ
పాదమూని యీమహేంద్రపర్వతాగ్ర మెక్కి వేగ
పోదు నబ్ధిదాటి మాతభూమిజాతనుం గనంగ.

అని గంభీరవచశ్చమత్కృతులతో నయ్యాంజనేయుండు ప
ల్కిన వాలించుచు జాంబవంతుడెలమిన్ లేనవ్వుదీపింప ఓ
హనుమా పెద్దల ఆశిషమ్ము లిక నీయందుండి నీచేయుఈ
ఘనకార్య మ్మిది సర్వదిగ్విజయ భాగ్యమ్మై విరాజిల్లుతన్.

భయముల్వీడి ప్రమోదముంగనిరి నీబాంధవ్యు లీవానరుల్
జయధాటిన్ జలరాశిదాటి ధరణీజాతన్ విలోకించి మా
నయనోద్భాసిగ నీవువచ్చుదనుకన్ దైవానుచింతామనో
నియతిన్ మేమిటనుందు మోయి హనుమా నీవేగిరమ్మాయికన్.

పటుశైలప్రవికంపనోగ్రబలవిస్ఫారుండు, వారాన్నిధి
స్ఫుటదూరప్రవిలంఘనప్రవణవిస్ఫూర్జన్మహావేగుడు
త్కటతేజుండు సమీరసూనుడు మహేంద్రగ్రావమం దెక్కె ప్రా
క్తటశైలోన్నతశీర్షమం దుదయమార్తాండప్రకాశాఢ్యుడై.

సలలితపుష్పవల్లికలు చల్లనినీడలు శాద్వలస్థలుల్
జలనిలయమ్ములున్ సకలజంతువిహారవిశాలభూములున్
గలిగిన యామహేంద్రగిరి కందర సానుతలమ్ములన్ ముద
మ్మలరగ సంచరించె నమరాధిప తుల్యుడు వాయుసూనుడున్. 190

శైలతటముల నటునిటు సంచరించి
తడవుసేయక అంజనతనయు డంత
మేను పెంచి వాయువునుకుంభించిలోన
గిరిశిరాన నిలిచె మేరుగిరియునోలె.

పవమానసూనుని పదఘట్టనమ్మున పగిలిబీటలువాఱె పర్వతమ్ము,
ఫలవృక్షములుక్రుంగె జలధారలుప్పొంగె పొరుగుసీమలకేగె పులుగులెల్ల.
పడుచులేచుచుబోవు ఫణిలోకఫణరాజి ధరణీధ్ర శిఖర కేతనములయ్యె,
దారితోచక గుహాద్వారమ్ములను వీడి పరువులెత్తెను మృగప్రతతివెలికి.

మునులు గంధర్వు లటనున్న జనములెల్ల
వీకచెడి నల్గడల కాందిశీకులైరి
తోటివా రొక్కరునులేని బాటసారి
వోలె నిల్చినది మహేంద్రశైలమచట.

చంచద్వాలనిపీడితాభ్రతల ముత్పాదమ్ముగా సాహసో
దంచ ద్భూరిమహోగ్రదేహబలు డుత్సాహమ్ముదీపింప కు
ప్పించెన్ మారుతి వార్ధిలంఘనజవోద్వేలప్రభావోద్ధతుల్
పంచారించి సమస్తదిక్చలితమై బ్రహ్మాండ మూటాడగన్.

జయము! శ్రీరామకార్యసంసక్తమతికి,
జయము! సీతాగవేషణ సాధుకృతికి,
సకలమునిగణ దేవతా సంస్తవార్హ
వితత ధార్మికవ్రతికి మారుతికి జయము!

మత్తకోకిల

వానరాన్వయమందు భాసుర భవ్యకీర్తిపతాకవై
ఈనభస్థలి దూరమున్ గమియించి వారిధిపారమున్
కానజాలిన వీరశేఖర! కల్గుగావుత నీకికన్
దానవాంతక విక్రమోన్నత ధైర్యసంపద మారుతీ!

ఉత్సాహ.

నీవొనర్చుపుణ్యకార్యనియతికిన్సహాయమై,
పావకప్రదాహక ప్రభావమెల్ల నీదియై,
ఆవిహంగనాథు గరుదనంతశక్తి నొందుచున్,
రావణప్రవృత్తికిన్, పరాభవ మ్మొనర్చుమీ.

స్రగ్విణి.

భూమిజాన్వేషణస్ఫూర్తి శుంభద్ద్యుతీ
రామకార్యార్థనిర్వాహ దూతాకృతీ
భీమసత్త్వాన్వితోద్వేగ వాయుప్రతీ
కామరూప ప్రకర్ష ప్రవీణోన్నతీ.

విజయ మంగళము.

దేవతాసమూహమొసగు దీవనల్ఫలించి మిగుల
నీవుపోవుచోట్ల నెల్ల నీబలమ్మమోఘమగుచు
ఈవిశాలజగము నిన్స్తుతింపగలుగు విజయమంగ
ళావహప్రమోదభరము హనుమ నీయశమ్ము వెలుగు. 200

అనిమిన్నంటెడిరీతి వానరుల హర్షామోద నాదమ్ము ల,
య్యనిలాపత్యము యౌగపద్యముగ నాయాకాశమున్ దాకుటన్;
వినిపించెన్ గనుపించె నాకవిచరద్విద్యాధరీ కిన్నరీ
జన గంధర్వ సురాళి విస్మయ వికాసవ్యగ్రులై చూడగన్.

ఆశ్వాసాంతము.

ఇదిహనుమడు నీపనికై
యుదధిన్ లంఘించుసాహసోద్యమమహిమా
స్పదకథ శ్రీరామా! రస
హృదయ స్వాదిష్టముగ రచించితి స్వామీ.

రామా నీసేవలనా
సామీరియె గుత్తకొనియె సర్వమ్మును నా
కేమిమిగిలినదయా! స్వా
మీ మీయిరువిరికథను రచించుట కంటెన్.

హనుమంతునిచరితము నం
దనురక్తియు నీమృదుచరణాబ్జమ్ములపై
మనమున భక్తియు నొకటై
నను నిల్పగనీయని రచనమ్మిది రామా!

ఎదివ్రాసిననీభువి నా
బ్రదుకున కొకవెలుగుదారి ప్రాపించునొ య
య్యదియే యాశ్రీహనుమ
త్కృథయని వ్రాసితినిరామ! తత్ఫలమీవే!

ఇనవంశోత్తమరామ! నీపదయుగీభృత్యుండు శ్రీయాంజనే
యునిగాథన్ మధురార్థశబ్దముల నవ్యోద్యత్ప్రబంధమ్ముగా
ననుసంధించుచు నీకొసంగితినిదేవా! యిద్దిమత్సాహితీ
ప్రణుతస్వాదుఫలమ్ము మీహృదికుదారప్రీతి కల్పించుతన్. 206

గద్య

ఇది శ్రీభారతీకరుణాకటాక్షలబ్ధకవితావిశేష హరితసగోత్రపవిత్ర
సత్రాజార్యరత్నమాంబాపుత్ర కవిశేఖర, మధురకవి, కవిభూషణ
భారతీప్రసన్నేత్యాదిబిరుదాంచిత, బుధజన విధేయ
సుబ్బారాయనామధేయప్రణీతంబైన శ్రీహనుమత్ప్రబంధమునందు
శ్రీరామసుగ్రీవులమైత్రి వాలివధ, సీతాన్వేషణకు కపిసేనలువెడలుట
స్వయంప్రభగుహ, సంపాతిఉపదేశము వానరులనిరుత్సాహము
జాంబవంతునిప్రోత్సాహము సముద్రలంఘనకు హనుమంతుడుద్యుక్తు డగుట
అను కథలుగల పంచమాశ్వాసముతో ప్రథమభాగముసంపూర్ణము

ఓమ్ తత్ సత్

శ్రీ ప్రసన్న భారతీ గ్రంథమాల
శ్రీ కొండేపూడి సుబ్బారావుగారి-ఉత్తమ సాహిత్య గ్రంథములు

నెం.	పుస్తకము పేరు వివరములు,	ప్రతి1కి వెల రూ.లు
1.	గీతామృతము : 1993 ప్రచురణ భగవద్గీత 18 అధ్యాయముల మూలము పద్యతాత్పర్య సహితము	30.00
2.	పరమేశ్వరి వచనము. శ్రీ దేవి భాగవతమునకు సంక్షిప్త రూపము	20.00
3.	విజయగీత వచనము. శ్రీ భగవద్గీత ననుసరించి వ్రాసిన పౌరాణిక నవల	20.00
4.	ప్రసన్న భారతి-ఈనాటి దాదాపు 170 మంది సుప్రసిద్ధకవుల కవితా సంకలనము. సరస్వతీస్తుతి 1,2 భాగములు	25.00
5.	సౌందర్యలహరి మూలము-తెలుగు పద్యతాత్పర్య సహితము	15.00
6.	శివానందలహరి 〃	10.00
7.	ద్వాదశజ్యోతిర్లింగములు 〃	10.00
8.	ముకుందమాల 〃	6.00
9.	ఈశ్వరార్పణము-శతకము	8.00
10.	హనుమత్ స్తోత్రము-శతకము	4.00
11.	దేవీపంచాశిక-దేవి, లక్ష్మి, పార్వతి, సరస్వతుల స్తుతి పద్యములు	3.00
12.	ప్రార్థన దండకములు వినాయకుడు మొదలు హనుమంతుని వరకు 12	3.00
13.	శ్రీ సరస్వతీదేవిమహత్త్వము వచనము	3.00
14.	శ్రీ హనుమత్ప్రబంధము పద్యకావ్యము మొదటి భాగము	35.00

పోస్టుఖర్చులు ప్రత్యేకము : వెలముందుగా M.O. చేయవలెను. వి.పి.లు పంపబడవు.

ముద్రణలోనున్నవి : కవితావాహిని (పద్యకవితలు)
వచనములు : ఆంధ్రరఘువంశము ఆంధ్రరాజుల చరిత్ర, సాహిత్య సౌరభము, కుమార విజయము

: పద్యకావ్యములు శ్రీ వేంకటేశ్వర కర్ణామృతము సూర్యనారాయణ శతకము

: శ్రీమద్రామాయణము, శ్రీమద్భాగవతము, ఉత్తర రామాయణము, మహాభారతకథ, శ్రీదేవీభాగవతము మొ॥

47-10-5, ద్వారకానగర్, విశాఖపట్టణం - 530 016

మా వంశక్రమము - నా సాహిత్యకృషి

కొండేపూడి సుబ్బారావు
గ్రంథకర్త,
సంస్థాపక సంపాదకుడు. ప్రసన్న భారతి సాహిత్య పత్రిక

మా పూర్వీకుల నివాసము కొండేపూడి గ్రామము, పశ్చిమ గోదావరి మండలము భీమవరము సమీపమున గోదావరి కాలువ ఒడ్డున. ఆ ఊరి పేరే మాయింటి పేరు. ఆర్వేల నియోగి బ్రాహ్మణ శాఖ- మాతండ్రి సర్రాజు గారు, తాత సుబ్బన్నగారు, ముత్తాత నరసింహముగారు. మా తాతగారి పేరే నాకు పెట్టిరి. ఆ పేరు క్రమముగా మారి లోక వ్యవహారమున సుబ్బారావు అయినది.

మా నాన్న గారిని గురించియే గాని అంతకు ముందు వారిని గురించి మేమెఱుగము - వారందరు పెద్దలు గడించి యిచ్చిన ఏ కొద్దిపాటి పొలమో వ్యవసాయము చేసికొని ఏ పంచనో నలుగురు పిల్లలకు చదువు చెప్పి, వచ్చిన దానితో సంతృప్తిపడి కాలము శాంతముగా గడపిన సాధుజీవనులు. మా జనని రత్నమ్మ గారు చేబ్రోలు గ్రామము (పశ్చిమ గోదావరి) ఆదూరి వారి ఆడుపడుచు. వీర వెంకట్రామయ్య గారి రెండవ కుమార్తె. వివాహమయిన తరువాత మా నాన్న గారు చేబ్రోలు వచ్చి స్థిరపడిరి - బాల బాలికలకు ఆ ఊరి రామాలయము అరుగుల మీదనే వారి బడి - నాకు 'ఓనామా' లతో అక్షరాభ్యాసముగ 'సరస్వతి నమస్తుభ్యం' అనిపించినది ఆ దయాహృదయుడే. ఈ నాటికిని ఆ గ్రామమున నన్ను సుబ్బన్న గారనియేపిలుచుచు మా నాన్నగారి మంచితనమును గూర్చి ఎంతయో చెప్పుదురు.

వంశములో నున్న పృథ్వీ తత్త్వ విశేషమేమో పొలములు దొడ్లు తోటలు చెట్లు చేమలు అనిన మా నాన్న గారికి ఎంతో యిష్టము. మా పెదతల్లి గారు కనకదుర్గమ్మ భర్త బొమ్మిరెడ్డిపల్లి గంగరాజు గారు ఆ యూరనే ఉండువారు. వారు సంపన్న గృహస్థులు ఉదారులు. బంధువులకు సాయము చేయు చుండు వారు. దైవచింతనలు తీరిక గలిగినపుడెల్ల మా నాన్నగారు వారి పొలము పనులను చూచు చుండువారు. వారింటనే మా నివాసము - మేము నలువురము. మా అక్క కనక దుర్గాంబ, తమ్ముడు సత్యనారాయణ, చెల్లెలు అన్నపూర్ణమ్మ. నా జననము 1916 నాకు ఎనిమిదేండ్లయినా నిండని చిన్న తనము నందే మానాన్న గారు, ఒక పుష్యశుద్ధ ఏకాదశి ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యసమయమున, ఏ వ్యాధియు లేకనే మా పెద్దనాన్న గారి తోటలో చెట్టు నీడను కూర్చున్న వారట్లే దివంగతులయిరి. వారికపుడు నడి వయస్సు అయిఉండవచ్చు. మానాన్న గారి మృతికి గ్రామమున దుఃఖింపని వారు లేరు. అంతటి సౌజన్యమూర్తి ఆమహనీయుడు. మేము నలువురము తల్లి చాటు చిన్న పిల్లలము - మాకు గల

ఆస్తి పాస్తులు మానాన్న గారికి గల మంచి పేరే. మా పెదతల్లి, పెదతండ్రి గార్ల ఆదరముతో వారి యింటనే ఉంటిమి. వారి పొలములు పనులు మానాన్నగారు చూచిన అభిమానమున మా తమ్ముడు సత్యనారాయణను, సీతారామాంజనేయులు అను పేరున వారు దత్తత గైకొనిరి. మా యింటి పిన్నలు పెద్ద లెల్లరును నిరంతరము భాగవత పఠనమున ఆసక్తి గలవారు. చిన్న నాటి ఆ అభ్యాసమే నాకు గల సాహిత్య ప్రవేశమునకు కారణము-

మా అక్కగారు కనకదుర్గాంబ సమీపమున నున్న కైకరం వాస్తవ్యులు శ్రీ ఆదూరి విశ్వనాథముగారి భార్య మా చెల్లెలు అన్నపూర్ణమ్మ చేబ్రోలు లోనే ఆదూరివారి కోడలు. భర్త నరసింహము.

నా వివాహము చాల చిన్నతనము 1930 లో అయినది. భార్య శ్రీమతి సుబ్బలక్ష్మి ఆరుగొలను గ్రామము తల్లాప్రగడ సుబ్బారావు గారి కుమార్తె. ఆర్థిక కష్టములవల్ల మధ్య మధ్య ఆగుచు ఎట్లో మా అమ్మగారి పట్టుదల వలన 1938లో కాకినాడలో బి.ఏ. ఉత్తీర్ణుడ నైతిని. వెళ్ళిన పరీక్ష లన్నిటి యందున ప్రథమ శ్రేణి ప్రథమ స్థానములు గడించితిని. వ్యాస వక్తృత్వ పరీక్షలలో బహుమానములు, మంచి ఉపకారవేతనములు; విశ్వవిద్యాలయ స్వర్ణపతకములును లభించినవి - చదువు ఎట్లున్నను ఉద్యోగవిషయమున అవి చాల గడ్డుదినములు. కొన్ని దినములు ప్రయివేటు ట్యూషనులు, కొన్ని దినములు ఒక అచ్చుఆఫీసు గుమాస్తా పని సాగి 1940 అక్టోబరు లో డిఫెన్సు అక్కౌంట్సు డిపార్టుమెంటులో జేరి క్రమముగా సీనియరు అక్కౌంట్సు ఆఫీసరు పదవినంది 1974 లో ఉద్యోగ విరమణ నందితిని - ఉద్యోగ సందర్భమున పూనా జబ్బల్‌పూరు, అలహాబాదు, మద్రాసు, సికింద్రాబాదులో తిరిగి విశాఖపట్టణమున రిటైరై యిచ్చటనే స్థిర నివాసమేర్పడినది. 1975 లో మా అక్కగారు, 1976 లో మా తల్లి గారు, 1995 లో మా బాగారును పరమపదించిరి.

నాకు ముగ్గురు సంతతి. కుమార్తె విద్యావతి; కుమారులు; చి॥ సర్వేశ్వర ప్రసాదు ప్రస్తుతము బ్యాంకు ఆఫీసరు వీని భార్య చి॥సౌ కామేశ్వరి. విజయవాడ శ్రీ పిండిప్రోలు భాస్కరరావు గారి కుమార్తె. మా అక్క ఆదూరి కనకదుర్గాంబ గారి కుమారుడు చి॥ భీమారావు రైల్వే ఇంజనీయరునకు మా కుమార్తె చి॥సౌ॥ విద్యావతి నిచ్చితిమి. వారి కుమార్తె చి॥ సౌ॥ గీతాలక్ష్మి మా రెండవకుమారుడు చి॥ శ్రీనివాసు భార్య. అతడు బెంగుళూరు ఇస్రో సంస్థలో సైంటిస్టు ఇంజనీయరు. దైవానుగ్రహమున అందరును వారి వారి కుటుంబములతో అన్న వస్త్రముల కేలోపమును లేక ఉన్నారు --

నా సాహిత్యకృషి - ప్రసన్న భారతి సాహిత్య పత్రిక

ఉద్యోగ విరమణ మందిన 1974 నుండియు బాల్యము నందలవడిన సాహిత్యాభిరుచితో మటికొంత స్వయంకృషి సాగించి, శ్రీ సరస్వతీ కరుణాకటాక్షమున పెక్కు పద్య గద్య గ్రంథములను

వ్రాసితిని . వీటిలో కొన్నిటి పట్టిక వెనుక పుటలోనున్నది. ఎక్కువగా ఆధ్యాత్మికములే. దాదాపుగా నేటి కేబది యయినవి.

నా రచనల ఫలితముగా అనేక సన్మానములు సత్కారములు పురస్కారములు లభించినవి, - బిరుదులు వచ్చినవి, కొన్ని సాహిత్య సంస్థలను స్థాపించి నడిపితిని.

ప్రస్తుతము నాసాహిత్య కృషి, నిర్విరామ కావ్యరచనతో పాటు "ప్రసన్న భారతి" సాహిత్య త్రైమాసిక పత్రికను 1993 లో స్థాపించి నడపుచున్నాను -- పూర్వాంధ్ర సాహిత్యము నందు పద్యకవితయందు ఆసక్తి సడలిన నేటి పరిస్థితులలో వేయేండ్ల సంపదగా మన కబ్బిన ప్రాచీనాంధ్ర సాహిత్య వైభవమును పరిరక్షించి భవిష్యత్తునకు అందజేయు కర్తవ్యము నేడు మన యందున్నది.

అందులకే ఈ ప్రసన్న భారతి పత్రిక.

ప్రసిద్ధులయిన మహా పండితులు కవుల రచన లిందు వచ్చుచున్నవి. ప్రస్తుతము ఈ పత్రిక చాల ఆవశ్యకము. నేడు ఇట్టి పత్రిక తెలుగున మరియొకటి లేదు అని నలుమూలల నుండియు ప్రశంస లందుచున్నవి మనజాతి చరిత్ర సంస్కృతి విజ్ఞానము తెలిసి కొనుటకు ఋషికల్పులయిన మన పూర్వకవుల కావ్యములే మన కాధారము.

ఇది మన భాషాపత్రిక, మన అందరి పత్రిక. పిల్లలకు పెద్దలకూ ఎల్లకాలము పనికివచ్చే ఉత్తమ సాహిత్య పత్రిక ఇది. ఆంధ్రప్రజానీకము తమ ఉదార సహాయ మొసగి ఈ పత్రికకు సుస్థిరత్వము చేకూర్చగలరని నా విశ్వాసము.

A cl
30
894.8
5u
60-3

అమ్మా భారతి ! ఆంధ్రభాషకు మనోజ్ఞాలంకృతుల్ గూర్చు కా
వ్యమ్ముల్ వ్రాయు కవీంద్రు లుండి రెవరేవాదమ్ములన్ జేసినన్,
సమ్మాన్యంబగు సంప్రదాయకవితా సంధాన మీ నవ్యకా
వ్యమ్మేపారుత సాహితీమధుర సర్వస్వ ప్రతిష్ఠాంకమై.

శ్రీరామాంజనేయుల మహిమ.

భూమిని ధర్మపాలనకు బుట్టిన విష్ణువు రాము డాపరం
ధాముని దివ్యనామ జపతత్పరు డూర్జిత భక్తిభావుక
శ్రీమధుమూర్తి మారుతి; విశిష్ట చరిత్రులు వార లిర్వురున్
భూమి జనావన ప్రథిత పుణ్యమనస్కులు సద్యశస్కులున్.

ఏకడ రామగాథ వచియింతురొ ఆకడ హర్షబాష్పరే
ఖాకమనీయ భాసుర ముఖంబున మారుతి వచ్చి భక్తిభా
వాకలిత ప్రసన్న మధురాకృతితో నుపవిష్టుడై వినున్
ప్రాకట సర్వలోక పరిరక్షణదక్షము లా చరిత్రముల్.

రాముని జెప్పుచో సుగుణరమ్యుడు, సంతతరామకార్యదీ
క్షామతి రామతత్త్వ మధుసార పరిప్లుత యోగసాధనా
ధీమహిముండు వాయుసుతు దివ్యకథల్ సయితమ్ము విన్నదున్
కామిత సత్ఫలప్రద లగణ్య మహత్త్వ పటుత్వ రమ్యముల్.

అమలోదాత్తము లార్యసన్నుతులు దివ్యానందసంపత్సుధీ
విమల జ్ఞాన వివేకరంజితము లుద్వేలస్ఫురత్ సాహితీ
రమణీయమ్ములు వాయుసూనుని కథల్ రాజత్ ప్రభావాఢ్యవి
భ్రమసాకల్యము లౌచు కర్ణయుగళీ పర్వమ్ములై పొల్చెడిన్.

వదనసరోజమందు ప్రతిభాసముదారము బ్రహ్మతేజమున్,
సదమల వేదశాస్త్రచయసారము సర్వము వాక్కులందునన్,
బుధజనరక్షణైక మధుపూరము చల్లని చూపులందునన్
విదిత మహత్త్వ తోరముగ వెల్గెడి సుందరు డాంజనేయుడున్.

శ్రీకర రామనామ జపసిద్ధి ప్రసిద్ధిని గన్నమేటి, ము
ల్లోకములందు నింతటి బలుండిక లేడనిపించుకొన్న, సు
శ్లోకుడు, వేద శాస్త్రహిత సూక్తులెఱింగిన జ్ఞాని సర్వవి
ద్యాకమలాసనప్రతిము డా హనుమన్ నుతియింప శక్యమే. 20

హరి యవతార మారఘుకులామల రత్నము రామభద్రుడున్
హరునిమహాంశతో జనన మందిన ధీయుతు డాంజనేయుడున్
హరి హరు లిట్లు దైత్య దురితౌఘములన్ విదళించి ధర్మమున్
స్థిరముగ నుర్వి నిల్పిన విశేష దయామయ సద్గుణాన్వితుల్.

తలవని తలంపు నాదుచిత్తమ్మునందు
కలిగె నొకనాడు విద్యుద్వికాసమటుల
రామకార్య నిర్వహణ ధురంధరుడగు
వాయునందను చరితమ్ము వ్రాయు కోర్కె.

అంతట తప్తహేమ సముదంచిత సార మయూఖ మాలికా
క్రాంతము, బ్రహ్మ భావ విసర ప్రథమాన విదగ్రగణ్యధీ
మంతము, వజ్రవిద్ధహనుమంతము, ధ్యాన నిమీలి తార్ద్రనే
త్రాంత మొకండు నాదు కనులందున నిల్చిన దాంజనేయమై.

నేననుకొన్న రూపమహనీయత అద్భుత రీతి నీగతిన్
మేనున పుల్క లేచి, కలిమిన్ చెలిమిన్ విలసిల్లు చుండ నా
పూనిక తీర్ప గల్గు వెరవున్ వర మీయగ వేడినాడ నా
వానరరూపదేవుని అపార కృపారమణీయ భావునిన్.

ఎవని మహత్త్వగాథ రచియింపగ నెంచితి దీక్షనూని యా
పవనసుతుండె నాయెడల ప్రాపుగ నిల్చి రచింపజేయుతన్
ప్రవిమల సాధుశబ్ద రసవత్ పరిపూర్ణ మనోజ్ఞ వైఖరీ
వివిధ విశేష కావ్య పదవీ మృదురీతుల నీ ప్రబంధమున్.

మును పీపావని గాథ లెల్ల కవితా పుణ్యోదయుల్ వ్రాయలే
దని కాదీరచనమ్ము, నా హృదయ మందత్యంత సమ్మాన్యమై
హనుమద్దివ్య పదార్చ నానుభవ హర్షాధిక్య సంపత్తి కా
రణ మై వ్రాయగ జేసె నా కపివర ప్రజ్ఞా విశేషమ్ములన్.

ఒక భక్తుండని యందుమా, ఒక మహా యోగీంద్రుడే అందుమా
ఒక వీరాగ్రణి యందుమా, సుగుణ ధీరోదాత్తుడే యందుమా
ఒక వేదాంతియె యందుమా, సకల మీ యూహావధుల్ చాలవ
య్యకలం కోత్తమ సాధు సచ్చరితుడా హన్మంతు వర్ణింపగా.

ఆవాల్మీకి మొదల్ పురాణ రచనా వ్యాసంగ దీవ్యత్ సుధీ
శ్రీ విద్వన్మణు లెంద ఱెందఱో కవుల్ చిత్రించి రా రామగా
థావిన్యాసము అందు మారుతి చరిత్రన్ సూక్తి వైచిత్రి, నా
యావేశమ్ము రవంత యబ్బినను నాయత్నమ్ము సాఫల్యమౌ.

ఇనవం శాగ్రణి రామభూవరుని ముందేకాగ్ర చిత్తమ్మునన్
వినమత్ శీర్షుడు భక్తి బంధుర కళా విద్యోతి తాప్యాబ్జుడున్
జనితానంద నవాశ్రు నేత్ర [illegible] సౌందర్య సౌజన్యుడౌ
హనుమ ద్దేవుని [illegible] మోహనయు వొయ్యన్ చక్షురానందమై.

హనుమంతుండను నామ మందుగల దివ్యత్ప్రాభవం బెట్టిదో
మనమం [illegible] ణమ్ము నిల్చినను తన్మాహాత్మ్య ముద్వేల మై
తనరున్ భావము వందొకానొక మహోత్సాహమ్ము కార్యమ్ములం
[illegible] విమాత్ర శక్తిమయ ధైర్య స్ఫూర్తి చేకొత్తగా. 30

[illegible] విభావర సుందరాలయ
శ్రీ [illegible] ధరిత్రిని శ్రీరఘు [illegible]
[illegible] భక్తి [illegible] నాయుడు [illegible] మాత్మయుండె [illegible]
[illegible] రచించి వినయాత్ముడునై [illegible]

గణనకు మీఱు సద్గుణనికాయము సర్వము మూర్తి గొన్నటుల్
మనసున కంద బోని మహిమాన్వితమౌ నొక దివ్య తేజమౌ
హనుమడు, సాధువాద సుగుణాఢ్యుడు, స్వచ్ఛయశస్కుఁ డౌ మహా
త్ముని కెన గాన రారు విబుధోత్తము లైనను శీల సంపదన్.

చంపక మాలిక.

జననము నంది శంకరుని శక్తియు వాయు బలోగ్ర వేగముల్
తనవిగ, పిన్ననాడె హరిదశ్వుని పండని మింటి కేగుచున్
హనువున నిల్పగల్గి యమరాధిపు వజ్రము, వేదవిద్యలం
దనుపమ పాండితిన్ బడసి యర్కుని వద్ద, కపీంద్రు కొల్వులో-

అనుచరు డౌచు రామునికి నాప్తుడునై జనకాత్మజాప్తకై
వననిధి దాటి లంకకును వహ్నిరగిల్చి నిశాట కోటి కిం
దనభుజశక్తి జూపి, వసుధాసుతకున్ రఘురామమూర్తికిన్
మనములయందు శాంతిగొను మాటల తోడ మహాముదమ్ముగూ-

ర్చిన సుహృదాత్ముడై, సమర సీమను రామునికిన్ సహాయుడై
దనుజుల బట్టి కూల్చుచు మదమ్మున, లక్ష్మణు మూర్ఛదేల్చి, జ్ఞా
ననిధి ధరిత్రిజాతకడ నమ్రత మీఱగ రామ తత్త్వమం
దనితర సాధ్యమైన పరమార్థ రహస్య విధాన మెల్ల నే-

ర్చిన కపి పుంగవుండు చిరజీవియు భావి విరించి దేవుడై
అనిశము రామ మంత్రమధురామృత పాన వినోది తాత్ముడై
మనిన సమీర పుత్రు మహిమన్ బఠియించిన ఆలకించినన్
జనువిల సార్థకమ్మయి ప్రశస్త సమస్త సుఖమ్ములందెడిన్.

చేతులు మోడ్చి భక్తిమెయి జేరిన ఆర్తజనాలి కాత్మలన్
భీతిని మాన్పి, ధైర్యము లభింపగ జేసి, అభీష్ట సత్ఫల
ప్రీతి నొసంగి, మానసము శ్రీరఘురామ పదాంబు జార్చన
స్ఫీత మొనర్చు దివ్యగుణ శీలము లాహనుమద్విలాసముల్.

ఉత్పల మాలిక.

భూమికి భారమై అమరభూమికి కంటకు లైన దానవ
స్తోమము నుక్కడంచు పని తొందర సేయ వికుంఠ మందిర
స్వామి దయాళుడై మనుజ జన్మము దాల్చిన విష్ణు దేవుడా
రాముడు, సర్వసద్గుణుడు రాజిత సత్య పరాక్రమ క్రమో

ద్దామ గుణుండు, వేద నియతవ్రత దక్షుడు, ధర్మపాలన
శ్రీమహనీయ దీక్షితుడు, శీలిత మానవ ధర్మ నిష్ఠుడా
రాముని కొక్కపల్కి, ప్రమురవ్రత నిర్ణయ సత్య సంధుడా
రాముని దొక్కమాట, సమరప్రళయోగ్ర ధనుః ప్రచండుడా

రాముని దొక్కబాణము, విరాజిత నిత్యదయావిలాసవి
ద్యామహిముండు భూమి తనయా హృదయాంబుజ లోలు డాపరం
ధాముడు రామచంద్రునికి నమ్మిన బంటయి పాల్చు జ్ఞానతే
జోమహితాత్ము డా పవనజుం డిక నెంతటి వాడు కావలెన్. 40

ఆసామర్థ్యము లాసముద్రతరణోద్యత్సాహసమ్ముల్ రణ
వ్యాసంగోగ్రపటుత్వముల్ చతురదౌత్యారంభముల్ కార్యదీ
క్షాసంకల్పము లుత్తమాశయసదాచారప్రకాశమ్ము లై
యాసామీరికె చెల్లె; సర్వజనమాన్యస్వాదుగాథావళుల్.

శ్రీమద్విష్ణ్వవతారు డూర్జితదయార్ద్రీభూతచేతస్కు డా
రామక్ష్మాపతి స్వామియౌనట; ఉరుప్రజ్ఞామహోద్యద్గుణ
స్తోముం డంజనసూతి భృత్యుడట, సంస్తుత్యప్రభావైకదీ
క్షామర్యాదలు దివ్యబాంధవము లా స్వామిత్వ భృత్యత్వముల్.

ఎక్కడ పుట్టువుంగనియె, నెవ్వరిలాలనపెద్దయయ్యె తా
నెక్కడనేర్చె శాస్త్రములనెల్ల, మహాబలధైర్యసాహసం
బెక్కడనుండివచ్చె, భువి నీతని పూర్వ జనుఃఫలంబులై
దక్కెనుగాక మారుతికి; ధన్యగుణోజ్జ్వలపుణ్యమూర్తికిన్.

వరజన్మం డురు సాహసుండు, శ్రుతివిద్వద్వార్ధిపారంగతుం
డరిలోకప్రళయుండు, రామపదపూజాసక్తు డౌదాత్త్య స
చ్చరితుం డుత్తమకార్యదీక్షితు డుదంచద్బ్రహ్మతేజోమహో
ద్దురదీవ్యద్వదనాంబుజుండు,హనుమంతుం డన్న సామాన్యుడే.

మచ్చున కైన,సాధుగుణమాన్యుడు మారుతి జీవితమ్మునన్
మచ్చయటన్న దొక్కయణుమాత్రము గానని సర్వధర్మసం
పచ్చరితాత్ము డంజనతపఃఫలభాసురమూర్తి యాత, డా
యచ్చపు పుణ్యరాశి సము లౌదురె వేల్పు లెకొందఱేనియున్.

తలచుకొలంది రామవసుధావరుడేమి, సమీరసూనుడా
లలిత గుణాఢ్యుడేమి? విమలమ్ములు ధార్మిక మూలముల్ సుధీ
విలసిత వేదసూత్రపదవీసముదాత్తవిధమ్ము లాచరి
త్రలు శశితారకార్కముగ రాజిలు నెన్నియుగమ్ము లేగినన్.

వ్రాసినచో పవిత్రగుణభవ్యములైన ప్రజాప్రయోజనో
ద్భాసిత సచ్చరిత్రములె వ్రాయవలెన్; హనుమత్ప్రవర్తనా
భ్యాసములెల్లనీపగిదిభాగ్యములై పరమార్థమార్గవి
న్యాస వికాస యోగ్యములు నై విలసిల్లు జగద్ధితమ్ములై.

సరస సలక్షణమ్మును ప్రసన్న కథామధురార్థశబ్దసుం
దరమును సంప్రదాయనియతమ్మును వ్యాకృతిబద్ధవాక్యని
ర్భర మగు గ్రంథనిర్మితియు పైపయినున్నదె? కావ్యదృష్టితో
నరయు విపశ్చిదగ్రణుల కంతయొ యింతయొ తృప్తినీవలెన్.

కావ్యరచనా సంకల్పము.

హనుమత్స్తోత్రముపేర నొక్కశతకం బాసక్తితో వ్రాసినా
డను పూర్వ మ్మది పొందగల్గెను పొగడ్తల్ పెక్కు లర్థానితో
దనివింగానని భావతీవ్రత లెడందవ్ తొందరల్ సేయు తీ
ర్పున చేబూనితి విద్ది నాకొలదివేర్పుల్ కూర్పుతేర్పాటుగా.

అన్నామారుతి! నేనెవండను మహాత్మా! నిత్య సత్కార్యసం
పన్నం బైన భవచ్చరిత్ర లిఖియింపన్; నామనోవాంఛ లీ
సన్నాహంబులు సాధుశబ్దకవితాస్వారస్యపద్యక్రమం
బెన్నన్ నీపలికించు పల్కులివి గాదే పూర్ణవిద్యాకృతీ! 50

నాకున్ నీకథవ్రాయుకోర్కె హనుమంతా! జన్మసాఫల్యమా
ప్రాకామ్యమ్మను, రామకార్యమయి కన్పట్టున్ మహాకావ్యదీ
క్షాకర్తవ్యము సాగనిమ్మది వచశ్చాతుర్యసాహిత్యరే
ఖాకళ్యాణముగా భవత్కృపామధురవీక్షాశీః ప్రసాదమ్మగా.

పరమేష్ఠిముఖసరోవరహంసి వాణీకరాంభోజ కచ్ఛపీరవమధూాళి,
మాతృదేవీ దత్తమహితాశిషవిశేషలబ్ధ విద్యామహాలంబనమ్ము,
బాల్యవేళాభ్యస్త భాగవతపురాణ పద్యపారాయణ వ్రత ఫలమ్ము,
మద్గురుస్థానమ్ము మహితాంధ్ర సత్కావ్య వాసంతవనపుష్పపరిమళమ్ము,

ఏడుగడయును నాతోడునీడ గాగ
బాసటగనుండి హనుమత్ప్రబంధ మనెడి
నవ్యకావ్యనిర్మాణ యత్నమ్మునందు
నన్నునడిపించుగాత సన్మార్గమందు.

గౌతమీతటమున గజయానపాటవమ్మలరంగ నడచి నన్నయ్య నాడు,
తెలుగుపల్కుల తీయ తేనెసోనలజాలు లబ్ధియైపొంగి తిక్కన్ననాడు,
కవిసార్వభౌమత్వ కనకాభిషేక సన్మానమ్ము లంది శ్రీనాథునాడు,
మందార మకరంద మాధుర్య వాగ్ధార లమృతమ్ము గురిసి పోతన్ననాడు,

భువనవిజయవిహార వైభవములరసి,
ఆధునికకవిలోకభావాంబరముల
సాహితీచంద్రకళ నింపు శారదాంబ
చెలగి నటియించుగాక నాజిహ్వయందు.

అమ్మా॒భారతి!నేటిఆంధ్రుల కవిత్వాకాశమార్గమ్ములన్
గ్రమ్మెన్ కారుమొయిళ్ళు, కైతల కలంకారమ్ములై వెల్గు ఛం
దమ్ముల్ బంధములంచు నెంచి వెడవింతల్ బోవుచున్,గద్యవా
క్యమ్ముల్ కైతలటంచు వ్రాయుదురు కట్టా యెంత వ్యత్యాసమో!

అగణితసాధుశబ్ద మధురామృతధారలు తెల్గుపద్యపుం
బిగువు లెఱుంగలేక పరవిద్యలు తేలికయన్న వెఱ్ఱిలో
తెగబడి తెన్గుకైత, బలుతెన్నుల వ్రాయుచునుందు రిప్పుడీ
వగపులపాలుసేయక కృపన్ గను మీయెడ మమ్ముభారతీ.

పలుకుంబల్కున తేనెలూరు కవితాస్వారస్యముల్ నన్నయా
దులు సృష్టించిన సంప్రదాయములు ఛందోబద్ధపద్యోదయో
జ్జ్వలసాహిత్యము లీకవిత్వవిధముల్ వద్దంచు వాదించువా
రలమార్గమ్ములనాపి పద్యమునుసంరక్షింపు మోభారతీ.

ఇవి యేవోతలపుల్ మనమ్మున ముదమ్మిగల్గు నున్వెల్గులై
గవియన్ పూర్వమహాంధ్రసత్కవుల మార్గమ్ముల్ ప్రబోధమ్ములై
చవులూరించిన కావ్యగౌరవము లాజ్ఞాపించుసాహిత్యవై
భవమై యొప్పు నవప్రబంధముగ సంభావించి తీ గ్రంథమున్.

ఇదినాఆశయు ఆశయమ్మగును దేవీ!నీకృపాలోకనా
స్పద సంపన్మహిమమ్ముగాదె కవులున్ సాహిత్యవారాన్నిధిన్
సుధలం ద్రచ్చిన, క్ష్మాతలేశ్వరులుమెచ్చుల్ జూపినన్; దత్కృపా
మధులేశమ్మును నాపయిం జిలుకు మమ్మా చాలు, వాగీశ్వరీ! 60

కృతిపతి నిర్ణయము.

తనసర్వస్వము రామభూవిభుని పాదద్వంద్వ సం సేవకై
వినియోగించిన ధన్యజన్ముడు జగద్విఖ్యాతచారిత్రుడా
హనుమం డాతని స్వామినే కుతుక మేపారన్ కృతిస్వామిగా
వినతుల్‌జేసి యొసంగినాడ మృదుమాధ్వీరమ్య మీకావ్యమున్.

గారామొప్ప నలంకృతిప్రతతి గాన్కలేవెట్టి, ఈకావ్యక
న్యారత్నమ్మును నీకొసంగితిని రామా !నవ్యసాహిత్యవి
ద్యారాజ్యమ్మున కీమె రాజ్ఞియయి విద్యల్లోక మర్పించు ఆ
శీరమ్యోక్తుల పొందగావలె యశశ్శ్రీరోచిరభ్యున్నతుల్.

యశము సప్తసంతానమ్ములందు కృతికె
కృతికివస్తువు హనుమచ్చరిత్ర మయ్యె,
కృతిపతియు నయ్యె శ్రీరాము, డింతకంటె
భాగ్యసంపద లేమి గావలయు నాకు.

పరతత్త్వమ్మొక రాజమూర్తి, పరతత్త్వాద్యేతయై ధర్మపుం
దెరువుల్నేర్చిన పుణ్యమూర్తియొక; డీధీవర్యులస్మత్కవి
త్వరసాకల్పిత మీవిశిష్టకృతికిన్ బ్రాపై విరాజిల్లుటల్
పరమార్థమ్ము పురాజనుః ఫలసముద్భాగ్యమ్ముగా కన్యమే?

కృతిపతిరామచంద్రధరణీశుడు కోసలసింహపీఠమం
దతిశయ రాజ్యలక్ష్మియుతుడై కొలువుండినవేళ నంజనా
సుతుడు తదంఘ్రిపద్మయుగశోభల జూచుచునున్న దృశ్యమా
తతసకలప్రసిద్ధు లిడి తన్వునుగావుత మీప్రబంధమున్.

షష్ఠ్యంతములు.

రామునకును, వర్షాభ్ర
శ్యామున, కినవంశ సదమలార్ణవ రాకా
సోమున కసురాళిదళన
స్థేమున కరిభీమునకును శ్రీరామునకున్.

క్రతుసంరక్షణధృతికిని
ప్రతివీరార్భటహృతికిని బహుసత్కృతికిన్
వితరణగుణవిస్తృతికిని
శ్రితజన రక్షణమతికిని సీతాపతికిన్.

సురపూజితచరణునకును
నరవరకులభూషణునకు నయసుగుణునకున్
పరిరక్షితమునిగణునకు
స్థిరధర్మాచరణునకును శ్రితశరణునకున్.

ధీరున కాశ్రమధర్మవి
చారున కఖిలాగమపథ సంచారునకున్
వీరునకును కపిబలవి
స్తారున కఘదూరున కరిసంహారునకున్.

సుధికిని సమస్తసద్గుణ
నిధికిని మునిసన్నిధికిని నిజబలవిజితాం
బుధికిని నిరతదయాసే
వధికిని దాశరథికి బుధవరసన్నిధికిన్.

హనుమత్ సేవిత పదునకు
వినయవిశేషాస్పదునకు వేదవిదునకున్
జనగణ సంపత్ప్రదునకు
ఘనయుద్ధవిశారదునకు కపివరదునకున్.

ఇట్లుసంస్తుతించి.

చంద్రునకు నూలుపోగైనచంద, మెనయ,
పాలకడలికి జలకణప్రాయముగను,
రామచంద్రునిపాదనీరజములందు
ఈచిఱుతకబ్బ మెలమి నర్పించినాను. 72

శ్రీ హనుమత్ప్రబంధము

ప్రథమాశ్వాసము

శ్రీ సామీరి కరార్చిత
భాసుర చరణాభిరామ! బహుశుభనామా!
త్రాసిత దనుజస్తోమా
శ్రీసూర్య కులాబ్ధి సోమ సీతారామా!

అని శ్రీకరుడును కౌసల్యాకుమారుడును, సీతామనోహరుడును, హనుమత్సేవిత చరణాంబురుహుడును, దయాసాగరుడును కృతి పతియునగు శ్రీరామ చంద్రుని సంస్తుతించి, రామనామ చింత నామృతాస్వాద నానంద భావుడును, నిరుపమాన తేజస్స్వ రూపుడును, వరజన్ముండును, అజేయపరాక్రమ సమన్వితుడును, కార్య దీక్షా దక్షుడును, ఆంజనాదేవి పుత్రుడును, ఏతత్కథానాయకుడునగు ఆంజనేయుని సంభావించి దైవ చింతన తత్పరులైన బుధజను లెల్లరకు అభ్యుదయ పరంపరాభివృద్ధిగ నా యొనర్పం బూనిన హనుమత్ప్రబంధంబను గ్రంథమ్మునకు కథాక్రమం బెట్టి దనిన :

ప్రభాస తీర్థము.

శ్రీకరమయి, పశ్చిమర
త్నాకర తీర్థస్థలముల నతిసుందరమై
ప్రాకట బహువిధ మహిమో
త్రేకం బగుచును ప్రభాస తీర్థం బలరున్.

పన్నీటి వలిమించు మున్నీటి తుంపురుల్ చలువ వెన్నెలలతో చెలిమిసేయ రంగ దుత్తుంగ తరంగోత్కరశ్రేణి పర్వతాగ్రములతో పంతమాడ చలువంపు క్రొన్నుర్వు తెలివెల్గు చాయలు నింగి నీలిమలను భంగపఱుప, లోనున్న రత్నాంచి తానూన దీధితుల్ మార్తాండ కాంతికి మారుపలుక.

అమలకాంచన కమ్ర చూర్ణముల దెచ్చి
మేలిపడకల దీర్చిన లీల దనరు
లలిత సుస్నిగ్ధ సైకత స్థలులెసంగు
సరస సౌందర్య మచ్చటి సాగరమ్ము.

పావనమై ప్రవాహజల భాసురమై, సతతోర్మిపంక్తి కా
ప్లావిత భూమిభాగమయి, లాస్య విలాసములన్ సరస్వతీ
శైవలినీలలామ తన స్వామికి సాగరమూర్తి కచ్చటన్
సేవలు సేయుచుండు నిజశీతల శీకర చామరమ్ములన్.

పవనాహతిని లేచిపడునట్టి కెరటముల్ భాసుర లాస్య విభ్రమము దెలుప
వికసితనవపుష్పవితతి రాల్చురజమ్ము పునుగుజవ్వాదుల పూతగాగ
తరగయంచులనంటి పరువులెత్తెడి నుర్వు పెదవిపై చిరునవ్వు వెల్లులనగ
కలహంస శుకపికీ గాన నిస్వనములు చెలికత్తియల జిల్గుపలుకులనగ.

కలికి నడకల యొయ్యారములుకబోసి
కాంతునిం జేరబోయెడి కాంతయటుల
అంబునిధి జేరి కలసిన దా ప్రభాస
తీర్థ సీమలందు సరస్వతీ స్రవంతి.

విలసత్ స్వాదువులైన నీరముల తన్పెన్ మమ్మిటన్ సర్వవే
ళల నీవాహిని యంచు వందనము తెల్పంబోవుచున్నట్లుగా
ఫలభారానత వృక్షముల్ శిరములన్ వాల్చున్, మరు ద్వీచికా
చలితమ్ముల్ పువుతీవలున్ తలలువెల్చున్ వాల్చు నా యొడ్డులన్. 80

ఆడుచు బాడుచు బాలురు
కూడెద రావాహిని దరి కుతుకము మీఱన్
తోడయి యొక్కరి కొక్కరు
వేడుకగా చల్లనయిన వేళలయందున్.

ఆయేటియిసుక తీసుక
యే యేనుగుబోలు ప్రతిమొ యెలమిదలిర్పన్
జేయుచు నావెంటనె పడ
ద్రోయుదు రాయేన్గు నచటి తోయములందున్.

కంటిమిగద యొక యేనుగు
జంటన్ మన యడవి దారి సందుల; దానిన్
గెంటించి దునుమగలిగిన
బంటెవడాయని తలతురు బాలురు తమలో.

ఆ తీర్థం బగణితనా
నాతరు సుమసురభిళ పవనప్రకరాంచత్
ఖ్యాతిం గడుసుందరమై
చేతోముదమొసగు నచటి జీవులకెల్లన్.

మానిత వృక్షరాజమహిమమ్మయి పొల్చు ప్రభాస తీర్థశో
భానుభవప్రమోదభరి తాంతరు లౌచు, విలాస వృత్తి త
త్కానన సీమ గ్రుమ్మరుచు క్రమ ఫలమ్ముల తేనె లానుచున్
వానరముఖ్యులెందరో నివాసము సేయుదు రాస్థలమ్ములన్.

అంజన యన్న దోర్ధు కల దావనసుందర దేశవాసియౌ
కుంజరు డన్న వానరునకున్ గడుగూర్చిన ముద్దుబిడ్డ, ఆ
కంజదళాక్షి యౌవన వికస్వర దేహవిలాసముల్ మనో
రంజకమై మనమ్ములు గరంచును చూపరు లెల్లవారికిన్.

వనచరకన్య యన్న యొకవాక్యమెకాని తదీయ రూపమ
త్యనుపమ కాంతిసంయుత ముదాత్తమనోహర విభ్రమంబునై
కనులకు వింతగొల్ప, పనిగట్టుక భూమికి వచ్చె నీమె యే
యనిమిషకాంతయో యనుచు నాత్మలనూహయొనర్తురెల్లరున్.

పూర్వ జన్మమందు పుంజిక స్థలయను
దేవకాంత యొకతె దివినివీడి
శాప కారణమున జన్మించె భువిపయి
అంజన యను పేర కుంజరునకు.

బలయుతుడగు భర్తనుగొని
బలవంతుడయిన తనయుని బడయగనెపుడున్
గలలం గాంచుచు నంజన
తలపోయుచు నుండు దేవుదయ్యకై మదిలో.

తనసుత అందము నెఱిగియు
తనసుత మనమున తనరెడు తలపు లెఱిగియున్
వినుత బలుండగు నల్లుం
గనుగొన కుంజరు డెడంద గలగుచునుండెన్. 90

ఇది యిట్లుండ,

కేసరిమదపుటేన్గులజంపుట

ఆవారిధి తీరమునం
దావాహిని తటమునగల యటవీ ప్రాంతం
బేవేళన్ ఖగమృగముల
కావాసమ్మయి తనరు నతిభయదంబై.

గములారోహిత పర్వతాగ్రము లనేకస్వీయసంతానసం
గములున్ నైజముఖోద్గతారవ సమగ్ర స్ఫోటి తాశావిభా
గములై గ్రుమ్మరు నామహాటవి నసంఖ్యాకమ్ములై నిత్యమున్
చమరీ సింహ మదేభ భల్ల శరభీ శార్దూల ఖడ్గౌఘముల్.

మదమున బలిసిన సింగపు
గొదమల, చదలంట నెదుగు కుజములనైనన్
మొదలంట గూల్చి, నదియం
దెదురీతల నీదు నచటి యేమగుగువ్వల్.

తొలగవు సింగపుగములకు,
తలగించును గిరుల నయిన దంతాగ్రములన్,
మలగక నెదిరిని పైకొని
కలహింపగ జూచు నచటి కలభము లెల్లన్

ఏన్గుగున్నలె మన్ను మిన్నెఱుగనట్టి.
ప్రబల సాహస విస్ఫార పాటవాతి
రేకమున విహరింప విశృంఖలముగ,
పలుకశక్యమె మదగజమ్ములను గూర్చి.

మ.కో.

ఉక్కు మీఱిన దేహపాటవ మూర్జితమ్ముగ జూపుచున్
లెక్క సేయక తక్కు జంతుల లేశమున్ పటుఘీంకృతిన్
పెక్కు రీతుల బోవు నావన వీధులందున నేనుగుల్
ప్రక్కప్రక్కల నక్కి స్రుక్కగ ప్రాణి సంతతులన్నియున్.

ఒకనాడున్మద భావజృంభిత మహోహుంకార ఘీంకార సం
ప్రకటాభీల పటుప్రతాప బలదుర్వారమ్ములై యానదీ
నికటమ్మందలి యూరు మీద పడియెన్ నిర్నిద్రనిర్మూలనా
త్మకకార్యారభటిన్; జనుల్ వెఱగునొందన్ రెండువేదండముల్.

గిరులన్ గొమ్ములజిమ్ము, నుద్ధతమదక్రీడాపరత్వమ్మునన్
ధరణింద్రొక్కు రసాతలమ్మునకు, దిగ్దంతావళశ్రేణిపై
కరుగం జూచును పోరి, కత్యధికదర్పాటోప విస్ఫూర్తి నా
కరియుగ్మం బతివిక్రమక్రమసముగ్రస్ఫూర్తిసంరంభమై-

ప్రబలభయంకరమ్ము లనివార్యగతిం దిరుగాడుచున్నవై
శబలము శంఖమన్ మదగజమ్ములు రెండవి, మౌనివాటికా
నబడిన జాలు వేపరువునం జని యార్చును హోమవహ్నులన్
గబగబ తత్కుటీరముల కాళులద్రొక్కి యడంచి కూల్చుచున్-

పెరికినయూపముల్ విసరివేయును మారము దన్ని; నీరమున్
కరముననింపి తెచ్చి జడిగా విరజిమ్మును యాగకుండముం
దఱిమిఱిజేయు నాస్థలము, లచ్చటవాసముసేయు మౌనులున్
పరువులుబెట్టి యాశ్రమనివాసములన్ విడనాడిపోవగా. 100

అట్లు విహరించు నేస్గుల కడ్డుతగులు
వీరవరుల గానక భయవిహ్వలులయి
ప్రాణములు గుప్పిటం బట్టి పటురయమున
ఎల్లదెసలకు ప్రజలు పర్వెత్తుచుండ.

కుపితారుణముఖు డున్నత
విపులోరస్కుం డతిశయ వీరాకారుం
డపరిమిత స్థైర్యుం డొక
కపి వీరుం డచట కాలుకదపక నిలిచెన్.

దవుడన్ నొక్కిన చాలనట్టి బడుగీతం డెవ్వడీకోతి? దు
ర్వ్యవసాయంబున దారికడ్డముగ దానై వచ్చె నంచున్ మదో
ద్భవ కోపోద్ధత వారణద్వితయ ముద్దండోగ్ర హస్తమ్ములన్
ప్లవగోత్తంసుని మట్టుపెట్టుటకు నై పైపైకి రాబోవగా.

ఆవెరవున పైబడు దం
తావళముల తెన్నులరసి తత్కపియును తా
నావల కీవల కురుకుచు
నేవలనను పట్టుపడక యేపుగ ద్రుటిలో.

వాలము ద్రిప్పి లేచుచు నభస్థలిపై కపలీలగా నవో
ద్వేల జవాతిరేక పటుతీవ్రతరోత్కట వృత్తిదోప న
వ్యాలరి యేన్గుజంట పయి కద్భుత ధైర్యమెసంగ దూకెనా
భీల బలోగ్రు డాప్లవగ వీరు డకుంఠిత సాహసాత్ముడై-

కడు సూక్ష్మబుద్ధి యాకపి
అడరెడు కోపపు టుడుకున నాయేన్గులకే
యెడమీయక తడవీయక
వడివడిగా రాళ్ళు దెచ్చి పయి గుప్పించున్.

ఉరుకును కపి కరిశిరముల,
దొరకక లవమైన వాని తుండమ్ములకున్:
సరగున కపివరు చెఱగొన
కరులును తమచుట్టు తామె కదువడి దిరుగున్.

మనముల మునుకొను కినుకల
వనచరుడును వనగజములు పనవుచు పైపై
జనుచును తనువుల నెనడులు
గనుపడు దనుకను పెనగును కడకదలిర్పన్.

బలితపుటేన్గులు క్రిందై
బలహీనమ్మైన కోతి పైబడి మీదై
బల బలహీనము లచ్చట
తలక్రిందై కనుల బడియె తద్దయు వింతై -

గుండ్రాతి యిసుమును గుప్పిళ్ళతో దెచ్చి కనులలో జిమ్మును కడకనెగిరి,
ఒకదంతిదంతమ్ము నొగిపట్టి యెక్కి వేఱొకదంతిదంతమ్ము నూడబెరుకు,
ఒకతుండముం బట్టి ఉరియక మెలివెట్టి వేఱొక్క దానితో బిగియ గట్టు,
ఒకదంతితోక వేఱొకదంతి తోకతో ముడివీడకుండంగ ముడిచి కట్టు,

పట్టుబడక మొండి పంతమ్ముతో కోతి
యొకటె చేయు వింతయుద్ధమునకు
బింకమిగిరిపోయి బెగడొంది వగజెందు
రెండు గజములకును గుండెలగిలె.

తోదకము

అందని యాకపి యారడి బెట్టన్
బందములన్ బడి బాధల లోనై
చిందులు ద్రొక్కుచు చేష్టలుదూలన్
క్రిందబడెన్ వడి రెండుగజమ్ముల్-

దుర్దాంతోరు బలాఢ్యు డాప్లవగ యోధుండొక్కడున్ విస్ఫురత్
దోర్దర్పమ్మున మోసితెచ్చి గిరులందున్ గల్గు పాషాణముల్
నిర్దాక్షిణ్య గుణప్రవృద్ధ బలవన్నిర్భిద్ర కోపోగ్రుడై
మర్దించెన్ పెనుప్రోవులై పడగ యామత్తేభ మాంసాస్థికల్.

రాజిత సద్గుణాఢ్యు డవిరామ తపోవ్రత నిష్ఠుడౌ భర
ద్వాజుడ టన్నమౌని, మదవారణయుగ్మము నట్లు సాహసో
త్తేజితు డైన యాకపి వధించిన యద్భుత మెల్లజూచి చే
తోజనిత ప్రమోదభరితుండయి యాతని కౌగిలించుచున్-

వాసిగ నీవొకండె మదవారణ యుగ్మము నిట్లనంత బా
హాసముదీర్ణశక్తి దునుమాడిన సింహ బలోగ్ర మూర్తివో
కీశకులాగ్రగణ్య, ఘనకీర్తిని పొందుమటంచు వానికిన్
కేసరి యన్న నామమిడి, కేలున వానిబుజమ్ము దట్టుచున్.

ఈవనసీమ కెల్లను కరీంద్రభయ మ్మెడబాపి నాడ వే
దే, వరమొండు త్వాదృశుల కిచ్చుట మాకొక గొప్పకాదు నీ
భావము నందెదేని గల వాంఛను దెల్పు మనంగ నామహీ
దేవునకున్ నమస్కృతులు దీర్చుచు కేసరి నమ్రవాక్కులన్.

నిరుపమ సత్త్వుడు విద్యా
పరమేష్ఠియు భక్తుడు నగు వానిన్ సుతుగా
వర మీయుండని వేడగ
దరహాసమ్మున మునియును తథ్యమ్మనియెన్.

అతిభయోత్పాత వైపరీత్యమ్ము లడర
వారణము లట్టు లూరిపై బడుట జూచి
పారిపోయిన ప్లవగు లే పర్వతంపు
కొమ్మునందునొ యే చెట్టు కొసనొ డాగి-

ఒంటరిగ పోరి వన్యేభయుగము నచట
మట్టుపెట్టిన కపివీరు మహితశౌర్య
సాహసమ్ముల కలరుచు సంభ్రమమున
పరువులెత్తుచు వచ్చి కేసరిని జేరి -

ఈనా డింతటివాడు మానడుమ జన్మించెన్, భవిష్యమ్ము నం
దేనాడెవ్వరు చూడనట్టి ప్రముఖుం డేయొక్కడో పుట్టు నం
చానందమ్మున కేసరిన్ పొగడి యాప్రాంతమ్ము లూరేగి ర
వ్వానిన్ వారిబుజాల మోసికొని దీప్తస్వాంతు లవ్వానరుల్. 130

అంజనాకేసరుల వివాహము

కుతుకము హెచ్చె, కేసరిని కుంజరుడాయెడ జూచినంతనే;
అతిశయ శౌర్య సాహస సమన్వితు డాతని నల్లువానిగా
మతిదలపోసి, యంజనకు మానసమేగతి వానియందు సం
గతమగు నో యటంచు దనకామితసిద్ధికి నచ్చుటచ్చుటన్.

నలువురిముందును కేసరి
బలసాహసవిక్రమమును భవ్యాకృతియున్
పలుకుచు, నల్లన నంజన
చెలులకు నెఱిగించు తనదు చిత్తమునతడున్.

వినినది మున్నె కేసరి
తనుదార్ఢ్య, మ్మాకపివరు దనముద మారన్
గనినది నేడంజన మే
నున నును పుల్కలు వొడమగ నూతనవాంఛన్-

శ్రీ రామాయనమః

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము అయిదు ఆశ్వాసముల పద్య కావ్యము

సముద్రలంఘనము నుండి శ్రీరామ పట్టాభిషేకము వరకు

శ్రీహనుమంతుని చరిత్రము.

రచన

"కవిశేఖర" "భారతీప్రసన్న"

కొండేపూడి సుబ్బారావు

'ప్రసన్న భారతి' గ్రంథమాలా ప్రచురణ

47-10-5, ద్వారకానగర్, విశాఖపట్టణము - 530016

ఇండియా

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము

విషయసూచిక **పుటలు**

భూమిక

శ్రీ హనుమత్ప్రబంధము రెండవ భాగము ఇది. సముద్ర లంఘనము నుండి శ్రీ రామపట్టాభిషేకము వరకు గల కథ యిందున్నది : పూర్వ కథ మొదటి భాగములోనున్నది- మూడవ భాగములో హనుమంతుని మహిమను గూర్చిన కథలు కొన్ని ఉన్నవి. క్రూర రాక్షసులను శిక్షించి ధర్మసంస్థాపన కొఱకు ధరణికి వచ్చిన శ్రీరామునికి సహాయార్థము వచ్చిన శివస్వరూపమే హనుమంతుడు. అధర్మమునణచుటకు ఆనాడంతటి శక్తి కావలసి వచ్చినది.

ఆంజనేయుడు భారతీయు లెల్లరకు ఆరాధ్య దైవము. ఆంధ్రులకు అభిమాన దేవతామూర్తి. ఈశ్వరాంశతో అంజనావాయువులకు జన్మించిన వరపుత్రుడు. సర్వదేవతామూర్తి, త్రిమూర్త్యాత్మకుడు, సర్వజన రక్షకుడు, అభయప్రదాత అని ఆ మహనీయుని ఎన్నియోరీతుల కీర్తింతురు ''ఆంజనేయ ''హనుమ'' అను నామములలో పరమాత్మ తత్త్వప్రకాశము కలదనియు ప్రతీతి. ఆయన చిరజీవి, భవిష్యద్బ్రహ్మ గూడ.

ఆంధ్రదేశములో ఎంత కుగ్రామమైనను నాలుగు బాటలు కలియుకూడలిలో ఉన్నతముగు ఆంజనేయ విగ్రహమును నిలిపి పూజలు సేయుదురు. అందరికిని అందుబాటులో నున్న దైవస్వరూపము హనుమంతుడు. ఆరూపమునందున్న ఆకర్షణ, మహిమ అట్టివి. ఆ దేవునికున్న గుణ గణములా! మఱియెక్కడను లేవని అనిపించును. నిరుపమాన ధైర్య బలసాహసములు వేదశాస్త్ర విద్యాభ్యాసము గురుభక్తి కార్యదీక్ష రాజనీతి ధుర్యత బ్రహ్మచర్యము మహాశౌర్యము పరోపకారము; మీదు మిక్కిలి ఆయన ప్రవర్తనయందు వ్రేలెత్తి చూపుటకు ఒక అణువైన దోషము కన్పింపని పవిత్రవర్తనుడు. మన దేవతావ్యవస్థలో ఒక విశిష్టరూపము ఆంజనేయుడు. అందుచేతనే విష్ణ్వంశసంభూతుడగు శ్రీరామునికి నమ్మిన వాడయినాడు. హనుమంతుని రామభక్తి అపారము. ఆయన జీవితము సర్వము రామమయము. శైవవైష్ణవ మాధ్వత్రిమతానుయాయులకు సమముగ ఆరాధనీయుడు హనుమంతుడు.

పుణ్యమూర్తులను స్మరించుట వారి చరిత్రములను వినుట చదువుట మనోవికాసము కలిగించి హృదయ నైర్మల్యము నొసగును. ఇందులకే మన జాతిలో ఆచారముగ వచ్చుచున్న పురాణ పారాయణము పురాణ శ్రవణము హరికథలు మున్నగునవి. వానరుడై జన్మించిన నేమి అన్ని విధముల దేవతలకన్న మిన్నయయిన దివ్య ప్రభావుడు ఆంజనేయుడు. కనుకనే విఘ్నేశ్వరునితో ప్రారంభించిన నిత్యదైవ ప్రార్థనలను ఆంజనేయుని స్తుతించిగాని పూర్తి చేయము. రాత్రులందు నిదురకు పోవుముందు హనుమంతుని స్మరింతుము. హనుమత్ స్తుతి సకలభయనివారకము, సకల ప్రయత్న విజయసాధకము. ఆదేవునిగుణములు, ఎన్నియుగములు చెల్లినను సమాజమునకాదర్శప్రాయములు శ్రేయోదాయకములయి విలసిల్లు చున్నవి. మఱియెన్ని యుగములైనను ఇట్లే విలసిల్లును.

ఈ యీ కారణములే ఈ హనుమత్ప్రబంధ కావ్యరచనకు నన్ను ప్రేరేపించినవి.

హనుమంతుని చరిత్ర విశేషములు అటునటునున్నవి సేకరించి వ్రాసితిని. శ్రీరాముని పట్టాభిషేకము వరకు హనుమంతుని చరితము ప్రథమ, ద్వితీయ భాగములలో నున్నది. సీతాదేవి యొద్ద హనుమంతుని ఆధ్యాత్మిక తత్త్వచర్చ, హనుమంతుడు చూపిన మహిమలు మూడవ భాగమున వచ్చును. ఈ కథలు చాలవరకు పరాశర సంహిత యందున్నవి. నిస్స్వార్థులయిన పూర్వమహాఋషులిట్లు మహనీయుల చరిత్రములను మానవ శ్రేయమునకై వ్రాసినవి కోకొల్లలు. నిజమునకు మన పురాణములన్నియు ఇహ పర పరమార్థప్రదములు జగద్ధితములు. పాశ్చాత్య నాగరికతా ప్రభావమున పడిన మన ఆధునికు లీసత్యమును గ్రహింపగలరని నా విశ్వాసము.

సర్వవిధముల ప్రయోజన ప్రదమగు శ్రీ ఆంజనేయుని చరిత్రము మనోరంజకముగ కావ్యరూపమున ఆంధ్రుల కందజేయనలయునను తలంపుతో ప్రారంభించిన కావ్యమిది. రెండు గ్రంథములు ఒకదాని వెనుక ఒకటి వ్రాయుచున్నప్పుడు పూర్తియయిన తర్వాతను పెద్దలకు విన్పించితిని. వారి ఆమోదము లభించినది. ప్రథమ భాగమునకు సమీక్ష ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు వ్రాసిరి. ఈ రెండవ భాగమునకు ఆచార్య కె. మలయవాసిని గారు వ్రాసిన సమీక్షయు వేదాంత ప్రవచన శిరోమణి శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి వ్రాసిన భక్తి నివేదనము అను చక్కని వ్యాఖ్య లిందున్నవి. పెక్కు మంది విద్వత్కవులు వ్రాసినవి, పత్రికా సమీక్షలు, ప్రశంసలు కూడ వచ్చినవి. ఈ సాహితీ మూర్తులెల్లరకు నా హృదయపూర్వక వందనములు.

కలియుగ దైవము, సప్తగిరి సార్వభౌముడు ఆశ్రిత వత్సలుడు అగు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ధన సహాయము ఈ గ్రంథ ముద్రణకు లభించినది. ఆ స్వామికి ఆ దేవస్థాన అధికారులకు నా కృతజ్ఞతాభివందనములు.

మఱియొక మాట : నా సాహిత్య రచనలన్నింటికి తగిన ప్రోత్సాహము మొదటి నుండి ఇచ్చుచు, వ్రాత ప్రతులను చదువుచు ప్రూఫులు దిద్దుచు ఈ హనుమత్ప్రబంధ కావ్యమునకు ప్రత్యేక ఆదరణ చూపిన మా అమ్మాయి చి ॥ సౌ ॥ విద్యావతి, మా అల్లుడు చి॥ ఆదూరి భీమారావులకు శ్రీ హనుమత్కృప వలన సకలైశ్వర్య సంపదలు శతాయురున్నతులు కలుగవలెనని నా ఆశీస్సులు.


అంకితము

నిరంతర రామనామ జపధ్యాన తత్పరుడైన హనుమంతుడు తన సర్వస్వము శ్రీరామచంద్రునకు అర్పించి చరితార్థుడైనాడు. హనుమంతుని చరిత్రయగు ఈ కావ్యమును గూడ సర్వలోక శరణ్యుడు భక్తజనమందారుడునగు శ్రీరామచంద్రుని చరణకమలముల యందు భక్తి వినమ్రుడనై సమర్పించుకొను చున్నాను.

ఇతఃపూర్వము నా గ్రంథముల నాదరించి నట్లుగనే ఈ నూతన కావ్యము శ్రీ హనుమత్ప్రబంధమును ఆంధ్రప్రజానీకము ఆదరించి శ్రీ హనుమత్కృపనందగలరని నా విశ్వాసము.

గ్రంథకర్త

ఆశీస్సులు



మా అల్లుడు
చి॥ ఆదూరి భీమారావు
C.A.O., S.E.Rly. (Retd.)

మా అమ్మాయి
చి॥ సౌ॥ విద్యావతి M.A.,

సమధిక భక్తి తత్పరులు సంస్తుత శీల విరాజితాత్ములున్
విమల గృహస్థ ధర్మ పదవీమృదు వర్తనులుర్వి రెండు వం
శములకుఁ బేరు దెచ్చిన ప్రశస్త చరిత్రులు వీరలిర్వు రు
త్తమ బహుకీర్తి భాగ్య సముదాత్తులునై విలసిల్లుగావుతన్.

మనుమలు మన్మరాండ్రు తమ మధ్యగ చెల్వగు నాటపాటలన్
దనియఁగఁ జేయు సంతసమునన్ జిరకాలము దన్కవారి వ
ర్ధన మహితోన్నతోదయ పరంపరలన్ గను భాగ్యవంతులై
మనుదురు గాత వీరు హనుమంతుని దివ్యకృపాభిరక్షలన్.

9-10-98

కొండేపూడి సుబ్బారావు
గ్రంథకర్త

భక్తి నివేదనము

''ప్రవచన శిరోమణి'' శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్య స్వామి

హనుమ సేవాభావములో భక్తి భావములో దౌత్యములో మంత్రణములో చారకృత్యములో కుశలుడు. బుద్ధి, తేజస్సు, పరాక్రమము, పౌరుషము ఆతని యందు పరిపూర్ణముగా నిండియుండును. శ్రీరామోపాసనకంటె హనుమదుపాసనము సకలకార్యఫలప్రదము. హనుమను ఉపాసించిననే శ్రీరామానుగ్రహము లభించును. హనుమ మంత్ర స్వరూపుడు, గురు స్వరూపుడు. చనిపోయిన వారిని బ్రతికించు సంజీవినిని ఒసంగినవాడు. హనుమ జీవించియుంటే అందరమూ జీవించియున్నట్లు ఆతడు లేనిచో బ్రతికియున్ననూ అందరమూ లేనివారమే అనినాడు జాంబవంతుడు. అట్టి హనుమను ఉపాసించిన ధన్యులు శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు.

శ్రీ సుబ్బారావుగారు లౌకిక జీవితము నుండి విశ్రాంతులైన తరువాత ఆధ్యాత్మిక జీవనమునకే తన మనసును, వాక్కును వినియోగించు చున్నారు. వాగ్దేవీ విశేషానుగ్రహ పాత్రులై సహజమగు వాగ్వైభవమును అందినారు. బహుగ్రంథ నిర్మాతలు. హనుమను స్మరించినంతనే పరవశించి ఒడలు మరచెడి స్వభావము వారిది. పద్య కవితా ప్రక్రియ యందు వారు సిద్ధహస్తులు వారు రచించిన గ్రంథములన్నియూ భగవదర్పణముగా రచింపబడినవే. ప్రాచీన పద్య కవితా స్రవంతి ఇంకిపోకుండ ఆంధ్ర పాఠక హృదయ క్షేత్రములో ప్రవహించవలెనని దీక్షపూని వారి సర్వస్వమునూ అర్పించి ప్రసన్న భారతి అను ఒక పత్రికను స్థాపించినారు. సారస్వత పత్రికలు నడిపించుట చాల కష్టము. అందులోను ఒకే వ్యక్తి సంపాదకులుగా, నిర్వాహకులుగా పద్య కవితా ప్రస్థానమును దేశములో వ్యాపింపజేయ సమకట్టినారు. వారి దీక్షకు హనుమ అండగా నిలచి నిరంతరాయముగా సాగించుచున్నాడు.

ఎన్నో ప్రబంధములను రచించి హనుమ యందు వారికి గల నిరతిశయమగు భక్తిచే హనుమత్ప్రబంధమును వ్రాయ సమకట్టినారు. శ్రీరామాయణము ననుసరించి హనుమ దివ్య చరితమును వారిందు

నిబంధించినారు. ఇది ఒక అపూర్వమైన గ్రంథము. ఇది రెండు భాగములు. మొదటి భాగము ఇంతకు ముందు వెలువడినది. ఇపుడు రెండవ భాగము ఆవిష్కరణము జరుగునున్నది. సీతాదేవి హనుమను ''త్వమస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణమ్ '' అని హనుమా! నీవే నా కార్యమును నెరవేర్చుటలో సమర్థుడవని అర్థించినది. నీవు ప్రయత్నించి నా దుఃఖమును పోగొట్టుము. నీ ప్రయత్నము వలన శ్రీరాముడు నా విషయమున ప్రవర్తించి నన్ను పొందుటకు యత్నించునట్లు చేయుము అని అర్థించినది . లక్ష్మీ స్వరూపిణియై భగవానుడు అగు శ్రీరామునితో అనన్యయై ఒప్పెడి తల్లికూడ హనుమనే ఆశ్రయించి తన కార్యమును సాధింప పూనుకొనినది. దానినే ఆ దర్శముగా తీసుకొని శ్రీ సుబ్బారావుగారు కూడా హనుమనే ఆశ్రయించి తన కార్యమును సిద్ధింపచేయ ఉద్యమించినారు. వీరి భక్తి అనన్య సామాన్యము. వీరి కవన చాతురి సహృదయ సమాదరణీయము. అనర్గళమైన ధారతో, లలిత పదప్రయోగముతో మధురాతి మధురముగా వ్రాయగల సమర్థులు వీరు. ఈ హనుమత్ప్రబంధము ప్రాచీనాంధ్రప్రబంధ పద్ధతిని వ్రాయబడుట వీరి ప్రత్యేకత-

వీరు రచించిన హనుమత్ప్రబంధమును సహృదయ ఆంధ్ర పాఠకలోకము మనసార చదివి ఆనందించి తరించునట్లు శ్రీసీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేతుడగు శ్రీరామచంద్రుడు అనుగ్రహించుగాక. వీరు దీర్ఘాయురారోగ్యములతో ఆంధ్ర కవితా సరస్వతిని తమ కృతి పుష్పములతో ఆరాధించి ధన్యులగుదురు గాక.

హనుమత్ప్రబంధ కవితా సౌగంధ్యము

ఆచార్య.కె.మలయ వాసిని. M.A.,Ph.D
తెలుగు విభాగము ఆంధ్ర విశ్వకళా
పరిషత్తు

మారుతి సత్కథా గ్రథన మంజుల కావ్య కృషీవలులైన మధురకవి శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు హనుమత్ప్రబంధ ద్వితీయ భాగాన్ని కూడా భక్తితత్పరులై పూజాదామంగా కూర్చి హనుమంతుని చేతుల మీదుగా రామాంకితము చేసిన ధన్యులు.

''చెప్పిన రామచంద్రు కథ చెప్పకొనున్ జగమెల్ల బ్రీతితో
నెప్పటి కప్పుడే యెడదకింపుగ తీయము లూరు వాచవిన్.

అన్నమాటలు ఎప్పటికీ అక్షరసత్యాలు. రామచంద్రు కథ అంటే హనుమన్న కథే; హనుమన్న లేకపోతే సీతాపహరణం తరువాత కథకు ప్రాణమే లేదు. సీతాన్వేషణ తత్పరుడు హనుమ సముద్రలంఘనం చేయడంతో ఆరంభమై శ్రీరామ పట్టాభిషేక సంరంభంతో ముగుస్తుంది ఈ రచన. ఆంజనేయుని పంచముఖాలవలె అయిదు ఆశ్వాసాలుగా విభజింపబడింది. సముద్రలంఘనం, లంకాప్రవేశం, సీతాదర్శనం, లంకాదహనం, రామపట్టాభిషేకం ప్రధానాంశాలు ఈ ఆశ్వాసాలలో. దీనికి పూర్వ కథ హనుమ జననము నుండి సముద్రలంఘనోద్యుక్తుడగు వరకు గల ప్రథమభాగము ఇటీవలనే వెలువడి కవిపండితుల మన్నన లందుకొన్నది-

సంప్రదాయాంధ్ర కవితారీతులలో పెరిగిన కవిచంద్రులు శ్రీ సుబ్బారావుగారు. బహుగ్రంథ కర్తలు. 'ప్రసన్న భారతి సాహిత్య పత్రిక వ్యవస్థాపక సంపాదకులుగా ఆంధ్ర సాహితీ లోకమునకు చిరపరిచితులు- వర్ణనానిపుణః కవిః అనే ఆలంకారోక్తికి నిదర్శనంగా వీరి కవితలో కథా సందర్భం, వర్ణనలు ఒకదానికి ఒకటి పరిపోషకంగా సాగి వారి కవితా ప్రౌఢిని పట్టియిచ్చేవిగా ఉంటాయి.

సముద్రలంఘ నోద్యుక్తుడైన హనుమ-

''ప్రాచీసుందరశైలపీఠిహరిదశ్వ స్యందనారూఢుడై
ద్యో చక్రమ్ముఁబరిభ్రమింప నినుఁడుద్యోగించు చందంబునన్
తో చాడట ''. అంతే కాదు, ఆ హనుమన్మూర్తిని గాంచి సముద్రం భీతిల్లినదని చేసిన హేతూత్ప్రేక్ష-

''తనువున్ తాళతరు ప్రమాణముగ నుద్దండించినిల్చిన ''-

''హనుమన్మూర్తిని గాంచి సాగరము సర్వాంగంబులన్ భీతితో
వణకన్ సొగెడి రీతి నుండె నిచలత్ భంగోత్కర శ్రేణులన్.

ప్రథమ భాగంలో తన పుత్రుడు, శిష్యుడు-సుగ్రీవ హనుమంతుల మైత్రిని వర్ణించే సందర్భంలో వారి మైత్రివలె-మధ్యాహ్నార్కుడు ప్రకాశించాడని వర్ణించిన కొండేపూడి వారు-ఈ భాగంలో సముద్రలంఘనం చేస్తున్న హనుమకు శ్రమ లేకుండా చేయడానికి సూర్యుడు, వాయువు చేసిన ప్రయాత్నాన్ని పరమ రమ్యంగా వర్ణించారు ''.తన శిష్యుండిటు లెండలం బడుచు సంతాపించుటల్ జూచి యయ్యినుడున్ మబ్బుల చాటునంజని శ్రమంబోగెన్; సుతుందన్ని నయ్య నిలుండున్ శిశిరోర్మికల్ నెఱపి మార్గాయా సముల్ పోవగా దనరున్ బిన్నల యందు నిట్లె కద పెద్దల్ చూపు వాత్సల్యముల్ ''. అంటూ చేసిన అర్థాంతరన్యాస విన్యాసం ఆత్మకింపయి నట్టిది.

ఉపమలు ఎన్నుకోవడంలో కవి ఉపజ్ఞ వెల్లడవుతుంది. పటువీర విక్రమ కళాధుర్యోరు తేజస్విమైన హనుమంతుని పరాక్రమాన్ని వర్ణించే సందర్భంలో త్రివిక్రముని తోడి సామ్యం ఎంత చక్కగా అమరింది.

'బలిబలమ్ము హరింపగ వామనుడు త్రి
విక్రమస్ఫూర్తినందిన విధముతోప
పటుతరోగ్ర రూపమ్మున వనధి దాటి
మరల నిజరూపమును తాల్చె మారుతియును

అశోకవనం నిత్యవసంతంతో అలరారుతూ ఉంటుంది. ఆ వసంత శోభను లలిత పద భావజాలంతో వర్ణించి మదిని ఉయ్యాల లూగించిన నేర్పు వీరిది.

''అలసాయాత సమిర వీచికలు, రమ్యారామ కేళీస్థలుల్,
పులుగుం బాటలు, తీయతావులును, పూవుందేని యల్, తమ్మిపూ
కొలనుల్, పుప్పొడి బాటలున్ పురమునం గ్రొంగొత్తలై యెల్లవే
ళల సొంపుల్ దొనకున్ వసంతదినలీలాలోలరమ్యమ్ములై.

సుందరకాండలో వాల్మీకి చంద్రోదయ వర్ణన ప్రత్యేకం ఒక సర్గలో చేసాడు. చంద్రుడు చంద్రిక కవులను ఉత్తేజ పరచేవి. ఆనాటి ఆ వెన్నెల కంత ప్రాముఖ్యం కథలో. శ్రీ కొండేపూడి వారి కవితా హృదయం కూడా చంద్రోదయంతో ఉప్పొంగి ఉత్ప్రేక్షా వల్లభులుగా చేసింది.

''అవని జాన్వేషణ మ్మనుకూల మగునట్లు
సురలు వెల్గించిన జ్యోతియనగ
శ్రీ కళా దీప్తమౌ సీతాముఖద్యుతి
వానరాగ్రణి కానవాలు గాగ

మథిత పయోరాశి మథన వేళోద్భూత
కమనీయ మధుసుధా కలశమనగ
ఆకాశ నందుండి హనుమ కాశీస్సులం
జలుపు శ్రీరాము తేజమ్మనంగ-

శ్రీ రాముని తేజమ్మనంగా చంద్రుడు ప్రకాశించాడు. శ్రీ రామచంద్రుడు కదా. హనుమకు ఆశీస్సులు అందించడంలో ఆశ్చర్య మేముంది. ఆ వెన్నెల కిరణాల లోలంక మల్లెపూదెరల మధ్యస్థమైయున్నదంటూ భావించారు. ఆ పద్యంలో చంద్రుని గూర్చిన మఱొక వర్ణన వాల్మీకమే- నీలాల నింగిలో వెలుగుతున్న చంద్రుడు క్రిందనున్న నిర్మల జలసరస్సులో ఉన్న హంసవలె ఉన్నాడని-
ఆ అర్థంలో ఉన్న వీరి మనోహరమైన పద్యం చూడండి-

''నీలాకాశ విశాల మార్గముల చాంద్రీ రమ్యరమ్యోత్సవ
శ్రీ లావణ్యము లార వోయుచును పొల్చెన్, నిర్మలాం భస్సరః
కేళీ సుందర రాజ హంసమను భంగిన్, చంద్రు డౌజ్జ్వల్యరే
ఖాలీలాకృతి మల్లెపూదెరల లంకన్ గప్పుచున్నట్లుగన్ ''.

అశోక వృక్షం క్రింద సీతాదేవిని చూసి హనుమ- ఆమెస్థితిని బట్టి ఆమెయె సీత గావలెన్ అనే కరుణార్ద్ర భావన పరంపరలతో మూడు పద్యాలు కూర్చారు. హనుమ దర్శించిన సీతా స్వరూపం మాలోపమలో రూపు కట్టించారు.

'సలలితాలంకార శబ్దార్థ మాధురీ
కమనీయతలు లేని కవిత యట్లు,
తారకాతతియును తారకాపతి లేని
చదలున నైల్యమ్ము గదిసినట్లు,
కడలేని దుఃఖమ్ము కన్నీటి కడలియై
పొంగెత్తి మొగమును ముంచినట్లు,
సందియం బుడివోని శాస్త్రార్థములయట్లు
పొగలుగ్రమ్మిన నిప్పుసెగల రీతి,
ముండ్ల మధ్యఁ జిక్కిన నునుఁ బూవువోలె
దీనమానసయై పరాధీన యగుచు
తులువలై చరించెడుగ రాసులకు మధ్య
కానుపించిన దామె యాకార మచట.

రావణుడు అర్ధ రాత్రి సీతను చూడడానికి వచ్చిన సందర్భంలో హనుమ చెట్టు మీద 'కనపడకుండడాగి విహగమ్మయి అనే కల్పనతో పాటు సులోచన, కాలనేమి

ఎంటి అవాల్మీక వృత్తాంతాలను కూడా ఈ రచనలో కూర్చారు సుబ్బారావుగారు.

ఇంద్రజిత్తు రణరంగంలో నిహతుడైన సందర్భంలో మండోదరి పుత్ర శోకాకులయ్యే కూడా అత్తగా కోడలైన సులోచనను ఒడిలో చేర్చుకొని ఓదార్చిన ఘట్టం కరుణ రస నిర్భరంగా తీర్చారు.

పాత్ర చిత్రణలలో కొండేపూడి వారిది అతి సుకుమారమయిన పద్ధతి. మనస్సుకు సంబంధించిన మానవ సంబంధాలను వర్ణించే తీరు చిత్తాకర్షకంగా ఉంటుంది. తన బుద్ధికి తననే నిందించుకునే సీత

''కొంచెపు బుద్ధి రామనృపకుంజరు గోరితి పైడిలేడి తె
మ్మంచును, పల్కరాని నుడులాడుచు నీసున సర్వ సద్గుణా
భ్యంచిత మూర్తి లక్ష్మణుని బంపితి నాతని వెంట; నన్నునే
వంచనఁ జేసి కొన్నది విపర్యయ మూరక బోవునే తుదిన్.

తన సంగతి సరే-రామమూర్తికి ఇప్పుడు 'లక్ష్మణుండొక్కడె సేయ వలయున్ బరిచర్యలు అని దిగులు పడుతుంది ఆ సాధ్వి.

తన భుజాల మీద యెక్కి వస్తే సముద్రం దాటించి తీసుకు వెళ్ళి రాముని చెంత చేరుస్తానన్న హనుమతో-సీత

'జనకుని యజ్ఞవాటికను జన్మమునుంగని, కోసలావనీం
ద్రునకును గోడలై, సుగుణ ధుర్యుడు రాముని పత్నినై యికన్
జనుదునె కన్నెఱంగి కపి సాయమునన్ ; దనుజేంద్రుడట్లు వం
చన మెయి మౌని వేసమున నన్గొని వచ్చెను గాక లంకకున్.

అంటూ తన అభిజాత్యాన్ని వివరిస్తుం దామె.

ప్రణయ సామ్రాజ్య పట్ట భద్రులు సీతారాములు. వారు ఒకరిలో ఒకరు ఎప్పుడూ ఉన్నారు. ఆవియోగం తనువులదే గాని మనస్సులకు లేనేలేదు. పవిత్ర ప్రణయ భావనా తత్పరులైన వారి మనోభావాల్ని మరింత పవిత్రంగా వర్ణించడంలో కవి నేర్పు మెచ్చ దగింది.

రామముద్రికను అందుకున్న సీతకు రాముడు శివుని చాపం ఎక్కిడిన దృశ్యమే కన్నులలో మెదిలిందట.

.ఎన్నటి మాట, తండ్రి మిథిలేశుని పీట, మహీశు చాపమున్

సన్నుత ధైర్య బాహుబల సాహసుడై విదళించె రాముడున్,
మన్నన నామె గాంచుచును మాటికి; నాటి మనోజ్ఞ దృశ్యమే
కన్నులలో నునున్మెఱపు గాంతుల జిమ్మెను ధాత్రి జాతకున్.

సీతరాముల అన్యోన్యతకు నిదర్శనంగా- వీరు వర్ణించిన ఘట్టం ఒకటి మనోరంజకమయినట్టిది.

సీతకు మొక్కలన్నా పువ్వులన్నా ప్రేమ. అందువల్ల సీతా వియోగంలో ఉన్న రాముడు స్వయంగా చల్లటి నీళ్లు ప్రేమగా ఆ మొక్కలకు పోసి నిశ్చేతనుడై నిలబడి పోయేవాడట. ఆ విషయాన్ని సీతకు చెప్తాడు హనుమ.

''సీతకు మొక్కలన్న, వికసించిన మవ్వపు బూవులన్ననున్
బ్రీతి, నవాంకురమ్ములను వేడ్కగ పెంచుచు నుండు నా మెయం
చాతడు శీతలాంబువుల నాపువు మొక్కల వద్దబోసి ని
శ్చేతనుడై నిలంబడును ; సీత యెడన్ మది యెంత మెత్తనో.

అంతటి సుతిమెత్తని మది కాబట్టి-

యుద్ధ పరిసమాప్తియై అగ్నిపూతయైన సీతను రాముడు స్వీకరించిన విధానాన్ని ఆ ప్రణయ పరీరంభణాన్ని ఉత్పలమాలికగా గ్రుచ్చారాయన.

'విచ్చిన కన్నులన్ మనసు విచ్చిన మోమున రామచంద్రుడున్
వచ్చిన సీతపై చిగురు వన్నెల వెన్నెల లైన నవ్వులన్
గ్రుచ్చి కవుంగిలించె నెనరుల్ దనరారగ బాహువల్లరిన్,
త్రచ్చిన వెన్నెలా మదిని దాచిన కూర్మలు తీయతావులై.

సీతారాముల పునస్సమాగమానికీ, లక్ష్మణుని మూర్ఛతీరడానికీ, సీతామాత క్షేమ వార్తను చెప్పి రామ లక్ష్మణుల ప్రాణాలతోపాటు కపుల ప్రాణాలు కూడా నిలిపినది హనుమయే, అందుకే రాముడు-

'ఓ నిరవద్య ధైర్య మహిమోన్నత! ఓ కపి లోకధూర్జటీ!
దానవ భూమి జొచ్చి, వసుధా సుతఁ జూచిన వార్త దెచ్చి, నా
ప్రాణము నిల్ప గల్గిన మహాత్ముడవంచును రాముడా మరు
త్సూనుని కౌగిలించెను మధుస్మిత దీపిత సుందరాస్యుడై.

సీతా వియోగంతో ఉన్న రాముడు నవ్వడం మర్చిపోయాడు. శోకాకుల చిత్తుడై పరిభ్రమిస్తున్నాడు. అట్టి స్థితిలో సీతామాత క్షేమ వార్తతో అతనికి పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. ఆ ఉపకారం చేసిన హనుమను మనసా రా, ప్రియమారా గ్రుచ్చి కౌగలించుకున్నాడట నవ్వురాజిల్లు మోముతో రామచంద్రుడు. అంతటి దుఃఖాకులుడైన శ్రీ రామచంద్రుని మోముపై చిఱునవ్వు వెన్నెలలు మొలిపించిన మహాభక్తుడు హనుమ. సీతతో రావణ సంహార వార్త చెప్పగానె ఆమె-'' హనుమా నీయుపకారమున్ మఱవ లేనయ్యా మనస్తృప్తిగా నిను వర్ణింపగ మాటలున్

ధారకవు-అంటుంది.

సీతారాములు ప్రణయ మూర్తులే కాదు అవతారమూర్తులు పైగా వేదమూర్తులు. ఆ విషయాన్ని శ్రీ కొండేపూడివారు తమ రచనలో సందర్భో చితంగా ప్రసంగిస్తూ వచ్చారు.

సీతాదేవి:-

'వేదమంత్రమహనీయ సముజ్జ్వల యజ్ఞవాటి

కాశ్రీయుతమూర్తి·

'నిర్మలనైగమార్థ తేజోకమనీయ,''సాధు సద్గుణ శ్రీ చరితామృత ప్రథిత చిక్కణ మూర్తి''సురుచిర ధర్మమార్గ పరిశుద్ధ మనస్విని,''సలలిత రామనామ జప సాధు తపస్విని,'నైగమ ధర్మమార్గ యాత్రాచణ శీల,'మహాగ్ని సమాన పవిత్ర,''సాధు భావ గుణ సంపద గల్గిన పుణ్యశీల , ' అత్యంత స్వాదువులీసుకుమార పద సమాసాలు.

శ్రీరామమూర్తి:-

'యుద్ధ విద్యా నిటలాక్షుడా రఘు రాముడు,
'సకలా రాతి విదార ణోద్ధత పటిష్ఠస్వామి
'పరమ దయా సుధాబ్ధి రఘువంశ్యుడు'

'దశరథేశుని యజ్ఞఫలోపలబ్ధ సుశ్రీకమహా నిధానము' పట్టాభిరాముని వర్ణన ప్రత్యేక పరువాన్ని అందింది.

నిర్మలాశయ సార నిజవర్తనా చార
నిహిత మానవధర్మ నియమ పరుడు,
ధారుణీ పాలనాధార శాస్త్రన్యాయ
మార్గాచరణ శీల మాన్యమూర్తి,
సర్వ జనామోద సత్యవాక్పరి పాల
నాశయోదార జిహ్వాంచలుండు,
దురిత కార్యోన్మాద దుష్టశిక్షణ శౌర్య
సామర్థ్య పౌరుషస్ఫురుడు నగుచు,
రమ్య సద్గుణ ధాముడా రాముడలరె
సకల జనభాగ్య సంక్షేమ సౌఖ్యరాజ్య
సార్వ భౌమత్వ కీర్తి ప్రశస్తి దనరి
రామరాజ్యము భువిని స్వారాజ్య మనగ.

ఈ కవిగారి రచనా వైశిష్ట్యమును గూర్చి ఒకమాట-సమాసములు

దీర్ఘములైనను రమణీయ పద పదార్థ బంధము తై రసబంధురముగ, అనర్గళ గంగా ధార వలె ప్రవహించును. ఉచ్చారణ సామ్యము గల పద ప్రయోగముతో పెక్కు చోట్ల యమకము నొక అందముగా వాడిరి-మధుర మనోహరము ప్రసన్న భావ కలితమునైన ఒక ప్రత్యేక శైలి నలవరచుకొన్న పద్య విద్య వీరిది-ఇట్టి కవితా శక్తి చాల అరుదు-నాటి నేటి ప్రసిద్ధాంధ్ర కవుల పోకడులందందుగాన వచ్చును. శ్రీనాథ పోతనల ప్రభావము వీరి రచనలందెక్కువ. ప్రతి పద్యము నందును ఒక శైలీ చమత్కృతి కానుపించు రసవత్ సుందర కావ్య మిది.

కొన్ని సామాన్య వాక్యములలోనే చమత్కారము చూడుడు.

1. సీత. ఓ రావణా! ఆనాడు నా రాముడచ్చటనే ఉన్నచో ''నీ కంఠమ్ములు గ్రాస్త్రధారా కృత్తమ్ములు చేసి యుండెడిని గృధ్ర శ్రేణికాహారముల్''-అన్యాయంగా జటాయు పక్షిని జంపిన ఆ దైత్యుని దేహఖండాలు గ్రద్దలు పీకుకు తినవలెనని-

2. లంగాదహనము: దైత్యులు హనుమ తోకకు నిప్పు బెట్టారు- 'వాలము నుండి రాలిన రవల్ రగిలించిన నిప్పు మంటలో కాల దొడంగెలంక''-వాళ్ళ యిళ్ళకు నిప్పు వాళ్ళే పెట్టుకున్నారు-హనుమ నిమిత్తమాత్రుడు. '' దావాభీల వాలానల జ్వాలాదగ్ధము '' లంక.

3. హనుమ రావణునితో: రావణా కామాంధుడవై నీవు చేసినది '' మహీసు తాప హరణమ్మా! కాదు; లంకాపుర శ్రీనాశమ్మగు కాలపాశము నీ మెడకు చుట్టుకున్నావు.

4. వారధి వర్ణన: ''అదియున్ వారధి కాదు వార్ధిపయి. దైత్యాధీశు దుర్మంత్ర దుర్మద దుర్నీతికి మృత్యువేదిక '' అని సురలు గగనమున సంభాషించిరి-

ఇట్టివి ఆద్యంతము కావ్యంలో కోకొల్లలు-

కవయిత్రి మొల్ల తెలుగులో కవిత్వం చెప్తే కందువ మాటలు, సామెతలు అందంగా కూర్చాలంది. శ్రీ సుబ్బారావుగారు తమ రచనలో అవి ఎంతో అందంగా కూర్చారు. హనుమ గండరగండడు.

నవ్వులాటలు,చెప్పున నల్గిచచ్చుట, లేచినవాడు లేచినట్లే గుట,
వైరిపై నెడమ కాలిడిత్రొక్కినట్లు, చీమచిటుకన్నన్,
లేచిన కంటిరెప్ప ముకుళింపక,
ఆడంబోయిన తీర్థ మెట్టదుట నున్నట్లు,
చచ్చి చేసెడిదేమి, వలను చిక్కిన పులుగు,
క్రిందు మీదులుగ సేయన్, కాలము లేదు మాటలకికన్, ఉన్న పాటుగా, కాలదన్నుట,
నీ వొకలెక్కా, గగ్గోలున, మొదలయిన తెలుగు పలుకు బడులు ఈ రచనలో కొల్లలు.

పద్యవిద్య అందరికీ అలవడేదికాదు. ఛంద శ్శిల్పాన్ని సమాదరించిన సత్కవులలో కొండేపూడి వారొకరు. ఏ సందర్భానికి ఏ వృత్తాన్ని కూర్చాలి,, ఎలా కూర్చితే అది ఔచితీమండి తమై అలరారుతుంది అన్నది పద్యవిద్యోపాసకులకే అవగతమయ్యే విషయం.

ఆది కవి నన్నయ శకుంతలో పాఖ్యానంలో కవిరాజ విరాజితంలో కణ్వాశ్రమాన్ని చూపించాడు. అలాగే మణిగణ విరాజితమయిన దశకంఠుని సుందర సౌధాన్ని కవిరాజ విరాజితంలో కూర్చారు వీరు.

'చని చని ముంగట సర్వ వికస్వరచారు సుమావళి సౌరభముల్'

'మానిని' అంటే అభిమానము కలది అని అర్థం. రావణుడు అశోకవనంలో సీతను చూడడానికి వచ్చిన సందర్భంలో సీతా మానిని అవస్థను 'మానిని' అనే ఛందస్సులో వర్ణించి ఔచిత్యం పాటించారు.

మానిని: 'కాయమునెల్లను క్ష్మాసుత వేగమె కాళుల సేతుల గప్పికొనెన్ '

శ్రీరామ వృత్తాంతాన్ని హనుమ చెట్టు మీద నుండి సీత మనస్సులో, పూలజల్లు కురిసి నట్లుగా వర్ణిస్తాడు. ఆ వృత్తాంతమంతా మంజరీ ద్విపదలో అల్లారు.

అక్షయ కుమారుడు అతి ఉత్సాహంతో యుద్ధానికి వచ్చిన సందర్భాన్ని ఉత్సాహ వృత్తంలోను, యుద్ధ వర్ణన రథోద్ధత ' వృత్తంలోను, లంకాదహనం జరిగిన సందర్భంలో లంకా నగరమంతా రోదిస్తున్న విషయాన్ని రోదకము అనే వృత్తంలోను అభివర్ణించారు.

రోదకము: ఈదెసె నా దెస నెచ్చట గన్నన్
ఏ దరి కింజన నీయని లంకా
వీథుల నగ్నులు వెల్వడి రాగన్
రోదనలందసురల్ బడిరార్తిన్!

ఆకాశ వీధిలో ఎగిరి వెళుతున్న హనుమను భుజంగ ప్రయాతంలోను-సీత యిచ్చిన రత్నాన్ని భద్రంగా దాచిన విషయాన్ని 'భద్రకము లోను వర్ణించడం మెచ్చ దగిన విషయం.

భద్రకము: వాతవీచి భయంబునన్
సీత యిచ్చిన రత్నమున్
ప్రాతిగా కడు భద్రమౌ
రీతి దాచెను హన్మయున్ !

మహా వీరులైన రామరావణుల యుద్ధంలో 'మదరేఖ' తోచిందా అన్నట్లు- ఆ వర్ణన 'మదరేఖ' వృత్తానికి ప్రత్యేకించారు:

మదరేఖ:- ధైర్యోత్సాహుడు దర్ప
స్ఫూర్త్యోద్దాముడు సత్వో
దార్యుండై రణధాటీ
ధుర్యుండై చనెతోడ్తో !

యుద్ధానంతరం ఖండిత రిపుడై కోదండార్చిత పూజ్యుడై సీతా సమేతుడై పుష్పక విమానారూఢుడై శ్రీరాముడు అయోధ్యకు వచ్చే సంరంభాన్ని 'విమానము' అనే వృత్తంలో అభివర్ణించారు.

విమానము: ఆ పుష్ప కారూఢుడౌ చున్
దీపించు తేజో ముఖుండై
భూపుత్రి పాల్వార ప్రక్కన్
ప్రాపొచు రాముండు నేగెన్.

శ్రీరాముడు, హనుమ- భూలోకంలో కొన్ని అక్కఱలు తీర్చడానికి అవతరించారు. ఆ విషయాన్ని మధ్యాక్కఱలోను, కావ్యాంతాన 'మంగళమహాశ్రీ' వ్రాసి ఛందశ్శిల్ప పారగులయ్యారు కొండేపూడి వారు.

ఇంతటి ప్రౌఢప్రబంధాన్ని ఔచితీ మహితంగా కూర్చిన కవిగారు ఇది నా వల్ల జరిగిన పనా? స్వామి కృపే అన్నారు. నిజమే భక్తిభావ బంధుర మయిన మనస్సు అలాగే పలికిస్తుంది. ప్రాణప్రదంగా భావించి రామ కార్యాన్ని నిర్వహించిన హనుమ కపి సేనతో

'దాశరథి దయ, సీత వాత్సల్య గరిమ
మీదు దీవనల్, నాకును ప్రోదిగాగ
చేయగల్గినయంతనే చేసినాడ
ననుచు నమ్రుడై వారికా హనుమ మ్రొక్కె.

ఆ రామ భక్తుని భక్తులు కవిగారు. వీరి ధోరణి వేరెలా ఉంటుంది. అందుకే.

'ఈ యతుల ప్రభావ మహనీయ కృతిన్ రస రమ్యరీతులన్
వ్రాయగ నేనెవండను కృపా మధురామృత వీక్షణా యత
శ్రీ యుత మూర్తులాయిరువు రిచ్చిన ఆ శిష భాగ్యరోచిర
ధ్యాయ మనోజ్ఞ కావ్య గుణమ్మై విలసిల్లెను గాక నర్మిలిన్.

శ్రీ కొండేపూడి వారి గుండె నిండుగా ప్రవహించే రామ భక్తి రసాయానం-హనుమంతుడు రామపట్టాభిషేక సమయంలో చేసిన శ్రీరామస్తవం అక్షరం అక్షరంలో ప్రవహిస్తూ ఉంది. కావ్యానికి మకుటాయ మానమయిన ఘట్టం.

అసలు హనుమ సీతా దర్శన వృత్తాంతాన్ని చెప్పినపుడు కపిసేన

అమృతా సారము లక్ష రాక్షరములల్లా లించిరావానర

ప్రముఖుల్- - - - - - - - - లంక కాల్చిన కథన్ సర్వమ్ము వాక్రువ్వగా

అంటారు. సీతా వృత్తాంతం హనుమ చెప్తుంటే-లంక గాల్చిన విషయం వింటూ ఉంటే-అమృతా సారము అక్షరాక్షరముల పొంగి పొరలిందనడం అక్షర సత్యం.

కథ రామకథ, హనుమంతుని కథ కూడా-సువర్ణానికి తావి అబ్బిన సందర్భమిది.

'భావం రామకార్య నియమ వ్యాపార సంపృక్తమ్ము కాగా

ఆ కవి-ప్రణుతామల పదపదార్థ ఫణితిని

మృదు పద బంధురరసభావ ఫణితిని,

కావ్యరస విశ్రుత సుందర పద్యవిద్యలన్

ఈ మహాకావ్యాన్ని విరచించారు.

రసాభ్యుచిత బంధంతో పదలాలిత్యము కమనీయము హృదయాహ్లాదమైన శైలిలో సాగిన ఈ మహా ప్రబంధం ఆంధ్రులు గర్వించదగ్గ రచన.

పుష్పగిరి తిమ్మన సమీర కుమార విజయం నేడు అంతగా వ్యాప్తిలో లేదు.

సమాజంలో ప్రతి వ్యక్తికి ఆవశ్యకములు ఆదర్శములు అయిన విద్య వినయము వివేకము, పరోపకారము, దీక్ష, కార్య నిర్వహణ సామర్థ్యము, నిష్కలంక ప్రవర్తన, సాహసము, స్వామి భక్తి, ధార్మిక చింతనాది సద్గుణములు కల, మహాత్ముడు హనుమంతుడు శివాంశ సంభూతుడు. విష్ణ్వవతారుడగు శ్రీరామునకు దుష్ట దైత్య విధ్వంసమునకైతోడు వచ్చిన కారణ జన్ముడు. ఈ విధంగా హనుమచ్చరిత్రమును ఒక అపూర్వ రీతిని రూపాదించిన ఈ మహాకావ్యం ఆంధ్ర సాహితిలో సుస్థిరంగా నిలువగల ఉత్తమ గ్రంథం అనుటలో అతిశయోక్తి లేదు.

హనుమ వ్యక్తిత్వాన్ని శ్రీ సుబ్బారావు గారు ఒకటి రెండు మాటల్లో ప్రస్ఫుటంచేసారు

''శైవాంశప్రభవుం డజేయ బలుడు ''

''కారణ జన్ముడున్ దివిజ కార్యధురంధరుడు ''

''వరజన్ముం, డురుసాహసుండు, శ్రుతి విద్యద్వార్థి పారంగతుం,

డరిలోకప్రళయుండు, రామపదపూజాసక్తు, డౌదాత్యస

చరితుం, ముత్తమకార్య దీక్షితు, డుదంచద్బ్రహ్మతేజో మహో
ద్బుర దీవ్య ధ్యానాంబుజుండు, హనుమంతుడన్న సామాన్యుడే.
ప్రజాహృదయాల్లో ఆవిధంగానిల్చి ఉన్న మహాత్ముడు హనుమంతుడు
ఆధునికాంధ్ర పాఠకులకీ హనుమత్ప్రబంధము స్ఫూర్తిదాయకమైన మంచి
ఉపాయనము.

నరనరాలా రామ భక్తి ప్రవహిస్తున్న స్థితిలో కవిగారు

'భావము సర్వ మీవయయి భావిత కార్యము సర్వమీవుగా
త్రోవలు జూప గల్గు నెనరుల్ గనుటెన్నటి కబ్బునంచు నీ
పావన పాదసేవలను బాసటగా గొనియే గుచున్న నా
జీవనయాత్ర యందున ప్రసిద్ధిని సిద్ధి నొసంగు మీశ్వరా !

వారి జీవన యాత్రయందే కాదు, కవితా జీవిత యాత్రలోని ఈ ప్రబంధాని
కిన్నీ ప్రసిద్ధిగలుగుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రాచీన ఆంధ్ర
ప్రబంధరీతులలో వచ్చిన గొప్ప రచన యిది.

'' జైహనుమాన్ ''

ప్రార్థన

విఘ్నేశ్వరుడు

1. శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ !
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే! !

శ్రీరాముడు

2. రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే !
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః! !
ఆపదామపహర్తారం దాతారం సర్వసమ్పదామ్
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్!!

హనుమంతుడు

3. అంజనానందనం వీరం జానకీశోక నాశనమ్!
కపీశమక్ష హన్తారం వందేలంకా భయంకరమ్!!

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసామ్
రామాయణ మహామాలా రత్నం వందే నిలాత్మజమ్

మనోజవం మారుత తుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్
వాతాత్మజం వానరయూధముఖ్యం శ్రీరామదూతం శిరసానమామి

ఆంజనేయ మతిపాటలాననం కాంచనాద్రి కమనీయ విగ్రహమ్
పారిజాత తరుమూల వాసినం భావయామి పవమాన నందనమ్

సరస్వతి

4. సరస్వతి! నమస్తుభ్యం వరదేకామరూపిణీ!
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా!!

శ్రీ రామాయనమః

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము - ప్రథమాశ్వాసము

సముద్రలంఘనము

శ్రీమద్రఘుకుల సోమా
భూమీతనయాభిరామ, పూజితనామా !
కోమల వార్షుక జలద
శ్యామా, సితకీర్తి ధామ, జానకి రామా !

దేవా శ్రీ రామచంద్రా ! అవధరింపుము

సుందరుఁడాహనుమంతుఁడు
సుందరమగు వార్ధి దాటి, క్షోణిజ సీతా
సుందరినిం గన నేగెడు
సుందరకథ నిక వినిచెద, సుందర రామా !

ప్రాచీసుందర శైల పీఠి హరిదశ్వస్యందనారూఢుడై
ద్యోచక్రమ్ముఁబరిభ్రమింప నినుఁడుద్యో గించు చందంబునన్
వీచీవ్రాత విశాలవార్ధితరణో ద్యుక్రాంతదీక్షాత్ముడై
తోచెన్ మారుతపుత్రు డున్నత మహేంద్రోర్వీధరాగ్రమ్మునన్.

తనువున్ తాళతరుప్రమాణముగ నుద్దండించి శైలమ్ముపై,
వనధిన్ దాటు నుపాయసాధనలు నప్రక్కల్ విలోకించు నా
హనుమన్ మూర్తిని గాంచి సాగరము సర్వాంగంబులన్ భీతితో
వణకన్ సాగెడి రీతి నుండె విచలత్ భంగోత్కరశ్రేణులన్. 4

వనచరనాథు నాజ్ఞ, యినవంశ విభూషణు వాంఛ, జాంబవం
తుని సముదుత్సుకత్వ వినుతుల్ కపిసేనల సౌహృదోల్లసత్
ప్రణుతులు సర్వముం గలసి వచ్చిన నూతన ధైర్య హేతువుల్
తన కొక మార్గ దర్శక విధమ్మున గన్పడె వాయుసూతికిన్.

" ఆవిసినమ్ములన్ వనచరాధిపుఁగొల్వున కేగు దీక్షలో
నీవును బోవు త్రోవ లవనిన్ సుగమమ్ములునై దలిర్పగా
దేవత లెల్ల రేకమయి దీవనలిచ్చెదరయ్య నాయనా !
నీవెట కేగినన్ జయము నీయది యౌనను" తల్లిపల్కులున్.

శ్రీవిన్యాసములై సుధామధు రసార్ద్రీభూత సౌమ్యమ్ములై
యేవేవో తలపుల్ మదిన్ బొడమి యూరింపన్ నవస్వాదువుల్
భావం బేకముఖంబు జేసి కొని విశ్వాసమ్మునన్ బ్రార్థనల్
గావించెన్ బవనాత్మజుండు కరయుగ్మం బెత్తి భక్త్యంజలిన్.

ఆ యనిలాత్మజుండు దనయంతన దా ననివార్య శౌర్యరే
ఖాయత వీరుఁడయ్యు వినయానత శీర్షుడు తూర్పు దిక్కుగా
నై యొనరించె బ్రార్థనల నాదృతిమై దనయత్నమందునన్
సాయముసేయు గాకనుచు సర్వ విధమ్ముల పంచభూతముల్.

నీ వేవేదవిధమ్ము దెల్పితివొ కానీ చిత్తచాంచల్యముల్
బోవన్ సల్పితి వృత్తమాశయ సముద్బోధమ్ము, సన్మార్గమీ
భావం బందున నిల్పి నావు గురుదేవా ! నానమస్కారపూ
జావాల్లభ్యము స్వీకరింపుము జగచ్చక్షూ, దినేశప్రభూ !

ధీరత మీఱగా త్రిజగతీ పరిపాలనసేయు దర్పవి
స్తారుఁడు, మౌని వెన్నెముక దాలిచి దానవలోక ఘోరముల్
దూరముసేసినట్టి బలధుర్యుడు, నాపిన నాటి చెయ్దికిన్
సైరణఁజేసి నన్గనిన స్వామి మహేంద్రునకున్ నమస్కృతుల్. 10

తనతపముల్ ఫలించిన కతమ్మగ సృష్టియొనర్చి వక్త్రని
స్వనము లుదాత్తలోకహిత వర్తన సూక్తులు నైగమార్థ శా
సనములుగా విరాజిలిన సాధువు విష్ణుని బొడ్డు తమ్మిలో
జననము గన్న వేల్పుగమిసామికి, బ్రహ్మకు నానమస్కృతుల్.

గిరిశిఖరాలనుండి క్షితికిన్ దిగి వచ్చుచు ప్రాణి కోటికిన్
సురుచిర జీవనార్థముల శోభలొసంగు నదీమతల్లులె
వ్వరి కవుగిళ్ళ చెల్మికయి పర్వులు బెట్టుదు రాతరంగసుం
దరునకు భూమి నల్గడల దాకెడు వార్నిధికిన్ నమస్కృతుల్.

అలికవిలోకనమ్మున మహోగ్ని శిఖావళి దాచుచున్ జగత్
ప్రళయము వచ్చుదన్క, శుభభద్రతలన్ బ్రజకిచ్చు స్వామికిన్
సలలిత సౌంధ్య నాట్య విలసన్నవరాగ విభాసురాంఘ్రిని
ర్మల జల జాత యుగ్మన, కుమారమణీపతికిన్ నమస్కృతుల్.

మానవ నీతి మార్గ నియమమ్ములు రూపముగొన్న ధర్మసం
స్థానము దీనరక్షణవిధామహనీయుడు, విల్లునమ్ములన్
బూనిన లోకముల్ నిలువ బోని పరాక్రమ వహ్ని, రామభూ
జానికి, తత్సమాను డనుజన్ముడు లక్ష్మణ మూర్తి కంజలుల్.

ఏయమ వేదమంత్ర మహనీయ సముజ్జ్వల యజ్ఞవాటికా
శ్రీయుతమూర్తి, సాధుగుణశీల విశాలమహః పవిత్రతే
జోయుతకీర్తి, రాముపయిఁజూపులు నిల్పుచునున్న సాధ్వికిన్,
మాయలద్రుచ్చు పాల్పడిన మాతకు సీతకు నానమస్కృతుల్-

తలచిన వేల్పు సాముల ఉదార సమున్నత తేజ మంతయున్
గలసి యొకండుగా నయి మొగంబున వెల్గినయట్లు దోచె నా
సలలిత సాధురూప విలసన్మహనీయుఁడు మారు తాత్మజుం
డిల నకలమ్ము దీప్త మొనరింపగఁజాలిన కాంతి పుంజమై. 16

అన్నిటికన్న మిన్నయనగా పవనాత్మజు మానసమ్మనం.
దున్నది రామమంత్ర మహిమోజ్జ్వల దివ్యబలమ్ము, సర్వశ
క్త్యున్నత సుప్రసన్నము, మహోదధి సంతరణైక వేగ సం
పన్నము, దైత్యసంప్రతతి పాటవ పాటన దోర్బలోగ్రమై.

మానవరూపుఁగొన్న పరమాత్మయె రాముడటంచు దోచు నా
దానవుఁడెవ్వ డోయతని తన్విని దొంగిలి పోవుటల్, తదా
ధ్యానము నందు నిట్లొక డనై నియతింబడి యేగుచో మదిం
గానగ నా నెదే నొక వికాసము మోసెద నేమొ యాపనిన్.

ఈమహనీయ శక్తి యిటు లెచ్చటి నుండి లభించె నాకు, శ్రీ
రాముని దీవనల్, తెలియ రాని మహత్తర దివ్యశక్తి సం
స్తోమము, లిట్లు నన్ను దయఁజూచిన భాగ్యమటన్న యూహయే
వేమఱు పొల్చు నాప్లవగవీరుని మానసమం దుదారమై.

తన పాదమ్ముల క్రింద c ద్రొక్కఁబడుచున్ ధాత్రీధరంబెల్లఁదో
చిన దల్పమ్మగు మట్టి కుప్పగ, నభస్తీరమ్ములన్ దాకు చుం
డిన వారాశియు పల్వలమ్ముగనె యుండెన్, నూత నోత్సాహస
త్త్వనిరూఢోన్నతు c డాసమీరజుని నేత్రద్వంద్వ దృగ్రేఖికన్ .

పదములు త్రొక్కిపట్టుకొని, బాహువులన్ విడసాచి, నాకమున్
గదియగ తోక ద్రిప్పుచును, గట్టిగ శ్వాస బిగించి, యొక్కటౌ
నుదుటున నింగిపై కెగసె హుమ్మని మారుతి, మూలముట్టుగాc
గదలి పగుళ్ళు వోయిన నగధ్వనికిన్ నలుదిక్కులద్రువన్.

ఉండిన యాత డున్నటుల నొక్క యదాటున పైకి దూకు ఆ
దండి మగంటిమిం గనుచు తక్కిన వానరసేన సర్వమున్
గుండెలు చేతులం దదుము కొంచు తలంచిరి, నిక్క మింక ఈ
గండర గండఁడెంతకును కాగల డన్నునుతుల్ వచించుచున్. 22

పారావారముపై, నభస్స్థలముపై, బ్రహ్మాండ గోళమ్ముపై
కారోహించుచు నున్న యట్టులుగ నంతంతై ప్రధావించు నా
పీరిం గాంచిన వానరాళికి కనుల్ మిర్మిట్లు కల్పించె వి
స్తారోదంచిత విక్రమోన్నత మహత్త్వం బాంజనేయమ్ముగా.

భువిపై వానరు లిట్లు లుండగ మహామోదప్రసన్నాస్యులై
దివిపైనుండి సురోత్కర మ్మతిరయోద్రేక స్ఫుర ద్వేగ వై
భవ తేజమ్మున రామ దూతగ మహా పాథోనిధిం దాటు నా
పవమానాత్మజుపై జయోత్సవ సుమవ్రాతంబు వర్షించిరిన్.

పవమానాత్మజు పాదఘట్టనల సర్వమ్మున్ సమూలమ్ముగా
నవియంబాతి మహేంద్ర శైలము వికారాకారముం దాల్పగా
వివి ధోత్పాతము లుప్పతిల్లిన గతిన్ భీతిల్లి రందున్న మా
నవ మౌనీశ్వర సిద్ధ సాధ్య గణ గంధర్వాదు లత్యంతమున్.

బరువుగ మోపి యూతగొను వాయుతనూజుని కాలి త్రొక్కునన్
గిరిశిఖరమ్ము కూలి విరిగెన్, తరువుల్పడె మూలముట్టుగా,
పరువులు బెట్టె సర్పములు, పక్షులు గూళ్ళను వీడి పోయె, ని
ర్ఝరములు రూపటెన్, జనులు జంతువులున్ జని రిళ్ళు వీడుచున్.

పెనుగాలి వీచిన వేగమ్ము నందు
వెనుక ముందుల కూగు వృక్షమ్ముపగిది
చదల వెంబడి నేగు సామీరిలోన
కదలి క్రొందలపులు కదలించె మదిని.

వనజాక్షుం గొని యేగు భూరి జవ సత్త్వ స్ఫూర్తి మున్మూర్తియా
వినతాపుత్రుని శక్తి నాయెడల దీపింపన్ వలెన్, శీఘ్రమ
య్యినవంశాగ్రణి రామువార్త గొని నేనీవారిధిం దాటి లం
కను జేరన్ వలె, చక్షురుత్సవముగాఁగానన్ వలెన్ జానకిన్- 28

బింక మ్మెప్పగ నేగి దైత్యుపురిలో పృథ్వీజనుంజూచి రా
మాంకం బుంగర మిచ్చి రావలెను, నాయత్నమ్మునం దెట్టియా
తంకం బెవ్వ రొనర్చినన్ విలయవిధ్వస్తమ్ము గావించి యా
లంకన్ రావణుతోడ మోసి కొని హేలన్ రాము ముందుంచెదన్-

రామక్ష్మాపతి మాట నాదు హృదయ ప్రత్యగ్రమై మ్రోగగా,
భూమీపుత్రి పదమ్ము లీకనుల కింపుల్ గూర్చి వెల్గొందగా,
ఏమీ ! నాకొక అడ్డువచ్చునె, యొకండేదేనియున్ గల్గుచో
భీమోద్దామ మదీయ వాల విచల ద్విక్షేపముల్ చాలికన్ .

మైనాకుఁడు

భావం బిట్టుల రామకార్య నియమ వ్యాపార సంపృక్తమై
ద్యోవీధిం బడి యంజనాసుతుడు విద్యుల్లేఖికావేగియై
యా వేశంబున నేగు దీక్షలఖిల మ్మా సాగరస్వామి తా
నై వీక్షించుచు తద్బలోన్నతుల కత్యాశ్చర్య ధుర్యాత్ముడై-

జగతిన్ మాయభివృద్ధికిన్ కతము విశ్వస్తుత్య చారిత్రుడా
సగరక్ష్మాపతి, తత్పవిత్రకుల సంజాతుండు శ్రీరాము దూ
తగ నేగున్ హనుమంతుఁ డీతనికి యాత్రాక్లేశముల్ లేని రీ
తిగ సాహాయ్యమొనర్పగా నతడు ప్రీతిం జిత్తమం దెంచుచున్.

పాతాళమ్మున నున్న దైత్యగణముల్ పైకెత్తి రాకుండగా
మూతం బెట్టె సురేంద్రుఁ డొక్క కుధరమ్మున్ మున్ను మైనాకునిన్ ,
ప్రీతిన్ వానిని బిల్చి సాగరుడు కోరెన్ రాము కార్యార్థ ము
ద్యోతప్రాభవమొప్ప నేగు హనుమంతున్ శ్రాంతు నొందింపంగా-

సూర్య భగవానుడే తన చుట్టు దిరుగు
పేరు కీర్తులు గలిగిన మేరుగిరికి
వరసుతుం డిల మైనాకపర్వతుండు,
గర్భమందు బంగరు నిధుల్ గలుగువాడు. **34**

మైనాకుండు సముద్రుమాట తనకున్ మర్యాద యే యౌనటం
వానందంబున లేచి పైకెదిగె, ఛాయావృక్ష సంశీతల
స్థానమ్ముల్ గల యున్నతాగ్రములతో, సౌ వర్ణ వర్ణాధికా
నూనప్రోజ్జ్వల కాంతితో, సకల సానుప్రాంతముల్ వెల్గగా.

శ్రమలు వాయంగ తనదు శీర్షమ్ము మీద
నాగు డని పిల్చె హనుమ నాయద్రివరుడు,
ధరణి నుపకారమతుల చైదమ్ము లిట్లె
తనరు నవ్యాజ సౌహార్ద తత్పరతల.

నేమ మెఱింగి స్వీయ కరణీయము సేయగ బూనినట్టి మే
ధామతి గాడ్పుపట్టి, తనదారికి నడ్డుగ నిల్చు దానవ
స్తోమము నుక్కడంప వెనుఁజూడని ధీరత నేగు వార్ధిపై
రామధనుస్సముద్గత శరప్రథమాన మహోగ్ర శక్తియై .

ఎఱుగం డాగిరిగూర్చి వాయుసుతు, ఁడేమీ ! యెంతకున్ బూనెనీ
గిరి నాకిట్టులనడ్డుగా నిలిచి యొక్కింతేని దారీయ డీ
గరువం బెట్టిదొ చూతు నేనని నగాగ్రప్రస్త రోపాంతమం
దురమున్ నొక్కి యణంచె నద్రిసకల మ్మొక్కుమ్మడిన్ డీల్పడన్-

ఈ కపి కింత శక్తి కలదే యని యుబ్బర మంది లేచి మై
నాకుడు మానవాకృతిని నాయన ! యోహనుమంత నిల్వుమీ
నాకడ కొంతసేపు పయనమ్మున నీకు లభించు శ్రాంతి నా
యీ కుసుమావనీజ రమణీయ సుశీతల సాను సీమలన్.

ఒక సహస్ర మదేభము లుక్కుమీఱి
త్రొక్కినను నొవ్వురాని సత్త్వుడనునేను
నీయురస్పర్శ నణగారి పోయి తిటుల
ఎంత బలంతు డగుదు వోయీ కపీంద్ర ! 40

నీకును మేలుగోరి యిట నిల్చితి, నీపిత వాయుదేవుడే
యాకడ నన్నునిల్పెను సురేంద్రుని వజ్రమునుండి రక్షయున్
నాకొనరింప, మీరు సుమనస్కులు ప్రత్యుపకార మైన యీ
నాకరణీయ మిద్దియు మనమ్మున వేఱుగ నెంచఁబోకుమీ.

విను మిం కొక్కటి, నీకు సత్కృతియు మావిధ్యుక్త ధర్మంబు,రా
ముని పూర్వీకులె వార్ధి వృద్ధి కిలపై మూలమ్ము, శ్రీరామ చం
ద్రుని కార్యమ్మున నేగు నిన్నని సముద్రుండిట్లు నన్గోరె నో
హనుమా! త్వాదృశులందు చూపగల మర్యాదమ్మె మర్మాదయౌ

అను మైనాకుని పల్కులందు రఘు వంశాధీశు డారామ చం
ద్రుని మాటన్ విని నంత మానసము నందున్ హర్ష ముత్కర్షమై
హనుమంతుండును మందహాసరుచిరాస్యస్వాదు సంభాషణ
మ్మున బల్కెన్ వినయాప్తవాక్యముల కూర్ముల్ తీపు లూరింపగన్.

సంతోషించితి మీరొనర్పదగు నీ సత్కార మర్యాదకున్
స్వాంతంబందున గాని, రామ విభు కార్యమ్మందు నాలస్యమా
వంతైనన్ పలుపంగఁజాల నిక, మీ యాతిథ్య సత్కార్యమే
నెంతో ప్రీతిగ స్వీకరించినటులే యెంచన్ వలెన్ పర్వతా!

అని, ప్రియవాక్యముల్ పలికి యా హనుమంతుడు తా నురమ్ముతో
నణగెడు నట్లు నొక్కిన నగాగ్ర తలమ్మున నొవ్వ వాయగా
పుణికి కరమ్మునన్, త్వరగ పోవలయున్ సెలవీయుడంచు వం
దనమిడి, పర్వతాబ్ధులకు, దానరిగెన్ విను వీధి త్రోవలన్.

తన పయి నిల్చి నీవనధి దాటి నిశాటుని వీటి లోపలన్
జనకజ గాననౌ బరువు సర్వ, మి దెంతటి కష్టమైననున్
దనపని మాని, సౌఖ్యముల నాసగొనండు, విలంబ మోర్వ డా
హనుమయు; కార్య దీక్షితుల ఆశయ సాధన లిట్లు భాసిలున్. 46

ఏ పేన నాడొ మిన్నులకు నేగిన ధైర్య జవాతిరేక సం
ధాపరి దీప్తమైన ప్రభుతల్ పది రెట్లయి నేడిటన్ సము
ద్రోపరి భాగ లంఘన సముద్యమ మం దగు పించె తీవ్రదీ
క్షాపటు కౌశల ప్రథిత సత్త్వ జవమ్ములు వాయుసూతిలో.

హేలన్ లేచిన లేమటే తడవుగా నేగెన్ నభోవీథిపై
తాలోత్తాల విజృంభమాణము తనూ ధైర్యంబు దీపింప, దిగ్
వ్యాలో లాంబుద మాలికల్ చెదరి పోవన్, తారకాగోళముల్
తూలన్ దారుల వెంబడిన్, పవన పుత్రుండుగ్ర వేగోద్ధతిన్.

నాగమాత సురస

వినుత ప్రాభవుడై, పరాక్రమ రమా విక్రాంతి సంపన్నుడై
హనుమంతుం డుదధిన్ దరించు బల విద్యాపాట వోద్రేకముల్
గనియున్, వాని బలాతిరేకముఁ బరీక్షల్ సేయగాఁ బంపి నా
రిన తేజస్విని నాగమాత సురసన్ బృందారకుల్ నేర్పుమై.

నరకప్రాయము జిహ్వోకోద్భవ దురంతాగ్నిచ్ఛటా పాటవ
స్ఫురణాపాయము, నాసికావివర సంభూతోగ్ర ధూమాబ్దని
ర్భరితోచ్ఛ్వాస నికాయమైన నిజవక్త్రస్థాన మూర్వీధ్ర కం
దర విస్తారము జేసి నిల్చె హనుమన్ ధట్టించు చా కాంతయున్.

హనుమంతా! విను మాకటంబడితి, నాకాహారముంగా ని నుం
గొన బంపించిరి సర్వదేవతలు నాకోర్కెన్ వడిన్ దీర్పగా
జనుమీ వక్త్రమునందు తిందు కపిమాంసం బెంతయో యిష్టమై
దనరున్ నోటికి, నేటికీ పగిది లబ్ధంబయ్యె నీదేహమున్.

> తెలియునోలేదొ వానర ధీర ! నీకు
> బ్రహ్మ వర మిది నాకు, నెవ్వండు గాని
> నాదు వక్త్రంబు దాటి చనంగ లేడు
> రమ్మ, చవిఁజూతు నిన్నువేగమ్మ యనిన. 52

ననుబోనీయక దారి కడ్డగ తనంతన్ వచ్చి తీండ్రించి నన్
దిన నుంకించిన దెవ్వరీ దనుజ ! ఏతీరైన గాని మ్మటం
చును దానేగెడి రామ కార్య విధులన్ సూచించి యావెన్కవ
త్తును నన్నుం దినవచ్చు నంచు హను మంతుడెంత యో చెప్పినన్.

తెరువుల నెంచి తా బయలు దేరిన దెప్పుడు వార్ధి దూరముం
దరియగ నింతలోపలనె దానవి యీమె యొకర్తు వచ్చి యీ
తెఱగున మాటలాడుట మదిన్ దల పోయ కుశాగ్ర బుద్ధి యీ
కరువలిపట్టి కేదియొ యొకానొక వింతగ దోచెనంతయున్.

కావలె నంచు వచ్చి, ప్లవగప్రభు వుత్తమ వర్తనుండు సు
గ్రీవుని కొల్వు జేరితిని కేవల మాగురు దేవు నాజ్ఞగా
సేవలొనర్చ, దేవతలె సేయగ నిట్టుల వేఱు కారణం
బావల నుండగావలయు నాతురపాటది యేల నింతలో.

వైరులు విక్రమించి పయిపైఁబడినన్, చతురత్వమేర్పడన్
వేఱగు సాధన మ్మొడద నెంచుట యుక్తమొకొక్క మారు, దు
ర్వార బలప్రయోగముల వారి నెదుర్చుట కంటె యంచు సా
మీరియు చిత్తమం దొకనిమేషము యోచనసేయు నంతలో.

నను నెట్లో గికురించి పోఁదలచు పన్నాగమ్ములన్ నమ్మబో
వను కోతీ ! యని, వక్త్ర భీకర బిల ద్వారంబు మిన్నంటు ద
న్కను దత్కాంతయు బెంచి పైపయికి రాగా జూచి, సామీరి త
న్వను రెట్టింపుగ బెంచి మోము చిఱు నవ్వుల్ దొల్క నిల్చుండినన్.

నామాటల్ విన నవ్వులాటలుగ గన్పట్టెన్ గదా యంచు ది
క్సీమన్ దాక మఱింతయై సురస యాక్షేపింప వాతాత్మజుం
డామాయన్ గని యిట్లు గాదనుచు ''నేమమ్మా భవద్వక్త్రవీ
ధీమధ్యంబును జేరగావలయు ప్రీతిన్ నీకు నింతేకదా. 58

అని యామారుతి కామరూపమున దానంగుష్ఠ మాత్రుండునై
చని యాదానవి నోటిలోనికి, నిమేషార్ధమ్ము కాలమ్ములో
నని దావెల్వడి వచ్చె రాహుకృత బంధమ్మున్ విడంద్రొక్కివ
చ్చిన చంద్రుంబలె సర్వమా సురసకున్ జిత్రాతి చిత్రమ్ముగా.

వెలువడి వచ్చి యట్లు కపివీరుడు వేగమె నింగి నుండి యా
లలనను జూచి నీ ప్రతినలన్ నెఱమేర్చితి నమ్మ వేగ బో
వలయును, రావణుండు జెఱబట్టిన జానకి జాడ జూచిరా
వలయును గాన నన్ను నిలుపన్ వలదంచును వేడి నంతటన్.

దానవివేషమున్ విడచి దక్షుని కూతురు నాగమాత యా
వానర ముఖ్యునిం గని భవద్బల ధైర్యము లే నెఱుంగుదున్
గాని సురల్ పొనర్చి రిటు గావలె నంచు విలంబనమ్ము, నీ
పూనిన యత్నముల్ విజయమున్ గొనగా ననుచున్ వచింపగా.

నెలవుం గైకొని నాగమాతకడ రాశీభూతవేగార్భటీ
విలసద్విక్రమ కాంతి రేఖ యగుచున్ విస్వీధి కాయంజనా
లలనాపుత్రుడు వార్ధి సంతరణ లీలాలోలు డై యేగు వి
ద్యలు సర్వమ్ము సుపర్వులుం గని రమందానంద మగ్నాత్ములై.

ఏకైకాశయ దీక్షితాత్ముడు రయోత్కృష్ట ప్రభావంతుడై
యాకాశమ్మున నుండి చూచెను మహోద్యత్ధ్వాన సంలీనవీ
చీకల్లోల మహాబ్ధి తీర మది యే విన్నమ్మొ నేత్రోత్సవం
బైకన్పట్టునె యంచు వాయుతనయుం డాందోళిత స్వాంతుఁడై

వారిధి దూరమున్ వెదకు పాటున దిక్కులబట్టి జూచు ఆ
మారుతి కన్గవన్ దడిపి, మానస మందు గలంచు వేదనా
భారము సర్వ మొక్క పరి పైకుబికెన్ దనుజుండు హేతువై
ధారుణిజారఘూత్తముల తాళగ లేని వియోగ దుఃఖముల్. 64

ఆకడ రాము భార్య జనకాత్మజ నిర్మల నైగ మార్థతే
జోకమనీయ మార్గపరిశుద్ధము, దుర్దమ దుష్ట దానవా
నీకము మధ్య నేపగిది నిష్ఠురముల్ పడుచున్ దినమ్ములన్
శోకమయమ్ముగా గడపి శోషిలు చున్నదొ దిక్కుగానకన్.

ఈకడఁజూడగా దశరథేశుని యజ్ఞఫలోపలబ్ధ సు
శ్రీక మహానిధాన మగు శ్రీ రఘు రాముడు, జానకీవియో
గాకుల వేదనాహృదయు డాతని నూఅట గొల్వ లక్ష్మణుం
డేకద యొక్కరుం డచట నిద్రయు హారము లేని సేవలన్.

లోకక్షేమ విధాన పాలన కళాలోక ప్రసిద్ధం బయో
ధ్యాకల్యాణ మహాసనాధిపులు సీతారాములా, యిట్టి చీ
కాకుల్ బొంది కలంతలం బడుట లీకష్టవ్యధాకారకుల్
రాకాసుల్ నశియించు కాల మదియున్ ప్రాప్తించు టేనాటికో.

సింహిక

అని లోలో దల పోయుచున్ రయముతో నాకాశవీధిన్ వడిన్
హనుమంతుండును బోవగా నతని ఛాయన్ బట్టి యంబోధిలో
తున కే శక్తియొ లాగు చున్నటుల చేతోవీధికిం దోచినం
తన కన్పించె నొకర్తు కా వనధి మధ్యన్ మున్గుచున్ దేలుచున్.

ఉగ్రాకార వికృత్కర ప్రబలవేషోన్మేష సంపుష్ట దం
ష్ట్రాగ్రప్రౌఢ ముఖంబు గల్గిన మహాశక్తిన్ గనెన్ విస్మయ
వ్యగ్రుండై కపి, యిట్టి శక్తు లుదధిన్ వాసించు చున్నట్లు మున్
సుగ్రీవుం డని నట్టి మాట మదిలో సుస్పష్టమై తోచగా.

నీడను బట్టి ప్రాణి తతినిన్ గబళించెడు సింహికాఖ్యయీ
చాడుపు నన్ జరించు నొక శక్తి యిదేయను చున్ గ్రహించి యా
గాడుపు పట్టి కొండవలె కాయము పెంచుట జూచి, యామె తో
డ్తోడన యాసమీరసుతు దుస్సహరూపము గాంచి క్రుద్ధయై. 70

రంహోధికరమ్మై, క్షుధాకుల వికారాకార కోపోగ్రమా
సింహమ్ముం బలె సింహికాసుర మహోజ్జృంభాధి కోద్యత్ క్రుం ధా
బంహిష్ఠమ్ముగ నోరు పెంచుచును పై పై దూకగా, రక్కసిన్
సంహారించు క్షణమ్మదే యనుచు యాసామీరి సన్నద్ధుడై

ఊకున దూకి యామె వివృతోత్కట వక్త్రమహాబిలమ్ము నం
దాకపి వీరు డూర్జితనఖమ్ములు గ్రుచ్చుచు శ్వాస కోశమున్
చీకి పెకల్చి ప్రోవులను బెట్టగ వచ్చిన దాపిశాచియున్,
వాకలు వాకలై కలసి వారిధి నిండిన వామెరక్తముల్.

చప్పుడు లేని యుద్ధమున జచ్చిన సింహిక దేహఖండముల్
గుప్పలు నై పయోధి క్రిమి కోటికి నాకలి దీర్చి కూటికిన్
దెప్పర మౌచు, వార్ధి పరిధిన్ బరు వెత్తు విహంగ రాజికిన్
దెప్పలునై శ్రమంబుడిపి, తేలుచు బోయిన వాజలమ్ములన్.

కాలిడినన్ మహేంద్రగిరి గ్రక్కదలెన్, సురసాపరీక్షలుం
జాలగలే దకారణమె చంపగ వచ్చిన సింహి కాంగనా
భీలపరాక్రమోద్యమము వీగి నశించెను; మూడు సారులీ
చాలున వాయుసూను బల శక్తుల జూచి సురల్ నుతించిరిన్.

ఎందఱెందఱి నిట్లు సింహికయుఁ బట్టి
ప్రాణములు బలిగొన్నదో గాని నేటి
కొక్క కపివీరు డాయమ నుక్కడించె,
బ్రహ్మ యిటు వ్రాసె నేమొ తాత్పాలమందు.

సాగిన దాప్రయాణ మొక చాడ్పున మారుతికిన్ బలోత్సు కో
ద్వేగముగా, రఘూత్తముని దివ్య పదాంబుజ భక్తి భావనా
యోగముగా, సదాశయ సమున్నత కౌశల కార్యసాధనో
ద్యోగముగా, నెదిర్చిన రిపూత్కరమున్ దునుమాడు యాగమై. 76

చుక్కల దారిలోన పొగచూఱిన మేఘ సమూహమందునన్
ఱెక్కలు గల్గు పర్వతము రీతిగ నేగు సమీర సూతి స
మ్యక్కమనీయ రూపమహిమన్ గని కిన్నర సిద్ధ సాధ్యులా
రక్కసు లీల్గు కాలము త్వరన్ గలదంచు దలంచి రాత్మలన్.

ధనురాముక్త శరమ్ముగా, ప్రబలఫూత్కారోగ్ర సర్పమ్ముగా;
కనదాకాశ చరత్తటి త్క్రమముగా, గాఢ త్వరాహంకృతిం
జనె విన్వీధుల నాంజనేయ మగు భాస్వత్ శక్తి రూప మ్మొకం
డనిదంపూర్వ మహాస్వరూపమయి వీక్షాతీత వేగాకృతిన్.

తన శిష్యుం డిటు లెండలం బడుచు సంతాపించుటన్ జూచి య
య్యినుడున్ మబ్బుల చాటునం జని శ్రమంబీగెన్, సుతుందన్వె న
య్యనిలుండున్ శిశి రోర్మికల్ నెఱపి మార్గాయాసముల్ వోవగా,
దనరున్ బిన్నలయందు నిట్లె కద పెద్దల్ చూపు వాత్సల్యముల్.

లంకాతీరము

ఎప్పుడు వార్ధి అంతమగు, నెప్పటి కేనును లంక కేగుదున్,
తప్పుడు దారి పట్టను గదాయని దిక్కుల యందు ఱెక్కలన్
విప్పుచు నున్న చీకటుల వెంబడి నేగెను గాలిపట్టి యా
యుప్పర మందునన్ దన రయోద్ధతి బెంచుచు నంతకంతకున్.

వందలు నేత్రముల్ గలుగు వారల కైనను దృక్పథమ్ము నం
దందని వేగ ధూర్వహుడు నై చను చుండిన గాడ్పు పట్టిక
న్విందుగ గోచరించె పృథివీధర కానన వృక్షపంక్తికా
సుందర పుష్పసౌరభ రసోల్బణ పూరము వార్ధి తీరమున్.

తీరము జూడగానె కడుతేలికయ్యె తన గుండె యందునన్
వారిధి దాటు వేళ బిగ బట్టిన యూపిరి సాగి వచ్చె సా
మీరికి,దూరసాగరపు మేరలెఱింగిన శేముషీలసత్
సారము లామహామహుని సత్త్వ జవాతి శయమ్ము లెన్నగన్. 82

వేగము తగ్గజేసి వినువీధుల నుండియె వార్ధి వీచికా
భోగవనీ మనోహరము, భూరిమణి ప్రకరాంశు కాంతి సం
యోగము, తీరసుందర మహోన్నత భూమిధరమ్ము గాంచె చే
తోగతి సంభ్రమప్రమద తుందిలమై యలరంగ నాతడున్.

ఆనగ సీమ నిర్మితమునై పాలు పారుచునుండు, నవ్యశో
భానవ రత్న కాంచన విభాసుర సుందర కుడ్య గోపుర
స్థానమనోజ్ఞకేళివన సౌధ విలాస విరాజితమ్ము లం
కానగరమ్మనంగ దశకంఠుడు రావణు రాజ ధానియై.

కనదుద్యన్మహనీయతేజమున నా కాశమ్మునం దర్కు డుం
జను చందమ్మున వార్ధి దూరము సమస్తమ్మున్ మహోత్సాహవే
గనిరూఢిం జని యంజనాసుతుడు లంకాద్వీప తీరమ్ము నం
దున వ్రాలెన్ బటు వీర విక్రమ కళా ధుర్యోరు తేజస్వియై.

సురకును దాసులై నిదుర జొక్కుచు కావలి కాయుచున్నవా
రెఱుగ రొకింత నాయెడకునెవ్వరు వచ్చిరి యెవ్వరేగి రా
తెఱగుల నేమియున్ ; మదికి దృప్తిగ మారుతి సంచరించె సా
గరతట మందు జంతు విహగమ్ములు భీతిలి పర్వులెత్తగన్.

ఆలంకాపుర కాంచనోజ్జ్వల మణీ హర్మ్య స్ఫురత్ సుందర
శ్రీలం జూచుచు విస్మయంపడి కపి శ్రేష్టుండు తానిప్పుడీ
శైలాభాకృతి బోవు చో దనుజు లాశ్చర్యంబునం జూతురీ
లీలన్ గార్యము కూడ కాదనుచు దాల్చెన్ వేగ స్వల్పాకృతిన్

బలి బలమ్ము హరింపగ వామనుడు త్రి
విక్రమ స్ఫూర్తి నందిన విధము దోప
పటుతరోగ్ర రూపమ్మున వనధి దాటి
మరల నిజరూపమును దాల్చె మారుతియును. 88

ఆచిఱు కోతి రాము చరణాంబుజ బంధుర భక్తి భావనా
శ్రీ చటుల ప్రభాన్వితము, సింధు జలప్రవిలంఘనాతి వే
గోచిత శక్తి మంత మసురోత్కర మర్దన దుర్ద మోగ్రరే
ఖాచణ రూపమం చెఱుకఁగానరు చూచిన వారలెవ్వరున్.

ఆశ్వా సాంతము

నీవార్తను గొని సీతా
దేవికి దెలుపగ బలితపు దెగువున వనరా
శీవిస్తృతి దూకిన కపి
ధీవరు కథ యిది మృదుపద దీప్తము రామా !

భక్తలోకమానస చక్ర వర్తి వీవు
మునివినుత శాశ్వతానందమూర్తి వీవు,
రమ్య కీర్తివి, ధర్మ మార్గ ప్రవర్తి
వతుల కరుణార్ద్ర సుందరా కృతివి రామ !

వననిధి లంఘన కృతిలో
హనుమంతుని వేగ విక్ర మాస్పద శక్తిన్
వినిచితి నానేర్చు కొలఁది
ప్రణుతామల పదపదార్థ ఫణితిని రామా !

సకల నృపాల కోటి మణిసారకిరీట మరీచి మాలికా
ప్రకర మనోజ్ఞ కాంతి చయరంజిత రమ్యపదాబ్జ సుందరా !
అకలుష వేద వాద పరమార్థ వినిర్మల తత్త్వమార్గ సం
ప్రకట మహాశయప్రథిత మానవనీతి విధా విభాసురా ! 93

ఇది శ్రీ హనుమత్ప్రబంధము ద్వితీయ భాగము నందు
హనుమంతునిసముద్రలంఘనము,మైనాకాద్రిసమాదరణసురసాపరీక్ష సింహికావధ
లంకాతీర ప్రవేశము అను కథలుగల
ప్రథమాశ్వాసము.

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము - ద్వితీయాశ్వాసము

లంకాప్రవేశము

శ్రీకౌసల్యాసుప్రజ,
రాకా విమలేందు కాంతి రమ్య ముఖాబ్జా !
శ్రీకర నవకల్పక భూజా !
సాకేత పురాధి రాజ ! సమధికతేజా !

దేవా శ్రీరామచంద్రా ! అవధరింపుము

శ్రీలేపారు సువర్ణ రత్నసుషమా శృంగార హర్మ్యాంచి తం
బాలంకా పుర మందు జేరిన క్షణమ్మందున్ ప్రసన్నాస్యరే
ఖాలావణ్యము, రామచంద్ర విభు నాకారమ్ము రోచిస్ఫుర
ల్లీలా రమ్యముగా కనుంగవను వెల్గెన్ అంజనాసూతికిన్.

ఆసలు మోసులెత్తు విజయప్రవిలాస వికాస భాగ్య ని
న్యాసము లూడి పడ్డవనగా తన వెన్క శుభాశిషోల్లస
ద్భాసుర మూర్తి రాముని కృపాబలమున్న దటన్న ధైర్యవి
శ్వాసములన్ దలంచె దనస్వామిని మారుతి నమ్ర శీర్షుడై.

పున్నెము నెంచి క్రొందళుకుఁబూవులఁజేసిన పూర్వపూజలె
న్నెన్నియొ సత్ఫలమ్ములయి ఈ రఘురాముని పాదసేవ నే
గన్నది నేడు తద్విభుని కర్జము చిత్తమొకింతయుంచి యే
చిన్నముఁజేసినన్ సఫల సిద్ధుల గాంచదె పుట్టు పుర్విపై. 97

ఆతని యర్ధదేహము దయాహ్వాద యాంచిత మూర్తి సీత, ప్ర
స్ఫీత సమస్త ధర్మగుణ చిత్తులు జ్ఞానరస స్వరూపు లీ
సీతయు రామచంద్రుడును, జీవన భాగ్యముగా కృపారసా
స్ఫీతులు వీరికిర్వురికిఁబ్రీతిగ సేవలు సేయ నోచితిన్.

అనిలోలో దల పోసి కొంతతడ వాహన్మంతు డుల్లమ్మునం
దనివిం జెంది యొకింత, ముందుగల కర్తవ్యమ్ము నూహించి యీ
మును మాపుం గను జీకటుల్ తగు హితమ్మం గూర్చునట్లుండుటల్
గని తారాడెను వార్ధి తీరమున లంకం గాంచు నుత్సాహియై.

అవని జాన్వేషణమ్మునం దన్యులకును
హనుమ గనపడ కుండగ నపర సంధ్య
నర్కుడొదిగెను, చీకటులలముకొనియె;
శిష్యుసేమమె గురువు వాంఛించు నెపుడు.

దానవ నాథు పట్టణపు దారుల దూరము లెట్టులుండు నా
వైనము ముందెఱుంగుట యవశ్యమటంచు మదిందలంచి యె
త్తైన స్థలమ్ము దీని కను వౌనని దాపున నున్న శైల మా
వానర వీరుడుం గని యపారముదంబును బొందె నాత్మలో.

ఆలోలేక్షణ రేఖికావిలస నోపాయమ్ము, దీవ్యద్భులా
భీలౌజ్జ్వల్య మహమ్ము, రాక్షసచమూ విధ్వంస కోద్వేగకో
పాలంబాధిక చండ తైజసము, స్వీయారంభ జాగార్యమై
గోలాంగూలము సంచరించనది తత్ క్షోణీధరాగ్రమ్మునన్.

చారులతాతరు ప్రతతి సంపదలన్ గను విందు గూర్చి చె
ల్వారెడు నాత్రికూట కుధరాగ్రము నుండి విచిత్ర సౌధవీ
ధీరుచిర ప్రదేశ పరిదీప్త మనోహర దృశ్యమైన లం
కారమణీయపట్టణము గన్గొనె నల్గడ నాంజనేయుడున్. 103

ఆకాశమ్మున బట్టి ప్రేలు ననగా ఆశ్చర్యముంగొల్పు నా
ప్రాకారమ్ములు వప్రగోపురములున్ ప్రాసాదముల్ దేవతా
నీకమ్మైనను పొందరాని రుచిరోన్నిద్రమ్ము లావిటికే
లోకమ్మందున సాటిగానని రమాలోలాచ్చ సౌందర్యముల్.

అమరాధీశునకే నలభ్యము నసాధ్యంబౌ మహావైభ వో
త్తమ రత్నస్రగి తోరు కాంతిమయ సౌధ శ్రేణితో, కేళికా
రమణీయోపవనాంతరామల సరః ప్రాంతమ్ముతో నింద్రనీ
లమణీనిర్మిత వేదికాతతులతో లంకాపురమ్మొప్పెడిన్.

అలసాయాత సమీర వీచికలు రమ్యారామ కేళీస్థలుల్
పులుగుంబాటలు తీయ తావులును పూవుందేనియల్ తమ్మిపూ
కొలనుల్ పుప్పొడి బాట లా పురమునం గ్రొంగ్రొత్తలై యెల్లవే
ళల సొంపుల్ దొనకున్ వసంత దివ లీలాలోల రమ్యమ్ములై

ఆకాశమ్మున చంద్ర బింబము లసంఖ్యానీకమ్మై వెల్గు న
ట్లా కాసారపు నీలినీరముల పద్మానీక ముత్ఫుల్ల శో
భాకారమ్ముల కాంచనామల కళావ్యాలోల దీప్తుల్ దిశా
వ్యాకీర్ణమ్ముగ నింపు చూపరుల కాహ్లాద ప్రకర్షమ్ముగా.

అలరుచు చెట్టు చెట్టునకు నాగిరియందున నెక్కి లంకమున్
గలయగ జూచు హన్మపయి నల్లన క్రొన్ననుతీవ లెల్ల పూ
వుల జడి నింపు చాతనికి పూజలు జేసిన చంద మొప్పె నీ
యిలపయి పుణ్యకార్యమతు లేయెడ నైనను పూజ్యులేకదా.

ఒకగట్టెక్కితి రామ కార్య నియ తోద్యోగాత్త సంరంభమం
దిక వేఱొక్కటి నాకిటన్ మిగిలె, ధాత్రీ జాత సందర్శనో
త్సుక కర్తవ్యము, రామమంత్ర మహితాస్తోకప్రభావంతమై
సకలమ్మున్ దనరారగావలె నికన్ సాఫల్యసంపూర్ణమై.

ఆయుధ హస్తులై సకల మానగరమ్మున దారులన్నియున్
రేయి బవల్ భటాళి కను ఱెప్పలు మూయక కాయుచుండగా
నేయెడ కెట్టు లేగుటయు నేరికి సాధ్యము, సాధ్యమైనచో
నీయసు రోగ్రసేన నెదిరించి బయల్పడి పోవవచ్చునే.

గడగడ లాడి పోవు త్రిజగమ్ములు రావణు డన్నపేరు వి
న్పడినను చాలు, నాదితిజనాథుడు మంచియు చెడ్డలేని దుం
దుడుకుల మాయలా డతని తుంటరి చేతల కోర్చి యింతకున్
పుడమికుమారి నేటి కసువుల్ విడ నాడక నిల్చి యుండునా.

అనఘుండుత్తమ నైగ మార్ద పరిశుద్ధాత్ముండు శ్రీరామచం
ద్రుని కార్యమ్మిది, సాను కూలమగు దారుల్ తీరు లూహించినే
చనుటే మేలు క్షణక్షణమ్మున సమస్తక్లేశ కష్టమ్ము లీ
దనుజుల్ సృష్టి యొనర్ప జాలిన దురంత క్రూర కర్మోద్ధతుల్.

వేసిన లెక్కలే తిరిగి వేయుచు మారుతి యి ట్లె దో ప్రతి
జ్ఞానముపేత నిశ్చయమునం దొక దారికి వచ్చి ముందు పృ
థ్వీ సుతనుం గనుంగొని వేఱుగ చేయగలట్టి కార్య వి
న్యాసము చూతు నేనను సమన్వయ మాత్మ దలంచె నర్థిమై.

చలువలు గ్రమ్ము చుండిన నిశాసమయమ్మది, తత్పురమ్మునన్
లలితసరో వరామల జలమ్ముల నీదుచు నున్న రీతిగా
నలరెను నింగి నున్న యమృతాంశుడు, చారు తరప్రసూన గం
ధిలములు, మందవాయువులు దిక్కులు బట్టి చరించె నిమ్ముగా.

వీచిన చల్లగాలి మృదు వీవనలందు శుభప్రమోద సం
సూచనలేవొ వెల్వడిన చొప్పులలో నొక త్రోవ నెమ్మదిన్
దోచినటుల్ రఘూత్తముని దూత ప్రసన్నత దాల్చి నిల్చె నా
లోచన లొక్కతీరయి వెలుంగును గన్న వికాసమొప్పగన్. 115

ఎవ్వరును తన రాక గుర్తింప కుండ
స్వీయ రూపమ్ము హనుమ యల్పీకరించి
గిరిని డిగి వెన్క ముందుల నరసి కొనుచు,
దానవపురమ్ము జొచ్చె మెత్తనగు నడక.

లంఖిణి

ఎలమి మఱింత చిన్నగ కుదించిన రూపము చూచుకొంచు నే
యలికిడి లేని కాల్నడల నాహనుమంతుడు ద్వారసీమలో
పల పదముంచి నట్లె కనుపట్టదు, అంతటిలోనె పెద్దదా
నెలుగున ఆగు మాగుము కపీ ! యెటు వచ్చితి వెట్లు పోదువున్.

మాదేశమ్మిది రావణప్రభువు సామ్రాజ్యమ్ము సర్వమ్ము, లం
కాదేవిన్ విను మేను లంఖిణిని ముఖ్యాలమ్ము లిచ్చోట లం
కాదుర్గమ్మును గాచు చుందు నెవరున్ గాలూనగా లేరు నా
యాదేశమ్మున గాని, యీ దరికి నీవై యెట్లు రాగల్గితో.

గుప్పెడి పట్టునం దిముడు కో సరిపోవని కోతి పిల్ల వే
చప్పుడు లేక వచ్చితివి చాలును, వచ్చిన దారి పొమ్మికన్
తప్పితి వేని నాపలుకు తప్పదు నీకిట పుర్వు వోలె నా
చెప్పున నల్గి చచ్చుటలు చెప్పితి నీహిత మెంచి వానరా !

అని గర్జించుచు రోష భీషణ వికారాకారయౌ దానవాం
గన యొక్కుర్తుక మీద దూకు నటులన్ గన్పింప నల్పీయుడౌ
హనుమంతుండును పర్వతాకృతిగ దానై దుష్ట ధూమ్రస్వరూ
పనిరూఢోగ్ర మహోగ్రహప్రకటదర్పన్ లంఖిణిం గాంచుచున్.

సిరులన్ జెన్నలరారు మీనగర లక్ష్మిన్ జూడగా వచ్చితిన్
పరుషోక్తుల్ వచియించి నన్నుమఱలింపం జూచుటల్ పాడియే
త్వరగా నాలుగు మూలలం దిరిగి నాదారిన్ వడిన్ బోదు నన్
వెఱపింపం జన దిట్లు నీవనుచు గంభీరమ్ముగా బల్కెనన్.

చిటికెన వ్రేల నొక్కినను జీవము లూడెడి కోతిగాడిటుల్
పటుతర రూపమై యెదిరి పల్కెనె? నిక్కము యీత డెవ్వడో
యటమట కాడు వీనిని దయంగను వేలని యామెయున్ మదో
త్కట దృఢ ముష్టితో బొడిచె గాడుపు పట్టి యురమ్ము నొవ్వగా.

తూలియు లేచి యామెపయి దూకుచు మారుతి స్త్రీయటంచు నే
జాలిగ జూచి నాడ నిది జాలును గా కని యానిశాచరీ
ఫాలము రెండు చేతులను బట్టి బిగించి యణంచి నొక్కగా
కాలువలట్లు నెత్తురులు గ్రక్కుచు నేలను ద్రెళ్ళె యామెయున్.

వీరవరుండ వాయుపుకపి ప్రవరా! విను మొక్క మాట నా
సారసగర్భుడే నుడివె సర్వము మున్ను కపీంద్రు డొక్కడీ
ధారుణి నన్ను పంపగల తక్షణ మీ యసురేంద్రు వైభవం
బారడి బోవు సందనియె నయ్యది నిక్కము నిన్ను జూడగన్.

పరమ పతివ్రతామణిని భాసుర సద్గుణరాశి జానకిన్
చెఱగొను టే నిశాట పతి చేయునకుం గతమయ్యె లంకలో
విరుగగ లాడ విష్టమగు తీరున వానర వీర ! యంచు నా
తరుణియు మాయమై చనె నదాటున చూపుల కందకుండగన్.

హనుమ నెమ్మది నచ్చెరు వయ్యె నొకటి;
దనుజులందును గూడ నుదాత్తమతులు
బహుతపశ్శాలు లుండి రేపాపముననొ
దురిత చిత్తులై పుట్టిరీ ధరణిననుచు.

ఆరాకాసిని జంపగానె తన కార్యంబింత సౌకర్యమై
దూరాదాగత రామ దూత మది సంతోషంబు నిండార లం
కారాజ్యమ్మును తేరి పారగని లెక్కల్ వేసి కొంచున్ పురిం
జేరం బోయెడి మార్గమున్ వెదుక జొచ్చెన్ నాలుగుం బ్రక్కలన్. 127

దాలు చరమాద్రి మీదను చంద్రికలున్, గలుద్రావి ద్రావి ని
ద్రాలతి బొక్కెయుండెడి పక్షుల్గా గావరి వాండ్రు, సిద్ధతై
యూరును నిద్ర మంచి నముద్రమ్మును ద్వారము లేని యెక్కు ప్రా
కారము నెక్కె మారుతియు గ్రక్కున మాటె పురమ్ములోనికిన్.

తళతళ రాచ వంచులని తళ్కులలో విశదమ్ము రాచ లంకలో
బంగరు వీధు లన్నియును పొందురు కాంతులతో పరిట్టి క్రొం
జిలుగుల పూవులన్ మిసిమి చెల్వుల ముత్తెములేరి మూలమూ
లల నయితమ్ము జల్లి నటులన్ వెలిరంగుల నద్దెనిట్టుగన్.

సీతాన్వేషణ

కదునడి వైరిపై నెడమ కాలిడి త్రొక్కిన యట్లు లంకలో
నడుగిడె నాంజనేయుడు మహాటంభీరమదేభరాజము
క్కడు పదముంచినంత కదకన్, తన యుల్లపు పాదముంచునం
బడి యెటు లుండెనో ప్రబల పొటువ మంతగ గాడ్పు పట్టెకిన్.

బంగరు మేడలున్, మిసిమి పన్నల రంగుల ద్వారబంధముల్,
ముంగిట లొల్కబోయు పొలుపుల్, సుమనస్సుమ దీర్ఘ వాసనా
సంగములై పురిన్ పలుతెలుంగుల చిత్తము లొంగ దీయు తీ
రుం గనియున్ రవంత పెడ త్రోవలకున్ జనబోవ డాతడున్.

అనవరతప్రమోద కలి తాఖిల నూత్న వినోద హేలలై
వినబడుచుండు నాపురము వీథుల మంజుల గీతికాధ్వనుల్,
దనుజసతీ నట న్మృదు పదప్రకటీకృత రత్న నూపుర
స్వనములు, కామలోలుపనిశాటుల చిత్తములన్ గరంచుచున్.

పదునుల్ బెట్టిన వాడి కత్తులనుపై పైకెత్తి ఝుళిపించుచున్
కదనుల్ ద్రొక్కుచు పోదు రాదితిజు లంకాపట్టణమ్మందు సై
న్యదళమ్ముల్ నడు రేయి చీమ చిటుక్కన్నన్ గూడ విభ్రాంతిమై
పడి మార్గప్పటు చూచి వత్తురు విధి వ్యగ్రైక నేత్రమ్ములన్.

ఆదశకంఠ దానవుని యజ్ఞహవిస్సులు దేవతా చయం
బాదట స్వీకరించుచు నిజాకృతులన్ శుభముల్ వచించు ముం
బోదురు వెన్క, కెంత భయమో యత డన్నను, తత్కృతూత్సవా
మోద ఫల మ్మెమ్మె వాని బలమున్ చలమున్ మదమత్సరమ్ములున్.

యోచన సాగునంతవర కూరక యుండుట యొప్పు దాపయిన్
చూచుట గాదు దైత్యపురి సొంపులు, వీలుగ నెప్పుడుండునో
వేచుట గూడ కాదు నడి వీధిని, పూనిన కార్య దీక్షలో
లేచిన వాడు లేచినటు లేగెను మారుతి జానకిం గనన్.

పిల్లియొ పిట్టకూనయొ పిపీలిక యో యయి సందుగొందు లం
దల్లన కామరూపమున నాపవనాత్మజుడేగి లంకలో
నెల్లెడ మెత్తనౌ అడుగు లిమ్ముగ నుంచుచు సంచరించె ని
ల్లిల్లును జూచుకొం చెచట పృథ్విజ కన్పడు నోయటంచునున్.

పూచిన పూలతీవ పొలుపుల్ గల సుందరి, ధర్మ బద్ధమౌ
రాచకులమ్మునన్ బెరిగి రామ నృపాల వరేణ్య భార్య కా
నోచిన పుణ్యశీల, తరుణుల్ గొనియాడెడు సాధ్వి సీత నే
డే చెఱయందు రాముని స్మరించుచు నశ్రువులొల్కు చున్నదో.

క్రూరులు నిర్విరోధ పటుఘోర వికార భయంకరాకృతుల్
దారుణ మారణాయుధులు దైత్య చమూపతు లున్న చోటులున్
వారి విశాల సౌధములు వాయు జు డేగి ధరిత్రి జాతకై
ఓరిమి బట్టి జూచె నొక టొక్కటె, యామెయుఁగాన రాదెటన్.

పోయిన దారులన్ కనుల ముంగట నాతడు జూచె కామలీ
లాయిత హేలలం దగిలి యంగన లెల్లరు మద్యపానము
ద్రాయుత చిత్తులైన మదనార్తులు భర్తల బాహు బంధన
స్ఫాయదనంతకేళి రస సంగతి నుండిన పానశాలయున్.

ఇంతటి సందరమ్ము లగు నీ నవరత్నసువర్ణసౌధ శు
ద్ధాంతము లీనిశాట మిథునాళి విలాస వినోదలీలలం
దంతము లేని భోగములకా! తుద కన్న జుగుప్సతోడనే
యంతయు జూచె నాపురమునందున హన్మయు పట్టువిడకన్.

పుష్పకవిమానము

లేచిన కంటి తెప్పు ముకుళింపని నిశ్చల దీక్షపెంపునన్
జూచుచు పోవు దారి, నొక చో మహనీయ వినూత్న కాంతిమ
ద్దీపికలన్ దళత్తళలు దిక్కుల నింపు నపూర్వ గేహమున్
జూచె సమీర సూనుడు కనుల్ మిఱుమిట్లుగ విస్మయమ్మునన్.

మేఘపంక్తులలోని మెఱపు తీవల గూర్చి
నిర్మించిన మనోజ్ఞ నిలయ మనగ,
నీలాభ్ర సీమలో నిలిచి తళ్కుల నీను
జిలుగు చుక్కల నేరి చేసి రనగ,
ఆకాశ వీధిలో హంస లెత్తుక మోయు
రమణీయ కాంచన రథమనంగ,
దివినుండి దిగివచ్చి భువిని వ్యాపించిన
సర్వ భాగ్యాన్విత స్వర్గమనగ.,

అబ్బురము గొల్పు నొక్క గృహమ్మునచట
అద్భుతాశ్చర్య చకితుడై హనుమ కనియె;
మహితపుష్పక నామ విమానమద్ది
విశ్వకర్మ నిర్మించిన విమలగృహము.

సురిచిరమై సురాధిపుని సుందర సౌధము కంటె రమ్యమై
మురువుల ప్రోవు లామనుల పూవులు రాశులు పోసి నట్టులై
నిరుపమ కాంతి రూప మహనీయత లందము గొన్న పుష్పకం
బరయుచు నిల్చెనచ్చటనె యాకపి ధీవరు డబ్బురంబునన్. 144

ఎంద టెక్కోనస్ స్థలము మఱింతగలిగి
కామ గమనమ్ము లలర నాకమున గూడ
స్వామి యింగిత మ్మరయుచు సంచరించు
మాన్య మహిమాన్వితమగు విమానమద్ది.

నరసుర దానవుల్ త్రిభువనమ్ముల నెవ్వ రెఱుంగ నట్టి దు
స్తరతర సత్తపోవ్రతము సల్పికుబేరుడు బ్రహ్మ సత్కృపన్
వరముగ నావిమాన మొక భాగ్యముగాగొని యేగి యక్షు లె
ల్లరు గొలువన్ నిరంతర విలాసములన్ విహరించె దానిపై.

ఈర్ష్యాచిత్తుడు క్రూరకర్మరుడు దైత్యేశుందు దుర్మార్గ దు
ర్ధ ర్షుండై వని సోదరుండ నెడి చింతల్ లేక స్వార్థకృధా
మర్షంబొప్ప కుబేరునింగెలిచి డంబమ్మొప్ప మీరన్ బలో
త్కర్షప్రౌఢిమ నావిమానమున వీకం జేయు సంచారముల్.

రావణుని నివాసము

చూచిన కొలంది మఱిమఱి చూడగోరు
రమ్య పుష్పకమ్మును వీడి రామ దూత
దూరముందుండి యే కడు సారు లోలయు
రావణుని సువిశాల హర్మ్యమును గనియె.

అది యొక కొండ కొండపయి అచ్చపు కాంచన రత్న కాంతి సం
పదల వెలుంగు మన్ నగరమధ్యగ సంతత మద్యపాన దు
ర్మద పలలాశి సైన్యపరిరక్షిత మై విలసిల్లు హర్మ్యమ
య్యది దశకంథుడుం దనలతాంగులతో వసియించు సౌధమున్.

చందన శీతలం బగురుసారమనోహరసీమ, దేవతా
నందన పారిజాత సమ నవ్య వికస్వర పుష్ప గంధిలా
నందనివాసమా దితిజనాథుని వాసము ముజ్జగమ్ము లం 150
దందము నందు సాటి యగు నట్టిది కానని రాజవాసమున్.

౨౨. ఉ. ఏసి పని ముంగటి సర్వ విస్తార వాటికమావళి సౌధముల్
మణిగణ కాంతి సముంచిత గోపుర మంజుల సాతిన మందిరముల్
మనుకొని సాగెడు మోహన వాదనకృతుసుధామధు గానములున్
వని, విని, మారుతి కాలిడె ఆదితిజాధిప సుందర సౌధమునన్.

దితి జాధీశునివాస మొక్కటియు కాంతిస్ఫూర్తి రమ్యంబునై
యతి వేలాద్భుత పట్టణమ్మగుచు హర్మ్య శ్రేణి బుద్యానముల్
లతికా శాలలు కేళికాద్రులు సరోరాజన్య పీఠస్థలుల్
రతి గేహమ్ముల తోడ నిండి వెలుగున్ రాత్రుల్ పవల్ వేడ్కలన్.

వినిపించున్ నడు రేయినిన్ దనుజపృథ్వీనాథు సౌధమ్మునన్
వినుతప్రాభవ కామినీ పద నటద్విన్యాస మంజీరని
స్వనముల్, గాన వినోద నాద విలస ద్వాద్యమ్ములున్ దైత్యనా
థుని దర్పోద్ధత ధైర్యసాహస బలస్తోత్రమ్ము లత్యంతమున్.

దానవ నాథు సౌధ సముదాయము వీధుల కొక్క యంతమే
కానగరాదు ! ద్వారముల కాంతులు జిమ్ము మణిప్రదీపి కా
నూన ఘృణీ వితానముల నొప్పిన క క్ష్యలు దాటి యా
వానరుడేగె దైత్యకులవల్లభునంతిపురమ్ములోనికిన్.

అవని జాన్వేషణ మ్మనుకూల మగునట్లు
సురలు వెల్గించిన జ్యోతియనగ
శ్రీ కళాదీప్తమౌ సీతాముఖద్యుతి
వానరాగ్రణి కాన వాలు గాగ,

మహిత పయోరాశి మథన వే ళోద్భూత
కమనీయ మధుసుధాకలశ మనగ
ఆకాశమందుండి హనుమ కాశీస్సులం
జలుపు శ్రీరామ తేజ మ్మనంగ

వెండి పంజరమున హంస విధము దోప,
వెన్నెలలు నింపి నీలాభ్ర వీధినుండి
ఉర్వి నెల్లర కాహ్లాద మొసగు చుండె
కలువ చెలికాడు చలువల వెలుగు ఱేడు.

తెలి వెలుగు వెన్నెలలు కరదీపికలుగ
దైత్యనాథుని గృహసముదాయమందు
కలయ వెదకెను నల్గడల్ గాడ్పు పట్టి
జనకజం జూచు నాసలు సందడింప.

రత్నరచితకుడ్యములందు బ్రతిఫలించు
చంద్రికల మఱింతగ బ్రకాశమ్ము నందె
మెఱుపులట్లుగ దైత్య కామినుల నగలు,
ముంగురుల మధ్య వారి మోములును గూడ.

ముదితల మోము లెఱుంగని
సదమల హృదయుండు హనుమ జనకజ కొఱకై
మది నన్యమెఱుగక కనుల
కెదురయి న వనితలనట పరీక్షగ జూచెన్.

ఎంత వెదకిన గాని యేయెడను గూడ
కనుపడదు తల్లి, ఆదశకంఠు డెచట
నుంచెనో యేమొ యెటు జూతు నంచు మదిని
ఆశయు నిరాశ నడుమ నాహనుమ యుండె.

కాంతలతో ప్రసిద్ధమణి కాంచనదీపసమంచి తోజ్జ్వలత్
కాంతిమయప్రపంచమది, కన్నుల (జూచియు నమ్మలేని శు
ద్ధాంతము భోగ భాగ్యముల తావిదియున్ దనకైసృజించి యం
దంతము లేని సౌఖ్యముల నాదశకంఠుడు మున్గియుండెడున్. 162

మెచ్చియుతండు రావణు నమేయ సుఖమ్ముసు లంక నున్న సం
పచ్చయు మెల్ల, నాక్షణమె భావమునందలపోయు జానకిన్
ముచ్చిలి దెచ్చినట్టి యధముండితడీవయి రాము చేతిలో
జచ్చుట దప్పదం చెవరు సాయము వచ్చిన ధైర్యమిచ్చినన్.

వననిధి దాటి నాడు, తన బాటకు నడ్డుగ నిల్చు వారినిన్
దునిమి నిశాటనాయకుని దుర్గము లంకను జేరినాడు, సీ
తనుగనలేని యట్టి కడు దైన్యమునన్ కపి వీరుడుండె చే
సిన పని కన్న మిన్నలయి చేయగ నుండిన చేత లెక్కువై.

హనుమంతుండును జూచె నా విపుల హర్మ్యాంతః పురమ్ముందునన్
దనివిం గూర్చెడు మద్యముల్ మెసవి కాంతాలోక మధ్యమ్మునన్
తనువైస్మృత్యదశావశానుభవ నిద్రామగ్నుడౌ రాక్షసా
గ్రణి నత్యుగ్ర వికార విగ్రహానముత్కర్షున్ దశగ్రీవునిన్.

ఎత్తగు నద్రిపై మదపుటేనుగు విశ్రమ మంది నట్లుగా,
అత్తరు పూవుదండ లల రారెడు మంచము నందు మద్యపున్
మత్తున నుండె నాయసురనాథుడు దానవ కాంత లాత్మలం
దత్తిన భక్తితో చలువలారెడు వీవన లూని వీచగా.

ప్రియకాంతాతతి సంగ మోద్ధత రతిక్రీడా సముద్వేదనా
మయముల్ రావణు శ్వాసవాయువులు, శుంభత్ సర్ప నిశ్వాససం
చయమ ట్లంతి పురమ్మునన్ వెడలు టా సామీరి కొక్కింతగా
భయమై దూరము పోయి రావణుని రూప మ్మారసెన్ వింతగా.

ఇనుపగుదియల గలిపి నిర్మించి నటుల
ప్రబల భీకరమ్ములు కందరము లెసంగి,
ప్రక్క పయిబడి గాఢ నిద్రను మునింగి
రావణుండుండె నొక్కపర్వతము వోలె. 168

ఏనుగు తుండముల్ వలె బలీయపు బాహుయుగమ్ముగల్గు నా
దానవ నాథు మేన విశదమ్మయి కన్పడె నింద్రు తోడ పో
రై నపు డంది యుండిన శతారపు ఘాతము లట్టి ధీరుడా
ఆనత వైరి దానవకులాగ్రణిప్రాణము లెంత గట్టివో.

ఆయెడ రత్నదీప కళికామల కాంతి సమూహమధ్యమం
దాయత దీప్తితో వెలిగె నాయ సురాధిపుమోము, సుందర
శ్రీయుత లైన కాంతలిరు చెంతల వంతులు బూని సేవలన్
సేయుచు నుండి రా యసురు చేతుల లాలన లంది సౌఖ్యమున్

వాడని పూల సొంపలరు వాలు జడల్, మణి భూషణమ్ముల
ల్లాడెడు చేడె లా వలపు లాడుల మధ్యగ నున్న కాంత నా
గాడుపు పట్టి చూచె త్రిజగమ్ముల యందలి యంద మెల్ల తా
ల్మాడెడి సందరాంగి దనుజాధిపు పట్టపుదేవి నచ్చటన్.

ఆడం బోయెడి తీర్థ మెట్టెదుట నున్నట్లై మహాభాగ్యమే
తోడై వచ్చినరీతి పైకెగసి గంతుల్ వైచి నల్వైపులం
దాడెన్, తోకను ముద్దు బెట్టుకొని తారాడెన్, ధరాజాతనే
చూడం గల్గితి నంచు సొరెకును చూచుం దాను మండోదరిన్.

హనుమకు నిల్వ లేదు మది నాముద మొక్క నిమేష కాలమున్
జనకజ సాధుభావ గుణ సంపద గల్గిన పుణ్యశీల, అ
య్యనిమిషు లందలేని సుగుణాన్వితు డారఘురాము భార్య ఈ
దనుజ కులాధి నాథు దరి దాపుల జేరునె ? చేర దంచునున్.

పరకాంతం దిల కించుటల్ దనకు పాపమ్మంచు లో నెంచియున్
ధరణీ జార్థమె చూచి నా నిటుల కాంతాలో కమున్ కామత
త్పరదృష్టుల్ తనకిందు లేవనుచు చిత్తమ్మందు భావించి తా
నరిగెన్ మారుతి వాడవాడలను సీతాన్వేషణాసక్తితో. 174

దనుజుడు రాముపై గినిసి ధాత్రిజ నిప్పుడు జంపియుండునో,
దనుజుల మధ్య నెంతయని తాలిమి దాపహియుండు నాత్మలో
తనగుణ శీల రక్షణకు దప్పక ప్రాణములన్ ద్యజించి యే
జనకజయుండు నేనిచట సర్వము లంకను జూచితిన్గదా.

నను వీక్షించిన యంగదాదులు వడిన్ బ్రశ్నింతు రుత్కంఠతో
హనుమా ! లంకకు నేగి యేపనులు నీవచ్చోట సాధించి నా
వనినన్, చెప్పుట కేమియున్నదిక నే నాలస్యముంజేయుచో
దనువుల్ వీడుదు రావనేచరులు యత్నంబెల్ల వ్యర్థమ్మయై.

క్రూరుం డాదశకంఠు డంబరమునన్ గొంపోవుచున్నప్పు డా
నారీ రత్నమె నేలమీదబడి ప్రాణాల్ వీడెనో, జానకిన్
కోరల్ సాచుచు నాతడే తినియె నో క్రోధాల్ రుచింపంగ సీ
తారామామణి నెందునుం గనని యత్నంబయ్యె నాపాలిటన్.

తారావీధి నవార్యవేగమున సీతం బట్టి కామాన్విత
ప్రారంభుం డసురేశు డట్లు కొనిపోవం జూచి దేవాంగనా
వారం బేమి తలంచె నోయనిన భావావేశ యై సీతదా
నారాట మ్మవమానమంది చనె నో ప్రాయోప వేశమ్మునన్.

ధరణిజరూపమెట్టిదియొ తానయి చూడగలేదు నేటికిన్
సురచిర ధర్మమార్గపరిశుద్ధ మనస్విని రామ నామత
త్పరమననమ్ము వీడని తపస్విని, సాధుగుణైక శీల నా
పరమ పతివ్రతన్ గనెడు భాగ్యము గల్గునె యన్న చింతలో

బ్రాతిన్ బూనిన కార్యమిట్లు నెఱవేర్ప న్లేని దీనుండనై
సీతంగానక వెన్క కేగు నెడ కిష్కింధా పురిన్ వానర
వ్రాతం బేమను ? రామలక్ష్మణులకున్ బ్రాణమ్ము లెట్లుండు నే
రీతిన్ అంతులు వోయి పైబడు నా సుగ్రీవుండు కోపోగ్రుడై. 180

యాగపవిత్ర భూమి జను పందిన తల్లిని చూడ లేనిచో
సాగర వేలలన్ తపము సల్పగ బోయెద, కానిచో నసు
త్యాగము నైన చేయుటయు దప్పదు, నాదు భవిష్యదర్థముల్
సాగిన సాగకుండిన అసాంప్రత మన్న దొకండుగల్గునే.

అటుల విహ్వల మానసుం డయిన హనుమ
మనసు నందలి యావేశ మణచివైచి,
చచ్చి చేసెడి దేమి యీ జగతిననుచు
మరల యోచించె తనకున్న మార్గములను.

చూచిన చోటులందిరిగి చూచెద చూడని చోటు లున్నచో
వేచియటన్ గనుంగొనుచు వేగ మెపోయెద సాధు సద్గుణ
శ్రీ చరితామృత ప్రథిత చిక్కణ మూర్తి ధరిత్రి జాతనున్
జూచినగాని నాతలపు చుమ్మలు తీరవు కోర్కెతీరదున్.

ఎఱుగడె కార్త వీర్యు నెదిరించి గడించిన శిక్ష నెమ్మదిన్,
మఱచెనె వాలి చేతి యనమానము, ధీరత మీఱనొక్కటా
కరమున నెత్తుచున్ శివుని కార్ముకమున్ దునియాడు రాఘవే
శ్వరు సతి నే చెఱంగొను నిశాటునకున్ మరణంబు దప్పునే.

ధరణిజ నేమిగా దలచి దానవు డిట్టుల దొంగిలించె నో;
నిరుపమ పుణ్యశీల ధరణీజను నేనిట జూడకున్నచో
బిరుదు మగంటిమిన్ దితిజవీరులు నవ్వరు జూచుచుండ నా
కఱకు నిశాటు బట్టి ప్రతి కారము సేయక ఊర కుందునే.

దనుజుడా రావణుం డనిన కోపమ్ము
జనకజం జూడలే దనిన తాపమ్ము
ఇఱియించె హనుమంతు నిరుగడలందు
తరువు నొంచిన రీతి సురుప్రభంజనము. 186

అశోకవనము

దానవ నాథు సౌధ సముదాయ పథమ్ముల వీడి వేగమే
క్షోణిజ కోసమై వెదకి చూడని చోటులు, క్రొత్త వాటినే
పైన కనుంగొనంగ ననిలాత్మజుఁడెత్తగు మేడ నెక్కగా
కానగ నయ్యె నొక్క వనికామల వాటిక కండ్ల కింపుగన్.

అది యొక పుష్పకుంజ నిచయాన్విత చారు వనప్రదేశ, మ
య్యది బహు జాతి వృక్ష నిలయం, బసు రేశు విహారశీల కా
స్పదమగుచోటశోక వన వాటిక క్రొత్తగ దోచి యచ్చటన్
వెదుకగ నిశ్చయించె పృథివీజను మారుతి కౌతుకమ్మునన్.

సురుచిర పుష్ప కుంజ తరు శోభిత మా వనవాటికాస్థలం
బరుదుగ దోచి రాక్షస భటావళి తప్పక కాచుచుందు రీ
పరిసరసీమ నెల్లరయ వచ్చునో యంచు దలంచి భక్తిని
ర్భర విమ లాంతరుండగుచు ప్రార్థనలంబచరించె నర్మిలిన్.

రాముడు, సీత, లక్ష్మణుడు, బ్రహ్మయు రుద్రుడు సర్వదేవతా
స్తోమము లష్ట దిక్పతు, లశోకవనిన్, ననుగాచుగాత, న
వ్యామల పద్మనేత్ర జనకాత్మజ నా కగుపించు గాత, సత్కృపా
ప్రేమ మయాత్ములెల్లరును వీరని కొల్తు నమస్సుమాంజలుల్.

ఈ కడ నున్న వారు గురుతించగ ఁ జాలని అల్ప రూపమే
నాకనుకూలమౌ వెదకు నప్పుడు, సద్గుణ పుణ్యతేజమీ
నాకనువెల్గు సీతకన నయ్యెడు దన్కను చూచు చుందు నా
రాకలు పోకలిం దెఱుగ రాని విధమ్మున సంచరించెదన్.

అనితలంచు నాతని కాత్మయందు ఁదోచె
పావని యొవండు, రాము దీవనల బలమె
సర్వమై నడిపించు నీసరణి ననిన
భావ ముత్సాహ ధైర్య సంపన్నమగుచు. 192

పుట్టిన నాటి నుండి వెలుపుంజవి చూడని గాడ్పుపట్టియా
చుట్టున నున్న కొండ లొక చొప్పున జేరగనీని దుర్గ పుం
గట్టడులై యశోకవనికాపరిరక్షకులున్న తీరు క
న్పట్టిన పట్టులం గనుచు పంతము తో నొకతెంపుసేయుచున్.

తోకన్ పైకెగ నెత్తి గుండియల యందున్ శ్వాస బంధించి అ
స్తో కోత్సాహ పరీత చేతన బలస్ఫూర్తి ప్రతాపమ్మునన్
దూకెన్ వానరు డొక్క దూకున మహోత్తుంగమ్ము హర్మ్యాగ్ర
ధీ కక్షమ్మున నుండి తోట వరకు ద్రేకస్ఫురద్వేగియై.

రివ్వను చల్లగాలి పొదరిండ్ల c గదల్చు టొకండె తప్ప యే
సవ్వడి యున్ జనింపని; నిశాసమ యాంధతమః పథమ్మునం
దెవ్వరు c జూడరాతనిని ఎవ్వరు చూచినగాని పోల్చలే
రవ్వన సీమయందు తిరుగాడు నొకానొక యల్ప జీవినిన్.

వచ్చిన నూతనాతిథికి స్వాగత పూర్వ సపర్యలట్లుగా
మచ్చికమైసుధామధుర మంజుల పుష్ప సుగంధ వాయువుల్
తెచ్చిన దాయశోకవన దేశము, నిండు మనమ్ము కూరుముల్
విచ్చిన రీతి, మిత్రునకు విందులు గూర్చు హితమ్ములన్నట్టుల్.

సల్లలిత ప్రసూన మధు సౌరభ తర్పిత శీతలానిలం
బల్లన వీచు సుందర వనాంతర మీయెడ నైన నేను నా
తల్లిని జూచినప్పుడు గదా రఘురాముని పాదమంటి యా
చల్లని మాట చెప్ప గల శాంతి లభించు నొకింత నెమ్మదిన్.

గాలికి రాలి మేనిపయి గప్పిన పూవుల క్రింద హన్మయున్
లీలగ పూలకుప్పయు వలెన్ బొలు పారుట గాంచి మాధవ
శ్రీలలితుండశోక వన సీమల నున్నటులన్ ముదమ్మునన్
దేలిన వామనోజ్ఞ సుమ దృశ్యము జూచుచు పంచభూతముల్. 198

సదమల సాధు శీల, వికసన్నయ సద్గుణ జాల, సీతకై
వెదుకగ లేదు ఈ వనము వీధుల నింతటి దన్క నిప్పుడీ
హృదయము క్రొత్త యాస ఉదయించిన సందడి తొందరించు నీ
యదనున నీయశోకవనమంతయు జూచెద నాల్గు మూలలన్.

ధారుణి జాత జూడని వ్యథన్ కపివీరవరేణ్యు డావనిం
జేరుముహూర్త మెట్టిది యొ చిత్తము లోనొక నూత్న కౌతుకో
దారపథమ్ము గాంచిన విధమ్మున సీత గవేషణార్థమై
చేరువనున్న యొక్క గిరి శీర్షమునన్ నిలుచుండి యాతడున్.

ఈ యందమ్ముల తోట యిచ్చ టయినన్ పృథ్వీజ కన్పించుచో
నాయత్నమ్ముల పంట రామవిభు నాజ్ఞాదౌత్యసంసిద్ధియై
మాయా రాక్షసు డాదశాస్యునికి రామాస్త్ర ప్రచండాగ్నులం
దాయుర్దాయము చెల్లి పోవు టది తథ్యంబంచు నున్నంతటన్.

నీలాకాశ విశాల మార్గముల చాంద్రీ రమ్య రమ్యోత్సవ
శ్రీలాలిత్యము లార వోయుచును పాల్చెన్ నిర్మలాంభ స్సరః
కేళీసుందర రాజహంస మను భంగిన్ చంద్రు డౌజ్జ్వల్యరే
ఖాలీలాకృతి మల్లెపూదెరలు లంకన్ గప్పి నటొప్పుచున్.

గిరితట మెక్కి చూచుచును కీశకులుండు తలంచె నాత్మలో
సురుచిర కాంతి మంతమగు చోటిది, సాగర తీర శీతశీ
కరములు చిత్తశాంతినిడు కానన సీమయు, లంకనున్నచో
ధరణిజ యుండగాఁదగిన తావిది సర్వవిధమ్ము లందునన్.

వరుసలు దీర్చి నట్టి సుమవల్లరులున్ ఫల వృక్షముల్ సరో
వరములు పుష్పగంధ మృదువాయువు లుత్తమ రత్న వేదికల్,
సురుచిర మందిరమ్ము నొకచో గల కానన మిద్ది రాక్షసే
శ్వరుని విహారకేళి వన వాటిక యౌ నని యెంచె నాతడున్. 204

తెలతెల వారు చుండె తెరదీయును చీకటు, లావెలుంగు దా
రుల నెవ్వరైన చూడగలరున్ నను నంచు నతండు చెట్ల కొ
మ్మలబడియేగు నప్పు డొక మాదిరి సన్నని గొంతు టెల్గులన్
పులుగులు గూళ్ళనుం డెగిరి పోయెడి సద్దొక టే వినంబడెన్.

వనములలో జనించి వనవాటికలన్ జరియించుచుండి ధా
త్రినిగల సర్వ వృక్షముల తీరులు సర్వ మెఱుంగు అంజనా
తనయున కాయశోక వనధామమునంగల చెట్టులన్నియున్
దన హృదయమ్మునన్, పరిచితాదర మిత్రుల యట్లె కన్పడెన్.

అనుకూలమ్మగు చెట్టు నం దొదిగి తానా చోటులన్నింటినిన్
గనగానెంచు సమీర సూతి కెదుటన్ గన్పించె నొక్కింతద
వ్వున భూమీధర శృంగ నిర్గత జలా పూర్ణంబునై యొక్క వా
హిని యాదాపున శింశు పాతరు వొకం డింపై కనుందోయికిన్

సలలిత రామ నామ జప సాధు తపస్విని సీత నీవనీ
స్థలములయందె రావణుడు దాచిన దాచగ వచ్చు, నీనదీ
జలముల నీరముం గొనగ జానకి వచ్చెన యేని నాదుక
న్వెలుగు గ ంజూతు నంచు మది నెంతయు సంతసమంది యాతడున్.

చూచినయంత నేమగును జానకికిన్ రఘు రాము సేమమున్
వా చవి తన్వి నొంద నుడువన్ వలె, నైగమ ధర్మమార్గయా
త్రాచణశీల యాజనని తామరసాంఘ్రుల వ్రాలి మ్రొక్కగా
నోచవలెన్, తదీయ కరుణోల్బణ వాక్సుషమల్ వినన్ వలెన్.

అని యూహించుచు నాత డా తరువునం దాసీనుడై అల్పమౌ
తనువున్ డాచుచు శాఖికాచయము మధ్యన్, జానకీదేవి నీ
వన మందే కనుగొందు నన్న యొకవిశ్వాసంబుతో అంజనా
తనయుండావనిఁజూడగాఁదొడగె నుత్సాహ ప్రదీప్తాత్ముడై. 210

ఆశ్వాసాంతము

అందంపుటశోకవన
మ్మందున సీతను వెదుకగ నడుగిడు హనుమత్
సుందర కథయిది మృదుపద
బంధుర రసభావఫణితి వ్రాసితిరామా.

భక్తి సంభృత మౌని హృత్పద్మ మధుర
సార సౌరభాస్వాద నాసక్త మతివి,
రామ ! మన్మనః పద్మ పత్రములొకింత
భాసిలును గాత నీపద భక్తినియతి.

నీసుకుమార రూపమహనీయత లెంచుచు, నిన్నెఱుంగగా
నాసలు పెంచు కొన్న హృదయమ్మున గ్రమ్మిన విమ్మ చీకటుల్
గాసిలి పెట్టు కుండ కడగాజను యోజన సేయు పూజనా
భ్యాస విధాన భాజన తపమ్మొన గూర్చ గదే దయా మయా ! 213

ఇది శ్రీ హనుమత్ప్రబంధ ద్వితీయ భాగమునందు
లంఖిణీవధ లంకాప్రవేశము సీతాన్వేషణము,పుష్పకవిమానము
రావణునివాసము అశోకవనము అను కథలు గల ద్వితీయాశ్వాసము.

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము - తృతీయాశ్వాసము

సీతాదర్శనము

శ్రీకరగుణ నీరాకర,
భీకర రాక్షస విదార, వేదవిహారా !
ప్రాకట కరుణా ధీవర,
లోకైక మహోధివీర లోకాధారా !

దేవా, శ్రీరఘు రామా ! అవధరింపుము .

శ్రీ రమ్యంబైన అశో
కారామము చెట్ల క్రింద యననీజను సా
మీరి కనుంగొని యామెకు
నూఱట గొల్పిన కథయిదియున్ మధు రోక్తిన్. 215

రాముని కార్య సిద్ధికయి రాక్షసనాథుని యింటి లోపలన్
భూమిజ యుండు చోటులను పూనిక నెంతయు వెద్కుచుండె మే
నేమము నందు నాకు ధరణిన్ కరుణాలయు నప్పుడే పితా
స్తోమము సాయమై నడపఁ జాలురు గావుత సత్యయత్నమున్.

దీవ్యత్ ద్యుతిమ ద్భాసుర
భవ్యాననపద్మమూర్తి, మధుభాషిణి సం
సేవ్యపదద్వయి జానకి
నవ్యాప్త పవిత్ర కాంతి నాకగుపడునా !

హనుమంతుండటు జూచెను వొక వృక్షాగ్రంబునందుండి యా
వెను నానావిధ పుష్ప సుందర తరు ప్రీతమ్ము దేవేంద్రునం
దనమో, యక్షకులేశు సుందర వనీ ధామమ్మొ నా నొప్పు తత్
కనదత్యూర్జిత మాయశోకవని సాకల్యమ్ము నాసక్తితో.

మలయ ధరాధరోద్గత కుమార సమీర విహారముల్ సుగం
ధిల సుమసార సౌరభ వినిర్భర కుంజతలమ్ము లంబర
స్థల పరిచుంబి వృక్షసముదాయము లచ్ఛ జలప్రపూర్ణస
ల్లలితసరస్సరోరుహవిలాస విశాలము లా ప్రదేశముల్.

కువకువ గూయు పక్షులగళస్స్వరము లా
స్వరములం గొని వచ్చు వల్లిగాలి,
వల్లిగాలికి నల్ల నల్లన కదలాడు
పసిమెఱుంగుల తరుపల్లవములు,
తరుపల్లవములపై తరుణకాంతులఁజిమ్మి
చదల దారుల వెల్గు చంద్రరేఖ,
చంద్రరేఖ వెలుంగు జాడలం దిరుగుచు
అటునటు నగపడు నసురభటులు, 220

అసుర భటుతతివలని యపాయముల ను
పాయముల తలంగగ నాంజనేయు డచట
నచట డాగి చరింపగ ననువు లెసక
మెసగు చాయశోకవనము పసఁ దలిర్చె.

చారువనప్రదేశ మిది, జానకికిష్టము పూవు టీరపుం
దారులలోఁ జరించుచు ముదమ్మున వానికి ప్రోది సేయుచున్
నీరము వోసిపెంచుటలు; నేనిట నుండియె చూడవచ్చు నా
వారిజపత్రనేత్ర యిటు వచ్చిన వేళలయంచు నెంచుచున్.

ఇరవుగ గూండ్లయందు నిదురించిన పుల్గులు లేచి దిక్కులన్
దిరుగుట లేదు, రాత్రి తెరదీయగ లేదును, మూడు యామముల్
జరిగిన జాడగానని నిశాసమయమ్మది, చెట్ల చాటునన్
మఱుగుగ నుండి చూచుటయె మంచిగ దోచె సమీర సూతికిన్.

సమ సోపాన వినిర్మితమ్మయి యుదంచద్రత్న సందీప్త మున్
రమణీయమ్మగు మందిర మ్మనతి దూరమ్మందునన్, తత్సమీ
పమునన్ గొందఱు దైత్య భామినులు గన్పట్టంగ నాశ్చర్యసం
భ్రమ మొప్పన్ పరికించె మారుతియు తత్ప్రాంతమ్ము నుత్కంఠతో.

అది యొక వేయి కంబముల యందము లొప్పు గృహమ్ము, చుట్టునున్
మృదువగు చెట్లనీడ ప్రసరించినచోటది, దానవాంగనల్
పదుగురు చేరి రాగృహము పట్టుల, వారల మధ్య దీనయై
సుదతి యొకర్తు చేడ్పడిన చూడ్కుల నుండుట జూచె నాతడున్. 225

అనుపమ రూప యౌవన సమన్విత యామిహాజాత నెట్టిలో
తనకు వశమ్మొనర్పఁ దగు దారుయి జూడగ దానవాధిపుం
డనిపిన వారె వారు, జనకాత్మజ మట్టును జేరి నిప్పుకల్
తొనకెడి నేత్రయుగ్మముల మాష్ణలాడఁవొడంగి రామెపై.

తనకును మట్టునుండు వనితల్ నిరతమ్ము క్రుధా విలోకనా
నన లగుచున్ కఠోరవచనమ్ములు బల్కుచు నుండ వారిమ
ధ్యను బికుబిక్కుమంచు బెడిదమ్ముల కోర్చుచు దిక్కులేని రీ
తినిఁ గనుపించె నాయబల దీనత రూపముఁ దాల్చినట్లులన్.

ఆమెను శ్రద్ధతో మరల నాహనుమంతుడు చూచె, రూపమం
దామెకు లేదు దైత్యవనితాకృతి, సంతతశోకతప్తయౌ
నామెయుఁ గాని సీతయగునా యని పోల్చు కొనంగ వీలుగా
నేమియు గూడ నుంత కనుపించని వింతను మున్గె నాతఁడున్.

వలువలు ధూళిగ్రమ్మి, ఉపవాసములన్ దను వెల్ల ఁజిక్కి తమ్మిపూ
వులు కరవౌ సరోవరము పోలిక, ధూమముగ్రమ్ము నగ్నిగా,
జలదము వెన్క చందురుని సామ్యము నొంది నిరస్త భూషయై
పాలుపఱి యున్న స్త్రీని కపి ముఖ్యుఁడు సందియ మంది చూచుచున్.

మొగమునఁ జారు నశ్రుకణముల్ తడి యారవు, గుండెలోతులం
దెగసిన శోకవహ్ని నశియింపదు, కోరలు దీర్చి మ్రింగగం
బగగొను వేటకుక్కలకు మధ్యగఁ జిక్కిన లేడి పిల్ల య
ట్లగపడుచుండె దైత్యసతులందున నామెయు సీతగావలెన్.

శోకము గడ్డకట్టిన కృశోదరి, కత్తులు బూని రాక్షసీ
భీకర మూర్తు లిర్గడల వేచి పిశాచము లట్లు మూగి య
ఱ్ఱాకల ఁబెట్టగా గినుక నందదు, ఏదియొ ధ్యానభావము
ద్రాకృతి వోలె నాకుఁ గననయ్యెడు నీమెయె సీతగావలెన్. 231

తరుగని వేదనాగ్ని పరితప్తము దీనము నయ్యు నామెసుం
దరముఖమందు ప్రస్రవముదాయము సందుల నుండి జారు చం
దురు తెలి వెన్నెలల్ పడిన తోడనె తోచుచు నుండె గౌరవా
దరయుత సాధుభావములు తప్పక యీయమ సీతగావలెన్.

సలలితాలంకార శబ్దార్థ మాధురీ
కమనీయతలు లేని కవితయట్లు,
తారకాతతియును తారకాపతి లేని
చదలున నైల్యమ్ము గదిసి నట్లు,
కడలేని దుఃఖమ్ము కన్నీటి కడలి యై
పొంగెత్తి మొగమును ముంచినట్లు,
సందియం బుడివోని శాస్త్రార్థముల యట్లు,
పొగలు గ్రమ్మిన నిప్పుసెగలరీతి

ముండ్ల మధ్యఁ జిక్కిన నును ఁబూవు వోలెఁ
దీన మానస యై పరాధీన యగుచు,
తులువలై చరించెడు గరాసులకు మధ్య
కానుపించిన దామె యాకార మచట.

ఆమె శిరోజ పాశముల యందున తళ్కు లెసంగు నొక్కచూ
డామణి దక్క వేఱొక యెడన్ నగలేమియులేవు, మైథిలీ
భామిను లిద్ది తాల్తురట బ్రాతిగ, ప్రాక్తన సంప్రదాయదీ
క్షామతి యీలతాంగి జనకాత్మజ కావలె నిశ్చయమ్ముగా.

అనువుగ నీమెమేనినగలన్నియు మూటగ నొక్క చెట్టుకొ
మ్మను బడియున్న వీమె మెయి ముద్రల బోలిక తోచు, పూర్వమా
వనములయందు మాకుఁగను పట్టిన భూషణరాజి ముద్రలున్
గననగు నీమె పాదముల, కావలె నిశ్చయ మీమె సీతయున్. 236

అని భావించుచు దైత్య కాంతల కఠోరాలాపముల్ చిత్తముం
మనఁగల్పించిన కోపమాపుచు మరుత్సూనుండు దానూహసే
సిన యట్లావనితాగణమ్ము నడుమన్ జేడ్పాటుమై నున్న భా
మిని జానకి యన్న నిశ్చయ మెదన్ బెంపొంది యుప్పొంగుచున్.

కనుగొనఁగల్గితిన్ జనకకన్యను నేటికి ధన్యమయ్యె నా
జను వని హర్ష బాష్ప కణ జాల ఝురీ భర సభ్రమ శీర్ణుఁడై
ప్రణతు లొనర్చె సీతకును రామున తల్లి సుమిత్ర సూతికిన్
మనసున పొంగులెత్తు నభిమానము మేనున పుల్కలొత్తగన్.

రాముని యంగుళీయము కరమ్మునఁ దాల్చుచు నొక్కసారిగా
నామె పదారవిందముల నాక్షణమందున వ్రాలనెంచి న
న్నామెయు నమ్మదేమొ దితి జాంగనలున్ బ్రతిరోధమంచు నే
దే మఱి యొక్క యూహ మది నెంచుచు పావని యాత్మలోపలన్.

జనకుని యాగ భూములను జన్మము నందిన సాధ్వి సీతయున్,
దినకర వంశ భూషణుఁ, డుదీర్ణ పరాక్రమమూర్తి సర్వస
ద్గుణనిలయుండు రాముడును దుర్భర దుఃఖములన్ మునింగి రా
దనుజు డొనర్చినట్టి దురితమ్మిది యంచు దలంచె నార్తితో.

పుట్టిన నాటినుండి సుఖముల్ జవిఁ జూచిన రాచబిడ్డ న
మ్రాట్టుని కోడలైన సుకుమారియు భాసుర కోసలావనీ
పట్టపురాజ్ఞి కాగలుగు భాగ్యవిలాసిని సీత యిట్టి యి
క్కట్టుల పాలుగావలసె కర్కశుఁడా దితి జేంద్రు వంచనన్.

ప్రబల ధనుః ప్రచండ బలరాముడు రాముడు, విష్టపత్రయీ
ప్రభుతల కన్న మిన్నగనె భావమునం దలపోయు నిత్యమా
త్రిభువన సందరీ మణి కిరీటము సద్గుణ సాధ్వి సీత నీ 242
యుభయులు నేకమై శుభము లొందుట చూతునె నాదు జన్మకున్.

ఇలువిడి పైకిరానినలినేక్షణ, ఓర్పున నుర్వి సాటియై
యలరెడు సాధ్వి, బంధుర వనాధ్వములం దిరు ప్రక్క ముందువె
న్కలఁ గని రామలక్ష్మణులు గావగ నేగు లతాంగి, దానవీ
బలమిటు కాపుఁ గాయు వెతఁ బాల్పడి మ్రాన్పడి యున్న దక్కటా.

నిక్కిన వారు, గర్వమెద నిండిన వారు, మనుష్యమాంసముల్
మెక్కిన వార లీయసుర లీసుకుమారిని రామమూర్తికిన్
దక్కగ నిత్తురే యనుచు ధైర్యములక్కు మరుత్ప్రసూతికిన్
ప్రక్కల నుండి యేదొ సడి వచ్చిన జాడలు దోచె వీనులన్.

అరిగెనిశన్ త్రియామ సమయ మ్మసు రాంగన లాడు దుష్టని
ష్ఠురముల తాళలేక కడు శోకమునంబడియున్న సీతనా
కరకు గరాసు లే కుటిల కష్టము పాలొనరింతురో యటం
చరిమురి యౌచు జాగరిత నారయు చుండె నతండు సర్వమున్.

ధ్వనులును దగ్గఱౌకొలది బాటలలోని తమమ్ముఁజీల్చుచున్
గన ఁబడె దీప కాంతులును, కాల్నడ ఁగౌందఱు వచ్చు సవ్వడుల్
వినఁబడె, నీ యడావుడికి వేగమె మారుతి చెట్టు కొమ్మలం
గనుపడకుండ డాగె విహగమ్మయి జానకి వైపె జూచుచున్.

రావణుని దుర్భాషలు

బలిమిన్ వంచనఁ జేసి జానకిని పాపం బెంచకన్ లంకలో
పల బంధించిన దాది రావణుడు తద్భామామణిన్ బొందగా
కలలంగాంచుచు నామెకుం దనసమగ్రప్రాభ వాధిక్యతల్
తెలియం జేయగ జూచుచుండె దగురీతిన్ సాధ నోపాయముల్.

తనకడ నెందఱైన వనితల్ గల రంగజు బాణముల్ శరత్
కనదురు కాంతిరేఖికలు కాని, ధరాత్మజ రూపలక్ష్మియం
దణువును గూడ పోల జన రాపయి శూర్పణఖన్ గురూపిఁజే
సిన రఘు రాముపైఁ దనకసిన్ గడు వేగమె తీర్చుకోవలెన్. 248

దైత్యుం డా దశకంఠుఁ డీపగిది పంతమ్మూని శ్రీరాముపై
ప్రత్యుద్గామిగ సీత లోఁగొనెడి కార్య మ్మొక్క కర్తవ్యమా
ప్రత్యాసార మటంచు నెంచుచు నుదీర్ణ ప్రౌఢ యత్నంబులం
దత్యంతమ్మును క్రిందు మీదగుచు మూయం డక్షిగోళంబులన్.

దినములు మాసముల్ గడచె, తెల్లము గా దొకయింత జానకీ
మనసెటు లున్నదో, యచట మాటుగ నుండిన కాంత లైన నుం
దన కొక మంచి మాట విన దగ్గదియున్ గొని రారు ఇర్వదా
కనులును గల్గువాని యొకకంటికిఁ గూడను నిద్ర పట్టదున్.

వేలాతీత పటుప్రతాప బలవద్విక్రాంతుఁ డారాము డె
ట్లో లంకాపురి కేగుదేరగ గలం డుర్వీజకై, యింక దా
నాలస్యం బొనరించుచో సకల కార్యంబున్ వృథా యన్నటుల్
డోలాందోళిత చిత్తు డయ్యె దనుజుండున్ రాత్రిరాత్రంతయున్.

కనులన్ మూసిన విప్పియుంచినను తత్ క్ష్మాజాతయాకారమే
తన చిత్తమ్మును బట్టి లాగెడు కలంతన్ అంతులా కామవే
దన పాలై యును రుస్సు రంచు ఁబడి స్వేదస్విన్న దేహమ్ముతో
దనుజాధీశుఁడు లేచె పుష్పసమమౌతల్పం బసహ్యంబెయ్యె.

వీకదనం బెసంగ పువు విల్తుడు తొందరసేయు నార్తిలో
ఆకలి గొన్న సింగ మటు లాతడు నాల్గవ జాము గాని యా
చీకటియం దశోక వన సీమల కేగగ లేచె సీతకై
ప్రాకట రత్న భూషణ విరాజిత రమ్యతనూ విలాసుఁడై.

ప్రక్కల బారు దీరి పరివారము బట్టగ రత్నదీపికల్,
చక్కనివార లంతిపురిచానలు నూపుర నాదమాధురుల్
దిక్కుల నింపి వెంట నరుదేరగ నేగె, నిజప్రభావముల్
మొక్కలమై రహింప పదిమోముల రక్కసి తేడు వేడుకన్. 254

తొలి ప్రొద్దున్ బడి వేదమంత్ర పఠనోక్తుల్ దిక్కులన్ మ్రోగ, మం
గళ గీతమ్ముల నాలపించు చెలమిన్ గర్పూర నీరాజన
మ్ముల గంధర్వలతాంగులున్ గొలుపు పాల్పుల్ నిండు సౌధాంగణ
స్థలులన్ దాటుచు సీతకై వెడలె దైత్యస్వామి దర్పంబునన్.

ధగధగాయుధకోటి ధాటీ పటాటోప
భటసమూహము బరాబరులు సేయ,
దశశిరః కోటీర విశదరత్నవ్రాత
విద్యోత మాకాశ వీధి కెగయ,
భూరి హేమాంగద తారహారానీక
హారహీరముల దేహమ్ము మునుగ,
కంఠసీమాలోల కమనీయ సుమజాల
మాలా సుగంధముల్ మలసి యాడ,

రాజవైభవముద్రా విరాజమాన
లలిత శృంగార హేలావిలాస భాసు
రోత్స వానంద శుంభన్నిరూఢి దనర
చనె నశోకవనికిని రాక్షసుల రాజు.

బలితుం డద్భుత కాంతిమంతుడు మహాబాహుండు రక్తారుణో
జ్జ్వలనేత్రుండు త్రిలోక రాజ్య విభవప్రౌఢాధిపత్యప్రభా
కలితౌదాత్త్యము సర్వమున్ తనదిగా కామోత్కటోద్వృత్తి సం
చలితుండై యరుదెంచు దానవపతిన్ సామీరి వీక్షించుచున్.

ఇంతటి భోగ భాగ్యవిధ మింతటి రాజస మింత వైభవ
మ్మింతటి గౌరవమ్ము కలదే మఱి యెవ్వరి కేని విశ్వమం
దంతట నెచ్చటైన యని యచ్చెరువందుచు చూడసాగె నొ
క్కింతగ క్రిందకున్ డిగి మహీరుహశాఖల వాయుసూనుఁడున్. 259

ఈ చటులప్రభావమహనీయుఁడు, తీవ్ర తపోవిశిష్ట దీ
క్షాచణు ఁడన్న కీర్తియును కల్గిన వా, డి దియేమి కర్మమో
నీచత నిట్టు లన్యరమణీమణులన్ చెఱఁబట్టు ఘోరపా
పాచరణుండునై రఘువరాగ్రణికే యొక యెగ్గు సేసెడిన్.

అని యోచించుచు శింశుపాతరువు మధ్యన్ పత్రముల్ చాటుగా
తనయాకారము కప్పిపుచ్చుకొని, సీతాసాధ్వియున్నట్టిపై
పున కే తెంచుచు నుండె నేమి దురితమ్మున్ చిత్తమందెంచి వ
చ్చెనో యీదుష్టుఁడ టంచు మారుతియు దృష్టిన్ నిల్పె నాదైత్యుపై

అకృతాలంకృత, మశ్రుసిక్త, మతిదీనాస్యమ్ము, దీర్ఘవ్యథా
వికలాకారము, శుష్కదేహము, భయోద్విగ్నమ్ము సంస్కారకే
శకదంబమ్ము మలీమసాంబరము నౌ క్ష్మాజాత రూపమ్మె దై
త్యకు లాధీశునకున్ గనంబడియె సౌందర్య ప్రభారాశిగా.

సరసీ జేక్షణ, నీలకేశిని శరత్ చంద్రాస్య బింబోష్ఠియున్
గురుభారస్తన హీనమధ్యయగు నాక్షోణీజ సౌందర్యమున్
బరికింపం దరికేగె రావణుడు దీప్తప్రాభవోత్కంఠతో
నర యక్షోరగ దేవతా విభులకందన్‌రాని గర్వమ్మునన్.

ప్రబల దీర్ఘ నాసాపు టోచ్ఛ్వాసితముల
భయదముగ వచ్చు ఆబోతు బాటనుండి
తొలఁగు ఆవులట్లు గ దైత్యు త్రోవ నుండి
తప్పుకొని రట జేరిన దైత్యసతులు. 264

మానిని : హేయవిజృంభణ మేచెడి హాసము
లిర్గడ నింపుచు నెక్కుడుగా
నాయసురాధిపు డాతుర పూర్ణ మ
హోట్టమునన్ దడబాటునడన్
ఆయమ దగ్గర కాగక వచ్చుట
నారసి భీతహృదంతరయై
కాయము నెల్లను క్ష్మాసుత వేగమె
కాళుల సేతులఁ గప్పికొనెన్.

పదిమాసమ్ముల కాలమేగినది, యీ భామాలలామమ్మ నె
మ్మది నేమున్నదొ చెప్ప దీ దనుజసమ్రాట్టింత యల్పుండె ! యం
చెద జన్మించిన కోప మాపు కొని దైత్యేశుండు పల్కెన్ లస
న్మృదు వాక్యమ్ముల జానకిన్ దనవశం బెట్లైన గావింపగా.

తనువున్ గప్పుచు నన్నుఁజూచి భయమందన్ మానుమో లోకమో
హన సౌందర్య విలాస భాసురతనూ ! హ్లాదైక లీలా వినూ
తన హేలన్ విహరించు కాలమిది సీతా ! నాకునున్ నీకు నీ
వనుమానింపక రమ్ము నీమృదుపరిష్వంగమ్ము నాకీయగన్.

ఈలంకా మహనీయ రాజ్య మిక నీవే యేలగావచ్చు నో
శ్రీలాలిత్యముఖారవింద మధుమూర్తీ ! నిత్య మానందవ
ల్లీ లావణ్యమనోజ్ఞ డోలికల దేలింతున్ గదే జానకీ !
త్రైలోక్యాధిప భోగభాగ్యము సమస్తమ్మున్ ద్వదీయమ్ముగా.

సదయాపాంగ విలాస సుందర సరోజాస్యచ్ఛవీ ! నాశిరం
బిది నీసుందర పాద పీఠముల యందే యుంతు ప్రేమోల్లస
న్మృదు భావామల పుష్ప మాధురులపేర్మిన్ నమ్ము మీమాట నీ
పదపూజన్ బ్రతు కంతయున్ మనెదనే భద్రాయ తోత్సాహినై. 269

పాడొనరింపఁబోకువె ప్రభాత సరోజమనోహరాస్య! నీ
పోడిమి, రామునిన్ మఱచిపొమ్మిక నీమగఁడాతడెట్లగున్
లేడినిఁ గూడఁ బట్టుకొనలేని బడుంగతడేల నీకు. నే
నీడును జోడు నీకగుదునే, మహినేలు మగంటిమిన్ చెలీ.

నను శాసింపుము దీపి తామల మతీ ! నా ప్రాభవమ్మొప్ప నీ
జనకున్ నేడె దిగంతరాళ జగతీ సామ్రాజ్యపట్టాభిషి
క్తునిఁ గావింతును సంతసమ్మిదియుఁ గాకున్నన్ వచింపంగదే
మనమం దున్నయభీప్సితార్థము దయన్ మన్నించి నన్ మైథిలీ !

ఆనందమ్మగ నీవు నా ప్రణయ రాజ్యప్రాజ్య సింహాసన
స్థానం బందున జేరవచ్చిన నిమేషమ్మందె నిన్ దాకుదున్
గానీ, యంతటి దన్క నీదరికి నేగన్ నమ్ము మీ మాట నా
ప్రాణప్రాణమ వంచు నెంచెద భయభ్రాంతిన్ విడం జూడుమీ.

నాకున్ గాంచన రత్న సుందర విమానమ్మున్న దీపుష్పకా
ఖ్యాక మ్మయ్యది కామరూప గమన ఖ్యాతమ్ము నిద్దానిపై
రాకాచంద్ర మయూఖ రంజిత వనప్రాంతమ్ము లా నందన
ప్రాకారమ్ములఁ ద్రిప్పి చూపుదునికన్ ప్రాభాత పద్మచ్ఛవీ.

పూవు మెఱుంగు పూత పొలుపుల్ దొలు కాడెడు నీవయస్సు నీ
యౌవన మెల్ల నాయడవి యందలి వెన్నెలఁ జేసె రాముడో
శ్రీ విలసత్ సుగంధలహరీ పరిశోభిత పుష్పకోమలీ !
రావణుఁ డట్లుచేయడు పరాకునగూడ నిజమ్ము పల్కెదన్. 274

ఏమెకమో బలింగొనక నింకను దా బ్రతికుండెనేని నీ
రాముఁడు వార్ధి దాటి యిటు రాగలడా ! యిటు వచ్చెనేనియున్
నామును ముందునన్ నిలుచు నంతటి వాడును గాదు జానకీ !
రాముఁడు, రాముఁడం చిటుల రాయిడులం బడు టేల నీకునున్.

ఆలస్యమ్మిక నేల? చూడు మిటు సీతా ! నూతనాలంకృతి
శ్రీలావణ్య విభూషణాంబర రుచిస్స్రగ్ర ప్రసూనావళీ
మాలారమ్య పురస్కృతుల్ దితిజభామారత్నముల్ నీదుపా
దాలం బెట్టిరి, లేచితాల్పుమివి సీతా! నాదుదేవేరిగా.

కామతమస్సు పైకొనిన గాఢ వికారము నందు రావణుం
డామెయి పల్కుటల్ వినుచు నాతనిపైఁబడి యొక్కత్రొక్కునన్
భూమినిఁగూల్చు నాగ్రహముఁ బూనియు వానరుఁడూరకుండె ; దా
నేమి దలంచెనో మది నొకించుక, రాముని యాజ్ఞ లేకనున్.

ఆపగలేని భర్తృవిరహార్తికి లోగి, దురంత దుఃఖ వీ
చీపరిపీడితాత్మయగు సీతకు చేతమునందు చిచ్చులం
దాపిన యట్లు, వాడిమొనతాల్పుల ముల్కులు గ్రుచ్చినట్లుగా
నై పిశితాశి పల్కులు విషాగ్నులఁగ్రక్కిన వంతకంతకున్.

మానదు రావణుండు తనమాటలు, వానిమొగమ్మొ చూడ దా
మానిని సీత; వేదహితమార్గమనస్వితఁ గల్గు రామ భూ
జానిని గూర్చి దానవుప్రసంగము దుస్సహమై, తృణమ్ముచేఁ
బూనుచు నడ్డుగా, దనుజ భూవిభు దిక్కయి యామె యిట్లనున్.

కనువిందౌ హరివర్ణశోభిత పశుగ్రాసమ్ముగా ధాత్రి నీ
తృణమైనన్ దన పుట్టు వెల్ల చరితార్థీభూతమై గ్రాలు నో
దనుజాధీశ ! యిదేల నీకు పరకాంతామోహ దుర్మార్గ సం
జనితాశాపటుపాపసంచరణ నీచంబైన దుర్వృత్తియున్.

మాయలమౌని వేషమున మాటలు నేర్చి కఠోరవృత్తి న
న్నీ యెడ కీవు బల్మిఁ దరలించితి వియ్యది పాపమంచు నీ
కేయొకరున్ వచింపరె? వచించిన గూడను, నీకు లెక్కలే
దా! యొక రన్న మంచి పలుకైనను, బ్రహ్మమహాన్వయోద్భ వా ! 281

నా కర్మ మ్మిట్టు వ్రాసియుండె నుదుటన్, గాదేని యచ్చోట శ్రీ
కాకుత్సాన్వయరమ్యకీర్తి, రిపువర్గధ్వంసి, కాలాగ్ని రే
ఖాకోదండుఁడు రాముఁడున్న యెడ నీకంఠమ్ము లుగ్రాస్త్ర ధా
రాకృత్తమ్ములు చేసి యుండెడిని గృధ్రశ్రేణికిన్ విందుగా.

ఆతని ధర్మపత్నిని మహాగ్ని సమాన పవిత్ర నైన నే
సీతరుణమ్మునందె శపియించి నినున్ బరిమార్పఁ జాలియున్,
బ్రాతిగ, ప్రాభవచ్ఛటుల పౌరుష వహ్ని రముప్రవీరుఁడే
నీతల లెల్ల డుల్చు టవనిం దగు కార్యముగాఁ దలంచితిన్.

నీకామార్తి ప్రగాఢమై సఱగినన్ నిత్యమ్ము గ్రీడింపు మీ
నీకాంతాతతిఁ గూడి, అన్యవనితానీకమ్ముపై మోహవాం
ఛాకాలుష్యము లేల? వేఱొకడు పుష్పాస్త్ర జ్వరార్తుండునై
నీకాంతం జెఱఁగొన్న యప్పు డెడదన్ నీకెట్లగున్ జూచితే.

దనుజుఁడ వీవు మర్త్యవనితన్ దగ నేనును నీకు, నిప్పుడై
నను రఘురాము పాదనలినమ్ముల నన్గొని పోయి జేర్చుచో
నినుఁగరుణించి బ్రోచు మహనీయ విశాల దయాసుధాబ్ధి య
య్యినకులనాథుఁ డిద్ది యొనరింపు మికన్ బ్రతుకం దలంచుచో.

అనివచియించి సీత దను జాధిపుడుఁన్ దన కన్నుదోయి ముం
దున విపరీత కామమద దుష్టపిశాచముగా నిలుచుండి యుండుటల్
గనుగొనలేని శోకమున కాల్వలుగట్టిన బాష్పముల్ గనుం
గొనల స్రవింప వెన్దిరిగి కూర్చొనె నావలి దిక్కు మోముగా.

ఏమే, మూర్ఖపు మట్టిబొమ్మ! విను మెంతే గౌరవప్రేమ భా
వామోదంబున మాప్రభూత్తముఁడు మాట్లాడంగ మర్యాదగా,
నీ మోమైనను జూపవేల యనుచున్ నిందించు చాదానవీ
స్తోమం బామెను చుట్టుముట్టగనె, దైత్యుం డడ్డుగా నిల్చుచున్. 287

ఔనే, యోసి ధరాత్మజా! యెడమొగంబై యిట్లు నీవుండుటల్
మీనారీసహజమ్ము నౌ బిగువు సుమ్మీ యంచు భావింతు, ని
ప్పైనన్ బోయినదేమి, నీచరణదాస్యమ్మానగా పల్కుచు
న్నా నేకోరిక యున్నదో సరగునన్ వాక్రుచ్చి శాసింపవే.

అడిగిన నీదుప్రేమమధురాశలు తీర్చగలే దటన్న యే
యెడమును కల్గనీను, వినవే హృదయ మ్మఖిలమ్ము నుంచి నీ
యడుగుల దామరల్ కొలువులై మనని మ్మిటు పైని నన్ను నీ
పుడమిని, చారు శారదిక పూర్ణసుధాకర చంద్రికాద్యుతీ !

నారలుగట్టి భీకరవనమ్ముల రాముని వెంట నేగు నా
యాఅడు వేల నీకు మగువా ! మధుమాస విలాస కేళిశృం
గారవనమ్ములం దసుర కాంతలు సేవలొనర్ప నాకడన్
జేరి నిశాటరాజ్యమహి నేలుము పట్టపుదేవి వై యికన్.

తులువతనమ్మునన్ మదముతోబడి తూలుచు దానవేంద్రుడున్
బలికిన దానికిన్ బదులు పల్కదు, చూపును గూడ వానిపై
నిలుపదు సీత, దుఃఖ మెదనిండిన కాయము ఱాయి యైనటుల్,
కలుషితవర్తనుండు దశకంఠుని వాక్కరినోపలాహతిన్.

పావనవేద ధర్మ విభవప్రథితాకృతి సీత మౌనమం
దే విలయాగ్నియున్నదియొ యీదురితాత్ముని చావుకై, జ్వల
ద్దావము చుట్టుముట్టిన విధమ్మున తిమ్మిరిగొన్న రిమ్మలో
రావణుఁ డాగ్రహుండయి ధరాసుత పై కరుదెంచు నంతలో.

ఆగు మటం చొక ర్తతని హస్తముఁ బట్టుచు నాపఁ గన్నులం
దూగిసలాడు కోపమదియున్ పదిరెట్లగు కామదుర్మదో
ద్వేగ మొకింత యాపుకొని పృథ్విజనుం గనుచున్ వచింపగా
సాగెను రావణుండు పరుషప్రకటోత్కట దుష్ప్రలాపముల్. 293

''నా''యను దిక్కులేని యొక నాతిగ నీపతియున్ మఱంది ని
న్నా యటవీస్థలిన్ విడచినందుల కేనుగదా తలోదరీ
సాయమొనర్చి తెచ్చి నిను సమ్మతితోఁ గపగూడు మంచు ప్రే
మాయతభావమెంచి యభిమానము నుంచితి నింత నీపయిన్.

వినుతప్రాభవ వైభవుల్ త్రిజగతీ వీరాధివీరాగ్రణుల్
వినమత్ శీర్షులు నై భజించు ప్రభుతల్ వెల్గొందు సమ్రాట్టునై
నినుప్రేమించి వరించి వచ్చితిని తన్వీ! ఈమహాభోగ భా
గ్యనిధిన్ కాలునఁ దన్ను వెళ్ళిమతివిన్ గాబోకు ధాత్రీసుతా !

ధరణిన్ సాటియెలేని కోమలివి సీతానీవు, ప్రాభాతసుం
దర బాలారుణరశ్మి నీవదన సౌందర్య మ్మికన్ నామన
స్సరసీజమ్ము వికాస మందఁగల వీక్షామాధురుల్ జింది నా
కరమున్ బట్టు శుభక్షణమ్ముకయి నే కాంక్షించు చుంటిన్ చెలీ !

ఓరిమి నిట్లు తాను చనవొప్పిన కూరిమిఁ జూపగా తిర
స్కారమె గాని వేఱొకటి గానక, జానకి పై దురాగ్రహ
క్రూరవికార రూపమున కోరలు విచ్చు మొగమ్ము కారముల్
నూరిన తీరునన్ నుడివె నోటికి వచ్చిన యట్లు దైత్యుఁడున్.

దాపై వచ్చి కరమ్ము సాచితిని సీతా ! ఒక్క పట్టైన రా
దీ పంతమ్మున కర్థమేమి యిక రెండే రెండు మాసమ్ములే
నాపై నిల్పను చేరు మీగడువులోనన్ నన్ను లేదేని ప్రా
ణాపాయము తప్ప దిప్పు డయినన్ నామాట లాలింపుమీ.

కనుగొను మోసి ! యీదనుజకాంతలు కత్తులు దూసి కోసి నీ
తనువు సమస్త మాగడువు దాటిన నాటికి నోటి కింపుగా
తినుటకు వండి పెట్టెద రిదే తుదిమాట యటంచు నాజ్ఞలా
వనితలకిచ్చి రావణుఁడు వచ్చిన దారినిఁ బట్టె క్రుద్ధుఁడై. 299

దనుజకులేశుఁ డిట్టు లిలుదారిని బట్టుట జూచి ధాన్యమా
లినియను నాతి అడ్డమయి లీలగ వాని కరమ్ముబట్టి యో
యనుపమ సుందరాంగ విను మంద మొకింతయులేని సీతకై
మనసది యేల, నన్నుగొని మన్మథ రతికేళిని దేలుమా యనన్.

జానకి మీదనే తలపు సర్వము నిల్పిన దానవాధిపుం
డానన మెత్తియైన గనఁ డాయతివన్ వినఁడామెపల్కులన్,
మానస మేదియో యితర మార్గమునం జరియంచు నూహలో
దానికరమ్ముఁ గ్రక్కున విదల్చి వదల్చుకొనెన్ వడి నిల్లుసేరగా-

ధరణీజాతను లోఁగొనన్ బడిన యత్నమ్మెల్ల వమ్మై హృదం
తరమం దేమియు తోచబోవనియవస్థన్ కోపసంతాపసం
భరితుం డంగలు సాచికొంచుఁ జనె శుంభద్వేగియై రాక్షసే
శ్వరుఁ డుద్విగ్నమనస్కుఁడై శకలితాశావేశ చింతాత్ముఁడై .

దానవు డేగె, దైత్యవనితల్ తనకెట్టి విపత్తు గూర్చుచున్
ప్రాణము దీతురో యను భయమ్మున దిక్కొకడేదియున్ మదిన్
గానని సీత కా యెడమకన్నదరెన్ శుభసూచకమ్ముగా
మానసమందు దైన్యమొకమాత్రము తగ్గిన శాంతి గూర్చుచున్.

దైత్యస్త్రీల దుష్ప్రవర్తన

క్రచ్చులలేచివచ్చి పడగల్ బుసకొట్టిన దుష్టసర్పమై
చిచ్చులు గ్రుమ్మరించి చనె సీతపయిన్ దశకంఠు డుగ్రకో
పోచ్చలితప్రచండ పరుషోక్తుల ; గుండెల యందు శూలముల్
గ్రుచ్చిన యట్టులై పుడమికూతురు చేతనదక్కి సోలగా. 304

కావరమేచినట్టి తమకమ్ములు గ్రమ్మిన పాపచిత్తుఁడా
రావణుఁడన్న దుర్మదదురాసదముల్ వినుచున్న దేవక
న్యావళి కశ్రులొల్కె నయనాంతములన్, సుగుణాఢ్యయౌ నొక
ర్తేవిధి వంతఁ గుందుట సహింతురె సుంతయు సాటి మానినుల్.

సారతరమ్ము లైన గుణసంపద లాకృతిఁ గొన్న సాధ్వి యీ
ధారణిజాతదాపునకుఁ దానయి రాగలడా ! దశాస్యుఁ డే
దూరమునుండియో దుడుకు దూరుల ప్రేలును గాని యంచు సా
మీరియు వేచియుండెను సమీపకుజమ్మున మంచివేళకున్.

ఆనతి యిచ్చి యేగె నసురాధిపుఁ డాగ్రహుఁ డౌచు సీతనె
ట్లైనను లోగొనన్ వలయునంచు, నదే తమకున్ నెపమ్ముగా
దానవకాంతలెల్ల వసుధాత్మజ చుట్టునుఁ జేరి వాకొనం
బూనిరి సూటిపోటువిసముల్ కరవాలము లెత్తి చూపుచున్.

పౌలస్త్యుఁ డీతడు బ్రహ్మకు మనుమఁడు
రావణుండీతడు రమణి! వినుము,
సర్వదేవతలను శాసించు ప్రభువు మా
దశకంఠుఁ డతనికిఁ దగుదు వీవె,
త్రిభువన సామ్రాజ్య విభవముల్ నీకె ట్టు
లబ్బు రావణు నంకమందుఁ గాక,
దేవేరులందున రావణుం డిక నిన్నె
మిన్నగాఁ జూచునో మెలత వినుము. 308

వీరుఁడాతడు సొగసైన వెలఁది వీవు
వ్యర్థ మొనరింపఁ బోకు నీయౌవనమ్ము
ప్రభువులకు నెల్ల ప్రభువు రావణునెదిర్చి
బ్రతుకలే వొక్క దినము ధరాతనూజ!

వలచినీకైవచ్చి నిలచిన స్వామిని
చిన్న బుచ్చితి వేమి చేటె నీకు?
రావణాంతఃపుర రాణివాసముకన్న
అడవులు మేలటే యతివ నీకు?
సిగ్గు లేదే నీకు సీతా యొకింతైన
మగవారి నెదిరించి మాట లాడ ?
బడుగు రాముఁడె గాని పటుదైత్యవీరుఁడు
తగడటే నీకును తగుల మాడ?

స్త్రీలకును మధ్య గానని చెప్పుచుంటి
మింతదనుకను గాక మాకేమి పట్టె,
ఎఱుగుదువు నీవె దశకంఠుఁ డిడిన యాజ్ఞ,
కలవు మాయొద్ద వాడికత్తులును సీత!

అని దితిజాంగనానిచయ మాడెడి నిష్ఠుర దుష్ప్రలాపముల్
విని సహియింప లేని పృథివీజయు వీనులు చూడి నట్టులున్,
తనువున నిప్పుకల్ చెలగి తార్చిన యట్లయి వారిమోములన్
గనుటకె భీతి జెంది వణకాడుచు నిల్కడలేని కాళులన్.312

హనుమయు దాగియుండి దను జాంగనలన్ గను చెట్టుక్రిందకే
జనకజ తానుఁజేరి కనుజంటను గాల్వలుగట్టు నశ్రులన్
గనలిన కంఠనిస్వనపు గద్గదికన్ విలపించె నా నిశా
వనితయె ప్రత్యుషస్తుహిన బాష్పము లోడిచి తోడు నిల్వగన్.

గట్టు తెగినట్టి కడలియై చుట్టు ముట్టి
పైఁబడెడు దైత్యవనితల బారినుండి
యెచటికేగును? తానెట్లు లేగ గలదు?
వలను జిక్కిన పులుఁగయ్యె వసుధపుత్రి.

ముక్కలుగఁగోసి తింద మీ మూఢురాలు
చచ్చిపోయిన దనుచు నిశాటపతికి
చెప్పెదము లెండు లెండంచు సీతముందు
వికట తాండవ మాడిరా వెలఁదు లెల్ల.

అంతులు మాన రెంతకును రక్కసిమూకలు వంతులాడుచున్
వంత మెసంగ పల్కుదు రవాచ్యము లొక్కరి మీరి యొక్కరున్
దంతురితోగ్రరూపముల; దాత్రిజయున్ తుదకెట్లొ గుండెనొ
క్కింతగ నిబ్బరించి పలికెన్ బటునిశ్చయ వాక్యధీరతన్.

చెప్పుడు మీరలెన్నయిన చిన్నము చిత్తము నంటఁబోవు మీ
తప్పుడు పల్కులెల్ల వసుధాసుతకున్; వినుఁడొక్కమాట మీ
దెప్పరి కంపు మాట విడఁదీయగఁజాలదు రామునుండి న
న్నెప్పటికిన్ రఘుప్రవరుఁడే హృదయేశ్వరుఁడుర్వి జాతకున్-

నిరతము రామచంద్రు ధరణీవరు నమ్మి చరించు సాధ్వినై
వరలెడు నన్ను నిచ్చటకు బల్మినిఁదెచ్చిన రావణాసురుం
డెఱుగడొ మంచి చెడ్డ తనకింటను భార్యలు లేరొ, యిద్దియున్
దురితమటంచు చెప్పు సుదతుల్ తనలంకను కానరారొకో !

రాముఁడు గీముఁ డంచును తిరస్కృతి సేతురు మీరెఱుగంగ రా
రాముఁడు సత్య సద్గుణపరాక్రముఁ డీదశకంఠులంకకున్
దీమస మొప్ప రాగలఁ డెదేనిముసమ్మున దుష్టదానవ
స్తోమ వినాశ మాక్షణమె చూతురు మీరును కండ్ల ముందుగన్-

అతడు వచ్చి రెండు నెల లంతకు మించిన నాడె చంపుడీ
సీతనటంచు జెప్పి చనె, శ్రీరఘు రాముని పత్నియైన యీ
సీతయుఁజచ్చునేయటులఁ, చెట్టున కుచ్చుదగిల్చి రామునే
చేతము నందలంచుచును జీవముఁబాయును గాని ధాత్రిపై-

అనుచును బాష్ప సిక్తనయనాంచలయై విలపించు జానకిం
గని దనుజాంగనల్ చెలులు కంటిరె! యీయమ దొంగవేసముల్
కనులను గప్పి పోదమని గావును కారులు పల్కుచున్నదీ
దినమె వధించి యీమెనిక తిందము విందుగ నంచు నుగ్రలై.

కలకు ఁగత్తుల నూపుచు ఁగరములందు
నుర్విజకడకు వారేగుచున్నయంత
కడు వడిగ లేచి వారి మార్గమున కడ్డు
త్రిజట యను దైత్యకాంత పర్వెత్తి వచ్చి.

త్రిజట

ఆగుడు ! ఆగుడో యతివలార ! నిజమ్ములు సీతపల్కు, లు
ద్వేగము మానుడింక వినిపింతును నాకల యొండు, రాముఁడున్
సాగరమెల్లదాటి తనసైన్యముతో, దను జేంద్రుఁద్రుంచి తా
నేగెను సీతతోడ మహనీయత మీరగ నన్న లిప్తలో.

ఏమీ! చెప్పుము, చెప్పుమో త్రిజట! నీవేస్వప్నముం గంటివే
సామం బొప్పగ రాముఁడిచ్చటికి ఁదాఁజన్దెంచి గొంపోయెనా
భూమీజాతను ; ఎంతఘోరము నిజమ్మున్ బల్కవే స్వప్నమం
దేమే మున్నది వార్ధిదాటి యతఁ డెట్లేతెంచెనే, లంకకున్.

త్రిజట వెఱ్ఱిది గాని ధరిత్రియందు
కలలు కల్లలె యగును నిక్కమ్ములగునె,
యనుచు దైత్యకాంతలు చిత్త మందొకింత
సందియము తోనె విని రామె స్వప్నకథను-

వినుఁడని పల్కె నా త్రిజట; వీరుఁడు రాముఁడు కీశసేనతో
వనధిని దాటి వచ్చి శరవహ్నుల లంకను మండ బెట్టె; రా
వణుఁడును తైలసిక్తమసి వర్ణుఁడు ముండితశీర్షుఁడున్ దశా
ననముల నెత్తురుల్ దెఱల నాల్కలు వ్రేలగ గార్దభమ్ముపై- 326

జనె నల దక్షిణమ్మునకు; చచ్చిరి దానవ యోధు లావిభీ
షణు డొకరుండె నిల్చెనిట; జానకిc దోడ్కొని యుత్తరాశ క
య్యినకులరాజు రామవిభు డేగె విమానము నెక్కి రాజలాం
ఛన విభవోల్లస ద్విజయ సంపదలన్, గపిసేన గొల్వగా.

పరమపతివ్రత భవ్య చరిత్ర
వరగు ఙాన్విత సీత పాదాలకెరగి
చరియింత మీపయి సద్వర్తనమున,
అరుగు దేరుండని యనినంత త్రిజట.

సీతమొగమ్ముc జూచుటకె సిగ్గయి యేమియు పాలుపోవకన్
చేతన దక్కి యాత్రిజట చెప్పిన మాటకు దైత్యకామినుల్
భీతమనస్కలై పరుపు cబెట్టిరి తామిట విన్నదెల్ల నా
రాతిరియందె పోయి వివరమ్ముగ రావణుతో వచింపగా.

కోఱలు జూపి జానకిని కోసుకు తిందమటంచు వచ్చు కో
పారుణనేత్రలన్ త్రిజట యాపెనుగాని, సమీరజుండు దు
ర్వారమహోగ్రముష్టి పటుపాటవమున్ జవిc జూపి ప్రోవులన్
బేరిచియుండువాడె ఒకపెట్టున వారల రక్తమాంసముల్.

కరవాలమ్ములు జూపి సీతపయికిన్ గాడ్రవ్వు దైత్యాంగనా
దురితమ్ముంగని కిన్కcబూను హనుమంతుండింత శాంతించె; నా
ధరణీ జాతకు వామనేత్ర మదరెన్ ధైర్యమ్మెసంగెన్ సమా
దరమొప్పన్ వినిపింపగాc త్రిజటయున్ దాగన్న స్వప్నమ్ముటన్.

అటు లోకించుక యూఱట నంది, మరల
తనదురంతవేదనలను తలcచు కొనుచు,
నలల తాకిడి కూగిసలాడి పోవు
నావవలె కదలాడె జానకియు మిగుల. 332

కొంచెపు బుద్ధి రామనృపకుంజరుఁ గోరితి పైడి లేడిఁదె
మ్మంచును, పల్కరాని నుడు లాడుచు నీసున సర్వసద్గుణా
భ్యంచితమూర్తి లక్ష్మణుని ఁబంపితి నాతని వెంట; నన్నునే
వంచనఁ జేసి కొన్నది విపర్యయ మూరక ఁబోవునే తుదిన్.

అక్కడ యేమి య్యెరొ ముగురత్త లయోధ్యను సేవసేయువా
రొక్కరు గూడ లేక, ఎటులుండిరొ నామఱఁదుల్ ; మఱిక్కడన్
దిక్కొక ఁడేని కన్పడని దీనత నేపడియుంటి; లక్ష్మణుం
డొక్కడె తానుసేయవలయున్ బరిచర్యలు రామమూర్తికిన్.

రాముని వెంట ఁదమ్ముడునరణ్యము జేరుటతో తపస్వినీ
భామిని యయ్యె నూర్మిళయు; పట్టపుదేవి పదమ్ము పట్టలే
దామెకుఁగూడ మాండవికి, నన్నియు వేదనలై యయోధ్యలో
మామకు మారుగా మిగిలె మాన్యగుణుండు సుమంత్రు ఁడొక్కడున్.

వనధితరంగ మగ్నులగు వారికి ఊతలభించు చాడ్పునన్
పెనగొను శోక వీచి పరిపీడిత సీతకు ఁగ్రొత్తయాసలున్
మనమునఁదోచె నాత్రిజట మాటలకున్; హనుమంతుఁడంతయున్
కని మది నెంచె చేయదగు కర్జము పూరితిసేయు మార్గముల్.

హనుమత్ సీతాసంభాషణము

సీతకు రాముమాటలును జెప్పక వెన్కకుఁబోవరాదు, తా
నీతరుణమ్ము నం దిట చరించుట దైత్యు లెఱుంగ రా, దెదో
రీతిని యింత దన్క పచరించినకార్యము పూర్తి కావలెన్;
చేతుల కందు కొమ్మయును చీలి తుదిన్ పడిపోవరాదునున్.

మారుతి కంతయున్ పటు సమస్యయె, క్రిందికి నొక్కమారుగా
బీరము జూపి దూకునెడ పృథ్విజ వీడెవడో నిశాటు ఁడం
చారటఁజెందు; తుట్ట తుద కామె పదమ్ముల చెంత కెట్టులో
చేరిన యప్పు డేమని వచించుటయో అదియున్ సమస్యయే- 338

అదవదఁజెందుమున్ వెడలి రట్టిటు రక్కసులున్ విలంబన
మ్మొదవగగూడ; దేది యెటులుండునొ యీపయి చెప్పఁజాలమి
య్యది యదనైన కాలము ధరాత్మజ వద్దకు నేగ నంచునె
మ్మది పవ నాత్మజుండు పదిమారులు లెక్కలు గట్టె యూహలన్.

పూవుల బోని మెత్తదనమున్, గరుణార్ద్రము రాము చిత్తమా
దైవము సుప్రసన్నలలితమ్మగ చూచెన యేని సత్పుల
శ్రీవిభవమ్ములై యలరు చేసిన నాచెయిదమ్ము లంచు నా
పావన రామమంత్రము జపమ్మొనరించుచు నాత్మలోపలన్-

పాటయు గాదు, గానవిభవమ్మలరన్ సురలోక భాషలో
మాటయుగాదు, లోకజనమాన్య వచస్సుల తేటతెల్లమై
వాటిలు తీయముల్ తొనకు బాసలతో నట జెట్టు కొమ్మకున్
జాటున నుండియే పలుక సాగె నిటుల్ హనుమంతుఁడర్మిలిన్.

చల్లని పిల్లగాలులు కొసల్ దెసలందున పూవుఁదావులన్
జల్లెడు వేళ, మారుతి ప్రసంగములాచిఱుగాలి రివ్వలో
నల్లన వచ్చి విన్బడియె నావసుధాత్మజ వీను దోయికిన్
వెల్లువ జాలులై విరియవిచ్చిన తీయని పూవుఁదేనెలై.

మంజరి: ఇనకులనృపతులు మనువుమాంధాత మొదలగు వారియం దధికతేజస్వి
దశరథు పుత్రుండు ధైర్యసాహసుడు రాముడు సుగుణాభిరాముండు భువిని
తపసి జన్నముగాచె తాటకంజంపె జనకజన్ బెండ్లాడె శంభు విల్విరిచి,
తనసతి తోడను తమ్మునితోడ వనుల రాముండుండ జనకు నానతిని,
జనకజం దొంగిలి చనె రావణుండు. తనసతిన్ వెదకుచు వనులరాముండు
కిష్కింధ యందు సుగ్రీవుతోచెలిమి పాటించె. వానర వల్లభుండంత
జనకజన్ వెదుకంగ సకలదిక్కులకు కపులను బంపె నాకపిసేన గూడి
సాహసమ్మున నేను జలధిలంఘించి దనుజు లంకనుజేరి వనములోనిచట
సీతయెట్లుండు నో చెప్పగా వినుచు అట్లున్న నిన్నునే నరసితినమ్మ-
చేసిన యత్నమ్ము సిద్ధించినాదు జనువు ధన్యమ్మయ్యె జననియీనాడు. 343

అని విరమించె పావనియు ఆర్ద్రము లామధురోక్తి రీతులన్
జనకజ యాలకించి మది సంతస మచ్చెరువున్ జెలంగ తా
ననయముసంస్మరించు రఘునాయకు రాముఁదలంచి పల్కె జీ
వన మిడినట్టి యీమధుర భాషణ మెవ్వరి దంచునర్థసల్-

కలయగఁజూచి జానకియు గాంచెను శీర్షమునెత్తి చెట్టు కొ
మ్మలనడుమన్ వసించు హనుమన్ దరుణార్కునిఁబోలు వానరున్,
లలితసువర్ణవర్ణు, గపినాయకు మంత్రిని వాయుసూనునిన్,
తెలివలువల్ ధరించుచు, మదిన్ వెఱపున్ గలిగించు వానినిన్.

అనయము కానలందుఁదిరుగాడుచు కాలము వెళ్ళబుచ్చు నీ
వనచరుఁడేమి యీపగిది వాకొనుటెట్టులు రాము గాథ నా
కనుఁగవ ముందునన్, నిజము గావుత మియ్యది యంచు మ్రొక్కెనా
జనకజయున్ బృహస్పతికిన్ విధి కగ్నికిన్ మదిన్.

కలఁతన్ బెట్టుచుమొన్న పీడకల గాఁ గన్పించుచున్ కోతి భీ
తిల జేసెన్; శుభమౌను గాత మిథిలాధీశుండు నాతండ్రికిన్
విలసన్మూర్తులు రామలక్ష్మణులకున్; వీక్షించి తీనాడు క
న్నులముం దీకపి నేమి యౌనొ యనుచున్ దుఃఖించె పృథ్వీజయున్.

పెను వెతలందు నిట్లు పరిపీడితయై స్రవదశ్రు పూరితా
నన యగు జానకింగని మనమ్మున నేమియు పాలుపోక అం
జనసుతుఁడామహీరుహము శాఖల కొంచెము డిగ్గి సాను భూ
తినయ వచస్సులన్ నుడివె తీయనిమాటలు తేటలూరగా.

ఫుల్లాంభోరుహపత్రనేత్రవు మహాపుణ్యాత్మ వీవిట్లు ప్రా
ద్దెల్లన్ గన్నుల నీరుగార్చుచును శోకింపన్ గతంబేమి, ఓ
తల్లీ ! యెవ్వరవమ్మ ! నాగసురకాంతాలోకసౌందర్యసం
పల్లీలల్ గనుపించునిన్నుఁగన భాస్వత్ సాధు రమ్యాకృతీ! 349

కమనీ యోజ్జ్వల మంగళాకృతివి ఓ కళ్యాణి, ఆకాశమ
ధ్యము నందుండి ధరిత్రికిం దిగిన దివ్యద్రోహిణీ తారవో,
విమల శ్రీయుత వా యరుంధతి వొ, నిర్వేల వ్యధాదుఃఖ భా
రము నీకేలనొ తల్లి, బందుగులు దూరప్రాంత మం దుండిరో.

ఏమైనన్ భవదీయ రూపసుషమన్ వీక్షింపగా ; రాజక
న్యామూర్తిత్వము, భోగ భాగ్యయుత రాజాంతః పురీ ముఖ్య దే
వీమాన్యాకృతి యున్ స్ఫురించు నెద గానీ, దేవతారూపు నీ
కేమాత్రము లేదటంచు మదిలో నెంతున్ సరోజాననా.

నీమోమందము, నీధరించినది మేనీంద్రాంగనా మాన్య వే
షామర్యాదయు చూచినంతన జనస్థానమ్ము నందున్న నా
డా మాయాదితిజుండు దొంగిలిన స్త్రీవా సీతవా! చెప్పు మ
మ్మా!మే తౌనిక రామ భూవిభుని భార్యారత్న మీవేకదా!

చనవులు నిండు నెయ్యమున చల్లని మాటల నిట్లుపల్కు యా
వనచరు జూడగా విహిత భావమొకింతగ గల్గి సీతయా
ననమునఁ గ్రొత్తగా వికస నమ్ముదయించుటఁగాంచి అంజనా
తనయుడు వేచియుండె వసుధాత్మజ యేమను నన్న యూహలన్.

తనలో తానెదియో తలంచి, తుదకున్ ధాత్రీజ వృక్షమ్ముపై
హనుమంతుంగని రామచంద్రుని యరణ్యావాసమున్ తాను రా
ముని వెంటం జనుదెంచుటల్ దితిజుడున్ మోసమ్మునందన్ను బ
ల్మిని దోడ్తెచ్చుటఁజెప్పి మాఱుపలుకుల్ లేకుండ శోకింపగన్.

ధరణిజ యీమెయే యను ముదమ్మున పావని వృక్షశాఖలన్
సరగునడిగ్గి జానకి దెసన్‌గని కైజత మోడ్చి నీవికన్
వెఱవకు మమ్మ రాముఁడును వేగమె వచ్చును, రామదూత నై
పరువున వచ్చి తీ కుశల వార్తను నీకెఱిగించు కోరికన్- 355

వేద వేత్తయు బ్రహ్మాస్త్ర విదుఁ డతండు
దశరథు సుతుండు రాముండు కుశలమచట
రాముననుజుడు తేజోవిరాజితుండు
లక్ష్మణుడు మీకు కైమోడ్పులను వచించె.

ప్రవిమల సాధు భాషణలు పావనిపల్కులు విన్నయంతనే
యవనిజ హర్ష భావ పులకాంకిత యై హను మంతుఁజూచి యో
ప్లవగవరేణ్యా నీవచనపద్ధతి కబ్బురమయ్యెఁగాని ని
క్కముగ రామదూత వని కోతివి నిన్నెటు నమ్మఁజాలుదున్.

మునివయి వచ్చి మా కుటికి మోసమునన్ ననుఁబట్టి నాడ వీ
వనచరరూపుతో మరల వచ్చిన దైత్యుఁడ వేమి సేయగా
మనమున నెంచి వేసమును నార్చితి విచ్చటి కే విదారణం
బొనరుప నున్న వాడ వొకొ యుర్విజమాత్రమునీకు దక్కదున్-

రాముని దూతయౌ వనచరప్రవరుండవు నీవె యైనచో
సేమము నీకగున్, శుభము సేకురుఁజెప్పు మొకింత యారఘు
స్వామిగుణమ్ములున్, పలుకు చందము; లక్ష్మణుఁడెట్టి వాడు, నన్
స్వామి తలంచునే మనము నం దని జానకి బల్కె హన్మయున్.

జననీ! ధన్యుడనైతి, నాప్రభువు భాస్వత్ సూర్యతేజస్వి, చం
ద్రుని సంపూర్ణకళాకృతిం బలె ప్రసన్నుం డాతఁడావిష్ణుదే
వునికిన్ సాటి యశోధనుం, డినకులోద్భూతుండు శ్రీరామమూ
ర్తిని వర్ణింపఁదరమ్మె సత్యవచనోద్దీప్తోరు వాచస్పతిన్-

రమణీయాకృతి రామభూవరుడుఁధర్మస్వాంతుఁ, డుద్యత్ప రా
క్రమ కోదండుడు, రాజశీల మలరారన్ నిగ్ర హానుగ్రహో
ద్యమ దక్షుండు; సుమిత్రసూతియు సముం డన్నింట శ్రీరామ చం
ద్రమహీజానికి కీర్తియందు, ధనురస్త్ర ప్రౌఢ విద్వత్తులన్.

ధరణిజ! నీవెఱుంగుదు గదా రఘు వంశమనోజ్ఞ మూర్తులా
యిరువురు యిర్వురే రణమహేశ్వరు లుత్తమ రాజలాంఛనుల్;
నిరుపమ వార్షు కాంబుదవినీల శరీరుఁడు రామచంద్రుఁడున్,
వరుస పదారు వన్నియల బంగరు బొమ్మ సుమిత్రపుత్రుఁడున్. 362

సురుచిరమూర్తులున్ సుగుణసుందరు లారఘురామలక్ష్మణుల్,
పరువము గన్న భాస్కరుని వంశమునన్ మణిమూర్తు లిర్వురున్,
ధరణిని నేటి దన్క గుణధన్యులు మాన్యులు నిట్టి వీరశే
ఖరులు మఱెవ్వరెచ్చటను గానగరా రని లోకులందురున్.

ఇంచుక రాము నోట జనియించిన మాట యొకండుచాలు ధ
ర్మాంచిత వేదమార్గ పథమయ్యది, ఆలకు మార్దవంబు క
ల్పించగఁజాలు సాధువును; ఎంత వచించినఁజాలదా కృపా
ప్రాంచదుదార భావమహితాత్ముని రాముని గూర్చి చెప్పగా.

రాముఁ డజేయ విక్రమధురామహిమాన్విత ధైర్యసాహసో
ద్దాముఁ డతండు లేని తరి తాపస వేషము నూని వచ్చి నిన్
కామ మదప్రవృత్తి దశకంఠుడు దొంగిలిపోయి లంకయం
దీమెయినుంచె తత్ఫలిత మేదియొ చూచు నతండు శీఘ్రమే.

రావణుఁడట్లొనర్చిన దురాగతమున్ విని యాగలేని దుః
ఖావిల చిత్తులై నిలిచి రచ్చట రాముడు లక్ష్మణుండు సు
గ్రీవుడు మూవురున్ నిను స్మరించుచు; వేగమె వచ్చి యాదశ
గ్రీవుని శీర్షముల్ దునిమి పృథ్విజ! నిన్గొనిపోవు రాముఁడున్.

నమ్మము తల్లి! నేపవన నందనుఁడన్ హనుమంతుఁడన్న నా
మమ్మున వానరాధిపుని మంత్రిని, రాముని లక్ష్మణున్ వనా
ధ్వమ్మునఁజూచి తోడ్కొనుచు వచ్చితి వానర రాజు నొద్దకున్
సమ్మతి c జెల్మియయ్యె రఘు నాథునకున్ గపినేత కచ్చటన్.

తీరదు కోపమా సమరధీరులకున్ దశకంఠు శీర్షముల్
ధారుణి cగూలు దన్క, యిదితప్పదు వత్తురు వారు శీఘ్రమే;
వారును సే మ మా యెడను పర్వున నేచని నీదు వార్తయున్
వారికి సెప్పగావలయు వంతలికన్ విడుమమ్మ నీయెదన్. 368

మనసున్ విప్పుచు రామలక్ష్మణుల సేమంబున్ సుధాసారవా
చనుడై తెల్పిన వాయుసూను గనుచున్ క్ష్మా జాతయున్ వానిపై
ననుమాన మ్మెదలింప లేక, నను మాయా వాక్యముల్ దెల్పి వం
చన సేయన్ చనుదెంచినాడవని నాస్వాంతమ్ము బాధించెడిన్.

మనుజులు లేరె వేరయిన మార్గము లేదొకొ దూత నంప నా
యినకుల రాజ శేఖరున కీకపి కావలెనా? మహాంబుధిన్
వనచరు లెట్లు దాటెదరు, పల్కఁగలారొకొ యిట్లు, రామల
క్ష్మణులకు నైన దాటుటకు సాధ్య మొకో జలరాశి నంతయున్.

ఎఱుగుదు నందు వా యినకులేశుని యాతడు నన్దలంచునా
విరహవిచార మగ్నుడెటు వేగుచు నుండెనొ యేమొ, లక్ష్మణుం
డెఱుకువతోడ నన్న కొనరించునె సేవలు రామమూర్తి కా
బరువిక తగ్గునే, కనుగవన్ భువినాతని ఁజూడ నేర్తునే.

గడు విక రెండు మాసముల కాలమె యంతటి లోన రాము డీ
యెడ కరుదేరకుండినను పృథ్వితనూజకు నేమియున్న దీ
యిడుమల మధ్య జీవితము నేదొగతిని సమయింతు నంచు దం
దడివడి యేడ్పు జానకికి నంజలిఁబూనుచు నాంజనేయుడున్.

అమ్మా నమ్ముము నాదుమాటలను, మాయాదైత్యుడన్ నేనుగా
నమ్మా! శంభునియంశతో నతుల సత్వాఢ్యుండనై ధాత్రి జ
న్మమ్ముంగాంచితి నంజనానిలులకున్, రామావనీ స్వామి నన్
నెమ్మిన్ నమ్మిన బంటుగా ననిపె నన్వేషింప నిన్నియెడన్.

రాముఁడు వార్ధి దాటి యిటు రాగలడాయను శంక మాను మా
రాముఁడజేయ విక్రమధురా మహిమాన్విత ధైర్య సాహసో
ద్దాముడు, విల్లునమ్ములను దాలిచి నిల్చిన యేని లోకసం
స్తోమము నిల్వజాల దొక తోయధి యాతనిముందు లెక్కయే. 374

తన సాయమ్మున సూర్యుపట్టి సుఖమందన్ రాజ భోగమ్ములన్,
జననీ! రాముడు మాత్ర మొంటిగనె తత్శైలమ్ము నందే వసిం
చును చిత్తమ్మున నిన్ దలంచుచు నెదో శోకమ్మునన్ భూమిజం
గను భాగ్యమ్మికఁగల్గునా యను వియోగ వ్యాకులోద్విగ్నతన్.

''ఎఱుగదు నన్ను వీడి దినమేనియు పెండిలి నాటి నుండి యా
ధరణి జ సీత, నాసకలతన్వున ప్రాణము ప్రాణమా మనో
హరమధుమూర్తి లేక సుఖమన్నది నాకిక నేల'' నంచునున్
నెఱదలు వోవు ఆకటిక నేల పరుండును రాముడొంటిగా.

''సీతకు మొక్కలన్న, వికసించిన మవ్వఁపుబూవులన్నచోఁ
బ్రీతి, నవాంకురమ్ములను వేడ్కగ పెంచుచు నుండు నామె'' యం
చాతడు శీతలాంబువుల నాపువు మొక్కల వద్ద బోసి ని
శ్చేతను డై నిలంబడును, సీత యనన్ మది యెంతమెత్తనో.

తనశోకమ్మును తానె మ్రింగుకొని వంతన్ మున్గి కన్నీరునిం
చును, సీతాయని నిద్రలో పలవరించున్, చెంతనున్నట్టివా
రును తమ్ముండెది యేని సాంత్వనపుఁ బల్కుల్ దెల్పగాఁ బూనుచో
మనసీయండును మాటలాడడును రామస్వామి మౌనమ్మునన్.

అతడు వసించు నాప్రసవణాద్రిని పూఁబొదలెల్ల సాక్షిగా
ప్రతిన నొనర్చి తెల్పుదును రాముడు నా ప్రభు, నీవు మాతవున్,
క్షితిపయి మీపదాబ్జయుగసేవలు నాపరమార్థసాధనల్
సతతము; నమ్ము మీ పలుకు సాధుమతీ రఘురాము గేహినీ.

అదియేదో యొక దుర్ముహూర్త మసురుం డానాడు కొంపోవుటే
మొదలై రాముడు లక్ష్మణుండును వనమ్ముల్ నాల్గుమూలల్ నినున్
వెదుకం బోవని చోటు లేదు, నిను నన్వేషించు చున్ రాత్రులన్
నిదురంబోవను లేదు, అన్నమయినం దిన్నట్లె కాన్పించదున్- 380

ధరణిజకోసమై వనపథమ్ముల రాముడు బోవువేళలన్
వరుసగ నాజటాయువు కబంధుడు ఆశబరీలలామయున్
సరసతఁజెప్పి నట్టినుడిచందములున్ కపినాథు చెల్మియున్
గరువలిపట్టి సర్వమును క్ష్మాసుతకున్ వచియించె నమ్రతన్.

వీనులకున్ జటాయు వను పేరు వినంబడి నంత కన్నులన్
జానకి కన్నువుల్ దొరల సాగె వడిన్, తనకై నిశాటుతో
ప్రాణములొడ్డి పోరిన మహామతి యావిహగుండు, సీత కున్
మానసమున్ గరంచిన సమాదృతులవ్వి కృతజ్ఞతాశ్రువుల్-

జనకజ నెన్నడేని గనఁజాలుదునా యను చింతతోడ కా
ననముల బట్టి వచ్చు రఘు నాథుని కూఱట గొల్పు నట్టి సూ
చనలును దోచె గ్రీష్మ దివసమ్ముల రాలిన జల్లులట్లుగన్
వనచర రాజు వీటికిని వచ్చిన నాడె మనోగతమ్మునన్.

తన కనుసన్నలన్ మెదలు దాసులు వానరు లెంద ఱుండినన్
కనుగవ నెత్తి చూడఁ డిది కావలెనంచును కోర ఁడాతఁడా
జనకజలేని నాకు సుఖసంపద లేలని కుందు నొందు; రా
మునిగని నిస్పృహాయులు కపుల్ సయితమ్మురి యాడి యేడ్తురున్.

అలరుల్ విచ్చిన పూవు దీవలను నీవైయుందు వం చాసతో
గలయం జూచును, కోయిలే కడనొ శాఖన్ గొంతు సారింప నీ
పిలుపంచుం జనుచుండు, రాముని కికన్ వెన్వెంట సౌమిత్రియే
కలఁడోదార్పగ, నెమ్మదిన్ గలఁచు శోకమ్మింత చల్లార్పగన్-

అడిగితి వేదొ నేనుడువు నంతకు ముందె, భయమ్ము నంది బె
గ్గడిలితి వేను రాక్షసుడ గాను ; రఘూత్తము సత్కృపాదృతిన్
బడసిన వాడ నీవనము నందున నిన్గని నంత సంతసం
పడితిని, స్వామి రాముడును వచ్చును నిన్గొని పోవజానకీ! - 386

తనకయి ప్రేమ రాముఁడెద దాచెనె యింతగ నన్న యూహలో
జనకజ గుండియల్ కరగి జారె నవాశ్రువు లింక వేగమా
దినకర వంశజుం డరుగు దెంచును ద్రుంచును దైత్యునన్న వా
ర్తను విని మోము విచ్చిన ధరాసుతఁజూచి సమీరసూనుడున్.

అవు నమ్మా, రఘు వీరు వెంటఁగపిసైన్యం బెల్ల నేతెంచు నా
దివి జారాతిని మట్టు బెట్టగ, సమిద్ధీరప్రతాపాఢ్యులా
ప్లవగోత్తంసులు వార్ధి సంతరణమున్ లంకాపురీ ధ్వంసమున్
వివి ధోపాయములన్ బొనర్తురిదియున్ వీక్షింతు వీవే యికన్-

కోతిగ నన్నుఁ జూడకు మకుంఠిత సాహస నిర్విరోధ వే
గాతిశయుండ నీ జలధి నంతయు దూకితి రామ మూర్తికిన్
దూతగ వచ్చి, కామగమనుండను వాంఛిత కామరూపుడన్
ప్రీతిగ ఁ జూచి నాపలుకు విన్నపమున్ వినుమమ్మ వేడెదన్.

ఉరుతరమైన నాపటు బలోగ్ర రయోద్ధతికేమి, రాఘవే
శ్వరుకరుణావిలాస విభవమ్మొక టున్నది నాకుఁజాలు నీ
ధరణి నసాధ్యమన్న దెడదన్ గను పింప దొకింతగూడ సా
గరమును లెక్కసేయ కొక గంతున నేనిటు దూకి వచ్చితిన్-

రాముని యాజ్ఞ లే కరమరంబడి చూచుచు నుంటి గాని నా
భీమబలమ్ము జూపి యొకపెల్లగ నీవన మెత్తి నిన్ను నీ
రాముని వద్దఁ జేర్చగల ప్రాభవమున్నది తల్లి ! యానభ
స్సీమలకైన నేనెదుగు చేవగలాడను చూడు మంచునున్.

చంచలద్వాల నిపీడి తాఖిల దిశాస్థానమ్ము లూటాడగా
పెంచెన్ దేహము వాయుసూనుడు మహాభీలాకృతిన్ విక్రమో
దంచత్ ప్రౌఢ విజృంభణోద్ధత తనూద్రాఘిష్ఠ తేజశ్చ టల్
పంచారించుచు భూనభస్థలులు గప్పన్ సీతకాశ్చర్యమై. 392

మేరు గిరీంద్రు నున్నతిని మించి నభస్స్థలి మంటు రూపవి
స్తారుడు వాయుజం డవనిజం గని ; నాభుజపీఠమందు నం
జేరుము తల్లి రాముకడఁజేర్తును ; లక్ష్మిని విష్ణుమూర్తికిన్
క్షీరసముద్రరా జిడిన చెల్వు లొసంగిన రీతి నంచనన్.

నీవని నంత సాహసబలీయుడవే హనుమంత! నన్ను గొం
పోవగ సంద్రమందు బడి పోదు నొ యేమొ; నిశాట యోధులున్
ద్రోవలు గాచి యెట్టి యెసరుల్ ఘటియింతురొ యిట్టి యత్నమా
పావన మూర్తి రామ నరపాలుడు నెమ్మది సమ్మతింపడున్.

జనకుని యజ్ఞవాటికను జన్మమునందితి, కోసలావనీం
ద్రునకును గోడలైతి, గుణ ధుర్యుడు రాముని పత్నినై యిటుల్
జనుదునె కన్మొఱంగి కపిసాయములన్ ; దనుజేంద్రుఁడట్లు వం
చనమెయి మౌని వేసమున నన్గొని వచ్చెను గాక లంకకున్.

వినుము మఱొండు నేనగుచు వేఱుగఁజెప్పగ నేల, క్రూరులా
దనుజుల బారి బడ్డ తన తన్విని రక్షణసేయు కార్య మా
యినకులజుండు రామధరణీంద్రుని కర్తము, వేరు దారులం
జనుటలు పౌరుష ప్రబల సాహసు ఁడారఘురాముఁడోర్వడున్.

అనిన మహీజ వాక్యముల యందొక యర్థమునాత్మలో పలన్
హనుమగ్రహించి శీఘ్రముగ నారఘుసత్తము వద్ద కేను ని
న్గొనిచను నూహలో నిటుల కూడని తొందర మాట లాడితిన్
జనని! క్షమింపు మన్న కపి సత్తమునిన్గని నవ్వె సీతయున్.

ఇంక మ ఱొక్క మాట జననీ! యిదె నాకడ నున్న రామనా
మాంకితమంగుళీయకము నాతఁడొసంగిన దానవాలుగా
నంకిలి మాని దీనిఁ గొనుమా, నిను గన్గొన నాకు నెట్టి యా
తంకము లేక రక్షనిడె తల్లియిదేనని యిచ్చె హన్మయున్. 398

అచ్చపు రత్న కాంచనమయ మ్మది సీతకు గుర్తె దానినీ
వచ్చిన కోతి వంచకుఁ డెవండును కా దిక రామ మూర్తికిన్
నచ్చిన బంటె యీతడను నమ్మిక గల్గిన భావమాధురుల్
మచ్చికలై ప్రసన్న ముద మంజుల మయ్యె మహీజ యాస్యమున్.

తాము వివాహమైనపుడు తండ్రి యొసంగిన పెండ్లి కాన్క శ్రీ
రాముని యంగుళీయము నురమ్మునఁబెట్టుచు కండ్ల కద్ది యా
రాముడె వచ్చినట్లు దన రామునిఁజూచిన యట్లు లెంచుచున్
భూమిజ తాల్చె నశ్రు కణముల్ జడిగా తను వెల్లఁ బుల్కలై.

రాముని వ్రేలియందు రుచి రమ్యము లేలి వెలుంగు లాలనల్,
గోముగ నాడు చెక్కిళులకున్ వలపుంబులకల్ రచించిన
న్ప్రేమగ వచ్చినట్టి కరుణోదయ సాదరభావ భాగ్యమీ
కోమల కాంతి రాశి యను కొంచును సీత శిరమ్ము వాలిచెన్.

అంధ తమసమ్ము నెడఁబాపు నరుణు కరణి,
నెడద యందలి దైన్యము నెడలఁజేయ
నరుగు దెంచిన యట్లయి హనుమ రాక
పలికె నిట్లు సీతయు గపిప్రవరుఁజూచి.

హనుమా నీబల పాటవమ్ము విదిత మ్మంభోనిధిన్ దాటి దై
త్యనివాసమ్మగు లంక కొంటరిగ ధైర్య మ్మొప్ప నేతెంచినా,
వినవంశాధిపు దౌత్య కార్యమున కీవే యర్హు డంచెంతు రా
ముని సేమమ్మును దెల్పినావు మది సమ్మోదమ్ము నిండారగా.

తెలుపు మిదొక్కమాట కపిధీవర! యేలొకొ రామలక్ష్మణుల్
ప్రళయ పరాక్రమ ప్రబల వహ్నులు నాకొఱ కింత దన్కనున్
బలములు గూర్చి రావణునిపైఁ బడరారు వియోగ వేదనా
కలితుడతండు మందమతి కాడుగదా రఘురాము డింతకున్. 404

సుగ్రీవుండును వచ్చునా కపి భటస్తోమంబుతో సైన్య సా
మగ్రీ సంయుత వీరుడై, భరతుఁడున్ మన్నించునా నన్ను, పం
క్తి గ్రీవుం డని గూలుటల్ దుదకుఁ బ్రీతిన్ జూతునా, వేదనా
వ్యగ్రీ భూతుఁడు రాముఁడిప్పు డలసత్వం బంద కుండున్ గదా.

తనకీ దానవ బాధలంతమయి చిత్తమ్మందు శాంతత్వమున్
గొను టేనాడిక నంచు వందురెడు నాక్షోణీజకున్ మ్రొక్కి యా
హనుమంతుండును సందియంపడకు మాతా! దైత్యుడీలంకకున్
నినుఁ దోడ్తెచ్చు టెఱుంగ డాప్రభు వికన్ నేనేగి తెల్పన్ వలెన్.

ప్రకటతరాత్మగౌరవ విభాసురుఁ డుగ్రమహాస్త్రపాటవత్
వికలిత శాత్రవుండు రఘువీర శిఖామణి రాముఁడా కిరా
తకదనుజేంద్రు నిం దునిమి తథ్యమ నిన్గొని పోవు; రాజ్ఞిగా
నిక నినుఁ జూచు భాగ్యము లభించును వేగమె మాకయోధ్యలో.

అనుచున్ మ్రొక్కులు దీర్చి నిల్చబడు నాహన్మంతునిం గాంచుచున్
తనయున్ బంపెడు మాతృ వత్సలత చందం బొప్పగా గద్గద
స్వనయై కన్నుల నశ్రుధారలొలుకన్ క్ష్మాపుత్రి పల్కెన్ మన
మ్మున నూల్కొన్న తలంపులొక్కపరి మోముందమ్మిలో వెల్వడన్.

ఇమ్మగ నీకునుంగరము నిచ్చిన రాముడు నీదుపల్కులన్
నమ్మను లంకయందుఁగని నట్టిది వీనుల విన్నదిన్ సమ
స్తమ్ము వచింపుమా దశరథాత్మజు లిద్దరికిన్; గ్రహింతురే
చుమ్మల యందు వందురుచు క్షోణిజ యున్నదొ దైత్యులంకలో.

ఆయత బాహు విక్రమ బలాధిక శౌర్యమహోగ్ర వీరనా
రాయణు లా సహోదరులె అల్గిర యేని త్రివిష్టపమ్ములున్
డాయగ లేవు, రాక్షసగణ మ్మొకలెక్కయె వారికిన్ తృణ
ప్రాయము లట్లుఁ జూచి బడవైతురు చండతరాస్త్ర వహ్నులన్. **410**

అనియొక్కింత నిమీలి తాక్షియుఁనెదో యాలోచనామగ్నయై
మనసున్ గన్నులు రామ చంద్రు మహిమన్ మన్నించు ధ్యానోపము
ద్రను పృథ్వీజయు బల్కెఁ, సత్యమును ధర్మమ్మున్ కృపాదృష్టి తో
ననుసంధించు మహోత్తమవ్రతుఁడు నానాథుండు నన్నోముతన్.

ఎవని పదాంబుజాత రజ మీశిరమందున భూషణాయతం,
బెవని మృదుస్మితార్ద్ర రుచు లీ బ్రతు కంతకు వెల్గు దారు లౌ,
నెవని కరాంగుళీ మృదువు లీ తనుధన్యతఁగూర్చు స్పర్శ లా
ప్రవిమల సాధుశీల గుణరమ్యుఁడు రామునకున్ నమస్కృతుల్.

సదమల రాజసౌధ పృథు సంపద కాదని భార్య నూర్మి ళా
సుదతిని యింటిలో విడచుచున్ సుకముల్ వలదన్న దీక్షలో
వదినకు నన్నకున్ విపిన వాటిక సేవకుడైన త్యాగశీ
లధనుఁ డుదార సద్గుణుడు లక్ష్మణ మూర్తికి నాశిషమ్ములౌ.

రావణుఁజంపగా నిటకు రాముడు వచ్చుటకున్ సహాయదీ
క్షావిధి సర్వయత్నములు సల్పుచు నుండిన కీశరాజు సు
గ్రీవున కంగదాదులకుఁ బ్రీతిగ నే శుభమున్ వచించి తంచు నో
పావని చెప్పుమా'' యనిన పల్కులు విన్న సమీర సూనుడున్.

ఆర్తిలోఁగూడ ఎంతటి యార్ద్ర మూర్తి
అవనిజ ! యెడంద బడబాగ్ని నణచు కొన్న
పరమకరుణాబ్ధి యామె తత్వ మ్మనూహ్య
మనుచు మారుతి తనకార్యమును దలంచి.

తరువుల్ చాటుగఁ జేసి చూతురదె దైత్య స్త్రీలు వేవేగనే
నరుగంగావలె నిన్నుఁ గన్గొనిన యట్లా స్వామికిన్ దెల్పగా
గురుతే దైన యొసంగి పంపుమని మ్రొక్కుల్ వెట్టి నిల్చున్న వా
నరవర్యుంగని సీత అచ్చెరువొకింతన్ దోచు దృగ్రేఖలన్- **416**

చూడామణి

ఆరఘురాముడే యడిగెనా, మఱి నీవుగ నానవాలునున్
గోరుచు నుంటివో తెలియకున్నది, ఆతడెఱుంగడా, మహా
వారిధి లంఘన ప్రథిత పాటవశాలివి, యంగుళీయక
మ్మారక యిచ్చెనా వనచరోత్తమ! నిన్నునుఁదాను నమ్మకన్.

రామక్ష్మాపతి వర్తన మ్మదియు చిత్ర మ్మోచుఁ గాన్పించు నా
కేమో అర్థము కాదు చిన్నమును విన్మీగాథ హన్మంత; శ్రీ
రాముండొక్క దినాన నన్నుఁదనతో రమ్మంచుఁగొంపోయి కే
ళీమోహమ్మున జల్లులాడె కొలనిన్ లీలా వినోదమ్ముగా.

ఆరగ నిచ్చి వస్త్రముల నాయెడ చల్లని చెట్లనీడకున్
చేరితిమంత, రాముడును చేయికి చేయిని కూర్మిఁ జేర్చి నా
యూరుల మీదనున్ శిరము నుంచుచు నిద్దుర వోవు వేళకున్
గేరుచు వచ్చి నాయురముఁగీరెను కాకి యొకండు ధూర్తతన్.

నాథుని నిద్ర భంగమగు నన్న భయమ్మున నూఱకున్న నా
మీదకు మాటిమాటికిని మిట్టిపడున్ బలిభుక్కు, కొట్టినన్
పోదది, వాడిగోరులను మోటు తనమ్మున గీర బోవ నే
వేదనఁ జెందుచున్ గదలి వెన్కకు తప్పుకొనం దలంపగా.

స్తనముల మధ్య ముక్కు కొన చయ్యనఁ గ్రుచ్చి పెకల్చి మాంసపుం
దునుకను, నెత్తు రోడికలతో తడిముద్దగు నన్నుఁ దాకి మే
ల్కని కినుకన్ రఘూత్తముడు కాకిపయిన్ వదలెన్ తృణమ్ము మం
త్రనియత శక్తితో విధిశరప్రతిమాన మహాయుధమ్ముగా.

వదలదు కాకి నాయిషువు, వాసవు పుత్రుఁ డటన్న పక్షి య
య్యది చతురాస్య దత్త వరమబ్బిన జీవియు, భూదివమ్ములన్
పది దెసలందునన్ దిరిగి బాసటఁ గానక రాము నంఘ్రులం
దదవద వ్రాలి కన్నును తృణాస్త్రసమర్పణ జేసి తాచనెన్. 422

నీచత నాపయిన్ బడగ నేర్చిన కాకినిఁబ్రోచు సత్కృపా
శ్రీచణమూర్తి రాఘవుఁడు, శీఘ్రమ నన్గొని పోఁడొ రావణున్
పీచమడంచి, బాహుబలవీరమహేశ్వరు లన్నదమ్ములున్
వేచనుదెంచు వేళకయి వేచుచు నుంటి సమీర పుత్రకా.

గడు వికరెండుమాసముల కాలము రావణు చేతులందునన్
మడియుట యో మఱొక్కటియొ నానొసటన్ విధివ్రాసె నిద్ది నీ
నుడువుట యందె సర్వమును నున్నది వెన్కకు బోయి ; రామచం
ద్రుడు తనభార్యనున్మఱవ నోపడటంచు దలంతు మారుతీ.

వానరవర్య! రామ నరపాలునకీకథఁ జెప్పుమీ యభి
జ్ఞానముగా హృదంతరమునం దెలియంగల డాతఁ డిచ్చుటన్
వానర నాథునిం బ్లవగ వర్యులగూడి రఘుప్రవీరుడం
భోనిధి దాటివచ్చు దినమున్ గణియించుచు వేచి యుండెదన్.

ఈనాయూహను మువ్వురే గరుడుడు న్నీవున్ మహావాయువున్
గానీ వార్ధిని దూకనేర్తురు కడంకన్ ; స్వామి సాహాయ్యమై
ధీనైపుణ్యుడెవండొ రావలెను వార్ధిన్ వారధిన్ గూర్చి యో
ధానీకమ్మును లంకఁ జేర్పగను, సాధ్యంబిద్ది యౌనందువా.

ఇంతగ చేటుమూడి బ్రతుకీగతి నున్నది, రామమూర్తి నా
చెంతకు వచ్చునప్పటికి జీవము లుండునొ లేదొ నాకు, నీ
వంతు వచింపు మేగి రఘువర్యున కోకపివర్య లేడికై
పంతము బట్టి వారి నటు బంపినపాపము పండకుండునే.

అనిదుఃఖించు ధరిత్రిజం గనుచు నాహన్మంతుఁ డమ్మా యదే
పనిగా క్రందులు పోదువేల రిపు విధ్వంసప్ర తాపాఢ్యుఁ డౌ
ఘనుడారాముడు వచ్చు, కీశపతియున్ గావించు సాహాయ్య మీ
వనధిన్ దాటుదు రెల్లరున్ దనుజవిధ్వంసమ్ము తథ్యమ్మికన్. 428

ఇందుల కంతరాయ మెదియేనియు గల్గిన యేని మద్భుజా
స్కంధము లందునన్ గడువు కాలము లోపల మోసితెత్తునా
నందముతో సలక్ష్మణుని నాప్రభువున్ ; దశకంఠునిన్ చమూ
బంధు సమేతమున్ దునుము పాటవ ధుర్యులు వార లిర్వురున్.

సందేహింపకు మమ్మ వానరచమూసామర్థ్య మాత్మన్, దిశా
సందోహమ్మును చుట్టిరాగల, రుదంచత్ శైల శీర్ష స్థలం
బందం జాలుదు, రేయుపాయమునవో యంభోనిధిన్ ఊలతో
బంధింపగల రానిశాట నిధన ప్రత్యుత్క మైకాగ్రతన్.

హనుమ నుడివిన పలుకుల నాలకించు
సీత ముఖసీమ యొకక్రొత్త చెలువెసంగి
దైన్య మెడలి వికాసవంతముగ దోచె ;
మబ్బు చెఱవీడు చంద్రబింబమ్ము పగిది.

భూమిజ నెమ్మదిన్ ప్లవగ పుంగవు నందలి రామ కార్యదీ
క్షామతమున్ గ్రహించి కడు జాగ్రతగాఁ దన చీర కొంగునం
దే ముడిఁ బెట్టి యుంచినది యుజ్జ్వల హేమ మణీమయమ్ము చూ
డామణి దీసి చూచుచు వడంకు కరమ్మున హన్మకిచ్చుచున్.

హనుమా యిమ్మిది యానవాలుగను నాప్రాణేశుఁ డా రామ చం
ద్రున కాతం డిది చూచి నంతటన నాతోబాటుగా కోసలేం
ద్రుని, నాతండ్రిని గూడ మానసము నందున్ జ్ఞప్తి కిం దెచ్చి, వ
చ్చిన నీకార్యము పూర్తియౌటకును హర్షింపంగలండాత్మలో

ఆరఘుమూర్తి రాగలిగి నప్పటి మాటగదా, శరీరమీ
ధారణినిల్చు నాకు ; పిశితాశనుఁ డీల్గి మదీయ బాధలే
తీరున తీరునోయది మదిన్ గనుమంచు వచింపు మా మహో
ధీరులు రామలక్ష్మణ సుధీగుణ మూర్తులకున్ కపీశ్వరా. **434**

సాగరమ్మెల్లదాటి రఘుసత్తముసేమము దెల్పినావు. నీ
యాగమనంబు నాకును ముదావహమయ్యె శ్రమమ్ము వాయ నీ
వాగుము నేటికేవిట రహస్యముగా నెటనైన, మద్వ్యథో
ద్వేగము తగ్గ, దాపున కపిప్రవరుండవు నీవుఁగల్గుచో.

అమలో దాత్తము లుర్వీజావచనముల్ హన్మంతు స్వాంతమ్ము నం
దమ్మతాసారము లట్లుఁదోచి యతడమ్మా ! నేనిటన్ నిల్వగా
సమయం బియ్యది యౌనె? యిప్పటి సమాచారమ్ము సర్వమ్ము శీ
ఘ్రముతెల్పన్ వలె, రామ భూవిభుని లంకాయాత్ర సాగన్ వలెన్.

అను నాయంజనసూతి తొందరలు తానాత్మన్ ధరిత్రీజయున్
గని, వాత్సల్య సుధాస్రవన్మధుర రేఖల్ మోము నం బ్రామగా
చనుమో మారుతి నీదు కార్యములు భాస్వద్దిగ్జయోపేతవ
ర్తనతన్ మించుత వజ్రదేహి వగుగాతన్ నీకు నాదీవనల్.

నిరుపమ శౌర్యధైర్య మహనీయుడ వీ వెటనున్ననున్ సదా
వరుణుఁడు వాయు వీశ్వరుఁడు వహ్నియుఁ బ్రోతురుగాత వేగమీ
వరిగి యటన్ రఘూత్తమున కంతయు తెల్పుచు తోడితెమ్ము వా
నరవిభుసేనతోడ నవినన్ విని పావని కైజత మోడ్చి సీతకున్.

అచ్చోనేగి వచింతు రామునకు నీ వన్నట్టి దెల్లన్ ; వడిన్
వచ్చున్ తమ్మునిగూడి స్వామియు, కపి వ్రాతమ్ము సుగ్రీవుడున్
వచ్చున్, రాముని చేతి శాత విశిఖ జ్వాలన్ దశగ్రీవుడున్
చచ్చున్ తథ్యమటంచు సీతకు నమస్కారమ్ము లర్పించుచున్.

తోకన్ ద్రిప్పుచు రామదూత కృతిసంతోషంబు నిండార పెన్
వీకన్ దానరిగెన్ ; నిశాటతతి యెందేఁదన్ను వీక్షించి పై
పైకిన్ దూకి యెదుర్చుచో నిజభుజావష్టంభ శుంభద్బలో
ద్రేకమ్మున్ గనఁ జేతునన్న కుతుకోద్దీప్తోరు దర్పమ్మునన్. **440**

హనుమయు నేగి నంత, దను జాంగన లాయముముట్టుఁ జేరి మా
జనకజ; యెవ్వరే యతడు చయ్యననీకడకేగు దెంచి యిం
దనుకను మాటలాడి చనె, నాతడెవం డది యేమి బాసయే
వనచరు నట్లు మాకు కను పట్టె నతండెటకేగె నింతలో.

తెలుపుము వేగ వాడరుగు దెంచిన హేతు వదేమి? పారిపోఁ
దలచితివేని చెట్టునకు తక్షణమే నినుగట్టి వైతు మం
చలజడిఁజేయగా త్రిజట అడ్డగ వచ్చిటువంటి చెట్టలున్
వలదిక సీతపై ననుము వారల నావల కంపె నేర్పుతో.

ఆతడెవండొ నేనును సమస్త మెఱుంగను నేడొ తేపె మీ
కాతడె చెప్పు నేమొ యను నా ధరణీసుత యన్న మాటకున్
భీతిలి దైత్యభామినులు వేగమె యేగి దశాస్యుజూచి యా
కోతియు జానకిన్ గలిసి కొన్న విధమ్ము వచింపబోవగా.

ననుఁబువు సెజ్జలందు మదనోత్సుకుఁడైన నిశాట రాజు కా
వనితలు చెప్పి నట్టిదియె పట్టదు; కామము నెత్తికెక్కగా
గనబడునే వినంబడునె గాఢ వధూపరిరంభ సంభ్రమ
స్వనితము మధ్య నెవ్వరయి వచ్చిన యెంతటి వార్తదెచ్చినన్.

వలదని చెప్పినన్ ద్రిజట, వచ్చితి మీపనిఁ బూని స్వామికిం
దెలుపుటకై యశోకవని తీరులు బోవు విధమ్ము కొంత ; కా
వలసిన వారి చెప్పదగు వార్తలు గూడ వినండతండు ఆ
వల మనకేల యం చెవరు వచ్చిన దారిని వార లేగిరిన్. **445**

ఆశ్వాసాంతము

హనుమయు నశోక వనమున
దనుజస్త్రీలకు నడుమగ ధరణీతనయన్,
తనయత్నము సఫలమ్మయి,
కనువిందుగ (గనఁగలిగిన కథయిది రామా.

శాశ్వ తానంద లక్ష్మీప్రసాద భాగ్య
వరదుడవు, నిత్యకారుణ్య భావుకుడవు,
నిత్య సత్యవ్రతివి ధర్మ నియతమతివి,
రమ్య సద్గుణ సాంద్ర శ్రీరామచంద్ర. !

భావము సర్వ మీవయయిఁ భావిత కార్యము సర్వ మీవుగా
త్రోవలు జూపగల్గు నెనరుల్ గను టెన్నటి కబ్బునంచు నీ
పావన పాదసేవలను బాసటగాఁగొని యేగు చున్న నా
జీవన యాత్రయందున ప్రసిద్ధిని సిద్ధి నొసంగు మీశ్వరా ! **448**

ఇది శ్రీ హనుమత్ప్రబంధము ద్వితీయభాగము
సీతాదర్శనము, రావణునిదుర్భాషలు, దైత్యస్త్రీల దుష్ప్రవర్తన,
త్రిజట స్వప్నము, హనుమత్ సీతాసంభాషణము, చూడామణి అనుకథలుగల
తృతీయాశ్వాసము.

శ్రీ హనుమత్ప్రబంధము

ద్వితీయభాగము : చతుర్థాశ్వాసము

శ్రీ సీతాహృదయాంబుజ
భాసుర బాలార్క కిరణ, భక్తత్రాణా!
త్రాసిత దుష్టాసురగణ,
దాసజనభయార్తి హరణ, దశరథరామా!

హనుమంతుని వాలమ్మున
కనలము ముట్టించి త్రిప్ప నసురేశు భటుల్,
హనుమయు లంకను గాలిచి
కనదురువిజయముఁబడసిన కథ యిది రామా!

దేవా, అవధరింపుము,

ఆంజనేయుని బలవిజృంభణము

భూమిజ యిచ్చినట్టి మణిభూషను భద్రమొనర్చి, చిత్తమం
దామెను జూచినా ననెడి హర్షమునన్ పులకీకృతార్ద్రచే
తో మహనీయ విక్రమ కుతూహల తాండవమాడె, నాయశో
కామల కాననాధ్యములయందున మారుతి చెట్టు చెట్టునన్.

చెట్టులనున్న పండు లిరు చేతులఁద్రెంచి భుజించి, పాదసం
ఘట్టన పాటిత ప్రబల కానన వృక్ష విదీర్ణ శాఖలన్
గుట్టలు పేర్చి, నల్దెసలకున్ బడి ప్రాకిన పూల తీవలన్
కట్టలు గట్టి పీకి, కడు గర్వము నన్ నిలుచున్న మారుతిన్.

దండులుగా నశోకవని ధాపున కాపరులైన దైత్యులా
గండర గండడౌ కపినిఁగన్గొని కత్తులతోనెదుర్ప నా
తండును మేను వెంచుచు నదాటుగ 'హు' మ్మని యార్చి నంతనే
గుండెలు జారి వారు పరుగుల్ గొని రావణుఁజూచి మ్రొక్కుచున్-453

దానవనాథ! మీ చరణ దాసుల విన్నప మాలకింపు డీ,
వానరుఁడెవ్వడో యిటుల వచ్చెనొగాని అశోకసుందరో
ద్యానము పాడొనర్చి మముఁదాకెను పైబడి, వానిధాటికిన్
ప్రాణముఁ బిగ్గఁబట్టుచు దొరా! యిటు వచ్చితి మయ్య భీతితో.

త్రుంచని తీవలేదు, పడఁద్రోయని చెట్టును లేదు, నుగ్గుగా
వించని కేళికావిమల వేదికలేదును, కన్నుఁగప్పియా
వంచకుఁడెట్లు లంకకును వచ్చెనొ మేమిక పోవఁజాల మా
పంచకు, పోయినన్ తనువు ప్రాణము లుండవు నేడు మాకికన్.

ఆపలుకుల్ వినీవినని యట్లు సురావశుఁడై దశాస్యుఁడే
హో పరిహాస రీతిగ నొహో! ఒక కోతికి నీగతి భీతిఁజెందియా!
మీపని మాని వచ్చిరిటు మీరలు కోతిని బట్టి వేగమా
కూపము నందుఁ ద్రోయుఁడని కోపమునన్ గనె వారినెల్లరన్.

చేయున దేమిలేక మతి చేద్పడి వారును కొంత తోడుతో
నాయెడ కేగినంత నెదురై కపి వర్యుడు పెద్దమ్రాకులన్
మోయుచుఁదెచ్చి వారిపయిమోదుచు పైఁబడి నంత ప్రాణముల్
పోయెను వారికచ్చటనె; పోవని వారును పర్వు లెత్తిరిన్.

వానరు రాకయున్ త్రిజట స్వప్నమునుం దలపోసి లంకలో
దానవలోకమంతయును దల్లడిలెన్, కపిగాదు దేవసం
ధానిత శక్తియేదొ యయి తానరు దెంచె నికన్ మఱేవిప
త్తీనగరమ్ము నెల్లఁదహియించునొ యన్న భయాకులమ్మునన్-

ఆలరి కోతిగాడొకఁడు హంతకుఁడై విహరించి లంకగ
గ్గోలొనరించె నన్న పలుకుల్ విని నెత్తురు నెత్తి కెక్కి క్రో
ధాలసుడైన దైత్యవిభుఁడంపెను కాకలు దీరి నట్టి యో
ధాళినిబిల్చి వాని దునుమాడక రావల దన్న యాజ్ఞతో. 459

అనుకొని నట్టి పైన దిటులంతయు, దానవసైన్య వాహినుల్
మునుకొని వచ్చుచుండె మొగమోటమి నాకికనేల నంచు నా
హనుమయు దీర్ఘతాల భయదాకృతిఁదాలిచి, సింహనాద మొం
డొనరిచె దిగ్వి పాటన సముత్కట పాటవ కంఠ నిస్వనిన్-

దిక్కులు పిక్కటిల్లె, జలధిజ్వలనంబుబికెన్; మహారవం
బెక్కడి నుండి వచ్చె నెవ రింతటి దుర్దమ శక్తిమంతుడం
చక్కడనే మహోగ్రకపి నాహనుమన్ గని రాత్మ ధైర్యముల్
దక్కిన బిక్కమోములను దైత్యకులాధిపు సైనికాగ్రణుల్.

జయమౌగావుత రామ లక్ష్మణులకున్, క్ష్మాపుత్రికెల్లన్ శుభో
దయమౌగావుత, రామదూతనయి సీతం జూడగా వచ్చితిన్
వియదధ్వమ్మున వార్ధి దాటి హనుమ న్వీరాగ్రణిన్, రావణుం
డయినన్ జాలడు నాకటంచు నఱచెన్ హన్మంతుఁ డుగ్రాకృతిన్.

కపి యితఁడేమిసేయు మన కాపరులన్ భయపట్టె నంతె యీ
చపలుని పట్టు కొందమని సైనికులున్ వడి వచ్చి పైఁబడన్
కపివరుఁ డాయశోక వనికాముఖతోరణమున్ పెకల్చి వా
రిపయికి వీకమీఱ విసరెన్ నలుదిక్కులు బట్టి పర్వగా.

వనితలు వచ్చి చెప్పి రొక వానరుఁ డుర్విజ ఁజూచి వెళ్ళుటల్,
వనచరుఁడాయశోకవని పాడొనరించిన వార్తఁదెచ్చిరా
వనపరిపాలకుల్, కపినిఁబట్టగఁ బంపిన సైన్య నాయకుల్
వెనుకకు వచ్చినట్లు కనుపింపక రావణుఁడుండె యోచనన్.

తలఁకు వహించి రావణుఁడెదన్ దిగులొందుటయున్ గ్రహించి, యో
విలసిత దైత్య రాజ్యపదవీవిభవ ప్రభువర్య నీకిటుల్
గలఁత లివేల మేమిచటఁగల్గగ, కోతినిఁబట్టి లిప్తలో
నిలుతును నీదుముందనుచు నేగె జవంబున జంబుమాలియున్. 465

ప్లవఁగు వధించి వత్తునని పల్కిన ధీరుఁడు జంబుమాలియున్
బవరమునుండి వెన్కకును వచ్చిన జాడయుఁగానరాక దా
నవవిభుఁడంపె యోధుల ననంతబలాఢ్యు లమాత్యపుత్రులన్
వివిధమహోయుధమ్ములును వీరవరేణ్యుల సాయమిచ్చుచున్.

ఒకరికి వెన్క నొక్క రిటులుద్ధతులై రణ భీకరారవ
ప్రకటిత కోపవేగ పటు పాటవులీయను రాళి మీదమీ
దకుఁజనుదేరుటల్ గని క్రుధాపరిణద్ధ విలోకనానల
ప్రకరము లేర్చుచున్ నిలిచె పావని, పావకశైల మట్లుగన్-

పోరిరి వారు దర్ప పరిపూరిత దారుణయుద్ధమాయలన్,
పోరెను రామమంత్ర పరిపుష్ట బలాన్విత ధీయుతుండు సా
మీరి యితం డొకండెయయి ; మిన్నులు ముట్టిన వా సమీకకా
ర్యారభమాణ దుర్దమరుషాయుత గర్జన లందునిందునన్-

కుటిల దానవసైన్య పటలమ్ముపైగాని
అరుగంగ నీడు కోపాగ్నిదృష్టి!
ఎదిరించి పోరాడు మద వైరిపై గాని
వాలగానీ దుగ్ర వాలనిహతి;
రామనామాక్షర రమ్యమంత్రమెగాని
చేరనీడన్యమ్ముజిహ్వాపైని
జానకీ శ్రీపాద జలజాతములఁగాని
నిలుపడు ధ్యానమ్ము నిముసమేని,

తనయమోఘ మహాబల ధైర్యములకు
జనకజారఘూత్తముల దీవనల బలము
తోడుగానయి హనుమదుద్ధురమహోగ్ర
శక్తి చెండాడె దశకంఠు సైన్యములను- 470

ప్రాకటక్ష్వేళో(గ పటుతరార్భటులకు
దితిజసేనలు దశదిశల (జెదర,
నిష్ఠుర నాసికా నిశ్వాస రయమున
రథపంక్తి దూర దూరములు తొలcగ,
దీర్ఘ బాహు ద్వయీ తీవ్రఘాతమ్ముల
సచివపుత్రులు ధరాస్థలినిcగూల
కఠి నాంఘ్రి శితనఖక్రకచ ఘట్టన హతి
సైన్యాధిపతుల శీర్షములు తునుcగ,

అసురసేనల చూపుల కందనట్టి
వీర విక్రమ వేగ దుర్వారపటిమ
మెఱుము లురుములు నగుచు సామీరి తిరిగె,
భయద యమదంష్ట్రి కో(గ్రప్రభావ మడర.

శివదివ్యాంశయొ, రామనామ జప సంసిద్ధి ప్రభావాప్తియో,
పవమానాత్మజు శౌర్యపాటవ దవజ్వాలావలీఢంబులై
యవనింగూలెను దైత్య సైన్యములు, లంకాధీశు శీర్షమ్ముపై
పవిఘూతమ్ముగcదోచె మారుతి సమిత్ప్రజ్ఞాపరిష్కారముల్.

వచ్చెను జంబుమాలియును, వచ్చిరి దానవసైన్యనాయకుల్,
వచ్చి రమాత్యపుత్రులును, వచ్చిన వారలు వచ్చినట్లుగా
చిచ్చఱమంట యాప్లవగశేఖరు చేతులcజిక్కి చచ్చిరా
చచ్చిన వార్తలన్ విని నిశాటకులేశుడు భీత చిత్తుడై.-

అంతలు సేసె రాముడిటకంపిన కోతియొకండు, రాముcడే
వంతెనయో రచించి, కపివాహిని తో జల రాశి దాటి తా
నెంతలు సేయునో యిటుపయిన్ మనలంకను జేరి యున్నవి
భ్రాంతిని ముగ్గి, చంపెద ధరాసుత నంచుcగృపాణముం గొనెన్. 475

అవనిజ కిచ్చినట్టి గడు వడ్డుగ వచ్చెను గాని యా క్రుధా
వివశుఁడు రావణుండు పృథివీజను ముక్కలు సేసి సర్వది
గ్వివరము లందునన్ విసరి వేసెడు వాడె క్షణమ్ములోన నా
ప్లవఁగవరుండొనర్చిన విపత్పరిణామ పరాభవమ్మునన్.

అక్షయకుమారవధ

అలుపములైన యత్నముల యందిక లాభము లేక వేగమే
యలఘుతరోగ్ర విక్రమ సమన్వితుఁడౌ సుతు నక్షయాఖ్యునిన్
బిలిచి బలప్రసిద్ధులగు వీరుల తోడుగ నిచ్చి పంపె న
బ్బలితపు వానరుం గదిసి పట్టి వధింపగ నెట్టులైననున్.

ఉత్సావా : సాహసమ్ము బలము పెంపె సంగ నక్షయుండు ను
త్సాహభరిత చిత్తుఁడగుచు దారుణాయుధాళితో
వాహినీ ప్రవాహ మసురవాహినీసమేతుడై
ఆహవమ్ముసేయ నరిగె హనుమపై రథస్థుడై-

రూక్షాలోకన ధైర్యసాహససమగ్రుం డాగ్ర హోదగ్రయు
ద్దక్షోణీ నిన దార్భటుల్ సెలఁగ, యోధశ్రేణులున్ వెంటరా,
నక్షీణోద్ధతి భిండివాల శితకుంతప్రాస బాణాలితో
రక్షో నాయకు డక్షయుండు చనె దర్పాటోప దీప్తాస్యుడై-

శైలప్రాంశు శరీరు ఁడూర్జిత భుజాస్కంధుండు, సౌవర్ణవ
ర్ణాలంకారిత దేహవర్ణుఁడు, మహోగ్ర త్రాణుఁడాజానుబా
హోలంబుండు, మహాబలోల్లసిత సర్వాంగ ప్రభుండైన లాం
గూలిం జూచుచు నక్షయుం డతులిత క్రోధారు ణాక్షుండు నై.

ఔరా! అక్షయుఁడేగు దెంచిన భయ మ్మావంతయున్ లేకయే
పోరాడన్ గమకించు కోతికిక చావున్ జూపు దంచున్ మహో
గ్రారావమ్మున రోషసంభరిత శౌర్యాకారుఁడై సైన్యమున్
బ్రేరేపించుచు లేచె నక్షయుడు గర్వీభూత చేతస్కుడై. 481

నాదర్పోద్ధతి కోహటించి చని యిందన్న్కన్, త్రపన్ వీడి నా
మీదన్ దూకుదు రీనిశాటు లిపుడున్ మేలే, యటంచున్ మహా
క్రోధోద్భూత పరాక్రమక్రమ నటత్ భ్రూరేఖి కాభీల రా
ద్రోదీర్ఘుండయి లేచె మారుతియు యుద్ధోద్యోగ ధైర్యాఢ్యుడై.

రథోద్ధత: వానరప్రవరుపై మహోగ్రుడై
దాన వాగ్రణియు దాడి సేయగన్,
పూని శైలములు పోరి నట్లుగా,
కాను పించె రణ కంపి తోర్వియున్.

కరికరిని, గిరిని గిరియున్,
సరిసరి యయి జరిపి నట్టి సమరాభముగా,
కరువలి సుతుతో నసురే
శ్వరుసుతుఁడొనరిచె బవరము పటుతర శక్తిన్

నొప్పింపన్ హనుమంతు నాహవమునన్ దూటాడి వేటాడుచున్
నిప్పుల్ గ్రక్కెడి శక్తిమ ద్విశిఖ పంక్తిన్ నిర్విరామంబుగా
గుప్పించెన్ దను జేంద్రు పుత్రుఁ డవి తాకున్ తాకవన్నట్లు నే
ర్పొప్పన్ దప్పుకొనెన్ మరుత్సుతుఁడు ధైర్యోపాయ ధీయుక్తుఁడై.

కుపితుల్ దానవ సైనికుల్ సకల దిగ్వ్యూహమ్ము సంధించి, యా
కపినిన్ బట్టుట కేగగా హనుమ దీర్ఘాభీల వాలోద్భవా
తప విక్షేప మహాప్రభంజనములన్ ధట్టించి రెట్టింప, త
ద్విపరీత ప్రతిఘాత కాయసురులున్ భీతిల్లి పర్వెత్తగా-

సేన పాఱిపోయె, బాణముల్ వమ్మయ్యె,
పొట్టికోతి యెంత గట్టివాడొ !
ద్వంద్వయుద్ధమునకు దానె పోవలెనని
తలచె దైత్యరాజ తనయుఁ డడరి. 487

ప్లవగోత్తంసునిపైకి బహుబలదర్ప ప్రజ్ఞ చూపన్ నిశా
టవరుండున్ గదఁబూన, తాలతరు వ్రూడన్ బీకి చేఁబట్టి యా
ప్లవగుం డుగ్రత లేచి మోదఁదొడగెన్ బ్రత్యర్థినిన్; దిక్తట
మ్మవిసెన్, తాలగదాయుధమ్ములకు మధ్యన్ ఘోర సంగ్రామమై.

విదితాభీల పరాక్రమ ప్రతిభు లా వీరాగ్రణుల్ పోరగా,
గదయున్ తాలము లొండొకంటిపయి వీకన్ దాకి నుగ్గయ్యె, న
య్యదనున్ గన్గొని దైత్యుఁడున్ గదిసి బాహాబాహి యుద్ధమ్మునన్
దుదముట్టింపగ నాకపిప్రవరుపై దూకెన్, మదేభమ్మటుల్.

గ్రక్కదలన్ రణస్థలము, కండల నెత్తురు లూరు తెంపు తో,
నెక్కటిపోరి, నాయిరువు రేచి పెనంగుచు నున్నవేళ పే
రుక్కున హన్మయున్ ప్రబలి ఒక్క యదాటున దైత్యుకంఠమున్
గ్రక్కునఁ నొక్కిపట్టి యొడికారమునన్ బడవైచి త్రొక్కినన్.

అచలనిభమైన దైత్యు దేహమ్మునుండి
నెత్రు టేరు లుప్పొంగి ధరిత్రినిండె,
శైల సానువు లందుండి నేల పయికి
జారి పడు శోణవర్ణ నిర్ఝరములట్లు.

కపి బలమ్మున సర్వాంగకములు చీలి
అక్షయుఁడు ముక్కముక్కలై యవనిఁ బడుట
చూచియును, చూడలేని, సంక్షుబ్ధమతులు
అసురసేనలొనర్చె హాహారవమ్ము.

విజయశ్రీ హసితాననుం డగుచు దిగ్వీథుల్ చలింపగ, వా
యుజు ఁడుంజేసిన సింహనాదములు రాజోదాత్త శుద్ధాంత స
ర్వజన మ్ముల్కిపడన్, శ్రవశ్లథములై వ్యాపించె, లంకాపురీ
ధ్వజమే కూలినయట్లు తోచినది దైత్యస్వామి స్వాంతమ్మునన్. 493

అక్షయ ధైర్యదోర్బల సమన్వితుఁడూర్జిత శౌర్యసాహసా
ధ్యక్షుడు వైరినిర్మథన దక్షుఁడు దివ్యవరప్రభావితుం
డక్షయుఁ డంతమొందె కపి హస్తములం దను వార్త వించు, నా
రాక్షస నాథుఁ డేడ్చె, రణరంగము నన్ పశువేడ్చు చాడ్పునన్

పితరు నోదార్ప వచ్చిన పెద్ద కొడుకు
నింద్ర జిత్తును గని దనుజేంద్రుఁ డెడద
పొంగి వచ్చు దుఃఖమ్ము నాపుకొని కొంత,
నుడివె నిట్టులఁగన్నీరు తుడుచుకొనుచు.

తనయాచూచితె, లంకకెట్టుల మహోత్పాతమ్ము వాటిల్లెనో
హనుమంతుం డట, రామ దూతయట, యెట్లా వానరుం డబ్ధిదా
టెనొ లంకం జొఱఁబాఱి తాఁదునుము చుండెన్ దైత్యులం బట్టి నీ
యనుజుం డక్షుడుగూడె కూలె నట, కట్టా! వాని దర్పోద్ధతిన్.

మును సుగ్రీవుని, వాలినిన్ గపికుల ప్రోద్దాములన్ జూచితిన్
గనరా డింతటి వాడు; ఎట్లుచటి కేగం గల్గెనో సీతనుం
గని యేమే మొ వచించి వచ్చెనట, వేగ మ్మింక నీవేగి వా
నిని బంధించుచుఁదెమ్ము కొల్వుకడకున్ నేనేగగా నేటికిన్.

జనకుం డన్నది విన్నయంతనె యుదంచ ద్యుద్ధ సంరంభ సం
జని తాలాప వికంపి తాఖిల దిశా సంశ్రేణియై రత్న కాం
చన శోభాంకిత కింకిణీ ధ్వని విలాసాంచ ద్ర థంబెక్కి రా
వణు పుత్రుండు మహోర్బటిం జనె కపిన్‌బంధించి తోడ్తేరగన్.

దను జౌర్ధత్యముఁజూచి మారుతియు నుద్యత్క్రోధ దర్పమ్ముతో
దనువున్ బెంచుచు సర్వ దిగ్బిదము నాదమ్మొండు గావించుటన్
గని చాపమ్ము ధరించి యింద్రజి మహోగ్ర ప్రౌఢ దుర్దాంత బా
ణనికాయోత్థిత వహ్నులా హనుమపై నాటించె శుంభద్గతిన్. 499

దనుజు నిశాత బాణ రయ ధాటికి మించిన వేగ మూర్తియై,
దనుజుని బాణ సంజనిత దావము మించిన తేజమై, మరు
త్తనయుడు నింగిపైకెగసి తప్పుకొనెన్; గపి యెచ్చ టున్నదిన్
గనుగొనలేక నింద్రజియు గాసిలె నాశుగ పంక్తి వ్యర్థమై.

హనుమంతున్జెఱబట్ట, మంత్రములు మాయల్ వజ్రతుల్యమ్ములౌ
ఘనశస్త్రాస్త్ర వితానముల్ పనికి రాకన్ దైత్యుఁడుద్విగ్నుఁడై
మన సాక్కింతగ బిగ్గ బట్టుకొని బ్రహ్మాస్త్రంబు నేయంగ తత్
ఘనపాశమ్మునఁ జిక్కి మారుతి తనంతన్ దాను పృథ్వింబడెన్.

ఇది బ్రహ్మాస్త్ర మహామహ మ్మఖిల లోకేడ్యమ్ము, నా జీవన
ప్రదభాగ్యమ్మగు గాత మంచు, గపియున్ బంతమ్ముతో దీనినే
నెదిరింపం దగదంచు లొంగినటులన్ నేలంబడన్ సమ్ముదా
స్పదనృత్యోన్మద నాదముల్ జలిపి రుత్సాహమ్మునన్ దానవుల్.

రావణునికొల్వు

చీరుడు ముక్కముక్కలుగ చీల్చుడు చంపుడటంచు చుట్టునుం
జేరి నిశాట సేన కపి శేఖరు పైబడి కాలు సేతులన్
నారల గట్టి బంధితు నొనర్చి దశాస్యుని కొల్వులోనికిన్
దారుల వెంట నీడ్చి త్వరితమ్ముగ దెచ్చిరి తిట్టి కొట్టుచున్.

దశశిర :కోటీర ధగధగాయిత రత్న
కాంతి రంజిత సభాగారమలర,
చందనాంచిత దేహ సౌందర్యమును హేమ
మణి భూషణాంశుక మ్మినుమ డింప,
భుజకీర్తి భూషణ స్ఫురిత బాహు ద్వంద్వ
మురుఫణాధర రూపములు వహింప,
త్రైలోక్యపాలనో ద్యన్మహాశేము షీ
సంభవ ప్రభుత లా స్యముల వెలుఁగ, 504

జపతపఃఫల బ్రహ్మతేజః ప్రపూర్ణ
మహిత గాంభీర్య సార సమ్మాన్యమూర్తి,
స్ఫటిక మణిగణ విరచి తాస్తరణకాంతి
భాసురోజ్జ్వల కనక సింహాసనమున-

శ్రీ విభవ కామినీజనసేవితుండు,
త్రిజగతీ పాలనార్హసుధీబలుండు,
సచివ సామంతపరివృత సార్వభౌముఁ
డయిన రావణుంగనె పవనాత్మజుండు.

ఈ దైత్యుం డతిలోకవైభవ కళాపృక్తుండగున్, బ్రహ్మతే
జోదీవ్యత్ ద్యుతిరేఖ వీనిముఖముల్ జూడంగఁ గాన్పించు, సీ
తాదేవిన్ జెఱగొన్న దుర్నయ చరిత్ర మ్మొండు లేకున్నచో
యాదేవేంద్ర సముండె యంచుఁ దలఁచెన్ హన్మంతుఁడుల్లమ్మునన్.

అసుర పతిరాజ వైభవం బరసి హనుమ
యెంత అద్భుతం పడెనొ, దైత్యేంద్రుఁడంత
కంటె నచ్చెరు వందె నాకపినిఁజూచి,
ఒక రొకరి నిట్లు వీక్షించు చున్నయపుడు.

ఎదుటన్ హన్మని జూచినంతన క్రు ధావీక్షైక రక్తాస్యుఁడై
యిదియున్ వానరమైన మద్భటుల నిట్లేలా వధింపంగలం
డిదియేదో పటు శక్తి, కాని యెడ, నందీశుండొ బాణుండొ యి
య్యది కావచ్చు నటన్న సందియము దైత్యాధీశుఁడొందెన్ మదిన్.

నీవెవ్వాడవు కోతివా? మఱియొకం డేయింద్రుఁడో పంపగా
నీవేతెంచి తొ యంచమాత్యులును బ్రశ్నింపంగ లంకేశు ది
క్కై- వాక్రుచ్చెను వాయుజుండు; దితిజేంద్రా! వానరేశుండు సు
గ్రీవుండంపగ రామదూతనయి ధాత్రీజన్ గనన్ వచ్చితిన్. 510

నేనెవ్వండను గాదు వానరుడ, తన్వీరత్న మా జానకిన్
గానంగల్గితి, వాయుసూనుడను హన్మంతుండు నాపేరు, నీ
సేనానీకము నన్నెదుర్కొనుచు నాచేజచ్చిరిన్, శౌర్యపా
రీణుండన్ నను నెట్టియాయుధము పోరిన్ గూల్చగాఁజాలదున్.

నిను వీక్షింపఁదలంచి ఇంద్రజికి నేనే లొంగిపోతిన్, మహీ
జను బల్మిం జెఱగొన్న నీపని దశాస్యా! యెంతనీచమ్మొ నీ
మన మం దెంచితొ లేదొ, నీదయిన సేమమ్మెంచి, సుగ్రీవుఁడం
పిన సందేశము నీసభాముఖమునన్ విన్పింతు నాలింపుమా.

దానవ నాథ! రామవిభు తన్వినిఁ దెచ్చితివీవు, యుద్ధవి
ద్యానిటలాక్షుఁడారఘుకులాధి పుఁడాతని కామెనిచ్చి, నీ
ప్రాణము నిల్పు కొమ్మనుచు వానరరాజు వచించె, రావణా!
నేనను మాటలున్ వినుము నీహిత మెంచి వచింతు నిచ్చటన్.

సకలారాతి విదారణోద్ధత పటిష్ఠస్వామి రామప్రభుం
డొక బాణమ్మున వాలినిం దునిమె, వీరోత్తంసు డాతండు తా
నిక కోదండము నెత్తెనేని భువనానీకమ్ములున్ నిల్వవీ
వొకలెక్కా, సకలమ్ము ధ్వంసమగునం చూహించు కొమ్మీమదిన్.

ఆనాడీ వొనరించి నట్టి పని కామాంధ్యప్రవృత్త్యైక కా
ర్యానీతమ్ము మహీసుతాపహరణమ్మా కాదు, లంకాపుర
శ్రీ నాశమ్మగు కాలపాశము భవద్గ్రీవమ్మునంజుట్టి నా
వో నక్తంచరనాథ! నీ వెఱుఁగవేమో నీదు దుష్కృత్యమున్.

నేనొకరుండ గాదు! గణనీయులు వానరులేగుదెంచి లం
కానగరమ్ము నల్గడల గాల్చెదు నాడు, రఘుప్రవీరుడ
స్త్రానల రాశులన్ గురియు నప్పుడు నీపలు కాలకింపరో
దానవ నాథయెవ్వరును, తప్పదు పాపఫలంబు నీకికన్. 516

పరమ దయాసుధాబ్ధిరఘువంశ్యుడు రాముఁడు, నీవువేగ మే
ధరణిజనిచ్చి యాతనిపదమ్ముల వ్రాలి నిశాచరేంద్ర! నీ
నిరుపమ దైత్యరాజ్యమహనీయ సుఖమ్ములు నీదు ప్రాణమా
వెరవున నిల్పు కొమ్మని కపిప్రవరుండు వచించి నంతనే.

ఔరా! యీకపి మాట వింటివె ప్రహస్తా! నన్ను శాసించుచున్
గారుల్ ప్రేలెడి వీనిఁ బట్టు కొని ముక్కల్ ముక్కలుంగా మహా
వారాశిం బడవేయుడంచును క్రుధావహ్ని చ్ఛటా జ్వాలికా
క్రూరాస్యుం డయి దైత్యనాథుఁడఱచెన్ కొల్వెల్ల మాఱ్ఱ్మోగగా.

వచ్చిరికింకరుల్ ప్లవగ వర్యునిఁగత్తులు దూసి చంప, నా
వచ్చుట లాపుచున్ దనుజ వల్లభు ముందునకేగి చెప్పగా c
జొచ్చె వినమ్రుఁడౌచు ననుజుండు వీభీషణుఁడో త్రిలోకసం
పచ్చయ నాథ! దూతయయి వచ్చిన వానినిఁజంపుటేలయా!

ప్రీతిగ స్వామి యాజ్ఞ నెఱవేర్పగ వచ్చెడు అస్వతంత్రుఁడౌ
దూత అవధ్యు డంచు విబుధుల్ వచియించిరి దానవేంద్ర! యీ
నీతి విధమ్ము నీవెఱుఁగ నేర్పని వాడవు గా దొకింత నా
చేతము జెప్పి నాడ నెది చేయుటకున్ దగు దీవె సోదరా!

ఆతని చేష్ట లాతఁ డని నట్టివియున్ సహియింప రానిచో,
ఏతగినట్టి శిక్షయొ విధింపుడు చాలును, మీ పరాక్రమ
ఖ్యాతినిఁజూపగా నరుగు డారఘురాముని పైకి గాని, యీ
దూతను బట్టి చంపు నొక దోషము మీరు వహించు టేలనన్. 521

తమ్ముని మాట లాత్మ కహితమ్ములె యయ్యును రావణుండు చి
త్తమ్మున గొంత మెత్తబడి దైత్య భటావళి వైపుఁజూచి వా
లమ్మునఁ జిచ్చు పెట్టి యవలన్ పురవీధుల నీడ్చి(దిప్పుడీ
కొమ్మ మెకమ్ము నం చనగ కోతిని గట్టిగఁబట్టి యా భటుల్.

తోకకు గుడ్డ పీలికల దొంతరలన్ బిగఁజుట్టి తైలపుం
బాకములందు ముంచి పెను మంట రగుల్చుచునున్న గూడ ని
ర్వ్యాకులుడా మరుత్సుతుఁడు వాలమునందున లేము సంజ్వల
ద్భీకరవహ్నులందుఁగను పించె వియత్పథమధ్య భానుఁడై.

వీరలు చిచ్చు పెట్టి నను వీథుల నీడ్తురు గాక లంకయం
దారయవచ్చు దారులరహస్యము లంచు మదిందలంచి సా
మీరియు మిన్నకున్నదియె మేలని యెంచి నిశాటు లాకపిన్
కారులు తిట్టి కొట్టి గుదిగట్టకుఁగట్టుచు (దిప్పి రెల్లెడన్.

హనుమను తోక గాల్చి పురమందునఁ (దిప్పుచునున్న వార్తలన్
వినిన మహీజ శోకభరవిహ్వలయై తన మేలు గోరివ
చ్చిన కపి కీ వెతల్ విధి రచించెనె యంచతిదీనయై మన
మ్మున ననలుందలంచి కొని (మొక్కులు దీర్చెను ధ్యానమగ్నయై.

ఓనిరత(ప్రకాశ కిరణోదయ భాసురమూర్తి, వీతిహో
(త్రా! నెనరుంచి నాపయి రవంతగ విన్నప మాలకింపుమా;
ఏను నిరంతరమ్ము పతియే పరమాత్మగ నెంతు నేనియున్,
భానుకులుండు నాకుశల వార్త నెఱింగెడు వాడె యేనియున్-

దానవ నాథు సైన్యరచిత జ్వల దగ్నుల బాధ లామరు
త్సూనునిఁ దాకకుండ దయఁజూడుము వేడుచునుంటి నంచు నా
జానకి విన్నవించు నిముసమ్మున వహ్నియు చల్లనయ్యె తీ
(వానల కీలతాప మనిలాత్మజు నంటగఁబోని రీతిగా. 527

ఉన్నది తొల్త రాముదయయున్, గిరియున్ జలరాశియర్మిలిన్
నన్ను ననుగ్రహించి రిక నావసుధాసుత సత్కృపాశిష
మ్మున్నది; నాదుతండ్రి పయి నుండిన సఖ్యతc జూచి కొంత నన్
మన్ననcజేసెనంచు పవనాత్మజుc డగ్నికి మ్రొక్కె భక్తిమై.

పెంచెన్ దేహము తాలసామ్యముగcగన్పింపన్, తనూబంధముల్
త్రెంచెన్, సర్వదిగంచలావృత నభస్తీరమ్ము మార్మ్రోగc గా
వించెన్ రావము, దైత్య పట్టణముపై విప్పారు ఆగ్నేయశ
స్త్రాంచద్రీతి నొనర్చె మారుతియు తానై స్వైర సంచారమున్.

తైలవర్ధిత దీర్ఘ వాలాగ్ర వహ్నికా
జ్వాల లట్లే రేగి ప్రబలుచుండ,
ఆగ్రహావేశ ధుర్యన్మహోన్నతరూప
మగ్నిచ్ఛటాగోళ మట్లువెలుcగ,
వాలాగ్ని నిర్గ తాభీల ధూమౌఘమ్ము
విద్యుదన్విత మేఘ వృత్తిc దనర,
వహ్నిదీపిత వహావాలదైర్ఘ్య మ్మొక్క
ధూమకేతువుగ దైత్యులకుcదోప.

అబ్ధి లంఘించు నాటి సాహసము కన్న
వందరెట్లైన బలపాటవమ్ము మెఱయ,
చటుల దుర్వార విపుల తేజస్వియగుచు
పావనియు పైకెగసి లంకపై వెలింగె.

వాలమునుండి రాలిన రవల్ రగిలించిన నిప్పుమంటలం
గాలcదొడంగె లంకయును, కన్నులు గప్పుచు నెట్టు లీ మహా
జ్వాలలు లేచెనో తెలియcజాలని దైత్యపురీ నివాసు లా
కీలల మధ్యcజిక్కుకొని క్రేళ్ళురుకుల్ బడి రన్ని దిక్కులన్. 532

ఆయతచండవేగ చటులాగ్నిగ మారుతి సంచరింపగా
వాయువు సాయమై దెసలఁ బ్రాకిన వహ్నిశిఖాచయమ్ము దై
తేయపురీ విశాలపరిధిం బడి యేగును గాని యాకడన్
డాయవు ; సీతయుండిన వనమ్ము, విభీషణుఁడున్న గేహమున్.

హేలన్ వహ్నిరగుల్ప మారుతియు నెట్లేతెంచి యెట్లేగునో
యాలోకించిన వారె లే, రతుల దావాభీల వాలానల
జ్వాలాదగ్ధము లంకసర్వము మహాసంక్షుబ్ధమై పోయె నే
యాలంబమ్మును లేక ఆలనయు లే కాక్రంద నోద్రిక్తమై.

రోదకము: ఈదెస నాదెస నెచ్చట గన్నన్
ఏదరి కింజననీయని లంకా
వీథుల నగ్నులు వెల్వడి రేగన్
రోదనలందసురుల్ బడి రార్తిన్.

ఆదశకంఠ దర్ప దళ నాకృతి మారుతి కల్పితమ్ములై
మీదకు మీదకు న్నెగసి మిన్నులకున్ జెలరేగు చున్న లం
కాదహనార్చులం గని మొగమ్ములు విచ్చియు నీవిపత్తు స్వ
ర్వీథుల నంటునేమొ యని భీతిలిరాత్మల వేల్పుగుంపులున్.

క్రిందికిఁ జూచి పావని యొకించుక నాలుగు మూలలందు నీ
సుందర పట్టణమ్మునకు చూడు రగిల్చితినంచు నెమ్మదిన్
గ్రందులు పోయిపోయి తటకాపడె నాయనలమ్ము మధ్య యే
కుందుల నందెనో పుడమికూతురు సీతయటన్న వేదనన్.

నేనై చేసిన యీ యకార్యమునకున్ బృథ్వీజయున్ నష్టమే
యైనన్ వేగమె రామలక్ష్మణు లసుత్యాగమ్ము గావింతు, రా
పైనన్ వానరనాథుడుం గపులు నిల్వంబోవ, రీవార్తకున్
ప్రాణాలన్ భరతాదులున్ విడువ ధర్మధ్వంస మే యౌనిలన్. 538

అని, యేహోనియు సీతకున్ గలుగ రాదంచున్ హనూమంతు డ
య్యనిలున్ వహ్నిని రాఘవున్ వినతుండై ప్రార్థించు చున్నంతలో
వినవచ్చెన్ వినువీథి నొక్కపలు కాపృథ్వీజ సేమం బటం
చును కర్ణద్వయికిన్ సుధామధువచస్ఫూర్తి ప్రకాశమ్ముగన్.

వారిధి తీరనీరముల వాయుజుడుం దన వాల వహ్ని జ
ల్లారిచి యేగి సీతచరణాబ్జములన్ బ్రణమిల్లి తల్లి! దే
వారులు నాదు వాలమున కగ్నిరగిల్చిరి, నీకృపామృతా
సారసువృష్టి నే బ్రతుకఁ జాలితి లంకయు దగ్ధమైనదిన్.

స్వామికి వేగ నిన్గనిన వార్తను జెప్పవలెన్, భవత్పదా
బ్జామల సీమలన్ మనెదు వాడను పంపు మటన్న పావనిన్
భూమిజ జూచి యోప్లవగ పుంగవ! తాళుము నేటికీ యెడన్
నామది కింత యూఅట గనంబడు నీకు లభించు శ్రాంతియున్.

నీకును దక్క నన్యులకు నీరధి దాటగ శక్యమౌనె, నీ
వీకడలిన్ తరించి వచియించితి వారఘురాముసేమ మో
యీ కపి వర్య! నాయెడద నింకను శంక నశింపఁ బోదు సు
శ్రీకుండు రాముఁడిచ్చటికి చేరవలెన్ గడు వేగు లోపలన్.

అని యాజానకి యన్న భావయుత వాక్యమ్మున్ సమాలోచనన్
విని, హన్మంతుడు తల్లి! నానుడుపులన్విశ్వాసముంచంగదే
దనుజున్ దున్మను, నిన్ను దోడ్కొని యయోధ్యన్ జేరు రాముండు, మి
మ్మును వీక్షింతుము మేము కోసలమహీభూజానిగా రాజ్ఞిగా.

వానర నాథుండున్ బ్లవగ వాహిని తో నరు దెంచు, రాముడున్
వానరు లెల్ల దాటుదురు వార్ధిని, భీకర సంగరమ్మునన్
దానవుండీల్గు రాము నిశితాస్త్రమునం దిది నీవె చూతు వో
జానకి ! తథ్యమీ పనులు సాగును మాసము దాట కుండగన్. 544

విని తత్ ప్రసూనల వాక్య వైఖరులు పృథ్వీజాత యొక్కింత వి
చ్చిన యాస్యాంబుజ మెత్తి ప్రేమమయ దృష్టిన్ జూచినంతన్ మరు
త్తనయుం డంజలి పెట్టి సీతకభివాద మ్మిచ్చి శ్రీరామద
ర్శన కౌతూహలి యై పయోనిధి తటీ శైలమ్ము చేరెన్ వడిన్.

ఆరోహించుచు నాధరాధరము నొక్కంగన్ హనూమంతు డా
పారావారము పైకి దూకె చరణ ద్వంద్వమ్ము దట్టించి త
ద్భూరి ప్రాభవ పాదఘట్టన హతిన్ భూమీధరం బద్రువన్
వేరుల్ దన్కను ద్రెళ్ళి వృక్షతతు లుర్విన్ వ్రాలె నొక్కుమ్మడిన్.

భుజంగప్రయాతం:

వియద్వీధి నున్నట్టి వేల్పుల్ కడున్ వి
స్మయంబంది చూడన్ ప్రచండాహి వేగో
దయస్ఫార ధైర్యాతి దర్పాధి కుండై
రయం బొప్పగా వానర శ్రేష్ఠుఁడేగెన్.

భద్రకము:

వాతవీచి భయంబునన్
సీత యిచ్చిన రత్నమున్
బ్రాతిగా కడు భద్రమౌ
రీతి దాచెను హన్మయున్.

హనుమచ్చండ రయప్రకంపితము నై యంభోధర శ్రేణి తు
త్తినియల్ గా నలు ప్రక్కలన్ జెదరె, పాథోరాశి భంగమ్ములు
ర్విని మ్రింగంజనునట్లు లేచె, పవనోర్మీ వ్యాప్తమై భీషణ
ధ్వని యొక్కండది దిక్కులంజనె భయోత్పాతమ్ముఁ గల్గించుచున్.

ఆవలి తీరమందు కపు లాతురతన్ గను లెత్తి ఎప్పుడా
పావని వచ్చి, చల్లనగు వార్తను దెచ్చునటంచు దిక్కులం
ద్రోవలు జూచు చుండ, నొక దూరమునన్ గనవచ్చె దక్షిణా
శావలయమ్ము జీల్చి వరుసంబడివచ్చు ద్యుతి ప్రతానమున్. 550

వెను వెంటన్ బవనోర్మి కాంతరితమై విన్పింపగా భూరిని
స్వన మొక్కం దది యాంజనేయుడును గావచ్చున్న యాసన్ కపుల్
చని రొక్కొక్కరె యామహేంద్రగిరికిన్ సామీర్కై నింగిపై
గను చూపందిన మేరం జూచుచును జాగర్యప్రతీక్షాత్ములై.

వచ్చెను వెన్కకుం దిరిగి వాయుతనూజుండు దైత్యులంకనుం
జొచ్చిన నాటి భూరిరయ శోభల మించి వెలుంగు సంతసం
బచ్చుపడంగ, రాఘవున కావసుధాత్మజ వార్తం దెల్పగా;
వచ్చి మహేంద్ర శైలమున వ్రాలె, కపుల్ గని చుట్టు ముట్టగన్.

''చూచితి సీత'' నం చనిలసూనుండు పల్కె నొలేదొ గంతులన్
వైచుచు నేక కంఠమునబల్కిరి ''జే'' యనుచున్, కరమ్ములన్
సాచి కవుంగిలించిరి, బుజమ్ముల మోయుచు ద్రిప్పి స్వాగత
శ్రీ చిగురొత్త సన్నుతులంజేసిరి హన్మకు వేడ్క మీఱగన్.

అమృతాసారము లక్షరాక్షరము ల ట్లాలించి రా వానర
ప్రముఖుల్, మారుతి వార్ధి దాటి దితిజావాసమ్ము నంజొచ్చి శో
కము రూపమ్మగు ధాత్రిజాతకు రఘు క్ష్మానాథు వార్తన్ సమ
స్తము విన్పించుచు లంకం గాల్చిన కథన్ సర్వమ్ము వాక్రువ్వగా.

దనుజుల మధ్య జానకి వెతల్, పవనాత్మజుంజంప వాలమం
దనలము (బెట్టి యాడ్చిన దురాగతమున్ విని యొక్క పెట్టుగా
వనచరు లాగ్ర హోగ్ర బలవత్ పటు ధీరత నార్చి లేచి రా
దనుజులంబట్టి తక్షణమె ధ్వంసమొనర్చు తలంపు పెంపునన్.

హనుమంతుంగని జాంబవంతు డనురాగానంద మేపార నా
యన! నీకీర్తి జగమ్మునన్ నిలుచు చంద్రార్కమ్ముగా నంచు మూ
ర్ధ్నిన శీర్షమ్మును, అంగదుండలరి మాకున్ నేడు నీవోమరు
త్తన యా! జీవనదాత వంచును పొగడ్తల్ సేసె హర్షంబునన్. 556

దాశరథిదయ, సీత వాత్సల్యగరిమ,
మీదు దీవనల్ నాకును ప్రోదిగాగ
చేయఁగల్గిన యంత నేచేసి నాడ
ననుచు నమ్రుఁడై వారి కాహనుమ మ్రొక్కె.

ఆలస్యంబిక గూడ దంచు కపులాహన్మంతు వెంటన్ మహో
హేలాకేళి వినోదమోదమద వైజృంభ ప్రదీప్తాత్ములై
వాలమ్ముల్ పయికెత్తి త్రిప్పుచు కడున్ వైళంబ కిష్కింధలో
వ్రాలన్ పర్వులు దీసి రుత్కట రయ ప్రారంభ సంరంభులై.

పంతం బాడుచు దూర మెంచుచు కపి వ్రాతంబు కిష్కింధన
ల్లంతం గాంచుచు పట్ట రాని ముదమే పారంగ సుగ్రీవుఁడా
పొంతం బెంచిన రమ్యమౌ మధు వనంబుం జేరుచున్ దద్వనో
పాంతం బెల్లను క్రిందుమీదులుగ సేయన్ సాగి రౌత్సుక్యులై.

పొదలపెకల్చి, తీవలపువుల్ విరజిమ్మి, ఫలోర్వ్రిజమ్ములన్
మొదలులు పట్టి కూల్చి, ఫలముల్ దినిత్రేనిచి, తేనెపట్టులన్
విదిలిచి తప్ప త్రావి, వనవీథుల వెంబడి గెంతుచున్ యదా
యదలు గఁ జేసి రావనము నంతయు వానరు లొక్కపెట్టునన్.

మధువులు ద్రావి త్రావి, కడు మత్తులు నై విహరించుచున్ వనం
బదవదఁ జేయు వానరుల నారసి యావనపాలుఁడల్కతో
దధిముఖుఁడన్న వా డెదిరి దర్పమునన్ బెదరింప వానిపై
నదలుచు కేరుచున్ తరిమి రావలకున్ కపులెల్ల రేకమై.

దధిముఖుఁడేగి చెప్ప కపితండ మొనర్చిన దుండగమ్ము లా
యధిపుఁడు వానరేంద్రుఁడది యంతయు సీతనుఁజూచి వచ్చి స
మ్మదమున వానరుల్ సలువు పోడిమి గా గ్రహియించి వెంటనే
దధిముఖు తోడు కొంచుఁ జనె దాశరథుల్ వసియించు చోటికిన్. 562

హనుమంతుఁడు సీతవార్త రామునకు నివేదించుట

సీతనుఁజూచి వానరులు చేరువకుం జనుదెంచి నట్టి వా
చేతలు దోచు చుండె నదె శ్రీరఘురామ! వనమ్మునన్ గపి
వ్రాతముసేయు నల్లరులు రాయిడులం గనుచుండ; ధారణీ
జాతను గూర్చి నీమది విచారము మానుమటన్న యంతలో.

వచ్చిన వానరేశ్వరుని పల్కులకున్ మొగముల్ ముదమ్మునన్
విచ్చిన రామలక్ష్మణులు వేచెడి ప్రస్రవణాద్రి మీదకున్
వచ్చి రయమ్ము నన్ దిగిరి భాసుర హర్షవికాస సమ్మదం
బచ్చులు వోయు రూపముల నాకపు లంగద హన్మదాదులున్.

''సీతను చూచితిన్ నియత జీవన,'' నాదితి జేశు వీట నా
మాత నటంచు వ్రాలె హనుమంతుఁడు రాముని పాద సుందరా
బ్జాతములందు, హర్షజనితామల బాష్పజలార్ద్ర లోచన
ప్రీతిగ స్వామి దర్శన ప్రహృష్ట సుఖానుభవ ప్రభావుఁడై.

వనచరులున్ రఘూత్తముని పాదములన్ బ్రణమిల్లి వారలా
వననిధిఁజేరు టా పిదప పావని వారిధి దాటి దానవే
శునిపుర మంతయున్ వెదకి చూచి యశోకవనమ్మునందు సీ
తనుగని వచ్చి చెప్పిన కథన్ వివరించిరి నమ్ర వాక్కులన్.

సీతయు లంకలో జీవించి యున్న
ప్రీతిఁగొల్పెడి వార్త విని రామ మూర్తి
ఆమె యెట్లున్నది, ఏమి చెప్పినది
ఆమాట వినిపింపు డనినంత హనుమ.

స్వామీ! నీ కరుణాశిషమ్మున మహావారాశిలంఘించు చో
నామార్గమ్మున నాగమాతయును మైనాకాద్రియున్ జూపి రెం
తోమర్యాదను,చెట్ట రక్కసిపడంతుల్ సింహికాలంఖిణుల్
తామై నన్నెదిరించి వచ్చి రొక ఘాతన్ నెత్తురుల్ గ్రక్కుచున్. 568

మణిమయ సౌధశోభితము మంజుల కాంచన దీప దీప్తమౌ
దనుజపురమ్ము జొచ్చి వసుధాసుతకై నలుమూలలన్ దశా
స్యుని నిలయమ్ము సైతమును జూచియు సీతను గానలేక లం
కను నలుప్రక్కలన్ మరలఁగానగ నేగిన దెల్ల వ్యర్థమై.

తుట్ట తుదకేను దైత్య నాథుని విహార
భాసు రోద్యానక మశోక వనము నందు
కావలిగ నున్న రాక్షసాంగనల మధ్య
దీనమూర్తి సీతను జూచినాను రామ!

మబ్బు గ్రమ్మిన చంద్ర బింబమ్ము పగిది
బెబ్బులులకు చిక్కిన లేడిపిల్ల వోలె,
దారుణాతప తప్త పద్మమ్ము పగిది,
దనుజ కాంతల కుటిల తర్జనల మధ్య

మాటి మాటికి రామ రామా! యటంచు
పతివియోగ విచార సంవ్యథిత చిత్త,
అశ్రుధారామలిన వదనాంబుజాత,
దీన మూర్తి సీతను జూచి నాను రామ!

హనుమ వచించుచుండ నిటు లా రఘురాముడు లక్ష్మణుండుక
న్గొనలను జారు నీటి చినుకుల్ తడియొత్తిరి సారె సారె కా
జనకజ దుస్థితిం దలఁచి; స్వాంతము నందు విచార బాధ నా
హనుమ యణంచుచున్ నుడివెనావలి సంగతి నిట్లు నమ్రుడై.

సామర్థ్య మ్మెనయంగ మూడు జగముల్ శాసించు మా దానవ
స్వామే నీకరమున్ గ్రహింపఁదగడా, సర్వావనీరాజ్య హే
లామర్యాదలు కాలదన్ను టది యేలా పిచ్చి దానా! యటం
చేమేమో దను జాంగనల్ పలికి రాపృథ్వీజనుం జూచుచున్. 574

ప్రబల దానవ రాజ్యవైభవ విలాస
రత్నకోటీర భూషణ రమ్య వస్త్ర
గంధ మాల్య విభాసు రాకారుఁడగుచు
రావణుడు వచ్చి వివిధ దుర్భాషలాడె..

అవనిజయున్ దశాస్యు మొగ మారయ కావలి వైపె జూచి శో
కవివశ యౌచు గడ్డి పరకన్ దనకడ్డుగఁబెట్టి యోయిదా
నవపతి! నీదురాగత మణంపగ రాముడు వచ్చు తన్మహా
స్త్రవిలయ వహ్నికీలలను చత్తువు నీవిక తథ్యమం చనన్.

సకల ప్రాజ్యసుఖోప భోగ విలసత్ సంపన్నిధుల్ నీదు కా
ళ్ళకడం బెట్టెద రామువీడి నను హేలన్ జేరుమీవేగ జా
నకి! నీకున్గడు వొక్కమాసమె యగున్ నన్ జేరుటో లేకని
న్నిక గత్తిన్ దెగగోయుటో యనుచు పంక్తిగ్రీవుడేగెన్ బ్రభూ!

రావణుఁడేగె దుర్ణయ దురాలపనంబులనాడి యాడి, యా
కావలి వారికిన్ నిదురగ్రమ్మిన దాస్యములందు; వేగ నే
నావసు ధాత్మజాత వినునట్టుల చెట్టుననుండి యే, సుహృ
ద్భావ మెసంగు బాసలను పల్కదొడంగితి నల్ల నల్లనన్.

దేవేంద్రుండె సుహృద్వరుండయిన కీర్తిన్ లోకసమ్మాన్యమౌ
మీవంశోన్నతియున్, దశాననుడు బల్మిన్ సీతఁగొంపోవ మీ
రావన్యాధ్వము లందునన్ బ్లవగ రాజ్యమ్మున్ సమీపింప సు
గ్రీవుండున్ సఖుడైన సంగతులు వర్ణింపంగ, నా తల్లియున్-

తరువున నున్న నన్నుగని దానవుఁడే యితడొక్క డెవ్వడో
మరల ననున్ కనుల్మొఱగు మాయలమారి యటంచునెంచి ని
వ్వెఱఁబడి దుఃఖ మొందు పృథివీజను గాంచుచు చెట్టు క్రిందకే
నరిగి తదంఘ్రి పద్మముల కంజలి వెట్టి శిరమ్ము వాల్చుచున్. 580

ఆమెకు నమ్మకమ్మొదవ నంతయుఁజెప్పితి మిమ్ము గూర్చి మీ
రీమెయి నామెకై పరితపించుచు నుండుట; లబ్ధి దాటుచున్
దీమస మొప్ప మీర లరు దెంతురు రావణుఁబట్టి త్రుంతురం
చా మెకు గుర్తు మీరిడిన యంగుళిముద్ర నొసంగితిన్ ప్రభూ!

మాతకు దెల్పి తేను హనుమంతుడ, వాయుసుతుండ నిట్లు మీ
దూతగ వచ్చి నాడనని తోయధి దాటుచు నొక్కగంతు నం,
దాతత శక్తి సాహససమర్థత నెంతటి కార్యమైన నుం
జేతును కామ రూపి నని చిత్తమునన్ నను నమ్మ వేడితిన్.

కరకమలమ్ములన్ గొనుచు కన్నుల కద్దుచు నుంగరమ్ముదా
నురమున దాల్చి యశ్రుఝరు లుర్విజరాల్చుచు మీకు గుర్తుగా
శిరమున నున్న భూషణము శీఘ్రమె దీసి యొసంగె, రాఘవే
శ్వర ! గయి కొమ్ము దీని నని వాయుజుఁ డిచ్చె వినమ్ర శీర్షుడై.

అమరేంద్రుం డిడి నట్టిదిన్, దివిజ పూజ్యమ్మిద్దియున్, మావివా
హమువేళన్ దనతండ్రి కాన్క యగు సమ్యగ్భూష ధాత్రీజ శీ
ర్షమునందున్ వెలుగొందు నన్న తలఁపుల్ జన్మింపనద్దానివ
క్షము నందద్దుచు రాముడేడ్వఁగని యాశ్వాసించె సౌమిత్రియున్.

ఈ నవరత్న భూష నిడి, పృథ్విజయున్ నుడివెన్ ప్రభూ! అభి
జ్ఞానము గాగ కాకియు కుచమ్మును జీల్ప తృణమ్మె యమ్ముగా
వానిని శిక్ష సేయుటయు, ఫాలమునన్ దిలకమ్ము వోవగా
దానిని దిద్ది నావట ముదమ్మలరంగ శిలారజమ్మునన్.

ఈసున నన్నదల్చి బెదరించెడు రక్కసి గుంపు మధ్యనే
మాసము కంటె నిల్వను సుమా యని చెప్పెను జీవితమ్మునం
దాసయు గానరాని బహుళార్తినిఁగుందుచు, నిన్నె భక్తివి
శ్వాసములన్ దలంచుచు పవల్ నిశలన్ ధరణీజయున్ ప్రభూ! 586

కనుగవ నశ్రువుల్ దొనక క్ష్మాసుత పంపిన దయ్యు నన్ను మీ
కును వినిపింపనామె పలుకుల్, మఱి నేనును వచ్చు వారితో
నను నెదిరించు దానవగణమ్ములఁదున్మితి నింద్ర జిత్తు రా
వణు తనయుండు నన్ను గొని బందిగ కొల్వునకేగ్చు నుద్ధతిన్.

అనుజుడు నౌ విభీషణుడు నడ్డుగ వచ్చెను గాని రావణుం
డును నను జంపువాడె, దహనోత్కటవహ్ని రగిల్చి తోకకున్
నను విడువంగ కోపమున నాదనుజేశుని లంక సర్వమా
యనలుని పాలొనర్చితి నయా! నిలుపోపగ లేక నెమ్మదిన్.

నీకరుణావిలాస మది నిప్పులు జానకి యున్న చోటికిన్
బ్రాకగలేదు; తోకపయి వహ్ని లెగంబడి మండు చున్ననున్
నాకును మేనిపై నొకకణమ్మును వేడియులేదు, నేడు మి
మ్మికడఁజూచు భాగ్యము లభించిన ధన్యుడ నో ప్రభూ ! అనన్.

ఓనిరవద్య ధైర్య మహిమోన్నత! ఓ కపిలోక ధూర్జటీ!
దానవ భూమిఁజొచ్చి, వసుధాసుతఁజూచిన వార్త దెచ్చి, నా
ప్రాణము నిల్పఁగల్గిన మహాత్ముఁడ వంచును రాము డామరు
త్ప్రానుని కౌగిలించెను మధుస్మిత దీపిత సుందరాస్యుఁడై.

జానకి వార్తయుందెలిసె సైన్యము సిద్ధము సేయు తొందరన్
వానర నాథుడుండె, తనవద్దను సర్వసమర్థుడౌ మరు
త్ప్రానుడు గూడ నుండు శుభ సూచనలం దొక నూతనోత్సు కా
నూన మనః ప్రశాంతి మది నూల్కొనె రాముని కాత్మయందునన్.

దానవ నాథునిం దునిమి ధారుణిజన్ గొనిరాగ రామ భూ
జానియు తొందరన్ బడుచు స్వాంతమునన్ దన జైత్రయాత్రకై
వానర రాజు కా పగిది వార్తల నంపె, మహోద్య తోత్సుక
స్వానములన్ బొనర్చి కపివర్యులు హర్షమునన్ జెలంగగన్. 592

తక్కిన మూడు దిక్కులకు ధారుణిజం గన నేగి యామెనే
ప్రక్కను గానకన్ తిరిగి వచ్చిన వానరులున్ మరుత్సుతుం
దక్కడఁ జెప్పుచున్న కథ నంతయు, ఁబ్రీతిగ వించు చిత్తముం
దక్కజ మంది హర్ష వివశాత్ములు నై వినుతించి రాతనిన్.

జనకజఁజూచి వచ్చితిని, సర్వము దైత్యుని లంకలోపలన్
వినినది కన్నదెల్ల వినిపించితి నోప్రభు! మీదు రాకకై
జననియు వేచియున్నది నిశాటుల మధ్య నటంచు రామల
క్ష్మణులకు భక్తి పూర్వక నమస్కృతులన్ బచరించె హన్మయున్.

ఆశ్వాసాంతము

దైతేయుని లంకకు మీ
దూతగఁ జని యతి వివేక ధూర్వహమతియై
వాతాత్మజుఁ డుర్విజఁ గని
యేతెంచి వచించిన కథ యిది రఘురామా!

దనుజులమధ్య దీనయగు ధాత్రిజ కూఊట గొల్పి వచ్చుచో
దనను వధింప పైఁబడిన దైత్యుల నుక్కడగించి లంకయుం
దనలము బెట్టి కాల్చిన మహామతి మారుతి వీర గాథలన్
వినిచితి నిట్లు రామ! రస విస్తృత సుందర పద్యవిద్యలన్.

పరమ విహిత వీక్షా! భక్త రక్షైక దీక్షా
సరస మృదుల భాషా! చక్షు రానంద వేషా!
సురభయ పరి హారా! సూరి చేతో విహారా!
శరవిదళితవైరీ! సర్వలోకోపకారీ!

ఇది శ్రీ హనుమత్ప్రబంధము ద్వితీయ భాగమున
అశోకవన విధ్వంసము, ఆంజనేయుని బలవిజృంభణ, అక్షయకుమారవధ,
రావణుని కొల్వు, లంకాదహనము, హనుమంతుడు రామునకు సీత వార్త
దెలుపుట కథలుగల చతుర్థాశ్వాసము. 597

శ్రీహనుమత్ప్రబంధము

ద్వితీయ భాగము : పంచమాశ్వాసము

రావణవధ- శ్రీరామపట్టాభిషేకము

శ్రీకాకుత్స్థాన్వయ నీ
రాకర కార్తీకరమ్య రాకా సోమా!
ప్రాకట కోసల రాజ్య
శ్రీకర పట్టాభి రామ ! సీతారామా!

వానర సేన వెంట నడువన్ వనరాశిని దాటి లంకలో
దానవనాథు దున్మి , వసుధాసుత తోఁజను దెంచి గౌరవ
శ్రీనెగడన్, అయోధ్యనగరీప్రజ గొల్వగ, కోస లావనీ
మానితపట్టభాగ్యమహిమన్ గొను నీకథ యిద్ది రాఘవా!

దేవా అవధరింపుము.

విభీషణుని శరణాగతి

ధారుణి జాత వార్తకు ముదమ్మును బొందియు రాము నాత్మలో
నూఱట గాన రాదు; పవనోద్భవుఁడుద్ధతి దాటెగాక యా
వారిధి దాటు టెట్లు కపివాహినిఁ దోడ్కొని, యెట్టి చెట్టచే
కూరక ముందె యాపుడమికూతునుగన్గొను టెట్టు లంచునాన్.

సుగ్రీవుం డరుదెంచి సర్వజగతీ శూరుండ వీ చింతనా
వ్యగ్రత్వం బది యేల రామ! సమర వ్యాపార ధౌరేయ సా
మగ్రీ సర్వ సమర్థులుత్కట బలోన్మత్తుల్ రిపుధ్వంసకో
దగ్రుల్ వానరులుండ వార్ధి యొకలెక్కా యంచు వాక్రువ్వగా.

హనుమంతుండును వచ్చి మ్రొక్కులిడి, దైత్యాధీశు లంకాపుర
మ్మున ప్రాకారరహస్యమార్గ వివరమ్ముల్, దుర్గమ ద్వార బం
ధనిరోధమ్ము, లనేక కుడ్యచయ సంధా నాధ్వముల్ దానుఁ జూ
చినవెల్లన్ రఘు వీరులున్ విన వచించెన్ స్పష్ట వాక్యమ్ములన్. 602

శుభసంసూచనగా నభస్స్థలము నన్ సూర్యుం డు దాత్తుండు నౌ
నభిజిద్దీప్తముహూర్త కాలమున మఱ్ఱాడే కపి శ్రేణులున్
రభ సోద్వేగము తోడ వెంట నడువన్ రాముండు దర్పోల్లస
ద్విభవుండై చనె దక్షిణాంబుధి తటీ వీథిన్ మహేంద్రాద్రికిన్.

భీమాటోప విజృంభమాణ కద నాభీలాకృతుల్ వానర
స్తోమంబుల్, పదఘట్టి తావని రజస్తుంగా భ్రసంశ్రేణి భూ
ద్యోమార్గంబులఁ గ్రమ్మ నట్లు చని రత్యుగ్రార్భటుల్ మ్రోగ శ్రీ
రామక్ష్మాపతి కార్య నిర్వహణ ధౌరంధర్య పారీణులై.

చారుల్ శీఘ్రము వచ్చి దైత్యపతికిన్ సాష్టాంగముల్ వ్రాలుచున్
తీరమ్మందున వార్ధి కావల సమీద్ధీరుల్ కపుల్ లక్షలై
చేరన్ జూచితి మో ప్రభూ యని వడిన్ జెప్పంగనే రావణుం
డారాటం పడె గుండెలోఁ జొనిపినట్లై వాడి శూలమ్ములన్.

వానరుఁ డొక్క- డేచి నలుప్రక్కలఁ జిచ్చులు బెట్టె లంకకున్,
వానర సేనతో నిటకు వచ్చి రఘూత్తము డేమి సేయునో
దానయి పోల్చఁ జాలని వితాకున మంత్రులఁబిల్చి కొల్వునన్.
దానవ నాథుఁడీ బెడద దాటు ను పాయముఁ జూడు డీ యనన్.

దీమస మేపు మీఱు రణధీరనిశాచర వీరు లార్భటిన్
రాముఁడా! గీముడో! అసలు రాగలడా జలరాశి దాటి, తా
నేమటుమాయనైన పాగ రెక్కిన కోతులఁగూడి వచ్చినన్
మీమును ముందు మ్రింగెదము మేకొని వారినటంచు నార్చుచున్.

విభీషణుని శరణాగతి

పిడుగులటుల్ పదాహతుల పృథ్విని ద్రొక్కు-చు, పండ్లు గీటుచున్
పిడికిలులన్ బిగించుచును బెబ్బులు లట్టుల బొబ్బలార్చుచున్
పెడసర మాటలన్ దితిజ వీరులు కారులు పల్కు-చుండగా
కడువడి వారికిన్ నడుమ కైజత మోడ్చి విభీషణుం డనున్. 608

వినుమో దానవ నాథ! నీకెడద సంప్రీతిన్ ఘటింపంగ నే
ర్చిన వీ మాటలు గాని విల యార్చిష్మంతుఁ, డా రాముఁడ
న్నను లోకైక మహాధనుష్కుఁ డతనిన్ గాదంచు గాల్రువ్వ టె
వ్వనికైనన్ గొనితెచ్చుటే సకల విధ్వంసంబు చేఁజేతులన్.

అనుగుం దమ్ముఁడ నీదు సేమ మెద యందాసించి వాక్రుచ్చు నా
వినతుల్ విన్మొక యింత రామునకికన్ పృథ్వీజ నర్పించి యా
తని కారుణ్య ఫలమ్మునన్ మనుము నిత్యశ్రీలు దీపింపనాన్
విని దైత్యేశుడు తాడితోరగఫణా విర్భూత ఫూత్కారుఁడై.

ఛీ! పాపాత్ముడ! నీవిటుల్ పలుకగా సిగ్గైన లేదా త్రిలో
కీ పూజ్యుండను రామచంద్రు నెదుటన్ గేల్మోడ్చి నిల్చుందునా
పోపొమ్మంచు విభీషణుం దరిమె కొల్వున్ జేర వద్దంచునున్;
పాపస్వాంతులు స్వార్థులై యరయరున్ బాంధవ్యముల్ సైతమున్.

పరిభూతుండయి యావిభీషణుఁడు సద్భావుల్ సఖుల్ వెంట రా
శరణంచున్ పఱ తెంచి రాము చరణాబ్జాతమ్ములన్ వ్రాలగా
కరుణాసింధువు రాముఁడాదరణ వీక్షావృష్టితో వానికిన్
శరణీయన్ వినిపించె నాతఁడును తాఁజన్దెంచు వృత్తాంతమున్.

కావలె నంచు రాముడడుగన్ వచియించె విభీషణుండు నా
రావణులంకలోని వివరమ్ములు సైన్యబలాబలమ్ములున్
ద్రోవలు సందు గొందులును దుర్గ నిగూఢ మహాయుధస్థలుల్
రావణమేఘనాదుల దురాసదమాయలు యుద్ధ వేళలన్.

మలిన జలమ్ములన్ మధుర మంజుల పద్మము పుట్టి కాంతిమత్
సలలిత రూప సంపదల సౌరభముల్ విరజిమ్మ నట్లుగా,
తులువల మధ్య సాధు చరితుండు విభీషణుడున్ జనించి ని
ర్మల చరితార్థుడై మనియె రామనృపాలుని యాశ్రయమ్మునన్. **614**

వారధి నిర్మాణము

శ్రీరాముండు పయోధి తీరము కడన్ జేరంగ, ఘోరమ్ముగా
తీరమ్మున్ దన వీచికాగ్రములతో దీండ్రించి కోరాడు నా
పారావారము గాంచి యీ జలధి సర్వం బెట్లు లంఘించెనో
ధీరుం డా పవనాత్మజుం డనుచు బొందెన్ సంభ్ర మాశ్చర్యముల్.

తనమార్గంబున కడ్డుగానగు సముద్య ద్గర్వ రేఖా తరం
గనికాయోర్జిత నిస్వనోచ్చలిత దిక్చక్రావధిన్ వార్నిధిన్
గని శ్రీరాముడు వేడ సౌమ్యముగ మార్గం బీయగా, సాగరుం
డను కూలింపఁడు మానడున్ బటు తరంగారావ దర్పోద్ధతుల్.

వంచింపం బని లేదు వార్ధికనుచున్ భావించి రాముండు మ్రో
గించెన్ నారిని తత్ప్రచండ ధను రాకీర్ణోగ్ర టంకారముల్
పంచారించుచు దిక్తటమ్ము లదరన్; వారాశి మర్త్యాకృతిన్.
వంచెన్ శీర్షము రాముముందు నిటులన్ వాక్రుచ్చుచున్ నమ్రతన్.

నీమార్గంబున కడ్డురా దగనయా! నిన్గాంచి యుప్పొంగి నా
నామోదంబున ; నేనెఱుంగుదును రామా! నీప్రయత్నమ్ములన్;
నామీదన్ రచియించి వారధిని సైన్యంబెల్ల పోవచ్చు వే
ఱే మార్గంబిక లేదటంచు నుడివెన్ శ్రీరాముతోఁ బ్రీతిమై-

జలతత్త్వమ్ము నెఱింగి నట్టినలుఁ గీశాధ్యక్షు డర్థింపగా,
నలవోకన్ నలు దిక్కులన్ తిరిగి యర్హంబైన పాషాణపం
క్తుల నావానర సేన లేగి కడకన్ దోడ్తెచ్చుచుండంగ నా
జలధిన్ సేతువు గట్టె నా నలుడు పెల్చన్ పంచరాత్రంబులన్.

నృత్యన్మంజుల హస్త తాళములతో, నిర్ణిద్ర గీతాళితో,
ప్రత్యాలీఢపదమ్ముతో విజయ భద్రస్థైర్య ధైర్యంబుతో,
ప్రత్యక్షప్రమదమ్ము తో వన చరవ్రాతమ్ము లాలంకకున్.
ప్రత్యాసారము లొప్ప వారిధిపయిన్ బర్వెత్తె రుద్రిక్తులై. 620

అదియున్ వారధి కాదు వార్ధిపయి, దైత్యాధీశు దుర్మంత్ర దు
ర్మద దుర్నీతికి మృత్యువేదిక; మహోద్యద్ధర్మ సంస్థాపనా
స్పద సంధానము; సర్వలోక హిత శశ్వద్రామ రాజ్యోదయ
ప్రదభాగ్యమ్మది యంచు దేవగణముల్ భాషించి రభ్రస్థలిన్.

వానరాసుర యుద్ధము

భానుమరీచికల్ పుడమి పైఁ బడువేళకు లంకమీదికిన్
వానరసేన వచ్చి పడె నన్నది చూడఁదలంచి మేడపై
దానవభర్త వైభవమదమ్మున నిల్చుటఁ గాంచి క్రుద్ధుడై
వానరనాథుఁడా యసుర పై వడి దూకుచు నొక్క గంతులో
వానిశిరమ్ముఁ దన్ని పడవైచె; పదంపడి యంగదుండు నా
దానవుఁగాంచి వాని దురితమ్ము వ చించి బలమ్మెలర్ప లం
కానగరీమహాసదము గ్రక్కున ఁగూలిచి కాలి తాకుతో,
వానర సేన ధైర్యబల పాటవముల్ జవి జూపె నచ్చటన్.

అరయక ముందు వెన్క, లనికై నడపెన్ దితిజుండు సైన్యముల్;
ధరణికి శ్రేయమై యెసఁగు ధర్మవిధానము లొక్కవైపునన్,
ధరణికి కంటకమ్మయిన దైత్యవిధమ్మొక వైపునన్ జగం
బరయగ రామరావణమహారణ మైనది లంకలోపలన్.

పటుదుర్వా రబలప్రదర్శనధురా ప్రారంభసంరంభ మం
దటుల న్యోన్య జిగీష మీఱ సమరాహంకార సంభారము
ల్విట లూగాడు పగన్ పెనంగుచును పోరం జొచ్చి రిర్వాగులు
త్కట రోషప్రకటోద్య తాహవ కళా దర్పంబు లే పారగన్.

కులిశ తోమర వాలాసి కుంత పరశు
నికర ముద్గర శూల మ్ము లొకరి వగుచు,
చరణనఖములు ఱాలు వృక్షమ్ము లొకరి
యాయుధమ్ములై యచటి యాహవమెసంగె. 626

తేజితబాణ హస్తులు ప్రదీపిత శౌర్యకళామహోల్లస
ద్రాజిత తైజసాకృతులు రాముడు లక్ష్మణుఁ డామరుత్సు తుం
డోజ బుజమ్ములం దిడి మహోత్సు కతన్ గొనిరాగ దైత్యుపై
నాజికి వచ్చి రుగ్రనయ నాకృతు లిర్వురు వచ్చి నట్లుగన్.

నాగబంధము

రాముడు లక్ష్మణుండుఁగపి రాజును తక్కిన వాన రాగ్రణుల్
భీమ పరాక్రమోగ్రులయి వీరవిహార మొనర్చ దానవ
స్తోమము లార్తులై వెనుక ద్రోవలు బట్టు టఁగాంచి యుద్ధమా
యామహనీయుఁడింద్రజితుఁడార్చుచు నేసెను నాగ బంధమున్.

ఎక్కడి వార లక్క డనె పృథ్విని వ్రాలిరి; రామలక్ష్మణుల్
చిక్కిరి నాగ పాశమున చేష్టలు దక్కుచు, హన్మ దాదులా
యిక్కము జూచి బెంగ వడి రేమియుఁదోచక యింత లోన దా
నెక్కడనుండియో దిగియెనేలకు వైళము వైన తేయుఁడున్.

ఉరుతర పక్షమారుత రయోచ్చలి తోన్నత పర్వతుండునై
గరుడుఁడు రాగ నాగపరికల్పిత బంధములూడె, రాఘవే
శ్వరుడును లక్ష్మణుం డఖిల వానరు లెప్పటి యట్ల లేచి; రా
గరుడడు రామలక్ష్మణుల కాళ్లకు మ్రొక్కుచు నేగె వెన్కకున్.

ఊఅక మేఘనాదుని మహోరగపాశము నాశమయ్యె నం
చారట మంది దానవమహారథు లీసున తేరు లెక్కి యే
తేరగ పోరి, కంతకు పదింతలు రోసము దూసి యుద్ధ కా
ర్యారభ మాణులై ప్లవగరాజును ముందిడి యేగి రా కపుల్.

తేరిన యుద్ధమాయ గడి దేరిన ధీరత రక్కసింపుచున్
బోరికి వచ్చి పాసి రసువుల్ దశకంఠుని సైన్యనేత, లా
వీరమహేశ్వరుండు రఘువీరుడు గూల్చెను కుంభకర్ణునిన్,
కారెను బోతు బోలు నతికాయుని గూల్చె సుమిత్ర సూనుడున్. 632

నిమిసముగూడ ధైర్య మెదనిల్పని రావణుఁడింద్ర జిత్తుతో
సమయము వచ్చె నోతనయ సాగవికన్ మన మాయ లా రఘు
ప్రముఖుని చండచాప శరపంక్తుల ముందికలంక గావ నీ
సమధిక వహ్ని హోమ పటు శక్తి నిఁ జూపుము ప్రాపుగాననన్.

సంజీవని

హోమము పూర్తిఁజేసినసము జ్జ్వల సత్త్వుఁడు, ధైర్య సాహస
స్థేమ మహోగ్రరూప పరిదీపిత శూరుఁడు, మేఘనాదుఁడు
ద్దామమహోర్బటిన్ సమరధారుణికిం జని యేసె మంత్రవి
ద్యామహనీయ శక్తి నొక దానిని మిన్నులు మీద బెడ్డటుల్.

విస్తృత శక్తిమంత మతివేల మహోగ్రమ్మునైన వాని బ్ర
హ్మాస్త్రము ధాటి కోడి కపులందరునేలకు వ్రాలి పోయి రా
యస్త్రము నందు గౌరవము నాత్మఁదలంచుచు రామలక్ష్మణుల్
నిస్తుల శౌర్య ధుర్యులవనిం బడి చేతన దక్కియుండగా.

హనుమన్ గన్గొని జాంబవంతుడు మహాత్మా నేడు మామేని జీ
వనముల్ నిల్పగఁజాలు దీవె యగు దప్పా! చూడు మారామల
క్ష్మణులున్ మూర్ఛిలి నారు, వేఱు విధమున్ గాన్పించ దాయోషధీ
ఖని శీతాద్రికి బోయి తేవలయు వేగమ్మొప్ప సంజీవనిన్.

కాలము లేదు మాటలకికన్, తొలి ప్రొ ద్దగుపించు ముందె శీ
తాలయ మేగి రావలయునం చనిలాత్మజుఁడు న్న పాటుగా
వ్రాలిన భక్తి మ్రొక్కి రఘు రాముని, కాత్మఁదలంచి జానకిన్
తాలమహోన్నతుండు వియ దధ్వముపై కెగసెన్ జవమ్మునన్.

అని మొనఁగూలి రింద్రజితు నాయుధధాటికిఁ జిక్కి రామల
క్ష్మణు లని హర్ష నాదములు సల్పగ దానవ సైన్య ముక్కునన్,
వనచరముఖ్యు లొక్కొకరె వచ్చి దిగుల్పడి చూచి రామల
క్ష్మణులను, దిక్కుగానని వగన్ విలపించిరి నిస్సహాయులై. 638

ఆకాశమ్మున దారకల్ సెదర, నాశాంతమ్ము లూగన్, జవో
ద్రేకప్రౌఢిమ నంజనాతనయుఁడు ద్దీపించి శీతాచల
ప్రాకారమ్ములు దాటి యోషధి నగ ప్రాంత మ్ములం జూచి, యే
యాకారమ్మున నెచ్చటైవెదకి దా నచ్చోట సంజీవనిన్-

వీకన్ ద్రవ్వి గ్రహించు తీరెఱుగకన్ విద్యోత దివ్యౌషధీ
శ్రీకప్రోజ్జ్వల రూపమై వెలుగు నద్రిన్ పాదమూలమ్ముగా
జేకొంచున్ దన హస్తమందుఁజనె నా శ్రీరాముడున్ లక్ష్మణుం
డేకష్టంబున నుండి రో యను తలం పేచన్ మదిన్ రాయిడై.

తొలిప్రొద్దున్ నునువెల్గు తూర్పుమల పైఁదోచన్ కపుల్ దిక్కులన్
గలయం జూచుచు నుండ నాతురతతోఁ, గన్దోయి మిర్మిట్లుగా
వెలుగున్ జిమ్ముచుఁగాను పించెను నభోవీధిన్ హనూమంతుడు
జ్జ్వల మౌ నౌషధ శైల భాగమొక హస్తమ్మందు నం దాల్చుచున్.

క్షతగాత్రుల్ మృత దేహులున్ మరల నాసంజీవనీ సన్నిధిన్
క్షితిపై నెప్పటి యట్ల లేచి రెలమిన్ స్మే రాననుల్ వానరుల్;
స్మిత రేఖాద్యుతు లాననాబ్జముల క్రొంజెల్వమ్ముల న్నింపు దీ
పిత తేజస్కులు రామలక్ష్మణులు సుప్తిన్ వీడి రు జ్జీవులై.

పారావారము నెల్ల భూరి జవసత్వ స్ఫూర్తి లంఘించి సీ
తారామామణిఁ జూచి వచ్చె; నొక చేతంబూని నేడీమహా
భారంబౌ నచలమ్ముఁ దెచ్చెనని యావాతాత్మజుం జూచి యీ
వీరుండుగ్ర మహేశ్వరుండని కపుల్ వేనోళ్ళ శ్లాఘించిరిన్.

తనవిజయమ్ము చాటు కొని తండ్రిని గూడి మహోత్సవమ్మునన్
దనరెడు మేఘనాదు నెడదన్ ములికింగొనలట్లు నాటె నా
వనచర హర్ష నాదములు; బ్రహ్మమహాస్త్ర మె పాడి దప్పెనా
యనుచు పునః ప్రయత్నము మహానల హోమముఁబూనె నాతఁడున్.

అకటా నేటికి నింద్ర జిత్తు విలు కాడై వచ్చె మామీదకీ
యెకసక్కెమ్ముల వేవొ చూచెదను నేడే యంచు యుద్ధోన్ముఖ
ప్రకటోద్యత్ప్రళయాగ్నివోలె వెడలెన్ రామాను జుం డుగ్రకా
ర్ముక మాహేశ్వర విక్రమక్రమధురా రోచిఃప్రభాపూర్ణుడై.

ఇంద్రజిత్తు వధ

అన్నకు మ్రొక్కి, చండధను రస్త్రములన్ భుజపీఠిఁదాల్చి శౌ
ర్యోన్నతుఁడా సుమిత్రతనయుం డనికేగ, విభీషణుండు నున్
మన్ననఁబిల్చి చూడుము కుమార! అదే, చను చుండె నింద్రజిత్
గ్రన్నన హోమ శాలకు నికన్ దడ వన్నది సేయ కూడదున్.

అతడాహో మము పూర్తిఁజేసి యెదురై యస్త్రమ్ములన్ దాల్చుచో
క్షితి నాతండవి జేయుఁడంచు నుడువన్ శీఘ్రమ్మె సౌమిత్రి యా
దితిజశ్రేష్ఠునిఁజూచి ఓయియసురా! ధీరుండ వేనైన చో మ
త్ప్రతి ఘాత మ్మెదిరింపు మంచు తన చాపమ్మెత్తి చూపించినన్.

పైకొని వచ్చుచుండిన యుపద్రవమున్ గ్రహియించి దానవుం
డాకొను సింగమై ధనువు నందు టఁగాంచి సుమిత్ర సూనుఁడ
స్తోక సహస్ర శీర్ష ఫణ దుర్దమ సర్పమహోగ్ర పూత్కృతిన్
గైకొని య స్త్ర మొండు త్రుటి కాలము ధ్యాన నిమగ్న చిత్తుడై.

రాముఁడు సత్యసంధుఁ, డపరాజిత పౌరుష పూర్ణ నిస్తుల
స్థేముఁడు, ధర్మవర్తన విశిష్ట చరిత్రుఁడె యేని యీమహో
ద్దామ శితాస్త్ర మింద్రజినిఁ దాకి వధించు ను గాక యంచు దీ
క్షామహితప్రచండతరశక్తిగ మంత్ర నియుక్తి నేసినన్.

ప్రాణము లేచి పోయి, తలపైఁగల రత్నమరీచికా శిర
స్త్రాణము డుల్లి, ఖండిత శిరస్కుఁడునైపడె మేఘనాదు; డా
బాణము చాపముక్తమయి పర్విన దెప్పుడో నిర్నిరోధమై
దానవు నిన్ వధించిన విధ మ్మెపుడన్నది కానుపించకన్. 650

చాలడెవండుఁగూడ దనశక్తికి సంగర మం దటంచు ను
ద్వేల మదంబునం జనిన వీర వరేణ్యుఁడు మేఘ నాదుడుం
గూలెను యుద్ధమందనుచు గొంతులు బ్రద్దలు వోవు నట్లు గ
గ్గోలుగ నేడ్చిరా దనుజ కోటులు రావణు రాజధానిలో.

నమ్మగ వీలులేని వచనమ్మిది, నాథుఁడెటుల్ మహాగ్ని హో
మమ్మును వ్రేల్చు నిత్యనియమమ్మును మానును, లక్ష్మణుండు ధై
ర్యమ్మున నెట్లె దుర్చుఁగలఁడంచు సులోచన చిత్తమందెదో
యుమ్మలికమ్ముతోఁ జనిన దొయ్యన నత్తను జూచు గోరికన్.

కొడుకులు జచ్చి, యాకడుపు కోత భరింపగ లేక యేడ్చు రా
పడతియు కోడలింగనిన పట్టున గుండెలు వ్రీలు బాధ తో
నొడిపయి జేర్చి పట్టుకొని యూఱట గొల్పను గాని వేదనం
బడి యురి యాడు నా తరుణి బాధల నార్పఁదరంబె యేరికిన్.

ఒకరిది పుత్రశోకము, మఱొక్కరి కయ్యది భర్తృశోకమై,
వికల మనస్కలౌచు విలపించుచు నొక్కరి చేతులందు వే
ఱొకరయి మాట లేక పడి యుండిన వేళకుఁ జేరె రావణుం
డొకదరి లేని వెంగడపు టూహల నచ్చటి కూగు లాడుచున్.

ఎఱుగక వారు మువ్వు రట నెవ్వరి నెవ్వరు పల్కరించుటో
నరిమురి జెందు చున్న సమయమ్మున ధైర్య మునూని దానవే
శ్వరు సతి లేచి చూచితివె ప్రాణపతీ! మన లంకలోన నె
వ్వరి ముఖ మందుఁజూచినను బాధయె దప్ప మఱొండు గానమున్.

సాధుచరిత్ర యా ధరణిజం జెఱఁబట్టిన వాడ వెట్టి స
మ్మోదమొగాని నీకదియు, పుత్రుల చావున కర్ధి హేతువై
పోదిక ఖేదమెన్ని జనువుల్ చనినన్, మనకేమి? దుఃఖపున్
బాధల కాగలేని సుకుమారి సులోచన యేమి కావలెన్. **656**

రాముఁడజేయ వీరుడు, ధరాసుత సీత పవిత్ర శీల సా
ధ్వీమణి, వారి యాగ్రహ మవేల దవానల కీలయే యగున్!
రాముని వద్దకుం జని ధరాసుత నిమ్మికనైన నీదు లం
కామహి నున్న వారు బ్రతుకంగల రోదను జాధిపా'' యనెన్.

మనసును చిక్క బట్టుకొని, మామకు నత్తకు మ్రొక్కుచున్ సులో
చన ''దశకంఠ! నీవవనిజన్ జెఱఁబట్టిన నాడె యింతలా
నని తెలియున్ పతివ్రత మహత్త్వమెఱుంగని రాజు వీవు, న
న్నునుఁజన నిండు నింద్రజితునుం బడి పోదు చితాగ్నియందనెన్.

వాకొనఁజాల కేమియును వారల నిర్వురిఁ జూచుచున్ మనో
వ్యాకులుఁడై దశాననుఁడు వచ్చిన త్రోవలఁబట్టె నెమ్మదిన్
శోకము కోపమై తనువుఁజూడెడి నెవ్వగ యూరుపుంబొగల్
బ్రాకిన కన్ను జంట లిరు ప్రక్కల నిప్పులు గ్రక్కు చూపులన్.

అనుదిన మగ్నిహోమ సవనాధిక దివ్యఫలంబుఁగొన్న వా,
డనిమిష నాథు దర్పము దగ్రత నుగ్రత దూల్చి నట్టి నా
తనయుని జంపె రాఘవుని తమ్ముఁడు వంచనఁజేసి, చూతు రా
యనుజుడు నన్నయున్ సమరమందిక రావణు నంచు నెంచుచున్.

మానస మందు కోప మవమానము ముందు కు త్రోయు తెంపునం,
బూనిన పంత మొప్పగ సముత్కట రోషకషాయ దృష్టులన్
దానవ నేత యాజ్ఞయిడి దైత్యచమూతతికిన్ సమీక సం
ధానమొనర్పుడంచు, నరదమ్ము నఁదానరిగెన్ రణోర్వికిన్.

సమరము నందు మొన్న రఘు సత్తము శస్త్ర మహోగ్ర ధాటికిన్
తుమురులునై రథమ్ము, తన ద్రోవను వెన్క కుఁబోయి నట్టి యా
ప్రముఖుడు నేడిదే మరల వచ్చెను చూడు డ టంచు కీశ సై
న్యము లరు దెంచి రాహవ సమర్థులు రావణు పైకి పోరికిన్. 662

లక్ష్మణుని మూర్ఛ

జ్యావల్లీధ్వని కుప్పరమ్మగుల దైత్యాధీశుఁ డుగ్రాస్త్ర వి
ద్యావేశమ్మున నెల్ల చోటులకుఁ దానై వచ్చి దుర్దాంతమం
త్రావిర్భూతమ హత్త్వశక్తిని సుమిత్రా సూను పై వైవ చే
ష్టా విన్యాస మణంగి లక్ష్మణుఁడు మూర్ఛన్ మున్గె తద్ఘాతకున్.

వెఱచుచు వానరుల్ సమర వీథుల పర్వులు వెట్ట, సమ్మద
స్వరనినదార్భటుల్ సెలగ చచ్చెను చచ్చెను లక్ష్మణుండటం
చఱచిరి దైత్య సైనికు, లనంత విచారవిదీర్ణ చిత్తులై
యరిగిరి రాముడున్ ప్లవఁగు లాయెడ లక్ష్మణుఁడున్న చోటికిన్.

తనయొడి యందుఁ బెట్టు కొని తమ్ముని శీర్షము ఘోరు ఘోరునన్
పెనగొను శోకబాధ విలపించెను రాముడు, బంధు వర్గమున్
గననగు, భార్యనున్ బడయగానగు, దేశములందు గాని ల
క్ష్మణసముఁడైన సోదరుడుఁగానగ రాడని మాటి మాటికిన్-

అతిశయ మంత్ర శక్తియగు నస్త్ర హతిన్ స్మృతిఁదప్పె నీతఁడున్
మృతిఁగన లేదు; శీతల గిరీంద్రమునం గల జీవ నోషధిన్
వెతకుచుఁ దెచ్చినన్ బ్రతుకు నీతఁడ టంచు సుషేణుఁడున్ కపి
ప్రతతికిఁ జెప్పి నంత రఘురాముడు హన్మనుఁజూచె నాదృతిన్.

జీవన దాతవోయి కపి శేఖర! లక్ష్మణ మూర్తి ప్రాణముల్
గావగ పోవలెన్ హిమనగమ్మున కీవయి యన్న మాత్రలో
పావని లేచి రామవిభు పాదములంటి మహోర యోద్ధత
శ్రీ విభవమ్మెలర్ప నెగసెన్ విను వీధి కదృశ్య రూపుడై.

హనుమను దారి యందె హతమార్పగ వంచనఁ జేసి రావణుం
డనిపెను కాల నేమి యను నాతని, మాయల మారి మౌని యై
చని తన యాట లేమి యును సాగక మారుతి తోక దెబ్బకా
దను జుఁడె చచ్చె నేలఁబడి దానవనాథుని యాశ భగ్నమై. 668

పడగ విప్పిన త్రాచు పరువెత్తినట్లు
చాప నిర్గతమైన శరమేగు రీతి
విను వీధి బడియేగు విద్యుత్తు పగిది
పావని చని తెచ్చె జీవనౌషధిని.

తూరుపుఁగొండ దారులను తోయజ బంధుని సంజ బంగరుం
జాలలు గానరావు, హిమశైలము చేరిన దెప్పు డౌషధిన్
ధీరతతోఁ బెకల్చి కొని తెచ్చిన దెప్పుడు కొండ పెల్లతో
మారుతి, సర్వమిద్ది పరమాద్భుతమంచు దలంచి రాకపుల్.

ఆరుచిరౌషధీ ద్రవము నాతని నాసిక యందు నుంచగా
స్మేరము ఖాబ్జుఁడై నిదుర మేల్కొని నట్లుగ లేచి లక్ష్మణుం
డారఘు రాముఁజూచి దెగటార్పుము నేడిక రాత్రి లోపలన్
క్రూరుఁడు రావణాసురుని ఘోరము లంతము నొందు నట్లనెన్.

వనధిని దాటి యేగి సతివార్తను దెచ్చె, హిమాద్రికేగి త
మ్మునకును జీవన మ్మిడెడు మూలిక దెచ్చెను హన్మయంచు నా
తనిఁ దన కౌగిలిం గొని కృతజ్ఞత తో కపిలోకశేఖరా!
అను కొను నంత కంటె మహి మాత్ముడ వంచు నుతించె రాముడున్.

ఎచ్చటి దైత్యలంక మఱి యెచ్చట నుండె హిమావృ తాద్రి యున్
తెచ్చిన యోషధిన్ మఱల తెచ్చిన చోటనె యుంచి హన్మయున్
వచ్చెను రెండు సార్లిటుల, వర్ణన కందని దివ్యశక్తి సం
పచ్చరితుండితండనుచు వందనముల్ పచరించి రాకపుల్.

చచ్చెనటన్న లక్ష్మణుఁడు శాతవహోశుగ చాప హస్తుఁడై
వచ్చెను యుద్ధధారుణి కవార్య బలోద్ధతి నంచు చారులున్
దెచ్చిన వార్తయున్ మెడకుఁ తెచ్చిన యుచ్చును బోలె దివ్యమం
త్రోచ్చ మహాత్ము లెం దణగి పోయెనొ యన్న విషణ్ణ చిత్తుడై- 674

ఆదశకంఠుడుం దన హృ దంతర వేదన తొందరింప మం
డోదరి వద్దకుం జని కడున్ వడి మానుము దేవి! నీవెతన్
సాధుగుణాఢ్యయౌ జనకజన్, రఘురాముని నేనెఱుంగుదున్
కాదన రాక పోవలె నికన్ విధి న్నిర్ణయి మీ దురమ్ము నం

దేది ఘటిల్లినన్ మది సహింపక తప్పదు; ఆయు వున్నచో
మేదినిపై రిపుప్రళయమే ఘటియింతును, కాదయేనినా
కాదళ దబ్జ లోచనుఁడె యాశ్రయ మౌ నను భర్త నామెయున్
పాదము లంటి వీడు కొలుపన్ నిలిచెన్ స్రవదశ్రు నేత్ర యై.

మచ్చర మేచి చేసిన యమానుష కృత్యము పంట ప్రోవుగా
వచ్చిన దీవిపత్తు, పరివారము పుత్రు లమాత్యు లెల్లరున్
చచ్చిరి; రావణుం డిరుదెసల్ కపి సేన రగుల్చు చున్న కా
ర్చిచ్చుల మధ్య తానె మిగిలెన్ వగలాగని గుండె మంటతో.

రక్షోభర్త కెడందలో, cగలcచు నిద్రన్ జాగృతిన్ గూడ రా
మక్ష్మా జాని పరాక్ర మాకృతి యె; చంపం జాలు టో చచ్చుటో
లక్ష్యం బొక్కటి మాత్రమే మిగలి నట్లై లేచె నాతండు యు
ద్ధక్షోణీ విధ వేష భూషణ సమస్తాలంకృతి ప్రోద్ధతిన్.

మదరేఖ : ధైర్యోత్సా హుడు దర్ప
స్థైర్యోద్దాముడు సత్వో
దార్యుండైరణ ధాటీ
ధుర్యుండై చనె తోడ్తో.

విను వీధిన్ గనవచ్చె కేతన పటావిస్ఫార సాంద్ర చ్ఛవుల్,
వినవచ్చెన్ రథ పార్శ్వ కీలిత రణద్విన్యాస ఘంటాక్వణత్
క్వణ నిస్వానము, లుత్తమాశ్వ పదరింఖా ఘట్టన ధ్వాన మా
దను జేశుం డవనీతల మ్మదర యుద్ధక్షేత్రముంజేరగన్. 680

అతడు మహాతపస్వి, జలజాసన వంశసముద్భవుండు, ని
ర్జితదివిష త్రు భుండె యయి చేయగ రానిపనుల్ పొనర్చి దు
ర్గతిఁగొనె నంచుఁ జాలిబడె రాముఁడు చిత్తమునందుఁ గాని యా
దితిజుఁడు చూడబోవఁడు మదిన్ బుధులాడెడు నీతి మార్గముల్.

తూరుపు గొండపై వెలుగు తో చిన యంత నగస్త్య సంయమి
ప్రేరణ రామచంద్రుఁ డొనరించి సమర్చలు భాను మూర్తికిన్,
సారథితోడు నిచ్చి దివిషత్రుభువంపిన దిగ్జయోజ్జ్వల
శ్రీరథమెక్కి యేగెరణసీమకు దివ్యమహః ప్రపూర్ణు డై.
ఆకాశమ్మెదు రేగి ఆకసముతో, అంభోది అంభోదితో,
వీకన్ భాస్కరు డేగి భాస్కరుని తో, వెల్లెన్ను లొండొంటి తో,
డీ కొన్న ట్లుగ పోరి రస్త్ర చయ ధాటీ పాట వోజ్జృంభితో
ద్రేకం బొప్పగ రామరావణులు సందీప్తోరు శౌర్యమ్మునన్.

అనికింజేరిన రామ రావణులు దర్పావేశ రౌద్రోగ్రకో
పను ల న్యోన్య జిగీషులై విడుచు ది వ్యాస్త్రాయు ధోదగ్ర సా
ధన లత్యూర్జిత పాట వోద్భవ మ హౌద్ధత్యమ్ము లొండొంటిపైఁ
జని భగ్నమ్ములు నయ్యె తత్కకల సంజాతాగ్ని నిండన్ దిశల్.

మన్నున్ మిన్ను చలించె, సాగర విజృంభ మ్మాగె, దిగ్జాలమా
పన్నం బయ్యె, కులాద్రులున్ వణకె, సర్వప్రాణి సందోహము
త్పన్నంబయ్యె, సమస్త లోక విల యోత్పా తోరు సంక్షోభము
త్పన్నం బైన విధమ్మునన్ నెగడ యుద్ధం బచ్చటన్ ఘోరమై.

చిచ్చులు గ్రుమ్మరింపఁగల చిచ్చుఅ కోలల నెన్ని యేసినన్
చచ్చియు చావడాయసుర, శస్త్ర నికృత్త శిరమ్ము లొక్కటన్
వచ్చి నిలంబడున్ మరల ప్రాణముతో, నిక నీదశాస్యుఁ డుం
జచ్చునె యెన్నఁడేని యను సందియముల్ గదలించె రాఘవున్. 686

ఏవలనైన వీనిని వధింపకఁదప్పదు నే డ టంచు సం
భావిత మంత్రపాటవము బ్రహ్మ మహాస్త్రము దీసి రాముడున్
రావణు నాభిరంధ్ర కుహరచ్ఛిదురమ్ముగ నేసె నేసినన్
రావణుడొక్క పెట్టున ధరాధరమట్టుల కూలెనేలపై.

భాసురదైత్యరాజ్యవిభవ ప్రథి తామల హేమరత్న సిం
హాసన భాగ్యమందిన దశాస్యుతలల్ తెగిపోయి మృత్యువి
న్యాసములాడసాగె రుధి రాపగలందునఁ దేలి పోవుచున్,
చేసిన పాప కృత్యము రచించిన విప్రతికార మట్లుగన్.

ఏదెసనుండి కన్మెఱగి యేసెనొ యాతడు, రాము తన్వునం
దాదశకంఠు ముల్కి కొన లంటిన చోటుల నెల్ల నెత్తురుల్
జాదులు గట్టి గ్రమ్మి వికసన్నవపుష్ప దశోజ్జ్వలమ్మునొ
మోదుగ చెట్టు వోలె రణభూమిని పొల్చె రఘు ప్రవీరుడున్.

ధరణినిఁబుట్టి దానవుల దౌష్ట్యము లంతముఁ జేతు నంచు నా
సరసి జనేత్రుఁడున్ దమ కొసంగిన మాటను దీర్చె రాముఁడై
సరసత నిట్టు లంచు సుర సంఘము లెల్లరు హర్ష చిత్తులై
గురిసిరి పూల వానలు రఘుప్రవరున్ వినుతించు చర్మిలిన్.

రాముడు ధర్మ మార్గ పరిరక్షణ దక్షుడు, సత్యవాక్య దీ
క్షామహనీయ వర్తనుడు, సాధు జనాళి శరణ్యు డున్, జగత్
క్షేమవిధాయి దుష్ట జన శిక్షణ శౌర్య ధనుండు, జానకీ
రాముడు రాజిలెన్ విజయరాముడు సర్వజనాభి రాముడై.

విన్నను వొప్ప విభీషణు
డన్నకు సంస్కృతు లొనర్చి అసురావనికిన్
చెన్నుగ రాజ య్యె సుగుణ
నన్నుతుఁ డారామ మూర్తి సత్కారుణాప్తిన్. 692

సీతకు అగ్ని పరీక్ష

హనుమంతుండును రాము నానతి నశోకారామ మందున్న సీ
తను చేరంజని మ్రొక్కులన్ నెఱపి మాతా! దుష్టుడారావణుం
డనిలోఁ జచ్చెను, రామలక్ష్మణులు నున్నారమ్మ యిచ్చోటనే;
వినఁగాంక్షించె రఘుప్రవీరుఁడును దేవీ! నీదు చిత్తమ్మనన్-
విని యాపల్కులు హర్ష సంభ్రమముతో పృథ్వీజ డగ్గుత్తికన్
హనుమా నీయుపకారమున్ మఱవలేనయ్యా, మనస్తృప్తిగా
నిను వర్ణింపగ మాటలున్ దొరకవున్ నీవేగి శ్రీరామ మూ
ర్తిని నేఁజూడఁ దలంతు నన్న దియుఁబ్రీతిన్ జెప్పు మయ్యా, యనెన్.

ధరణిజకున్ నిశాటవనితల్ త్రిజ టాదిగ వచ్చి, నూతనా
భరణచయాద్యలంకృతులు భాసిలఁజేయ విభీషణుండు దా
సరగున నేగి రాఘువుని సన్నిధి కామెను దెచ్చె; నశ్రువుల్
గురియుచు సీత రామునకు గూర్మి నమస్కృతిఁజేసి నిల్చినన్.

ఏయమ కోసమై వెదకి యేడ్చెనొ రాముఁడు కాననమ్ములం,
దేయమ కోసమై వనధి నెల్లను దాటి దశాస్యుఁజంపెనో;
ఆయమ వచ్చి నిల్చె తన యంఘ్రులయందని చూడఁబోడు, సీ
తా! యని ప్రేమతోఁబిలువ డారఘురాముడు మౌనమూర్తి యై.

జగము భరియంప లేని నిశ్శబ్ద భార
మావరించిన యచ్చోట నందరికిని
ఆకసముఁజీల్చి పడునట్టి యశనిపాత
మగుచు వినఁబడె శ్రీరాముఁడనిన మాట.

క్షితిజా! రాక్షసు వీట నుండుట యె నీశీలమ్ము సందేహసం
గత మీ వగ్ని పరీక్షఁదేల్చు కొను మీ కాద్భాటు నంచచ్చటన్
జితిఁ బేర్పించెను రాముఁ డెల్ల కపులున్ ఛిన్నాత్ములై యా జగ
న్నుత సాధ్వీమణి కా! పరీక్షయనుచున్ దుఃఖమ్మునన్ మున్గగా. 698

గునపమ్ముల్ దల మీద బాదినటు లాక్షోణీజ నిశ్చేష్టయై
యినవంశోత్తమ! రామ భూరమణ! నీవీ మాట నిచ్చోటికా
హనుమన్ బంపిన నాడె జెప్పినను నా ప్రాణమ్ములన్ వీడియుం
దును గాదాయని యేడ్చి , యేడ్చి, తన చేదోయిన్ దలన్ మోడ్చుచున్.

ధృతదైర్యమ్మున నిల్చి ''సంతతము నే శ్రీరామునే భర్తగా
మతి భావింతున యేని సాక్ష్యమిది నా మాంగళ్య మంచున్ జ్వలత్
చితి యందుంబడి యగ్ని దేవుని శుభాశీర్భిక్ష నర్థించె స
మ్మతి జిహ్వాగ్రమునన్ చవుల్ గొలుపు రామా! యన్న పల్కాడుచున్.

పూవుల బాటయయ్యె హుతభుక్ చటులోత్కట కీల జానకీ
దేవికి; సీత ఉత్తమ పతివ్రత సాధు చరిత్ర యంచు నా
పావకు దివ్య రూపమట వచ్చి కృపాళుఁడు రామమూర్తికిన్
దీవన లిచ్చి యిచ్చె పరిదీనముఖాంబుజ సీత నాదృతిన్.

విచ్చిన కన్నులన్ మనసు విచ్చిన మోమున రామచంద్రుడున్
వచ్చిన సీతపై జిలుగు వన్నెల వెన్నెలలైన నవ్వులన్
గ్రుచ్చి కవుంగి లించె నెనరుల్ తనరారగ బాహు వల్లరిన్;
త్రచ్చిన వెన్నలా మదిని దాచిన కూర్మలు తీయ తావులై.

మావినతుల్ దయన్ వినుచు మాకల నా డిడి నట్టి మాటగా
రావణుజంపి ధర్మపరి రక్షణఁగూర్చితి వోయి రామ! నీ
వా విలసద్వికుంఠ నిలయప్రభు వర్యుడ వంచు భక్తితో
దేవతలై నభస్థలి నుతించిరి లోకము లెల్లనున్ వినన్.

ముని లచ్చోటికి నేగుదెంచి రఘురాముంజూచి యాక్రూరదై
త్యుని లంకేశు వధించి తీవెవరవీ యుర్విన్ మహాత్మా యనన్
వినతుండై యతఁడేను రాముఁడను పృథ్విన్ కోస లాధీశు పు
త్రు నటంచున్ వచియించె; నున్న తులకెందున్ గల్గునేగర్వముల్. 704

ఎఱుగుదు నేను సీత! మఱి యెల్లరెఱుంగగ నీదు శీలమున్
జరిపితి నీపరీక్ష నని జానకి మోమును జూచె రాముఁడా
యిరువురి కన్నులన్ పొరలి యేరులు గొన్న జలమ్ములున్ పర
స్పర మధు రాను రాగ రస బంధుర భాషణ లయ్యె నాయెడన్.

తొనకెడు కూర్మిమై దశరథుండును భూమికి డిగ్గి కోడలిన్
దనయులఁగాంచి దీవన లొసర్చెను, నాకవిభుండు వచ్చి చ
చ్చిన కపిసేనకున్ తిరిగి జీవనమిచ్చి, నుతించె రామునిన్
దనదు ప్రతిజ్ఞలన్ నెఱపి దానవ దౌష్ట్యముఁదూల్చి నందుకున్.

త్వరగ నయోధ్య కేగి తన తల్లులఁజూడఁదలంచి వేగమా
యిరవున నున్న పుష్పకము నెక్కిన రాముని చేయి యూతగా
ధరణిజయెక్కె, నెక్కిరిక తక్కిన వారలు, ఆంజనేయుఁడా
ధరణిసుతారఘుప్రభు పదమ్ముల వద్దకు వచ్చి కూర్చొనెన్.

వనులకుఁదాము ముగ్గురును వచ్చిన యాపదు నాలుగేడు లున్
చనిన ప్రదేశమెల్ల గగనమ్మున నుండియె వారు చూచుచున్
గని రది సర్వమొక్క కలగా ఁదలపోయుచు నింత లోనదా
పునవె యయోధ్య యున్ గనుల ముందుగఁ గానగనయ్యె విందుగా.

విమానము: ఆపుష్ప కారూఢుఁ డౌచున్
దీపించు తేజోము ఖుండై,
భూపుత్రి పాల్వార ప్రక్కన్
ప్రా పొచు, రాముండు నేగెన్. 709

పరువుల్ బెట్టుచు నేగి మారుతి యుఁదెల్పన్ రాము డేతెంచుటల్
భరతుండున్ దన తల్లులంగొని భర ద్వాజాశ్ర మమ్మందు సో
దరు రాముంగని మ్రొక్కి తోడ్కొని యయోధ్యం జేరె నా పౌరులం
దరు రాజోచిత రీతి స్వాగతము లుత్సాహమ్ముతో సల్పగా.

పురమందున్ మణి దీప తోరణ కళామోదమ్ము శోభిల్లె, వా
నరులున్ పుణ్యమహానదీ జలములన్గైకొంచు నేతెంచి రా
మఱునాడే సుముహూర్తమై సకల సామంతుల్ మునుల్ బాంధవో
త్కర మేతెంచిరి కానుకల్ గొనుచు సత్కారార్హ మర్యాదలన్.

విలసత్ కోసల రాజ్య పట్ట పదవీ విద్యోత దీక్షా న్వితుం
డలరెన్ రాముఁడు జానకీ సహితుడై; ఆ చార్యుడా శ్రీవసి
ష్ఠులు చేయించిరి వేద శాస్త్ర విధి వత్ సూత్ర ప్రకార క్రమం
బలరన్ శ్రీరఘు రామమూర్తి కెలమిన్ పట్టాభిషేకమ్ములన్.

నిర్మలాశయసార నిజవర్తనాచార
నిహిత మానవ ధర్మ నియమ పరుడు,
ధారుణీ పాల నాధార శాస్త్ర న్యాయ
మార్గాచరణశీల మాన్యమూర్తి,
సర్వజనామోద సత్య వాక్పరిపాల
నాశయోదార జిహ్వాంచలుండు,
దురితకర్మోన్మాద దుష్ట శిక్షణ కార్య
సామర్థ్య పౌరుషాస్పదుడు నగుచు,

సకల జన భాగ్య సంక్షేమ సౌఖ్యరాజ్య
సార్వ భౌమత్వ కీర్తి ప్రశస్తిఁదనరి,
రామ రాజ్యము భువిని స్వారాజ్య మనగ,
రమ్యసద్గుణ ధాముఁడా రాముఁడలరె. 714

భూమి సమస్తమున్ సిరులు పూచిన భాగ్యమ హోమహోల్లసత్
శ్రీ మహితమ్ముగా నెగడె శ్రీరఘు రామ మహీశు పాలనన్ ;
రాముఁడె దేవుడయ్యెను, ధరాప్రజ కెల్లను; సర్వ కాలర
క్షా మహదాశయ మ్మను ప్రశస్తి గడించెను రామరాజ్యమున్.

తప్పక సత్యధర్మములు ధాత్రిని మానవ నైతికాశయం
బొప్పుగ జూప గల్గిన మహోత్తమ మార్గముగాఁ దలంచుచున్
చెప్పిన రామచంద్రు కథ చెప్పు కొనున్ జగమెల్ల (బ్రీతితో
నెప్పటి కప్పుడే యెడద కింపుగ తీయము లూరు వాచవిన్.

వానర నేతకున్, సభకు వచ్చిన యెల్లరకున్ బ్రియమ్ముగా
గానుకలిచ్చె స్నేహవచన ప్రమద మ్ములరార రామ భూ
జానియు; స్వీయకంఠ విలసన్మణి సుందర హార మామరు
త్సూనున కిచ్చె సీత మనసున్ వెలి బుచ్చిన హర్ష రేఖగా.

''జే'' యనుచున్ బురప్రజలు చేతులు మోడిచి నిల్చి సన్నుతుల్
సేయగ, నుత్సవమ్మునకుఁజేరిన మౌనివరేణ్యులున్ జగత్
శ్రేయము నీయఁగల్గు నృపశేఖరు నిన్నునుఁ జూచినాము రా
మా! యని దీవనల్ సలిపి రా రఘురామునకున్ మహీజకున్.

హనుమంతుడు జానకీ రాములను స్తుతించుట

ఏకలలంగరంగి మతి యే పర మార్థము లూహసేసెనో
యాకపిలోకధీమహిముఁ డంజన గర్భము తత్తపః ఫల
శ్రీకమనీయతల్ విరియ జిమ్మిన వామహనీయమూర్తి కన్
ఱేకులలో ధరిత్రిజయు శ్రీరఘురాముల దివ్య రూపముల్.

రామస్వామియు సీతయున్ మహిత సామ్రాజ్యాసనాసీన శో
భామర్యాదల నందుటల్ గనుచు భాస్వద్బంధు రానందవీ
క్షామంద చ్ఛవు లేచు గద్గదిక తో సామీరి తత్కీర్తిరే
ఖామాహాత్మ్యములన్ స్తుతించె చెలువొల్కన్ మాధురీ సాధువుల్. 720

శ్రీరము వంశ చంద్రు న, కశేష జగ త్పరిపూజ్య ధర్మసం
చారునకున్, నమంగనెడి స్వామికి, రామునకున్ నమస్కృతుల్;
సార వివేక సద్గుణ విశారద కుత్తమ శీల సాధ్వి కా
ధారుణి జాత సీతకు, మదంబకు నిత్యము నానమస్కృతుల్.

ఏతన్మాత్రులె నీవు సీతయును లోకేడ్యుల్, జగత్సర్వర
క్షాతాత్పర్యులు, నేత్ర పర్వ సుషమాంచ ద్విగ్రహుల్, చిత్కళా
జ్యోతిర్మంగళ మూర్తు లిర్వురును ప్రేమోన్మేష వీక్షామధు
స్ఫీతా బ్జాస్యులు భక్తలోక శరణుల్ శ్రీరామ చంద్రప్రభూ!

చపల స్వాంతుని చేరదీసి నిగమ స్వారస్య విద్వత్ సుధీ
విపులార్థమ్ముల సారసంపద మనో వీథిన్ గనం జేయు జ్ఞా
నపదార్థ స్ఫురణమ్ముఁ దెల్పిన మహానంద స్వరూపమ్ము, నీ
వపరోక్షమ్ముగ నిల్చితీ జనువు ధన్యంబౌనటుల్ రాఘవా!

భూవలయమ్మునన్ భవ దపూర్వ మ హా మహిమప్రధానగా
థావళి నెచ్చ టెచ్చట సమాదరరక్తి వఠింతు రావచః
శ్రీ విమలస్థలమ్మున వసింపగ ని మ్మొక మూల నైన న
న్నో వరదాన దివ్య విభవోదయ! దాశరథీకృపానిధీ!

అది యీ నాటిది కాదు రామ పృథి వీంద్రా! ఏపురాజన్మసం
పదుపానీతమొ లోక పూజ్యుఁడవు నీ పాదాబ్జ సంసేవనా
స్పద భాగ్యమ్మిది యిట్లె మీచరణ పూజల్ సేసి జీవింప నే
ర్చెద స్వామీ! భవదంఘ్రి పీఠమె మదాశీరక్షతల్ వోయుతన్.

అని శ్రీరామునకున్ ధరిత్రి జకు భక్త్యావేశ బద్ధాంజలిన్
వినమత్ శీర్షుఁడు నౌ మరుత్తనయునిన్ వీక్షించి సభ్యుల్ జయ
స్వన సంస్తోత్రము లేక కంఠమున హర్ష స్వాంతులై చేసి రీ
హనుమంతుం డితడెంతవాడు భువి నాహో! యన్న యావేశులై. 726

వరజన్ముం డురు సాహసుండు శ్రుతివిద్యద్వార్థి పారంగ తుం
డరిలోకప్రళయుండు, రామ పద పూజాసక్తు, డౌదాత్య స
చ్చరితుం డుత్తమ కార్యదీక్షితు డుదంచ ద్బ్రహ్మతేజో మహో
ద్ధుర దీవ్యద్వద నాంబుజుండు, హనుమంతుండన్న సామాన్యుడే.

కలిగె మేలిమి పన్నె బంగార మందు
పద్మ రాగ సంయోగ సంప త్ప్రశస్తి
హనుమయును కథా నాయకు డైన కృతికి
రాముఁడు ను కృతి భర్తయై రాజిలంగ.

మధ్యాక్కఱ. ధారుణి పద్మనేత్రు నవ తారము రాముడు బుట్టె
వీరమహేశ్వరాంశ కపి వీరుడు ఆంజనేయుడును;
కారణ జన్ములై భువనకంటకులన్ బరి మార్చి
, దీరత ధర్మరక్షణము తేకువ జేసి రిర్వురును.

ఈయతులప్రభావమహనీయ కృతిన్ రసరమ్య రీతులన్
వ్రాయగ నేనెవండను కృపామధు రామృత వీక్షణాయత
శ్రీయుత మూర్తులా యిరువురిచ్చిన ఆశిష భాగ్యరోచిర
ధ్యాయ మనోజ్ఞకావ్య గుణమై విలసిల్లెను గాక ప్రీతిగా !

ఆశ్వాసాంతము

ధీరత మీఱగా జలనిధిన్ పృథు వారధి గట్టి లంకకున్
జేరి, దశాస్యునిన్ పరమ నీచుని రావణదైత్యుఁజంపి, యీ
ధారుణికిన్ శుభమ్మొనరు ధర్మము నిల్పిన నీకథన్ వచ
శ్శ్రీరమణీయ పద్ధతి రచించితి దాశరథీ దయానిధీ. 731

మారుతి సత్కథా గ్రథన మంజుల కావ్యకృషీవలత్వమో
శ్రీరఘు రామ! నీ చరణ సేవన భాగ్యము; మత్కవిత్వ ధా
రారుచిర ప్రసిద్ధ రసరమ్యముగా సురధేను వైపయో
ధారలు పిండి నాబ్రతుకు దారుల నన్ జరితార్థుఁ జేయుతన్.

ప్రాకామ్యమ్ముగ నీపదాబ్జయుగ సేవా ధర్మ నిర్వాహ సు
శ్లోకుండంజన సూతి గాథయిది, సంస్తుత్యప్రథాసాహితీ
శ్రీక ప్రౌఢి రచించి నాడ నిను నర్థిన్ స్వామిగాఁజేయుచున్
చేకొమ్మీ కృతి రామ చంద్ర భవదాశీ ర్వైక్య మందించుచున్.

అమలోదాత్తము రామ నామ జప మర్యాదమ్ము, వేదార్థసూ
త్రమహోపజ్ఞము, శైవతేజము, రిపూగ్రంపశ్య సత్వమ్ము, భ
క్త మనోభీష్ట ఫలోపపన్నము, దిగంత వ్యాప్త సత్కీర్తి ర
మ్యము విన్పించితి నాంజనేయు కథ రామా! నీకు శుశ్రూషగన్.

మంగళ మహాశ్రీ

శ్రీ కరము నై వెలయు ప్రేమరససంకలిత
సీధు కణ పూర్ణ మృదు వీక్షా,
భీకర మహాదురిత భేషజ నిశాటకుల
విక్రమ బలచ్ఛిదుర దీక్షా,
ప్రాకట కృపామధుర భావ విభవోపకృత
భక్తజనజీవన సు రక్షా,
శ్రీక నవశారదిక శీతకర కాంతి నిభ
శ్రీ విభవ మంగళ మహాశ్రీ. 735

గద్య

ఇది శ్రీ భారతీకరుణాకటాక్షలబ్ద కవితా విశేష
హరితసగోత్రపవిత్ర రత్నమాంబా సత్రాజామాత్య పుత్ర
కవిశేఖర, మధురకవి, కవిభూషణ, భారతీప్రసన్న, అభినవ పోతనేత్యాది
సద్బిరుదాంచిత, బుధజనవిధేయ సుబ్బారాయ నామధేయ ప్రణీతంబైన

శ్రీ హనుమత్ప్రబంధము ద్వితీయ భాగమున
వారధి నిర్మాణము. లంకా ప్రవేశము. వానరాసుర మహా యుద్ధము
నాగ బంధము-సంజీవని, ఇంద్రజిత్తు వధ, లక్ష్మణుని మూర్ఛ - సంజీవని,
రామ రావణ మహాయుద్ధము, రావణ వధ, సీతకు అగ్నిపరీక్ష
శ్రీరామ పట్టాభిషేకము, రామరాజ్యము,
హనుమంతుడు శ్రీ రాముని స్తుతించుట.
అను కథలుగల పంచమాశ్వాసము. **736**

హనుమత్ప్రబంధము సర్వము సంపూర్ణము
ఓమ్‌తత్‌సత్.

శ్రీరస్తు

శ్రీ హనుమత్ ప్రబంధము

మూడవ భాగము - వచనము

(హనుమంతుని మహిమను దెలుపు కథలు, గాథలు, ఆంజనేయ దండకము, తులసీదాసు హనుమచ్చాలీసా తెలుగు అనువాదముతో సహా ఇందు కలవు)

రచయిత

'కవిశేఖర', 'భారతీ ప్రసన్న' 'అభినవ పోతన'

కొండేపూడి సుబ్బారావు

* * *

* * శ్రీశ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారు, ధార్మిక గ్రంథ ముద్రణ ప్రణాళిక క్రింద నొసగిన ద్రవ్య సహాయమున ఈ గ్రంథము ముద్రింప బడినది. * *

* * *

ప్రసన్న భారతీ గ్రంథమాల

47-10-5, ద్వారకానగరము, విశాఖపట్టణము - 530 016

ఆంధ్రప్రదేశ్, ఇండియా

హనుమత్ప్రబంధము - మూడవ భాగము

తొలిపలుకు

హనుమత్ప్రబంధము అను హనుమచ్చరిత సర్వస్వమున ఇది మూడవ భాగము వచనము. మొదటి రెండు భాగములును పద్యకావ్యములు. ఆంజనేయుని జననము మొదలు శ్రీరామ పట్టాభిషేకము వరకు గల కథ - ఈ మూడవ భాగమందు హనుమంతుని మహిమను దెలుపు కథలు గాథలు కలవు.

కృతయుగమున దుష్టరాక్షస సంహారమున కవతరించిన శ్రీ విష్ణువు శ్రీరామునకు సర్వవిధముల తోడ్పై ప్రధాన పాత్ర వహించిన పారమేశ్వర శక్తి సంపన్నుడు శ్రీ హనుమంతుడు. భవిష్యద్బ్రహ్మ కాగలిగిన చిరజీవి, నేటికిని గంధ మాదన పర్వతమున తపశ్శాలియై, భక్తజనుల బాధలు నశింప జేసి, ఇహపర సౌఖ్య సంపదలు భక్తుల కొసగు చున్న కరుణాళుడు.

హనుమంతుడు యావద్భారత ప్రజారాధ్యుడు. అత్యంత ప్రజాదరణ పొందిన దైవమూర్తి. ప్రతిగ్రామమున ప్రతిపట్టణమందు ఏ కూడలి యందో, అభయ హస్తము గదాయుధము కలిగిన మహోన్నత హనుమద్విగ్రహము దర్శన మిచ్చుచునే ఉండును. ప్రజల మధ్య ఇంతటి మహా ప్రసిద్ధి నందుట హనుమంతునకే చెల్లినది. గ్రంథ ప్రస్తావన యందు ఈ విషయములన్నియు వివరింప బడినవి.

కృతజ్ఞత

1. ఈ పుస్తక ముద్రణకు ద్రవ్య సహాయమొసంగిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారికి

2. ఈ పుస్తకమునకు ముఖచిత్ర చిత్రము వ్రాసి పంపిన శ్రీ 'బాపూ' గారికి,

3. నా విన్నపమును మన్నించి ఈ పుస్తకమునకు హనుమద్దర్శనము అను పేర ఆంజనేయ తత్త్వమును గూర్చి భూమిక వ్రాసి యిచ్చిన మహా పండితులు, వ్యాకరణాలంకార చక్రవర్తి, ఆచార్య శ్రీ అప్పల్ల సోమేశ్వర శర్మగారికి.

4. ఈ హనుమత్ప్రబంధ రచనమున అటనట నాకు గల సందేహముల దీర్చి సాధు వాదమును తెలిపిన కవి పండితులకును

నాహృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

భక్తి తత్పరు లెల్లరు ఈ గ్రంథమును చదివి, హనుమత్కృపా విశేషమునకు పాత్రులగుదురుగాక.

శ్రీ హనుమత్ప్రబంధము

మూడవ భాగము - విషయ సూచిక

హనుమంతుని మహిమను దెలుపు కథలు, గాథలు

ముఖ పత్ర చిత్రము శ్రీ 'బాపూ'

శ్రీ రామాయనమః

శ్రీ హనుమత్ప్రబంధము

మూడవ భాగము

ఇష్టదేవతా ప్రార్థన

విఘ్నేశ్వర స్తుతి

విలసితసత్కృపాన్వితుడు విఘ్నములన్ దొలగించుదైవ ము
జ్జ్వల శశివర్ణసుందరుడు భక్తులొసంగెడి పూజనాదులం
దొలుతగ గూర్మి గైకొను చతుర్భుజు డార్యకు ముద్దుబిడ్డడై
యలరిన గుజ్జువేలుపు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికై.

త్రిమూర్తిస్తుతి

చెలువొప్పన్ బదునాల్గులోకములు సృష్టింజేసి పోషించి త
ద్విలయావృత్తి పునఃపునఃక్రమము దీపింపంగ జేయన్ సమ
ర్థులు బ్రహ్మాచ్యుతఫాలనేత్రులు త్రిమూర్తుల్ వారి కారుణ్యసం
కలితప్రాభవ సంపదున్నతులకై గావింతు సంస్తోత్రముల్.

వాణీ లక్ష్మీ పార్వతీస్తుతి

నిరతోద్యత్కరుణా విలాస విభవోన్నిద్రైక వీక్షావిని
ర్భర వాత్సల్యము జూపి భక్తులకు విద్వద్భాగ్యదీవ్యత్ శుభో
త్కరముల్ గల్గగ జేయు ప్రేమభరితాత్మల్ భారతీ శ్రీ శివల్
సరవిన్ నన్గృపజూచుతున్ మధురవాత్సల్యానురాగమ్ములన్.

హనుమంత్ స్తుతి

అంజనానందనం వీరం జానకీశోక నాశనమ్!
కపీశమక్ష హన్తారం వందేలంకాభయంకరమ్!!

గోష్పదీకృత వారాశిం మశకీకృత రాక్షసామ్
రామాయణ మహామాలా రత్నం వందేఽనిలాత్మజమ్

మనోజవం మారుత తుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్॥
వాతాత్మజం వనరయూధముఖ్యం
శ్రీ రామదూతం శిరసానమామి॥
ఆంజనేయ మతిపాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహమ్॥
పారిజాత తరుమూల వాసినం
భావయామి పవమాన నందనమ్॥

శ్రీ రామప్రభు దివ్య నామజపసంసిద్ధి ప్రదానంద రే
ఖారోచిష్ణు! డజేయ విక్రమ మహోగ్ర స్థైర్యుడున్ సాధుగా
థారమ్యుండు శివాంశ సంజ్యనితుడున్ త్రయ్యర్థ విద్యావిదుం
డారాధ్యుండగు నంజనాతనయు డత్యంతమ్ము నన్బోముతన్.

హనుమద్దర్శనము

వ్యాకరణాలంకార చక్రవర్తి - ఆచార్య అప్పల్ల సోమేశ్వర శర్మ

ప్రవేశిక : ''కవిశేఖర'' శ్రీ కొండేపూడి సుబ్బారావుగారు, తమ మహాకావ్యం ''హనుమత్ప్రబంధము''ను గురించి ''తాత్త్వికంగా కొన్ని మాటలను వ్రాయండ''ని సహృదయ సంభావనతో నన్ను కోరినారు. వారి మాటకు కాదన లేదు. కాదనలేను. మా ఉభయులకుండే రసార్ద్ర హృదయ బంధమది. అంగీకరించేను. పర్యవసానమే ఈ దిగువ పొందుపరచిన వాక్య కదంబం. ఈ అవకాశం వారు నాకిచ్చినారు. సంతోషం.

కవి : శ్రీ కొండేపూడి సుబ్బారావు మహోదయులు లోకజ్ఞానం కలిగిన నాటినుండి శ్రీరామ పరమ భక్తులు. శ్రీరామ దూత సేవా ధురంధరులు. పసితనం లోనే మాతృదేవత నుండి పోతనగారి భాగవతామృతాన్ని స్తన్యంతో పాటు గ్రోలిన వారు. ఇదీ బాల్య సంస్కారం, పిదప ఆంగ్లవిద్య తత్రాపి ఎకౌంట్స్ అందువల్ల వృత్తి ప్రభుత్వంలో పెద్ద ''ఎకౌంట్స్ ఆఫీసర్''గా పరిణమించింది. అయినా ''సహజ సంస్కారం'' విడిచిపెడుతుందా! రామ హనుమద్భక్తి వ్యర్థమవుతుందా? సంస్కార బీజం మొలకెత్తింది. మొక్క అయింది. అచిర కాలంలోనే భారతీ దేవి కూడా ''ప్రసన్న''గా మారింది. ఇక కొదవ ఏమి? ఆ మొక్కయే నేడు మధుర కవిత్వమహా వృక్షంగా విజృంభించి శాఖోప శాఖలుగా విస్తరించి, సుగంధ పుష్పాలను, అమృత రస బంధుర ఫలాలను సహృదయ లోకానికి అందిస్తున్నది. నడి వయసులో జన్మించిన వీరి కవితా బాల క్రమంగా ముగ్ధ అయి, యువతి అయి, ప్రౌఢ అయి - నేడు తొమ్మిదవ పదిలో ఉన్న వీరిని ఆనంద సందోహంలో ముంచెత్తుతున్నది. భావుకులను పరవశింప జేస్తున్నది. ఇంచుమించు ''సర్వేశ్వర శతకము''తో ప్రారంభమై నేటి ''హనుమత్ప్రబంధము'' వరకున్ను ఉపశతంగా ఎన్నో హంగులతో ఉవ్విళ్ళూరిస్తున్నది.

శ్రీ సుబ్బారావుగారి కవిత్వానికి ప్రాచీనతే ప్రాణం. సంప్రదాయ బద్ధత మహా ప్రాణం. ఈ బలంతోనే వీరు ఎన్నో విధాలయిన ప్రక్రియలను పుష్కలంగా పండించినారు. విశేషించి ''పద్య రచన''యే వీరి మహావ్రతం! అది కూడా అనవద్యము, హృద్యము అయి ఉండాలి. కాగా వీరి కవితా కౌశలం ''కవిశేఖర -

కవిభూషణ - మధురకవి - అభినవ పోతన - భారతీ ప్రసన్న'' ''ఆంధ్రదండి'' మొదలైన నైక విధములైన బిరుదములన్నింటిలోను ''అభినవ పోతన'' అన్నది వీరికి మిక్కిలి అభిమతం - సార్థకం కూడా! ఒకనాడు మహాసభలో దీన్ని నేను నా అనుభవ పురస్సరంగా ప్రతిపాదించగా, సభ్యులందరున్ను ఏకకంఠంతో ఆమోదించినది కావడం ఇక్కడి ప్రత్యేకత. నాకు ''ఆత్మానందం''! అస్తు.

ఇంతకు ఆశ్చర్యం ఏమంటే - వృత్తి రీత్యా డిఫెన్సు అక్కౌంట్సు డిపార్టుమెంటులో ఎక్కువ కాలం ఇతర రాష్ట్రాలలో ఉండుట వల్ల సంస్కృత ఆంధ్ర భాషా సాహిత్యాలలో క్రమమైన శాస్త్రాధ్యయనం చేయడానికి అవకాశం లభించలేదు అనిన ఈ విషయం వీరు చెప్పినదే! అయినా సకల తత్త్వమయంగాను, సరసంగాను, సహృదయ హృదయ రంజకంగాను ఆంధ్ర కవితామతల్లి వీరిని వరించిందంటే అది కేవలం ''భారతీ ప్రసాదమే'' అని నొక్కినొక్కి చెప్పవచ్చు. ఆలంకారిక శిఖామణులందరు ''శిగపట్లు'' పట్టి చివరకు ''ప్రతిభ మాత్రమే కవిత్వానికి కారణం'' అని చప్పరించి ఊరుకున్నారు. ప్రతిభ అనగా ''భారతీ ప్రసాదమే''! దీన్ని పొందగలిగిన వారు ప్రాయశః తక్కువ మందే ఉంటారు. వారిలో ఈ కవి చేరడం మహాదృష్టం!

కావ్యము : ప్రస్తుతమైన కావ్యం ''హనుమత్ ప్రబంధము''. ఇది మూడు భాగాలుగా విస్తరించి ఉంది. మొదటి భాగంలో వివిధ ఛ్ఛందో బద్ధంగా 736 పద్యాలున్నవి. హనుమంతుని పుట్టుక మొదలు సాగర తరణానికి ప్రయత్నించు వరకున్ను కథ నడిచింది. రెండవ భాగమున 565 పద్దెములు. అంజనాసుతుని సముద్ర లంఘనం మొదలు శ్రీరామ పట్టాభిషేకము అయ్యేవరకు కథ వర్ణితము. ఈ మూడవ భాగం కేవలం గద్యమయం. ఇంచుమించు ఇరవై అయిదు ఖండికలలో మారుతి యొక్క స్వరూప స్వభావాలు, మహిమలు, కథలు, గాథలున్ను. అనేక పురాణ సంహితాదుల ప్రమాణాలతో వెల్లి విరిసేయి.

ఇక్కడ ఒక అంశాన్ని ప్రస్తావించాలి. ఈ కవియొక్క రచనలన్నీ - బహువిధ ప్రక్రియలతో పద్యమయములే. సంస్కృతంలోని మహా మహా ప్రబంధాలనే ద్విపద మయంగాను, ఇతరములను హృద్యపద్యమయంగాను తీర్చిదిద్ది, ఆంధ్ర వాణీ రామణీయకాన్ని ధగధగ లాడించిన దిట్టకవి ఈయన. ''గద్యం కవీనాం నికషం

పదింతి'' (గద్యంచను కవిత్వానికి గీటురాయి = పెద్ద పరీక్ష) అని సంస్కృతంలో ఒక సూక్తి ఉంది. దీనికి కూడా లక్ష్యం కావాలని కాబోలు - శ్రీ సుబ్బారావు గారు ఈ భాగాన్ని గద్యమయం చేసేరు. ఇందులోని ప్రకరణాలన్నీ మృదు మధురమైన పద బంధాలతోను, నుడికారాల తోను, నిండుగా మెండుగా ఉన్నాయి. సామాన్య సంస్కారి అయిన చదువరిని కూడా ఇట్టే ఆకర్షించి బుట్టలో వేసుకునే శక్తి సటికుంది. గద్యరచనలో కూడా కవి 'సెబాస్'' అనిపించుకున్నారు.

ఈ తీరులో ''హనుమత్ప్రబంధము'' ముద్దుగా మూడు విభాగాలతో - ''ప్రస్థాన త్రయము'' వలెను, ''త్రిపథగ'' (గంగ) వలెను, ''త్రివేణీ సంగమం'' వలెను, ''మూర్తి త్రయము'' వలెను, ''మంత్ర త్రయము'' వలెను, ''అగ్నిత్రయము'' వలెను హనుమానుని దివ్యచరితమును భవ్యంగా వర్ణించి చదువు వారికి పరమ పవిత్రతను చేకూర్చి పెట్టింది. ప్రభాదివ్య కాయుడైన వాతాత్మజుని స్తుతించు అష్టోత్తర శతకములు, సహస్రనామములు, ఇతర స్తోత్రములు, కథాంతరములు, గ్రంథాంతరములున్ను విడివిడిగా కొల్లలుగా ఉండవచ్చు - ఉన్నాయి కూడా. **కాని వానరయూథ ముఖ్యుని సాకల్యంగా మనః ఫలకంపై చిత్రించగల రచనలు అల్పాల్పంగానే ఉంటాయి. అసలు ఉన్నాయా? అని సంశయం! అటువంటి సంశయాన్ని పోగొట్టి ''ఇదిగో నేనున్నాను. నేనే హనుమను'' అని జబ్బచరచి నిలబడుతుంది ఈ ప్రబంధం. సర్వాంగ సుందరంగాను, సర్వమనోహరంగాను, సర్వమయంగాను, సర్వ తారకంగాను, కాంచనాద్రి కమనీయ విగ్రహుడైన కపిముఖ్యుని ప్రతిష్ఠించింది ఈ కావ్యం.** అందువల్ల ఇది ''హనుమత్ప్రబంధము'' మాత్రమే కాదు. ''హనుమచ్చరిత సర్వస్వము'', ''ఆంజనేయాయనము'' అని నేను అనదలచుకున్నాను. (ఈ భావాలు శీర్షికలోనే ఇమిడి ఉన్నాయనుకోండి. నేను వాటిని వాచ్యం చేయడానికి సరదాపడినాను.)

మరి అసలు విషయానికి రావలసి ఉంది. ''హనుమంతుని తత్త్వమేమి?'' అన్నదే అసలు విషయం. ఇక్కడ ఎన్నో అన్వయాలు, సమన్వయాలు, వ్యాఖ్యలు, ఉపవ్యాఖ్యలు, విమర్శలు పరిశోధనలున్ను విశాలంగా జరిగే ఉన్నాయి. అన్నింటినీ కలబోసి, కలగూర గంపను సర్ది, తాత్త్వికుల కందించడానికి యథాశక్తి ప్రయత్నం

చేస్తాను. ముఖ్యంగా నాలుగైదు ద్వారాలలో హనుమత్తత్త్వాన్ని దర్శించడం సముచితమని నా తత్పర్యం.

ప్రపథమంగా శ్రీమద్రామాయణ ద్వారము : ఇది లోకసిద్ధం - అతి ప్రసిద్ధం బహుక్షుణ్ణం అయిన మహాద్వారం కనుక కొన్ని అంశాలను గుర్తు చేసుకుంటే సరిపోతుంది. శ్రీ రామాంజనేయ భాగవతులకు అంతా ఇట్టే అర్థమవుతుంది.

1. ఋశ్యమూక పర్వతంపై మొట్టమొదట సారిగా హనుమంతుడు శ్రీరామ లక్ష్మణులను కలిసాడు. తొలి చూపులతోనే వారికి పరస్పరం స్పృహణీయమైన అంతరనుభవం కలిగింది. ''దేవలోకం నుంచి దిగిన మహానుభావులు'' అనుకున్నాడు అంజనాసుతుడు. ఓహో! ఎంత చక్కగా మాట్లాడేడు. వేదాలన్నింటిని, సమగ్రవ్యాకరణాన్ని అధ్యయనం చేసినవాడే ఇతడు'' అనుకున్నాడు శ్రీరాముడు. ఇక్కడే కపివరుని దాసభావానికి, శ్రీరాముని భక్త జన సులభ భావానికిన్ని బీజం పడింది.

2. తరువాత సముద్ర లంఘన సమయం : చతికిలబడి కూర్చున్న పవన తనయుని జాంబవంతుడు ''బలం బుద్ధిశ్చ తేజశ్చ'' ఇత్యాది వచనాలతో ప్రోత్సహించి ''ఉత్తిష్ఠ హరి శార్దూల! లంఘయస్వ మహార్ణవమ్'' (లేవోయ్! నీవు కడు సమర్థుడవు, సముద్రం దాటు) అని ఉత్తేజ పరచి ఉరకలు వేయించేడు.

3. ఇక ''సుందర కాండము'' అంతా సుందరుని వైభవమే గదా! సుందరుడనగా కపి సుందరుడే! లంకలో ప్రవేశించి నానాభీభత్సం సృష్టించి, సీతమ్మను చూచి, లంకను కాల్చి, ''దాసోహమ్ కోసలేంద్రస్య'' - ''దూత్యోహం రామచంద్రస్య'' అని అనుకుంటూ, వాయు వేగాన వచ్చి, శ్రీరామ చంద్రునికి సీతాకుశల వార్తని అందించేడు మారుతి. శ్రీరాముడు ఉవ్వెత్తున పొంగి పోయి ''ప్రియతమా! నీ సాహ్యంలోకోత్తరం. దానివల్ల నేను, లక్ష్మణుడే కాక మా వంశమంతా రక్షింపబడింది. నేను నీకేమి ఈయగలను? గాఢాలింగనం మాత్రం ప్రేమ సారంగా ఇస్తాను. స్వీకరించు అని వానర యూథ ముఖ్యుని కౌగిలించుకున్నాడు. ప్రభుసేవకుల సౌహార్దానికిది పరాకాష్ఠ. భక్తునికి పరమానందం!

4. శ్రీరామ పట్టాభిషేకము : మారుతి ప్రభుసేవకు, సీతామతల్లి కృతజ్ఞతకున్ను కూడా ఇదే పట్టాభిషేకం. ఈ సంనివేశంలో ఇంద్రుడు కానుకగా

పంపిన మణిహారాన్ని శ్రీరాముడు సీతమ్మకివ్వడం జరిగింది. వెంటనే ఆ హారాన్ని

శ్లో॥ తేజో ధృతిః, యశోదాక్ష్యం సామర్థ్యం వినయో నయః
పౌరుషం విక్రమో, బుద్ధిః యస్మిన్ ఏతాని నిత్యదా

(తేజస్సు, ధైర్యం, కీర్తి, నైపుణ్యం, శక్తి, వినయం, రాజనీతి, పౌరుషం, పరాక్రమం, బుద్ధి అనే గుణాలు ఎల్లప్పుడు కలిగి ఉన్నవాడు) అని సంభావించి హనుమ మెడలో అలంకరించింది. ఇది చాలు హనుమ వైభవానికి!

కాగా - శ్రీరాముడు నరోత్తముడు - హనుమంతుడు వానరోత్తముడు. శ్రీరాముడు ప్రభువు. హనుమంతుడు నమ్మిన బంటు. శ్రీరాముడు దివ్య విభూతి! హనుమంతుడు దివ్యానుభూతి!

శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీరాముడు పరమాత్మ సీతమ్మ జీవాత్మ. వారిద్దరిని కలిపిన ఆచార్యవర్యుడే హనుమంతుడు. ఈ విధంగా రామాయణ ద్వారం నుండి హనుమంతుడు కనిపిస్తాడు.

2. రెండవది పురాణ ద్వారం : ముఖ్యంగా శివ పురాణం ఇది "శివచరిత మహాసాగరం" ఇందులో ఆంజనేయుని ప్రసక్తి విపులంగా ఉంది. పరమ శివుడు ఆయా సమయాలలో ఎన్నో అవతారాలు ధరించేడని, వానిలో "హనుమ దవతారము" ఒకటనిన్ని ఇది వర్ణించింది. చివరకు "శివోఽద్వైతః" అని సూత్రీకరించి, ప్రభువైన రాముడున్ను, బంటు అయిన ఆంజనేయుడున్ను ఒకటే తత్త్వమని వ్యాఖ్యానాన్ని బలపరిచింది.

ఇదీగాక హనుమత్ స్తోత్రాలలో

1. త్రినేత్రం కుండలోజ్జ్వలమ్ ....
2. మూర్తి త్రయాత్మాకం పీనం మహావీరమ్ ....
3. సుందరం సాబ్జనయనం త్రినేత్రమ్ ....
4. త్రిమూర్త్యాత్మక మాత్మస్థమ్

మొదలైన వచనాలలో పావని త్రినేత్రుడని విశదంగా ఉంది. కనుక అతడు శివాంశ సంజాతుడే లేక శివావతారమే! ఇట్లు పురాణ ద్వారం మారుతిని పరమ శివునిగా చూపిస్తుంది.

3. సంహితాద్వారం : వేదముల తాత్పర్యాన్ని విస్తరించడానికి అవతరించిన గ్రంథాలు ఇతిహాస, పురాణాలు. సంహితలు కూడా పురాణాల వంటివే. కొన్ని కొన్ని విశేషాంశాలను ఇవి విరివిగా వర్ణిస్తాయి. వీనిలో ఉమా సంహిత, పరాశర సంహిత అనే గ్రంథాల్లో కపివరుని వైభవమంతా తీర్చిదిద్దబడింది. అందులోను పరాశర సంహితలో హనుమంతుని విశ్వరూపం వేయి విధాలుగా ప్రదర్శించ బడింది. ప్రకృతమైన కృతిలో (మూడవ భాగంలో) కవిగారు కమనీయంగా వ్రాసినదంతా పరాశర సంహితనుండి సంగ్రహించినదే. అందువల్ల సంహితాద్వారం నుండి చూస్తే "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్" అన్న విధంగా వానర ముఖ్యుడు కనిపిస్తాడు.

4. మంత్ర ద్వారం : ఇది అగాధం - అనంతం. ఓంకారం నుండే "సప్తకోటి" మహామంత్రాలు ఆవిర్భవించేయని సంప్రదాయం. ఇది వేద విరుద్ధమని కొందరంటారు. వైదికమే అని మరికొందరు. ఏదైనా బహుప్రచారాన్ని పొందిందిది. దేవారాధనలో ఇది విచిత్రమైన, విశిష్టమైన, వివిధమైన ప్రక్రియ. బీజాక్షరాలు, మంత్రం, తంత్రం, యంత్రం, ముద్ర, చక్రం మొదలైనవి ఇందులోని ప్రధానాంశాలు. వీటి వ్యాఖ్యానం ఇక్కడ అనవసరము. వేద పురాణేతిహాసాలలో పేర్కొనబడిన ప్రతి దేవునకు, దేవతకున్ను ఈ విధానం సుప్రతిష్ఠితంగా ఉంది. ప్రసిద్ధమైన 'శ్రీవిద్య'ను అనుసరించి ఇది విస్తరించిందని పండితులంటారు. ఈ మార్గంలోనే నేడు సమాజంలో కొత్త దేవుళ్ళకు, కొత్త దేవతలకు కూడా మంత్రాలు వెలుస్తున్నాయి! తంత్రం కొనసాగుతోంది! ఇది సమాజ గ్రహచారం! "గత్యానుగతికోలోకః"! సరే! ఇది ప్రాసంగికం. ఈ సంప్రదాయం లోనే ఆంజనేయస్వామికి కూడా ఎన్నో మంత్రాలు ప్రచారంలో ఉన్నాయి. జపించే వారికి, సాధకులకున్ను అవి ఇష్టసాధకాలవుతున్నాయి. తంత్ర, చక్ర, ముద్రాది ప్రక్రియ కూడా అవలంబింప బడుతున్నది.

5. అధ్యాత్మ ద్వారం : ఇదే తత్త్వద్వారం. ఇదే గర్భ ద్వారం. ఇదే పరమ పద ద్వారం. "ఓమితి బ్రహ్మ, ఓమితి ఇదం సర్వమ్, ఓమిత్యేకాక్షరం బ్రహ్మ, అని శ్రుతిమాత ఘోషించింది. మాండుక్యోపనిషత్తు ఈ ఘోషణానికి వ్యాఖ్యానం చెప్పింది. నాదబిందు, తేజోబిందు, ధ్యానబిందు మొదలైన చిన్ని ఉపనిషత్తులు ఉపవ్యాఖ్యలు చేసేయి. అన్నింటి సారము ఒకటే. "ఓంకారమే పరమాత్మ" అని, "తస్య వాచకః ప్రణవః (పరబ్రహ్మకు ఓంకారం ప్రతీకం) అని యోగదర్శనం ఉపసంహరించింది.

మన హనుమ "ఓంకార స్వరూపుడే" అని పెద్దలు నిశ్చయించేరు. వేదాంతలో "సోऽహమ్" అన్నది "అజపా మంత్రం" దీనిలో సకార హకారాలను తీసివేస్తే ఓంకారమే మిగులుతుంది. (అకారం, ఉకారం, మకారం కలిసి ఓమ్ అని వింగడింపు గదా!) హనుమన్మంత్రాలన్నీ హనుమ యొక్క ఓంకార తత్త్వాన్నే విశదీకరిస్తాయని ఆయా గ్రంథాలలో సిద్ధాంతం చేయబడింది. (పంచాక్షరి, షడక్షరి, ద్వాదశాక్షరి మొదలైన హనుమన్మంత్రాలు ఉపాసనలో ఉపయోగించ బడుతున్నాయి.)

ఈ విధంగా మంత్రద్వారం పవమాన నందమని పరమాత్మ స్వరూపునిగా ప్రత్యక్షం చేయిస్తుంది. అందువల్లనే 1. రామాయణ ద్వారం, 2. పురాణ ద్వారం, 3. సంహితాద్వారం, 4. మంత్రద్వారం, 5. అధ్యాత్మ ద్వారం అన్న అయిదు ద్వారాలలో గర్భాలయ ప్రతిష్ఠితుడైన ఆంజనేయ స్వామి అయిదు ఆకారాలతో దర్శనమిస్తాడు. అతడే "పంచముఖుడు" (పంచముఖాంజనేయుడు) అని నా అభి సంధి (గట్టి నిశ్చయం) భవతు!

ఈ సందర్భంలో తత్త్వసారమైన కొన్ని మాటలను పొందు పరచాలని తోచింది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" "ఏకమేవాऽద్వితీయమ్" "సదేవసోమ్యేగమగ్ర ఆసీత్" "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" "రసోవైసః" "ఆనందో బ్రహ్మ" మొదలైనవి వేదాంత భేరీ నినాదాలు. అనుభవానికి వచ్చినా లేక పోయినా అందరున్నూ వింటున్నవే ఇవి. ఇది నిత్యసత్యతత్త్వం.

"రూపం రూపం ప్రతిరూపో బభూవ (బ్రహ్మమే నామ రూపాలన్నీ) "తత్ సృష్ట్వా తదేవాऽను పావిశత్" (నామ రూపాల్లో ఉన్నది ఆ బ్రహ్మమే)" సర్వాణి రూపాణి విచిత్య ధీరః! నామాని కృత్వా (అన్ని రూపాలు, అన్ని పేర్లున్న ఆ బ్రహ్మమే) "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" (ఒకే సత్యాన్ని వేర్వేరు ఆకారాలతో వేర్వేరు పేర్లుతో అనుభవిస్తారు) ఇది వ్యవహారం. (లోకం పోకడ) ఇదే ప్రపంచం.

అందుచేత సాధకుడు తనకభీష్టమైన సాధనను అవలంబించి, క్రమ క్రమంగా వ్యవహారాన్ని అతిక్రమించి (నామ రూపాలను విడిచి పెట్టి) "తత్త్వమసి" (పరవస్తువే నీవు) అన్న బోధను గ్రహించి, చివరకు "అహంబ్రహ్మాऽస్మి" అన్న స్వరూప స్థితిని పొందడమే పరమ పదమని సకల నిగమాగమసారం - సర్వ వేదాంత వేద్యం - సర్వశాస్త్ర సదుపదేశం!

ఈ సంవిధానంలో ''హనుమదుపాసన''ను ప్రముఖంగా స్వీకరించవచ్చు. సందేహం లేదు. ''యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితు మిచ్ఛతి'' అని భగవానుని ఉపదేశం. ఈ ''హనుమత్ ప్రబంధము'' యొక్క ప్రభావం కూడా ఇదే! నా ''హనుమత్‌ద్దర్శనము'' కూడా ఇదే!

ఇంతటి సద్గ్రంథం ఆంధ్ర ప్రజానీకానికి ఇచ్చి నందులకు కవిశేఖరులు శ్రీ కొండేపూడి సుబ్బారావుగారికి మరోసారి నా అభినందనలు.

పరమ ప్రీతితో ఈ మాటలను వ్రాసే అవకాశం నాకిచ్చినందుకు ''కవిశేఖరు''లకు నమస్సుమాంజలిని అర్పిస్తున్నాను.

''ఓం తత్ సత్''

విశాఖపట్నం - 13
తే 16-7-2001
వృష, ఆషాఢ బహుళదశమి
సోమవారం - కర్కాటక సంక్రాంతి.

శ్రీరస్తు

శ్రీ హనుమత్ప్రబంధము

ప్రస్తావన

శ్రీ హనుమత్ప్రబంధము నందిది మూడవ భాగము. ఈ భాగముతో ఈ గ్రంథము సంపూర్ణము. మొదటి రెండు భాగములు పద్యకావ్యము లీవరకే వెలువడినవి. ఇది వచనము.

మొదటి భాగమున హనుమంతుని జననము మొదలు సముద్ర లంఘనమున కుద్యుక్తుడగు వరకు గల కథ ఉన్నది.

రెండవ భాగమున హనుమంతుని సముద్రలంఘనము మొదలు రావణ వధానంతరము శ్రీరామ పట్టాభిషేకము వరకు గల కథ కలదు.

ఈ మూడవ భాగము వచనము. హనుమానుని మహిమను దెలుపు వ్యాసములు, ఆతడు భక్తులను రక్షించిన కొన్ని కథలు గాథలు ఇందున్నవి. మొత్తమీ గ్రంథమంతయు హనుమత్పురాణమే అనవచ్చును.

శివాంశసముద్భవుడు సర్వసమర్థుడు మహాబలుడు వేదాంత వేది భక్తరక్షకుడయిన ఆంజనేయుని చరితము శ్రీ మద్రామాయణమున కొంతవరకే ఉన్నది. ఆ తరువాతనే ఆ మహనీయుని చరిత ఎక్కువ భాగము కలదు. పరాశరుడు మున్నగు మహర్షులు వ్రాసిన గ్రంథములందు హనుమానుని గూర్చిన మహిమావిశేషములెన్నియో ఉన్నవి. ఆ కథలు గాథలు దేశవ్యాప్తములై సకల జనాదరణీయములైనవి. సకల సంప్రదాయములవారికి ఆరాధ్యదైవముగా గ్రామ గ్రామములలో వెలసిన శివమూర్తి ఆంజనేయుడు - ప్రతిగ్రామమున పట్టణమున ఏ కూడలి యందో మహోన్నతము, సుప్రసన్నమైన ఆంజనేయ విగ్రహము, అభయహస్తముతో గదాయుధముతో ప్రత్యక్షముగ కన్పించును. కరుణా సింధువు హనుమంతుడు. భక్తాంజనేయునిగా వీరాంజనేయునిగా, భద్రాంజనేయునిగా, ధ్యానాంజనేయునిగా అభయాంజనేయునిగా, పంచముఖ ఆంజనేయునిగా ప్రజలా దైవతమూర్తిని వారి వారి యిష్టానుసారము రూపించుకొని సేవించి తరింతురు.

హనుమన్మహిమను గూర్చి ఋషులు ఎన్నియో విధముల పూర్వ గ్రంథములందు కొనియాడిరి. ఉమా సంహితలో "ఆంజనేయం మహావీరం బ్రహ్మవిష్ణు శివాత్మకమ్" అని సంస్తుతింపబడినాడు. అనగా త్రిమూర్తుల యందున్న మహత్త్వమా ఆంజనేయుని యందు కలదని భావము.

పరాశరసంహితలో ఆంజనేయః పూజితశ్చేత్ పూజితా సర్వదేవతాః హనుమన్మహిమాశక్యో బ్రహ్మణాపి నవర్ణితుమ్॥ హనుమన్మహిమను వర్ణించుట బ్రహ్మకైనను అసాధ్యమే. హనుమానుడు పూజింపబడినచో సర్వ దేవతలు పూజింపబడినట్లే. మఱొకచోట

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా।
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్స్మరణాద్భవేత్॥

బుద్ధి కీర్తి నిర్భయము ఆరోగ్యం జ్ఞానము వాక్శక్తి మున్నగు సంపదలన్నియు హనుమానుని స్మరించినంత మాత్రమున లభ్యమగునని వచింపబడినది.

వాల్మీకి రామాయణమున సుందరకాండ అంతయు యశస్సుందరుడైన హనుమత్కథయే. ఇట్లే తులసీదాసు రామమానస చరిత హనుమాన్ చాలీసా సుప్రసిద్ధములు. పదపడి హనుమత్ప్రశస్తిని దెలుపుచు వ్రాయబడిన రామకథలు, కావ్యములు, శతకములు దండకములు స్తోత్రములు అష్టోత్తర శత సహస్రనామములు ఆంధ్రమున కోకొల్లలు - తన బుద్ధిపాటవమువలన, బలసాహసముల వలన, చిరజీవిగా భవిష్యద్బ్రహ్మగా వరము లందిన మహనీయుడతడు. సకల వేద శాస్త్ర వేత్త. నిష్కళంక పవిత్ర చరిత్రుడు - **కృతయుగమున తాటక ఖరదూషణులు మారీచసుబాహులు రావణ కుంభకర్ణ ఇంద్రజిదాదులు లోకకంటకులై విజృంభించిన సమయమున, శైవతేజసముద్భవుడై శ్రీరామునికి దుష్టదైత్య నిర్మూలన కార్యమందు తోడ్పడిన పారమేశ్వర శక్తి హనుమానుడు.** దైవత కార్యసిద్ధి చరితాత్ముడైన కారణజన్ముడా హనుమంతుడు. నేటికిని గంధమాదనమున తపశ్శాలియై భక్త జనులను రక్షించుచున్న దైవతమూర్తి. ఇంతటి సుస్థిర భక్తి గౌరవ ఆదరాభిమానములతో భావింప బడుచున్న మహామహిముడాతడు.

హనుమానుని చరిత మందున్న ఈ యీ మహత్తర విశేషములను కథలను గాథలను ఈ పొత్తమందు సవిస్తరముగా తెలుపుటకు ప్రయత్నము జరిగినది.

రామాయణ భారతాది ఇతిహాసములలో ఇతర గ్రంథములలోను చదివినవి, అటనట వినినవి హనుమచ్చరితావిశేషములు కూడ ఈ పొత్తమున పొందుపఱపబడినవి. భాషా ప్రవేశమంతగలేని వారును గ్రహింపవీలగు నట్లు సులభశైలిలోనే ఈ భాగము వ్రాయబడినది.

శ్రీ ఆంజనేయుని తత్త్వము ఊహించిన కొలది ఒక అనిర్వచనీయము మహోజ్జ్వల మైన దివ్య తేజము మన మానస గోచరమగును. సర్వదేవతా స్వరూపుడు, త్రిమూర్త్యాత్మకుడు, ఈశ్వరాంశ సంభూతుడైన హనుమానుని స్వరూప స్వభావములు ఇట్టివి అట్టివని వర్ణించుట అసాధ్యము. ఇట్టి మహా వీరుల నామస్మరణము కథాపఠనము శ్రవణము సమాజపురోగతికి రాజమార్గము.

వేదములను వేద ధర్మములను, వానిని విశదీకరించి బోధించు పురాణేతిహాసములను సంశయించు వారలింకను కలరు. వానిలోని ధర్మము లెట్టివి? లోకాస్సమస్తాస్సుఖినోభవంతు, సహనావతు సహనౌభునక్తు, మున్నగు సమాజ శ్రేయః ప్రదసూక్తులు, వాని నాచరించి చూపిన మహనీయుల చరిత్రలే కదా మనసనాతన సంస్కృతి. ఈ సమాజ నీతి నియమములు ధర్మములు కూడ అక్కరలేదందురా?

మఱి అట్టి ధర్మ ప్రవర్తనకు నిదర్శనములగు శ్రీరాముడు ఆంజనేయుడు దైవ మూర్తులో ఏమోగాని, వారి మహత్త్వమును గ్రహించి జీవన ధర్మమును అవగాహన చేసికొని అనుసరించినపుడే జాతికి పురోగతి. వారిరువురి శీలములు లోక కళ్యాణ ప్రదములు. దౌష్ట్యమును అధర్మమును సహించని సత్యపరాక్రమము వారిది.

అందుచేత హనుమానుని చరితమును మహర్షులు, శాస్త్రజ్ఞులు కవులు అనేక విధముల ప్రశంసించి వ్రాసి మనకందజేసిరి. సత్ప్రవర్తన శీలమే దైవవరము. భక్తుల పూజాఫల మనగా జన్మమునకు సార్థకతనిచ్చు ధర్మమార్గము. అదియున్నప్పుడు సర్వము విజయ ప్రదము. ఆ మహాత్ముల చరిత్ర నుండి మనము నేర్చుకొనవలసిన ధర్మమిదియే.

హనుమన్మహిమా విషయములను వివరించు ఈ గ్రంథము నాదరించి చదివి, వినువారెల్లరు హనుమత్కృపానుగ్రహములకు పాత్రులగుదురు గాక.

హనుమత్ప్రబంధము - మూడవ భాగము

హనుమంతుని చరిత్ర - జననము

హనుమంతుని జన్మవృత్తాంతమును గూర్చి పాఠభేదములున్నవి. ఇవి యెట్లు సంభవించినవి అనిన పరీక్ష అంత ఆవశ్యకవముకాదు. యుగ యుగములనాటి గాథలివి. ఈ మధ్యలో ఏకారణము చేతనైనను ప్రక్షిప్తములు మార్పులు చేర్పులు వచ్చియుండవచ్చును. ఈ మార్పులు మహాపురాణములకే తప్పలేదు. కొందరు వారి వారి విశ్వాసములను బట్టి మూలమును లెక్క చేయక చేసిన మార్పులు వలె కన్పట్టును. ఏ కథ యెట్లు వ్యాప్తిలోనికి వచ్చినను హనుమంతుడు హనుమంతుడే. తన ప్రజ్ఞాపాటవఫలముగ బ్రహ్మాదులను గూడ మెప్పించి చిరజీవిగా వరములంది సర్వ ప్రజానీకముచే పూజలందుకొనుచున్నాడు.

ఈ వేర్వేరు కథలెట్లున్నను హనుమంతుని జన్మ చరితమున పరమశివుడు, అంజన, వాయువు ఈ మూవురు ముఖ్యులుగ నున్నారు. అదిచాలును. అయినను వివిధములైన కథలెట్లున్నవో చూతము.

1. (రామాయణము) పశ్చిమ సముద్ర తటమున వానరులు నివసించు ప్రదేశమొకటి ప్రభాసతీర్థమను పేర ఉన్నది. ఆ చుట్టు ప్రక్కల నున్న అడవుల నుండి ఏనుగులు వచ్చి వారి నివాసము పాడుచేయుచుండెను. ఒకనాడు శంఖము శబలము అను రెండేనుగులు ఊరిపై బడి విధ్వంసము చేయుచుండగా ఆ తీర్థము నందున్న వానరులు చెల్లా చెదురుగ పారిపోదొడగిరి. వారియందున్న వీరుడొకడు ఆ యేనుగులతో పోరాడి వానిని జంపెను. ఏనుగులను చంపగలిగిన వాని పరాక్రమమును మెచ్చుకొని ఆ ప్రాంతముల నున్న భరద్వాజుడను ముని వానికి కేసరి యను నామమిడి, అతనికి మహాబలాఢ్యుడు సర్వవంద్యుడు అయిన పుత్రుడు కూడ కలుగునని వరమిచ్చెను. ఆ ప్రభాస తీర్థము నందున్న కుంజరుడను వానరముఖ్యునకు అంజనయను పుత్రిక కలదు. ఆమె కడు సౌందర్యవతి. బలవంతుడగు అల్లుని కొరకు వెదకుచు కుంజరుడు తనకుమార్తె అంజనను కేసరికిచ్చి వివాహమొనర్చెను. ఆ దాంపత్యమెన్ని నాళ్ళో సాగలేదు. వివాహమైన కొన్ని నాళ్ళకే కేసరి విరాగియై తపస్సునకేగుచు అంజనను పిలిచి

"వాయుదేవుని పూజించుకొనుము ఆ దైవమూర్తివలన అజేయబలుడు, మహావిద్వాంసుడు, పరమభక్తుడగు సుతుడు నీకు ఉదయింపగలడు, క్రూర రాక్షస విధ్వంసకుడై ఆసుతుడు మహా కీర్తిమంతుడగును, ఈ సాంగత్యము వలన నీ శీలమునకు ఎట్టి లోపము రాదు" అని కూడ చెప్పెను. భర్త ఆకస్మికముగ విరాగియై తనను విడచి యేగుట అంజనకు అపార దుఃఖము కలిగించెను. ఏమియు తోచక ఆమె విచార మగ్నయై దినములు యుగముల వలె గడపు చుండెను. క్రమముగా ఆ దుఃఖమునుండి తేరుకొని ఒకనాడు అంజన ప్రభాసతీర్థము వద్దనున్న సరస్వతీ నదీతీరమున తిరుగుచుండగా ఆమె సౌందర్యమును చూచి వాయువు వలచివచ్చి ఆమెను కలియగా బాలభాను డనదగిన ఒక మహాతేజస్వియగు కుమారుడు కలిగెను. "వాయుదేవుడామెను విడచియేగుచు దేవీ నీవు విచారింపకుము. ఈ కుమారుడు నా వద్దనున్న శివతేజము వలన జన్మించినవాడు. మహావీరుడు, మహాజ్ఞానియునై జగత్ ప్రసిద్ధి బడయగలడు. నీ మాతృత్వమునకేలోపము కలుగదు అని చెప్పి వెడలెను. ఆ అటవీ ప్రాంతమున ఆ పసిబిడ్డకు జాతకర్మములు చేయించు వారెవరు? నామకరణము చేయువారెవరు? ఈశ్వరుడే శరణ్యము. అంజన యొక్క కుమారుడు గాన ఆంజనేయుడని పేరు వచ్చినది. ఇది అన్ని చోట్లను వ్యాప్తినందిన గాథ; సుప్రసిద్ధమైన కథ.

2. (విచిత్ర రామాయణము) గౌతమ మహామునికి భార్య యగు అహల్యవలన కలిగిన కొమరిత అంజన. అహల్య చాలసుందరి. సూర్యుడామెను మోహించి సుఖింపగా పుత్రుడొకడు కలిగెను. తరువాత మరియొక పుత్రుడును కలిగెను. ఈ రహస్యము నెఱిగిన అంజన ఆమె తండ్రి గౌతమున కీమాట చెప్పగా అతడు ఈ మగపిల్ల లిరువురును అహల్యకు అక్రమ సంతానమైనచో వానర ముఖులగుదురు గాక యని శపించి సముద్రమున బడవైచెను. వారిరువురు కోతి మొగములతో బయటకు వచ్చిరి. వారే వాలి సుగ్రీవులు. తన గుట్టును బయట పెట్టినందులకు అహల్య "అంజనను గ్రుడ్డిదానవగుదువు, నీకు వానరుడొకడు పుత్రుడగును గాక" యని శపించి అడవులకు బంపెను. ఈ కథ చాల అసంబద్ధముగా నున్నది.

ఉత్తర రామాయణమున వాలి సుగ్రీవులను గూర్చిన కథ వేఱుగనున్నది. ఋక్షవిరజుడను వానరముఖ్యుడు కాననము లందు తిరుగుచు, పార్వతి వలన శాపము నందిన కొలనులో స్నానమాడి ఒక సుందర స్త్రీయై బయటకు వచ్చెను. ఆమెను చూచి ఇంద్రుడు మోహించి కలియగా పుట్టిన వాడు వాలి. సూర్యుడు కూడ ఆమెను వలచి కలియగా పుట్టిన పుత్రుడు సుగ్రీవుడు - మఱునాడే ఋక్షవిరజుడు నిజరూపము దాల్చి వాలి సుగ్రీవులను తీసికొని వెడలి కిష్కింధ రాజ్యమును స్థాపించెను. ఇదియే వాడుకలోనున్న కథ. ఇందు అంజన ప్రసక్తియే లేదు.

3. అంజనను ప్రథమమున వివాహమాడిన కేసరియే వాయువు. రావణాది రాక్షసులను సంహరించుటకు దేవతలేగి పరమశివుని సాహయ్య మడుగగా పరమశివుడంగీకరించెను. రావణుడు మహాశివ భక్తుడు. తన భక్తుని తానై సంహరించుట తగదని పరమశివుడు తన తేజమును వాయువునందుంచెను. వాయువే కేసరి రూపమునందెను, పుంజకస్థలయను అప్సరస దేవలోకమున రావణునిచే బలాత్కరింప బడి తన పగ తీర్చుకొనుటకు భూమిపై అంజనగా జన్మించినది. ఈ అంజనను కేసరి నిజ వాయుస్వరూపమున వివాహమాడి శివాంశ కలిగిన పుత్రుని కనెను. ఆ శిశువే హనుమంతుడు.

వాల్మీకి రామాయణమున, హనుమంతుడు రావణాసురునితో మాట్లాడుచు తాను వాయుదేవుని పుత్రుడనని చెప్పినాడు.

''అహంతు హనుమన్నామ మారుతస్యౌరసపుత్రః'' ఔరస పుత్రుడనగా నిజధర్మపత్ని యందు పుట్టినవాడని యర్థము.

ఇచ్చట పుంజకస్థలను గూర్చి కొంత చెప్పవలసియున్నది. ఈమె ఒక అప్సరస, దేవలోకమును నానాభీభత్సము చేయుచున్న రావణుని చూచి భయపడి దాగి బ్రహ్మలోకమునకు పారిపోవుచుండ ఆమెను బలిమిని పట్టి రావణుడు రమించెను. పుంజకస్థల యెట్లో తప్పించుకొని బ్రహ్మతో మొఱపెట్టినది. రావణునిపై బ్రహ్మకోపించి ''నీవిక పరస్త్రీనిట్లు బలాత్కరించినచో నీ తల వేయిముక్కలగు'' నని శపించెను. రావణుని పై ప్రతీకార వాంఛతో బ్రహ్మదేవుని ప్రార్థించి పుంజకస్థల

వరములంది అంజనయై జన్మించినది. బ్రహ్మ అనుగ్రహమున వాయుదేవుడే ఆమెను వివాహమాడి తత్ఫలితముగ శివాంశయు మహాశక్తి స్వరూపుడగు ఆంజనేయుని కనినది. సుగ్రీవునితో మైత్రి, సీతాన్వేషణము, రావణాది దైత్యుల సంహారము, సీతా రాములకలయిక మున్నగు సందర్భములలో హనుమంతుని పాత్ర ప్రధానమైనది.

పుంజకస్థల కథ రామాయణమందున్నది. రావణుడు సీతను చెఱబట్టి లంక యందుంచినాడు. ఆ దైత్యేంద్రుని కొలువులో నున్న మహాపార్శ్వుడను మంత్రియొకడు రావణుని కొకసలహా చెప్పినాడు "ప్రభూ! నీవు త్రిలోకములను జయించిన మహాబలుడవు నీకు అడ్డు చెప్పు వారెవరునూ లేరు. త్రిలోక సుందరి, సీత నీకు దగిన స్త్రీ. బలిమిని భోగింపుము" అనగానే రావణుని ఒడలు జలదరించినది" మంత్రీ! నీవు చెప్పవలసినది చెప్పినావు. నాకా అదృష్టములేదు. పరస్త్రీని యిక బలిమిని ముట్టుకొనినచో నాతల వేయి భిన్నములగునని బ్రహ్మశపించినాడు" అని పుంజకస్థలయను అప్సరసను తాను బలాత్కరించిన పనికి పరిణామమును చెప్పినాడు.

రామాయణములోని ఈ క్రింది వాక్యములీ కథకు సంబంధించినవే

పితామహస్య భవనం గచ్ఛన్తీం పుంజకస్థలా
చంచూర్యమాణామద్రాక్ష మాకాశేగ్నిశిఖామివ
సాప్రసహ్య మయాభుక్తాకృతావివసనాతత
అథఃసఃకుపితోదేవో మామిదంవాక్య మబ్రవీత్
'అద్య ప్రభృతి''యా మన్యాం బలవన్నారీగమిష్యసి
తదాదే శతధామూర్ధా ఫలిష్యతి నసంశయః

ఈ వృత్తాంతము మొదట నున్న కథకు దగ్గరగా ఉన్నది. కేసరి అంజనల పూర్వవృత్తాంతమును తెలుపుచున్నది.

విషయ వివరణమెట్లున్నను హనుమ శివాంశసంభూతుడని, అజేయ బలసాహసోపేతుడని కారణజన్ముడని పూర్వ గ్రంథములను బట్టి స్పష్టముగ తెలియుచున్నది.

హనుమదవతారము

మహానదుల పుట్టుకకు మహాత్ముల జన్మమునకు జగత్కళ్యాణ ప్రదమైన పరమార్థమేదియో దైవనిర్ణీతమై యుండును. దైవ సంకల్పములు నెరవేరితీరును. సాక్షాద్విష్ణ్వవతారుడు శ్రీరాముడు. దుష్టశిక్షణకు శిష్టరక్షణకు ధర్మసంస్థాపనకు జన్మించిన మహా పురుషుడు. త్రిలోక కంటకులయిన రావణాదులను పరిమార్చిలోకమునకు శాంతి సౌఖ్యములు గల మార్గమేర్పరచినాడు. ఈ కార్యనిర్వహణమున ప్రధాన పాత్ర వహించిన వ్యక్తి హనుమంతుడు. వీరిరువురి కలయిక వెనుక ఒక విశిష్టమగు ప్రత్యేకత ఏమైన ఉన్నదా అను విషయము సూక్ష్మముగా పరిశీలించదగియున్నది. అంతేకాక రామాంజనేయుల కలయిక హరిహరాత్మకమయిన ఒక మహాశక్తి. ఇంతటి శక్తి ప్రాదుర్భవించుటకుగల కారణమును గూడ విశదముగ తెలిసికొనవలసిన ఆవశ్యకతయున్నది. ఈ దృక్పథము నుండి పరిశీలించినపుడే హనుమంతుని సరియైన స్వరూపము అవగతమగుటకు వీలుకలుగును.

హనుమంతుడు శివావతారము - ఈ విషయము వ్యాస మహర్షి వ్రాసిన పదునెమ్మిది పురాణములలో నాల్గవదియగు శివమహాపురాణము రుద్ర సంహిత కుమార ఖండము 20వ అధ్యాయమున విపులముగ నున్నది. ధర్మ సంస్థాపనము కొరకు పరమ శివుడెన్నియో అవతారము లెత్తెను. వానిలో హనుమదవతారము ముఖ్యమైన అవతారము.

ఒకానొక సమయమున విష్ణువు మోహినీ రూపమును దాల్చగా ఆమె సౌందర్యమునకు శంకరుడు చలితమనస్కుడై తన వీర్యమును విడిచెను. ఆ సంఘటనము రామ కార్యార్థము జరిగినదే ఆ వీర్యమును సప్తర్షులు దాచి యుంచిరి. తుదకా వీర్యమును అంజనీదేవి చెవిలో వేయగా ఆమె గర్భవతియై ఒక కుమారుని ప్రసవించెను. శంకరుడే మహా బల పరాక్రమములుగల వానరుడుగా ఉదయించెను. ఆతడే హనుమంతుడు.

శివుడు హనుమంతుని రూపమున లోకమున చూపిన లీలావిలాసము లద్భుతములు. హనుమద్రూపమున శివుడే దుష్టరాక్షస విధ్వంసమున శ్రీరామునికి

తోడ్పడెను. రావణ వధానంతరమున హనుమంతుని దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కార్యములెన్నియో యున్నవి.

అది కృతయుగము. శ్రీరాముని కాలము నాటికే శ్రీమన్నారాయణుని అవతారములు ముఖ్యమైనవి అయిదైనవి.

1. ఏవి భరత వర్ష సంస్కృతికి ధర్మమునకు ఆధారములైనవో ఆ వేదముల నపహరించి సాగర గర్భమున దాగినాడు సోమకుడను రాక్షసుడు. ఆ వేదముల నుద్ధరించుటకు శ్రీ విష్ణువు మత్స్యమైవచ్చి సోమకుని ద్రుంచినాడు.

2. రాక్షసుల బాధ నుండి దేవతలకు రక్షణ కావలెను. క్షీర సాగరమున నున్న అమృత సేవనమే దానికి మార్గము. దానవులు మాత్రము తక్కువ వారా! వారును అమృతమున కాసించి సముద్రమథన మారంభించిరి. కవ్వముగా నున్న కొండ సముద్ర జలమున మునుగగా శ్రీ విష్ణువు కూర్మమై కొండను తన వీపుపై నిలిపి నాడు. అమృతమునకు బదులు హాలాహల విషాగ్నులు ప్రబలి లోకము దగ్ధమగుటకు సిద్ధమైనది. శివుడు తానే వచ్చి ఆ విషమును పట్టి తన గళమున బంధించినాడు. తరువాత లభించిన అమృతము దేవతల కందించుటకు మధ్యగా విష్ణువు మోహిని ఆకారమున రావలసివచ్చినది.

3. హిరణ్యాక్షహిరణ్యకశిపులు మహాదుష్టులైన దానవ సోదరులు. భూమి లేకుండ జేసినచో జనులందరు మడియుదురు గదా అని హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రమున త్రోసినాడు. శ్రీవిష్ణువు మహావరాహమై హిరణ్యాక్షుని ద్రుంచి తనముట్టెతో భూమిని పైకెత్తినాడు.

4. తన అన్నగారిని చంపిన విష్ణువుపై వైరమూని హిరణ్యకశిపుడు విష్ణుభక్తులను పారద్రోలి, హరి భక్తుడైన తనకుమారుని ప్రహ్లాదునే చంపయత్నించినాడు. శ్రీవిష్ణువు నృసింహరూపమై హిరణ్యకశిపుని చీల్చిచంపి విష్ణుభక్తులను రక్షించినాడు.

5. బలి చక్రవర్తి రాక్షస కులాధిపతి. రాక్షసుడైనను దాన బుద్ధి గల విశాలహృదయుడు. తన రాజగర్వము బలగర్వము చూచుకొని బలి యింద్రాదులైన దేవతలనే అవమానించుటకు సిద్ధపడెను. శ్రీ విష్ణువు వామనుడుగా అదితి కశ్యపుల కుద్భవించి ఒకవటువురూపమున, యజ్ఞము చేయుచున్న బలివద్దకు పోయి,

తనకు మూడడుగుల నేల దానముగ అడిగి పుచ్చుకొని ఒకపాదమున భూమిని ఒక పాదమున ఆకాశము నాక్రమించి మూడవ అడుగు భాగమునకు బలిశిరము మీదనే పాదముసుంచి పాతాళమునకణగద్రొక్కెను.

6. కొందరు రాజవంశీయులు మహాదర్పితులై ప్రజలను మునులను హింసింప మొదలిడిరి. ఈ దౌష్ట్యము నరికట్టుటకు శ్రీ విష్ణువు భృగుమహర్షికి తనయుడై జన్మించెను. అకారణముగ భృగుమహర్షినే దుష్టులగు కొందరు రాజన్యులు వధించిరి. ఆ మునికుమారుడు పరశురాముడు విష్ణుని అవతారము, ఇరువది యొక్క మారులు దాడివెడలి దుష్టులైన రాజన్యులనెల్ల సంహరించి పితృ తర్పణమొనరించెను.

ఈ సంఘటనలతో ఆగలేదు. త్రిపురాసురులు విజృంభించి నపుడు పరమ శివుడే వచ్చి సంహరించినాడు. మహిషాసురుని తదనుచరులైన చండముండులను రక్త బీజాదులను ద్రుంచుటకు పరాంబికాదేవియే, కాళీదుర్గా రూపముల వచ్చినది.

ఈ గాథలను పరిశీలించినచో ఒక్కొక్క రాక్షసుడు ఎంత బలవంతుడో విశదమగును. వారినణచుటకు వైకుంఠమున నుండి విష్ణువో, కైలాసమున నుండి శివుడో రావలసి వచ్చినది. కాలము గడచినది. రాక్షస సమూహము కూడగట్టుకొని బలవంతులయినారు. వారి మతము దుర్మార్గము. వారి లక్ష్యము నరసురముని వ్రాతములహింసించుట, యజ్ఞ యాగాది సత్కార్యములు సాగకుండ ధ్వంసము చేయుట వారి స్వభావము. వారి ప్రవర్తన కామక్రోధలోభమోహ మద మాత్సర్యముల కూడిక. వారి గుణము తమోగుణము. తుదకు పైనుదహరింపబడిన రాక్షసులు కొన్ని వందల మంది కూడిన మహోపద్రవమే పుడమికి వచ్చినది. దేవతా పూజలు చెల్లవు, అగ్నిహోత్రములు వెలుగవు, క్రతువులు సాగవు. స్త్రీలకు రక్షణలేదు. ఇది ఆనాటి జగత్పరిస్థితి.

ఇట్లు విజృంభించిన దుష్ట రాక్షసవర్గము రావణాసురుని వంశీయులు, అనుచరులు, సహచరులు. రావణుడెవ్వడో కాదు. బ్రహ్మ మానసపుత్రుడు పులస్త్యబ్రహ్మ కుమారుడు. భరతవర్షమున దక్షిణమున నున్న లంకలో దానవరాజ్యమేర్పడినది. రావణుడు లంకాధిపతి. దానవముఖ్యులెల్లరు మంత్ర

తంత్రములు నేర్చినారు. తపస్సులు చేసినారు. వరములంది నారు. సిద్ధులు పడసినారు. అవసరమగు కామ రూపముల ధరించు శక్తులు సంపాదించినారు. ఈ శక్తులకు తోడు దారుణ మారణా యుధములను సమకూర్చుకొనగలిగినారు. నేల నలు ప్రక్కల ఈ దుష్టులు అల్లుకొనిపోయినారు. ఉత్తరమున తాటక యను మహారాక్షసి, దండకాటవిలో ఖరదూషణాదులు. దక్షిణమున లంక దానవరాజ్యము- రావణునకు అడ్డేమి ఉన్నది. అతడు మహా శివభక్తుడు మహాతపశ్శాలి మనుష్యులన్నచో అతనిముందు పురుగుల కన్న హీనము. మనుష్యుల లెక్కయేలేదు. వారివలన తనకు ఏ చిక్కునులేదు అనుకొనినాడు. తక్కిన దేవతలు దిక్పతులు నాగగరుడ గంధర్వ కిన్నరాదులు ఎవరి వలనను చావులేకుండ బ్రహ్మచే వరములందినాడు. రావణుని కొడుకు మేఘనాథుడును అంతటి వాడే. అతడు హోమమొనర్చి వచ్చినచో ప్రపంచమున ఎవ్వరును, దేవుడైనను అతని నెదుర్కొనలేరు. ఇంద్రుని జయించి ఇంద్రజిత్తు అని ప్రసిద్ధనామము నందినాడు. రావణుని తక్కిన కుమారులు అక్షయుడు మున్నగు వారు కూడా దుర్వారబలులు. సోదరుడు కుంభకర్ణుడు పర్వతమంత మనిషి. వాని ఉచ్ఛ్వాస నిశ్వాసముల వేగమునకు పర్వతము లెగిరిపోవునంతటి బలుడు. ఇక వీరి అనుచరులు ఒకరిని మించిన వారొకరు. వీరిముందు త్రిలోకములు తల్లడిల్లిపోయినవి. భూదేవి ఘోషించినది. బయటకు వచ్చుటకు సూర్య చంద్రులే భయపడి ప్రక్కకు తొలగినారు. జగత్తున కింతటి విపత్తునా పుటకు ఎంత శక్తి కావలసి యుండును. ఇక దేవుడే దిక్కు.

రావణుడు తనదర్పాతిశయముతో కామాంధుడై తన చావునకు తానే కారణములు కల్పించు కొనుచు వచ్చినాడు. కన్ను మిన్నెరుగక చేసిన దురితముల ఫలమిది. పుంజకస్థల మాన భంగము కారణముగ బ్రహ్మ శాపమున్నది. ఒక సమయమున దివియందు రంభను బలాత్కరించి నలకూబరుని శాపము నందినాడు. మునికన్యయగు వేదవతిని బలిమిని పట్టబోయినందులకు తత్ ప్రతీకారముగ ఆమెయే లక్ష్మి అంశ కలిగిన సీతగా జనకునింట జన్మించినది. మూడు విధములుగ స్త్రీ శక్తి రావణుని అంతము కొరకు ఎదురు చూచుచున్నది.

ఇక మరొక ప్రక్కనుండి బ్రహ్మను ఇంద్రుని తోడ్కొని సురలు మునులు వైకుంఠమున శ్రీ విష్ణువుకడ కేగి మొఱపెట్టుకొని - రావణుని ముందు

లోకములాగవని విలపించిరి. ఒక్క మానవుని వలనగాని రావణునకు చావులేదని శ్రీవిష్ణువెరుగును. కరుణా సింధువు శ్రీహరి దేవతల కభయహస్తమిచ్చినాడు. క్రూర రాక్షస నిర్మూలమునకు నేను త్వరలోనే వత్తును, ముఖ్యదేవతలు వానరులైతనకు సాయముగనుందురని నుడివి, రావణుడు పరమశివుని మహాభక్తుడగుటయు గమనింప వలసినదిగా జ్ఞప్తి చేసి పంపెను. తమ కొకదారి దొరకవలెను లేదా బ్రతుకులుండవు. దేవతలు కైలాసమునకేగి మహాశివుని అనుగ్రహము సంపాదించినారు. రావణుని దౌష్ట్యము పరమ శివుడెరుగును. తన భక్తుని పరిమార్చుటకు తానయిరాడు. భక్తుడని ఉపేక్ష వహించినచో లోకములకు ప్రళయమే సంభవించునట్లున్నది. ఏదో ఉపాయము తానై చూడవలయును. మహాశివుని ఆంతర్యము గ్రహించిన దేవతలకు మునులకు కొంతభయము తగ్గినది. క్రూర రాక్షస నిర్మూలము ఎప్పుడెపు డాయని దినములు లెక్కిడుచున్నారు.

ఇక ఆలస్యమెంత మాత్రమును తగదు. హరి హరులు వారే తొందరపడుచున్నారు. కోసల దేశాధిపతి దశరథుడు మహాబలవంతుడు దేవేంద్రునకు దేవదానవ యుద్ధమున ఎంతయో సాయము చేసినవాడు. ఆ మహారాజిప్పుడు బ్రహ్మర్షియు కులగురువునైన వసిష్ఠునాదేశమున పుత్రులకొరకు యాగమునొనరించుచున్నాడు. యాగము ఫలించినది. యజ్ఞపురుషుడు ప్రత్యక్షమయి పాయసమిచ్చినాడు. మంచి సమయముగా కనుపించినది. ఆ రాజు భార్యలు పాయసమును సేవించినారు. పెద్ద భార్య కౌసల్య గర్భమున శ్రీహరి శ్రీరామునిగా జన్మించినాడు. రెండవ భార్య సుమిత్ర యందు లక్షణ శత్రుఘ్నులు కవలలుదయించిరి. అనంతుడు ఆదిశేషుడు లక్ష్మణుడై అవతరించినాడు. శత్రుఘ్నుడు చక్రము అంశతో జన్మించెను, మూడవ భార్యకైకయందు శంఖము అంశమున భరతుడు ఉదయించినాడు శ్రీహరి అవతారము శ్రీరామునిగా పూర్తి అయినది.

రావణునెదిరింపగల మహాబలుని పుత్రునిగ పొందుటకు పుంజకస్థల అంజనగా జన్మించినది. వాయుదేవుడామెను, వలచి తనయందున్న శివతేజముగల పుత్రునిగనెను. ఆ మహాతేజస్వియే ఆంజనేయుడు. ఆంజనేయునకు శ్రీరాముని

సాంగత్యము లభించినది. రాక్షస విధ్వంసమునకై హరిహరాత్మకమైన మహాశక్తి కావలసి వచ్చినది. హరిహరులిట్లు రామాంజనేయులుగా అవతరించిరి.

శ్రీరాముడు వీరనారాయణుడు. హనుమంతుడు శివశక్తి స్వరూపము. ఈ మహిమలు రెండును కలిసిన మహాశక్తియే రావణునితో పాటు ఆనాటి దానవదౌష్ట్యమును అంతమొందించుట కావశ్యకమైనది. దేవతలును, వానరరూపులై ఈ బృహత్కార్యమున సాయపడవలసిన ఆవశ్యకతయు కలిగినది. ఇది హనుమదవతార కథ.

ఆంజనేయుని గొప్పతనము

ఆంజనేయుడు శివస్వరూపమని అతని జన్మగాథయే విశదము చేయుచున్నది. ఆ దివ్య పురుషుని గొప్పతనమును వర్ణించుట ఎవరికిని శక్యము గాదు. అయినను ఆ మహాత్ముని గొప్ప తనమును గూర్చి పూర్వగ్రంథములలో వ్రాసియున్న కొన్ని వృత్తాంతములను చెప్పుకొందము.

పూవు పుట్టగనే పరిమళించును. ఆంజనేయుని బలసాహసములట్లే శిశు ప్రాయమునందే వెల్లడియైనవి. ఆంజనేయుడు శివాంశ సముద్భవుడు గనుకనే సహజకవచ కుండలములు పసిడి జన్నిదములతో జన్మించినాడు.

తల్లి అంజన తన బిడ్డను అల్లారు ముద్దుగా పెంచుకొనుచున్నది. మూడు దినముల పసికందు. పాలు చాలక బిడ్డ పోరుపెట్టుట తల్లి భరించలేకపోయినది. ఆ బిడ్డను మెత్తని పూ పాన్పుపై పరుండ బెట్టి, పండ్లు తెచ్చి పిల్లని కా పండ్లరసము పట్టింపవలెనను ఆసతో దగ్గరనున్న అడవిలోనికి ఏగినది. ఉదయమైనది. బాలభానుడు బంగారు కాంతులతో పైకి వచ్చుచున్నాడు. ఆ బింబమును చూచి ఆంజనేయుడు ఏదో పండని తలచి, ఆకసమున కెగిరినాడు. ఆ వేగము ఆ తేజము ఆ విగ్రహము చూచి గగన చరులయిన కిన్నర కింపురుష గంధర్వాదులు భయపడి చూడసాగిరి. తనకు ఆహారము కావలసిన సూర్యుని మ్రింగుటకు ఏదో భూతము వెళ్ళుచున్నదని రాహువు అడ్డురాగా ఆంజనేయుడు రాహువుపై పడబోవునంతలో స్వర్గముపైకి ఎవరో రాక్షసుడు వచ్చుచున్నాడని దేవతలేగి ఇంద్రునికి చెప్పిరి. వెను వెంటనే ఇంద్రుడైరావతమునెక్కి వచ్చి ఆంజనేయునిపై వజ్రాయుధమును ప్రయోగించినాడు. అది ఆంజనేయుని హనువునకు తాకగా ఆ ధాటికాగలేక ఆంజనేయుడు క్రిందబడినాడు. తండ్రియగు వాయువిది చూచి, "పసిబిడ్డ అనికూడా భావించక లోకపాలకుడైన ఇంద్రునకింతటి దౌర్జన్యమా!" అని ఒక్కసారిగా వాయుచలనమును ఆపెను - లోకములకు ప్రాణవాయువు లేదు. ప్రాణికోటి ఒక్కుమ్మడిగా చనిపోవు విపత్తేర్పడినది. బ్రహ్మాదులు భయపడి వచ్చి వాయుదేవుని ప్రార్థించి ప్రాణవాయువును లోకమున ప్రసరింపచేసిరి. ఆ పసిబాలుని మూర్ఛదేర్చి ఎచ్చటను కనివిని యెఱుగని అతని జవ సత్వములకు సాహసమునకు అద్భుత పడి ఈతడు దైవత కార్యసిద్ధి చరితాత్ముడును, చిరజీవియు కాగలడని దీవించి బ్రహ్మాదులు వెడలిరి.

పండ్లతో ఇంటికి తిరిగి వచ్చిన అంజనతన బిడ్డను కానక ఎవరో రాక్షసులెత్తుకొని పోయినారని గోలు గోలున ఏడ్చు చున్నంతలో వాయు దేవుడా బిడ్డను తీసికొని వచ్చి తల్లికిచ్చి జరిగిన కథనంతయునుడిడెను. తన హనువు (చెక్కిలి) నందు దేవేంద్రుని వజ్రాయుధమునే ఆపిన బలవంతుడగుటచే ఆంజనేయున కానాటినుండియు హనుమంతుడను పేరు వచ్చినది. తమ బిడ్డ తమకు దక్కినందులకు తల్లిదండ్రులు సంతసించిరి.

హనుమంతునకు విద్యాభ్యాసమునకు తగినయీడు వచ్చినది. జ్ఞానతేజో రూపుడయిన సూర్యునివద్ద కాతనిని తల్లిపంపినది. సూర్యుడా బాలుని జూచి "ఉదయాస్తమానములు ఆకసమున అటునుండి యిటకు తిరుగాడు నా వద్దనా నీవు విద్యనభ్యసించుట" అని పరిహాసమాడగా, హనుమంతు డా భాస్కరునకు నమస్కరించి "గురుదేవా! నీవూహించిన చిక్కేమియు ఉండదు. ప్రతి నిముషము నీ ముందు నుండగలనని మహా రూపుడై ఉదయాద్రి యందొక కాలు అస్తాద్రియందొక కాలు నిలిపి నిలుచుని దినవయునకొక విద్యచొప్పున చతుష్షష్టికళలను వేద వేదాంగ శాస్త్రములును నేర్చి ఆంజనేయుడు మహా విద్వాంసుడయ్యెను. హనుమంతుని మేధా శక్తి సామర్థ్యములకు సూర్యుడే ఆశ్చర్యపడి "హనుమా! నీవెంత వాడవయినను కాగలవు. నిన్నెదిరింపగల వారెవరును ఉండరని" దీవించిపంపెను. చిన్ననాడు ఆకలి కాగలేకపోయిన పసిబిడ్డ మహాబలసాహసుడై మహా పండితుడై వచ్చి తల్లికి నమస్కరించినాడు. తల్లి అంజన ఆనందమునకు మేరలేదు. తల్లి దీవెనలు అనుజ్ఞగొని హనుమంతుడు కిష్కిందలో వానర వీరుడైన సుగ్రీవుని వద్ద చేరినాడు. దైవనిర్ణయమది.

శ్రీరాముడు, బాల్యమునందే విశ్వామిత్రమునిక్రతువును రక్కసుల బారినుండి రక్షించుటకేగుచు, దారిలో అడ్డుగా వచ్చిన తాటకను చంపినాడు. క్రతువును ధ్వంసము చేయవచ్చిన సుబాహుని చంపి, మారీచుని పారద్రోలినాడు. తండ్రి దశరథుని కోరికపై భార్య సీతతో గూడి రాముడు లక్ష్మణసహితుడై వనవాసమేగెను. వారు దండకాటవిలోనుండగా శూర్పణఖయను రక్కసి కామాంధయై పైకి రాగా లక్ష్మణుడామెను కురూపిగ జేసి పంపెను. ఇవి యన్నియు విని రామునిపై పగ తీర్చుకొనుటకు రాముడింట లేనప్పుడు మారు వేసమున మునియై వచ్చి రావణుడు సీతనపహరించి లంకలో చెఱబెట్టెను.

సీతాపహరణము తర్వాత రామకథలో అన్ని ఘట్టములందును ప్రధాన పాత్ర హనువంతునిదే. శ్రీరామ దర్శనము, రామ సుగ్రీవుల మైత్రి, సముద్రలంఘనము, సీతాన్వేషణము, సీతాదర్శనము, అక్షయకుమారాది రాక్షసుల వధ, రావణునితో సంభాషణ, లంకాదహనము, సీతను చూచిన వార్త రామునకు తెల్పుట, రాముని వెంట వానరసేన వారధి కట్టి లంకను జేరుట, రామరావణ యుద్ధము - సంజీవని తెచ్చి లక్ష్మణుని బ్రతికించుట. రావణ వధానంతరము - సీతారాములు పుష్పకముపై అయోధ్యకు చేరు సమాచారము భరతునకు తెల్పుట. ఇవి యన్నియు రామాయణములోని ముఖ్యఘట్టములు. హనుమంతుని సామర్థ్యమును తెల్పునవియే. రావణుని ఆయుధహతికి నిశ్చేష్టుడయి పడిన లక్ష్మణుని బ్రతికించుటకు సంజీవని అవసరమైన సమయమున జాంబవంతుడొక సంగతి చెప్పెను. చూడుడు, హనుమంతుడెక్కడ ఉన్నాడో, అతడు బ్రతికి యున్నచో అందరమును బ్రతికి నట్లే. అంతటి మహిమ అతనికున్నది. ఆతడే హిమాద్రికేగి సంజీవని తేగలడు అనెను.

ఇచ్చట నొక విషయము తెలిసి కొనదగినది. దుష్టులు తమ దుష్ప్రవర్తన చేత తమ గోయి తామే త్రవ్వుకొందురు. రావణుని పాపము బ్రద్దలైనది. శ్రీహరి అంశయగు శ్రీరాముని భార్య సీత నపహరించినాడు. పరమశివునంశయయిన హనుమంతుని తోకకు నిప్పంటించి చంపజూచినాడు. ఫలితము తనసర్వనాశనము.

రామాయణములో సుందర కాండకు మహత్తర ఖ్యాతి ఉన్నది. ఈ కాండను మంత్రశాస్త్రతుల్యముగనే పండితులు భావింతురు. సుందర కాండ కథకు నాయకుడు హనుమంతుడు. ఈ మహనీయుని గొప్పతనము గల సుందర కాండ వలననే రామాయణమున కంతటి ప్రాముఖ్యము వచ్చినదను మాట అత్యుక్తికాదు. ఈ కాండలోనే హనుమానుని విక్రమ సాహసములు, వివేకము, పరేంగిత జ్ఞానము ఎచ్చట యెట్లు విస్తరితములు కాగలవో అట్లయినవి.

మైరావణుడు

ఈ కథ సవిస్తరముగ పరాశర సంహిత 44వ పటలముననున్నది. మైరావణుడు రావణుని మేనమామ. పాతాళమున దానవరాజ్యాధిపతి. మహా బలవంతుడు, మాయల మారి. పాతాళ లంక ఆతని నివాసము.

రావణుని వధించుటకై వానరసేనతో శ్రీరాముడు లంకలో ప్రవేశించి సైన్యమునువ్యూహముగ నేర్పరచియుంచెను. ఇంతకుముందే శ్రీరాముని పరాక్రమము వినియున్న రావణుడు చింతా క్రాంతుడైయున్న విషయము నెఱిగి మైరావణుడాతనికడకేగి రావణా విచారింపకుము, నా మాయల వలనుండి దాటి రాముడైనను దేవుడైనను ఆవలకు పోలేడు. రామలక్షణుల నిర్వురిని బంధించి రేపే దుర్గకు బలియిచ్చెదము అని ధైర్యము చెప్పివెడలెను.

సుగ్రీవుడు వానరసైన్యాదిపతి రామలక్ష్మణులకు భద్రత కల్పించుట యాతని కర్తవ్యము. ఆ రాజకుమారులను సైన్యమధ్యమున నుంచి హనుమంతుని కావలియుంచి తనపని తాను చూచుకొనుచుండెను. ఆ రాత్రి గడవవలయును మఱునాడు రామరావణ యుద్ధమారంభమగును - హనుమంతుడు తనతోకను పెంచి వలయము నేర్పరచి ఒక ఉన్నత దుర్గమును రామలక్ష్మణుల కొరకై నిర్మించి తానడ్డుగనుండెను.

మైరావణునకిదియంతయు తెలిసినది. సూచీ ముఖుడను రాక్షసుని హనుమంతుడేర్పఱిచిన దుర్గములోనికి బోయి రామ లక్ష్మణుల నొకపెట్టెయందు బంధించి తీసికొనిరమ్మని పంపెను. హనుమంతుని వాలరోమములు తాకినంతనే అతని ముఖము చిల్లులుపడి రక్తసిక్తుడై వెనుదిరిగి తనకీపని అసాధ్యమని సూచీముఖుడు మైరావణునికి చెప్పినాడు. మరల వెంటనే మైరావణుని పంపున పాషాణముఖుడగు రాక్షసుడు వచ్చి తనతలతో వాలదుర్గమును బ్రద్దలు చేయజొచ్చి తన తలయే బ్రద్దలయి వెనుదిరిగినాడు.

సమయము మీరుచున్నది. మైరావణుడు స్వయముగ తానే విభీషణుని వేషమున నేగి హనుమకు నమస్కరించి "ఆంజనేయా! జాగ్రతగ నుండుము సుమా! రాక్షసులు మాయావులు రామలక్ష్మణుల కెట్లో అపాయము

చేయజూచెదరు. నేనొకసారి లోనికేగి రామలక్ష్మణులను చూచి వత్తును'' అనగనే హనుమ వాని మాటలు నమ్మి వానిని లోనికి పోనిచ్చెను. అదే తడవుగా ఆ దానవుడు లోనికి పోయి రామలక్ష్మణులను చిన్న బొమ్మలుగ చేసి పెట్టె యందు బెట్టి చంకను పెట్టుకొని, బయటకు వచ్చి ఏమియు తెలియని వానివలె ''హనుమా! రామలక్ష్మణులు సుఖనిద్రలో నున్నారు. జాగ్రత సుమా'' అని మఱియొకసారి హెచ్చరించి తన పాతాళమునకు పోయెను. రామలక్ష్మణులున్న పెట్టెనొక మూలను దాచి తన సోదరి దుర్దండియను నామెను కాపుంచి రేపు వీరిని గంగా స్నానము చేయించి దుర్గకు బలీయవలెను. జాగ్రత అని ఆమెకు ఆమె పుత్రునకు అప్పజెప్పెనం. రావంలక్ష్మణంలకు పూర్వ రూపవంులు వచ్చినవి వారెచ్చటనున్నదియు వారే గ్రహింపజాలక ఏ యపాయముచే బయటకు పోవలయునా అని ఆలోచించుచుండిరి. రామలక్ష్మణుల సుందర రూపమును చూచి అక్కటా యింత మోహనాకారులైన సుకుమారులకా, యీ నిర్బంధము అని దుఃఖించుచు హారి సెట్లైన రక్షించుటకు దుర్దండి ఆలోచించుచుండెను. కాని తానేమియు చేయజాలదు. మైరావణునిచే తానును అచటనే బంధింపబడి యున్నది.

మైరావణుడు డటు వెళ్ళినాడు, ఇటనుండి నిజమైన విభీషణుడు వచ్చి ''హనుమా రామలక్ష్మణులు క్షేమముగా నున్నారు గదా! రమ్ములోనికి పోయి చూతము.'' వారికొక యుద్ధరహస్యము చెప్పవలెను, అనగనే ఆంజనేయుడు విహ్వాలుడై ''విభీషణా యిప్పుడే గదా చూచి వచ్చితివి మరల ఈ వచ్చుటేమి నాకంతయు చిత్రముగనున్నదే'' అనగా విభీషణుడును కళవళపడి హనుమా? నేనిచ్చటకు రాలేదు, ఇదియేదో మాయావులలో అగ్రగణ్యుడైన మైరావణుని మాయ కావలయునని చెప్పి త్వరగా హనుమంతుని తీసికొని లోనికేగెను. రామలక్ష్మణులు లేరు.

విభీషణుడు జరిగినదంతయు గ్రహించినాడు ''ఆలస్యమునకు తావు లేదు. మైరావణుని రహస్యములు తానెఱిగినవాడుగాన హనుమంతుని తీసికొని ఆ రాక్షసుని నివాసము జొచ్చితిన్నగా రామలక్ష్మణులు బంధింప బడిన గదియొద్దకు వచ్చి అచట కావలియున్న దుర్దండికి భయము లేదని చెప్పు నంతలో ఆ సందడి గ్రహించి మైరావణడెదురై తనపైకి వచ్చిన యుపద్రవమును గ్రహించి

భీకరాకృతితో లేచి, వారిపై బడబోయెను. హనుమంతు డంతకంటెను భయంకరాకారుడై ఆతడు కదలుటకు కూడ వీలు లేకుండ తోకతో కట్టిపెట్టి క్రిందపడగొట్టి మైరావణుని ప్రాణములున్న వక్ష స్థలమున పర్వత శిలవంటి తన పిడికిలులతో పొడిచి పాదములతో నలగత్రొక్కి నిశ్చేష్టుని చేసెను. హనుమానుడు వెంటనే రామలక్ష్మణులు బంధింప బడియున్న గదికవాటములు బ్రద్దలుకొట్టి దానవ సైన్యములడ్డు రాకుండ ప్రక్క దారిని ఆ సోదరుల నిరువురిని తన బుజముల యందెక్కించుకొని యథా పూర్వస్థానమున జేర్చి కావలియుడెను. తెల్లవారు సరికి ఈ కథయంతయు సుగ్రీవాదులకు తెలిసి విభ్రాంతులై తమతమ కార్య కలాపములలో పదింతలు జాగ్రత పాటింపసాగిరి.

ఆంజనేయుని బలసాహసములవలన రామలక్ష్మణులు క్షేమముగ నుండిరని వానరసైన్యమంతయు ఆ అంజనాతనయుని వేనోళ్ళ ప్రస్తుతించిరి.

హనుమత్పురము

పరాశర సంహిత - 42-43 పటలములు

మేరు పర్వతమునకు దక్షిణమున పదియోజనములు విస్తీర్ణము కల గ్రామంమొకటి కలదు. ఆ గ్రామంము సర్వవేళల సర్వసంపన్నమై ఆ గ్రామవాసులకెవ్వరికిని ఏ విధముగ లోపములేని రీతిగా విలసిల్లు చుండెను. ఆ గ్రామవాసులు వివిధ వర్ణముల వారు వారి వారి వృత్తులొనర్చుకొనుచు అన్యోన్య శ్రేయోభిలాషులై కలిసిమెలసి మెలగుచు భగవత్ చింతన తోడను భగవత్పూజలతోడను కాలము గడపుచుండిరి. ఆ గ్రామమునకు సంపూర్ణమైన జలసౌకర్యము కలదు. చుట్టు ప్రక్కల వనముల నుండి కూరగాయలు లభించును. కేదారములు సస్య సంపదనిడును. గో వృషభాది పశు సంపద వలన పాడి పంటకు లోటు లేదు. ఆ పురవాసులు ధనధాన్య సమృద్ధితో నుండిరి.

రావణ వధానంతరము అయోధ్యలో శ్రీరామ చంద్రుడు సామ్రాజ్య పట్టాభిషిక్తుడై కోసల రాజ్యము నేలుచుండెను. హనుమంతుడు శ్రీరాముని కొలువు నందుండి నిరంతర రామ సేవాతత్పరుడై యుండెను. సీతా సమేతుడై శ్రీరామునకు మనసులో నేదో తలపునకు వచ్చిన సమయమున హనుమంతుని పిలచెను. ఆ వానర శ్రేష్ఠుడును వచ్చి సీతారాములకు ప్రణామము లొనర్చి నిలచియుండగా శ్రీరాముడతనిని చిరునవ్వుతో జూచి, ఆంజనేయా నీవు మాకు మొదటినుండియు చేసిన యుపకారములను మేము విస్మరింపజాలము. కృతజ్ఞతతో నీకేదియైన వరమీయవలెనని యున్నది కోరుకొమ్మని ప్రసన్నుడై పలికెను. "శ్రీరామచంద్రా నీవు పరమపురుషుడవు. మీ సేవయే నాకు పరమ భాగ్యము". అని ఆంజనేయుడు మిన్నకుండగా శ్రీరాముడు చిరునవ్వు నవ్వుచూ, అట్లు కాదు హనుమా, మేరు గిరికి దక్షిణమున శాంతి సంపదలతో నలరారుచు ఒక చక్కని గ్రామమున్నది. దానికి హనుమత్పురమని నామమిడి నీకు ఇచ్చుచున్నాను స్వీకరింపుము. అచటి జనులెల్లరు హనుమ ద్భక్తులై మనెదరు. నీ పేరు ప్రతిష్ఠలు జగమున చిరకాలము వర్థిల్లగలవు"!! అని శ్రీరాముడు నుడివెను. రామాజ్ఞ ఆంజనేయునికి శిరోధార్యము - మహాభాగ్యమనుకొని అంగీకరించి శ్రీరామునుండి సెలవుగైకొని అచటికేగెను.

ఆంజనేయుడా గ్రామమున కధిపతియే. కాని ఆయనకేమికావలెను, అటనున్న బ్రాహ్మణులను పిలిచి మీరిచట మీమీ కుటుంబములతో సుఖముగా నుండుడు అని దీవించి ఆ గ్రామమును వారికి దానము చేసెను. ఆ బ్రాహ్మణులెల్లరు పవిత్ర వర్తనులు, నీతి నియమము లెఱిగిన దైవ చింతనులు. వారెల్లరు హనుమంతుని ఔదార్యమును మెచ్చి కృతజ్ఞతగ హనుమన్మందిరముల నిర్మించి భక్తితో పూజించుచుండిరి. హనుమత్పురము మఱింత శోభతో సంపదలతో సమృద్ధమై విరాజిల్లుచున్నది.

ఆ పరిసరముల నున్న దుర్ముఖుడను రాక్షసునకు ఆ నగర భాగ్యము చూచి కన్నుగుట్టినది. ఒకనాడకస్మాత్తుగ తనసైన్యముతో వచ్చి, పురవాసుల నెల్లపిలిచి ఈ రాజ్యమునాది. మీరిట నుండుటకు వీలులేదు. తక్షణమే వెడలి పొండని గర్జించెను. ఆ రాక్షసుని బెదిరింపులకు వారెల్లరు భయపడి'' అయ్యా మేమిట ఎంతో కాలము నుండి నివసించుచుంటిమి. హనుమత్పూజ తప్ప మాకు అన్య విషయములతో పనిలేదు. మీకపచారము నేమేమియు చేయలేదు-మమ్ములను వదలుడని వేడిరి. ''వీలు లేదు పో పొండని ఆ దుండగుడు మీదబడుచుండగా ఆ బ్రాహ్మణులందరు మాకొకరెండు దినములు సమయమీయుడు అని వేడుకొనిరి. ఆ రాక్షసుడంగీకరించెను.

ఆ పురవాసులతి భక్తి శ్రద్ధలతో హనుమంతునారాధించుచు మమ్ము రక్షింపుము దేవా! అని ప్రార్థించుచునే ఉండిరి. ఆ రాత్రి ఒక బ్రాహ్మణుని స్వప్నమున ఆంజనేయుడు కనబడి ''ఈ భూమి యెవరిరాజ్యమును కాదు. మాంధాత మొదలైన మహాచక్రవర్తులు వారి సామ్రాజ్యములు తమతో తీసికొని పోయిరా? మీగ్రామమందు మీరుండుడు. ఈ మాట దుర్ముఖునికి నుడువుడు'' అని, దానవసేనయున్న ప్రదేశమందు భీకరాకారముతో చుట్టును తిరిగి పర్వతము పైపునకేగెను. మఱునాడు పురవాసులు దుర్ముఖుని వద్దకేగి ఆంజనేయుని మాటలు తెలియజేయునంతలో రాక్షస సైన్యనాయకుడేగు దెంచి ''స్వామీ! మహాకాయుడెవడో తాళప్రమాణమున భయంకరముగ నున్నవాడు మన సైన్యము చుట్టును తిరిగి పర్వతములపైపేగెను. మాకు భయముగానున్నది. ఆతడా బండరాళ్ళను మాపై విసరెనా మేము అంతముకావలసినదే. అని చెప్పిరి.

వారును వీరును చెప్పిన మాటలు దుర్ముఖుని నెత్తికెక్కినవి. కొంత ఆలోచనలో పడి, తాను అకారణముగ గ్రామవాసులను తరిమివేయ జూచితిని అని తనలో తాననుకొని బ్రాహ్మణులవద్దకేగి నమస్కరించి మీరందరును సత్ప్రవర్తనులు మీకేభయమును లేదు మీ గ్రామమున మీరుండుడని నుడివి వారికి బహుమానములొసగి వెడలెను.

ఇది యంతయు శ్రీ ఆంజనేయుని కృపయే; ఆంజనేయుని పూజించు గ్రామములన్నిటికి ఆ స్వామి కృప యుండగలదను ధైర్యముతో ఆ పురవాసులు తమ పూజను నిర్విఘ్నముగ కొనసాగించిరి.

దేశమున ప్రతి గ్రామమున ఆంజనేయుని విగ్రహములు వెలసినవి మందిరములు నిర్మింపబడినవి. సర్వ రక్షకుడై ఆ స్వామి ప్రజల పూజలందు కొనుచున్నాడు.

హనుమంతుని ప్రవర్తనము బలసాహసములు

ఇటు తల్లివైపు నుండి, అటు తండ్రివైపు నుండియు దివ్యాంశ సంభూతుడాహనుమానుడు. దానికి తోడు తనకుగల సహజసక్తి వలన మహా విద్వాంసుడు మేధావి, సచ్చరిత్రుడునై విలసిల్లెను. పుట్టుకతోడనే మహా బలుడయి జన్మించినాడు. ఈ సద్గుణముల కన్నిటికి మకుటాయమానముగ విష్ణ్వవ తారమగు శ్రీరామ చంద్రుని సాన్నిధ్యము లభించినది. మేలిమి పసిడికి తీయని తావి అబ్బినట్లు ఆంజనేయుని జీవితము ప్రకాశించినది.

ఒక వ్యక్తి యొక్క గొప్పతనమాతని ప్రవర్తనమువల్లనే లోకులకు విశదమగును. ఆంజనేయుని చరిత్రము స్వచ్ఛకీర్తి విరాజితము - ఎన్ని మార్లు తిరుగవేసి చూచినను ఒకమచ్చయును కానరాదు. అగ్నిపర్వతము కూడ సామాన్య పర్వతమువలెనే కనుపించును కాని, ఒకొక్క సమయమున మహాజ్వాలలు వెలిగ్రక్కి లోకభయంకరమగును. సహజముగ సాధువర్తనుడయ్యు హనుమానుడు సమయానుకూలముగ మహాభీకర రూపమును దాల్చి అనన్య సాధ్యమగు పనులు నెరవేర్చినాడు.

పసితనమందే, బాల భానుడొక పండని భావించి దానిని పట్టి మ్రింగుటకు ఆకసమున కెగిరి, బ్రహ్మేంద్రాదులు మెచ్చిన జగదేక జవసత్వ సంపన్నుడయినాడు. ఇంద్రుని వజ్రాయుధ మాతని హనువు (చెక్కిలి) నకు తాకి వెనుకకు వెడలినది గాని మరేమియు చేయలేక పోయినది. తన శక్తి తానే యెఱుగడు ఎఱిగినను అతిశయ మణుమాత్రమును లేదు. అహంకారమును ఎఱుగనే యెఱుగడు. వేద శాస్త్ర విద్యకు వినయము తోడైన విశిష్టవ్యక్తిత్వమది.

హనుమానుడు తానెంత శక్తిమంతుడైనను అనుచరుడైన మంత్రి గనే వానర వీరుడగు సుగ్రీవుని కొలువుచేరినాడు. అన్నయగు వాలి, తన తమ్ముడగు సుగ్రీవుని బయటకు గెంటి అతని భార్య రుమను కైవశముచేసికొనినాడు. వాలి వలన భయము సుగ్రీవునకు పోలేదు. రావణాపహృతయయిన సీతకై వెదకుచు రామలక్ష్మణులు సుగ్రీవుడున్న పంపా సరోవర ప్రదేశ సమీపమునకు వచ్చినారు. ధనుర్ధారులు మహాతేజస్కులయిన యా వీరులను జూచి తనను చంపుటకు వాలి పంపిన వారేమోనని సుగ్రీవుడు వారిని గూర్చి తెలిసి కొనుటకు మఱెవ్వరిని

పంపలేదు. హనుమంతునే పంపెను. ప్రథమ దర్శనముననే శ్రీరాముడు పరమాత్మస్వరూపుడని హనుమ గ్రహించి ఎంతో వినయముగ వారిని జేరి, వారి రాకకు కారణమెఱిగి సుగ్రీవుడేదైన సాయము తప్పకచేయునని చెప్పి, తన భుజస్కంధముల మీదనే మోసి కొనిపోయి వారిని సుగ్రీవునికడజేర్చినాడు.

రామ సుగ్రీవులకు అగ్ని సాక్షిగా మైత్రి అయినది. రామునితో మైత్రి ద్వారా సుగ్రీవునకు వాలి భయమణగి కిష్కింధారాజ్యము లభించినది. సుగ్రీవుని వలన రామునకు సీతాన్వేషణలో సహాయము వచ్చినది. ఈ మైత్రికి కారకుడు హనుమంతుడే.

శ్రీరాముని జూచిన నిముసము నుండియు ఆ మహనీయునకు తాను దాసుడుగనే ప్రవర్తించినాడు; ప్రవర్తించుటే కాదు ఎన్నియో సార్లు ఆ విషయమును చెప్పి నాడుగూడ ఇది హనుమంతుని వినయమునకు నిదర్శనము. హనుమానుని భుజములపైననే రామాయణకథ నిల్చిన దనుటలో అత్యుక్తి లేదు. అందువలననే "రామాయణ మహామాలారత్నం వందే ఉనిలాత్మజం" అనిన పొగడ్త వచ్చినది.

సుగ్రీవుడు రఘువంశమూలపురుషుడగు సూర్యుని కుమారుడు. ఆ కపివీరుని చరిత రాముడు వినియున్న విషయమే. హనుమను చూచి ఆతని సంభాషణను వినిన రామునకిట్లనిపించినది. "లక్ష్మణా! అంతటి కపి వీరుడు సుగ్రీవునకు మంత్రి అయిన ఈ హనుమ యెంతటి వాడు కావలెను. సకల వేదములెఱిగిన వాడు గాని యితనివలె సంభాషించలేడు. మాటలందొక అపశబ్దమును లేదు.

వానృగ్వేద వినీతస్య నాయజుర్వేద ధారిణః!
నాసామవేద విదుషః శక్యమేవం ప్రభాషితుమ్॥
నూనంవ్యాకరణం కృత్స్నం అనేక బహుధాశ్రుతమ్
బహు వ్యాహరతానేన నకించిదపశబ్దితమ్॥ కిష్కింధ సర్గ

హనుమానుడు రామలక్ష్మణులను సుగ్రీవునకిట్లు పరిచయమొనర్చెను

అయంరామో మహాప్రాజ్ఞః సంప్రాప్తోదృఢ విక్రమః!
లక్ష్మణేన సహభ్రాతారామోయం సత్య విక్రమః
ఇక్ష్వాకూణాం కులేజాతో రామోదశరథాత్మజః!! కిష్కింధ సర్గ 5

హనుమానుడు భవిష్యత్తు ఊహించినాడు. వీరిరువురును వాలి మనపైకి పంపిన వారు కాదు, వారిపనిలో వారుందురు మనకేమిలే అని ఊరకున్నచో తదుపరి కథే లేదు. వారిని సుగ్రీవు నొద్దకు గొంపోయి చేయవలసిన సాయమంతయును చేసినారు.

సీతాన్వేషణమునకును, సముద్రమును లంఘించి, రాక్షసుల లంకలో జానకిని జూచి ఆనవాలుగా తన యంగుళీయక మిచ్చుటకు రామునకు గన్పడిన అర్హుడు హనుమయే. అంగద నాయకత్వమున వానరులందరు సముద్రతీరము చేరినారు సముద్రమును దాటి రక్షోరక్షితమయిన లంకలో ప్రవేశించి సీతను జూచి రావలెను. ఒకరిమొగమొకరు చూచుకొనుచున్నారు. హనుమ తన సామర్థ్యము తానెఱుగడు. ఎఱిగినను అతిశయముతో జబ్బలు చఱచుకొని గంతులువెట్టడు. "హనుమాలెమ్ము యీ పనికి నీవే సమర్థుడవు. మనము వచ్చిన కార్యమును నీవే నిర్వహింపవలెను" అని జాంబవంతుడనువరకు హనుమంతుడు కదలనే లేదు. సముద్ర లంఘనమున కుద్యుక్తుడైనాడు. దేహమును పెంచి ఒడ్డున నున్న మహేంద్ర గిరిపై నిలుచుని పాదములు దట్టించి పైకి లేచుసరికి హనుమంతుని శక్తి కాపర్వతము కదలాడినది. వృక్షములు కూలినవి. అచ్చటివారు నలు ప్రక్కలకు పారిపోయిరి. అతడు ఈ యత్నమున చేసిన మొదటి పని పంచ భూతములను ఇతర దైవతములను స్తుతించుట. తనకు దీవెన లిమ్మని తన తల్లి దండ్రులను, సీతారాములను స్తుతించినాడు. ఎంత వివేకభావుకత ఇది!

ఆకాశపథమున బడి హనుమంతుడు సముద్రమును దాటునపుడు మైనాకుడు అను పర్వతుడు చూచి "హనుమంతా ఒకింత సేపు నావద్ద విశ్రాంతి తీసికొనుమని" ఆహ్వానింపగా హనుమ "మీ యాతిథ్యమునకు కృతజ్ఞుడను. నేపోవునది రామకార్యము. విలంబనము తగదు" అని శరవేగమున వెడలెనేకాని తన శరీర సౌఖ్యమును లెక్కచేయలేదు. ఆద్యంతము హనుమంతుని కర్తవ్య నిర్వహణ భావము, దక్షతయు అట్టివి.

దేవతలు గంధర్వాది ఖేచరులు క్రూరదానవ విధ్వంసమున కవతరించిన రామ చంద్రుని కథా క్రమమునకు సంతోషించినారు. కథ మంచి పట్టులోనికి వచ్చినది. హనుమానుని శక్తిని పరీక్షించుటకు వారు నాగమాత సురసను ప్రేరేపించి

"త్వంముహూర్తం విఘ్నమాచర" అని పంపినారు. ఆమె సూర్య మండల తేజస్వినియై నోరు తెఱచి, నానోటిలోనికిరమ్ము, నిన్ను మ్రింగెదనన్నది. ఈ విచిత్రము గ్రహించిన హనుమ సూక్ష్మ రూపమున ఆమె నోటిలోనికి దుమికి నోరు మూయకముందే క్షణములో బయటకు వచ్చి నీ మాట చెల్లించితిని గదా ఇకనేను పోవలయును. అని యుక్తిగా ఆమె చిక్కు తప్పించుకొనినాడు. అతని యుక్తికి దేవతలు మెచ్చి దీవెనలిడిరి. రామ బాణము వలె సముద్రమును దాటి సాయంతనమగుసరికి లంకాతీరము చేరినాడు.

ఒక కాలిత్రొక్కుతో మహేంద్రగిరి అదరి అణగిపోయినది. దారిలో సముద్రమున అడ్డుదగిలిన సింహిక, ఆటలు సాగలేదు ఒక్క ముష్టిఘాతముతో యమసదనమున కరిగినది. లంకాద్వారమునకు అడ్డుగ నిలిచిన లంఖిణిని చంపి, నిర్భయముగ కామరూపి అయి ఇతరులకు కనుపడకుండ, లంకలో ప్రవేశించి హనుమానుడు సీతకై వెదకుచున్నాడు ఈ మహాశక్తి సామర్థ్యములు దేవతలకు అద్భుతాశ్చర్యములుగా కన్పట్టినవి.

లంకానగరమున సీతా దర్శనము

రామ కార్యమున హనుమంతుడింతదనుక చేసిన దంతయు ఒకయెత్తు. లంకలో సాధించినది దానికి పదింతలైన బృహత్కార్యము. తాను దిగినది శత్రుదేశము. అచటి వారు క్రూరులు, మాయల మారులు, నరమాంస భక్షకులు సీతనింకను బ్రతుకనిత్తురా. బ్రతికినను, ఆమె యెట్లుండునో తాను చూడలేదు. రామనామ ధ్యానమగ్నయగు ఒక పవిత్రయోగినీ సదృశమగు జ్యోతిర్మూర్తిని మాత్రము తానూహించుకొనుచు లంకలో వాడవాడలా వెదకుచున్నాడు. ఎచ్చటను కనుపడలేదు. రావణాంతఃపురమున ఆతని భార్య మండోదరిని చూచి సీత అనుకొనెను. మరల వెంటనే జానకి ఇచ్చట నుండుట అసంభవము ఆమె సీత కాదు అనితోచినది. సీత జాడ కనుగొనకుండ తాను వెనుకకు వెళ్ళలేడు, వెళ్ళడు కూడ.

లంకను నాలుగు మూలల వెదకినాడు. పిల్లియో పిపీలికయో అయి వాడవాడల, ఇల్లిల్లును వెదకినాడు. ఆహర్మ్యములు, ఆ విహారప్రదేశములు! లంకాపట్టణము దేవేంద్రుని అమరావతి పట్టణమును మించిన సుందర నగరము ఈ సౌందర్యమంతయు రావణాది రాక్షసుల కామ వాంఛాతృప్తి కొరకేనని హనుమ కాశ్చర్యమైనది. రావణుని సౌధ సముదాయ మందున్న స్త్రీలనందరిని సీత అందున్న దేమోనని చూచినాడు. పరస్త్రీని కన్నెత్తి పరికించని జితేంద్రియు డాహనుమానుడు. తన కట్టి తలపులేదు, తాను చూచినది సీతాన్వేషణకొరకేనని తనలో తానే సంతృప్తి పడినాడు. స్త్రీలను స్త్రీల మధ్యలోనే కదా వెదుకవలెను.

"నా అన్యత్ర హి మయాశక్యా వైదేహీపరిమార్గితుం!
స్త్రియోహిస్త్రీషుదృశ్యంతే సదాసంపరిమార్గిణే॥

ఈ యన్వేషణమొక మహాసాధనము. ఎందులకు? ఒక కామాంధ పిశాచ దుష్కృత్యమువలన విడిపోయిన ప్రకృత్యంశ పరమాత్మలగు సీతా రాముల కలయిక కొరకే.

ఎట్టకేలకు హనుమ పురబహిః ప్రదేశమున నున్న అశోకవనమున కూడ వెదకుచు ఒక చెట్టు క్రింద రాక్షస స్త్రీల తర్జన భర్జనల మధ్య రామధ్యానములో అశ్రుసిక్తాననయై ఉన్న అబలను జూచి ఆమె యే సీతయని ధ్రువపరచుకొని,

ఒకనిముసమాలోచించుకొనెను. తాను వచ్చిన కార్యము నెట్టులామెకు తెలుపవలెను, ఏ భాషలో మాటలాడ వలెను, ఎప్పుడు మాట్లాడవలెను ఇవన్నియు హనుమంతునకు సమస్యలే. ఈ లోపున బహుపటాటోపముతో రావణుడేగుదెంచి నానా దుర్భాషలాడుచు సీతా! నన్ను అంగీకరింపుము, నేను త్రిలోకాధిపతిని. నా దానివి అగుచో త్రిలోక భాగ్యములు నీకు కల్పించెదను. లేదా రెండు మాసములలో నిన్ను నరికి ముక్కలు చేయించెదను" అని బెదిరించి యేగెను. సీత తానేమి చేయగలదు. పులులకు చిక్కిన లేడివలె దుఃఖించుచుండెను. ఇదంతయు హనుమంతుడు చెట్టుపైనుండి చూచుచునే యుండెను. ఒక మహా సాధ్వియగు, లక్ష్మీ స్వరూపముపై ఒక నీచ రాక్షసుడిట్లు ప్రేలునా? హనుమంతునకు ఒడలు మండినది. అచ్చటనే రావణుని పైకురికి మట్టుపెట్టదలచెను కాని, రామునననుజ్ఞలేక ఓరిమి పట్టినాడు. రావణుడేగినాడు. కానలియున్న రాక్షస వనితలు నిద్ర మత్తులో నున్నారు.

ఇది మంచి సమయమని తలచి, ఆలోచించి ఆలోచించి చెట్టుపై నుండియే మానవ భాషలో రఘువంశమును కీర్తించుచు మెల్లగా దిగివచ్చి హనుమానుడు శిరమువాల్చి సీతకు నమస్కరించి, తనపేరు చెప్పి తాను రాముని దూతనని నుడివి రామలక్ష్మణుల క్షేమమును దెల్పి సీతకు ప్రణతులర్పించెను. ఒక వానరుడు ఆకస్మికముగా చెట్టు నుండి దిగి, తల్లీ నేను రామదూతను అని ఏవేవో మాటలు చెప్పగనే సీతనమ్మునా; ఒకసారి మోసపోయినది. హనుమంతుని మాటలు జానకి నమ్మలేదు. కోతి సముద్రమును దాటుటెట్లు, శ్రీరాముడు దూతను పంపించునెడల కోతియే కావలెనా, వీడెవడో మరల మాయల మారి రక్కసియని సీత ఆతని వంకకే చూడలేదు.

హనుమంతుడంతట జానకిని జూచి "అమ్మా, ఇదిగో నా ప్రభువంపిన ఆనవాలు నీయెడబాటు రామునికెంతో కలత కల్గించినది. నిన్నే తలచుచు అన్నమైన ముట్టడు. నిద్రలేనేలేదు. కపిరాజు సుగ్రీవునితో చెలిమి చేసి వానరసేనతో రావణుని అంతమొందించుటకు రానున్నాడు. హనుమంతుని ఈ మాటలు సీతకు కొంత నమ్మకము కలిగించినవి. రాముని అంగుళీయకము తనకు గురుతే. తన వివాహ సమయమున తన తండ్రి జనకుడు శ్రీరాముని కిచ్చిన కాన్క అది. ఏవేవో

మధురస్మృతులొక్కమారుగ మనసున కదిలినవి. ఆ అంగుళీయమును గ్రహించి కనుల కద్దుకొని జానకి "ఓయీ వానర వర్యా! నీ మాటలు సరియే, వానరసేన వార్ధిని దాటుటెట్లు, రావణుని గడువులోపల శ్రీరామ చంద్రుడు లంకను జేరి ఈ దానవుని వధించి నన్ను తీసికొని పోగలడా" అని సందియములు నుడువగానే హనుమంతుడు "అమ్మా నీకిక భయమక్కరలేదు. సుగ్రీవుని సేవలో పర్వతములు బ్రద్దలుచేసి తీసికొని రాగల మహాబలులున్నారు. ఏ ఊళ్ళతోనో సాగరమును బంధించి వారధి నిర్మించి, లంకను చేరగలరు. శ్రీరామచంద్రుడు వీరనారాయణుడు. ధనువు సారించి నిలిచెనా వారిముందు లోకములాగవు. లక్ష్మణ స్వామియు అంతటి వాడే. ఇంకను సమయము మించి ఆవశ్యకమైనచో ఈ లంకనంతయు నేనే పెళ్ళగించి శ్రీరాముని ముందుపెట్టెదను. రావణుని మాటలకు భయపడకుము అతని అంతము సమీపించినది" అని ఆకసమంత ఎత్తున భీకరాకారుడై దేహమును పెంచి తన శక్తి చూపినాడు. సీతకు మొగము విచ్చినది; హనుమంతుని శక్తి సామర్థ్యములకు అబ్బురపడినది. హనుమా! నేను మరల శ్రీరామ చంద్రుని చూడగల్గుటకు "త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణమ్" సమర్థం ప్రాజ్ఞత్వం నీవు సమర్థుడవు ప్రజ్ఞా శాలివి. నీవే నయ్యా, సహాయము చేయగలవు అని నుడివి తనచూడామణిని శ్రీరాముని కానవాలుగనిచ్చి దీవించి పంపినది.

ఈ సీతా దర్శన ఘట్టము యావత్తు హనుమంతుని కార్యనిర్వహణదక్షత, వాక్చమత్కృతి, నిశితమైన బుద్ధి, నిశ్చయముగల వివేకమునకు తార్కాణము. ఇక లంకలో హనుమంతుని ఇతర కార్యములును ఇంతటివే.

రావణుని కొలువు - లంకా దహనము

జానకి నుండి మరల హనుమానుడు తిరుగు ప్రయాణమైనాడు. సీతను జూచిన ఆనందాతిరేకములో అశోకవన వృక్షములను, తోరణ స్తంభములను విరిచి ప్రోగులు బెట్టి అడ్డుదగిలిన కాపలి వాండ్రను తరిమి కొట్టినాడు. ఆంజనేయుని ఆగడములు ఊరెల్ల ప్రాకినవి. తన మీదకు వచ్చిన సైనికులు యోధులు మంత్రికుమారులు సేనా నాయకులు హనుమానుని ధాటికి సగము చచ్చిరి సగము పరువులెత్తిరి. రావణుని గుండెలు గుండెలలో లేవు. తనకుమారుడు మహాబలుడు అక్షయుని బంపినాడు. అతడును హనుమంతుని చేతులలో మరణించినాడు. తుదకు మాయలమారి ఇంద్రజిత్తునే పంపినాడు. హనుమానుని బలము ఇంద్రజిత్తు గ్రహించి బ్రహ్మాస్త్రమును ప్రయోగించినాడు. హనుమానుడు బ్రహ్మాస్త్రమును గౌరవించి, లొంగినట్లు నటింపగా అతనిని త్రాళులతో కట్టి రావణుని కొలువున కీడ్చినారు. రావణుని సభా భవనము దేవేంద్రుని సభావైభవమును మించి యున్నది. హనుమను చూచిన రావణునికి మహాగ్రహము కలిగినది. ఇతడా ఇంతచేసినవాడు. ఇతడు ఇంద్రుడో బాణుడో మరేదియో అని రావణుని కొక భీతికలిగినది. హనుమంతుడు రావణుని జూచి నేనెవడను కాదు "నేను వాయుపుత్రుడను. రామదూతను. సీతను జూచివచ్చితిని. నిన్ను తోకతో జుట్టి చతుస్సముద్రముల ముంచిన వాలి తమ్ముడు సుగ్రీవుని మంత్రిని. అని రావణుని సందియమునకు హనుమ సమాధానమిచ్చినాడు.

"దాసో ఉహం కోస లేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః" శ్లో - 3-4

తానెంత వాడయినను శ్రీరాముని మాట వచ్చుసరికి తాను శ్రీరామునికి దాసుడననియే చెప్పుకొనినాడు హనుమానుని లోని విశిష్టత ఇది.

రావణుడు త్రిలోక విజేత. దానవ రాజ్య సార్వభౌముడు. హనుమానుడంతకు మించినవాడు. ధిక్కరించి యిట్లు మాట్లాడినాడు. "రావణా నేనెవరినో చెప్పితిని. ఇక నే వచించు మాటలను వినుము. నీకున్న ఈ వైభవమెల్ల పరకాంతల నపహరించి బాధించుటకా, మహనీయుడగు శ్రీరాముని భార్య నపహరించి మహాపాపము చేసినావు. వెంటనే బుద్ధి తెచ్చుకొని ఆ మహాత్ముని

పాదములపైబడి శరణువేడి సీతనర్పించుము. శ్రీరాముడు కరుణాళుడు నిన్ను క్షమించును; లేదా సుగ్రీవ జాంబవదాది వానరసేనతో సముద్రమును దాటి లంకను చుట్టుముట్టి నిన్ను సపరివారముగా ధ్వంసము చేయును" తననిండుకొలువులో తన మంత్రి సామంతులముందు, ఎవడీతడిట్లు ధిక్కరించును, రావణుని కొడలుమండినది. ఈ కోతిని చంపుడని సైనికులకాజ్ఞ యిచ్చినాడు. రావణుని తమ్ముడు విభీషణుడు, అడ్డుపడి, దూతయైవచ్చిన వానిని చంపరాదు. అతని ప్రవర్తన మంచిదికానిచో శిక్షింపుమనెను. రాక్షసేంద్రుని కోపము కొంత తగ్గినది. ఈ కోతి తోకకు నిప్పుముట్టించి ఈడ్చి పారవేయుడని మరల ఆజ్ఞ. విన్నదే తడవు సైనికులు వచ్చి హనుమ తోకకు గుడ్డలు చుట్టినారు, తైలముతో తడిపి మండుచున్న కొరవితో నిప్పు ముట్టించినారు. బయటకీడ్చి వదలినారు.

హనుమంతునకు స్వేచ్ఛలభించినది. పైకెగసి నింగినుండి లంకా నగరమంతయు చూచినాడు. ఎచటికేగునో ఏమి చేయునో దృష్టికి గోచరింపడు. మహా వేగమున అవార్య ఆగ్నేయాస్త్రమువలె విహరించి వాడవాడల నిప్పంటించినాడు. రావణుని కనులముందు అమరావతిని మించు తన లంకామహా నగరము ఒక కోతివలన సర్వముధ్వంసమైనది. ఇక శ్రీరాముడేతెంచి ఏ విపత్తు తెచ్చునో. రావణుడు చీమ చిటుకన్నను భయముతో వణకిపోవుచున్నాడు. హనుమంతునకొక పెద్ద సందేహమే వచ్చినది. లంకలో అంతయు మంటలు లేచినవి. తన క్రోధమువలన గదా అందమైన లంక దగ్ధమైనది. ఎవరికెట్టి బాధ కలిగినదో అని హనుమ చింతించెను ఎంతవిశాల హృదయుడు కాకపోయిన శత్రువులయిన వారిని గూర్చి అట్లు భావించగలడు. అయ్యో జానకి ఏమైనదోనని. వినతుడై వెళ్ళి చూచినాడు అగ్ని హోత్రుడామె సమీపమునకే చేరకుండుట గమనించి అగ్ని దేవునకు కృతజ్ఞతలతో నమస్సులర్పించినాడు.

సంతోషముతో వెనుదిరిగి సముద్ర జలములందు తోకనార్పి ఆవలిగట్టు జేరి అంగదాది వానరులను కలిసి కిష్కింధ జేరి శ్రీరాముని ముందు వ్రాలినాడు వ్రాలుటే ఆలస్యము "చూచాను సీతను".

"దృష్టా మయాసీతా.... రాక్షసీమధ్యే ..... చింతాపరాయణా"

అని ఒక్కమాటలో చెప్పినాడు. ఎంత వివేకం! హనుమానుని తిరుగు రాకకై

వేయికన్నులతో చూచుచు క్షణము యుగాలుగా గడపు రామ చంద్రునకు తాను రాముని ముందు ప్రణమిల్లుచూ తన దౌత్యసారాంశం ఈ ఒక్కమాటలో చెప్పిన హనుమ మేధాశక్తి అద్వితీయము ఊహాతీతము.

హనుమంతుడు తానులంకలో కనినది, వినినది, చేసినది; లంకా దుర్గముయొక్క రహస్యమార్గములు తాను చూచినవి గ్రహించినవి సర్వము శ్రీరామునకు విశదముగా నుడివి ఆ ప్రభువు తనను ఎందులకు దూతగా పంపినాడో అంతకన్న పదిరెట్లు నేర్పుతో తనపనిని ఆ కపివీరుడు నెరవేర్చి వచ్చినాడు. శ్రీరామచంద్రునికి కనులు చెమ్మగిల్లినవి. వికసిత వదనుడై ఆంజనేయుని మనసార కౌగిలించుకొని యిట్లనినాడు.

ఏషసర్వ భూతస్తు పరిష్వంగో హనూమతః!
మయాకాలమియం ప్రాప్య దత్తస్తస్య హనూమతః!!

ఇది యెంతటి మాట శ్రీరాముని రూపములో నున్న పరమాత్మయే "హనుమా నీవు పురుషోత్తముడవే. నీవు చేసిన మహోపకృతికి ఈ పరిష్వంగములో నన్ను నీకు సమర్పించుకొనుచుంటిని. "అని గౌరవించినాడు ఆ యిరువురి అన్యోన్య పరిష్వంగములో హరిహరాత్మకమైన తేజస్సు ఒకే కాంతిగా వెలిగిన దచట. మఱొకమాట కూడ రాముడనినాడు.

ఏకైక స్యోపకారస్య ప్రాణాన్ దాస్యామి తేకపే।
శేషస్యా హోప కారాణాం భవామ ఋణి నోవయమ్॥

"హనుమా! సీతా సందర్శన వార్త దెచ్చిన ఒక్క ఉపకారమునకే నా ప్రాణము సర్వస్వమునిచ్చినను సరిపోదు. తక్కిన నీ ఉపకారములకు శాశ్వతముగా నేను నీకు ఋణపడి ఉండవలసిన వాడినే" శ్రీరామునంతటి వానిచే యిట్లు ప్రశంసింపబడిన హనుమంతుడు ఎంతటి వాడు కావలెను.

ఆంజనేయుడు శిరము వంచి వినయముగ ఇట్లనినాడు. "స్వామీ నేను చేసిన పనిచాల స్వల్పమైనది. లంకను నుగ్గు నుగ్గు చేసితినా! రావణుని వధించి ఆ దుష్టుని తలలు నీముందు పెట్టితినా! ఏమీ ఘనకార్యము చేయలేదే కేవలము వార్తా హరునిగా వెళ్ళి వచ్చితిని. దానికే నీ కౌగిలి పొందునంతటి బహూకృతికి నేను తగను. అని తన వినయ స్వభావమే చూపినాడు. ఉత్తమ పురుషుని లక్షణమిది.

రామరావణ మహా సంగ్రామము

హనుమానుని శక్తి ప్రదర్శనము రామకథ కంతకును మకుటాయ మానమైన ఘట్టము రామ రావణ మహా సంగ్రామము. సీతాన్వేషణ కార్యమున ఒక్క ఊపులో సముద్రమును లంఘించినాడు. లంకలో అశోకవనమున సీతాదేవిని చూచి శ్రీరాముని కుశలవార్త జెప్పి సీతా వార్తను రామునకు తెలిపినాడు, తన ప్రయత్నములకు దారిలో తనకడ్డు వచ్చిన వారిని మట్టుపెట్టి లంకాధి పతి రావణుని ధిక్కరించి లంకను గాల్చి వచ్చినాడు. ఇక శ్రీరాముడు వానర సేనను తీసికొని లంకను జేరి రావణుని వధించి సీతను తీసికొనువచ్చు రంగము సిద్ధమైనది. ఈ కార్యక్రమమంతయూ హనుమంతుని వలననే నెరవేరినది.

వారిధికి వారధి కట్టి శ్రీరాముడు వానరసేనతో లంకలో ప్రవేశించి రావణునిపైకి యుద్ధసన్నద్ధుడయ్యెను. లోకములు కనివిని యెఱుగని మహాసంగ్రామమది. ఒకప్రక్క ధర్మసంస్థాపనాచార్యుడు దుష్ట శిక్షకుడైన శ్రీరాముడు; మరొక ప్రక్క త్రిలోక కంటకుడు మహాపాపి అయిన రాక్షసేంద్రుడు రావణుడు.

యుద్ధ మారంభమైనది. మాయల మారి రావణుడు ప్రథమ దినమునందు ప్రయోగించిన మహాశక్తికి వానరసేనలేకాదు రామలక్ష్మణులు స్పృహదప్పి యుద్ధరంగమున పడిపోయిరి. ఆనాడు హనుమ లేనిచో ఏమయ్యేడిదో - సుషేణుని సలహాపై హిమగిరి కేగి తెల్లవారకుండ సంజీవని ఓషధిని దెచ్చి అందఱికిని చైతన్య శక్తినిచ్చిన మహనీయుడు హనుమానుడు. రావణుని శక్తి ప్రభావమున ఎల్లరును నిశ్చేష్టులై యున్న సమయమున జాంబవంతుడు కొంత ఓపిక చేసికొని, ప్రక్కనున్న వారితో "చూడుడు ఆంజనేయుడెచట నున్నాడో, ఆతడు బ్రతికి యున్నచో అందును బ్రతికి యున్నట్లే" అనినాడు హనుమంతుని శక్తికి ఎంతటి ప్రశంస! ఆంజనేయుడు తన బలసత్వములు నిరూపించుకొనినాడు. మఱునాటి యుద్ధమున ఇంద్రజిత్తు ఏమేఘముల చాటునుండియో ప్రయోగించిన శక్తి ప్రభావమున లక్ష్మణుడు మూర్ఛ నందినాడు. సోదరుని దురవస్థకు శ్రీరాముని దుఃఖమాగలేదు. కన్నీరు మున్నీరైనది. ఎవరు దిక్కు. హనుమానుడే మహా వేగమున నేగి రాత్రికి రాత్రి సంజీవని ఓషధిని రాతిపెళ్ళతో సహా తెచ్చి, స్పృహలేక పడియున్న లక్ష్మణుని, మృతులయిన వానరులను బ్రతికించి శ్రీరామునికి హర్షము కల్గించెను. రావణుని శక్తి యుక్తులను, ఇంద్రజిత్తు మాయలను నిస్సారములు చేయగల్గిన

ఘనత హనుమంతునికే దక్కినది. బాల్యము నుండియు హనుమానుడు చేసిన సాహసకృత్యములు అనన్యసాధ్యములు, చూపిన బలప్రదర్శన అసదృశము, ప్రదర్శించిన శక్తియుక్తులు అసాధారణములు. ఇది అంతయు విష్ణ్వంశ సంభూతుడైన శ్రీరామునికి తోడైన పారమేశ్వర హనుమత్ శక్తి.

యుద్ధమంతమైనది. శ్రీరాముని విజయ వార్త చెప్పి అశోకవనము నున్న సీతను తీసికొనివచ్చుటకు, విభీషణునితో హనుమంతుడే వెళ్ళినాడు. వారు తిరిగి అయోధ్య చేరుకున్న వార్తహనుమంతుడే పోయి భరతునకు చెప్పినాడు. అన్నిటికిని ముందు హనుమంతుడే కావలెను.

శ్రీరాముని పట్టాభిషేకము

రావణుడు సపరివారముగా వధింపబడినాడు. శ్రీరాముని శరణు బొందిన విభీషణుడు లంకకు రాజైనాడు. అగ్ని పరీక్షసంపూర్ణమై సీత శ్రీరాముని కలిసినది. పుష్పకవిమానమున సీతారాములు ప్రధానాసన స్థితులై తక్కువానర వీరులును ఆసీనులైన విమానము అయోధ్య దరి దాపుల నున్నదనగా శ్రీరాముని ఆదేశమున హనుమంతుడు పరువుననేగి సీతారాముల రాకను భరతునకు తెలిపెను. అయోధ్యా పౌరులెల్లరు భరతునిముందిడుకొని మంగళవాద్యములు మహారాజోచిత గౌరవములతో సీతారాములను నగరముకు దోడ్కొని యేగిరి. మఱునాడే కులగురువు వశిష్ఠుని ఆధ్వర్యమున సీతాసహితుడై శ్రీరాముడు కోసల సామ్రాజ్య పట్టాభిషిక్తుడయ్యెను.

శ్రీరామ చంద్రుని సామ్రాజ్య పట్టాభిషేక సభా మందిరము. ముని వర్యులతో అమాత్య సుగ్రీవాది వానరులతో విభీషణ జాంబవంతులతో సకల సామంత రాజన్యులతో తక్కు పరివార, పురప్రముఖులతో మహా వైభవముగ విరాజిల్లుచున్నది. ఎవరెచ్చట ఆసీనులైనను హనుమంతుడు ప్రధాన ఆసనమునకు అర్హుడయిన వాడే. అట్లని మునుముందునకాతడు తోసుకుని రాలేదు. ఒక ప్రక్కగానే ఉండెను. సీతారాముల దృష్టి హనుమంతుని మీదనే, హనుమంతుని నేత్రములు సీతారాముల పాద పీఠములందే ఉన్నవి.

హనుమంతుని అనన్య సాధ్యమైన సాహసకృత్యములకు సత్ఫలోదయమైన అమృతక్షణమది. లోకమున ధర్మ సంస్థాపన కొఱకుదయించిన శ్రీహరి అవతారము శ్రీరాముడు - భావి శ్రీరామ రాజ్య దివ్యదృశ్యము హనుమంతుని భావములో, కనులలో మెఱసిపోవుచున్నది. తాను నిరీక్షించు చున్న పవిత్ర సమయము ఈనాడు కనులముందున్నది. సభాంతమున హనుమంతుడు లేచి వసిష్ఠుల అనుమతితో సీతారాములను వినమ్రుడై స్తుతించి తన కృతజ్ఞతలనిట్లు వెల్లడించెను.

శ్రీ సీతారామప్రభూ! పరమాత్మ రూపా! వానర విభుడగు సుగ్రీవుడు మొదలు నావరకు తమ అనుచరులముగా సేవకులముగా మా జనసమ్ములు ధన్యమ్ములైనవి. రావణాది క్రూర రాక్షసుల వధ కారణముగా జగత్తున ధర్మ రక్షణ

కార్యమున మాకు కూడ సేవచేయుటకు అవకాశము కల్గించిన మీ యనుగ్రహమునకు కృతజ్ఞులము. లక్ష్మీ స్వరూపయైన సీతతో తామందిన అయోధ్యా సామ్రాజ్య పట్టాభిషేకము నిజముగ లోక కళ్యాణ ప్రదమగు మహోత్సవము. మీ దర్శన భాగ్యమున, మీ సాన్నిధ్య లాభమున మా జన్మలు తరించినవి. మా హృదయపూర్వక భక్త్యంజలులు గైకొని మమ్ము దీవింపుడు. అనిన హనుమంతుని వినయ ప్రవర్తనకు సభాస్తారు లెల్లరు హర్ష పులకితులైరి.

ఏ మహాప్రభువు రాజ్యపాలనము చూడవలయునని మునులు దేవతలు ప్రజలు కోరుకొనిరో, దానవ దౌష్ట్య నిర్మూలనమునకై వచ్చిన ఏ అవతారమూర్తికి శివశక్తి రూపమగు హనుమానుడు తోడైనిలచెనో, ఆ శ్రీరాముడు లోకపాలకుడై విరాజిల్లెను. త్రిలోకములు శాంతి సౌఖ్యధామములయ్యెను.

హనుమంతుని బలసాహసములు శక్తి సామర్థ్యములు సర్వజగద్విదితములైనవి. శ్రీరాముని రూపమున శ్రీవిష్ణువు మానవుడై వచ్చి, ఆదర్శమానవుడు ఆదర్శ నృపతిగా కీర్తినందెను. వానరరూపమున వచ్చిన శివశక్తి హనుమానుడు అనితర సాధ్యమైన బలసాహసములు ప్రదర్శించి మహా విద్వాంసుడై, చిరజీవిగా వరములంది చరితార్థుడయ్యెను. శ్రీరామపట్టాభిషేకమునకు వచ్చిన వారెల్లరు హనుమానుని శక్తి సామర్థ్యములు వేనోళ్ళ కొనియాడిరి. ఇంత విఖ్యాతి నందిన వాడయ్యు హనుమంతుని అభిలాషవేరు.

శ్రీరాముని పట్టాభిషేకము త్రిలోక క్షేమంకరము. పట్టాభిషేక సమయమునకు దేవేంద్రుడు శుభ సూచకముగ ఒకమణిహారము శ్రీరామునకు కానుకగా బంపెను. శ్రీరాముడా హారమును సీతకీయగా సీత దానిని ఆంజనేయునికి బహూకరించెను. సీతారాములకు ఆంజనేయుడనగా ఎంతకృతజ్ఞత.!

హనుమంతుని ఆధ్యాత్మిక చింతనము

హనుమానుడు సీతారాములను తల్లి దండ్రులకన్న మిన్నగనే భావించినాడు. ఎవరికైనను మొదటి గురువులు తల్లి దండ్రులే. సీతారాములా మహా కపికి జగన్మాతాపితలు. శ్రీరాముడు పరబ్రహ్మము సీతమూల ప్రకృతి. శ్రీరామ తత్త్వ స్వరూపమును శ్రీరామునను మతిచే సీత హనుమానునకు బోధించెను. ఈ వృత్తాంతము శ్రీ సీతారామాంజనేయ సంవాదము ను పూర్వగ్రంథమున నున్నది. ఇది బ్రహ్మాండ పురాణాంతర్గతమగు అధ్యాత్మరామాయణమునందలి శ్రీరామ హృదయమని ఆ గ్రంథముననున్నది. పార్వతి ఒక సమయమున శంకరుని జేరి "దేవదేవా! పాపముల నశింపజేసి ఇహ పర సుఖములను బ్రహ్మానంద సుఖమును ఇచ్చి పరబ్రహ్మసాక్షాత్కారము కల్గించి ఉపాసకులనుద్ధరించు మంత్ర రాజమును వినగోరెద" ననగా సీత హనుమంతునికి బోధించినరామమంత్ర మహిమను రామతత్త్వమును శంకరుడే ఇట్లు నుడివినట్టు కలదు.

రామనామ మంత్రము సకల మంత్రములలో ఉత్తమమైనది. సకల యోగులు బ్రహ్మాది జ్ఞానులు సర్వవేళల పరబ్రహ్మభావమున క్రీడించు చుందురు గాన పరమాత్మకు రామనామము కలిగినది. జీవ బ్రహ్మములకు అద్వైత స్థితిని సీత విశదీకరించెను. ఆంజనేయుడెన్నియో ప్రశ్నలను మధ్యమధ్య వేయుచు తన సందేహములను తీర్చుకొనుచుండెను. జీవునకు బ్రహ్మానందసుఖమును గల్గించు తారకయోగమును యోగమును, పరబ్రహ్మస్వరూపము జీవ బ్రహ్మైక్య విచారము చిద్రూపలక్షణములు గల సాంఖ్యయోగ విశేషములను సీతవచింపగా, వైరాగ్య లక్షణములు యోగిలక్షణములు జీవన్ముక్తుని స్వభావమును వివరించు అమనస్కయోగమును శ్రీరాముడు బోధించెను. ఏది యెట్లున్నను తాను సర్వ శాస్త్ర వేదియయ్యు అధ్యాత్మయోగమును మరల సీతారాముల వద్ద నేర్చిన మహా యోగి హనుమానుడు. సీతారాములు బోధించిన విషయములను చిత్తశుద్ధితో గ్రహించి దేహాత్మాభిమాన జీవాత్మాభిమానదశలను దాటి పరబ్రహ్మమునకును తనకును భేదములేని కూటస్థుడే తాను అను బ్రహ్మానందాను భూతి గలిగిన వాడయ్యెను.

చిరజీవి సకల విద్యావిశారదుడు పరమ యోగి శ్రీ ఆంజనేయుడు సీతారాముల నుండి సెలవు గైకొని గంధమాదవ గిరినున్న నిజాశ్రమమున కరిగి సంతతాత్మ ధ్యానపరాయణుడు భక్తరక్షకుడునై నేటికిని అందు విరాజిల్లుచున్నాడు.

భవిష్యద్బ్రహ్మ - ఆంజనేయుడు

పరాశర సంహిత - 54వ పటలము

ఆంజనేయుని మహిమ ఊరూర వాడవాడల దేశమునందు వ్యాపించినది. ప్రజలా మహనీయుని విలాసములు లీలలు కథలు కథలుగా చెప్పుకొని పూజ లాచరించుచున్నారు. కరుణా తరంగిత హృదయాంతరంగుడా మహనీయుడు. భక్తుల కెచ్చట ఏ బాధ కలిగినను తాను ప్రక్కనుండి కాపాడుచునే ఉండును. హనుమంతుడు నివాసమున్న గంధమాదనాశ్రమము వేదోపనిషద్ధర్మ మార్గ ప్రచారస్థానమైనది.

ఒకనాడా హనుమంతుడు, సాకేతమున జానకీ సహితుడైయున్న శ్రీరామ చంద్రుని చూడదలచి తన వాహనమగు ఒంటెనెక్కి వెడలి, ఒకింత దూరమున వాహనముదిగి, తన స్వామి వారిని తలచుకొనుచు పోయి వారి పాదముల ప్రణమిల్లి, ఉపనిషత్సార స్తోత్రములు పఠించి సీతా రాములను దర్శించిన ఆనందాతి రేకమున హర్ష బాష్ప సిక్తవదనుడై వారిముందు నిలబడెను. శ్రీరాముడా హనుమానుని సుఖాసనాసీనునిగా జేసి హనుమా నీరాక మాకెంతో సంతోషము నిచ్చినది. నీవు గంధ మాదనగిరికేగిన తరువాత మరల నిన్ను చూచుట యిదే. నీరాక సీతకు గూడ ఎంతయో ఆనంద ప్రదము, నీవున్న పరిస్థితులు నీవు సంచరించు చోట్లు శుభముగానున్నవి, కదా! అని కుశల ప్రశ్నచేసి "ఆంజనేయా నీవు మఱియొక కార్యము నెరవేర్పవలయును. నా అంగుళీయకమును సత్యలోకమున నుంచుటకు బ్రహ్మ అడుగగా ఇచ్చితిని. లంకయందు వియోగ దుఃఖ సమయమున ఆ ముద్రికయే సీతకు మనశ్శాంతి కల్పించుచుండినది." ఇప్పుడది కావలెను. నీవు వేగముగ పోయి తెమ్ము. అని కోరిన శ్రీరాముని పలుకులే తడవుగా హనుమంతుడు మహవేగమున సత్య లోకమున జేరెను.

అచట బ్రహ్మదేవుని సభ నిండుగా నున్నది. సనకసనంద నాది మహా మునులు, దిక్పాలురును అందే ఉన్నారు. ఆంజనేయుని చూచుసరికి వారందరును లేచి నమస్సులాచరించి ఉపవిష్టుని జేసి కుశలమడిగిరి. ఆ మరుత్తనయుడంత బ్రహ్మదేవుని దిక్కుమొగమై "దేవా! మీకు నా నమస్కారములు శ్రీరామ చంద్రులు కనకరత్న ఖచితమైన తమ అంగుళీయకము

మీకిచ్చినారట దానిని తీసికొని రమ్మని నన్ను పంపినారు. ఈ ముద్రిక కొరకు స్వామి సాకేతమున వేచి యున్నారు. నేనిది తీసికొని వేగమే వారికంద జేయవలెను" అని చెప్పిన మాటలును విని బ్రహ్మ "ఈ ముద్రికను శ్రీరామ చంద్రులు సత్యలోకమునకిచ్చిరి తిరిగి ఇచ్చుటకు వీలు పడదని" నుడువగానే ఆంజనేయునికి కోపమువచ్చి దేవా మీరు కృతజ్ఞతతో మాటలాడుట లేదు. నాకిచట ఆలస్యమెనర్చుటకు వీలుండదు. మీరు వెంటనే ఈయకపోయినచో నేనీ ప్రదేశమంతయు పెళ్ళగించి తీసికొని పోయి రాముని ముందు పెట్టెదనని దేహమును భీకరముగ పెంచి పెద్ద సింహనాదము చేసెను. విశ్వతోముఖమైన ఆ యాకారము జూచి సత్యలోక మంతయు గగ్గోలు పడినది. చతుర్ముఖుడు ఏమీ యీ విపరీతము ఎవరిట్లు చేసిరని విభ్రాంతిని మునుగగా ప్రక్కనున్న సనకమహర్షి దేవా యిది శ్రీరాముని ఉంగరమునకై వచ్చిన మహావీరుడు ఆంజనేయుని బల విజృంభణము. పరిస్థితులు మేర మీరకముందే మీరా యుంగరము నిచ్చి ఆంజనేయుని పంపవలసినదని నుడివిరి, బ్రహ్మ ఆంజనేయుని స్తుతించి ప్రక్కనున్న తామర పూకొలను చూపి అంగుళీయకము అందున్నది తీసికొనుమనెను. ఆ కొలను స్వర్ణకమలములతో బహుసుందరముగానున్నది. ఆ పూవుల మధ్య నున్న నిర్మల జలములో శ్రీరామ నామాంకితములైన ముద్రికలు వందల కొలది మెఱిసిపోవుచున్నవి. హనుమంతుడు వానిని చూచి ఆశ్చర్యపడి, వాని నన్నిటిని తీసికొని వెళ్ళుటకు రామాజ్ఞయులేక తిరిగి అయోధ్యకు వచ్చి శ్రీరామునకా యుదంతము చెప్పెను.

శ్రీరాముడా మాటలు విని నవ్వి ఆంజనేయా ఆ సరస్సున నున్నవి నా అంగుళీయక బింబ ప్రతిబింబములే. బ్రహ్మ ఆ ముద్రికలను పూజించుచు వాని మహిమవలన లోకములను ప్రయోజనకరముగ పాలించుచున్నాడు. నీవు పోయి ఒక ముద్రికన తీసికొని రమ్ము అని పంపెను. ఆంజనేయుడు వాయువేగమున సత్యలోకమునకేగి నిజమైన రామముద్రికను కొనివచ్చి శ్రీరామునకీయగా నతడు దానిని సీతకందజేసెను. హనుమంతుడెంతటి కార్యమునకైనను సమర్థుడనుకొని సీతారాములు పొందిన ఆనందమునకు మేరలేదు.

శ్రీరాముని పని నెఱవేరినది గదా అని హనుమంతుడును మిక్కిలి సంతృప్తి నంది శ్రీరాముని ఆదేశమునకై ఎదురుచూచుచు అంజలి ఘటించి యుండెను.

శ్రీరాముడంతట పరమ ప్రీతితో సుస్మిత వదనుడై, "ఆంజనేయా నీవు సత్యలోకమునకు పోయివచ్చితివి. అచ్చట అందరును, సర్వలోక శ్రేయమును గూర్చు నా ముద్రికను పూజించుచుండుట చూచి ఆనంద మందితివి. నీవును బ్రహ్మలోకాధి పత్యమందుదువుగాక. నీవెన్నో ఉపకారములను మాకు చేసితివి. నా అనుజుడు లక్ష్మణుని బ్రతికించితివి. నీ కార్యములన్నియు అనన్య సాధ్యములు. నేనెన్నో అవతారములను పూర్వము ధరించితిని ఇప్పుడీ యవతారము నడచుచున్నది. నా భక్తుడగు బ్రహ్మకు ప్రతికల్పమునందు నాకు ప్రతి నిధియగు ముద్ర ఈయబడుచున్నది. నీకు వలె ఆత్మసంయమనముగల భక్తుడు మఱియొక్కడు లేడు. నీవును రాబోవు కల్పమున బ్రహ్మవై లోకమున చరాచరసృష్టినంతయుగావించుచు వేదోక్త ప్రకారము సంచరించుచు నా ఆజ్ఞను పాలించుచు భక్తులను రక్షించుచు సుఖముగా నుండుము. ఇది నా యభిలాష, ఆజ్ఞయు నని హనుమంతుని అనుగ్రహించి శ్రీరాముడు పంపెను.

విష్ణ్వవతారుడైన శ్రీరామునేధ్యానించుచు ఆంజనేయుడు తన గంధమాదన ఆశ్రమము చేరెను.

శైలము గంధ మాదన మా ఆంజనేయుని నివాసము. లలిత లతా సురభిళ పుష్ప విలసితము, బహువిధఫల వృక్షపరివృతము, నిర్మలనదనదీజల ప్రవాహ సేవితము, మందగంధవహవీచికా తర్పితము, మృదు శాద్వలాన్విత సానుసంకలితము, కనకరత్నమణిశోభితమై గంధమాదనాచలము నిరంతరము సౌఖ్య ప్రదమై ప్రశాంతమై యొప్పుచుండును. అచట నిర్మితములైన పర్ణశాలలు సకల ఋతువులందును నివాస యోగ్యమై విలసిల్లును. అచటి యరణ్యము లందు తిరుగు ప్రాణికోటి పశుపక్ష్యాదులు, పిల్లి ఎలుక మొదలు గజ శార్దూల సింహముల వరకును అన్యోన్య మైత్రితో జీవించు చుండును ఇట్లు గంధ మాదన శైల ప్రాంతమెల్లను, ఆంజనేయుని తపోవాటికయే య్యైనది. ఆంజనేయునితో పాటు అచ్చట అతని పూర్వస్నేహితులు మహా ప్రభావశాలులు అయిన జాంబవంతుడు నీలుడు సుషేణుడు మైందద్వివిదులు పనసుడు వినతుడు మున్నగు వారెల్ల హనుమంతుని పార్శ్వ చరులై యుందురు. వచ్చిన భక్తులెల్లరును మున్ముందు వారిని పూజించి తరువాత ఆంజనేయుని పూజింతురు.

తన నివాస ప్రాంగణము సర్వము ఒక తపస్సీమ. ఆంజనేయుడు నిరంతరము వేదోపనిషద్రహస్యములు ధర్మశాస్త్ర ప్రబోధములు వినుచుండును. మునీంద్రు లేగుదెంచి తమ ప్రవచనములు గావింతురు. దేవతలేగుదెంచి హనుమంతుని ధర్మ పీఠమును దర్శించి హనుమంతుని స్తోత్రములు కావించి చను చుందురు. గరుడ గంధర్వ కిన్నరాది గగనచరులును వచ్చి హనుమంతుని దర్శించి నృత్యగీతములతో సన్నుతులు గావించు చుందురు.

త్రికాలములయందును ఆంజనేయుడు శ్రీరామార్చన యందాసక్తుడై యుండును. ఆంజనేయుడు ప్రపంచ స్వరూపుడు మంత్రరూపుడు. తన భక్తులెచ్చటెచ్చట నున్నను వారి క్షేమయము, ఆపద రాకుండ కాపాడుచు కార్యసిద్ధులొసగు విశాల హృదయుడు, అపార కృపావిరాజితుడు. దేవేంద్రాది దిక్పాలురు హనుమద్విగ్రహములను పూజాపురస్సరముగ అష్టదిక్కులను ప్రతిష్ఠించి జాంబవదాదుల కిచ్చిరి. ఆంజనేయుడీరీతిగ సకల లోకారాధ్యుడై, భక్త వరదుడై గంధమాదన తపో వాటికలో కదళీవనమధ్యమున, పారిజాత తరువు నీడ యందు నేటికిని విరాజిల్లు చుండెను.

త్రిమూర్త్యాత్మకుడై, సూర్యునికాంతిని, చంద్రుని చల్లదనము గలిగి సహజముగ తేజోవంతుడైన హనుమంతుడా గంధమాదనాశ్రమ వాటిక యందు రత్న రంజిత ధర్మ పీఠమున నున్నపుడు ఇనుమడించిన తేజస్సంపన్నుడై చూచువారల కెల్లరకు నొక అద్భుత దివ్య రూపముగ సుప్రసన్నుడై కనుపట్టును.

శ్రీ ఆంజనేయదర్శనము

శ్రీరాముడుండిన కాలము కృతయుగమునాటి వాడు హనుమంతుడు. పదపడి త్రేతా ద్వాపరయుగములు గడచినవి. ఇది కలియుగము. ఆనాటి నుండియు త్రిమూర్తులతో సామ్యముగ పూజలందుకొనుచున్న దైవతమూర్తి ఆవుహాకపి. ఆతడు చిరంజీవి. నేటికిని గంధమాదనమున తన యాశ్రమమందుండి భక్తులను రక్షించుచున్నాడు. నిజరూపమున ఆతడెచ్చట నున్నను ఆయన పవిత్ర విగ్రహము గ్రామగ్రామమున ప్రత్యక్షమే. భక్తుడెచ్చట స్మరించినను ఎట్లు స్మరించినను తేజో వంతము గంభీరము, మహోన్నతమైన హనుమద్దివ్య రూపము కనుల ముందుండును. ప్రజాహృదయములలో అంత ఆప్యాయముగ ముద్రితమైన రూపమది.

హనుమంతుడు ప్రణవస్వరూపుడు మంత్రరూపుడు అది గాక, భక్తులు స్వేచ్ఛగ వారి వారి ఇష్టనామములతో చేయు పూజలు ప్రార్థనలు స్వీకరించు కరుణాళుడు. ఒకనికిగల భయములు చిక్కులు తొలగిపోవలెను అప్పుడతడు అభయాంజనేయుడు. ఒకని యత్నములు ఆటంకములు లేక సఫలముకావలెను. అప్పుడతడు వీరాంజనేయుడు. ఒకనికి ఇహపరసౌఖ్యములు కావలెను. అతడు భద్రాంజనేయుడు, ఒకనికి నిశ్చలాత్మచింతన యోగసిద్ధి సాధన కావలెను అతడు ధ్యానాంజనేయుడు. నిండు భక్తితో నొకడతనిని కీర్తించును. అతడు ప్రసన్నాంజనేయుడు; ఇట్లెన్నియో మార్గముల భక్తసులభుడైన దయామయుడా ఆంజనేయుడు. హనుమన్మాలమంత్రోపాసన వలన సిద్ధులగుచున్నవారున్నారు.

హనుమదనుగ్రహము నంది మహాకవులు ఋషులు ఎందరెందరో ఆ స్వామి మహిమను కథలను గాథలను వ్రాసి ప్రజలకందించినారు. వానిని విని

చదివి భక్తి శ్రద్ధలతో సేవించిన భక్తులు పిలిచినపలుకు భక్త ప్రియు డా అంజన కుమారుడు. హనుమన్మంత్ర విధులతో హనుమదుపాసకులై సిద్ధులయిన వారనేకులుగలరు. "నవనిధికేదాతా" అని తన హనుమాన్ చాలీసాలో గోస్వామి తులసీదాసు సంబోధించినాడు. ఆయన మహిమము, కరుణము, అనంతములు. హనుమానునిపై వచ్చిన సాహిత్య మొక క్షీరసాగరము. ఆదికవి వాల్మీకి రామాయణమున సుందర కాండ సర్వము హనుమన్మహిమా సౌందర్యమే. వివిధ పురాణములలో ఆయా చోట్ల హనుమంతుని గూర్చి ఉన్నది. పదపడి ఉమాసంహిత శౌనసంహిత పరాశరసంహితల వంటి బృహత్కావ్యము లున్నవి. స్తోత్రములున్నవి. అష్టోత్తర దశ, శత, సహస్ర నామావళులున్నవి, భజనకీర్తనలున్నవి, ఇక తెలుగులో ప్రతిరామ కథా గ్రంథమునందు ముఖ్యభాగము హనుమత్కథే. శతకములు పద్యములు లఘు కావ్యములు కీర్తనలు ప్రచార పత్రికలు సదస్సులు సంస్కృత కావ్యానువాదములు కోకొల్లలు.

లోకమెల్లరు ఇట్లేల హనుమానుని తలచి పూజింతురు? అసలు "ఆంజనేయ-హనుమ" అను పదములలోనే మహిమాన్వితమైన మంత్ర బీజాక్షరములున్నవని పండితుల వ్యాఖ్యానము. ఇష్టదైవముల నేయే నామముల పూజించినను అన్నియు ఈశ్వరునకు చెందునవియే తన్నిమిత్త ఫలముల నిచ్చునవియే".

'ఏకమ్ సత్ విప్రా బహుధావదన్తి' అని వేదవాక్యమున్నది. ఒక ధ్యానశ్లోకంలో

"ఆంజనేయం మహావీరం బ్రహ్మవిష్ణు శివాత్మకమ్" అనియు హనుమత్ సహస్ర నామస్తోత్రంలో "సదాశివాయ నమః రుద్రవీర్యసము ద్భవాయ నమః" అని రుద్రనామములు, దశావతారనామములు, ఇతర దైవముల నామములును ఉన్నవి. భక్తుల మనస్సులలో వారూహించుకొనిన ఏ యిష్టదైవనామము లున్నను అది ఆ ఈశ్వరరూపమే. వాడవాడల వెలసిన మూర్తి. సర్వజనులకు ఆరాధనీయుడు. భక్తిభావ సంప్రదాయము విలసిల్ల జేయుటకు ఆవిర్భవించిన దివ్యమూర్తి హనుమంతుడు.

మహాభక్తులైన మన భద్రాద్రి రామదాసు, త్యాగయ్య హనుమానుని గూడ ధ్యానించి కీర్తించి తరించిన వారే. హనుమంతుని భక్తులలో చెప్పుకొన వలసిన

మహా పురుషుడు గోస్వామితులసీదాసు. రామ చరిత మానస అను ప్రఖ్యాత రామాయణమును హిందీ (వ్రజ) భాషలో వ్రాసిన ఇతడు 16వ శతాబ్దం వాడు. తన సమకాలిక సమాజంలో ధర్మాచరణ శీలం కొరవడి పరస్పర మత వైషమ్యాలు పెరుగుటతో తన రామాయణము వలన ప్రజలలో ఎంతో ధార్మిక చైతన్యంకలగ చేసిన వాడని ప్రతీతి. ఆయన అయోధ్యలోను కాశీలోను నివసించుచున్న సమయమున ఈ రామాయణముతోపాటు ప్రసిద్ధికెక్కిన "హనుమాన్ స్తోత్రమును" రచించి నట్లు చెప్పుదురు. ఇంతేకాదు.

హనుమంతుని సాక్షాత్కారము పొందిన మహాభక్తుడు తులసీదాసు. ఈ సందర్భమున ఒక కథకలదు. ఒకనాడు చిత్రకూటములో తనరామాయణ ప్రవచనము సాగుచున్న సభలో ఒకమూల కన్నీరు గార్చు ఒకరోగిని చూచి హనుమంతునిగా గుర్తించి ప్రణతులర్పించెను. హనుమంతుడు నిజస్వరూపమున ప్రత్యక్షమైనీకేమి కావలయునని అడుగగా రామలక్ష్మణుల దర్శన భాగ్యము నిప్పించుమని తులసీదాసు వేడుకొనెను. అట్లే అగును వారిని చందన తిలకములతో సత్కరించుమని చెప్పి హనుమానుడు అంతర్ధానమందెను.

యత్రయత్ర రఘు నాథకీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిం॥
బాష్ప వారి పరిపూర్ణలోచనం

అని కదా హనుమానుని గూర్చి చెప్పుదురు. మఱునాడు రామలక్ష్మణులు రాజకుమారుల వేషమున ఆ దారినేగుచుండగా తులసీ దాసు ధ్యానంలో ఉండి గుర్తింప జాలక మరల హనుమంతుని వేడగా" వచ్చిన వారిని నీవు గుర్తించ లేకపోయినావు. రేపు వారు మరల రావచ్చును" అని చెప్పి పంపెను. మరునాడా రామలక్ష్మణులు రాజకుమారుల వేషమున తన దగ్గరకే వచ్చిరి. వారి తేజస్సు ముఖవర్చస్సు చూడజాలక తులసీదాసు స్పృహ దప్పి పడిపోయెను. శ్రీరాముడే చందన తిలకమును తులసీదాను ఫాలమున దిద్దివెడలెను. అట్లు హనుమద్రామ లక్ష్మణుల దర్శనము పొందిన మహనీయుడా భక్తుడు. రామ లక్ష్మణులు అంతర్ధానమందిన తరువాత తులసీదాసు "అయ్యో నా స్వామి ఒక నిముసమైన నిలువలేదు. నేనును ఆ క్షణమున పరిచర్య చేయలేకపోయితిని అని విచారించెను.

తులసీదాసు కీర్తి విని అతనిని తీసికొని రమ్మని ఒకసారి ఢిల్లీ నవాబు భటులను బంపగా, వారి ప్రయత్నములు సాగకుండ హనుమంతుని ఆదేశమున వందల కొలది వానరము లాభటులను అడ్డగించి వెనుకకు తరిమి కొట్టి ధ్యానమందున్న తులసీదాసునకు రక్షణకల్పించిన వని మరియొక ఐతిహ్యము కలదు.

తులసీదాసు సంగీత జ్యోతిశ్శాస్త్రములందు కూడ నిపుణుడు. ఒకసారి కాశీ వద్ద రాజఘాట్ రాజుకుమారుడు వేటకుపోయి దారి తప్పి పోగా ఆ రాజు తులసీదాసుని మిత్రుడు గంగారామ్ జోషిఅను పండితుని తన కుమారుడెప్పుడు వచ్చునో చెప్పుమనెను. ఆ జోషి తులసీదాసు వద్దకే వచ్చి ఆ విషయము, నడిగెనట. తులసీదాసు చక్రము వేసి మఱునాడే వచ్చునని చెప్పెను. గంగారామ్ రాజునకామాట చెప్పగా రాకుమారుడట్లే వచ్చెను. రాజు సంతోషించి గంగారామ్‌నకు లక్షరూపాయలిచ్చెను. తులసీదాసు కారణముగా తనకీ సొమ్ము వచ్చినదని తలచి అతనినే ఆ సొమ్మును తీసుకొనుమని గంగారామ్ బలవంతపెట్టెను. తులసీదాసు పన్నెండు వేలు మాత్రము తీసికొని పన్నెండు హనుమంతుని గుడులు కట్టించినట్లున్నది. వానిలో ప్రసిద్ధమైనది కాశీలో సంకటమోచన్ ఆలయము.

శ్రీరాముడనినను హనుమంతుడనినను తెలుగు వారి కత్యంత ప్రీతి. హనుమంతుని గూర్చి తెలుగులో అసంఖ్యాకములైన దండకములు స్తోత్రములు శతకములున్నను, తులసీదాసు హనుమాన్ చాలీసాగూడ సమాన భక్తి శ్రద్ధలతో తెలుగు వారు పఠింతురు.

హనుమంతుని ప్రత్యక్షమహిమను గూర్చి ఒక చక్కని కథ చెప్పుదురు. చల్లపల్లి ఆస్థానమునందు దేవరకోటను దోచుకొనుటకు నిజామ్ ఆలీ గుట్టపు దండు వచ్చుచున్నపుడు దానిని నివారించు ఉపాయము చూడుమని సంస్థానాధిపతి వారి ఆస్థాన పండితుడు ముక్తేవి పెరుమాళ్ళయ్య కవిని వేడుకొనెనట. ఆ కవీంద్రుడు శ్రీకాకుళాంధ్ర విష్ణువు ఆలయములో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామిపై "శత్రుహంతహనుమంత" అనే మకుటలంతో పద్యాలు చెప్పగా హనుమానుడు ప్రసన్నుడై శత్రువుల దండుపై పిడుగులు గురిపించి

దేవరకోటకు రాకుండ చేసెనట. ఈ విధమైన ఐతిహ్యములు ఈ కాలమందును చాల ఉన్నవి. దీనుల బాధలను తొలగింపగలవారెందరో హనుమదుపాసకులు ఉన్నారని ప్రజలలో విశ్వాసమున్నది.

సర్వదేవతా శక్తి సమర్థుడు, నిత్య కరుణాంతరంగుడు, సర్వ జనారాధ్యుడు బ్రహ్మవిష్ణు శివాత్మకుడైన హనుమంతుడు భక్తుల కెల్లవేళల సర్వాభీష్టఫల ప్రదాతయే.

ఆంజనేయుడు మహాకవి - సంగీత శాస్త్రజ్ఞుడు

ఆంజనేయుడు శ్రీరామచరిత్రము నొక మహాకావ్యముగ రచించెనని చెప్పుదురు. ఆంజనేయుడు - మహాకవి సంగీత శాస్త్రసర్వజ్ఞుడు. ఛందస్సుందరములైన వేదములను కూలంకషముగ అధ్యయనమొనర్చిన పండితుడు. సర్వ శాస్త్రములను నేర్చినవాడు. అతడేది పల్కినను విర్దుష్ట పద ప్రయోగవప్పుదులవంగు కావ్యశైలిలో నుండుననగా ఆర్చర్యములేదు. సీతారాములతో, రావణునితో సుగ్రీవునితో ఆ మహనీయుడు నెఱపిన సంభాషణములు వాల్మీకిఋషి రచిత రామాయణమున నున్నవి. వానిని మఱియొకసారి చూచినచో హనుమంతుడు మహాకవియే అనిపించును. ఆతడు రామ కథను కవితా రీతిలో వ్రాసి గానమొనర్చియే యుండును. ఏ దేవతాలోకమునందో ఎచ్చటనో ఉండి మనకది లభ్యముకాలేదు.

ఆంజనేయుడు సంగీత శాస్త్ర సర్వజ్ఞుడనుటకు నిదర్శనములున్నవి. సంగీత పారిజాత మను గ్రంథమును వ్రాసినట్లు చెప్పుదురు. "కర్తా సంగీత శాస్త్రస్య హనుమాంశ్చ మహాకపిః" అను వాక్యము సంగీతలోకమున వాడుకలో నున్నది. సంగీత మహాసభలలో హనుమంతుడు కీర్తింపబడుటయు తరచుగా చూచుచుందుము. సప్త స్వరకల్పనలో హనుమంతుడు కొన్ని అలంకారములనుడివి నట్లు ఇప్పటికిని సంగీత శాస్త్రజ్ఞులు చెప్పుదురు.

భద్ర సంజ్ఞమలంకారం
ఆంజనేయో వదత్సుధీః
ఏకైకస్య స్వరస్యాత్ర
హసనాచ్ఛ క్రమోభవేత్

సరిగమలను జంటగను ద్రుతములుగను ఉచ్చరిస్తే వచ్చే భద్రాది అలంకారముల సృష్టి ఆంజనేయునిదే అనెదరు.

సగౌరిగౌసముచ్చార్య మగౌరిగౌతద్దైవచ
గ్రీవంలఘు ద్వయే నాత్రహనుమాన దత్సుధీః
ద్రుతాభ్యం లఘు కాలేన భాలంవదతిమారుతిః

ఇవి ఇలా ఉండగా హనుమానుని సంగీత శాస్త్ర ప్రజ్ఞాపాటవములకు ఒక కథను నిదర్శనముగా చెప్పుదురు.

దేవఋషులు నారద తుంబురలు త్రిలోకవిఖ్యాతి గనిన సంగీత శాస్త్రజ్ఞులు, మహావిద్వాంసులు, విద్వాంసుల మధ్య స్పర్ధ సహజమే అట్లే వారిరువురి మధ్య నేనెక్కువ నేనెక్కువ అనిన వాదము పెరిగి తుదకు కలహముగా మారినది. పరిష్కారము కొరకు పరమాత్మ వద్దకే వెళ్ళినారు. మీ తగువు తీర్చగలిగిన ప్రజ్ఞాశాలి హనుమానుడొక్కడే అని వారిని వెనుకకు బంపగా వారు హనుమానుని వద్దకేగి కపీంద్రా సంగీతమున మీ ప్రజ్ఞ నెఱిగియే ఇచ్చుటకు వచ్చినాము. మా యిర్వురిలో ఎవరు అధికులో సందేహము లేనిరీతి పరిష్కారము చేయుడని వేడిరి. ఆంజనేయు డాలోచించినాడు. ఇద్దరును మంచికీర్తిగల గానవిశారదులే. ఇరువురును తనకు పరిచయమున్నవారే. వారినొక శిలావేదికపై గూర్చుండబెట్టి హనుమానుడు తానే గాన మారంభించినాడు. రాల్గరగించు గాంధర్వ విద్యఅది. హనుమంతుని దివ్యగాన ప్రభావమునకు ఆ శిల కరిగినది. ఆయిరువురు గాయకోత్తములు దానిలో కూరుకు బిగిసిపోయినారు. పరమ గాయకోత్తములారా మీరొక రొకరే మీగానము వలన శిలను కరిగించి పైకి రండు అని హనువంతుడు నుడివినంత వారిరువురును ఒకరి తర్వాత ఒకరు వారి గాన శక్తి కొలది ప్రయత్నించిరి గాని ఫలితములేకపోయినది. హనుమానుడు తానే మరల సంకీర్తన చేసి వారిని బయటికి రప్పించి మీరు ఎవరికి వారే విద్వాంసులు. నేనేగొప్ప వాడనను భావము ఎవరికిని తగదు అని బోధించి పంపించెను.

సువర్చలాంజనేయమ్

శ్రీ ఆంజనేయుని చరిత్రలో ఇదియొక సందేహాస్పదమ్మైన ముఖ్య విషయము. ఆంజనేయుడు సూర్యుని శిష్యుడు. సువర్చల సూర్యుని పుత్రిక. ఆ మహనీయుడు బాల్యము నుండియు బ్రహ్మచారి అనియే పెక్కు మంది అభిప్రాయము, జనులలోగల వాడుకయు గూడ అదియే. ఇదమిత్థమని తెల్చుకొనుట కష్టసాధ్యము. కారణము పూర్వగ్రంథములలో రెండు విధముల పాఠములున్నవి. హనుమంతుడు సూర్యుని శిష్యుడు. అతడు నేర్చిన వేద విద్యుత్ప్రకాశ ప్రభావము వలన హనుమానునకు మంచి ముఖవర్చస్సు వచ్చినది. సువర్చల అను పదమును తద్విజ్ఞాన వికాసమునకు సామ్యముగ హనుమానుడు మహావర్చస్వి అనుటకు సువర్చలాసహితుడు అని సాంకేతికముగా వాడిరని కొందరి వాదము. విఘ్నేశ్వరునకు సిద్ధి వినాయకుడను నామమే ఉన్నది. వాంఛాసిద్ధిని కలుగజేయువాడను అభిప్రాయముతోనే ఆ పదమును వాడుదురు. అట్లే సువర్చలాంజనేయు డను మాటగూడ. ఆలయములలోను ఇతర స్థలములందును ఉన్న విగ్రహములు హనుమాను నొక్కనినే చూపించునవిగా ఉన్నవి. ఎచ్చట నైనను సువర్చలా సహితునిగ నున్న మాత్రమున ఆమె హనుమానుని భార్య యనగలమా పూరి జగన్నాథాలయమున బలరామ కృష్ణులు సుభద్ర కలిసిన విగ్రహములకే పూజ. అంతమాత్రమున అన్యథాభావింపవలసిన పనిలేదు. ఇచ్చట లక్ష్మీదేవి రూపమే సుభద్రయను నామముతో నున్నట్లొక శాస్త్ర వాదమును కలదు.

అధ్యాత్మ రామాయణములో ఉమామహేశ్వర పరముగా నున్న స్తోత్రములో "మూర్తి త్రయాత్మకం పీనం మహావీరం మహాహనుమ్ హనుమంతం వాయుపుత్రం నమామి బ్రహ్మచారిణం" అని కూడ ఉన్నది. అయితే బ్రహ్మచారి అనుపదమునకు అవివాహితుడని కాక బ్రహ్మధర్మ మార్గ సంచారి అని కూడ చెప్పవచ్చును. గురుని కుమారితను వివాహమాడుట సంప్రదాయ విరుద్ధము, కూడదు అని అందురు. ఆంజనేయునంతటి మహాజ్ఞానికి ఈ మాటయేల. మన పురాణరచనలలో రచయిత భక్తి విశ్వాసముల కొలది అతిశయోక్తులున్నమాట సత్యమే. ఈ గాథలు జరిగి యుగయుగములు జరిగినవి. కాల క్రమమున ఆ

చరిత్రలలో ఎన్నో మార్పులు చేర్పులు సంభవించినవి. ఆ మార్పులు కొన్ని అసంబద్ధములు. 24000 శ్లోకములుగల రామాయణము 36000 శ్లోకములకు పెరిగినది. ఎవరిట్లు చేసిరి అను ప్రశ్నకు సమాధానము చెప్పజాలము. అట్లే ఆంజనేయుడు సువర్చలను వివాహమాడెననిన విషయము ప్రక్షిప్తమని కొందరు చెప్పుదురు.

ఆంజనేయుని మహిమను మైత్రేయ మహామునికి పరాశరమహర్షి వచించినట్లు పరాశరసంహిత యను బృహద్గ్రంథమున్నది పెక్కుచోట్ల ఆ గ్రంథమునందు సువర్చలాపతీ అను సంబోధనలేకాక భక్తులకు ఆంజనేయుడు సువర్చలా సహితుడై దర్శనమిచ్చినట్లు కథలు గలవు. హరిశర్మ కథ యందీ శ్లోకమును చూడుడు.

కంఠే హారం, శ్రవణపుటయోః కుండలే, స్కంధదేశే
బ్రహ్మంసూత్రం, కరకమల యోః కంకణాన్యంచితాని,
మధ్యే పీతం కనకవసనం చోర్ధ్వ పుండ్రంలలాటే
వామేదేవీం మిహిరతనయాం భిభ్రతం వానరేంద్రం॥

మిహిరతనయ అనగా సూర్యుని పుత్రిక. అలంకారభూషితుడు పీతాంబరుడైన సుందరుడు సువర్చలా సహితుడై హనుమంతుడు భక్తులకు దర్శనమిచ్చు చుండెనని భావము. సువర్చలా సహితుడైన హనుమదాలయములు కొన్ని చోట్ల ఉన్నవి. మారుతీ కళ్యాణమను పేరుతో సువర్చలాంజనేయుల వివాహోత్సవము జరిపి ఆనందింతురనియు చెప్పుదురు.

మఱియొక విషయము త్రిమూర్తులకు దిక్పాలకులకు వారి దేవేరులున్నట్లే కద మన పురాణములన్నియు - లక్ష్మీ పార్వతీ సరస్వతులు దేవీ ప్రధానాంశలై హరి హర బ్రహ్మలకు అంతశ్శక్తులై విరాజిల్లుచున్నారు. ఆంజనేయుని విషయములో కూడా అట్లే అనుకొనవచ్చును. కావలసినది దైవమునెడల భక్తి విశ్వాసములు. ధార్మిక సంస్కారము. ఇష్టాను సారము రూపభేదము లూహించుకొను స్వేచ్ఛ ఉన్నను, చిత్తశుద్ధిగల భక్తి భావము ముఖ్యము. భగవానుని దృష్టిలో అందరును సమానమే.

హనుమంతునికి జరుగు పూజా విధానములు

పరాశర సంహిత 18వ 41వ పటలము అందు ఈ విధానములు విపులముగ చర్చింపబడినవి.

భక్తి తొమ్మిది విధములుగా చెప్పబడినది. అవి శ్రవణము. కీర్తన స్మరణ, పాదసేవనము, అర్చనము, వందనము, సఖ్యము ధాసత్వము ఆత్మ నివేదనము. ఇవి ప్రత్యేకముగా విష్ణువును గూర్చి చెప్పబడినను సకల దేవతా పూజలకును వర్తించును. అట్లే హనుమత్పూజా సందర్భమునను ఈ విధులు పాటింపనగును. తుదకు ఏమియు చేయజాలని వారు నడివీధినున్న హనుమద్విగ్రహమునకు వందన మాచరించి అటనున్న సిందూరమును ఫాలమున దాల్చి ఏగుదురు.

ఆచార ప్రకారము స్నానము, సంధ్య అయిన వెనుక గాయత్రీ మహా మంత్ర పూర్వకముగా ప్రాణాయామ మొనర్చి భూశుద్ధి యొనర్చి, రంగవల్లికలు దీర్చి, చిత్రాసన మేర్పరచి అష్టదళ పద్మ చక్రమునమర్చి, అందు వస్త్రాలంకార సింహాసనమునుంచి, త్రిమూర్త్యాత్మకుడు భక్త రక్షకుడు, కాంచన వర్ణ విభాసితుడు అయిన హనుమంతుని ధ్యానించుచు ఆ స్వామి ప్రతిమను అందు ప్రతిష్ఠించి 'ఆవాహితో భవ' సన్నిహితో భవ, స్థాపితో భవ, సమ్ముఖో భవ ప్రసీదో భవ అని ఉచ్చరించి షోడ శోపచారములు జరుపవలెను. ఈ పూజా విధానము నాలుగు ఆవరణలుగా వివరింప బడినది.

తరువాత హోమ విధానము చెప్పబడినది.

హనుమత్ సప్తాక్షరీ మంత్రమునుచ్చరించుచు ఆవునేయి ధారగా పోయుచు హవ్య ద్రవ్యమగు బియ్యముతో హోమము ప్రతిదినము చేయవలయును. గరిక, సమిధ, ఫలము, పత్రము, పూలు కూడ హోమ ద్రవ్యములుగా వినియోగింతురు.

ఇవియైన వెనుక మంత్రాంగ విధానమును భక్తులొనర్తురు. హనుమంతుని మంత్ర రూపమహిమ వర్ణింప ఎవ్వరికిని శక్యముగాదు. ఎక్కువ తక్కువ, పేద ధనికుడు, అను విచక్షణ స్వామికి లేదు. వారి వారి భక్తి తత్పరత ననుసరించి హనుమంతుని దయానుగ్రహ ఫలములు తప్పక కలుగును.

పుణ్య దినములందు పర్వదినములందును హనుమత్పూజ విశేషఫల ప్రదము. భక్తులకు ప్రతి దినము భగవత్పూజా విధియే. అయినను ఆయా తిథులందును ఆయా నక్షత్రములందును పూలు నివేదనలు ఆంజనేయునకు ప్రీతి కరములని శాస్త్రములందు నిర్దేశింపబడినవి.

ఈ పూజా విధానము నందు ముఖ్య భాగముగా చెప్పబడిన హనుమత్సూక్తము, పరాశర సంహిత 41వ పటలమున నున్నది. ఈ సూక్త పఠనము సకలాభీష్ట ఫలమనియు వర్ణింపబడినది.

హరిహరాది ముఖ్యదైవములకు జరిగినట్లే ఆలయములందు ఇతర ప్రదేశములందును నిత్య పూజలు సేవలు ప్రత్యేకముగ హనుమానునకును జరుగు చున్నవి. ఇతర దైవత పూజలకు వలసిన వైభవముల పట్టింపు హనుమానుని పూజకంత ఆవశ్యకములు కాకపోవుటయే హనుమానుని పూజ ఎక్కువ ప్రజాదరణ నందుటకు కారణము.

నిత్యదర్శనము నిత్యసేవలు గాక సంవత్సరములో హనుమానుని పూజకు రెండు ప్రత్యేక దినములున్నవి. ఒకటి హనుమజ్జయంతి. వైశాఖ బహుళదశమి శనివారం పూర్వాభాద్ర నక్షత్రము నాడు. హనుమపుట్టుక శనివారము నాడు కాదు, మంగళ వారము హనుమానుడు జన్మించెనని కొందరందురు. శనివారము మంగళవారము ఈ రెండును హనుమంతునకు ప్రీతికరములైనవే. ఆ వారములలో ఆ బాలవృద్ధులు పెక్కుమంది హనుమంతుని దర్శనము చేసికొని ప్రదక్షిణ నమస్కారములాచరించి తీర్థప్రసాదములు స్వీకరించుట ఆంధ్రమున ఒక విశిష్టాచారము. రెండవది, హనుమద్వ్రతము మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు జరుపు కొందురు. విఘ్నేశ్వర, సరస్వతీ వ్రతములనాచరించిన విధముగనే హనుమద్వ్రతము యథా విధి చేయుదురు. మనధార్మికవిధానములో తపోధ్యానాది నిష్ఠలతో నిర్గుణ నిరాకార పరమాత్మను ఎట్లు భావింతురో సగుణాకృతులగు దైవ విగ్రహములకు చేయుపూజలకును అంత ప్రాధాన్యమున్నది. జ్ఞానయోగి యయిన శ్రీ శంకర భగవత్పాదులు గూడ సగుణమార్గదైవ పూజలకును ప్రాధాన్యమిచ్చిరి. వారి శివానందలహరి సౌందర్యలహరి, ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రములును ఇట్టివే.

పై జెప్పబడిన వ్రతములును నిర్దేశింపబడిన కొన్ని పర్వదినములున్నను ఇష్టదైవ మెవరైనను ప్రతిదినపూజార్హుడే. ఆడంబరములకన్న చిత్త శుద్ధిగల భక్తి ప్రధానము. గంపలకొలది మిఠాయిలు నివేదనమిచ్చినను లేక ఒక పండో పత్రమో అ చంచల భక్తితో నివేదన మీయగలిగినను భగవానుని కరుణాదృష్టి భక్తులపై ఒకే విధముగా నుండును. ఏమియు ఈయలేని వారు హృదయమిచ్చి నమస్సునర్పించినను భగవానుడు సుప్రసన్నుడే.

సర్వసామాన్యముగ హనుమానుని ఆకారమొకటి ఉన్నది. కుడి చేతితో అభయహస్తము, ఎడమ చేత భీకరమైన గదాయుధము. ఇట్టి విగ్రహమునే చాల చోటుల చూచుచుందుము. హనుమానుని మహత్త్వమంతయు ఆ సుందర గంభీర విగ్రహమందున్నది. భక్తుల భయములను పారద్రోలి సర్వసౌఖ్యములు భుక్తిముక్తులు ప్రసాదించు అభయ ముద్ర అది. మరొక ప్రక్క, భక్తుల వ్యాధి బాధలు కష్టనష్టములు భూత ప్రేత పిశాచముల పీడలు దరిజేరకుండ విధ్వంసమొనర్చు ఉగ్రగదాయుధముద్ర రెండవది. హనువమానునకు అసాధ్యమనునది లేదు. హనుమంతుని ప్రత్యక్ష దర్శనము పొందిన తులసీ దాసిట్లు స్తుతించినాడు.

దుర్గమ కాజ జగతకేజేతే, సుగమ అనుగ్రహతుమ్హారే తేతే॥
సబసుఖలహై తుమ్హారీశరనా, తుమరక్షక కాహుకోడరనా॥
భూత పిశాచనికట నహిఁ ఆవై మహా వీర జబనామ సునావై॥
ఔరమనోరథ జోకోయీ లావై తాసు అమిత జీవనఫలపావై॥
సంకట హటైమిటై సబపీరా, జోసుమిరై హనుమత బలవీరా॥
అష్టసిద్ధి నౌనిధికేదాతా, అసవరదీన్హజానకీమాతా॥

శ్రీరాముడు హనుమంతుని తన సమానము గనే చూచుకొనెను. హనుమంతుడు తృప్తినందినచో శ్రీరామునకు తృప్తియే.

ఇట్టి ఫలప్రదాత అయిన ఆంజనేయ విగ్రహమునే ఉదయమున నిదురలేవగానే మున్ముందు స్మరించి ధ్యానించి నిదురకు పోవనపుడట్లే మరల స్మరింతురు. పెక్కుమందికీ దైనందిన హనుమత్స్మరణ అలవాటే.

వివిధాలయములలో ఆంజనేయవిగ్రహము వివిధ రూపములలో

కానుపించును. విజయనగరాంధ్రభూపతి శ్రీకృష్ణదేవరాయలు తన గురువగు వ్యాసతీర్థులచేత అనేక హనుమదాలయములను నిర్మింప జేసెనట. ఎవరెట్లు రూపించుకొని పూజించినను, ఆంజనేయుడు ఆంజనేయుడే. పరమ కరుణాళుడు.

కొందరా స్వామిని పంచముఖ ఆంజనేయునిగా భావించి పూజింతురు. ఈ క్రింది శ్లోక మందులకు తార్కాణము.

వందే వానర నారసింహ ఖగరాట్ క్రోడాశ్వ వక్త్రాంచితం
నానాలంకరణం త్రిపంచనయనం దేదీప్యమానం రుచా॥
హస్తాబ్జైరసి ఖేలు పుస్తక సుధా కుంభాంశురద్రీన్ గదా.
ఖట్వాంగం ఫణిభూరుహే దశభుజం సర్వారిగర్వాపహం.

పంచముఖాంజనేయుడు శత్రు భయంకరుడు. భక్త జనక్షేమం కరుడు. పదునైదు నేత్రములవాడు - పది చేతులు - నానాలంకార శోభితుడు - దేదీప్య మాన తేజస్వి - చేతులందాయుధములేకాక పుస్తకము సుధాకలశమూ కూడ ఉన్నవి. తూర్పున వానరముఖం దక్షిణమున నారసింహముఖం, పశ్చిమమున గారుడముఖం ఉత్తరమున ఘోణివక్త్రం. ఉర్ధ్వమున అశ్వముఖం భక్త జనులకు ప్రసన్న సుందరమ్మైనది, శత్రువులకు భయంకరమ్మైన రూపమది. ఇందుకొన్ని విష్ణు సంబంధమ్మైనది, శత్రువులకు భయంకరమ్మైన రూపమది. ఆయాముఖముల కనుగుణవములగు బీజాక్షర మంత్రవములు ఉపాసనావిధులు ఉన్న హరిహరాత్మకరూపమ్మై ఆయా ఫలితాలు ఉపాసకులకు ఇచ్చే మహాస్వరూపం అది.

హనుమంతునకు భక్తులొనర్చు పూజావిధానము, విధులు పుణ్యా తిథులు మున్నగు వివరములన్నియు పరాశరసంహిత 41వ పటలమున విశదముగనున్నవి. హనుమంతుడు మంత్ర రూపుడు. ప్రణవస్వరూపుడు. హనుమన్మాలా మంత్రములు హనుమత్ సూక్తములు కూడ యీ పటలముననున్నవి.

హనుమజ్జయంతి, హనుమద్వ్రత పర్వదినములందు శక్తి కొలది హనుమంతుని విగ్రహమును చేయించి యథావిధిగ పూజా పీఠమున ప్రతిష్ఠించి పూజలొనర్తురు. బహువిధములగు తీయని పండ్లు పరిమళ పుష్ప పత్రములు ధూపదీప నీరాజనములు స్తోత్ర పాఠములు నివేదనములతో కూడిన

షోడశోపచారములొనర్చి ప్రదక్షిణ నమస్కారములర్పింతురు. శక్తి కలవారు నిష్ఠాపరులు ప్రతిదిన పూజలందును ఈ ఉపచారములన్నియు కావింతురు. తెలుగు వారు ముఖ్యముగ హనుమత్పూజలందు అరటి పండ్లు తమలపాకులు తులసీదళమాలలు తీయని అప్పములను నివేదన మొనర్తురు. హనుమంతుని కిష్టమగు సిందూరకుంకుమముతో పూజ చేసి ఆ కుంకుమను తీసికొని కండ్లకద్దుకొని తిలకముగ ధరింతురు.

హనుమంతుని రూపము వర్ణనాతీతమగు అత్యంత సుందర విగ్రహము. మణిగణకిరీట శోభితుడు. సిందూర తిలకాంచిత ప్రసన్నాస్యుడు, హేమవర్ణుడు హారవిభూషితుడు. సువర్ణోపవీత ధారి. కనక కుండల మండితుడు. దుకూలాంబరుడు ధ్యానముద్రాభిరాముడు. మహాబలుడు మహాతేజస్వి - కామరూప సమర్థుడు. సద్బ్రహ్మచారి. నిష్కళంక పవిత్ర చరిత్రుడు. శివస్వరూపుడైన ఆ మూర్తి నూహించుటే పరమ పుణ్య ప్రదము.

హనుమత్స్మరణమాత్రమున ఎన్నియెూ లాభములున్నవని, ఆ మహనీయుడు త్రిమూర్త్యాత్మకుడనియు ఆయనను పూజించిన సర్వ దేవతలు పూజింపబడినట్లేయనియు పూర్వ శాస్త్రములలో చెప్పబడినది. అవి మరొయొకసారి భక్త జనుల ఉపయోగార్థము ఇచ్చుట ఉదహరింపబడుచున్నవి.

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా।
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాద్భవేత్॥
ఆంజనేయః పూజితశ్చేత్ పూజితాసర్వదేవతాః॥
హనుమన్మహిమాశక్యో బ్రహ్మణా పినవర్ణితమ్॥

ఇంతటి మహిమాన్వితుడైన హనుమానుని చిత్తశుద్ధితో ఉపాసింపగలవారికి ఏలోపమును ఉండదు. ఏ భయమును కలుగదు. ఆయన కరుణార్ద్ర హృదయుడు భక్తసులభుడు తన భక్తుల కెట్టి వరప్రదాన మొసగెనో చూడుడు.

ఐహికేషుచ కార్యేషు మహాపత్సుచ సర్వదా
వ్యసనే సమనుప్రాప్తే మాం స్మరేద్రామసేవకమ్॥
వాంఛితార్థాన్ ప్రదాస్యామి భక్తానాం రాఘవస్యతు
సర్వదా జాగరూకోస్మిరామ కార్యధురంధరః॥

నా భక్తులకు రామభక్తులైన వారికి ఎక్కడ ఏవిధమైన ఆపద వచ్చినః రామ దూతనైన నన్ను స్మరించుడు నేను జాగరూకుడనై మీ కోరికలన్నిటి తీర్చెదను. ఇది భక్తజనులకు హనుమానుడిచ్చిన వాగ్దానము.

అనన్యాః చిన్తయన్తో మాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥

ఇతర చింతలు మాని నన్నేనిరంతరము స్మరించి పూజించువా యోగక్షేమములు నేనే నిర్వహింతును. అని అర్జునునకు తాను ఒసంగిన ఉపదేశమందు శ్రీకృష్ణ భగవానుడు పలికిన అమృత వాక్యములనే హనుమాను పలుకులు తలపింపజేయుచున్నవి.

హనుమంతుడు త్రిమూర్త్యాత్మకుడు. అంతటి శక్తి కలవాడు కనుకనే తన అభయదానమును అంతనిరా ఘాటముగ చెప్పగలిగి నాడు.

హనుమంతుడు - మంత్ర రూపుడు

హనుమంతుడు మంత్ర రూపుడని మిక్కిలి ప్రసిద్ధి. మంత్రము మంత్ర జపము అనిన పదములకు గల అర్థము పరిశీలనార్హము. దైవ పూజా విధులందు ఈ పదములకు ప్రత్యేకార్థము కలదు. భక్తులు తమ తమ యిష్టదైవములను, వారి నామములకు ముందు వారి అనుగ్రహ ప్రాభవములను దెలుపు బీజాక్షరము లుంచి, వానికి మొదట ఓమ్ అను ప్రణవమును జేర్చి నమస్సులను తెలుపుచు తుట్టతుదను చతుర్థీ విభక్తిని జేర్తురు. తమ యిష్టదైవ స్వరూపములను మనసునందుంచి నిశ్చల ధ్యానమున మననము జేయుటయే మంత్ర జపము. కొన్ని మంత్రములు దైవ నామములతోనే ఉండును. ఉదాహరణకు ఓమ్ నమశ్శివాయ "ఓమ్ నమో నారాయణాయ" అనునట్లు.

మంత్రములందు కల బీజాక్షరములు ఆయా దేవతల బల పాటవములను ఆవాహన జేసికొనుటకు తపస్సిద్ధులేర్పఱచిన పవిత్ర పదములు. ప్రసిద్ధ ఆచారముగ బీజాక్షర సంయుతములైన మంత్రములను గురువుల నుండియే భక్తులుపదేశమును పొందుదురు. ఆ మంత్రములను హృదయములందు నిగూఢముగ నుంతురు. భగవంతుడు మంత్రాధీనుడని ఆర్యోక్తి - మంత్రముల కంతటి మహాశక్తి యున్నది.

సకల దేవతలకును వారివారి కేర్పఱచిన మంత్రములుండగా విశేషించి హనుమంతుని మంత్రరూపుడనుటలో ఒక ప్రత్యేకత ఉన్నట్లు తోచును. రామాయణములోని సుందర కాండ కథ యంతయు హనుమంతుని పాత్ర ప్రధానముగా కలదియే. సుందర కాండమును మంత్రశాస్త్ర మనియే విజ్ఞులందురు. ఆయా ఫలములను బట్టి హనుమంతుని గూర్చి భక్తులు అనుష్ఠించు పెక్కు మంత్రములున్నవి. చిన్నచిన్న హనుమత్ ప్రతిమలను నిత్య రక్షగా జనులు మెడలందు కట్టుకొని దగ్గఱనుంచు కొందురు. ఆంజనేయుడు అంతటి పూజామూర్తియు, పరమేశ్వర స్వరూపము కనుకనే మంత్ర రూపుడుగ పూజార్థమున జనులు భక్తితో భావింతురు. వైష్ణవులకు వైష్ణవుడుగ శైవులకు శైవుడుగ సర్వజన పూజ్యుడు హనుమంతుడు.

హనుమదుపాసకుల సాధనకు పెక్కు మంత్రములున్నవి.

హనుమన్మంత్రములు 500లు ఉన్నట్లు పురాణేతిహాసములు చెప్పుచున్నవి. కొన్ని మంత్రములకు పెక్కు రీతులును ఉన్నవి. శ్రేయః ప్రదములు సర్వకార్య సాధకములు భయ నివారకములు పిశాచాక్షరి మున్నగునవి, హనుమన్మాలా మంత్రము, హనుమన్మాలమంత్రములున్నవి. మంత్రోచ్చారణమునకు స్థలశుద్ధి చిత్తశుద్ధి ఉచ్చారణ శుద్ధి ఆవశ్యకము. సామాన్యముగ హనుమన్మంత్రము నుచ్చరించు స్వేచ్ఛయు కలదు.

తిష్ఠన్గచ్ఛ సమాసీనః-శయాళుర్వాస్వపన్నపి
భుంజానో భాషమాణో వా-మల మూత్ర విసర్జనే
అనులోమ విలోమాభ్యాం- హనుమన్మంత్రముచ్చరేత్

అను శ్లోకము ఈ భావమునే విశదీకరించుచున్నది.

హనుమన్మంత్రము లెన్నియున్నవో అదే సంఖ్యలో చక్రవిన్యాసములును కలవందురు.

మంత్రోచ్చారణకు ముందు మూడు సార్లు ప్రాణాయామము చేయవలెను. అంతమునందును అట్లే చేయవలెను. హనుమన్మంత్ర చక్రము లన్నింటికి పదునారు ముద్రలు నాల్గు ఆవరణలు అయిదు న్యాసములును చేయదగియున్నవి.

హనుమన్మంత్ర శాస్త్రమొక మహార్ణవము వంటిది. అంతులేని అగాధ రహస్యములందున్నవి. హనుమదర్చనలలో మంత్ర విధాన మత్యుత్తమము, అత్యంత ఫల ప్రదమును. ఎవరెట్లు ఈ విధానమున పూజ చేయగలిగినను హనుమంతుడెల్లవేళల సుప్రసన్నుడు భక్తరక్షకుడునయి తత్ఫలితముల నిచ్చుదైవమే. భక్తులు హనుమన్మంత్రోపదేశమును సద్గురువుల నుండి పొందుట ఆచారము.

ఈ పూజా విధానములో పఠింపదగినదియు విశేష ఫలప్రదమునయిన హనుమత్సూక్తము ఈ క్రింద నీయబడినది.

శ్రీ హనుమత్సూక్తమ్

పరాశర సంహిత : 41వ పటలము

శ్రీ మన్తః సర్వలక్షణ సంపన్నః జయప్రదః సర్వాభరణ భూషిత ముదారం మహోన్నతోష్ట్రమారూఢః కేసరి ప్రియనందనః వాయుతనూజః యధేచ్ఛ పంపాతీర విహారః గంధమాదన సంచారః హేమ ప్రాకారాంచిత కదళీ వనాంతరనివాసః పరమాత్మా వనచరశాప విమోచనః హేమవర్ణాం నానారత్న ఖచితా మ మూల్యతరాం మేఖలాంచ స్వర్ణోపవీతాం కౌశేయ వస్త్రంచ బిభ్రాణః సనాతనః పరమ పురుషః మహాబలః అప్రమేయః ప్రతాపశాలీ రజిత వర్ణః శుద్ధ స్పటిక సంకాశః. పంచవదనః మహేంద్రా ద్యష్ట దిక్పాలక త్రయస్త్రింశద్గీర్వాణ ముని గణ గంధర్వ యక్ష కిన్నర పన్నగాసుర పూజిత పాద పద్మ యుగళః నానావర్ణః కామరూపః కామచారః యోగిధ్యేయః శ్రీ హనుమాన్ ఆంజనేయ విరాడ్రూపీ విశ్వాత్మా విశ్వరూపః పవన నందనః పార్వతీ పుత్రః ఈశ్వర తనూజః సకల మనోరథాన్నోదదాతు.

ఇదం శ్రీ హనుమత్సూక్తం యో ధీమాన్యేకవారం పఠే
ద్యది సర్వేభ్యః పాపేభ్యోవిముక్తో భూయాత్.

తా॥ : ఈ శ్రీ హనుమత్సూక్తమును ఏకాగ్రబుద్ధితో ఒక్కమారు, పఠించినను ఆతడు సమస్తములగు పాపములనుండి విముక్తుడగును.

హనుమత్ప్రబంధము

మూడవ భాగము

ఆంజనేయుని మహిమను తెలుపు కథలు గాథలు

వెనుక చెప్పబడిన అధ్యాయములలో ఆంజనేయుని చరిత్రమును గూర్చియు, ఆంజనేయ తత్త్వమును గూర్చియు కొంత వివరింపబడినది. ఆ మహనీయుని గూర్చి సంపూర్ణముగ నుడువుట బృహస్పతి కైనను శక్యముగాని పని. రాముని కాలము నుండి ఈ నాటి వరకు హనుమంతుని గూర్చి ఎన్నో స్తుతి పాఠములు చరిత్రలు కావ్యములు శతకములు కోకొల్లలుగా వచ్చినవి. ఇకముందును ఇట్లే వచ్చును, ఎల్లకాలము ఇట్లే వచ్చినను పరమాదర్శ ప్రాయములైన ఆయన సద్గుణములు మహత్త్వము దయా స్వభావము ఎన్నిసారులెందరు ఎంతగా వర్ణించి వ్రాసినను చాలదు. ప్రపంచ మున్నంతకాలము వారి చరిత్ర ఇట్లే లిఖింపబడుచు పఠింపబడుచు భక్తజన రక్షయై మానవ జాతికి స్ఫూర్తిదాయకమ్మై విరాజిల్లుచుండును.

మన పూర్వ ఋషులచే బోదింపబడుచు యుగ యుగముల నుండియు నిరంతర జీవనదీ ప్రవాహము వలె వచ్చుచున్న ఆంజనేయ చరిత్రను గూర్చిన కావ్యములు అసంఖ్యాకములుగ నున్నవి. అందు పరాశర సంహిత యనునది ముఖ్యమైనది. వందల కొలది గల పటలములలో వేలకొలది శ్లోకముల గల గ్రంథమిది. వ్యాస భగవానుని తండ్రి పరాశర ఋషీంద్రునిచే మైత్రేయమహా మునికి ఆంజనేయ చరిత్ర బోధింపబడినది. సంహిత అనగా వేదమునందొక భాగమని అర్థము. ఈ చరిత్రను గూడ పరాశరసంహిత అనుటలో వేదముల కున్న మహత్త్వము కల శాస్త్రము ఈ హనుమంతుని చరిత్రయని చెప్పటయే. ఈ సంహిత నుండి తీసి కొనబడిన కొన్ని కథలు ఈ తరువాతి పుటలలో నీయబడినవి.

పరాశురుడనగా మైత్రేయుడనగా పరమ సిద్ధులైన మహర్షులు. వారి వలన మహాభాగ్యముగా మనకందిన శ్రీ ఆంజనేయుని చరిత్రము సర్వ జనులకు పఠనీయము, పూజనీయము. ఇహపర సౌఖ్యప్రదము.

కపిలుని చరిత్రము

పరాశర సంహిత - 21వ పటలము

గంగాతీరమున బార్హస్పత్య పురమను గ్రామమున కపిలుడను నొక విప్రుడు కలడు. అతడు సదాచార సంపన్నుడు. దైవచింతనుడు. తన కాలము నంతయు దైవనామ జపమునందే గడపుచుండువాడు. భార్యా పుత్రులను పోషించుకొన లేని దరిద్రుడయ్యు హనువంతుని మంత్రమును జపించుకొనుచు సాయంతనమగు సరికేదో కాయగూరయో ఆకు కూరయో తీసికొని యింటికి పోయి దాని తోనే తాను కుటుంబముతో కాలక్షేపము సేయుచు అప్పుడప్పుడు అదియునులేక పస్తుండువాడు.

ఒకనాడు గంగయందుండి హనుమన్మంత్రము పఠించుచు కాల గమనము కూడ నెరుగక జపదీక్షాతత్పరుడై యుండగా ధ్యానమూర్తియగు హనుమంతుడు ప్రత్యక్షమయ్యెను. నాలుగు చేతులు, చంద్రుని బోలు దేహకాంతి, తెల్లని జందెము. రత్నకుండలములు, దువ్వలువలు, దర్భల మొలత్రాడు. ఆమూర్తి దివ్య తేజోమయముగా ప్రకాశించుచుండెను. ఆ వానర శ్రేష్ఠుని ప్రక్క జాంబవంతుడు వినతుడు నలుడు మైందుడు ద్వివిదుడు కూడ నుండిరి. వారందరును హనుమద్భక్తులే. హనుమవాలమునకు అభిషేకము చేసిన జలము వలన అచ్చట "వాల సాగర" మను నదియును పుట్టినది. కపిలు డానదిని పూజించి జాంబవదాదులను పూజించి హనుమకు ప్రార్థనలు పూజలర్పించి చీకటి పడుటచే ఇంటికి మరలెను. ఈ భక్తుడు చేయుచున్న పూజలు చూచిన హనుమంతున కెంతయో తృప్తికలిగినది. ఏదైనను కోరుకొమ్మని చెప్పినను హనుమత్స్మరణలో అన్నియును మరచిన విరాగియతడు. ఏమియు కోరుకొనక అట్లే యిల్లు చేరుకొనెను.

అయ్యో కూరాకు అయినా చేతితో పట్టుకొని రాలేదు. ఈ రాత్రి ఏమివండి పిల్లలకు పెట్టెదను. కట్టుకొనుటకు బట్ట, తినుటకు తిండి యీయలేని ఈ సంసార మెట్లు సాగును. మీ జపతపములు మీ పిల్లల కొకనాడయినా తిండిపెట్టగలవా! ఎందులకీ వృధాశ్రమలు అని ఆరాత్రంతయు కపిలుని భార్య విసుగు కొనుచునే త్రాగుటకు మంచి నీళ్ళిచ్చి పిల్లలను పరుండ బెట్టినది.

మఱునాడు తెల్లవారినది. భార్య అదే సణుగుడు. ఎంత చెప్పినను వినదు. "నాకు నిన్న హనుమంతుడు ప్రత్యక్షమై ప్రసన్న ముఖమున నన్ను చూచినాడు.

నాజన్మ ధన్యమైనది. మరేమి కావలెను'' అని కపిలుడనగా భార్యవెంటనే, ''ఔను! హనుమంతుడు గొప్పవాడే, మీరునూ ధన్యులు. మీ కుటుంబమునకు మాత్రము దారిద్ర్యము తప్పదు ''అని విసుగుకొనుచుండగా వినలేక కపిలుడు వాలసాగరమునకు హనుమన్నామ జపమునకేగెను. అతడా నిష్ఠలో నుండగా హనుమంతుడు ప్రత్యక్షమయి కపిలుడు లోలోపల పడుచున్న బాధను తెలిసికొని ''కపిలా నీవు నా భక్తుడవు మీకు క్షేమ సౌఖ్యములు కలుగజేయుట నా కర్తవ్యము. మీ పెరటిదొడ్డిలో రేగు చెట్టు క్రింద ధనము పాతర నిధియున్నది. దానిని తీసికొని సుఖింపుడు అని వరమిచ్చి పంపెను. కపిలుడు సంతోషముతో ఇంటికివచ్చి భార్యకీ వార్తను తెలుపగా, ఆమెకేమాత్రము సంతోషము కలుగలేదు సరికదా మరల భర్తను నిందించుటకు మొదలిడెను. ''సరసముగనే ఉన్నది. మీరు భక్తులు హనుమంతుడు భగవానుడు. భక్తుని యందు దయ ఉన్నచో తానే ఈ రాతి నేలను త్రవ్వి ధనపు బిందెను తీసియీయవచ్చునుగదా. శ్రీరాముడు సేతువును కట్టినపుడు పెద్ద పెద్ద బండలనే అతడు పెకల్చుకొనివచ్చెనని మీరు చెప్పుదురు. ఈమాత్రపు బరువు ఆయన త్రవ్వితేలేడా! మీరు త్రవ్వుదురా, నేను త్రవ్వుదునా! నేలలో నున్న ధనము ఉన్ననూ లేకున్ననూ ఒకటే'' అను మాటలు కపిలుడు వినలేకపోయెను.

పరమ కరుణామూర్తి దయదలచి వరమిచ్చినాడు. దానిని త్రవ్వి తీసి మోసికొనివచ్చు భారము కూడ భగవంతునిదేనా. నా భాధ నాకే ఉండునుగాక నేనీమాటలా భగవానునకు చెప్పజాలను అని హనుమత్ షోడ శాక్షరీ మంత్రము జపించుచు కపిలుడు పరుండెను. తెల్లవారినది. కపిలుని భార్య నిద్రలేవగనే కనులు మిర్మిట్లు క్రమ్మినవి. బంగరు నాణెములు రత్నములు మణులు నిండిన ధనపు బిందె తనముందున్నది. ఇల్లంతయు బంగరుమయముగా వెలిగిపోవుచున్నది. హనుమంతుని దయాభిక్షకు అవశుడై కపిలుడు స్తోత్ర పాఠములు చేయదొడగెను. కపిలుని భార్యకు తెలిసివచ్చినది. భగవంతుని దయకు అసాధ్యమనునది లేదని, ఇంతవరకు తాను నిరర్థకముగ కాలము గడపినందులకు పశ్చాత్తాపమునంది కపిలుని భార్య తానును భక్తురాలయి హనుమంతుని పూజలనొనర్చెను. లబ్ధమయిన ధనమందు కపిలుడు భార్యయు తమకు కావలసినదే తీసికొని వాడుకొనిరి. తక్కినది హనుమద్భక్తులకు పంచిపెట్టిరి.

ఆ దంపతుల సద్భక్తికి సంతసించి వారికి ఇహమందు ఏలోపము కష్టము లేకుండ చేసి, పరమందు ముక్తిని గూడ హనుమంతుడు ప్రసాదించెను.

కశ్యపుని కథ

పరాశర సంహిత - 22వ పటలము

బ్రహ్మావర్తమను గ్రామమున కశ్యపుడను బ్రాహ్మణుడొకడు నివసించుచుండెను. అది ధన ధాన్య సంపన్నమగు గ్రామము. కశ్యపుడును ధన వంతుడైన గృహస్థే. జపతపములు సదాచారములు అతిథి పూజలు వదలక నిత్యము హనుమంతునికి షోడ శోపచారములతో పూజలర్పించుచు ధన్య జీవియై కాలము గడపుచుండెను. ఇట్టి సదాచారములు నీతి నియమములు, ఎచ్చటనుండునో హనుమంతుడచ్చట భక్తరక్షకుడై యుండును. తన భక్తుడైన కశ్యపునకు కావలసిన వస్తువులన్నియు లభ్యమగునట్లు ఆ దేవుడే చూచుచుండెను.

కశ్యపుని యింటగల ధన వస్తు సమృద్ధిని కనిపెట్టి ఒక గజదొంగ ఆ యింటికి కన్నము వేసి ఎత్తుకొని పోవలెనను ప్రయత్నముతో నుండెను. కాని ఆ దొంగ ఎప్పుడు వచ్చినను ఆయుధ హస్తుడైన కావలి వానిగనో వేరొక రూపముగనో హనుమంతుడే అడ్డుతగిలి వాని ఆటలు సాగనీయకుండెను. ఎట్లో అవకాశము చూచుకొని ఒకనాడు మఱినలుగురు తోడు దొంగలను వెంటబెట్టుకొని కశ్యపుని యింటికి కన్నము బెట్టి లోనికి రాబోవునంతలో హనుమంతుడే కశ్యపుని వేషముతో ఆ దొంగ చేతిని గట్టిగా పట్టుకొని లోనికి లాగెను.

ఆ చోరుడును లొంగక హనుమంతుని తనవైపునకు లాగుచుండెను. ఈ సందడిని విని తోడు దొంగలు పాఱిపోయిరి. పెద్ద దొంగ ఒక్కడును హనుమంతునిచే చావుదెబ్బలు తిని విలపింప సాగెను. రాజభటులు చూచినచో వీనిని శిక్షింతురను దయతో దొంగను వదలి హనుమంతుడు అంర్ధానమందెను. ఇంతలో వీధిని బోవు నలువురును ఆ దొంగను పట్టుకొని చితుకదన్ని వదలిరి. ఆ దొంగ కాళ్ళీడ్చుకొనుచు తనదారిని తాను పోయెను.

తెల్లవారగనే తనయింటికి పడిన కన్నమును చూచి కశ్యపుడు దొంగ దొంగ అని పెద్దగా అఱచెను. వీధి నున్న వారు " ఇదియేమి కశ్యపా! నీవే గదా ఒక దొంగను రాత్రి పట్టుకొని చితుకదన్ని వదలితివి. అతడు పోవుచుండగా మేము చూచితిమి. ఏమియు ఎఱుగనట్లు మాటలాడుదు"వని మందలించిరి. కశ్యపున

కంతయు ఆశ్చర్యమైనది. కొంత సేపు మిన్నకుండి ఆలోచించుచున్న సమయమున హనుమంతుడే తన రూపమున ఈ దొంగను పారద్రోలి తనయింటిని రక్షించినట్లు తోచినది.

కశ్యపుని తలపులన్నియు హనుమంతుని పై భక్తితో నిండినవి. ఆహా! యీ దొంగ ఎంత పుణ్యుడు! భగవానుడైన హనుమంతుని హస్తస్పర్శ పాదస్పర్శ పొందెను. ఎంత తపశ్శాలికైనను లభ్యము కాని భాగ్యమిది. నేను పాపాత్ముడను. మొద్దునిద్ర పోయితిని. హనుమంతుని దర్శన మైనను నాకు కాలేదు. ఇంకను ఎన్ని జన్మలెత్తవలెనో ఆ దయామయుని అనుగ్రహము పొందుటకని చింతాతప్తుడై పూర్వము కన్న మిక్కుటముగా హనుమంతుని పూజించుచుండెను.

హనుమంతుడు అపార కృపాంతరంగుడు. తన భక్తుడైన కశ్యపునకెట్టి కష్టము రాకుండ కాపాడుచు తుదకు పరమపదానంద ప్రాప్తిని కలిగించెను.

హరిశర్మ కథ

పరాశరసంహిత - 23వ పటలము

పవిత్ర గోదావరీ తీరమున కుశతర్పణమను గ్రామమున హరిశర్మయను బ్రాహ్మణోత్తముడు నివసించుచుండెను. అతడు వేద వేది. సర్వ శాస్త్రజ్ఞుడు హనుమన్మంత్ర జపనిష్ఠాతత్పరుడు. జగమున హనుమంతుని మహిమ కన్న మఱియొక్కటి లేదను నిశ్చల విశ్వాసము కల భక్తుడాయన. ఉదయమున లేచినది మొదలు రాత్రి నిదురకేగువరకును హనుమన్నామ సంస్మరణము తక్క మఱియొక్కటి యెఱుగని హనుమదుపాసకుడు.

ఆతని మనసున ఒకనాడొక ఆలోచన తట్టినది. నిత్యము ఈ సంసార బంధమున జిక్కియిచ్చటనే పడియుంటివి. పుణ్య భారత భూమి యందు ఎన్నియో క్షేత్రములు తీర్థములు భగవన్మందిరములున్నవి. జన్మమెత్తి నందులకొక మారయినను వానిని దరిశించుట చరితార్థతయనుకొని ఆ మఱునాడే సుముహూర్తమేర్పఱచుకొని బయలుదేరినాడు.

మున్ముందు శ్రీకృష్ణ దేహసముద్భూతయగు కృష్ణానది కేగి పితృ తర్పణాదులను కావించుకొని అటనుండి శ్రీశైలమును జేరి భ్రమరాంబా సహితుడగు శ్రీ శివుని దర్శించి పూజించి, మార్గమధ్యమున భక్త వత్సలుడు అహోబిల లక్ష్మీ నృసింహదేవుని స్తోత్రము జేసి మహాభక్తుడగు ప్రహ్లాదుని గాంచి పూజించి పవిత్ర వేంకటాచలమును దర్శించు వాంఛతో బయలు దేరెను. మార్గ మంతయు దుర్గమారణ్యము, కొండలు, నదులు; వీనిని శ్రమ కోర్చి దాటిపోవుచూ క్షుత్పిపాస బాధతో పాటు ప్రచండముగనున్న సూర్యుని తాపమున కోర్వలేక హరిశర్మ స్పృహతప్పి పడిపోయెను. ఆ విప్రుని చూచువారెవరు. దీనులకు దేవుడే బాంధవుడు. ఎవరో ఒక శూద్రుడాదారిని పోవుచు మాట లేక పడియున్న యాత్రికుని జూచి కరుణాంతరంగుడై మేల్కొల్పి "ఓ యాత్రికుడా ఎవరు నీవు ఎచ్చటికేగుచున్నావు ఈ యెండలో ఇట్లు పడియున్నావని అడిగి తనవద్దనున్న అన్నమునిడి అచటి సెలయేటిలో నీటిని తెచ్చియిచ్చి సేదదీర్చెను". ఆహా యెవరీతడు దేవునివలె వచ్చి నన్ను రక్షించినాడు". అనుకొని అతనితో

మాటలాడుటకు హరిశర్మ ప్రక్కకు తిరుగగా ఆహారమిడిన ఆ శూద్రుడు కానుపించనే లేదు. ఆ మహాత్ముడు భక్త బాంధవుడు ఆంజనేయుడేమో అని కొంత యోచించి తుదకు, పిన్ననాటినుండియు నిరంతరము హనుమత్ స్మరణము పూజలొనర్చుచున్న నాకీ నాటికిని హనుమానుడు కానుపించనేలేదు. ఆ రూపమెట్లుండునో చూడనే లేదు. ఇక నీ జన్మకు ఆ భాగ్యము నాకు లేదేమో. కానిమ్ము నేనిట్లే ఎన్ని జన్మములకైనను హనుమద్భక్తుడనే అనుకొని తనకు అన్నమిడిన వ్యక్తికి మనస్సులో నమస్సులర్పించి తన యాత్రకు సిద్ధమగుచుండగా సుధర సువర్ణ వర్ణుడు. కుండల ధారి యజ్ఞోపవీత కనకాంబర మౌంజీ భూషితుడు ఆజాను బాహుడయిన ఆంజనేయుడు ప్రత్యక్షమై 'ఓ విప్రుడా నీవు నా భక్తుడవు నీ యోగక్షేమములరయుచు నేను నీకడనే యుందును. నీ కన్నమిడి దాహము తీర్చిన వ్యక్తిని నేనే. నీవిక భయపడ వలదు నీ యాత్రలు ముగించుకొని క్షేమముగా నీయిల్లు చేరుకొందువని దీవించి అంతర్ధానుడయ్యెను.

హరిశర్మ కంతయు మహాశ్చర్యముగ తోచి పరమానంద భరితుడయ్యెను. ఆ ఆనందముతోడనే వేంకటాద్రిపై నున్న పద్మా వేంకటేశ్వరుల నర్చించి ప్రసాదముగైకొని, కంచిలో వరదరాజస్వామిని శ్రీ కావేరితీరమున శ్రీ రంగనాధుని దర్శించి పూజలర్పించి సంతుష్టాంతరంగుడై తన యింటికి క్షేమముగా చేరెను.

హరిశర్మ తన గ్రామమునందున్న బంధు మిత్రులను ఆహ్వానించి, హనుమత్ పూజ భక్తి శ్రద్ధలతో కావించి, తీర్థ ప్రసాదములు విందు భోజనముతో వారిని సంతృప్తులగావించి, తన యాత్రా విశేషములు, మార్గమధ్యమున హనుమంతుడు తనకు సహాయమొనర్చిన విధము నుడివెను. అతిథులెల్లరు హరిశర్మ అదృష్టమునకు సంతోషించి హనుమంతుని కథలు చెప్పుకొనుచు గృహములకేగి భక్తి శ్రద్ధలతో హనుమంతుని పూజలను యథావిధిగ జేసి ధన్యులైరి.

తనకుటుంబమున ఏలోపములేని సమృద్ధితో నిరంతర హనుమత్పూజా తత్పరుడై హరిశర్మ కాలము గడపుచు తుదకు మోక్షసిద్ధి నందెను.

త్రిశూలరోముని వధ

పరాశర సంహిత - 31వ పటలము

ఆంజనేయుని కొకసమయమున పంపాతీర ప్రాంతములకు విహారము కేగు తలంపుదయించినది. దక్షిణ భారతమున నున్న ఒక పుణ్య సరోవరము పంప. సుగ్రీవుని కొలువులో నుండగా ప్రప్రథమమున ఆంజనేయుడు రామ లక్ష్మణులను చూచిన దా పంపాసరోవర ప్రాంతములందే. ఆ కారణమున తత్ప్రాంతములను మరల చూచు ఆసక్తి ఆయనకు కలిగినది.

పవిత్రత యందు మానస సరోవరమునకు దీటైన కొలను పంప. ఎల్లవేళల కైరవ పుష్ప శోభితము, నిర్మల జలాన్వితము, తీర ప్రాంతలతా గుల్మ కుసుమ సురభిళ గంధవహతర్పితమైన యా కాసారమెల్లరకును కనుల పండువు. నిలింపవనమునకు సమానమగు శీతల వన ప్రాంతము లాపంపా పరిసరములు. సీతావియోగమున కలత జెంది ఆమె కొరకు అటవీ సీమలు వెదకుచు వచ్చుచున్న సలక్ష్మణుడైన రాముని పంప వైపునకు వెళ్ళవలసినదని శబరి ఆదరించి పంపినది. అచటనే ఒకింత మనశ్శాంతి శ్రీరామ చంద్రునకు కుదిరినది. రామాంజనేయు లిరువురుకు పరస్పర మైత్రి గౌరవము అవగాహన కుదిరినదచ్చటనే. అదియే హరిహరాత్మకమైన సమ్మేళనము.

ఆంజనేయుడు తన వాహనమైన ఒంటెపై నరుదెంచినాడు. కాంచనవర్ణము, రత్నకుండలములు సువర్ణ యజ్ఞోపవీతము, రుద్రాక్ష తులసి హారము నుదుట నిలువు సిందూర తిలకము, ప్రభుకిరీటము, పట్టు పీతాంబరములు, బలిష్ఠమైన గద కలిగిన మహా తేజో వంతమైన ఆ స్వరూప కాంతులవలన నలుదెసలు భాసమానములైనవి. ఏదో విశేషముండియే ఆంజనేయుడు బయలుదేరు చున్నాడని సుషేణ జాంబవదాదులు ఆయన వెంట వెడలిరి. భక్తవరదుడగు ప్రభువరుడేతెంచుచున్నాడని మార్గము వెంట సర్వ ప్రదేశములందు భక్తులాయనను దర్శించి పూజలుగావించి నీరాజనములర్పించి దీవనలందుకొను వారే. కొందఱాయనను అనుసరించి వెళ్ళిరి.

పంపా తీరమునకు పావని వచ్చుచున్నాడని తెలిసి పరిసరవాసులు, సమీపముననున్న వానర రాజ్యము కిష్కింధావాసులు ఆంజనేయుని దర్శించి

ధన్యులమైతిమనుకొని సంతసించువారే. పంపాజలముల స్నానమాడుచు అచట లభించిన ఫలపుష్పములతో శ్రీరామ విగ్రహము నర్చించుచు సాయంతన మగుదాక ధర్మ పీఠమునందాసీనుడయి వేదోపనిషచ్ఛాస్త్రప్రవచనముల నచటి తపశ్శాలులచే చెప్పించువాడు.

ఒకనా డుదయమున మధుర బృహతీనాద గీతముతో దేవముని నారదు డరుదెంచి నాడు. ఆంజనేయు డెదురేగి నమస్కారములర్పించి, అర్ఘ్య పాద్యాది సేవలందించి అచటిశిలా వేదికపై మెత్తని ఆకులతో ఆసనమేర్పరచి ఆ సీనుని జేసి మధురఫల రసములు పట్టుతేనెలతో తృప్తి నొందించి, అన్యోన్య కుశల ప్రశ్నములయిన వెనుక ఆంజనేయుడు దేవమునీంద్రా! నీ దర్శనముచే మా బ్రతుకులు ధన్యములైనవి, ఈ ప్రాంత మంతయు మఱింత ధన్యమైనది త్రిలోక సంచారివి నీ వెఱుగని విశేషములుండవు ఏమైన నేను వినదగు మాట యున్నచో సెలవిండు అని నమ్రుడై అడిగెను.

నారదమునీంద్రుడంతట "ఆంజనేయా! శివాంశ సంభూతుడవయిన మహనీయుడవు, రామ మంత్ర మహిమాన్వితుడవు అప్రతిమాన ప్రజ్ఞా ధురంధరుడవు, భక్త వత్సలుడవు లోకపూజ్యుడవు, నీవింత వినతుడవై నాకు పూజలొనర్చుట నాకే ఆశ్చర్యమగుచున్నది. మాచే పూజలందుకొనుటకు సర్వవిధముల అర్హుడవు. మిమ్మొకసారి చూచిపో వలయుననియు ఒకమాట మీచెవిని వేయవలయునని నా అభిలాష. కాలచక్రము పైకి క్రిందకు పరిభ్రమించుచునే ఉండును. రామావతార కాలమున యావద్భారత వర్షమున దానవ దౌష్ట్యములంత మొందినవి. మరల ఆ విషపు దుంప నుండి అంకురములు బయలు వెడలి తీగలల్లి వ్యాపించుచున్నవి. అసిరోముడను మహారాక్షసుడు ప్రజలను నానాబాధలకు గురి చేసి యేగినాడు. వాని కుమారుడు త్రిశూల రోముడు అంతకన్న క్రూరుడు. తీవ్ర తపశ్శాలి. శంభుని వలన వరములందినవాడు. త్రిజగములందున తనకన్న బలవంతులు లేరని విఱ్ఱవీగుచు తన పరిపాలనము సాగించుచున్నాడు. పచ్చి రక్తము త్రాగు మాయావి యతడు. అతడు చేయని ఘోరవములు లేవు. పూజలు సాగవు. క్రతువులు నెరవేరవు. ప్రజలు భయపడుచున్నారు. అతడీ ప్రాంతమునందే స్వేచ్ఛగా తిరుగుచున్నాడట ఎవరును

అడ్డువారు లేకున్నారు. అనుమాటలు వినగానే హనుమంతుడు ఒక త్రుటికాలము ఆలోచించి మునీంద్రా! వినదగిన విషయమే చెప్పితివి. రాక్షసుల ఘోరములు తెలిసినవే. ఇంకను వర్ణన మెందులకు, ప్రస్తుతము నేనిచ్చటనే ఉంటిని గదా. ఆ తుంటరి రాక్షసుని పని నేను చూచుకొందును. మీరు కొంత విశ్రాంతిని తీసికొనుడు అని నుడివెను. ఆంజనేయుని మాటలయం దర్థము గ్రహించి కొంతవడి విశ్రమించి ఆంజనేయుని సెలవుగైకొని, "మరుత్తనయా నా వచ్చిన పనియైనది లోకమునకు మంచి దినములు రానున్నవి" అని వీణ వాయించుచు నారదుడు తనదారినేగెను.

నారదుడు విశిష్టలక్షణములు గల మునీంద్రుడు. వైకుంఠ వాసము నందును స్వేచ్ఛా ప్రవేశము గలవాడు. తీరిక యైనపుడెల్ల త్రిలోకములు తిరుగుచునే ఉండును. ఎచ్చట తిరుగునో, ఎవరిని చూచునో ఏమి మాట్లాడునో అని యన్నియు తుదకు, సార్థకములు సర్వజన ప్రయోజన కరములే. ఆ రహస్యము లాతనికే యెఱుక.

పంపా తీరమునకు ఆంజనేయుడు వచ్చివారము దినములైన కాలేదు. దినచర్య యథావిధి సాగుచున్నది. ఒక నాడుదయమున సమీప ప్రాంతము నందొక క్రతువు నారంభించి ఋత్విక్కులు సామగాన స్వరమున హవిస్సులను గ్రహించుటకు దేవతల నాహ్వానించుచున్నారు. వారి వేద గానమును ఆసక్తితో వినుటకాంజనేయుడు దగ్గరగానున్న చెట్టుపై రహస్యముగ నుండెను. ఇంతలో ఒక పెద్ద భయంకరధ్వనితో "దేవతలెవ్వరు? దేవతలకు దేవతను నేనే, ఆ హోమద్రవ్యములన్నియు నేనపహరింతు"ననుచు చెట్ల చాటున నుండి ఒక భీకర రాక్షసు డరుదెంచెను. అతడే త్రిశూలరోముడు. చేతులు సాచి యజ్ఞ సంభారముల నారక్కసి గ్రహించు లోపల ఆంజనేయుడు తోకను బెంచి ఆ దైత్యుని చేయివెనుకకు లాగి తానారక్కసిపై కురికెను. ఇది ఏదో విపత్తువచ్చి పడినదని త్రిశూలరోముడు హనుమంతుని క్రిందకు త్రోసి అతని వాలమును పట్టి త్రిప్పనారంభించెను అచటనున్న మునులు దేవతలు భయపడి ప్రక్క ప్రక్కలకు పోయి అక్కటా ఈ రక్కసికి ఆంజనేయుడే చాలకున్నాడు అని ఆందోళన పడసాగిరి. ఆ రక్కసుని ప్రతిరోమము దీర్ఘనిశిత త్రిశూలమే. ఎంతకును పట్టుబడి లొంగడు. హనుమంతుడెట్లో ఆతని తలపైకురికి ఒక చేయితో కంఠమును బిగించి

వంరొక్క చేతి పిడికిలితో వాని గుండెపై పొడువ మొదలిడెను. త్రిశూలరోముడాంజనేయుని ముష్టిఘాతలకు తాళలేక తప్పించుకొని పారిపోయి ఒక చిన్న రాతి పెంకుగ మారి ఒక శిలాగర్భమున దాగెను. హనుమంతుడది కనిపెట్టి తన గాన విద్యచే నా శిలను కరగింపగా త్రిశూలరోముడు నెత్తురులు క్రక్కుచు నిజస్వరూపముతో అందుండి బయలు పడెను. వాని కిసుమంతయు తడవీయక ఆంజనేయుడా రక్కసుని పట్టి పిడికిలితో వాని వక్షము బ్రద్దలు చేసి చంపెను.

మునుల యాగము సక్రమముగా కొనసాగినది. నీవే యజ్ఞకర్తవు యజ్ఞ హోతవు యజ్ఞ భోక్తవు అని ఆ మునులు హనుమంతుని పూజించిరి. లోకమున కారక్కసుని బాధలు అంతమైనవి.

నాగకన్య కథ

పరాశర సంహిత - 32వ పటలము

కింపురుష ఖండమున సుషేణుడను గంధర్వుడు సదాచార సంపన్నుడు, వేదవేత్త, ప్రతిదినము నిష్ఠానియమములతో హనుమంతుని పూజించు భక్త శిఖామణి, ఉత్పలాక్షియను నొక నాగకన్య ఆకస్మికముగ వచ్చి ఆసుషేణుని కాళ్ళమీద బడి "ఓ జ్ఞాన భాస్కరా! నీవేనాకిపుడు శరణు. దయామయా! రక్తరోముడను క్రూరరాక్షసుడు నాగలోకమును జేరి అందరిని బాధించుచు నా సౌందర్యమును చూచి నామీద పడెను. వేరుదిక్కులేక నిన్ను జేరితిని ఆతని బారినుండి నన్ను రక్షింపుము స్వామీ!" అని విలపించ సాగెను. దయామయుడైన ఆ సుషేణుని గుండెలు కరిగినవి. 'ఓ కుమారీ విచారింపకుము. రాక్షసుల బాధల నుండి లోకుల తప్పించుటకు దైవము ఆంజనేయుడున్నాడు అని నుడివి హనుమన్మాల మంత్రము నుపదేశించెను. ఆమెయు భక్తి శ్రద్ధలతో పరమనిష్ఠాపరురాలై హనుమన్మంత్రము నిత్యము జపించుచు తన మొఱలామహనీయునికి వినిపించునా అనిసందియపడు చుండగా ఒకనాడు ఆమె కత్యాశ్చర్యమైనది. హనుమంతుడామె ముందు ప్రత్యక్షమై ఆమె బాధలను విని వెంటనే ఆమెతో నాగలోకమున రక్తరోముడున్న చోటికి ఏగగనే రక్తరోముడు హనుమంతుని చూచి మహోగ్రహాకారుడై "ఓహో నీవేనా ఆంజనేయుడనిన వానరుడవు. మాత్రిశూల రోముని చంపిన వాడవు" అని పెద్దపులి వలెనోరు తెరచి ఆంజనేయుని మ్రింగబోయెను. అదే అదనుగ ఆంజనేయుడు తనతోకతో వాని కాలు సేతులను కట్టివైచి రెండు చేతుల తోడను వాని వివృతవక్త్రమును పట్టి చీల్చి తలను రెండు ముక్కలుగ చేసి చంపెను. మహావీరుడై వచ్చిన రక్తరోముడు హనుమంతుని చేతి యందొక నిమేషమున పడిచచ్చెను.

నాగలోక నాయకమణియైన ఉత్పలాక్షి ఆంజనేయునికి దండప్రణామము లాచరించి హనుమంతుని మహిమను నాగలోకమున నాలుగు ప్రక్కలకు వ్యాపింపజేసెను.

సుముఖుని కథ

పరాశర సంహిత - 34వ పటలము

భారతోత్తర ఖండమున శ్రీ భద్రమను పేరనొక నగరము కలదు. అందు సుముఖుడను నొక బ్రాహ్మణోత్తముడు నివసించుచుండెను. అతడు హనుమత్ సప్తాక్షరి మంత్ర దీక్షా పరుడు. హనుమత్ప్రీతి కొరకు పూజా దినములందు ప్రత్యేకముగా పెక్కుమంది బ్రాహ్మణులను పిలిచి తీర్థ ప్రసాదములిచ్చి విందు భోజనము లేర్పాటు చేయువాడు. ఆ బ్రాహ్మణునికవసరమగు నేతిని ప్రతిదినము గోపాలుడొకడు తెచ్చి అమ్ముచుండువాడు.

ఒక దినమున ప్రత్యేకమైన హనుమత్పూజ నేర్పాటు జేసి పూజ్యులగు బ్రాహ్మణులను అతిథులుగా ఆహ్వానించి కార్య క్రమమును సుముఖుడారంభించెను. అతిథులందరు వచ్చిరి. పూజలు హోమములు చేయించు పురోహితులు వచ్చిరి. కాని గోపాలుడు నేయి తీసికొని రాలేదు. సుముఖుని కాందోళన యెక్కువయ్యెను. సుమూహూర్తము దాటుచున్నది. తన భక్తుని పూజలు భంగముగునట్లు తోచి ఆంజనేయుడే గోపాలుని వేషమున రెండు నేతి కుండలను నెత్తిపై పెట్టుకుని సమయమున కిచ్చినాడు. సుముఖుని వ్రతము యథావిధి పరి సమాప్తి అయినది. అందరికిని సంతృప్తి కలిగినది. అతిథులెల్లరు సుముఖుని ఔదార్యమునకు, దైవ భక్తికి మెచ్చి దీవించిరి. ఆనాడు వచ్చిన మాయ గోపాలుడును సుముఖుని పూజా ప్రసాదము స్వీకరించి తృప్తి పడి వెడలెను.

గోపాలుడు ప్రక్క పల్లెనుండి మధ్యలో ఒక చిన్న సెలయేరు దాటి రావలెను. సుముఖుని వ్రత దినమునాడు యథాపూర్వము నేతిని తీసికొని పెందలకడనే యేటి యొడ్డునకు వచ్చెను. రాత్రి కురిసిన కుంభవృష్టికి యేరు ఉప్పొంగి ప్రవహించుచున్నది. గోపాలుడు దాటలేక పోయెను. మఱునాడును అట్లే అయినది. బ్రాహ్మణోత్తముడు శపించునేమో నేయి అందలేదని భయపడుచు, గోపాలుడు హనుమత్పూజనే తలచుకొనుచు ఉండిపోయెను. మూడవ నాడు సెలయేరు వరద తగ్గినది. రెండు రోజుల నేతిని కూడ తీసికొని ఆనాడెట్లో ఒక తెప్పనెక్కి వెళ్ళి గోపాలుడు మున్ముందుగా సుముఖుని పాదముల మీద పడి "క్షమించుము స్వామీ! యేరు పొంగి ప్రవహించి రానిచ్చినది కాదు. ఒక తెప్పపై ఈనాడెట్లో వచ్చితిని అని ఎంతో ప్రార్థించెను.

సుముఖున కంతయు అత్యాశ్చర్యమైనది గోపాలుడు తాను రాలేదనుచున్నాడు, ఆ రెండు రోజులు నేయి తెచ్చియిచ్చిన గోపాలుడెవరు? అని తలంచుచు ఇది యంతయు భగవానుడగు ఆంజనేయుని లీలయే ఆతడే గోపాలుని వేషమున వచ్చి నేయి యిచ్చినాడను కొని పెవిధముల ఆంజనేయుని స్తుతించినాడు "స్వామీ నేతికుండలను మోయించిన పాపమును కట్టుకొంటిని క్షమింపుమని దీనుడై వేడెను. ఆ భక్తుని ప్రార్థనలాలకించి ఆంజనేయుడు ప్రత్యక్షమై "సుముఖా నీవలన నేరములేదు. నీవు నా భక్తుడవు. నీ వ్రతభంగమైనచో పెక్కుమంది బ్రాహ్మణోత్తములకు ఆశాభంగమగును. ఆశాభంగమొనర్చుట పాపము. నా భక్తుని ప్రతిజ్ఞ నెరవేరుటకై నేనే గోపాలుని వేషమున వచ్చితినని అదృశ్యుడయ్యెను.

సుముఖుని ఆనందమునకు మేరలేదు ఆంజనేయుడే స్వయముగ సాయము చేయవచ్చినాడు ఇతోధికమైన దీక్షతో సప్తాక్షరి మంత్ర జపము చేయుచు సుముఖుడు తన పూజలు నిర్వర్తించుచు హనుమన్మహిమ నెల్లరకు బోధించుచు ధన్యుడై కాలముగడపెను.

మైందుని కథ

పరాశర సంహిత – 35వ పటలము

సుందరీ నగరమున మైందుడను విప్రోత్తముడు కలడు. వేద శాస్త్రములు చదివిన మహాజ్ఞాని, పవిత్ర వర్తనుడు. ప్రతిదిన హనుమత్పూజా పరాయణుడు. తపో ధనుడైన యావిప్రుడు కాశీయాత్రకు బయలు దేరి గంగను దాటుట కొక చిన్న నావనెక్కెను. కొంత దూరమేగు సరికి ఆ నావకు గల చిల్లు ద్వారా నీరు లోపలికి వచ్చి ఎంతపైకి తోడినను లాభము లేకపోయినది. నీరు నావలో నిండుచున్న కొలదియు ఒక్కొక్క అంగుళమే నావమునుగుచున్నది. ఈ విపత్తును గ్రహించి తనకిక మరణ మాసన్నమైనదని తలచి మైందుడు, ముఖమును కప్పుకుని హనుమన్మంత్రమును జపించుచు ధ్యాన వశుడయ్యెను.

భక్తుని ఆపద గ్రహించిన వెంటనే హనుమంతుడు పెద్ద వానర రూపమున ఆ నావనెత్తి నది ఒడ్డునకు జేర్చి తీరమందున్న వారు చూచుచుండగనే అదృశ్యుడయ్యెను. తన ధ్యానము నుండి మేల్కొనిన మైందువ కంతయు నాశ్చర్యమై తానెట్లు తీరమును చేరితినని యడుగగా "అయ్యా ఒక పెద్ద వానరుడు నావను మోసికొనివచ్చి దింపెను. అతడెవరు నీకీ సాయమెట్లు లభించినది" అని యెదురు ప్రశ్నించిరి.

ఆహా! ఇది యంతయు భగవానుడగు హనుమంతునిదయ. ఓ జనులారా! మీరు అదృష్టవంతులు హనుమద్దర్శనము మీకైనది, ఇన్ని నాళ్ళనుండి నేను హనుమత్సేవ చేయుచుండగా నాకా భాగ్యము కలుగలేదు అని మనస్సున అనుకొని మహా విచారమొంది గంగలో పడి ప్రాయోపవేశమునకు సిద్ధము కాగా హనుమంతుడు ప్రత్యక్షమై మైందు నోదార్చి కనుపడినను కనుపడకున్నను నేనెప్పుడును భక్త రక్షకుడనే అని ప్రసన్న ముఖుడై అంతర్ధానుడయ్యెను.

ధర్మజుని రాజసూయము - పురుషమృగము

పరాశర సంహిత - 51వ పటలము

ఇంద్ర ప్రస్థపురమున పాండు రాజ జ్యేష్ఠపుత్రుడైన ధర్మరాజు తన నలువురు తమ్ములతో కలసి రాజ్యమేర్పరచుకొని రాజసూయ యాగము చేయు సంకల్పమున నుండెను. మున్ముందు తన తమ్ములను నాలుగు దిక్కులకు బంపి సకల రాజన్యవరులను తన వశము చేసికొని రాజసూయ యాగమును ప్రారంభించెను. దేశమందంతటి నుండియు రాజన్యులు బంధు మిత్రులు యాగమునకు వచ్చెదరు. భోజనశాల పవిత్రముగ శుద్ధిగ నుండవలెను. దేవలోకమునుండి పురుష మృగమును దెచ్చి ఆ శాల యందు వసింపజేసినచో అది పావన మగునని మునులు చెప్పగా ధర్మరాజు వాయుకుమారుడైన భీముని ఆ పనికి నియోగించెను.

భీముడు దేవలోకమునకేగు మార్గములో హిమగిరి అరణ్యముల త్రోవలో అడ్డుగా హనుమంతుడు పరుండెను. ఈ భీకర వానరుడెవ్వడో నాత్రోవ కడ్డు వచ్చెనని భీముడు తన బలముజూపి వానిని తొలగింపజూచెను గాని సాధ్యము కాలేదు. ఆ వానరుని పలు విధముల భీముడు స్తుతించి నమస్కారములర్పించి, తన రాక కారణమెఱిగింపగా హనుమంతుడును భీముని బలసాహసములను, మెచ్చుకొని భీమా! నీవు జాగ్రత్తగ నుండవలెను. నీవును వాయు కుమారుడవు, నా సోదరుడవు గాన చెప్పుచున్నాను. నీవు తేగోరు పురుషమృగము శివభక్తి కల మృగము. తన కెదురువచ్చిన పురుషులను చంపితినును. నీ ప్రార్థన విని ఒక వేళ పురుషమృగము వచ్చినను దాని జవసత్వములకు నీవాగలేవు. అదినీవెంట వచ్చు ఉపాయము చూడుము. నా వాలమునుండి గుప్పెడు రోమములు తీసి యిచ్చుచున్నాను. వీనిని ఒక్కటొక్కటే దూరదూరముగ నీదారియందు పడవేయుచు రమ్ము. ఒక్కొక్క రోమము పడినచోట ఒక్కొక శివలింగము ఉద్భవించును ఆ లింగమునకు పూజచేసిన తర్వాతనే మరల పురుషమృగము నీ వెనుకవచ్చును. ఆ విధముగ ఆ మృగమును తీసికొనివచ్చి మీ భోజన శాలయందుంచు''ము అని చెప్పెను. హనుమంతుడెంతటి బలవంతుడో ఎట్టి శక్తి సామర్థ్యములు కలవాడో భీముడిదివరకే వినియుండెను. ఆ వీర సాహసరూపములను భీముడు చూడగోరెను. భీముని కోరికపై హనుమంతుడు

తాను లంక ప్రవేశించిన నాటి సూక్ష్మ రూపమును సముద్రముపై లంఘించునప్పటి ఆకారము, రాక్షసులను చంపునాటి భీకరోన్నత రూపమును చూపెను. ఆ మహా రూపములను చూడలేక భీముడు మూర్ఛిల్లగా హనుమంతుడాతనిని సేదదేర్చి దీవించి పంపెను.

భీముడు దేవలోకమునకు చేరునప్పటికి పురుషమృగము ఇంద్రుని సభ సుధర్మయందున్నది. తాను వచ్చిన కారణమునివేదించి ధర్మజుని పవిత్ర యాగము విజయ ప్రదమొనర్చుమని ఆ పురుష మృగమును భీముడర్థింపగా అదియొప్పుకొని తన కడ్డుగనున్న వారిని చయ్యన తాను భక్షింపగలనను నియమము విధించినది. భీముడందులకంగీకరించెను. వారిరువురు ఇంద్ర ప్రస్థమునకు బయలుదేరినారు. వారేగు మార్గమున ఆంజనేయుని రోమములొక్కటొక్కటే వదలుచు భీముడు ముందు నడుచుచున్నాడు. అచ్చట నొకొక్క శివలింగముద్భవించు చుండగా ఆ మృగ మాలింగములను పూజించుచు వచ్చెను. ఈ లోపున భీముడు ముందునకు పోవుచుండువాడు. తుదకు ఇంద్ర ప్రస్థము చేరినారు. యాగ భోజనశాల సమీపించగనే భీముడొక కాలు శాలలో బెట్టి రెండవ కాలెత్తబోవు చుండగా ఆ పురుష మృగమాతనిని తినుటకు పట్టిలాగెను. భీముడు వెనుదిరిగి మృగముతో ''ఓ సర్వజ్ఞుడా ధర్మమెఱిగినవాడా! నీ ప్రతినను మఱచి నువ్విట్లు మా యింటిలో నన్ను పట్టుకొని తినబోవు చున్నావు. ఇది అన్యాయము'' అని ప్రార్థింపగా పురుషమృగ మంగీకరింపక ధర్మమెఱిగిన వాడుగాన ధర్మజుని కడకేగి తగవు తీర్చమని అడిగెను. ధర్మరాజు వివరములన్నియు తెలిసికొని, సగము మనిషి ఈవల నున్నవాడు గాన భీముని సగభాగము నీవు తినుట ధర్మమే అని తీర్పుచెప్పెను. భీముడు కాదనలేదు. తన శరీరార్ధబాగమును ఆ మృగము నోటికందించెను. భీముని చర్య మృగమున కాశ్చర్యము గొలిపెను. ధర్మజుని న్యాయమునకు న్యాయమునెడల ఆతని ఆసక్తికి భీముని ధైర్యసాహసములకు ఆ పురుషమృగము సంతసించి భీముని వదలెను.

ధర్మజుని రాజసూయము విజయప్రదముగా ముగిసినది. హనుమంతుని ప్రత్యక్షమొనర్చుకొని కార్యము సానుకూలము చేసినందులకు ధర్మరాజు భీమునభినందించి, హనుమంతుని స్తోత్రములుగావించి పురుషమృగమును పూజించి దానిని మరల దేవలోకస్థానమున కనిపెను.

భీమాంజనేయుల కలయిక - అర్జునుని కపిధ్వజము

(మహా భారతము - ఆరణ్యపర్వము చతుర్థాశ్వాసము)

పాండవ జ్యేష్ఠుడగు ధర్మరాజు తన దాయాదియగు దుర్యోధనునిచే మాయా ద్యూతంబున నోడి తానాడిన పందెము ప్రకారము భార్య ద్రౌపది తోడను, అనుజులు భీమార్జుననకుల సహదేవులతోడను కలసి వనవాసమున కేగి కొన్ని దినములకా యరణ్యమధ్య మందుగల గంధ మాదన పర్వత ప్రాంతము జేరిరి. ఒకనాడు ద్రౌపదీ భీములు ఒకచో నున్నతరి వేయి చక్కని దళములు, మధురమ్మైన సౌరభముగల తామరపూవొకటి తీవ్రముగ వీచుగాలికి ఎగిరి వచ్చి వారి ముందు పడెను. ఆ పద్మ సౌందర్యమున కాశ్చర్యపడి ద్రౌపది తన కట్టి పూవులదెచ్చి పెట్టుమని భీముని అడుగగా, వెంటనే యతడును ధనుర్బాణ సహితుడై బయలు వెడలి ఆ పుష్ప సౌరభము వచ్చు చున్న దిశకేగెను.

అడుగిడుటకు వీలుకాని కీకారణ్యము. గగనము నంటు వృక్షములు. సింహశార్దూలాది జంతువుల భీకరారవములు. ఈ ఆటంకములకు సరకు గొనక దారికడ్డుతగులు తరువులను నేలబడగూల్చుచు, మీదమీద కరుదెంచు క్రూరమృగముల దండించి పారద్రోలుచు భీముడు ముందునకేగెను. మార్గమధ్యమున చల్లని గాలి వీచుచున్నదెస నొక సుందరకాసారము జూచి యా కొలను నందు గ్రుంకులిడి లేచి యొక మహారవమొనర్చెను. ఆ పరిసరములందే కదళీవనమున ఏకాంత యోగ నిద్రయందున్న ఆంజనేయుడా కంఠధ్వని విని యబ్బురమంది తన తమ్ముడగు భీముని కంఠ స్వరమును బోలియున్నదని కొంత సంతృప్తితో ఆ ధ్వని వచ్చు మార్గమున కడ్డుగ పెద్ద పెద్ద చెట్లు పడగొట్టి, విలాసముగ తోక నాడించుచు యాదారి కడ్డుగ పరుండెను.

భీముడా వానరమును చూచెను. సామాన్యమగు కపికాదు. ఆజానుబాహువు. మహాబలిష్ఠము ఉన్నతవక్షము. కనులు విద్యుద్గోళముల వలె వెలుగుచున్నవి. మొగము మహా తేజో వంతముగ నున్నది. ఆ విగ్రహమును చూచి భీముడు కొంత అదిరిపడి "ఎవరవు నీవునాదారి నుండి తొలగుము నేనావలకు పోవలెను." అని గద్దించి పలికెను. హనుమంతుడంత "నీవెవరవు మానవుడవా. నేనేదో అడవిలో కాయకసరుతిని బ్రతుకుచు ముసలి వాడనయి

ఇచ్చట నుంటిని, దుస్సహమైన ధ్వని చేసి నన్నేల లేపితివి? మానవులు వివేకవంతులుగదా నాకు సాయము చేయుట మాని నన్ను బెదిరింతువా, నేను కదలలేను'' ఆవశ్యకమైనచో నావాలమును ప్రక్కకు నెట్టి నీదారినేగుము'' అనగనే భీముడా గ్రహవశుడై ''బాగు బాగు నాకే నీతులు చెప్పుచున్నావా, తోక పట్టుకొని బయట కీడ్చెదనని తోకను కాలితో కదపబోయెను తోక అణుమాత్రమును కదలలేదు. రెండు చేతులతో పైకెత్తబోయి తన బలమంతయు చూపెను. ఒడలు చెమట పట్టి కాలు సేతు లలసిపోయినవి. లాభములేక పోయినది. భీమునకు కోపమెక్కువైనది. ఓ కోతీ నీగర్వము సాగదు పూర్వము హనుమంతుడు మహా సముద్రము దాటినట్లే నిన్నును ఈ పర్వతమును దాటి ఒక్కగంతులో పైకి పోయెదను. నేను హనుమంతునంతటి బలవంతుడను. వాయు పుత్రుడను, భీముడు నాపేరు అని సింహనాదము చేసెను. హనుమంతు డా మాటలు విని ''ఓహో నీవు కృతయుగము నాటి హనుమంతునెరుగుదువా! ఆ కథ నాకు చెప్పు''మనగా భీముడంతట ఆసక్తితో హనుమంతుని కథ నంతయు చెప్పి హనుమంతుని తలచి నమస్కరించెను. అంతట హనుమంతుడు ఆదరదరహాసమున, ''భీమా! నీవు నాకు సోదరుడవు నేనే హనుమంతుడను'' అనగా భీముడాతని కాళ్ళపై బడి తానేగు చున్న వృత్తాంతము తెల్పి'' ఆశీర్వదింపవేడెను. సౌగంధిక పద్మ కాసారమును యక్ష రాక్షసులు, ఆ తరువాత దేవతలు కాపాడుచుందురు. నీవు కడు వివేకముతో వలసిన చోట బలము చూపి నీకార్యమును నెరవేర్పుము. దేవతలు హోమ ప్రియులు దైవభక్తి వశులుగాన బలసాహసములకు తొందర పనికిరాదు. నీకా సమర్థతయున్నది అను చున్న హనుమంతునికి భీముడు మరల మ్రొక్కి ''నీవు నా సోదరుడవగుట నా భాగ్యము నీవు దైవసమానుడవు సముద్రము లంఘించునప్పటి నీ యాకారము చూడగోరెదను, అనుగ్రహింపుమన'' హనుమంతుడు నవ్వి, అదికృత యుగమయ్యా అప్పుడు అన్ని వర్ణములు వారు వేదోక్త సదాచారులు ఇది ద్వాపరయుగాంతము. కలియుగము దగ్గఱపడుచున్నది. ధరణిపై కృ తయుగమున నాలుగు పాదములనడచిన ధర్మము క్రమ క్రమముగ నశించుచున్నది. కలియుగము నాటికి ఒక పాదమే ఉండును కలియుగమున నానావిధ దురాచారములు, రోగములును ప్రబలును. దైవ చింతనము

సదాచారమొక్కటియే భవ తారకము అప్పటి నా ఆకారము ఇప్పుడు నీవు దర్శింపలేవు. అయినను చూడుము అని ఆంజనేయుడు దిఙ్నభోవ్యాప్త తేజముతో భీకర రూప విజృంభణమున లేచెను. భీముడా రూపమును చూడలేక మన్నింపుము సోదరా నీ మహా రూపము నుపసంహరింపుము నాకు భయమగుచున్నది. నేనని మాటలకు నన్ను క్షమింపుమని ప్రార్థింపగా హనుమంతుడు తన నిజరూపమును దాల్చెను.

భీముడు హనుమంతునకు మరల మ్రొక్కులాచరించి నిలచెను.

ఆంజనేయు డాదరమున భీముని దగ్గఱకు తీసికొని సోదరా నీవు మహా బలవంతుడవు. మీ దాయాదులగు దుర్యోధనాదులతో మీకు యుద్ధము కానున్నది. అందు మీకు విజయము నిశ్చయము. నీకిష్టమెద్దియో కోరుకొనుము. దానిని జేసెదననగా భీముడా హనుమంతుని యాశీస్సుల వేడుకొనెను. హనుమంతుడు మరల సోదరా నీవు చేయు ప్రయత్నములందును యుద్ధ సమయము నందును నన్ను దలంపుము. మీకు శ్రేయమగును. నా చరిత్రము ధరణినున్నంతవరకు మీకు విజయమే. నీ యనుజుడు అర్జునుడు అతిరథుడు, ఆతని రథ కేతనమునందున నేనుండి మీ యుద్ధకార్యములను తిలకించు చుందును. నేనున్న ఆ కేతనము విజయధ్వజమై విలసిల్లును. ఇక నీవరుగ దలచిన సౌగంధిక సరోవరమునకు మార్గమిదియే ఈ దారి నరుగుమని చూపి తన దీవనలిచ్చి పంపెను.

భీముడు హనుమంతుని యాశీస్సులను గొని యినుమడించిన యుత్సాహముననేగి సరోవర రక్షకులుగా యక్ష రాక్షసుల నిర్జించి కుబేరుని సౌగంధిక సరోవరము జొచ్చి అందలి కనక కమలములను గ్రహించి వెనుదిరుగునంతలో కుబేరుడు వచ్చి భీముని సాహసమునకు మెచ్చి, ధర్మమూర్తి యగు ధర్మజు సోదరుడీతడని యెఱిగి అతని నాదరించి పంపెను.

పాండవ కౌరవ యుద్ధమున అర్జునుని రథముపై హనుమంతుని చిత్రము గల కేతనము మహాకాంతి మంతమై కౌరవులకు భయము గొల్పుచు విరాజిల్లినది. హనుమంతుని మహిమను దలచుకొని ధర్మజాదులు ఆ మహా వీరుని వేనోళ్ళ నుతించిరి.

అర్జునుడు – కపిధ్వజము

పరాశర సంహిత – 16వ పటలము

అర్జునుడు కపిధ్వజుడను ప్రశస్తికి మఱియొక చిత్రమైన కథ గలదు. పూర్వము అష్టాక్షరీ హనుమన్మంత్రో పాసకుడు విజయుడను నరపాలుడొకడు గలడు. హనుమంతుని అను గ్రహము పొందిన ధన్యుడు. మఱుసటి జన్మమున అతడే పాండవ మధ్యముడైన అర్జునుడుగా పుట్టెనను ప్రతీతియు కలదు. అర్జునుడు మహావీరుడు, మహాధన్వి, అతడు తన దేశ సంచార మధ్యమున దక్షిణమున సేతువు వరకును పోయి అచ్చట శ్రీరాముడు నిర్మించిన వారథిని గూర్చి విని, సేతు బంధము రాళ్ళతో కావలెనా, నేను బాణములతో కట్టి యుందునను. అని నుడువునంతలో శ్రీరాముని గూర్చిన మాటవిని హనుమంతుడచ్చటికి వచ్చి అర్జునునితో నీవు బాణములతో వారథి కట్టుదువా ఏదీ నీవు కట్టుము నేనొక కాలితో తొక్కి చూచెదను. నేనట్లు నీవారథివి విరగగొట్టలేనిచో నీ కేతనమున విజయ చిహ్నమగుదుననియు మాటయిచ్చెను.

అర్జునుడా మాటలువిని తన బాణ విద్యాతిశయము జూపి వారథి నిర్మించెను. హనుమంతుడు బలము నుపయోగించి కాలితో త్రొక్కగా ఆ బాణవారథి విరిగి ముక్కలైనది. ఆ వానరుని బలము చూచి అర్జునుడు అట్లే మరల వారథి నిర్మించెను. అర్జునినిపై దయతో శ్రీకృష్ణుడు కూర్మమై ఆ బాణ వారథి క్రింద జేరి వారథిని కాపాడుచుండెను. హనుమంతుడా వారథిని తన రెండు కాళ్ళతో శక్తికొలది పెక్కువార్లు త్రొక్కినను ఆ వారథి అట్లే ఉన్నది. హనుమంతుడాశ్చర్యపడి చూచుచుండ, అదియంతయు తన ధనుర్బాణ పాటవమే అనుకొని అర్జునుడు గర్వపడుచుండగా, శ్రీకృష్ణుడచ్చేరు వంది అర్జునా! అది యంతయు నీ శక్తిగాదు. నీవు కట్టిన వారథి క్రిందనేను కూర్మమై కాచితిని. ఆ వానరుడెవ్వరో కాదు. సాక్షాత్తు హనుమంతుడు. శివాంశ సంభూతుడైన మహాబలుడు. ఆత డా శర జాలమును కాళ్ళతో త్రొక్కగా నా వీపెట్లు బ్రద్దలైనదో చూడుము. రక్తములు మడుగులు గట్టినవి. అనిన మాటలకు అర్జునుడు నిశ్చేష్టుడై హనుమంతునకును శ్రీకృష్ణునకును మ్రొక్కులిడి తన తప్పు తెలిసికొనెను.

హనుమంతుడును విజయుని ధనుర్విద్యా శక్తికి అభినందించి, తాననిన ప్రకారము అర్జునుని కేతనమున విజయ చిహ్నముగా నుండి అర్జునుని దీవించి పంపెను. అర్జునునకు కపికేతనుడను పేరును వచ్చినది.

శ్రీ హనుమాన్ చాలీసా
భక్త తులసీ దాసు

హిందీ మూలము | **తెలుగు అనువాదము**

1. శ్రీ గురు చరణ సరోజ రజ
నిజమన ముకుర సుధారి
నౌరజ రఘువర బిమల జల
దాయక ఫల చారి॥

1. గురుప దాంబుజ ధూళి కూర్మితో గొనుచు
మనమును అద్దంపు మలినమున్ దుడిచి
ఇలపైన పురుషార్థముల నిచ్చు విధము
వినుతింతు శ్రీరామ పృథ్వీశు యశము

2. బుద్ధి హీన తను జానికై
సుమిరౌ పవన కుమార్
బలబుద్ధి విద్యాదేహు మొహి
హరహు కలేశ వికార్॥

2. అవివేకినై జన్మ మందితి గాన
మనమున స్మరియింతు మారుతసూను
అతడె నాక్లేశముల్ హరియించు గాక
సద్బుద్ధి బలవిద్య సమకూర్చినాకు.

3. అంజనీ గర్భ సంభూతో
వాయుపుత్రో మహా బల
కుమారో బ్రహ్మచారీచ
హను మతే నమోనమః॥

3. అనిల కుమార! శ్రీ అంజనీ పుత్ర!
బలవంత హనుమంత! భవ్య చారిత్ర!
బ్రహ్మచారీ! సర్వ బాధాపహర్త!
ప్రణతి పూజలు నీకు భక్తినొనర్తు.

4. పవన తనయ సంకట హరన
మంగల మూరతి రూప
రామలఖన సీతాసహిత
హృదయ బసహు సురభూప॥

4. జానకీ రామ లక్ష్మణులను గూడి
సకల దేవతలతో, సత్కృపతోడ
మంగళరూప! ఓ మారుతపుత్ర!
వసియింపు నామది భవ్యచారిత్ర!

5. జయ హనుమాన జ్ఞానగుణ సాగర
జయకపీశ తిహులోక ఉజాగర॥

5. జయము శ్రీ హనుమంత! జయము జ్ఞానాబ్ధి!
త్రిభువనోజ్జ్వల రూప! శ్రీ కపి నాథ!

6. రామదూత అతులిత బలధామ
అంజని పుత్రపవనసుతనామ॥

6. శ్రీరామ వరదూత! మారుతి నామ!
అంజనా సతి పుత్ర! అతి బల ధామ!

7. మహావీర విక్రమ బజరంగీ
కుమతినివార సుమతికే సంగీ

7. బహు వీర విక్రమ! వజ్రశరీర!
సుజన సంగవిహార! కుజన సంహార!

8. కాంచన వరణ విరాజసువేశా
కానన కుండల కుంచిత కేశా॥

9. హాథవజ్ర ఔధ్వజువిరాజై
కాంధేమూజ జనేవూ ఛాజై॥

10. శంకర సువన కేసరీ నందన
తేజప్రతాప మహాజగ వందన॥

11. విద్యావాన గుణి అతి చాతుర
రామ కాజ కరి వేకో ఆతుర॥

12. ప్రభుచరిత్ర సునివే కోససియా
రామలఖన సీతామన బసియా॥

13. సూక్ష్మరూపధరి సియహిదిఖావా
వికట రూపధరి లంక జరావా॥

14. భీమ రూపధరి అసుర సంహారే
రామ చంద్రకే కాజసవారే

15. లాయసజీవన లఖన జియాయే
శ్రీరఘువీర హరషి ఉరలాయే॥

16. రఘుపతి కీన్హీ బహుత బడాయీ
తుమ్మ మప్రియ భరత హిసమ భాయీ॥

17. సహసవదన తుమ్హారో యశగావై
అసకహిశ్రీపతి కంఠ లగావై॥

18. సనకాదిక బ్రహ్మాది మునీశా
నారద శారద సహిత అహీశా॥

19. యమకుబేర దిగపాల జహాతే
కవి కోవిద కహిసకై కహాతే॥

20. తుమ ఉపకార సుగ్రీవహి కీన్హా
రామ మిలాయ రాజపద దీన్హా॥

8. కుంచితాలక! కర్ణకుండల భూష!
కాంచన తనువర్ణ కమనీయ వేష!

9. విజయ ధ్వజాంచిత పృథువజ్ర హస్తః
కటి ధృతకుశ ముంజః కనకోపవీతః

10. రుద్రాంశసంభూత! రుచిర ప్రతాప!
కేసరిసుతః త్రిలోకీవంద్య రూప!

11. చతుర బుద్ధివిశాలః సద్గుణాలవాల!
విద్యా నిలయః రామవిభుకార్యలోల!

12. జానకీ రామలక్ష్మణ సక్తచిత్తః
రామ భూపతి కథాశ్రవణాను రక్తః

13. క్షోణిజన్ గంటివి సూక్ష్మరూపమున
కాల్చినాడవు లంక కడుమహాకృతిని

14. పరిమార్చి అసురులన్ భయదరూపమున
నెఱవేర్చితివి రామ నృపుని కార్యమును.

15. సంజీవిగొనితెచ్చి సౌమిత్రి కిచ్చి
బ్రతికింప ముదమంది రాముడు మెచ్చి

16. భరతు బోలిన ప్రియభ్రాతవటంచు
నుడువుదునని జూచి కడు సన్నుతించె.

17. వేనోళ్ళ నీకీర్తి వినుతించు చుండి
కౌగిలించెను నీదు గళము రాముడు

18. ఆదిశేషుండును అబ్జాసనుండు!
సనకాదులును వాణిముని నారదుండు

19. పండితుల్ కవులు దిక్పతులైన గూడ
అలవిగాదిక నీదు ఖ్యాతి గొండాడ

20. రామ సఖ్యము గూర్చి రాజ్యమ్ము నీవు
ఎలమి సుగ్రీవున కిప్పించి నావు

21. తుమ్హరో మంత్ర విభీషణ మానా
లంకేశ్వర భయేసబ జగ జానా॥

22. యుగసహస్రయేజన పర భానూ
లీల్యోతాహి మధుంఫల జానూ॥

23. ప్రభు ముద్రికా మేలిముఖ మహి
జలధి లాంఘిగయే అచరచనాహి!

24. దుర్గమ కాజ జగతకే జేతే
సుగమ అనుగ్రహ తుమ్హరే తేతే

25. రాముడు ఆరే తుమ రఖవారే
హోతన ఆజ్ఞా బినుపై సారే॥

26. తమరక్షక కాహూకోడరనా
ఆపనతేజ సమ్హారో ఆపై

27. సబసుఖల హైతుమ్హారీ శరనా
తీనో లోక హంకతే కాంపై॥

28. భూత పిశాచనికట నహి ఆవై
మహావీర జబ నామ సునావై॥

29. నాసైరోగ హరై సఖపీరా
జపత నిరంతర హనుమత వీరా

30. సంకటసే హనుమాన ఛుడావై
మనక్రమ వచన ధ్యానజోలావై॥

31. సబపర రామ తపస్వీ రాజా
తినకే కాజ సకల తుమ సాజా

32. ఔరమనోరధ జోకోయిలావై
తాసు ఆమిత జీవన ఫల పావై

33. చారోయుగ పరతాప తుమ్హారా
హైపరసిద్ధ జగత ఉజియారా॥

21. నిఖిలజగమెఱుంగు నీమాట వినుచు
అలవిభీషణుఁడయ్యె అసురేశుడనుచు

22. మధుర ఫలమ్మని మార్తాండుఁ బట్ట
యోజన సాహస్ర యుగమేగు దిట్ట॥

23. రామముద్రికనోట గ్రహియించి లీల
అబ్ధి దాటితివన్న ఆశ్చర్యమేల?

24. ఎట్టి దుష్కరకార్యమేని యీ జగతి
సుకరమ్మై వరలు నీ శుభదయా నిరతి,

25. రాముని ద్వారమ్ము రక్షించు నీదు
ఆజ్ఞ లేకయె లోనికరుగంగ రాదు,

26. సౌఖ్యమ్ము లబ్బు నీ శరణు గల్గినను
భయపడ పనిలేదు వసుధ దేనికిని,

27. నీవె తాళగలవు నీ తేజమునకు
కంపించు జగము నీ గర్జనమ్మునకు,

28. వీరాధి వీర నీపేరు విన్నంత
భూతపిశాచముల్ పోవాపొంత

29. వీర హన్మంతుని పేరు జపించ
రోగముల్ పీడలు వేగనశించు.

30. తను మనోవాక్కుల ధ్యానించువారి
బాధలు సర్వమ్ము బాపు సామీరి

31. రాజశేఖరుడగు రాముని పనులు
సాధించెదవు నీవె సకలమో హనుమః

32. ఎవరెద్ది కోరిన ఈడేర్చి యెలమి
చేకూర్చు హనుమయె జీవన ఫలము

33. అలరు ప్రసిద్ధమై నలుయుగమ్ములను
నిఖిలోజ్జ్వలమ్మయి నీశౌర్యమిలను

బాణాగ్నికిన్ నిప్పుగ్రహుండై లక్ష్మణన్ వేగ శీతాద్రికిన్ బోయి సంజీవి నిందెచ్చి జీవింపగా జేసి శ్రీరాము దుఃఖంబు బోకార్చి నా వోమహాసాహసోపేత! యుద్ధమ్మునన్ రావణుంద్రుంచి, భూమీజనుంగూడి సాకేతముంజేరు శ్రీరాముతోనేగి, శ్రీరామ పట్టాభిషేకమ్ము హర్షమ్ముతో గాంచి శ్రీరామమంత్రాక్షరోద్దీప్త షట్చక్ర రూపమ్ము నిత్యమ్ము హృత్పద్మమందుంచి ధ్యానమ్ము గావించు భక్తాంజనేయుండవై యోగివై యొప్పి - సీతామహాదేవియున్ బోధసేయంగ ఆద్యుండమేయుండనంతుండు నౌచున్ పరబ్రహ్మమై యొప్పు శ్రీరామతత్త్వమ్ము సర్వమ్ము శ్రద్ధాళువై నేర్చి మౌనీంద్రులున్ పొందగాలేని జ్ఞాన ప్రకాశుండవై యోగసిద్ధుండవై బ్రహ్మభావుండవై త్రైలోక్యసంస్తుత్య మహోత్ర్యవిభ్రాజ మానుండవై, శాకినీ ఢాకినీ దుష్టభూతాదులన్ దూరమున్ జేయు వీరాంజనేయుండవై, సర్వకార్యమ్ములందున్ జయమ్మున్ బ్రసాదించు దేవుండవై, విశ్వమందున్ చిరంజీవివై భావికాలంబునన్ బ్రహ్మవై నేడు శ్రీగంధమాదాద్రి యందున్ తపోనిష్ఠ లో కాలముంబుచ్చుచున్, రామనామాంకిత ధ్యాన చిత్తుండవై వేదశాస్త్ర ప్రబోధమ్ము లాలించుచున్, భక్తులంబ్రోచుచున్ దుష్టులంద్రుంచుచున్, లోక సంక్షేమమున్ గూర్చుచున్ సర్వ వంద్యుండవౌ దివ్య తేజోనిధీ! నీదు కారుణ్యవీక్షామృతా సారముల్ మాపయిన్ జిల్కుచున్ సుప్రసన్నుండవై సుందరాస్యుండవై మందహాసుండవై నీదు పాదాంబుజ ధ్యాన నిష్ఠాత్ములౌ మమ్ము దీవించి పాలింపుమో కీర్తిమంతా, హనూమంత, శ్రీ అంజనాపుత్ర సంస్తుత్యచారిత్ర, సౌవర్ణ సౌందర్య గాత్రా, నమస్తే నమస్తే నమస్తే నమః.

ఫలశ్రుతి

శ్రీరమ్య గుణగేయ శ్రీ ఆంజనేయ,
వారాశి లంఘన ప్రాభవోపాయ!

శివశక్తి సంభూత శ్రీరామ దూత,
స్తవనీయ జవసత్వ సాహసోపేత!

అనుపమ బలధామ హనుమంత నామ,
జననుత సౌజన్య సద్గుణ స్తోమ!

విమల వేద జ్ఞాన వీధీవిహార,
విమత మర్ధన ధీర వీరాధి వీర!

వానర బలనేత భక్త సంత్రాత,
జానకీ రాముల సౌఖ్య సంధాత!

జనులకు ఇహపర సౌఖ్యప్రదమ్ము,
అనుపమ బలము నీ అభయ హస్తమ్ము!

గంధ మాదనగిరి గహన తపస్వి,
బంధుర పరతత్త్వ భవ్య మనస్వి!

మహిత శక్త్యన్విత మంత్ర స్వరూప,
అహిత దర్పనిహంత అతులప్రతాప!

భువిని కొండేపూడి పుణ్య వంశజుడ,
ప్రవిమల సాహితీ వ్రత నీతి పరుడ!

సుబ్బరాయాఖ్యుడ సుకవి శేఖరుడ,
ప్రబ్బిన దీక్ష నీ భక్తి తత్పరుడ!

నీ రమ్య చరితమ్ము నియతివ్రాసితిని
ధారుణి నాజన్మ తనర ధన్యతను - !

చదివిన వినిన నీ సచ్చరిత్రము
సదమల సంక్షేమ సంపద్ప్రదమ్ము

జయము సద్గుణ వంత జయము ధీమంత,
జయము దానవ హంత జయము హన్మంత!

ఇలను మాయందు నీ కృపయున్న చాలు
వెలయించు నది మాకు విజయమున్ శ్రీలు!

ప్రసన్న భారతి

సాహిత్య విద్యా సాంస్కృతిక సేవా సంస్థ

మహోజ్జ్వల మగు మన ప్రాచీనాంధ్ర సాహిత్య ప్రయోజనమును ప్రాధాన్యమును, సంప్రదాయ కవితా వైశిష్ట్యమును ప్రకాశింపజేయు పవిత్ర సంస్థ.

ఈ సంస్థ కార్యక్రమములు

1. ఉత్తమ సాహిత్య త్రైమాసిక పత్రిక "ప్రసన్న భారతి" ని కొని చదవండి, పదిమంది చే చదివించండి.

ఇది మన పత్రిక – మన భాషా పత్రిక

సం॥ర చందా రు. 60-00లు శాశ్వత చందా

రు. 1116-00 లు

2. ఉత్తమ సాహిత్య రచనల ప్రచురణ

పూర్తివివరములు, అట్ట వెనుక భాగమునున్నవి

మెత్తముగా కొను వారికి మంచి డిస్కౌంటు కలదు

3. సాహితీ సదస్సులు – కవి సమ్మేళనములు, పేద పిల్లలకు సహాయము

చిరునామా :

47-10-5, ద్వారకానగరము, విశాఖపట్నం – 16

ఆంధ్రప్రదేశ్ – ఇండియా